# TELUGU KATHA SAMSKARANODYAMA PRABHAVA CHITRANA

## (Gurajada Apparao, Sripada Subrahmanya Sastry, Gudipati Venkatachalam, Adivi Bapiraju, Viswanadha Satyanarayana)

**A Thesis submitted to the University of Hyderabad in Partial Fulfillment of the requirements for the award of Doctor of Philosophy in Telugu**


**By**

**NAGARAJU ASILETY**

**Department of Telugu**
**School of Humanities**

# University of Hyderabad

**(P.O) Central University, Gachibowli**
**Hyderabad - 500 046**
**Andhra Pradesh, India.**


**December, 2012**

# TELUGU KATHA SAMSKARANODYAMA PRABHAVA CHITRANA

## (Gurajada Apparao, Sripada Subrahmanya Sastry, Gudipati Venkatachalam, Adivi Bapiraju, Viswanadha Satyanarayana)

A Thesis submitted to the University of Hyderabad in Partial Fulfillment of the requirements for the award of Doctor of Philosophy in Telugu


By

**NAGARAJU ASILETY**

**Department of Telugu**
**School of Humanities**

# University of Hyderabad

(P.O) Central University, Gachibowli
Hyderabad - 500 046
Andhra Pradesh, India.


December, 2012

# తెలుగు కథ
# సంస్కరణోద్యమ ప్రభావ చిత్రణ

**(గురజాడ అప్పారావు, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి
గుడిపాటి వెంకటాచలం, అడవి బాపిరాజు
విశ్వనాథ సత్యనారాయణ)**

**హైదరాబాద్ విశ్వవిద్యాలయానికి పిహెచ్.డి. పట్టాకోసం**

**సమర్పించిన పరిశోధనా గ్రంథం**


పరిశోధన

నాగరాజు అసిలేటి

**తెలుగు శాఖ**

**మానవీయ శాస్త్రాల విభాగం**

**హైదరాబాదు విశ్వవిద్యాలయం**

**హైదరాబాదు - 500 046**


**డిసెంబరు, 2012**

# DECLARATION

I, Nagaraju Asilety hereby declare that this thesis entitled **"Telugu Katha Samskaranodyama Prabhava Chitrana" (Gurajada Apparao, Sripada Subrahmanya Sastry, Gudipati Venkatachalam, Adivi Bapiraju, Viswanadha Satyanarayana)** submitted by me under the guidance and supervision of Prof. Tummala Rama Krishna is a bonafide research work. I also declare that this had not been submitted previously in part or in full to this University or any other University or Institution for the award of any degree / diploma.

Date :

Nagaraju Asilety
Regd. No. 07HTPH13

# CERTIFICATE

This is to certify that the Thesis entitled **"Telugu Katha Samskaranodyama Prabhava Chitrana" (Gurajada Apparao, Sripada Subrahmanya Sastry, Gudipati Venkatachalam, Adivi Bapiraju, Viswanadha Satyanarayana)** submitted by **NAGARAJU ASILETY** bearing Regd. No. **07HTPH13** in partial fulfillment of the requirement for the award of Doctor of Philosophy in Telugu is a bonafide work carried out by him under my supervision and guidance.

The thesis has not been submitted previously in part or in fill to this or any other University or Institution for the award of any degree or diploma.

Signature of the Supervisor

Head, Department of Telugu

Dean, School of Humanities

# కృతజ్ఞతలు

నన్ను పిహెచ్.డి. స్థాయికి చేర్చడానికి నా కోసం అవిశ్రాంతంగా శ్రమిస్తున్న తల్లితండ్రులు పాపాదేవి, కోటినాగులు గార్లకు, చెల్లెల్లు విజయశాంతి, ప్రశాంతిలకు...

నా పరిశోధనకు పర్యవేక్షణా బాధ్యత వహించి సకాలంలో పరిశోధన పూర్తికావడానికి అన్ని విధాలుగా సహాయసహకారాలు అందించిన నా పర్యవేక్షకులు ఆచార్య తుమ్మల రామకృష్ణ గారికి...

నేను ఎప్పుడు ఫోన్ చేసినా ఆప్యాయంగా పలకరించే గురువుగారు ఎండ్లూరి సుధాకర్ గారికి, ఫోన్‌లోనే తగు సూచనలు, సలహాలు ఇచ్చే ఆంధ్రా లయోలా కళాశాల (తెలుగు హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్) గుమ్మా సాంబశివరావు గారికి...

నా పరిశోధనాంశానికి సంబంధించి ఫోన్‌లోనే తగు సూచనలు సలహాలు ఇచ్చే ఆంధ్రప్రభ రిటైర్డ్ సీనియర్ సబ్-ఎడిటర్ పున్నమిరాజు నాగేశ్వరరావు గారికి, నాగసూరి వేణుగోపాల్ గారికి...

నాకు హైదరాబాద్ విశ్వవిద్యాలయం తెలుగు శాఖలో పిహెచ్.డి., అవకాశమిచ్చిన అప్పటి తెలుగు శాఖాధిపతి బేతవోలు రామబ్రహ్మంగారికి...

తెలుగుశాఖ అధ్యాపక బృందం-ఆచార్య ఎన్.ఎస్. రాజు గారికి, ఆచార్య ఎస్.శరత్ జ్యోత్స్నారాణి గారికి, ఆచార్య జి. అరుణ కుమారి గారికి, ఆచార్య ఆర్.రామకృష్ణ శాస్త్రి గారికి, డా॥ పిల్లలమర్రి రాములు గారికి, డా॥ పి.పవన్ కుమార్ గారికి, డా॥ డి. వెంకటేశ్వరరావు గారికి, డా॥ విజయలక్ష్మి గారికి, డా॥ డి.భుజంగ రెడ్డి గారికి, డా॥ విజయకుమారి గారికి...

దళిత అభ్యున్నతికి పాటుపడే డా॥ వెంకటేశ్వర్లు (Controller of Examination) గారికి...

నాకు పరిశోధనకు, అవకాశాన్ని కల్పించిన హైదరాబాద్ విశ్వవిద్యాలయం వారికి,

పరిశోధనకు కావలసిన సమాచారాన్ని సంపాదించుకోవడానికి అవకాశం ఇచ్చిన విజయవాడ ఠాగూర్ గ్రంథాలయం వారికి, రాజారామ్మోహనరాయ్ గ్రంథాలయం వారికి, చిత్తరంజన్ గ్రంథాలయం వారికి...

మరింత మెరుగైన సమాచారాన్ని సమకూర్చుకోవడానికి అవకాశం ఇచ్చిన ఉస్మానియా విశ్వవిద్యాలయం, తెలుగు విశ్వవిద్యాలయం, ఆంధ్ర విశ్వవిద్యాలయం వార్లకు...

నా పిహెచ్.డి., సీటు కోసం తపించిన హైదరాబాద్ విశ్వవిద్యాలయం సెక్యూరిటీ ఆఫీసర్ టి.వి. రావు గారికి, అలాగే కె. వెంకటేశ్వర్లు గారికి...

ఎప్పుడూ నా యోగక్షేమాలను కనుక్కొంటూ ఆప్యాయంగా పలకరించే హైదరాబాద్ అశోక్ నగర్ సాయి సత్సంగ్ సభ్యులైన శ్రీమతి రాధా, శ్రీమతి రాజేశ్వరి గార్లకు...

నా పరిశోధనకు కావలసిన విశ్వనాథ సత్యనారాయణ గారి కథలను అందించిన విశ్వనాథ పావన శాస్త్రి గారికి, అలాగే ఫోన్‌లోనే ఎప్పటికప్పుడు బాపిరాజు గారికి సంబంధించిన వివరాలను అందించిన వారి కుటుంబ సభ్యులకు...

నా ఉన్నతిని కాంక్షించే బంధుమిత్రులకు...

సిద్ధాంత గ్రంథ రూపకల్పనకు సహాయ సహకారాలనందించిన మిత్ర బృందం, కొమ్మల రాఘవేంద్ర, ఎమ్. రవికుమార్, త్రిపురనేని జయకృష్ణ, ఎమ్. సురేష్, ఎమ్. దుర్గరావు, కె. శ్రీను, నెల్లూరు విజయ్‌కుమార్, బి. శివకుమార్, యూ. ఝాన్సీ, రమాదేవి, విజయ భాను, కె. భాను నాయక్, కె. గౌరీశ్వరావు, జి. రమణ, డా॥ యం.సత్యనారాయణ గార్లకు...

నా సిద్ధాంత గ్రంథాన్ని అందంగా డి.టి.పి. చేసిన కలర్ గ్రాఫిక్స్ రమేశ్ గారికి, వారి యాజమాన్యానికి.....

నా
హృదయపూర్వక కృతజ్ఞతలు
నాగరాజు అసిలేటి

# ముందుమాట

ఎం.ఫిల్. పూర్తయిన తరువాత (2006-2007) అదే ఉత్సాహంతో పిహెచ్.డి., చేయాలనుకున్నాను. హైదరాబాదు విశ్వవిద్యాలయం తెలుగుశాఖలో సీటు కోసం కష్టపడి చదివి పిహెచ్.డి., అర్హత సాధించాను. ఈ విశ్వవిద్యాలయం తెలుగు డిపార్టుమెంటులో అప్పటిదాకా ఎం.ఫిల్., పిహెచ్.డి., లు చేసిన అంధులు ఎవరూ లేరు. నేనే మొదటి వాడ్ని. అటువంటి నాకు పర్యవేక్షణా బాధ్యత వహించడానికి అంగీకరించి సహృదయంతో ముందుకు వచ్చిన ఆచార్య తుమ్మల రామకృష్ణగారు ప్రసంశించదగినవారు.

ఆచార్య తుమ్మల రామకృష్ణ గారి పర్యవేక్షణలో నేను **"తెలుగు కథ సంస్కరణోద్యమ ప్రభావ చిత్రణ" (గురజాడ అప్పారావు, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి, గుడిపాటి వెంకటచలం, అడవి బాపిరాజు, విశ్వనాథ సత్యనారాయణ)** అనే అంశంపై పిహెచ్.డి., పరిశోధన ప్రారంభించాను. సమాజాన్నిపలురకాలుగా పట్టిపీడిస్తున్న సాంఘిక దురాచారాల్ని మరెన్నో మూఢ నమ్మకాల్ని వారు కథలకు వస్తువులుగా స్వీకరించి, కథలు రాసి సమాజాన్ని సంస్కరించేందుకు తమ వంతు కృషి చేశారు. అట్టి వారిలో గురజాడ, శ్రీపాద, చలం, బాపిరాజు, విశ్వనాథ పేర్కొనదగినవారు.

మొదట ఇంత ప్రసిద్ధ రచయితల మీద నేను పిహెచ్.డి., చేయగలనా? లేదా? అనిపించింది. కాని నా పర్యవేక్షకులు ఆచార్య తుమ్మల రామకృష్ణగారు ఇచ్చిన సలహాలు, సూచనలు 'చేయగలను' అనే ధైర్యాన్నిచ్చాయి. ఆ ధైర్యంతోనే పరిశోధన పూర్తి చేయగలిగాను.

గురజాడ అప్పారావు రచనల మీద, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారి కథల మీద విశ్వవిద్యాలయ స్థాయిలో పరిశోధనలు జరిగాయి. చలం గారి సాహిత్యం మీద పరిశోధనలు జరిగాయి. అడివిబాపిరాజుగారి సాహిత్యం మీద, విశ్వనాథ సత్యనారాయణ గారి సాహిత్యం మీద పరిశోధనలు వచ్చాయి. ఐతే ఈ ఐదుగురి రచయితలకు సంబంధించిన సంస్కరణ భావాలు గల కథల మీద ఒకే వ్యక్తి పరిశోధన చేసినట్లు నా దృష్టికి రాలేదు. అందుకే నేను నా పర్యవేక్షకుల సహాయంతో సాహసించాను.

ఈ క్రమంలో గురజాడ అప్పారావుగారికి సంబంధించిన ఐదు కథలను స్వీకరించాను. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారి కథల మీద పరిశోధన చేసిన డా॥ చామర్తి కనకయ్యగారు శ్రీపాద వారి కథల్ని పలు కోణాలలో విశ్లేషించారు. ఆ విశ్లేషణలోని సంఘసంస్కార భావాలు

గల ఇరవై కథల్ని నేను స్వీకరించాను. గుడిపాటి వెంకటచలం గారికి సంబంధించి వారి కథలన్నింటినీ అధ్యయనం చేసి, సిద్ధాంత గ్రంథం సమర్పించవలసిన కాలాన్ని, సిద్ధాంత గ్రంథ పేజీలను దృష్టిలో పెట్టుకొని, వీరివి సంస్కరణా భావాలు వ్యక్తం అయ్యే మొత్తం పదమూడు కథలను సిద్ధాంత గ్రంథంలో పొందుపరిచాను. అడవి బాపిరాజుగారికి సంబంధించి ప్రస్తుతం అందుబాటులో ఉన్న 'అడివి బాపిరాజు రచనలు - 8 కథలు'లో వున్న ముప్పైఏడు కథలను పరిశీలించి, ఎనిమిది కథల్లో మాత్రమే సంస్కరణా భావాలు వుండటం వల్ల, ఆ ఎనిమిదింటినీ సిద్ధాంత గ్రంథంలో చేర్చాను. విశ్వనాథ సత్యనారాయణ గారికి సంబంధించి, 'విశ్వనాథ సత్యనారాయణ చిన్న కథలు'గా లభిస్తున్న సంపుటిలో ముప్పై కథలున్నాయి. వాటినన్నింటినీ పరిశీలించినపుడు ఐదు కథలు సంస్కరణ భావాలతో రాసినట్లు నేను గుర్తించాను. వాటిని సిద్ధాంత గ్రంథంలో చేర్చాను. పరిశోధనా సౌలభ్యం దృష్ట్యా నా పరిశోధనాంశాన్ని నాలుగు అధ్యాయాలుగా విభజించాను.

**అధ్యాయం : 1 సంఘ సంస్కరణోద్యమం**

ఇందులో సంఘసంస్కరణోద్యమ ఆవిర్భావం, వికాసం, సంఘసంస్కరణోద్యమానికి కృషి చేసిన వాళ్ళు, సంఘసంస్కరణోద్యమ ధ్యేయం, లక్ష్యం అనే విషయాల్నిచర్చించాను.

**అధ్యాయం : 2 తెలుగు కథ ఆవిర్భావ వికాసాలు**

ఇందులో తెలుగు కథ పుట్టుకను, వికాసాన్ని గురించి చర్చిండంతోపాటు కథను సంస్కరణోద్యమం, జాతీయోద్యమం, స్త్రీవాద ఉద్యమం, దళిత ఉద్యమం ప్రభావితం చేసిన తీరును విశ్లేషణాత్మకంగా నిరూపించే ప్రయత్నం చేశాను.

**అధ్యాయం : 3 తెలుగు కథ సంస్కరణోద్యమ ప్రభావ చిత్రణ**

**(గురజాడ అప్పారావు, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి, గుడిపాటి వెంకట చలం, అడివి బాపిరాజు, విశ్వనాథ సత్యనారాయణ)**

గురజాడ కథలు సంఘసంస్కరణలు చిత్రించాయి, ఏఏ సాంఘిక సమస్యలను గురజాడ తన కథల్లో స్పృశించాడో తెలియజేస్తూ, ఆ కథలపై సంస్కరణోద్యమ ప్రభావం ఎలా ఉందో వివరించాను. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారి సంఘసంస్కార కథల్లో ఏఏ సాంఘిక దురాచారాలు కనబడ్డాయి, అవి సమాజాన్ని ప్రజలను ఎలా పట్టి పీడించాయి అన్న విషయాలతో పాటు కులాలలో వున్న మూఢాచారాలు, మూఢ విశ్వాసాలు వాటి వలన ప్రజలు ఎటువంటి ఇక్కట్లు చవిచూసింది వంటి వివరాలను పరిశీలించి శాస్త్రిగారు వాటికి ఎటువంటి పరిష్కారాలు చూపించారు అన్న అంశంతో పాటు శ్రీపాద వారి కథలపై

సంస్కరణోద్యమం ఎటువంటి ప్రభావాన్ని కనబర్చింది అన్న వివరాన్ని విశ్లేషణాత్మకంగా వివరించడం జరిగింది. గుడిపాటి వెంకటచలం కథలన్నింటిని అధ్యయనం చేసి నేనెంపిక చేసుకున్న పదమూడు కథల్లో ఎటువంటి సాంఘిక దురాచారాలు కనబడ్డాయి, ఏఏ స్త్రీ సమస్యలు ఎదురయ్యాయి అన్న విషయాన్ని విశ్లేషనాత్మకంగా తెలియజేయడమే కాకుండా ఆ కథలపై సంస్కరణోద్యమం ఎటువంటి ప్రభావాన్ని కనబర్చింది అన్న విషయాన్ని నిరూపణాత్మకంగా చూపించాను. అడవి బాపిరాజుగారి కథలన్నీ పరిశీలించి నేను గ్రహించిన ఎనిమిది కథల్లో ఎటువంటి సాంఘిక దురాచారాలున్నాయి వాటిని పరిష్కరించేందుకు బాపిరాజుగారు ఎటువంటి కృషి చేశారు లాంటివే కాకుండా ఆ కథలపై సంస్కరణోద్యమ ప్రభావం ఎలా ఉందో చూపించాను. విశ్వనాథ సత్యనారాయణగారి కథలన్నింటినీ పరిశీలించి వాటిలో నేనెంపిక చేసుకున్న ఐదు కథల్లో ఎటువంటి సంస్కరణ భావాలు కనిపించాయి, అవి సమాజానికి ఏ మేరకు ఉపయోగపడ్డాయి అనే విషయాలతో పాటు ఆ కథలపై సంస్కరణోద్యమ ప్రభావం ఎలా వుందో తెలియజేశాను.

**అధ్యాయం : 4 సంస్కరణోద్యమ కథలు భాష, శైలి పరిశీలన**

ఈ అధ్యాయంలో నేనెంపిక చేసుకున్న గురజాడ, శ్రీపాద, చలం, బాపిరాజు, విశ్వనాథగారి సంస్కరణ కథల్లో భాషా ప్రయోగం ఎలా ఉంది, వారు ఎటువంటి శైలిని ప్రయోగించారు అన్న విషయాన్ని పరిశీలించి వివరణాత్మకంగా తెలియజేశాను. చివరన ఉపసంహారం అనుబంధం, ఉపయుక్త గ్రంథ సూచి చేర్చడం జరిగింది.

# విషయసూచిక

## మొదటి అధ్యాయం


సంఘసంస్కరణోద్యమం .................... 1-77

1.1 సంఘసంస్కరణ-నేపథ్యం .................... 1

1.2 సంఘసంస్కరణ-ప్రారంభ వికాసాలు .................... 8

1.3 సంఘసంస్కరణ-ప్రసిద్ధ సంస్కర్తలు వారి సేవలు .................... 21

1.4 సంఘసంస్కరణ-ధ్యేయం .................... 59

పాదసూచికలు .................... 77


## రెండవ అధ్యాయం


తెలుగు కథ ఆవిర్భావ వికాసాలు .................... 78-112

2.1 తెలుగు కథ పుట్టుక .................... 78

2.2 తెలుగు కథ వికాసం .................... 80

2.3 తెలుగు కథ లక్ష్యం .................... 81

2.4 తెలుగు కథ లక్షణాలు .................... 83

2.5 తెలుగు కథ భేదాలు .................... 91

2.6 తెలుగు కథ - సంస్కరణోద్యమం .................... 93

2.7 తెలుగు కథ - జాతీయోద్యమం .................... 95

2.8 తెలుగు కథ - స్త్రీ వాద ఉద్యమం .................... 101

2.9 తెలుగు కథ - దళిత ఉద్యమం .................... 105

పాదసూచికలు .................... 111


## మూడవ అధ్యాయం


తెలుగు కథ - సంస్కరణోద్యమ ప్రభావ చిత్రణ .................... 113-316

(గురజాడ అప్పారావు, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి,
గుడిపాటి వెంకటాచలం, అడవి బాపిరాజు, విశ్వనాథ సత్యనారాయణ)

3.1 గురజాడ అప్పారావు .................... 113

3.2 గురజాడ కథలపై సంస్కరణోద్యమ ప్రభావం .................... 118

3.3 శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి ........................................................................ 136
3.4 శ్రీపాద కథలపై సంస్కరణోద్యమ ప్రభావం ................................................ 142
3.5 గుడిపాటి వెంకటాచలం ............................................................................ 195
3.6 చలం కథలపై సంస్కరణోద్యమ ప్రభావం .................................................... 205
3.7 అడివి బాపిరాజు ........................................................................................ 246
3.8 బాపిరాజు కథలపై సంస్కరణోద్యమ ప్రభావం ............................................ 253
3.9 విశ్వనాథసత్యనారాయణ .............................................................................. 290
3.10 విశ్వనాథ కథలపై సంస్కరణోద్యమ ప్రభావం ............................................ 295
పాదసూచికలు ................................................................................................. 314

## నాల్గవ అధ్యాయం

## సంస్కరణోద్యమ కథలు - భాష, శైలి పరిశీలిన ................. 317-357

4.1 సంస్కరణోద్యమ సాహిత్యం ......................................................................... 317
4.2 సంస్కరణోద్యమ కథలు - భాష....................................................................... 318
4.3 సంస్కరణోద్యమ కథలు - శైలి ...................................................................... 353
పాదసూచికలు ................................................................................................. 357

## ఉపసంహారం.................................................................... 358-360

## అనుబంధం ....................................................................... 361-363

## ఉపయుక్త గ్రంథసూచి ........................................................ 364-369

# మొదటి అధ్యాయం

# సంఘసంస్కరణోద్యమం

# రెండవ
# అధ్యాయం

## తెలుగు కథ – ఆవిర్భావ వికాసాలు

# మూడవ అధ్యాయం

## తెలుగు కథ సంస్కరణోద్యమ ప్రభావ చిత్రణ

గురజాడ అప్పారావు
శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి
గుడిపాటి వెంకటాచలం
అడవి బాపిరాజు
విశ్వనాథ సత్యనారాయణ

# నాల్గవ అధ్యాయం

## సంస్కరణోద్యమ కథలు - భాష, శైలీ పరిశీలన

మొదటి
అధ్యాయం

# సంఘసంస్కరణోద్యమం

*సాంస్కృతిక పునరుజ్జీవనోద్యమంలో భాగంగా సంఘసంస్కరణ ముందుకు వచ్చింది. ఆ తర్వాత గాడితప్పుతున్న సమాజాన్ని సంస్కరించేందుకు మేధావులు, కళాకారులు, రచయితలు తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. సమాజ అభివృద్ధికి ఆటంకంగా ఉన్నటువంటి అవిద్య, అజ్ఞానం, మూఢాచారాలు, దురాచారాలు, బాల్యవివాహాలు, అస్పృశ్యతలు, తొలగించడానికి విద్యావంతులైన కొందరు మహనీయులు ముందుకొచ్చారు. అటువంటి వారిలో వీరేశలింగం పంతులు, గురజాడ అప్పారావు, శ్రీపాద సుబ్రమణ్యశాస్త్రి, గుడిపాటి వెంకటాచలం, అడవి బాపిరాజు, విశ్వనాథసత్యనారాయణ పేర్కొనదగ్గవారు. వీరు కలాన్ని ఆయుధంగా ఎంచుకొని కథ, నవల, నాటకం, కవిత్వం వంటి అన్ని ఆధునిక సాహిత్య ప్రక్రియలలో సమాజాన్ని పట్టిపీడిస్తున్న సమస్యలను చూపించి, ప్రజలను చైతన్యవంతం చేశారు. భారతదేశంలో మొట్టమొదట ఈ సమస్యలపై దృష్టిసారించింది రాజారామ్మోహనరాయ్ కాగా ఆంధ్రరాష్ట్రంలో ఈ సమస్యలను రూపుమాపేందుకు సంస్కరణోద్యమాన్ని ప్రారంభించినది కందుకూరి వీరేశలింగం పంతులు.*

## 1.1 సంఘసంస్కరణ-నేపథ్యం

19వ శతాబ్దంలో సమాజం అనేక సాంఘిక దురాచారాలలో కూరుకుపోయి ఉంది. స్త్రీల పరిస్థితి మరీ దయనీయం. వీరికి స్వేచ్ఛా, సమానత్వం, స్వతంత్రం అనేవి లేవు. వీరిని ఎదగనీయకుండా సాంఘిక కట్టుబాట్ల పేరుతో పురుషులు నిరోధిస్తూండేవారు. ఇటువంటి స్థితి నుండి సమాజాన్ని బాగు చేసేందుకు సమాజ శ్రేయస్సు కోరే వ్యక్తులు కొంతమంది సంఘసంస్కరణోద్యమాన్ని ప్రారంభించారు.

'సంఘం' అంటే రకరకాల వర్గాల మనస్తత్వాల మానవ సమూహం. మానవుడు సంఘజీవి. ఒంటరిగా జీవించలేడు. సామూహికంగా జీవించవలసిందే.

అయితే ఈ సంఘం మన శరీరంలాంటిది. మన శరీరం దానికి వచ్చే రోగాలను, జబ్బులను అదే బాగు చేసుకోవడానికి ప్రయత్నం చేస్తుంది. సాధ్యం కాకపోతే వైద్యం చేయవలసి వస్తుంది. అలాగే సంఘం కూడా చిన్న చిన్న లోపాలను అదే సరిదిద్దుకుంటుంది. సాధ్యం కాని లోపాలు ఉంటే సంస్కర్తల అవసరం వస్తుంది.

మానవుల ఆలోచనా విధానాలు పలురకాలుగా ఉంటాయి. ఒకడు తన గురించి, తన బాగు గురించి ఆలోచిస్తూ ఉంటే మరొకడు ఇతరుల గురించి, ఇతరుల బాగు గురించి ఆలోచిస్తూ ఉంటాడు. ఇంకొకడు తన బాగుతో పాటు ఇతరుల బాగును కోరుతాడు, బాగు కోసం ప్రయత్నం చేస్తుంటాడు. తన గురించి కాకుండా ఇతరుల బాగుకోసమే తమ జీవితాలను సైతం త్యాగం చేసి, శ్రమించేవారు చరిత్రలో బహుకొద్దిమంది మాత్రమే ఉంటారు. బుద్ధుడు, జీసెస్, ఆదిశంకరుడు, మహ్మద్, వివేకానందుడు, గాంధీ మొదలైన వారు అలాంటివారు.

'సంఘం' ఒక ప్రవాహం వంటిది. ఆ ప్రవాహపు నీటిలో మట్టి, చెత్త, కల్మషం కలిసి ప్రవాహానికి ఆటంకం కలిగిస్తున్నట్టే మన సంఘంలో కూడా కలుషితమైన భావాలు, దురాచారాలు పేరుకుపోయి సంఘపురోభివృద్ధికి ఆటంకాన్ని కలిగిస్తున్నాయి. ఇటువంటి సమయంలో ఈ కుళ్లును, దురాచారాలను రూపుమాపడానికి ప్రయత్నం చేసే వారినే సంస్కర్తలంటున్నాం. అసలు సంస్కరించవలసిన అవసరం రావడమే సంఘానికి ఒక అదృష్టం. సంస్కరించవలసిన అవసరం వచ్చిందంటే సంఘం పురోభివృద్ధి చెందుతుందన్నమాట.

ఈ సంఘంలో కొన్ని జాతుల, తెగల, వర్గాల వారు నివాసముండే ప్రదేశమే సమాజం. ఒక్క మాటలో చెప్పాలంటే సమాజమంటే ప్రజలు, ప్రజలంటే సమాజం ప్రజలు లేకపోతే సమాజం ఉండదు.

ఈ సమాజంలో మనిషికీ, మనిషికీ మధ్య అన్యోన్య సంబంధముంటుంది. మానవుల మధ్యగల అన్యోన్య సంబంధం వల్లనే సమాజ మేర్పడుతుంది. 'సంఘం' అంటే ప్రజల మధ్య ఉండే పరస్పర సంబంధ బాంధవ్యాలే. ఒక వ్యక్తికీ మరొకరికీ, ఒక కుటుంబానికీ మరొక కుటుంబానికీ, ఒక కూటమికీ మరొక దానికీ, ఒక వ్యక్తికీ, కూటమికి మధ్యన గల పరస్పర సంబంధాలే సమాజం అని అంటారు జిడ్డు కృష్ణమూర్తి.

ఈ పరస్పర సంబంధాల వల్లనే మనిషి మార్పుకు లోనవుతుంటాడు. తన ప్రభావం ఇతరులపై ఉన్నట్లే, ఇతరుల ప్రభావం తనపై తప్పకుండా ఉంటుంది. కనుక మనిషి మారుతూ ఉంటాడు. సంఘం కూడా మారుతూ ఉంటుంది. సంఘమే కాదు మరొకటి కాదు సృష్టిలో ప్రతీది మారుతుంది. మనిషి సంఘాన్ని మారుస్తాడు. సంఘం మనిషిని మారుస్తుందనే అభిప్రాయాన్ని వెల్లడిస్తారు కుందుర్తి.

మన సమాజం సుమారుగా అయిదువేల సంవత్సరాల పురాతనమైనదిగా మనం చెప్పుకుంటున్నాం. కాబట్టి కొన్ని విశ్వాసాలు - ప్రాచీనమైనవి, కావున ఈనాటి సమాజానికి హానికరం కావచ్చు.

సంస్కరణమనేది ఒక నాటితో ముగిసేది కాదు. అది నిరంతరం జరగవలసిన కార్యక్రమం. కాలచక్ర భ్రమణంలో జరిగే ఎన్నో మార్పులు అప్పుడప్పుడు సంస్కరణకు గురికాక తప్పదు.

సమాజంలో పేరుకుపోయిన అనేక దుష్కార్యాలను రూపుమాపి సంఘాన్ని బాగు చేయడాన్నే సంఘసంస్కరణ అనవచ్చు.

ఏ సంస్కరణ అయినా సరే మార్పును కోరుతుంది. మార్పులేకుండా సంస్కరణ లేదు. సంస్కరణ అంటే మనుష్యుల పట్ల, విషయాల పట్ల ప్రజల భావాలలోను, నమ్మకాలలోను, విశ్వాసాలలోను, మనోవైఖరిలోను మార్పు జరగడమే.

అసలు సంఘసంస్కరణ భావం రావడమే మానవతాదృక్పథానికి నిదర్శనం. ఈ సంస్కార భావాలు రావాలంటే వ్యక్తులు మంచి ఆచారాలు, మంచి నడతగలవారై ఉండాలి. మంచి మనస్సు గలవారై ఉండాలి. తమ శక్తి మేరకు ఇతరులకు తోడ్పడేవారు, తమ మేలుతో పాటు తమలాంటి మానవుల మేలును కోరేవారు, కీడు కలిగించనివారూ అయి ఉండాలి. ఇలాంటి వారినే 'సంస్కారులు' అనొచ్చు.

సంఘసంస్కరణ ఆధునిక కాలంలోనే అభివృద్ధి చెందింది. ఆధునిక కవికి సంఘం, సామాన్య మానవుడే ఇతివృత్తాలు. ప్రాచీన కవికి దేవలోకాలు, స్వర్గలోకాలు, ఊహాలోకాలు, ఆ లోకాల్లో విహరించే దేవతలు, గంధర్వులు, అప్సరసలు ఇతివృత్తాలయ్యాయి. నవభారత విధాతగా కొనియాడబడిన రామమోహనరాయ్ అందించిన బ్రహ్మసమాజం ద్వారానే భారతదేశంలో సంఘసంస్కరణోద్యమాలకు నాంది జరిగింది అనవచ్చు.

ఈ బ్రహ్మసమాజం భారతదేశంలో అనేక ప్రాంతాలకు విస్తరించి ప్రజలను ఆలోచింపచేసి సమాజాన్ని ముందుకు నడిపించడానికి తోడ్పడింది.

గాంధీ గారి ప్రకారం ప్రతివ్యక్తి ఒక సంఘ సంస్కర్త కావాలి. తనను సంస్కరించుకొని ఇతరుల కోసం తన వ్యక్తిత్వాన్ని తగ్గించుకొని సమాజ సేవకుడు కావాలి. వ్యక్తికీ సమాజానికీ ఉన్న సంబంధాన్ని పేర్వారం జగన్నాథంగారిలా వివరిస్తారు. వ్యక్తికీ సమాజానికీ ఉన్న సంబంధం ఓడకి సముద్రానికి ఉన్న సంబంధం లాగా నాకనిపిస్తుంది. సముద్రపు ఆటుపోట్లన్నీ ఓడ  గమనాన్ని నిర్దేశిస్తాయి.

## బ్రహ్మ సమాజం :

1828లో బెంగాల్‌లో రామమోహనరాయ్ స్థాపించిన బ్రహ్మ సమాజం ఆంధ్రదేశంలోనూ విస్తరించింది. ఆంధ్రదేశంలో సంస్కర్తలనేకులు బ్రహ్మసమాజ అవలంబికులే. ఆంధ్రదేశ సంస్కరణోద్యమంలో బ్రహ్మసమాజ కార్యకలాపాలు అంతర్భాగమయ్యాయి. 1870-1880 మధ్య ప్రాంతాల్లో ఆంధ్రదేశంలో వివిధ పట్టణాల్లో బ్రహ్మసమాజ ప్రార్థనా మందిరాలు వెలిశాయి. సర్. రఘుపతి వెంకటరత్నం నాయుడు గారు కాకినాడను కేంద్రంగా చేసుకొని ఈ బ్రహ్మసమాజోద్యమాన్ని నడిపారు. రాజమండ్రిలో వీరేశలింగంగారు సంస్కర్తలే కాక బ్రహ్మసమాజానుయాయులు కూడా. వీరికి తోడు దేశీరాజు పెదబాపయ్యగారు, కవికొండల సాంబశివరావుగారు, కామరాజు హనుమంతరావుగారు మొదలైన అనేకమంది బ్రహ్మసమాజాన్ని అవలంబించారు. సాధారణంగా బ్రహ్మసమాజంలోని సభ్యులందరూ మేధావి వర్గానికి చెందినవారు, సంస్కరణాభిలాషులు. ఈ సందర్భంగా వెంకటరత్నం నాయుడుగారి సేవలు మరచిపోలేనివి. కులభేదాలు లేకుండా వివిధ జాతులవారు, మతాలవారు కలిసి మెలగటానికి, సహపంక్తి భోజనాలు, శాఖాంతర, వర్ణాంతర వివాహాలకి కృషి చేశారు. బ్రహ్మసమాజం సమాజంలోని అన్ని ప్రాంతాలకి విస్తరించి అన్ని అంశాల్ని పరామర్శించింది. మొదట్లో బ్రహ్మ సమాజికుల పట్ల సమాజంలో నిరసన ఉండేది. వారిని స్వగృహం నుంచి, సంఘం నుంచి బహిష్కరించారు. మన్నవ బుచ్చయ్య పంతులుగారు బ్రహ్మసమాజ ప్రచారానికి పాటుపడిన ఆంధ్రుల్లో మొదటివారని చెప్పవచ్చు. వీరు వెంకటరత్నం నాయుడిగారికి గురుతుల్యులు. వేశ్యా, వితంతు వివాహాలతో పాటు కులతత్వాన్ని ఖండించడం, జంధ్యం విసర్జించటం, అనాథ శరణాలయాల స్థాపన, అస్పృస్యతా నివారణ, ఆధ్యాత్మిక భావప్రచారం ద్వారా నిత్య జీవితంలో ఈశ్వర భక్తిని పెంపొందించటం బ్రహ్మసమాజ లక్ష్యాలు. బ్రహ్మసామాజికులు తమ సంస్కరణాచరణకి సంఘం నుంచి వ్యతిరేకతనెదుర్కొన్నారు.

భారతదేశంలో సంస్కరణోద్యమానికి పునాదులు వేసి బ్రహ్మసమాజం లేదా 'బ్రహ్మధర్మం' అనే నూతన సమాజాన్ని రామమోహనరాయ్ లోకానికందించాడు. ఈ బ్రహ్మసమాజ స్థాపన ఒక్క బెంగాల్‌లోనే కాక మొత్తం భారతదేశానికి, ముఖ్యంగా మన ఆంధ్రదేశంలోని సంస్కరణోద్యమానికి పునాది అయింది. ఈ బ్రహ్మసమాజం మత సంస్కరణకే కాక సంఘసంస్కరణకు కూడా దోహదమైంది. హిందూ, బౌద్ధ, జైన, ఇస్లాం మతాలను గురించి, వాటిలోని మంచి విషయాలను గ్రహించిన రామమోహనరాయ్ క్రైస్తవం

నుండి అనుసరణీయమైన అంశాలను గ్రహించి మొదట 'బ్రహ్మసభ' అనే పేరుతో బ్రహ్మసామాజాన్ని స్థాపించాడు.

ఇతను బైబిల్ చదివే కాలంలో విలియం ఆదాము అనే బాప్టిస్టు మత బోధకునితో స్నేహమేర్పడింది. ఆదాము ఎప్పటికైనా రామమోహనునిచే తమ 'జ్ఞానస్నానాన్ని' చేయించాలని అనుకోగా అందుకు వ్యతిరేకంగా ఆదామే రామమోహనుని ఏకేశ్వరవాదానికి ఆకర్షితుడు కావాల్సివచ్చింది. త్రిత్వమును బోధించే బాప్టిసము వదలి అతను యునిటేరియన్ మతాన్ని స్వీకరించాడు. ఈ విషయం బాప్టిస్టు మత ప్రచారకులకు మిక్కిలి కోపాన్ని తెప్పించింది. రామమోహనుని, ఆదాముని కూడా దూషించారు. దానికి సమాధానంగా రామమోహనుడు హిందువులలోని బహుదేవతారాధన కన్న త్రిత్వం ఏవిధంగానూ శ్రేష్టతరమైంది కాదని అంటో ప్రాచీన ఋషిప్రోక్తమైన వేదాల్లోను, క్రైస్తవ మతగ్రంథాల్లోను ఘంటాపథంగా స్థిరీకరింపబడి ఉన్న ఏకేశ్వరవాదం యూనిటేరియనులచే ఆచరించబడుచున్నది. కాబట్టి తాను యూనిటేరియన్ మందిరానికి వెళ్ళడంలో దోషంలేదని వాదించాడు. కాని కొద్ది రోజులకు యునిటేరియన్ సంఘం క్షీణించడం చూచి ఆదామేదానికి బదులుగా రామమోహనుని ఏకేశ్వరోపాసన సిద్ధాంతాన్ని బలపరచేందుకు బ్రహ్మసమాజాన్ని స్థాపించమని ప్రోత్సహించాడు.

రామమోహనరాయ్ కలకత్తాలో నివాసం ఏర్పర్చుకున్న తర్వాత 1815వ సంవత్సరంలో తన ఇంటిలోనే ఆత్మీయ సభ అనే పేరుతో ఒక సమాజాన్ని స్థాపించాడు. క్రీ.శ. 1828వ సంవత్సరం ఆగస్టు 20వ తేది బుధవారం నాడు అద్దె గృహంలో "బ్రహ్మసమాజ" స్థాపన జరిగింది.

## ఆర్య సమాజం :

ఆర్యసమాజం కూడా సంఘాన్ని సంస్కరించడానికి అవతరించిందే. స్వామీ దయానంద సరస్వతి స్థాపించిన ఈ సమాజం ఎంతోమందిని ప్రభావితం చేసింది.

1875లో దయానంద సరస్వతి స్థాపించిన ఆర్యసమాజం కూడా సంస్కరణ భావాలతో ఉద్భవించిందే. బ్రహ్మసమాజం పొందినంత ప్రచారం ఆర్యసమాజం పొందలేకపోయింది. ఆర్యసమాజం చేపట్టిన కార్యకలాపాల్లో ముఖ్యంగా పేర్కొనవలసింది శుద్ధిపుద్యమం. హిందూమతం వదిలి ఇతర మతాల్లో చేరిన హిందువుల్ని తిరిగి హిందూమతంలో చేర్చుకోవటం ఇందులోని ప్రధానంశం. హిందువులు క్రైస్తవ మతంలో ఎక్కువగా చేరుతున్న

ప్రాంతాల్లో ఈ మతం బాగా ప్రచారం పొందింది. స్త్రీ విద్యని ప్రోత్సహించింది. బాల్యవివాహాల్ని తిరస్కరించింది.

## దివ్యజ్ఞాన సమాజం :

దివ్యజ్ఞాన సమాజం ఆంధ్రదేశంలో బ్రహ్మసమాజం తర్వాత ఎక్కువ ప్రచారం పొందింది. ఈ సమాజం మొదట్లో సంఘసంస్కరణకి దూరంగా వుండేది. అనిబిసెంట్ ఈ మత సారధ్యం వహించిన తర్వాత దీనికి సంఘసంస్కరణతో సంబంధం ఏర్పడింది. ఈ సమాజం సర్వమానవ సౌభ్రాతృత్వానికి కృషిచేసింది. హిందూమతంలోని పూర్వాచారాన్ని చాలావరకు సమర్థించింది. ఎవరి మతాన్ని వారు వదలకుండానే ఈ మతంలో చేరే అవకాశం వుంది. ఆంధ్రదేశంలో సముద్రతీర ప్రాంతంలో ఈ మతం బాగా ప్రచారం పొందింది. తాడంకి వెంకట నర్సయ్య, తుర్లపాటి శేషాచలపతిరావుగార్లు ఆంధ్రదేశంలో దివ్యజ్ఞాన సమాజ నాయకులుగా వుండేవారు.

మత విషయాల్లో హిందూ ప్రజల్ని జాగృతం చేసిన రామకృష్ణ పరమహంస, వివేకానందుల బోధలు ఈ సందర్భంగా స్మరించదగ్గవి. హిందూమతం గొప్పతనాన్ని అస్పృశ్యతలోని నైచ్యాన్ని నొక్కి చెప్పిన వివేకానందుడు గొప్ప మత సంస్కర్త.

ఆంధ్రరాష్ట్రంలో వీరేశలింగం పంతులు సంఘసంస్కరణకు పునాది వేశారు. ఆంగ్లభాషా సంస్కృతుల ప్రభావంతో ప్రేరితులైన విద్యావంతులు సంస్కరణ భావాలను ప్రచారం చేయడానికి పూనుకున్నారు.

సంస్కరణ అంటే మార్పు, ప్రక్షాళన, చైతన్యం అని అనేక రకాలుగా పేర్కొనవచ్చు. కందుకూరి సాహిత్యాన్ని ఒక ఆయుధంగా స్వీకరించి, సంఘసంస్కరణోద్యమం ప్రారంభించి సఫలీకృతుడైనాడు. ఆయన ప్రారంభించిన సంస్కరణోద్యమం మూడు పూవులు ఆరుకాయలుగా వర్ధిల్లింది.

సంస్కరణోద్యమం రెండు విధాలు :

1. భాషా సంస్కరణ
2. సంఘ సంస్కరణ

ఈ రెండింటి ద్వారా సమాజానికి ఎంతో సేవ చేసిన మహనీయుడు కందుకూరి. ఆయన అడుగుజాడల్లో ఎందరో నడిచి ఫలితాలను సాధించారు.

సంస్కరణోద్యమాలకి ఆంధ్రదేశం అంతట్నించి ప్రాతినిధ్యం వున్నప్పటికీ ఈ ఉద్యమాలు ఆంధ్రప్రాంతంలో పుంజుకున్నంత వేగంగా తెలంగాణాలో ప్రాచుర్యం పొందలేదు. ఇందుకు ఆర్థిక, సాంఘికపరమైన అనేక కారణాలున్నాయి. తెలంగాణా ప్రాంతం పూర్తిగా ఆంగ్లేయ సంస్కృతీ ప్రభావానికి లోనుకాలేదు. నైజాం సంస్కృతీ ప్రభావంలోనే వుంది. తెలంగాణాలో ఉద్యమాలు కొంచెం ఆలస్యంగా తలెత్తాయి. కోస్తాంధ్ర జిల్లాల్లో కృష్ణా, గోదావరి ఆనకట్టల వల్ల అక్కడి ప్రజల ఆర్థికస్థితి మెరుగుపడింది. ఆంధ్రదేశంలో సంస్కరణోద్యమాలకి మచిలీపట్నం, కాకినాడ, రాజమండ్రి ప్రధాన కేంద్రాలుగా వున్నాయి.

మచిలీపట్నం తీర ప్రాంతం కావడంవల్ల ఇతర దేశాల సంస్కృతుల ప్రభావం ఆ ప్రాంతంపై ముందుగా పడింది. వివిధ దేశాల వ్యాపారస్తులకి, వారి గిడ్డంగులకీ కేంద్రస్థానం అయింది. ఇక్కడ అనేక పాఠశాలలు, కళాశాలలు ఇతర ప్రాంతాలకంటే ముందుగా స్థాపించబడ్డాయి. వీటికంటే ముందు క్రైస్తవ మిషనరీలు తమ ప్రచారం సాగించాయి. స్వరాజ్యోద్యమకాలంలో జాతీయ కళాశాల స్థాపన జరిగింది.

గోదావరి తీరంలో రాజమహేంద్రవరం సంస్కరణోద్యమానికి కేంద్ర బిందువు అయింది. గోదావరి ఆనకట్ట ప్రభావం వలన అభివృద్ధి చెందిన రాజమండ్రి వివిధ వ్యాపారాలకు కేంద్రంగా మారింది. వీరేశలింగం వంటి సంస్కర్తలు నివసించటం వల్ల, తర్వాత ముద్రణ రవాణా సౌకర్యాలు అభివృద్ధి మూలంగా కూడా రాజమండ్రి కేంద్రస్థానంగా నిలిచింది.

కాకినాడ సైతం సముద్ర తీర ప్రాంతం కావడం వల్ల రాకపోకలకు వీలుగా ఉండి సంస్కరణోద్యమం వేగాన్ని పుంజుకుంది.

రఘుపతి వెంకటరత్నం నాయుడువంటి బ్రహ్మసమాజకులకు సంస్కర్తలకు నివాసం కావడంతో ఇక్కడ కూడా వివిధ విద్యాలయాల స్థాపన, సంస్క ృతీ పరిణామం, సంస్కరణ భావావేశం తలెత్తి సంస్కరణోద్యమానికి నెలవయింది.

ఇవి కాక ఏలూరు, గుంటూరు, తణుకు, నెల్లూరు, విజయనగరం మొదలైన ప్రాంతాలు కూడా సంస్కరణోద్యమ కార్యకలాపాలకి నిలయాలుగా వుండేవి. పరిమిత వనరుల వల్ల ఇవి ప్రధాన కేంద్రాలు కాలేకపోయినా సంస్కరణోద్యమ చరిత్రలో వీటిస్థానం మరువలేనిది.

బ్రహ్మ, ఆర్య, దివ్యజ్ఞాన సమాజాలు ఉద్భవించి భారతదేశంలోనూ, ఆంధ్రరాష్ట్రంలోనూ ప్రజల జీవన స్థితిగతులకు సంబంధించిన సాంఘిక, సామాజిక, కుల వ్యవస్థలను సంస్కరణోద్యమాల ఆవిర్భావానికి పునాదులు వేశాయి.

## 1.2 సంఘసంస్కరణ - ప్రారంభ వికాసాలు

19వ శతాబ్దంలో సమాజాన్ని చీకటి రాజ్యమేలుతున్నట్లు ఉండేది. ప్రజలు అవిద్య, అవినీతి, లంచగొండితనం వంటి ఊబుల్లో కూరుకుపోయున్నారు. స్త్రీల దుస్థితి చెప్పనవసరంలేదు. బాల్యవివాహాలతోనూ, సతీసహగమన దురాచారంతోనూ, వితంతువుల దుస్థితితోనూ, వేశ్యాసమస్యతోనూ సమాజం కొట్టుమిట్టాడుతుండేది. ఇటువంటి సందర్భంలో సంస్కర్తలు సంఘాన్ని సంస్కరించడానికి సంఘసంస్కరణోద్యమాలను ప్రారంభించడం అనివార్యం అయింది. ఈ బాధ్యతను రాజారామ్మోహనరాయ్, కందుకూరి వీరేశలింగం, ఇంకా మరెందరో మహనీయులు తమ భుజస్కంధాల మీదకు ఎత్తుకున్నారు. ఆ దిశగా ప్రయత్నించి సఫలీకృతులైనారని చెప్పవచ్చు.

సంస్కరణోద్యమాలు అంటే ఏమిటి?

సంస్కరణ అంటే మార్చుకోవడం. సమాజంలో చలామణిలో వున్న పొరబాట్లనూ, నష్టదాయకమైన అంశాలనూ సరిదిద్దేందుకు ప్రయత్నించడం. ఆ మార్పు స్వల్పమైనదే కావచ్చు. ఏదైనా ఒక్క అంశానికి మాత్రమే సంబంధించినదై వుండొచ్చు. కానీ దానిపై పోరాడాలనే స్పృహ అందరిలోనూ కలిగించి, అందుకు వ్యతిరేకంగా సామూహికంగా కృషి చేయాలి. ఆ పోరాటం సమరశీలమైందీ కావచ్చు. సాత్వికమైందీ కావచ్చు. స్థూలంగా చెప్పాలంటే విప్లవం అంటే సమూలమైన మార్పు, సంస్కరణ అంటే పాక్షికమైన మార్పు. అలాగే రాజకీయేతర అంశాలను సంస్కరణలుగా పరిగణించడం రివాజుగా స్థిరపడింది. స్వాతంత్ర్య పోరాటానికి ముందే సాగిన కందుకూరి వీరేశలింగం వితంతు పునర్వివాహోద్యమం, వేశ్యావృత్తి నిరోధం, స్త్రీ విద్య వంటివి ఎన్నో ఇందుకు ఉదాహరణలు.

వీరేశలింగం యుగంలో తనకాలం నాటి ఈ సాంఘిక దురాచారాలన్నింటినీ వీరేశలింగం ఎదుర్కొని పోరాడారు. అతి బాల్యవివాహాలు, నిర్భంద వైధవ్యం, స్త్రీల అవిద్య, వేశ్యావృత్తి వివిధ రకాలైన మూఢ నమ్మకాలు మతమౌఢ్యం, అవినీతి, లంచగొండితనం, అంటరానితనం మొదలైన సాంఘిక రుగ్మతలన్నింటినీ రూపుమాపడానికి పూనుకున్నారు. ఫ్యూడల్ సాంఘిక, సాంస్కృతిక, సాహిత్య రంగాలలో గొప్ప విప్లవం తీసుకొని వచ్చారు. మహాకవి గురజాడ, గిడుగురామమూర్తి, కొమర్రాజు లక్ష్మణరావు ప్రభృతులు ఈ వీరేశలింగం ప్రారంభించిన సాంఘిక, సాహిత్య సంస్కరణోద్యమాలను ముందుకు తీసుకుపోయారు. రఘుపతి వెంకటరత్నం నాయుడుగారు వేశ్యావృత్తికి వ్యతిరేకంగా సుదీర్ఘపోరాటం సాగించారు.

## స్త్రీ విద్య :

సంస్కరణోద్యమ కాలంలో స్త్రీపరంగా చర్చించిన అంశాల్లో ముఖ్యమైంది స్త్రీ విద్య.

మనదేశంలో వేదకాలం నుంచి స్త్రీలలో విద్యావ్యాప్తి ఉందని గార్గి, మైత్రేయి వంటి స్త్రీల ఉదంతాలు తెలియజేస్తున్నాయి. చరిత్రలో కనిపించే ఏ ఒకరిద్దరి స్త్రీల పేర్లనో ఆధారంగా తీసుకొని మొత్తం స్త్రీ జాతి అంతా విద్యావంతులనటానికి వీలులేదు. ప్రతి యుగంలోనూ విద్యాసంస్కారం కలిగి రచనా వ్యాసాంగం చేపట్టిన స్త్రీలు ఒకరిద్దరు కనిపిస్తూనే ఉన్నారు.

ప్రపంచ వ్యాప్తంగా స్త్రీ విద్యని గూర్చిన ఆలోచనలు 18 మరియు 19వ శతాబ్దాల్లో తలెత్తాయి. మనదేశంలో కూడా 19వ శతాబ్ది ఉత్తరార్ధానికే స్త్రీ విద్యావశ్యకత గుర్తించినా ఆ శతాబ్ది పూర్వార్ధంలోనే నిజమైన ప్రయత్నాలు కొనసాగాయి. 20వ శతాబ్ది తొలిదశకాల్లో స్త్రీ విద్యా ఉద్యమం క్రమంగా అభివృద్ధి చెందింది.

భావ ప్రచారానికి విద్య ఉత్తమ సాధనం. 19వ శతాబ్దంలో దేశంలో ఏర్పడిన సాంఘిక ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా స్త్రీలలో మార్పుతేవలసిన అవసరం ఏర్పడింది. అందుకు విద్య ప్రధాన సాధనమయింది. విద్య ద్వారా స్త్రీని మార్చిన సామాజిక అవసరాలకనుగుణంగా తీర్చిదిద్దే ప్రయత్నం మొదలైంది. సంఘంలో నెలకొన్న పరిస్థితులు స్త్రీ విద్యావశ్యకతను గూర్చి చర్చింపజేశాయి.

స్త్రీకి విద్య అవసరమా? అవసరమైతే ఎటువంటి విద్య కావాలి? ఎంతవరకూ కావాలి? వంటి సమస్యలు తలెత్తాయి. అన్నిటికంటే ముఖ్యంగా విద్యనేర్చిన స్త్రీ ప్రవర్తన గురించి భయాందోళనలు స్త్రీ విద్యను గూర్చిన విస్తృత చర్చలకి దారి తీశాయి. మొత్తం మీద స్త్రీ విద్య లాభదాయకమనీ, అవసరం అని గుర్తించి స్త్రీలను విద్యావంతుల్ని చేశారు.

స్త్రీ విద్యను గూర్చిన చర్చలూ స్త్రీలపై విద్యా ప్రభావం మొదలైన అంశాల్ని నాటి నవలల్లో, నాటికల్లో, కథల్లో విస్తృతంగా చర్చించారు. రచయితలందరూ కూడా విద్య స్త్రీని అజ్ఞానాన్ని తొలగించి వివేకవంతురాలిని చేస్తుందనే విషయంలో ఏకీభవించారు.

స్త్రీ విద్యావంతురాలైతే కుటుంబమంతా విద్యతో నిండుతుందని, ఆ కుటుంబం సుభిక్షంగా ఉంటుందని క్రమేపీ సమాజమంతా అన్ని రంగాలలో వృద్ధి చెందుతుందని ఎంతో మంది బోధించారు.

చదువురాకపోవడం వలన, ప్రపంచంలో కలుగుతున్న మార్పులకి స్త్రీ దూరమౌతోంది. స్త్రీకి విద్య లేకపోవటం వల్ల కలిగే ప్రధానలోపం ఇది. స్త్రీకి బాహ్యప్రపంచంతో బొత్తిగా

సంబంధం ఉండదు. దానివల్ల బాహ్యాప్రపంచంలోని విషయాలకి స్త్రీల ఆలోచనలకీ వైరుధ్యం ఏర్పడింది. దాంతో స్త్రీ అభివృద్ధి నిరోధకురాలిగా తయారైంది. స్త్రీని ఆ అజ్ఞానం నుంచి బయటకు తీసుకురావటానికి విద్య అవసరం. అప్పటికి మనదేశంలో పురుషుల విద్య కూడా పరిణామస్థితిలో ఉంది. అయితే పురుషుడి విద్యకి ఆటంకాలుండేవి కావు. వివాహ సమయంలో పురుషుడికి విద్య ఒక అదనపు యోగ్యతగా పరిగణింపబడుతుంది. స్త్రీకి అదొక లోపంగా గుర్తించిన సందర్భాలు కూడా ఉన్నాయి. చదువుకున్న స్త్రీలు చదువులేని వారికంటే ఉత్తములుగా పరిగణింపబడతారు. సంసార నిర్వహణలో విద్యావంతులైన స్త్రీలు ఎక్కువ సమర్థత ప్రదర్శిస్తారు. విద్య స్త్రీకి కొత్త ఆలోచనలకి త్రోవ చూపుతుంది. ఆర్థిక సాంఘిక విషయాల్లో పురుషుడికి స్త్రీ సహకారం ఎక్కువగా కావలసి వచ్చింది. మారుతున్న సమాజంలో పురుషులు పరుగులు పెట్టినంత మాత్రాన సరిపోదనీ, తమతోపాటు తమ ఆడవాళ్ళనీ విద్యావంతుల్ని చేస్తే కానీ సంఘ పురోభివృద్ధి సాగదనీ గుర్తించారు.

స్త్రీలు చదువుకుంటే కాని సంసారాలు సరిగా ఉండవు అని స్త్రీల కోసం ముఖ్యంగా బాలబాలికల కోసం వీరేశలింగం గారు పాఠశాలలు ప్రారంభించారు. వాళ్ళకు వీరేశలింగమే స్వయంగా చదువు చెప్పేవాడు. అట్లానే బాలురకు కూడా సరైన విద్యనేర్పడానికి పాఠశాలలు స్థాపించాడు. సంఘంలో ధర్మం, దయ, నీతి, ఆస్తికత, పరోపకారం, చిత్తశుద్ధి, శీలం, సత్ప్రవర్తన అలవరచటానికి రాజమండ్రిలో బాలబాలికల పాఠశాలను వీరేశలింగం మొదట స్థాపించాడు. ఆడపిల్లలు, మగపిల్లలూ కలిసి చదువుకునే సహవిద్యా విధానం ఆంధ్రదేశంలో మొట్టమొదట అమలుపరిచినవాడు వీరేశలింగమే.

ఆడపిల్లల చదువంటే వీరేశలింగంకు అమితమైన అనురాగం. ఏ ఊళ్ళో ఉన్నా ఏ నగరంలో ఉన్నా తన తీరిక సమయమంతా ఆడపిల్లల చదువు గురించే ఆలోచించేవాడు. తానే స్వయంగా సుద్దముక్క, పుస్తకమూ పట్టుకొని వాళ్ళకు పాఠాలు చెప్పాడు.

### బాల్యవివాహాలు :

సంస్కరణోద్యమ కాలంలో సాంఘిక దురాచాలన్నింటిలోనూ బాల్య వివాహాలని కీలకమైనదిగా గుర్తించడం జరిగింది.‘‘పురాణకాలంలో బాల్యవివాహాలు అమలులో ఉన్నట్లు చెప్పలేం. మధ్య యుగాల్లోని ముస్లిం దురాగతాలవల్ల, ఇతర కారణాలవల్ల బాల్యవివాహాలు మనదేశంలో ఎక్కువగా జరుగుతూ వచ్చాయి.’’[2] ఏమి జరుగుతుందో తెలియని వయసులోనే ఆడపిల్లను పెళ్ళిపీటలు ఎక్కించేవారు. తరువాత కొంతకాలానికి

ఎన్నో కష్టాలకు వీరు గురౌతుండేవారు. ఊహ తెలియని వయసులోనే ఈ పెళ్ళిళ్ళు జరుగుతూ ఉండేవి. పీటల మీద కూర్చోవడం కూడా చేతగాని పసిపిల్లలని తల్లి ఒడిలో కూర్చోపెట్టి వివాహం చేసేవారు. మూడేళ్ళ అమ్మాయికి ఏడేళ్ళ అబ్బాయికి వివాహం జరిగేది. వధూవరులకి వివాహం అంటే ఏమిటో తెలుసుకునే అవకాశం లేదు. పెద్దలు నిర్ణయించిన పెళ్ళి చేసుకొని ముందు జీవితం సాగించడమే వారు చేయవలసిన పని. ఈ పరిస్థితిలో అన్నీ సవ్యంగా ఉండి ఆ బాలబాలికలిద్దరూ పెరిగి పెద్ద వారైతే పర్వాలేదు. కానీ, విధి వక్రించి బాలుడు మరణిస్తే ఆ బాలిక జీవితం ఘోరాతిఘోరం. బాల్యవివాహాల వల్ల స్త్రీ పురుషులిద్దరూ సమస్యలని ఎదుర్కోవలసి వచ్చినా ఎక్కువగా నష్టపడేది స్త్రీ అనడంలో సందేహం లేదు. బాల్యవివాహాల కారణంగా ముక్కుపచ్చలారని ఎందరో బాలికలు ఊహ తెలిసే నాటికే వితంతువులయ్యేవారు. ఈ బాల్యవివాహాల్ని రూపుమాపి రజస్వలానంతరం వివాహాలని ప్రవేశపెట్టటానికి ఎందరో సంస్కర్తలు ప్రయత్నించారు.

బాల్యవివాహాల వలన స్త్రీలకు ఎంతటి నష్టం జరుగుతుందో తెలుసుకొని వాటిని నిర్మూలించే దిశగా ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి.

బాలికల వివాహ వయస్సులో మార్పుతేవటానికి ఎంతగానో ప్రయత్నం చేయవలసి వచ్చింది. బాల్యవివాహాలవల్ల కలిగే నష్టాలు రచయితలందరూ గుర్తించారు. చిన్నప్పుడే పెళ్ళి, సంతానం వల్ల స్త్రీ అనారోగ్యవంతురాలు కావడమే కాకుండా, ఆమెకు పుట్టిన పిల్లలు కూడా అనారోగ్యవంతులై అల్పాయుష్కులయ్యేవారు. బాల్య వివాహాల వల్ల స్త్రీలు కుటుంబ నిర్వహణలోని మెళుకువలనూ, సతిధర్మాలనూ సరిగా పాటించలేకపోతున్నారనే భావం నాటి స్త్రీల పత్రికలలో కనిపిస్తుంది. బాల్యవివాహాలవల్ల వితంతు సమస్య పరిష్కరింపలేనిదిగా ఉండేది.ఇన్ని అనర్థాలకి కారణమైన బాల్యవివాహాలని రూపుమాపాలనే ఆలోచన నాటి సంస్కర్తలందరికీ ఉండేది. 1911వ సంవత్సరం జనాభాలెక్కల ప్రకారం అతి బాల్యవివాహాలు 90 లక్షలు జరిగాయి.

| వయసు | పెళ్ళి అయిన బాలికలు |
|---|---|
| 11 సంవత్సరాలు | 25,00,000 |
| 15 సంవత్సరాలు | 9,00,000 |

ఆంగ్ల విద్యా ప్రభావం వల్లనైతేనేమి మరే ఇతర కారణాల వల్లనైతేనేమి ప్రజల్లో దురాచారాల పట్ల విముఖత పెరిగింది. వివాహ సమయంలో వధూవరులకి స్వాతంత్ర్యం లేని పరిస్థితిని గుర్తించటం ప్రారంభించారు.

## మూఢనమ్మకాలు :

ఆంగ్ల ప్రభుత్వం ఈ దేశంలో తమ అధికారం విస్తరించుకొనే నాటికి మనదేశం మూఢనమ్మకాలకి, అర్థం కాని ఆచారాలకి ఆనవాలై ఉంది. పరలోకంలో పుణ్యం, పురుషార్థాలనే భ్రమతో కన్నబిడ్డల్ని మొసళ్లకి వేయడం, కాళికాదేవిని తృప్తి పరచడం కోసమని నరబలివ్వడం భక్తి పారవశ్యంతో భగవంతుని పేరిట ఆత్మహత్యలు చేసుకోవడం, మొదలైన ఆచారాలు దక్షిణ హిందూదేశంలో కంటే ఉత్తర హిందూ దేశంలో అధికంగా కనబడుతుండేవి. సతీసహగమనమనే దురాచారం స్త్రీల పాలిట శాపంగా తయారయింది. చనిపోయిన భర్తతో కలిసి మరణిస్తే పై లోకాల్లో కూడా ఆ భర్తతో కలిసి వుండవచ్చనే కల్పిత బోధలు చేసి అమాయకులైన బాలికల్ని భర్త చితిమీదికి బలవంతంగా తోసి సహగమనం చేయించేవారు.

స్త్రీ శిశువుల్ని పుట్టగానే చంపివేసే ఆచారం రాజపుత్రుల్లో ఎక్కువగా వుండేది. స్త్రీ శిశుహత్యలకి ముఖ్యకారణం ఆడపిల్లల తల్లితండ్రులు కూతురు వివాహ సమయంలో ఎక్కువగా ధనవ్యయం చేయాల్సి రావడమే.

1479లో వల్లభాచార్యుడు స్థాపించిన వల్లభాచార్య మతం వ్యభిచారాన్ని ప్రోత్సహించింది. మహారాజులు కృష్ణావతారులని, కృష్ణపూజల పేరిట విచ్చలవిడి శృంగారం యదేచ్ఛగా సాగింది. రాజులు నీతినియమాలు తప్పి ఇష్టపడ్డ స్త్రీలకు శృంగార బోధ చేసి అనుభవించడానికి ఈ మతం ఉపయోగపడింది. ఈ మతం పేరిట దురాచారాలు 1850 ప్రాంతాల వరకూ కొనసాగాయి. ఈ ఆచారాలన్నీ సాధారణంగా ఉత్తరదేశంలో ప్రబలి వున్నాయి. దక్షిణ హిందూదేశం ఈ విషయంలో తక్కువేమి కాదు.

ఆనాటి సమాజంలో ప్రజలు ఏదైనా పనిమీద ఇంటి నుంచి బయల్దేరడానికి అర్థంలేని శకునాల్ని పాటిస్తూ, మంచి రోజని, మంచి ఘడియని అయినదానికి, కానిదానికి కాలయాపన చేస్తూ, గ్రహణాలు మొదలైనవి అశుభసూచకాలని, ముఖ్యంగా గర్భిణీ స్త్రీలు గ్రహణాన్ని చూస్తే అంగవికలులైన బిడ్డలు పుడతారని నమ్ముతూ, చనిపోయిన వాళ్లు దెయ్యాలు, భూతాలు అవుతారని, ఆ దెయ్యాలు, భూతాలు కొంతమందితో మాట్లాడతాయని, కొందర్ని ఆవహిస్తాయని గుడ్డిగా జీవించేవాళ్ళు. భూత వైద్యులకి విపరీతమైన గిరాకీ వుండేది. ఇంటికొకర్కైనా గాలిసోకటం జరుగుతుండేది. మనిషికి పట్టిన దెయ్యాన్ని భూతవైద్యుడు వదలగొట్టి సీసాలో బంధించి భూస్థాపితం చేస్తాడని నమ్మేవారు. స్త్రీల పురిటి సమయంలో అనారోగ్యకరమైన అంశాల్నే ఆచారం పేరుతో పాటిస్తుండేవాళ్ళు. పిల్లలకి జ్వరాలు వచ్చినా,

వాంతులు విరేచనాలు వంటివి సంభవించినా వైద్యుని సంప్రదించక అమ్మవారొచ్చిందని నైవేద్యాలు పెట్టడం, గ్రామదేవతలకి మొక్కుతుండటం చేసేవారు. వ్యాధి వచ్చినప్పుడు మందుపుచ్చుకోకుండా అతీతశక్తులపైన నమ్మకం వుంచేవాళ్లు. మంత్రగాళ్లకీ, దొంగసన్యాసులకీ, వైరాగులకీ, కొదవలేదు. వీరు విపరీతంగా డబ్బును సంపాదించేవారు. వాళ్ళు ఇచ్చే తాయత్తులు విబూదుల వల్ల జబ్బులు నయమౌతాయనీ, దివ్యశక్తులు కలుగుతాయనీ వాళ్ళ మంత్రాలకి అమోఘమైన శక్తి వుంటుందని విశ్వసించేవారు.

ముత్తైదువులుగా చనిపోయిన స్త్రీలు దేవతలుగా మారుతారని అనేకమంది దేవతల్ని కొలుస్తూ, ఆ దేవతలకి బలులూ, జాతర్లు చేస్తుండేవాళ్లు. ఊరికి ముగ్గురు, నలుగురైనా గ్రామదేవతలుంటుండేవారు.

కొందరు సాధువులకి బంగారాన్ని తయారుచేసే శక్తి వుందని నమ్మేవాళ్లు. వీరు ఇనుముని బంగారంగా మారుస్తారని, తక్కువ బంగారం నుంచి ఎక్కువ బంగారం సృష్టిస్తారని, నమ్మి అనేకమంది అమాయకులు ఉన్న కొద్దిపాటి సంపదని పోగొట్టుకునేవారు. ఆ విద్యని నేర్చుకోవడం కోసం ఉపయోగం లేని ప్రయత్నం చేసేవారు.

ప్రభుత్వోద్యోగుల లంచగొండితనానికి న్యాయవాదుల ఆగడాలకీ అంతుండేది కాదు. ప్రతి చిన్న ఉద్యోగి ఎదుటి వాడ్నించి తృణమో, ఫణమో ఆశించందే పనులు చేసేవారు కాదు. పట్టం పుచ్చుకున్న ప్రతి న్యాయవాది డబ్బుకోసం ఎటువంటి పనిచేయడానికైనా వెనకాడేవాడు కాడు. బ్రిటిష్ ప్రభుత్వ పాలన ఫలితంగా న్యాయస్థానాలకీ, న్యాయవాదులకీ ఆదాయ మార్గం ఏర్పడింది. న్యాయవాదుల ఆగడాల్ని చిత్రిస్తూ అనేక నవలలు, నాటకాలు రచించబడ్డాయి. అన్నదమ్ముల, రక్త సంబంధీకుల మధ్య భూమి తగాదాలు తలెత్తుతుండేవి. దీనికి తోడు పరువు నష్టం దావాలు, మనోవర్తనం దావాలు ఎడతెరిపిలేకుండా సాగుతూనే వుండేవి. విదేశీయానం తప్పుగా భావించబడేది. మధ్యపానం, వేశ్యాలోలత్యం, బహుభార్యాత్వం నాటి సమాజాన్ని గబ్బిలంలా పట్టి ఉన్న సమస్యలు. ఒకర్నో, ఇద్దర్నో వేశ్యల్ని పోషించడం గొప్పవారికి ఆనవాయితీగా వుండేది. తినడానికి తిండి లేకపోయినా మీసాలకు సంపెంగ నూనె అన్నట్లు ఇంట్లో వస్తువుల దగ్గర్నుంచి పెళ్లాం మెళ్లో పుస్తెలు వరకు మొత్తం వుంచుకున్న వేశ్యకి చేరవేయడానికి వెనకాడేవారు కాదు పురుషులు. మగవాడు ఎన్ని పెళ్ళిళ్లు చేసుకోవడానికైనా అభ్యంతరం ఉండేది కాదు. ఒక భార్య ఉండగానే పిల్లలు పుట్టలేదనో మరింకేదో కారణం చెప్పి మళ్లీ పెళ్ళి చేసుకుంటుండేవారు.

ఇక వివాహం విషయంలో ప్రజలు పాటించే ఆచారాలకి అర్థం ఉండేది కాదు. ఏ వివాహం ఎందుకు జరుగుతుందన్న ప్రశ్నకి సమాధానం లేదు. వివాహలక్ష్యం ఏమిటనే విషయం పూర్తిగా మరుగునపడి వివాహ విధానం అర్థంలేని తంతుగా తయారైంది. బాల్యవివాహాలు కన్యాశుల్కాలే కాక వయసు తారతమ్యంతో సంబంధం లేకుండా ఎన్నో వివాహాలు జరుగుతుండేవి. వివాహ వ్యవస్థ పూర్తిగా కుళ్లిపోయి సమగ్రంగా సంస్కరించాల్సిన దిశలో ఉండేది. కన్యాశుల్కానికి తోడు రాను రాను వరకట్నాలు చెలరేగాయి. వధూవరులిద్దరికీ వివాహేచ్ఛతో సంబంధం లేకుండా వివాహాలు జరిగిపోయేవి. వివాహం వ్యాపారంగా, బొమ్మలాటగా మారిపోయింది. కన్యాశుల్కాలు కాటికి కాళ్లు చాచుకున్న ముసలివాడికి కూడా వివాహేచ్ఛని పుట్టించేవి. కన్యాశుల్కానికి ఆశపడే తండ్రి తన బిడ్డ వయసు, సుఖసంతోషాలతో నిమిత్తం లేకుండా వివాహాలు చేసేవాడు. తత్ఫలితంగా బాల వితంతువులు తయారయ్యేవారు. వివాహ సమయంలో అనవసరమైన ఖర్చులు, డాంబికాలు, అర్థంలేని ఆచారాలు, అలక సాధింపులు మొదలైన వాటికి అంతుండేది కాదు. తినడానికి లేకపోయినా అప్పో, సొప్పో చేసి భోగం మేళాన్ని పెట్టించడమనే ఓ దురాచారం వుండేది. వివాహాలు కుదిర్చే మధ్యవర్తులు రాజకీయాలకీ, కుటిలతత్వానికీ అంతుండేది కాదు. పీటల మీద పెళ్ళిళ్లు ఆపుచేయించడానికి కూడా వెనుకాడే వారు కాదు.

మొత్తంమీద సంఘంలోని ప్రతి వ్యవస్థలోను లోపాలు కొట్టొచ్చినట్లు కనిపించి సంస్కరణలనాశించేవి. దశాబ్దాలుగా దురాచారాల్ని రూపుమాపే ప్రయత్నాలు ఈ దేశంలో జరుగుతూనే వున్నాయి.

## సతీసహగమనం :

హిందూ దేశంలో సంఘసంస్కరణ 19వ శతాబ్దంలోనే హఠాత్తుగా తలెత్తింది కాదు. శతాబ్దాల తరబడి దేశంలోని దురాచారాల నిర్మూలనకి కృషి చేసిన రాజులున్నారు. సతీసహగమనాలు మాన్పించటానికి అక్బరు చక్రవర్తి కూడా కృషి చేసినట్లు తెలుస్తోంది. హిందువుల మతాచారాల్లో ఎక్కువగా జోక్యం కలుగజేసుకోవటం ఇష్టంలేని అక్బర్ తన ప్రయత్నాల్ని హిందువుల మీద బలవంతంగా రుద్దలేదు. అయితే అక్బరు జీవితంలో తాను స్వయంగా ఒక సతిసహగమనాన్ని అరికట్ట గలిగిన సంఘటన వుంది.

తర్వాత 19వ శతాబ్ది పూర్వార్థంలోనే తిరిగి ఈ సతీసహగమనాల్ని మాన్పించటానికి కృషి జరిగినట్లు ఊహించవచ్చు. 1804 ప్రాంతాల్లో బెంగాల్లోని కొందరు క్రైస్తవ మత బోధకులు

ఈ విషయమై ప్రత్యేకించి పదిమంది ఉద్యోగులనేర్పాటు చేసి సమాచారం సేకరించి ఈ దురాచారం మాన్పించాలని సంకల్పించి ప్రభుత్వానికొక విజ్ఞాపన పత్రం పంపించారు. అప్పటి బెంగాల్ గవర్నర్ వెల్లస్లీ పదవీ విరమణ కాలం వారం రోజులు మాత్రమే ఉండటంతో ఈ విషయంలో జోక్యం చేసుకోలేదు.

తర్వాత రాజారాంమోహనరాయ్ ఈ విషయం పై తీవ్రంగా ఆలోచించి దానిని రూపుమాపాలని ప్రయత్నాలు ప్రారంభించాడు. సతీసహగమన పద్ధతి అన్యాయమని చెప్తూ 1818లో ఇతడు 'సజీవ గతభర్తృకాగ్ని సంస్కారం' అనే పేరుతో ఓ చిన్న వ్యాసం రాసి ప్రచురించారు. సంప్రదాయ వాదులు 'చంద్రిక' అనే పత్రిక ప్రచురించి రాంమోహన్‌రాయ్‌ని దూషించడం ద్వారా ఆయనపై దండెత్తారు. రామమోహనరాయ్ తన ప్రయత్నాలు మానక సహగమన దురాచారంలోని నైచ్యాన్ని ప్రజలకి తెలియజెప్పటానికి పూనుకొన్నాడు. సంప్రదాయ వాదులతో యుద్ధం సాగించాడు. 1828 ప్రాంతంలో బెంగాల్ గవర్నరు అయిన బెంటిక్‌తో కలసి ఈ దురాచార నిషేధ చట్టాన్ని చేయించడానికి కృషి చేశాడు. 1829లో ఆ చట్టం చేయడంతో రాజరామమోహనరాయ్ విజయం సాధించినట్లయింది. బెంగాల్ బ్రాహ్మణులనేకులు ప్రభుత్వ శాసనం శాస్త్ర విరుద్ధమని దాన్ని ఎత్తివేయాలని ఇంగ్లండులోని ప్రివికౌన్సిల్‌కి విజ్ఞప్తి చేశారు. అయితే వారి ప్రయత్నాలు ఫలించలేదు. సతీసహగమన నిషేధం చట్టబద్దమైంది.

## వితంతు పునర్వివాహాలు :

"వితంతు పునర్వివాహాలు చేయాలనే సంకల్పం కూడా శతాబ్దాల క్రితమే కలిగింది. క్రీ.శ. 1500 ప్రాంతాల్లో ఉదయపూర్‌ని పాలిస్తున్న జస్వంతసింగ్ వితంతు వివాహం చేయతలపెట్టిన వారిలో ప్రధముడిగా కనిపిస్తున్నాడు. హిందూ దేశంలో గొప్ప పండితుడుగా పేరు పొందిన అప్పయ్య దీక్షితులు తమ వితంతు కుమార్తెకి వివాహం చేయాలనుకొని లోకనిందకు భయపడి తమ ప్రయత్నం విరమించుకున్నారు. జయసింగ్ అనే మరొక రాజపుత్రరాజు కూడ వితంతు వివాహాలు చేయాలనుకొని విఫలుడయ్యాడు. బెంగాల్లో గొప్ప పండితుడైన స్మార్తభట్టాచార్య రఘునందనుడు వితంతు వివాహం శాస్త్ర సమ్మతమని ప్రమాణాలు చూపిస్తూ ఒక గ్రంథాన్ని రచించి తన వితంతు కూతురికి వివాహం చేయాలనుకుంటాడు. కాని ఆ ప్రయత్నం ఫలించదు. రాజవల్లభుడనే ఇంకో పండితుడు ఈ విషయమై అనేక వాదాలు చేసి దేశీయుల్ని వితంతు వివాహాలు సమ్మతమని

వొప్పించగలిగాడు. కాని వివాహాలు జరిపించలేకపోయాడు. ఆ తర్వాత పూనాలో సర్దారు పరాశర బాహుపట్వర్ధన్ అనే ఆయన ఈ వివాహాలు శాస్త్రబద్ధమని పండితులచే వొప్పించగలిగాడు. ఈయన తన కుమార్తెకు వితంతు వివాహం చేయాలని ప్రయత్నించి వివాహం నిశ్చయించబోయే సమయానికి అకాల మరణం పొందాడు. ఈ విధంగా ఆయన ప్రయత్నం విఫలమైపోయింది. రాజారామ్‌మోహనరాయ్ కూడా వితంతు వివాహాల విషయంలో కొంత ప్రయత్నం చేశాడు. 1837వ సంవత్సరంలో బొంబాయిలో ఒక ఆంధ్ర బ్రాహ్మణుడు పరశురామ నివాసియైన ఇంకో బ్రాహ్మణునితో కలిసి వితంతు వివాహావశ్యకతని అనేక ప్రమాణాలతో నిరూపిస్తూ ఒక గ్రంథం రాసి ముద్రించారు. ఆ గ్రంథం దేశంలో బహుళ ప్రచారం పొందటం చూసి సహించలేని సంప్రదాయ పండితుడొకడు దాన్ని ఖండిస్తూ గ్రంథాన్ని రాసి ప్రచురించాడు. ఈ ఖండన చూసి పరుశురామక్షేత్ర వాసియైన బ్రాహ్మణుడు ఆవేశంతో దూషణ పూర్వకమైన ప్రతిఘటన చేయగా ఆంధ్ర బ్రాహ్మణుడు వీరిద్దరిని సమాధాన పరచి తన అభిప్రాయాన్ని నిలబెట్టుకొనే ప్రయత్నం చేశాడు. ఈ వాద ప్రతివాదనలు చూసిన మధ్యస్తుడొకడు సాధకబాధకాలని విచారించి యుక్తి పూర్వకంగా ఒక గ్రంథం రాసి రజస్వల కాని స్త్రీలకే పునర్వివాహం చేయవచ్చునని ఆంధ్రబ్రాహ్మణుడి అభిప్రాయాన్ని సిద్ధాంతీకరించాడు.''[3]

ఈవిధంగా స్త్రీలకు సంబంధించిన వితంతు పునర్వివాహాలు అనే అంశంపై ఎన్నో చర్చలూ రచనలు వెలువడడంతో క్రమేపీ ప్రజల్లో ఆలోచన మొదలైంది.

1841లో నాగపూర్‌లో ఇంకొకరు స్త్రీ పునర్వివాహావశ్యకతని చెప్తూ మరొక గ్రంథం రాశారు. ఆ గ్రంథం 1850లో కన్నడంలోకి 1868లో తెలుగులోకి అనువదించబడింది. ఈ ప్రయత్నాలీవిధంగా సాగుతూనే వున్నాయి. ఈ పరిస్థితుల్లో ఈశ్వర చంద్ర విద్యాసాగర్ తల్లి ప్రోద్భలంతో రంగంలోకి వచ్చాడు. స్త్రీ పునర్వివాహాలు శాస్త్ర సమ్మతమని నొక్కి చెప్తూ 1855లో 'విధవా వివాహ'మనే గ్రంథం రచించాడు. ఈ గ్రంథం బెంగాల్‌లోనే కాక హిందూదేశమంతటా విస్తృత ప్రచారం పొందింది. దీనికి అనేక ఖండన గ్రంథాలు వెలువడసాగాయి. వాద ప్రతివాదనలకి పత్రికలు వేదికలయ్యాయి. విద్యాసాగర్ కృతనిశ్చయంతో తన ప్రయత్నాలు విడిచిపెట్టక సాగిస్తూనే వున్నాడు. ఈ విషయంలో ఒక శాసనం వుంటే మంచిదనే తలంపుతో దేశజనులని, జమిందార్లని కూడా కూడగట్టుకొని వారందరి చేత సంతకాలు చేయించిన విజ్ఞాపన నొకదానిని ప్రభుత్వానికి సమర్పించాడు. దాని ఫలితంగా 1856లో ప్రభుత్వం ఒక చట్టం చేసింది.

1853వ సంవత్సరంలో కలిమతీదేవి అనే పదేళ్ళ బాలవితంతువుకి వివాహం జరిపించారు. ఈ వివాహమైన మర్నాడే మరో పన్నెండేళ్ళ వితంతువుకి వివాహం జరిగింది. క్రమంగా ఈ వివాహాలు ఉద్యమ రూపం పొంది యావద్భారత దేశానికి వ్యాపించాయి.

బొంబాయిలో 1866లో మొట్టమొదటి "స్త్రీ పునర్వివాహ ప్రవర్తక సంఘం" స్థాపించారు. సంప్రదాయ వాదులు దీనికి వ్యతిరేకంగా హిందూ ధర్మ వ్యవస్థాపక మండలి స్థాపించి స్త్రీ పునర్వివాహాలు అనర్థదాయకాలని ప్రచారం చేస్తూ స్త్రీ పునర్వివాహ ప్రవర్తక సంఘం వారికి అవరోధాలు కల్పించేవారు.

ఒక ప్రక్క స్త్రీ పునర్వివాహ ప్రవర్తక సంఘానికి మరో ప్రక్క సంప్రదాయ వాదులకు మధ్య అభిప్రాయ భేదాలు కొనసాగుతున్నప్పటికీ వితంతు పునర్వివాహాలు క్రమేపీ జరుగుతూనే ఉండడం హర్షించదగ్గ విషయం.

1864లో బొంబాయిలో మొదటి స్త్రీ పునర్వివాహం జరిగింది. 1865లో ఒకటి, 1866లో ఇంకొకటి జరిగాయి. మహారాష్ట్రలో ఈ వివాహాలు చేసుకున్న వారిని, చేయించిన వారిని వెలివేసే కార్యక్రమం మొదలైంది. వితంతు పునర్వివాహకర్తలు వెనుకంజ వేయక సంప్రదాయవాదులతో తమ వాదన కొనసాగించి చివరికి విజయం సాధించారు. శంకరాచార్యులు వారు కూడా మొదట్లో ఈ వివాహాన్ని వ్యతిరేకించారు. కాలక్రమేనా ప్రజాభిప్రాయానికి తలవొగ్గక తప్పలేదు.

హిందూదేశంలో బెంగాల్, మహారాష్ట్రాల తర్వాత వితంతు వివాహాలు ఉద్యమ రూపం దాల్చింది ఆంధ్రదేశంలోనే అని చెప్పుకోవచ్చు.

1868లో వితంతు వివాహాలకి సంబంధించిన గ్రంథం ఒకటి తెలుగులోకి అనువదించబడింది. బ్రహ్మసమాజ ప్రచారకులైన కేశవచంద్రసేన్ 1868లో మద్రాసులో బ్రహ్మసమాజ ప్రార్థనా సమాజాన్ని స్థాపించి వితంతు వివాహాలకి సంబంధించిన ఉపన్యాసం యిచ్చారు. ఆ తర్వాత మరికొందరు ఈ విషయమై ఉపన్యాసాలిచ్చినా అవి వెంటనే కార్యరూపం దాల్చలేదు.

కందుకూరి వీరేశలింగం పంతులుగారు అప్పటికే సంస్కరణ భావాలతో ప్రభావితులయ్యారు. వీరు 1879లో స్త్రీ పునర్వివాహ విషయంపై మొదటి ఉపన్యాసం యిచ్చారు. ఈ విషయంలో వీరికి చల్లపల్లి బాపయ్యగారు, పైడా రామకృష్ణయ్యగార్ల ప్రోత్సాహం బాగా లభించింది. వీరేశలింగంగారి ప్రథమ ఉపన్యాసానికి పండితోత్తములనేకమంది హాజరైనారు. వీరిలో చాలామంది వీరేశలింగంగారి వాదాన్ని

అంగీకరించినా సూరి వెంకటకృష్ణయ్యగారు, అద్దేపల్లి కృష్ణశాస్త్రులుగారు మొదలైన వారు వీరి ఉపన్యాసాన్ని ఖండించే ప్రయత్నం చేశారు. అదే సంవత్సరంలో వీరేశలింగంగారు వితంతు వివాహాలకి సంబంధించి "స్త్రీ పునర్వివాహ విషయక ద్వితీయ విజ్ఞాపన"ని ప్రచురించారు.

వీరేశలింగం పంతులుగారిచే ఆ కాలంలో ప్రచురించబడుతున్న వివేకవర్ధిని పత్రిక స్త్రీ పునర్వివాహ విషయానికి సంబంధించిన వాద ప్రతివాదనలకి వేదిక అయింది. దేశంలోని స్త్రీ పునర్వివాహానికి సంబంధించిన సమాచారం అందులో ప్రచురించబడుతుండేది. వీరి ఉపన్యాసాలు వెలువడ్డ కాలంలోనే మచిలీపట్నం నుండి కొందరు సంప్రదాయ పండితులు "అనల్పజవృతా కల్పకల్పవల్లీ నామ పత్రిక" అనే పుస్తకాన్ని ప్రచురించారు. అందులో కుటుంబంలో వితంతువుల ఆవశ్యకతని గూర్చి రాస్తూ వితంతు వివాహాల్ని ఖండించారు. ఈ వాద ప్రతివాదనలు రాజమండ్రి నుంచి క్రమంగా కాకినాడ మొదలైన ఇతర పట్టణాలకి వ్యాపించాయి. స్త్రీ పునర్వివాహ విషయక ఉపన్యాసాలకే వీరేశలింగం గారు వారి అనుయాయులు సంఘం నుంచి తీవ్రమైన వ్యతిరేకతని ఎదుర్కోవలసి వచ్చింది. ఈ అంశాన్ని కార్యరూపంలో పెట్టాలని తలచి 1881 డిసెంబరు 11వ తేదీన ఆంధ్రదేశంలో మొదటి వితంతు పునర్వివాహం జరిపించారు. సంఘ బహిష్కారం వంటి బెదిరింపులు వీరేశలింగం గారికి వారి అనుయాయులకి కూడా తప్పలేదు. రాజమండ్రిలో వీరేశలింగంగారు స్థాపించిన స్త్రీ పునర్వివాహ ప్రవర్తక సంఘానికి కాకినాడ వాస్తవ్యులైన పైడా రామకృష్ణయ్యగారు ముప్పైవేలరూపాయల ధన సహాయం చేస్తానని వాగ్దానం చేశారు. తర్వాత తర్వాత ఉన్నవ లక్ష్మీనారాయణ, దరిశి చంచయ్య మొదలైన సంస్కర్తలంతా ఈ ఉద్యమంలో కార్యకర్తలై దీన్ని విజయవంతం చేశారు.

"అన్నిటికన్నా ఆయన చేసిన గొప్పపని ఒకటి ఉన్నది. ముక్కుపచ్చలారని వితంతువులకు మళ్ళీ పెళ్ళి చేయడం. ఎనిమిదేళ్ళకో పదేళ్ళకో భర్తను పోగొట్టుకుని వైధవ్యం పాలైతే జీవితాంతం వాళ్ళట్లానే బతుకును ఈడ్చుకోవాల్సి ఉండేది. ఆ రోజుల్లో ఇది క్రూరం అనిపించింది వీరేశలింగం గారికి. వాళ్ళ పాపం ఏమిటి? వాళ్ళ తప్పు ఏముంది? ఎందుకు వాళ్ళ పాలిట ఈ శాపం? అని ఆయన చాలా బాధపడ్డాడు. అదీ కాక ఆ రోజుల్లో పై తరగతి కుటుంబాలలో దారుణమైన ఆచారం ఉండేది. అదేమిటంటే భర్తను పోగొట్టుకున్న ఆడపిల్లలకు తలజుట్టు తీయించి వేసేవాళ్ళు. వాళ్ళు మంచి బట్ట కట్టుకోవటానికి కానీ, పేరంటాలలో, శుభకార్యాలలో నలుగురితో కలిసి ఉండటానికి కానీ, మరికొన్ని ఏళ్ళు వచ్చిన

తర్వాత మంచి భోజనం చేయడానికి కానీ వీలుండేది కాదు. ఉప్పిడులు ఉపవాసాలతో ఎంత కాలక్షేపం చేస్తే అంత మంచిది, అదే పుణ్యం, అదే ధర్మం అని వాళ్ళకు బోధించేవాళ్ళు. వీరేశలింగం ఈ దుర్మార్గాన్ని భరించలేకపోయాడు. అటువంటి అభాగినులకు మళ్ళీ పెళ్ళి చేస్తానని పూనుకొన్నాడు.''[4]

దీనితో వీరేశలింగం కొందరికి విరోధిగా మారాడు. పై తరగతుల వాళ్ళ వ్యతిరేకతకు ఇతడు గురికావాల్సి వచ్చింది. సంఘంలో పై తరగతుల వాళ్ళు ఆయనపై కత్తికట్టారు. శత్రువుగా చూశారు. ఆయన్ను వెలివేశారు. అయినా ఆయన ఏ మాత్రమూ జంకలేదు. మరల అలాంటి వితంతువులను పెళ్ళి చేసుకోవటానికి ఎవరు ముందుకు వస్తారు? తన దగ్గర చదువుకుంటున్న యువకులకు, తన దగ్గరకు వచ్చి అభిమానించే వాళ్ళకు ఆయన బోధించాడు.

అటువంటి పెళ్ళిళ్ళు చేయడానికి స్థలం ఎవరిస్తారు? ఖర్చులెవరు పెట్టుకుంటారు? సహాయం ఎవరు చేస్తారు? భోజనాలకు ఎవరు వస్తారు? ఆదరంగా ఎవరు చూస్తారు? ఇవన్నీ సమస్యలే అయినాయి. అయినా ఆయన ఏ మాత్రమూ భయపడలేదు.

మొట్టమొదట్లో ఆయన ఈ వివాహాలు చేయించడానికి పూనుకొన్నప్పుడు కళాశాలలో ఆయన దగ్గర చదువుకున్న విద్యార్థులు ఆయనకెంతో అండగా ఉన్నారు. ఆయన ఏ పని చెప్పినా చేసుకొని వచ్చేవాళ్ళు. ఆయన తన ఇంట్లోనే ఈ పెళ్ళిళ్ళు చేసేవాడు. ఆయన పైన ప్రతిపక్షాలు దౌర్జన్యం చేయకుండా ఉన్నతాధికారులు, పోలీసు భటులూ ఆయన ఇంటి చుట్టూ వుండి రక్షణ కల్పించేవారు. పైడా రామకృష్ణయ్య, ఆత్మూరి లక్ష్మీనరసింహం, బసవరాజు గవర్రాజు మొదలైన వాళ్ళు మొట్టమొదటి వివాహాలలో ఆయన కెంతగానో సాయం చేశారు. వీరేశలింగం పంతులుగారి భార్య రాజ్యలక్ష్మమ్మగారు ఆయనతో సర్వవిధాల సహకరించింది. ఆమె బంధువులు ఎంతగా బోధించినా, బాధించినా పంతులుగారి వైపే వున్నది కానీ ఆయన్ను విడిచిపెట్టిపోలేదు. ఆయనకు ఎటువంటి కష్టమూ కలిగించలేదు.

వితంతు వివాహాలు మొదలుపెట్టి ఐదో వివాహం జరుగుతుండగా వంటవాళ్ళు, నీళ్ళవాళ్ళు మరి ఇతర సహాయకులూ ఎవరు మేం రామని కత్తికట్టారు. అప్పుడు రాజ్యలక్ష్మమ్మగారే స్వయంగా గోదావరికి వెళ్ళి నీళ్ళు తెచ్చుకుని పెళ్ళివారికి వంటచేసిపెట్టాల్సి వచ్చింది. అయినా ఆ తల్లి అందుకు ఏ మాత్రమూ బాధపడలేదు విసుక్కోలేదు.

ఎన్ని ఇబ్బందులు ఎదురైనా తాను చేయాలనుకున్న దాన్ని విడిచిపెట్టలేదు వీరేశలింగం. అది సాధించడం కోసమే తన జీవితాన్ని సైతం త్యాగం చేయడానికి సిద్ధపడ్డ మహామనిషి ఇతడు. అనుకున్న విధంగానే, 1881వ సంవత్సరం డిసెంబరు 11వ తేదీన వీరేశలింగం పంతులు, రాజ్యలక్ష్మమ్మగారలు తమ ఇంట్లో మొట్టమొదటిసారిగా వితంతు వివాహం చేశారు. కృష్ణాజిల్లాలో తిరువూరు తాలూకాలో రేపూడి అనే ఊరు నుంచి ఎనిమిది తొమ్మిదేళ్ళ బాలవితంతువును రాజమండ్రికి తీసుకువచ్చారు. వరుడు గోగులపాటి శ్రీరాములుగారు. వధువు పేరు గౌరమ్మ.

ఈ పెళ్ళితో రాజమండ్రిలో పెద్ద ఆందోళన బయలుదేరింది. ఈ పెళ్ళి చూడటానికి వెళ్ళిన వాళ్ళను, వీరేశలింగంగారి ప్రయత్నం పట్ల సానుభూతి చూపిన వాళ్ళను, వాళ్ళు అద్దె ఇళ్ళలో ఉంటే ఆ ఇళ్ళ నుంచి యజమానులు వెళ్ళగొట్టారు. వాళ్ళకు వుప్పూ నిప్పూ అందకుండా చేశారు. అటువంటి వాళ్ళు తప్పైందని ప్రాయశ్చిత్తాలు చేసుకొని మత గురువులు విధించిన షరతులకు వొప్పుకొని వాళ్ళు ఇవ్వాలని చెప్పిన దండన, రుసుం చెల్లించి మళ్ళీ స్వసంఘంలో కలవాల్సి వచ్చింది.

కాకినాడ పురవాస్తవ్యుడైన పైడా రామకృష్ణయ్య అనే సంఘసంస్కరణాభిమాని వితంతు వివాహం జరిగినప్పుడు వెయ్యి రూపాయలు ఇస్తానని వాగ్దానం చేశాడు. మొదటి వివాహాలకు ఆయన ఆ వాగ్దానం చేసిన డబ్బు ఇచ్చారు.

మొదటిసారి వితంతు వివాహం చేసినప్పటి నుండి వీరేశలింగం పంతులుగారు అటు తర్వాత తాము జీవించిన సుమారు 40 సంవత్సరముల కాలంలో నలభైదాకా వితంతు వివాహాలు నిర్వహించారు.

## వేశ్యా సమస్యలు :

ఆనాటి సమాజంలో వేశ్యా వృత్తి ప్రధాన సమస్యగా ఉండేది.ఈ వేశ్య వృత్తి మొదట్లో మతపరంగా అభివృద్ధి చెందింది. కొందరు స్త్రీలు దేవుని పేరుతో తమ జీవితాల్ని దేవాలయాలకు అంకితం చేసేవారు. వీరు తమ నృత్య గీతాదులతో సంపాదించిన ధనాన్ని దేవాలయాలకు ఆస్తిగా ఇచ్చేవారు. రానురానూ ఈ పద్ధతిలో పవిత్ర స్థానానికి బదులు వ్యభిచారం వృద్ధి చెందింది. దేవదాసీలు ధనవంతుల కామదాహానికి బలి అయ్యేవారు. కొందరి స్త్రీలకు వ్యభిచారం వృత్తిగా మారింది.

"వ్యభిచార వృత్తిని నిరసిస్తూనే శ్రీపాద వారు వేశ్యాకులం వర్ధిల్లవలసిన ఆవశ్యకతను సహేతుకంగా నిరూపించారు. "సంగీత నాట్యాది కళలు వర్ధిల్లడానికే ఆ వ్యవస్థ ఏర్పడిందని, వ్యభిచారానికి ఎంత మాత్రము కాదనీ, వ్యభిచారం కోసం ఒక కులం ఏర్పాటు చెయ్యవలసిన అవసరం లేద"ని అన్నారు (సుబ్రహ్మణ్యశాస్త్రి, శ్రీపాద. - 1959). అంతేగాక సంసారం చేసే వాళ్ళు వ్యభిచరిస్తున్నప్పుడు వేశ్యలు వ్యభిచరించడంలో తప్పులేదని తీవ్రంగా ఖండించారు. ఆ కులం వ్యభిచారం కోసమే పుట్టిందనే వీరేశలింగం గారి అభిప్రాయంతో విభేదిస్తూ ఆ కులం కళల కోసం పుట్టిందని వాదించారు."[5]

ప్రాచీన కాలంలోని దేవదాసీ వ్యవస్థ యొక్క మరో రూపమే ఆనాటి సంఘంలోని వేశ్యవ్యవస్థ. వీరిని భోగంవాళ్ళు అని పిలవడం జరిగేది. వీరు సంగీత, నాట్య ప్రదర్శనలిస్తూ జీవించేవారు. వేశ్యలను ఉంచుకొనడం ఒక గౌరవ సూచికంగా ఆనాడు ఉండేది. ఎటువంటి శుభకార్యాలయినా ఈ 'భోగం మేళా' లేకుండా జరిగేవి కావు. సమాజం వీళ్ళను నీచంగా చూడ్డం, గౌరవించకపోవడం వల్ల, ఇక్కడ కూడా స్త్రీ అవమానాలకు బాధలకు గురయ్యేది.

ఈవిధంగా 19వ శతాబ్దం నాటి సమాజం అనేక రకాలయిన సామాజిక సమస్యలతో నిండి ఉండేది. సమాజాభివృద్ధికి ఆటంకాలయిన ఇలాంటి దురాచారాలు, ఆనాటి వ్యవస్థను అస్తవ్యస్తం చేశాయి. 20వ శతాబ్ది ప్రారంభకాలంలో కొందరు సంఘసంస్కర్తల కృషి ఫలితంగా సమాజం చైతన్యవంతమైంది. ఈ కృషియే 20వ శతాబ్దంలోని అనేక సాంఘిక సంస్కరణోద్యమాలకు దారితీసింది.

ఈవిధంగా సంఘ సంస్కరణోద్యమం ప్రారంభమై క్రమేపీ అన్ని ప్రాంతాలకు విస్తరించి, ఒక నిర్దిష్టమైన వికాసాన్ని పొంది ప్రజలలో ఆలోచనలను కలిగించి సమాజంలో కొంత మేరకు సాంఘిక దురాచారాలను అరికట్టడంలో కొంత ప్రగతి సాధించినట్లు చెప్పవచ్చు.

## 1.3 సంఘసంస్కరణ - ప్రసిద్ధ సంస్కర్తలు - వారి సేవలు

### రాజారామమోహన్‌రాయ్ (1772-1833):

1772 మే నెల 22వ తేదీన సనాతన బ్రాహ్మణ కుటుంబంలో బెంగాల్‌లోని రాధానగర్ అనే గ్రామంలో రమాకాంతరాయ్, తారిణిదేవి దంపతులకు రాజారామమోహన్‌రాయ్ జన్మించాడు. రాధానగర్ మొదట బర్ద్వార్ జిల్లాలో ఉండేది. ఆ తర్వాత అది హుగ్లీ జిల్లాలోని ఉపభాగమైన ఆరంబాగ్‌లో భాగమైంది. సుసంపన్నమై సుప్రసిద్ధమైన ఖనకుల్ కృష్ణనగర్ అనే గ్రామానికి ఉత్తర భాగాన ఉన్న రాధానగర్ చాలా చిన్న గ్రామం.

రాజారామమోహనరాయ్ ప్రాథమిక విద్యను గ్రామంలో ఉన్న బడిలోనే నేర్చుకున్నాడు. ఆయన ఒక మౌల్వీ దగ్గర పారశీక భాషను కూడా నేర్చుకున్నాడు. ఆ విధంగా ఇంటి వద్ద కొంతకాలం విద్యాభ్యాసం చేసిన రామమోహన్‌రాయ్‌ని అతని తండ్రి పట్నాకు పంపించాడు. పట్నాలో రామమోహన్‌రాయ్ అరబ్బీ భాషను నేర్చుకోవడమే కాకుండా తనకు తెలిసిని పారశీక భాషకు మెరుగులు దిద్దుకోగలిగాడు. ఖురానునీ, ఇస్లామ్ వేదాంతాన్నీ చదివాడు. అరబ్బీ అనువాదాలు రూపంలో లభ్యమైనంత వరకు యూక్లిడ్, అరిస్టాటిల్ రచనలను అధ్యయనం చేశాడు. ఖురాన్‌లోని ప్రజాస్వామ్య బోధనలు, అరబ్బీ ఆలోచనా వ్యవస్థలో కనిపించే తార్కిక ధోరణి రామమోహనుని ప్రభావితం చేశాయి. అందులో ప్రముఖంగా ముతజిలాల (క్రీ.శ. 8వ శతాబ్దంలో వాసిల్-బి.ఆటా, అమీర్-బి-ఉబైద్ ముతజిలా హేతువాద ఉద్యమాన్ని బస్రాలో ప్రారంభించారు) ఆలోచనా విధానం, సూఫీల వేదాంతం ఆయనపై ఎక్కువగా పనిచేశాయి.

పట్నా నుంచి ఇంటికి తిరిగి వచ్చిన తర్వాత రామమోహన్‌రాయ్ హిందూ సంఘంలో కనిపిస్తున్నటువంటి విగ్రహారాధన, మూఢవిశ్వాసాలకు సంబంధించి ఒక పరిశోధనా గ్రంథం రాయాలని నిశ్చయించుకున్నాడు. సనాతన భావాలు గల రమాకాంతరాయ్, రామమోహన్‌రాయ్‌ని ఇంటి నుంచి వెళ్ళిపొమ్మన్నాడు. రామమోహనుడు ఇల్లు విడిచిపెట్టి ఒక గమ్యం అనేది లేకుండా దేశదిమ్మరిలాగా ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి తిరగడం మొదలు పెట్టాడు. ఆ విధంగా తిరిగి, తిరిగి టిబెట్ చేరాడు. అక్కడ బౌద్ధమతంలో విస్తరించిన విగ్రహారాధనను వ్యతిరేకించి, టిబెట్టులోని లామాల తిరస్కారానికి గురి అయ్యాడు.

తన జీవితంలోని ఆ రోజుల గురించి రామమోహన్‌రాయ్ తన 'స్వీయ చరిత్ర కథనం'లో ఇలా పేర్కొన్నాడు. "నేను పదహారేళ్ల వాణ్ణిగా ఉన్నప్పుడు నేను హిందువుల విగ్రహారాధన యొక్క సార్థకతను ప్రశ్నిస్తూ ఒక రచన చేశాను అదీ, దాంతో పాటు అప్పటికే ఆ విషయం గురించిన నా అభిప్రాయాలు నాకూ, నా సన్నిహిత బంధువులకూ మధ్య విరోధభావాన్ని కలిగించాయి. నేను నా ప్రయాణాలు ప్రారంభించి భారతదేశపు సరిహద్దులలోనూ, దానికి వెలుపలా ఉన్న వివిధ ప్రాంతాలు పయనించా"నన్నారని కె. రాజ్యలక్ష్మి భారతీయసాహిత్య నిర్మాతలు అనే గ్రంథంలో తెలియజేశారు.

రామమోహనుడు హిందూమతం, ఇస్లాం, బౌద్ధమతం, క్రైస్తవ మతం మొదలైన మతాలనూ తులనాత్మకంగా పరిశీలించి, వాటి ప్రాథమిక సూత్రాలలోని ఐక్యతను కనుగొన్న

మొట్టమొదటి వ్యక్తి, రామమోహన్‌రాయ్ ఆలోచనలు, కార్యక్రమాలపై పరిశీలన జరిపిన డాక్టర్ బ్రజేంద్రనాథసీల్ - రామమోహనుడు దీర్ఘదర్శి, ఆధునిక భారతదేశానికి వాస్తవంగానే తండ్రి వంటివాడు కాగలడని నిరూపించాడు.

కలకత్తాలో రామమోహనుడి స్నేహితుడైన రెవరెండ్ విలియం ఆదం చేసిన ప్రశంస ఇది ఆయన స్వతంత్రంగా ఉంటాడు, లేకుంటే స్వాతంత్ర్యం లేకుండానే ఉంటాడు. స్వతంత్ర వాతావరణంలో ఆయన ఉండాలనుకున్నాడు. అందుకు తగిన పరిస్థితి లేదనిపించినపుడు, తనకు కావలసిన పరిస్థితిని స్వయంగా రూపొందించుకున్నాడు. ప్రాచీన ఆంగ్లకవిలాగా ఆయన 'నా మనసే నా సామ్రాజ్యం' అనుకున్నాడు. తన స్వతంత్ర సామ్రాజ్యంలో నుంచి ఆయన మత, సామాజిక, రాజకీయ పీడన వ్యవస్థలను ఎదుర్కొన్నాడు. పరిస్థితుల ప్రభావం వల్ల ఆయన ఆ వ్యవస్థలలో భాగం వహించి - నటుడుగానో, బాధపడే వాడుగానో, బోధకుడుగానో, మోసపోయిన వాడుగానో ఉండవలసి వచ్చింది. తనకు విచిత్రమైనవీ, ద్వేషభావాన్ని ప్రోత్సహించేవీ, కీడు కలిగించేవీ అయిన అధికారాలూ, హక్కులూ ఉన్నప్పటికీ ఆయన వాటిని పట్టించుకోకుండా ప్రతిఘటించడం ఆయన గొప్పతనానికి గుర్తు అనవచ్చు. ఆయన ఆత్మకు చాలా ప్రీతి పాత్రమైనవి - స్వాతంత్ర్యం మీది ప్రేమ. ఆ స్వాతంత్ర్యం శరీర స్వాతంత్ర్యం కాక బుద్ధికి సంబంధించినది, అది ఆచరణకు సంబంధించింది కాక, ఆలోచనకు సంబంధించినది. ఆయన తన దేశ ప్రజల మతమూ, తన దేశం, కుటుంబం వంశం, తన వ్యక్తిగత స్థాయి మొదలైనవి విధించిన ఆచార వ్యవహారాలను చీల్చుకుంటూ, అవి చేసిన బంధాలను తెంచుకుంటూ, ఆ బంధాలను కాలరాస్తూ ముందంజ వేశాడు. తన దారికి అడ్డువచ్చిన వాటిని ఆయన నిర్భయంగా తొలగించుకున్నాడు. తన బుద్ధి స్వాతంత్ర్యంపట్ల ఎవరన్నా పరోక్షంగా వ్యతిరేకత చూపినా, ఆయన గాఢంగా గాయపడి, అవమానం పొందినట్లు భావించి ఆ వ్యతిరేకతను ఎదుర్కొనేవాడు.

1831లోనే దేశాల మధ్య చెలరేగిన విభేదాల పరిష్కారానికి, విశ్వశాంతిని పెంపొందించడానికి పటిష్టమైన అంతర్జాతీయ వ్యవస్థ అవసరాన్ని గ్రహించి నానాజాతి సమితిగాని, ఐక్యరాజ్యసమితిగాని ఏర్పర్చాలనే ఆలోచన ఏ రాజకీయ మేధావికి కలుగక ముందే రామమోహనుడికి అప్పటికే కలిగి ఇలాంటి వ్యవస్థ ఏర్పడాలని ఆశించాడు.

**సతీసహగమన నిషేధం :**

రాజారామమోహనరాయ్ జీవిత చరిత్రను తలచుకున్నప్పుడు అతడు సతీసహగమనాన్ని నిషేధించడానికి చేసిన కృషి గుర్తుకు రాక మానదు. ఆ కాలంలో

హిందూ సమాజపు స్త్రీలు, భర్త చనిపోయినప్పుడు సుఖాలు విడిచి ఆ భర్త చితిలోకి దూకి వారు కూడా ఆ అగ్నికే ఆహుతులయ్యేవారు. ఆవిధంగా కావడమే పతీవ్రతల లక్షణంగా ఆ కాలపు ప్రజలు భావిస్తూండేవారు. వీరిలో కొందరు ఇష్టపూర్వక మరణం పొందుతుంటే, మరికొందరు సమాజపు సాంఘిక కట్టుబాట్ల వలన బలవన్మరణం పొందేవారు. ధర్మకార్యం పేరిట ఇటువంటి దుష్కార్యాలు జరుగుతున్న రోజులవి. రామమోహనరాయ్ అటువంటి సంఘటనలు విన్నప్పుడల్లా నరహత్యకు ఇంతకు మించి మరో ఆధారం ఉండదేమో అనుకునేవాడు.

ఒకనాడు రాజారామమోహనరాయ్‌గారి అన్న మరణించడంతో అన్న మృతదేహానికి చితిని అంటించారు. అతడి వదిన ఆ చితిలో దూకి అగ్నిలో ఆత్మహుతి అయింది. ఆ సంఘటన చూచిన రాజారామమోహనరాయ్ ఎంతో కలత చెందాడు. ఈ అమానుషపు చర్యను నిర్మూలించాలని కంకణం కట్టుకున్నాడు.

అప్పుడు భారతదేశాన్ని పాలిస్తూన్నటువంటి ఇంగ్లీషువారు ఇతరదేశాల వారైన ఫ్రెంచి, గ్రీకులు ఆ దారుణ కృత్యాలను చూడలేక, అరికట్టలేక కళ్ళు మూసుకునేవారు! హిందూ ఆచార విషయాలలో జోక్యం చేసుకోవడం ఇంగ్లీషువారికి ఇష్టం లేకపోవడంవల్ల ఈ సతీసహగమనం యధేచ్ఛగా జరిగిపోతుండేది. కానీ రాజారామమోహన్‌రాయ్ మాత్రం వారికి లాగా ఈ సంఘటనలను చూస్తూ ఉండలేకపోయాడు. దీన్ని నిషేధించడానికి రామమోహనుడు తనకు వీలయినన్ని ప్రయత్నాలు చేశాడు.

ఈ సతీసహగమన దురాచారాన్ని గురించి ప్రజలలో అవగాహన కలిగించడానికి మూడు పుస్తకాలు రాశాడు. వీటిని అప్పటి గవర్నర్ జనరల్ భార్య అయిన లేడీ హేస్టింగ్సునకు అంకితమిచ్చాడు. ఇంతటితో ఆగలేదు. ఈ దురాచారాన్ని ఖండిస్తూ అనేక పత్రికలకు వ్యాసాలు రాశాడు. ఎట్టకేలకు ఇతడి ప్రయత్నం ప్రభుత్వాన్ని కదిలించింది. కానీ అప్పటి గవర్నర్ జనరల్ ఈ విషయానికి సంబంధించి ఎటువంటి చర్య తీసుకోకుండానే వెళ్ళిపోవడం జరిగింది. అయినంత మాత్రానా రాజారామమోహనరాయ్ నిరాశ చెందలేదు. ఇతడి ప్రయత్నాలని ఇంకా ఉదృతం చేశాడు.

విలియం బెంటింక్ గవర్నర్ జనరల్‌గా వచ్చి అధికార బాధ్యతను చేపట్టాడు. ఈయన ఇంగ్లాండ్‌లో ఉన్నప్పుడే రామమోహనుని గూర్చి విన్నాడు. ఇతడు రామమోహనుడు ఇంగ్లీషు పత్రికలకు రాసిన వ్యాసాలను చదివి రాయ్ స్నేహాన్ని కోరుకున్నాడు.

రాజారామమోహనరాయ్ ఈ సదవకాశాన్ని తన సొంత విషయాలకు ఉపయోగించుకోకుండా గవర్నర్ జనరల్ అయిన విలియం బెంటింక్‌తో సతీసహగమనాన్ని నిషేధించమని తెలుపుతూ దీన్ని గురించి చర్చించాడు.

ఆయన మాటలోని సత్యాన్ని, సతీసహగమనంలోని ధర్మత్వాన్ని గ్రహించిన గవర్నర్ జనరల్ సతీసహగమన నిరోధ చట్టం చేసి శాశ్వతంగా దానిని రూపుమాపాడు!

రాజారామమోహనరాయ్ సతీసహగమనాన్ని నిషేధించడానికి మాత్రమే కాకుండా ఇంకా సంఘాన్ని పట్టి పీడిస్తున్న సనాతన సాంఘిక దురాచారాలయినటువంటి బహుభార్యావివాహాలు, పిల్లలను గంగకు బలి ఇవ్వడం వంటివి రూపుమాపడానికి అవిశ్రాంతంగా కృషి చేసి సఫలీకృతుడయ్యాడు.

**ఇంగ్లండ్‌లో మరణం :**

రాజారామమోహనరాయ్ ఇంగ్లండ్‌కు వెళ్ళడానికి మూడు ముఖ్యమైన కారణాలున్నాయి. వాటిలో మొదటిది అప్పటి ఢిల్లీ చక్రవర్తి అయిన రెండవ అక్బర్ తరుపున ఇంగ్లండు రాజుకు ఒక విజ్ఞాపనను సమర్పించడం. రెండవది - సతిని నిషేధించమని హవుస్ ఆఫ్ కామన్స్ (ప్రజాప్రతినిధులసభ)కు ఒక విజ్ఞాపనను సమర్పించడం. మూడవది - ఈస్ట్ ఇండియా కంపెనీ శాసనం పునరంగీకారం గురించి హవుస్ ఆఫ్ కామన్స్‌లో సాగే చర్చ సందర్భంగా అక్కడ హాజరుకావడం. సంస్కరణ బిల్లు రెండవ పఠనం (Second Reading) సమయానికి హవుస్ ఆఫ్ కామన్స్‌లో హాజరు కావడం కోసం రామమోహనుడు లివర్‌పూల్ నుంచి ఏ మాత్రమూ ఆలస్యం చెయ్యకుండా లండన్ చేరుకున్నాడు. ఈయన లండన్ చేరేసరికి బాగా చీకటి పడింది. ప్రయాణభారంతో అలసిపోయి నిద్రపోయారు. అప్పుడు ప్రముఖ బ్రిటీష్ తత్త్వవేత్త జెరెమీ బెంతామ్ రామమోహనుణ్ణి చూడడానికి ఆయన బసచేసిన హోటల్‌కు వచ్చాడు. అయితే అప్పటికే రామోహనుడు విశ్రాంతి తీసుకుంటున్నాడని తెలిసి, బెంతామ్ ఒక చీటి వ్రాసి పెట్టి వెళ్ళిపోయాడు. ఆ చీటీలో 'జెరెమీ బెంతామ్ మంచి - స్నేహితుడు రామమోహనరాయ్‌కి' అని వ్రాసి ఉంది. బెంతామ్ రామమోహనుణ్ణి ఎంతగానో ఆరాధించేవాడు. ఇంకొకసారి ఆయన రామమోహనుడికి చీటీ వ్రాసిఉంచినపుడు రామమోహనుణ్ణి 'మిక్కిలిగా ఆరాధింపబడేవాడు, మానవజాతి సేవలో ప్రియమైన సహచరుడు'గా పేర్కొన్నాడు.

ఇంగ్లండుకు చేరగానే ఆయన ఢిల్లీ చక్రవర్తి విజ్ఞాపనను ఈస్ట్ఇండియా కంపెనీ డైరెక్టర్ల సంఘానికీ, లండన్‌లో పలుకుబడిగల పెద్ద మనుషులు చాలామందికీ అందజేశాడు.

ఆ విజ్ఞాపనలోని అంశాలను పూర్తిగా అంగీకరించకపోయినా 1833 ఫిబ్రవరి 13న డైరెక్టర్ల సంఘం అందులో కొన్నిటిని ఆమోదించింది. అలా అది ఢిల్లీ చక్రవర్తి వార్షిక ఉపకార వేతనాన్ని మూడులక్షల రూపాయలకు పెంచింది.

1830 నవంబర్ 15 నాడు రామమోహనరాయ్ 'ఆల్బియన్' అనే ఓడలో ఇంగ్లండుకు బయలుదేరి, 1831 ఏప్రిల్ 8న చేరాడు. రామమోహనరాయ్ కీర్తిప్రతిష్ఠలు, ఆలోచనా విధానాలు ఇతనికంటే ముందుగానే ఇంగ్లండ్‌కు విస్తరించాయి. 1861లో వేదాంతం గురించిన ఆయన తొలి ఆంగ్ల రచన అయిన 'వేదాంత సంగ్రహం' (An Abridgment of Vedant) వెలువడినప్పుడు ఇంగ్లండుకు చెందిన "ది మంత్లీ రిపాసిటరీ ఆఫ్ తియాలజీ అండ్ జనరల్ లిటరేచర్" (The Monthly Repository of Theology and General Literature) దాన్ని సమగ్రంగా విమర్శించింది. లివర్‌పూల్‌కు ఆయన వెళ్ళిన వార్తను తెలుసుకొని చాలామంది ప్రముఖులు ఆయనను చూడటానికి వస్తారు.మెడిసిస్‌కు చెందిన విలియం రాస్కో అనే ప్రముఖ చరిత్రకారుడు అప్పుడు బాగా అనారోగ్యంగా ఉన్నాడు. రాజారామమోహనరాయ్‌ని తనని కలవమని కొడుకుతో వార్త పంపించాడు. రామమోహనుడు అనారోగ్యంతో బాధపడుతున్న రాస్కోను కలుసుకున్నాడు. వాళ్ళిద్దరూ సంభాషించుకున్నారు. వారి సంభాషణ సాగుతున్న సందర్భంలో అక్కడే ఉన్న రాస్కో కొడుకు దాన్ని గురించి వ్రాసిన చిరస్మరణీయమైన వ్రాత ఇది : "ఈ గోష్ఠి ఎన్నటికి మరుపురానిది - ప్రాచ్యదేశాల సంప్రదాయం ప్రకారం నమస్కరించిన రామమోహనుడు 'నాకు సంతోషంగానూ, గర్వంగానూ ఉంది. యూరపులోనే కాక, ప్రపంచం మొత్తంమీద ప్రసిద్ధుడైన వ్యక్తిని చూడడంవల్ల నాకు ఎంతో సంతోషంగానూ, గర్వంగానూ ఉంది' అన్నాడు. ఈ దినం చూడడం కోసం నన్ను బతకనిచ్చిన దేవుడికి నా అభినందనలు అన్నాడు రాస్కో" అని రాజ్యలక్ష్మి భారతీయసాహిత్య నిర్మాతలు అనే గ్రంథంలో తెలిపారు. చాలా సంవత్సరాలు పాటు పక్షవాతంతో అవస్థపడుతూ రాస్కో కొన్నాళ్ళకు మరణించాడు.

ఈస్ట్ ఇండియా కంపెనీ డైరెక్టర్లు 1831 జూలై 6 నాడు రాత్రి రామమోహనుడికి 'సిటీ ఆఫ్ లండన్' ఆహార గృహంలో విందు ఏర్పాటు చేశారు. ఆ విందుకు ఈస్ట్ ఇండియా కంపెనీ అధ్యక్షుడే అధ్యక్షత వహించాడు. రామమోహనుడు చిరకాలం ఆరోగ్యంగా వర్ధిల్లాలంటూ అభినందించాడు. రామమోహనుడు భారతజాతికి చేసిన సేవలను ఆయన ప్రశంసించాడు. నాలుగవ విలియం పట్టాభిషేకాన్ని చూడడానికి ఆయనకు యూరపురాజుల రాయబారుల సరసన ఆసనం ఏర్పాటు చేశారు. రాయల్ ఆసియాటిక్ సొసైటి వారు

రామమోహనుని తమ వార్షిక సమావేశానికి ఆహ్వానించారు. అక్కడ ఈయన ప్రముఖ ప్రాచ్యవేత్త (Orientalist) అయిన హెన్రీ తామస్ కోల్‌బ్రూక్‌కు వందన సమర్పణ చేశాడు. రామమోహనుడు మానవతా వాదియైన సోషలిస్టు రాబర్ట్ ఓలెన్‌ను కూడా కలుసుకున్నాడు.

రామమోహనుడు ఇంగ్లండుకు చేరినపుడు సంస్కరణ బిల్లు ఉద్యమం వల్ల చెలరేగిన ఉద్యమ ఉధృతి అక్కడి రాజకీయాన్ని గడగడలాడించింది. 1831 మార్చిలో ప్రవేశపెట్టబడిన మొదటి బిల్లు కమిటీ స్థాయిలోనే వీగిపోయింది. దాంతో పార్లమెంటును రద్దు చేయవలసివచ్చింది. కొత్తగా ఎన్నికైన హవుస్ ఆఫ్ కామన్స్ రెండవ సంస్కరణ బిల్లును 1831 సెప్టెంబర్ 26న ఆమోదించింది. కాని దాన్ని హవుస్ ఆఫ్ లార్డ్స్ అక్టోబర్‌లో తోసిపుచ్చింది. మూడవ సంస్కరణ బిల్లును హవుస్ ఆఫ్ కామన్స్‌లో మళ్ళీ ప్రవేశపెట్టారు. 1832 మార్చిలో ఆ బిల్లు ఆమోదింపబడింది. తరువాత దాన్ని హవుస్ ఆఫ్ లార్డ్స్‌కు పంపారు. ఇంగ్లండు ప్రజలు ప్రభువుల నిర్ణయానికి 'విపరీతమైన ఆదుర్దా'తో ఎదురు చూస్తుంటారు. ఈసారి ప్రజల ఒత్తిడికి ప్రభువులు లొంగిపోతారు. వారు 1832 జూన్‌లో సంస్కరణ బిల్లును ఆమోదించారు. ఐర్లండ్, స్కాంట్లండ్‌లకు కూడా అటువంటి నిర్ణయాలే వర్తింపజేశారు. రామమోహనుడికి సంస్కరణ బిల్లు ఆమోదించడం ఎంతో ఆనందం కలిగించింది. ఆ ఆనందాన్ని ఆయన విలియం రాత్‌బోన్‌కు వ్రాసిన ఉత్తరంలో వ్యక్తం చేశాడు.

బ్రిటీష్ ఏకేశ్వరోపాసకుల సంఘం రామమోహనుని గౌరవార్థం ఒక సభ ఏర్పాటు చేసింది. ఆ సభలో జెరెమీ బెంతామ్ జీవిత చరిత్ర వ్రాసిన డాక్టర్ బౌరింగ్ రామమోహనుడికి స్వాగతం చెప్పాడు.

ఈ సభలో అమెరికాలోని హార్వర్డ్ విశ్వవిద్యాలయం మాజీ అధ్యక్షుడైన డాక్టర్ కిర్క్‌లాండ్ (Kirkland) పాల్గొన్నాడు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అమెరికాలో రాజా పట్ల ఎంతో ఆసక్తి చూపిస్తున్నారు. ఆయన రాక కోసం ఎంతో ఆత్రంగా ఎదురుచూస్తున్నారు అన్నాడు. రెవెరెండ్ డబ్ల్యూ జి. ఫాక్స్ కూడా రామమోహన్‌రాయ్‌ని గొప్పగా ప్రశంసించాడు. రామమోహన్‌రాయ్ తనకు జరిగిన ఈ సన్మానాలకు సమాధానం చెబుతూ ఉపన్యసించాడు. ఈ ఉపన్యాసంలోని చిరస్మరణీయమైన చివరి మాటలు ఇవి : వివేకానికీ శాస్త్రాలకూ, లౌకిక పరిజ్ఞానానికీ సంపదకూ, అధికారానికీ పక్షపాత ధోరణికీ మధ్య పోరాటం సాగుతున్నది. ఈ మూడు తక్కిన మూడిటితో యుద్ధం సాగిస్తున్నాయి. అయితే మీ విజయం ఎప్పుడో ఒకప్పుడు తప్పనిసరిగా సాధ్యం కాగలదని నేను నమ్ముతున్నాను

.......... నన్ను అడపాదడపా గౌరవించి మీరు నాకు చేసిన సన్మానాన్ని నేను నా జీవితంలో తుదిక్షణం దాకా మరచిపోలేను"[6] అన్నారని కె. రాజ్యలక్ష్మి భారతీయసాహిత్య నిర్మాతలు అనే గ్రంథంలో పేర్కొన్నారు.

ఆర్థిక సమస్యలు, పని ఒత్తిడి కలిసి ఇతడి ఆరోగ్యాన్ని దెబ్బతీశాయి. ఈయన ఆర్థిక సమస్యలకు కలకత్తా ప్రతినిధులైన మెకింతోష్ అండ్ కంపెనీ వారి బాంకింగ్ హవుస్, ఈయన లండన్ ప్రతినిధులైన రికర్డ్స్ మెకింతోష్ అండ్ కంపెనీ విఫలం కావడమే కారణం. 1833 సెప్టెంబర్ ప్రారంభంలో మిత్రులు ఆయనను లండన్ నుంచి బ్రిస్టల్‌కు వెళ్ళమని కోరారు. అలా వెళితే కాస్త మార్పుగా ఉండడంతో పాటు, ఆయనకు విశ్రాంతి చిక్కుతుంది అని వారు అనుకున్నారు. అలా రామమోహనుడు తన స్నేహితుడు 'బ్రిస్టల్‌లోని లూయిన్'స్ మీడ్ చాపెల్‌లో బోధకుడు (Pastor of Bristols Lewin's Mead Chapel) అయిన డాక్టర్ లంట్ కార్పెంటర్ (Dr. Lant Carpenter) శిష్యురాలైన కుమారి కాసిల్ (Miss Castle) ఇంటికి వెళ్ళి విశ్రాంతి తీసుకున్నారు. స్నేహితుల సాంగత్యంలో రామమోహనుడు తన ఇబ్బందులను చాలావరకు మరచిపోగలిగాడు. అయితే సెప్టెంబర్ 19నాడు ఆయనకు అకస్మాత్తుగా జబ్బు చేసింది. ఆయనకు విపరీతమైన జ్వరమూ, భరించరాని తలనొప్పి వచ్చాయి. ఆతర్వాత రోజుల్లో ఈయన పరిస్థితి దిగజారసాగింది. ఆయన అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నప్పుడు డేవిడ్ హేర్ సోదరియైన కుమారి హేర్ ఆయనకు శుశ్రూష చేసింది. ప్రముఖ వైద్యులెందరో ఆయనకు వైద్యం చేశారు. కానీ దానివల్ల ఫలితమేమీ లేకపోయింది. ఆయన పరిస్థితి అంతకంతకు దిగజారిపోయింది. 1833 సెప్టెంబర్ 27నాడు రామమోహనుడు మరణించాడు.

1833 అక్టోబర్ 18వ తేదీనాడు మధ్యాహ్నం రెండు గంటలప్పుడు స్టేపుల్‌టన్ గ్రోవ్‌లో ఆయన శరీరాన్ని పూడ్చి పెట్టారు. అప్పుడు అక్కడ ఉన్న మేరీ కార్పెంటర్ ఆ సంఘటనను ఇలా వివరించింది : "అన్ని ఏర్పాట్లూ పూర్తిగా చెయ్యబడ్డాయి. హేర్ కుటుంబంవారు లండన్ నుంచి వచ్చారు. రాజాతో వ్యక్తిగత సంబంధం గలవారిని మాత్రమే స్టేపుల్‌టన్ గ్రోవ్‌కు ఆహ్వానించారు. కుమారి కాసిల్ సంరక్షకుడు, వారి సన్నిహితులు. హేర్ కుటుంబం వారు, రామమోహనుడికి ఆయన కుమార్తెలా సపర్యలు చేసిన కుమారి హేర్, రామమోహనుడి దత్తపుత్రుడైన బాలుడు రాజారాయ్, బ్రాహ్మణ సేవకులు అక్కడికి వచ్చారు. డాక్టర్ ఎస్ట్లిలిన్ - తన తల్లినీ, పసిపిల్ల అయిన తన కుమార్తెనూ తీసుకుని వచ్చాడు. తక్కిన వైద్య బృందం, డాక్టర్ జెరార్డ్, ప్రముఖుడైన జాన్ ఫాస్టర్, మా నాన్న,

నేను అక్కడకు చేరాం. మిట్టమధ్యాహ్నం అయ్యాక ఆ పవిత్ర పురుషుడి శరీర అవశేషాలున్న పేటిక నెమ్మదిగా, గంభీరంగా విశాలమైన కంకరబాట వెంబడి మోసుకుపోబడింది. ఆ గాఢమైన నిశ్శబ్ద వాతావరణంలో ఆయన మరణానికి సంతాపం పొందిన మిత్రులు ఆ పేటికను అనుసరించారు. వారికి ఆయనతో అంతకు కొంతకాలం ముందే పరిచయం ఏర్పడింది. ఆ పేటికను మోస్తున్నవారు నీడకమ్మిన దారి వెంబడి సాగిపోయారు. ఆ దారి అంతకు ముందు ఎన్నిసార్లో రామమోహనుడు నడిచిన దారే. పేటికను ఆ దారి వెంబడి తీసుకువెళ్ళి నిర్ణీతమైన ప్రదేశాన, ఆ పవిత్రమైన బరువును దించారు. తను గుండెలలో నిండిన గాఢమైన అభిప్రాయాలను వెల్లడించడానికి అక్కడున్న ఎవరికీ గొంతు పెగలలేదు. జాన్‌ఫాస్టర్ 'అటువంటి సమాధి సమీపాన ఎవరు మాట్లాడి ఉండగలరు?' అన్నాడు" కె. రాజ్యలక్ష్మి రాజారామ్మోహన్ మరణాన్ని గురించి భారతీయసాహిత్య నిర్మాతలు అనే గ్రంథంలో వివరించారు.

ఎన్నో సంవత్సరాల తర్వాత 1842 రామమోహన్‌రాయ్ స్నేహితుడు, శిష్యుడు అయిన ద్వారకానాథ్‌ఠాగూర్ ఇంగ్లండుకు వెళ్ళాడు. ఆయన రామమోహనుడి శరీరాన్ని ఉంచిన పేటికను స్టేపిల్‌టన్‌గ్రోవ్ నుండి బ్రిస్టల్ నగరం పొలిమేరలలో ఉన్న ఆర్నోస్ వేల్ శ్మశానానికి (Arno's vale) తరలించాడు. అక్కడ 1843 మే 29 నాడు రామమోహనుడి భౌతిక శరీరపు అవశేషాలను పాతి పెట్టించాడు. 1844లో అక్కడే భారతీయ వాస్తు శిల్ప విధానంలో ఒక అందమైన కట్టడం నిర్మించబడింది.

ఈ విధంగా భారతదేశంలో రాజారామ్‌మోహన్‌రాయ్ సంఘ సంస్కరణ కొరకు చేసిన సేవలను యావత్ భారతదేశపు ప్రజలు ఎప్పటికి మరచిపోరు.

## ఈశ్వర చంద్ర విద్యాసాగర్ (1820-1890):

సంఘసంస్కరణోద్యమ కాలంలో స్త్రీల కొరకు తన వంతు కృషి చేసి సఫలీకృతుడైన వ్యక్తి ఈశ్వర చంద్ర విద్యాసాగర్. ఆ కాలంలో సమాజం నుండి ఎన్నో దూషణలను ఎదుర్కొని ఏమాత్రం క్రుంగి పోకుండా, వాటిని సమూలంగా నిర్మూలించడానికి అవిశ్రాంతం పోరాడిన వారు ఈశ్వర చంద్ర విద్యాసాగర్. ఈయన 1820వ సంవ్సరంలో బెంగాల్‌లో జన్మించారు. 1841 నుంచి 1858 వరకు ఉద్యోగం చేసి సంస్కరణ కోసం ఉద్యోగాన్ని విడిచిపెట్టి తన జీవిత కాలాన్నంతటినీ సంస్కరణ కోసమే వినియోగించారు.

ఇతడు వితంతు పునర్వివాహాల పట్ల ప్రజలలో అవగాహన కలిగించేందుకు గానూ సాహిత్యాన్ని ఆయుధంగా ఎంచుకొని రచనలు చేశాడు. వితంతువుల దుస్థితిని వర్ణిస్తూ "వితంతు పునర్వివాహం" అనే గ్రంథాన్ని శాస్త్ర ప్రమాణ సహితంగా రాశారు. 1853లో ఈయన మొదటి వితంతు పునర్వివాహాన్ని జరిపించాడు. 1856లో వితంతు పునర్వివాహం చేసుకొన్న వారి సంతానానికి చట్టపరమైన ఆస్తిహక్కులు, ఇతర స్వాతంత్ర్యాలు ఉంటాయని వితంతు పునర్వివాహాలు న్యాయసమ్మతాలని ప్రభుత్వం చట్టం చేయడం విద్యాసాగర కృషి ఫలితమే. ఈయన కేవలం రచనలు చేయడమే కాదు స్వయంగా ఆచరించి చూపించాడు. తన కొడుక్కి ఒక వితంతువుతో వివాహం జరిపించాడు.

ఈశ్వర చంద్ర విద్యాసాగర్ విద్యకు అత్యంత ప్రాధాన్యతను ఇచ్చాడు. అందులోనూ స్త్రీ విద్య పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపించాడు. ఆయన స్కూల్స్ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగం చేస్తున్న సమయంలో తాను వెళ్ళిన ప్రతి ప్రదేశంలోనూ బాలికల కోసం పాఠశాలలు స్థాపించి స్త్రీ విద్య కోసం కృషి చేశారు. ఆయన స్థాపించిన బాలికా పాఠశాలలన్నింటికి ప్రభుత్వ ధన సహాయం లభించకపోతే తానే ఆ పాఠశాలల నిర్వహణ బాధ్యత వహించారు.

ఈయన నాటి సమాజంలో పాతుకుపోయిన అంటరానితనాన్ని నిర్మూలించటానికి కూడా కృషి చేశాడు. అస్పృశ్యతా నివారణకు నిరంతరం శ్రమించాడు. విద్య అందరికీ సమానంగా అందించాలన్నదే ఆయన ముఖ్య ఆశయం. అవిద్య వల్ల అజ్ఞానంలో కొట్టుమిట్టాడుతున్న వారికి చేయూతగా నిలిచాడు. బ్రాహ్మణేతరులకు విద్యావకాశాలను కలకత్తా సంస్కృత కళాశాల ద్వారా కల్పించారు.

ఈ విధంగా అస్తవ్యస్తంగా ఉన్న సమాజాన్ని సంస్కరించేందుకు, అట్టడుగు స్థాయిలో ఉన్న స్త్రీలను ఉద్ధరించేందుకు నిరంతరం పాటుపడిన ఉన్నత వ్యక్తి ఈశ్వర చంద్ర విద్యాసాగర్.

## కేశవ చంద్రసేన్ (1838-1884):

సమాజాన్ని సంస్కరించడానికి, రాజారామ్‌మోహన్‌రాయులు స్థాపించిన బ్రహ్మసమాజంలో కేశవ చంద్రసేన్ విశేషసేవలు అందించిన వ్యక్తి. సంఘసంస్కరణే లక్ష్యంగా, వితంతు పునర్వివాహాల నిర్వహణ కొరకు నిరంతరం పోరాడి విజయం సాధించిన కర్తవ్యశీలి కేశవచంద్రసేన్. ఈయన 1838లో కలకత్తాలో జన్మించాడు. ఇతనిపై పందొమ్మిదవ యేటనే బ్రాహ్మసమాజ ప్రభావం పడగా, ఆ సమాజ ప్రచారానికి

పూనుకొన్నాడు. బ్రహ్మసమాజ ఆచార్యుడుగా అనేకచోట్ల పర్యటనలు చేసి ఉపన్యాసాలు ఇచ్చాడు. 1966లో ఈయన, భారతీయ బ్రహ్మసమాజాన్ని స్థాపించారు. 'ఇండియన్ రీఫార్మ్ అసోసియేషన్' ఏర్పాటు చేశారు.

ఈ కాలంలో స్త్రీలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు పరిష్కారాన్ని చూపటానికి నిరంతరం తపించాడు. వీటిన్నింటికీ మూలం అవిద్య, మూఢాచారాలు కారణమని తెలుసుకొని, వీటిని రూపుమాపే దిశగా తన ప్రయత్నాలను కొనసాగించాడు. బాల్యవివాహాలు పోవాలని, స్త్రీలకు 14 యేండ్లు, పురుషులకు 18 యేండ్లు రానిదే వివాహం చేయకూడదని ప్రచారం చేసి చివరకు సాధించాడు. 1872లో దీన్ని చట్టంగా తీసుకువచ్చాడు.

ఇదే కాక ఆనాటి సమాజంలో స్త్రీ పట్ల శాపంగా ఉన్నటువంటిది వైధవ్యం. దీనిని రూపుమాపేందుకు వితంతు పునర్వివాహాలను ప్రోత్సహించాడు. అలాగే, ప్రజలలో సమానత్వ భావాన్ని పెంపొందింప చేసేందుకు కులాంతర, మతాంతర వివాహాలను కూడా ప్రోత్సహించాడు. అనేక ఉపన్యాసాలు, రచనల ద్వారా సమాజాన్ని గురించి ప్రజల్లో మంచి ప్రచారం తెచ్చాడు. 'ఇండియన్ మిర్రర్' (ఇంగ్లీషు), 'ధర్మతత్వ' (బెంగాల్) పత్రికలను స్థాపించాడు.

ఇలా ఎన్నో సంస్కరణలు చేపట్టిన చంద్రసేన్‌కు, దేవేంద్రనాథ్ ఠాగూర్‌కు మొదట సన్నిహిత సంబంధం ఉండేది. కానీ తర్వాత వారికి విభేదాలు వచ్చి విడిపోయారు. తరువాత కేశవ చంద్రసేన్ 'భారత బ్రహ్మసమాజాన్ని' స్థాపించాడు. కొన్ని మార్పులతో అది తర్వాత కాలంలో 'నవవిధాన్' అన్న పేరుతో పిలవబడింది.

ఈ విధంగా సంఘసంస్కరణ తన లక్ష్యంగా నిరంతరం పరిశ్రమించిన కేశవ చంద్రసేన్ క్రీ.శ. 1884లో పరమపదించారు. రాజారామ్‌మోహన్‌రాయ్ ఆశయ సాధన కొరకు పాటుపడిన వ్యక్తి ఈయన. ఇది తరువాత కాలంలో దేవులపల్లి కృష్ణశాస్త్రి, వేదుల వంటి వారికి స్ఫూర్తిదాయకమైంది.

## అనిబిసెంట్ (1847-1933):

తనదైన పద్ధతిలో సంఘాన్ని సంస్కరించడానికి పూనుకున్న స్త్రీ మూర్తి శ్రీమతి అనిబిసెంట్. ఈమె విదేశీయురాలైనా, భారతదేశాన్ని తన కన్నతల్లివలె భావించి, దేశ పురోభివృద్ధికి నిరంతరం కృషి చేసిన నిస్వార్థజీవి. అనిబిసెంట్ క్రీ.శ. 1847వ సంవత్సరం అక్టోబర్ 1వ తేదీన 'జేమ్స్, మారిస్‌వుడ్' దంపతులకు ఇంగ్లండులో జన్మించారు.

చిన్నతనంలోనే ఫ్రాంక్‌బీసెంట్ అనే క్రైస్తవ మతాచార్యుని వివాహం చేసుకొన్నది. ఈమెకు చిన్నపటినుండి క్రొత్త విషయాలను తెలుసుకోవాలనే జిజ్ఞాస ఉండేది. ఈమెకు గల సందేహాలకు క్రైస్తవ మత గ్రంథాలు సమాధానమివ్వలేకపోయాయి. అందువల్ల క్రైస్తవ మతంపై విశ్వాసం కోల్పోయి ఆమె వీలులేని పరిస్థితుల్లో భర్తతో విడిపోవాల్సి వచ్చింది.

"ఈమె 1889వ సంవత్సరంలో 'దివ్యజ్ఞాన సమాజ' స్థాపకులలో ఒకరైన మేడం బ్లావట్స్కీ రాసిన SECRET DOCTRINE (గుప్త విద్య) అనే ఉద్గ్రంథాన్ని సమీక్షించడంతో ఆమె సమస్యలన్నింటికీ సమాధానం లభించింది. తత్ఫలితంగా దివ్యజ్ఞాన సమాజ సభ్యత్వాన్ని స్వీకరించి 'బ్లావట్స్కీ'గారికి అనుంగు శిష్యురాలై, దివ్యజ్ఞాన ప్రచారం చేసింది. 1893 సంవత్సరం ఈమె భారతదేశానికి వచ్చింది. అప్పటినుండి భారతదేశంలో జన్మించనప్పటికీ భారతదేశాన్ని తన మాతృదేశం కన్నా అమితంగా ప్రేమించింది. 1907లో దివ్యజ్ఞాన సమాజానికి అధ్యక్షురాలై 1933లో సెప్టెంబర్ 20వ తేదీన ఆమె చనిపోయే వరకు అధ్యక్షురాలుగానే ఉన్నారు."[7]

అనిబిసెంట్ భారతదేశానికి వచ్చేనాటికి దేశం పలురకాల సమస్యలతో సతమతమవుతూ ఉంది. అసమానతలతో నిరంతరం ఘర్షణ పడుతుండేది. స్త్రీల పరిస్థితి మరీ దయనీయం. సరియైన విద్యావిధానం అందుబాటులో ఉండేది కాదు. వీటిని చూసి చలించిన ఈమె భారతదేశాన్ని సంస్కరించడానికి నడుం కట్టింది. అనిబిసెంట్, ప్రజలకు సేవచేయడానికి రాజకీయ రంగమైతేనే సరియైనదని భావించింది. దీని ద్వారానే సత్వరంగా, సమగ్రంగా తన సేవలను ప్రజలకు అందించవచ్చని అనుకుంది.

ఈమె 1913వ సంవత్సరంలో మద్రాసు నగరంలో అనేక ఉపన్యాసాలిచ్చారు. ఈ ఉపన్యాసాలన్నింటిలోనూ ముఖ్య విషయం, 'భారతమా! మేల్కొనుము' సాంఘిక సంస్కరణలతోనే భారతదేశ భవిష్యత్తు ముడిపడి ఉన్నదని భావించింది.

అప్పట్లో మద్రాసులో ఎక్కువ ప్రసిద్ధిలో ఉన్న పత్రిక "ది మద్రాసు స్టాండర్డ్"ను ఈమె కొని, దానిని 'న్యూ ఇండియా'గా పేరు మార్చి దాని యాజమాన్య బాధ్యతలను స్వీకరించారు. దీని ద్వారానే "హోంరూల్" ఉద్యమ ప్రచారం చేపట్టింది. ఒక ప్రక్కన 'న్యూ ఇండియా' పత్రికను, మరో ప్రక్క అడయార్‌లోని దివ్యజ్ఞాన సమాజాన్ని సమర్థవంతంగా నిర్వహించేది. వాటిని ఆమె తన రెండు కళ్ళుగా భావించేది.

చిన్న పిల్లల్లో సత్ప్రవర్తనను పెంపొందింప చేయటానికి ఈమె ఎంతగానో తపించింది. నేటి బాలలే రేపటి పౌరులు అనే సూక్తిని ఈమె గాఢంగా నమ్మేది. బాలబాలికల సంక్షేమమే

సమాజ అభివృద్ధికి మూలమని భావించి, వారిని ఆ దిశగా తీర్చిదిద్దడానికి 'బాలభట సంఘం'ను ఈమె స్థాపించారు. "1921లో ఆ సంఘ కార్యకలాపాలు 'సర్ రాబర్ట్‌బాడెన్ పావెల్' సంఘ కార్యకలాపములతో కలిపి వేయబడ్డాయి. ఇట్లు చేసినందుకుగాను 1932లో 'సిల్వర్ ఉల్ఫ్' పతకంతో అనిబిసెంట్‌ను ఘనంగా సన్మానించిరి.

చిన్న పిల్లలకు స్వేచ్ఛ ఉండాలి కాని, ఆ స్వేచ్ఛ వారిని వక్రమార్గాన నడిపేదిగా ఉండకూడదనేది ఈమె అభిప్రాయం. డా. అనిబీసెంట్, పిల్లలను కూడా పెద్దవారిని వలె ఎంతో గౌరవమర్యాదలతో చూసిన వ్యక్తి. ఆమె పిల్లలను భయం పాలు కాకుండా పెంచమని చెప్పింది. బిడ్డలనెపుడు వారి ఇష్ట ప్రకారము చేయనీయకూడదు, కానీ వారిని ఆనందంగా పెరగనీయవలెననునది ఈమె ఉద్దేశం."[8]

అనిబిసెంట్, బాలబాలికలకు విద్య చాలా అవసరమని అది మాత్రమే వారికి సత్ప్రవర్తన అందిస్తుందని గ్రహించి వారికోసం అనేక విద్యాసంస్థలను స్థాపించారు. యువకుల్లో భారతీయ సంస్కృతిని జాగృతం చేయటానికి 1898లో కాశీలో 'సెంట్రల్ హిందూ కాలేజి'ని స్థాపించారు. బాలికల కొరకు 'సెంట్రల్ హిందూ గర్ల్స్ స్కూల్'ను స్థాపించింది. అప్పటి సమాజం అనేక కట్టుబాట్లకు లోబడి ఉండేది. వాటిని అనుసరించి ఈమె బాలికలకు శిక్షణనిచ్చేది. విద్యాసంస్థల అభివృద్ధికి అనిబిసెంట్ 'బీసెంట్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్' అను సంస్థను స్థాపించారు. ఈ సంస్థ యాజమాన్యలోనే అనేక విద్యాసంస్థలు నేటికీ నిర్వహించబడుతూ ఉన్నాయి. అందులో ఆంధ్రదేశంలోని మదనపల్లెలో 'బీసెంట్ థియోసాఫికల్ కాలేజ్' ఒకటి. దీనికి 1907 నుండి అనిబిసెంట్ అధ్యక్షురాలిగా పని చేశారు. జాతీయ కాంగ్రెస్‌కు అధ్యక్షత వహించిన తొలి మహిళ ఈవిడే.

సహజమైన ఎదుగుదలకు విద్య ఒక ముఖ్యాంశం. కానీ జీవనోపాధికి కాదు అని అనిబిసెంట్ భావించేది. విద్య మానసిక వికాసానికి తోడ్పడాలి కాని, అది వ్యాపారార్జన కొరకు కాకూడదు. అందుకే ఈమె ఉత్తమ విలువలతో కూడిన విద్యను నవతరానికి అందించటం కోసం చివరి వరకు కృషి చేశారు.

చిన్నపిల్లలను సంరక్షించడానికి వారి పోషణ కొరకు అనిబిసెంట్ 'రౌండ్‌టేబుల్' సంఘాన్ని స్థాపించి, దాని ద్వారా అనాథ పిల్లలకు ఆశ్రయాన్ని కల్పించి, ఆ పిల్లలలో కూడా సేవా భావం, ధైర్యం, సత్యం మొదలైన లక్షణాలు పెంపొందునట్లు ఆ సంఘానికి రూపకల్పన చేసింది. దీని శాఖలు నేడు ప్రపంచమంతటా విస్తరించి ఉన్నాయి. ఒక మహిళ విద్యావంతురాలైతే, కుటుంబమంతా విద్యతో నిండుతుందనేది పెద్దల మాట.

అది అనిబిసెంట్ విషయంలో రుజువైంది. ఈమె అనేక విజ్ఞాన జ్యోతులను వెలిగించింది. అవి నేడు ప్రపంచమంతటా కాంతికిరణాలను ప్రసరింపచేస్తున్నాయి. "ఆదర్శధీరుడు, బలిశాలి, ధైర్యశాలి, సత్యశీలుడు, కరుణామయుడు, మర్యాదస్తుడు ఆత్మనిగ్రహం కలవాడు. తనకంటే బలహీనులపై చేయి ఎత్తనివాడు, ఎవరికీ అన్యాయం చేయడు. ఎదుటలేని వాని గూర్చి అపవాదులాడడు. స్నేహితుని పట్ల విశ్వాసహీనముగ వర్తింపడు. గౌరవమతని లక్షణం. సౌమ్యత అతని అలంకారం. అతడాపదయందు నిర్భయుడు. విజయమునందు కరుణామయుడు.తనకు అపకారం జరిగినపుడు క్షమాశీలి. బిడ్డల యెడలను, జంతువుల యెడలను దయాశాలి. ఇటువంటి ఆదర్శధీరుల కోసం ఆమె కలలు కన్నది."[9]

ఈ ఆదర్శ సమాజ నిర్మాణం కోసం అనిబిసెంట్ చివరి వరకూ కృషి చేసింది. పూర్తిగా మార్చలేకపోయినా, కొంతవరకూ ఈ సమాజాన్ని తన ఆశయాలతో ఆలోచింపచేసింది. మనందరికీ ఆదర్శప్రాయురాలైనది అనిబిసెంట్ మార్గం.

## కందుకూరి వీరేశలింగం (1848-1919):

ఆంధ్రరాష్ట్రంలో సంఘసంస్కరణకు ఉద్యమించి కృషి చేసిన వారిలో శ్రీ కందుకూరి వీరేశలింగం గారు ప్రముఖులు. ఈయన రాజమహేంద్రవరంలో జన్మించి, అక్కడే సంస్కృతాంధ్రాలలో పాండిత్యాన్ని సంపాదించారు. వీరు ఉపాధ్యాయ వృత్తిని స్వీకరించారు. సంఘసంస్కర్తగా, పత్రికా నిర్వాహకుడిగా, నాటక కర్తగా, వచన రచనాకర్తగా పలు విధాలుగా సాహిత్యానికి, సమాజానికి వీరు సేవలందించారు. ఈయనకు విద్యార్థి దశనుండే మంచి రసవత్తరమైన కవిత్వం రాయడం, విషయ ప్రధానమైన ఉపన్యాసాలు చేయడం అలవడ్డాయి. వీరి వలన తెలుగు సాహిత్యంలో అనేక నూతన ప్రక్రియలు ఆవిర్భవించాయి.

అంతేగాక వీరు,చిన్నతనం నుండే పట్టుదలగల మనిషి. ఈయనకు ఆత్మవిశ్వాసం ఎక్కువ. సహజంగా శాంతస్వభావుడు. అయినా తనను ఎవరైనా విమర్శిస్తే సహించేవాడు కాదు. అన్యాయాన్ని ఎదిరించడానికి వెనుకాడేవాడు కాదు. అదే పంతులుగారి వ్యక్తిత్వాన్ని మహోన్నతంగా తీర్చిదిద్దింది. దైవభక్తి, మంత్రతంత్రాలు, జ్యోతిష్య శాస్త్రం మొదలైన వాటి పట్ల చిన్నతనంలో ఆసక్తి ఉన్నా, క్రమేపి వాటిపై విముఖత చూపారు. బాల్యంలోనే ఆదికవి నన్నయ భారతం మొదలు సూరన కృతుల వరకు ఉన్న కావ్యాలను చదువుకొన్నారు. ఈ సాహిత్య పఠనమే వారు మొదట సంప్రదాయ సాహిత్యాన్ని రాయడానికి ప్రేరణనిచ్చింది.

కందుకూరి వీరేశలింగం పంతులు గారు క్రీ.శ. 1848 ఏప్రిల్ 16 కీలకనామ సంవత్సరం చైత్రశుద్ధ త్రయోదశి భానువారం నాడు పున్నమ్మ, సుబ్బారాయుడు దంపతులకు రాజమండ్రిలో జన్మించారు.

నెల్లూరు జిల్లాలో 'కందుకూరు' అనే ఊరుంది. ఆ ఊరే మా పూర్వీకుల స్వస్థలం అని చెప్పారు వీరేశలింగం పంతులుగారు. అయితే ఉద్యోగం కోసమని, ఇతర కారణాల వల్లన వారు తమ స్వస్థలాన్ని విడిచిపెట్టి ఏలూరుకు చేరుకున్నారు. ఆరోజుల్లో సంస్థానాధిపతుల దగ్గర, చిన్న చిన్న జమీందారుల దగ్గర ఉద్యోగాలు లభించేవి. ఆ కారణం చేత కందుకూరి వారి పూర్వీకులలో ఎవరో గోదావరి జిల్లాకు చేరి ఉంటారు.

వీరేశలింగం గారిలో సంఘసంస్కరణ భావాలు కలగడానికి ఆయన జీవితనేపథ్యం కొంత కారణం. తాతముత్తాతల నుండి ఇది వారికి సంక్రమించింది. "వీరేశలింగం తాతగారి పేరు కూడా వీరేశలింగమే. ఆయన పేరే వీరేశలింగం గారికి కూడా పెట్టారు. తన ముత్తాతగారైన చంద్రమౌళిగారి గురించి ఒక ఆసక్తికరమైన విషయం వీరేశలింగం గారు తమ స్వీయచరిత్రలో చెప్పారు. అదేమిటంటే శైవమతస్థులు ఎవరూ కూడా వైష్ణవుల ఇంటి నుంచి ఆడపిల్లలను కోడలుగా తెచ్చుకోరు. వైష్ణవులు నిలువుబొట్టు వాళ్ళు, శైవులు అడ్డబొట్టు వాళ్ళు. అయితే చంద్రమౌళిగారు మాత్రం వైష్ణవుల ఇంటి అమ్మాయిని పెళ్ళాడారు అని చెపుతూ, 'నా ముత్తాత గారి దగ్గర నుండే మా కుటుంబంలో సంస్కారాభిప్రాయాలుండేవి' అని వీరేశలింగం గారు రాశారు."[10]

వీరు ప్రాథమిక విద్యాభ్యాసాన్ని సొంత ఊరిలోనే సాగించారు. వీరి గురువు పులిపాక అమ్మిరాజుగారు. తల్లి పున్నమ్మకు కొడుకును పై చదువులు చదివించాలనే కోరిక ఉండేది. అందువల్ల 1860లో పంతులుగారిని ప్రభుత్వ జిల్లా పాఠశాలలో చేర్చారు. వీరేశలింగం గారు మంచి ధారణాశక్తి, నిరంతర పరిశ్రమ కలవారు. తరగతిలో ఎప్పుడూ ప్రథమస్థానం పొందేవారు. అతని సత్ప్రవర్తనకు, తెలివితేటలకు జిల్లా విద్యాధికారి నుండి 'ఉత్తమ విద్యార్థి' బహుమానం అందుకొన్నారు.

1861 నాటికి పంతులుగారికి పదమూడేండ్లు వచ్చాయి. తల్లి, పెద్దతండ్రి ఆనాటి ఆచారం ప్రకారం వీరేశలింగం గారికి పెళ్ళి నిశ్చయించారు. పెళ్ళికూతురు పేరు బాపమ్మ, వివాహం తరువాత పున్నమ్మగారు తమ తల్లి రాజ్యలక్ష్మి గారి పేరుతో పిలిచేవారు.

కుటుంబ కలహాలతో దిగులు చెంది పెదతండ్రి మరణించాడు. తల్లికి, పెద్దతల్లికి మధ్య వైరం కారణంగా ఆస్తి రెండు వాటాలైంది. ఇంటిలో కొంత భాగాన్ని అద్దెకు ఇవ్వడం

వల్ల వచ్చిన ఆదాయంతో జీవనం సాగేది. వీరేశలింగం గారు మాటిమాటికి రోగపీడితుడైనప్పటికీ ధృఢనిశ్చయంతో చదువుకొన్నారు.

ఈయన 1870లో మెట్రిక్యులేషన్ పాసయ్యారు. 1871లో క్రిమినల్ హయ్యర్‌గ్రేడ్ పరీక్ష పాసయ్యారు. 1872లో భాషాంతరీకరణ పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు. ప్రాథమిక పాఠశాల చదువు పూర్తయ్యాక రెవిన్యూ ఆఫీసులో గుమస్తాగా చేరారు. కానీ యజమాని చెడు ప్రవర్తనను వ్యతిరేకించి, విసుగు చెంది ఉద్యోగం విడిచిపెట్టారు

1872వ సంవత్సరంలో కోరంగిలో ఆంగ్ల పాఠశాలలో హెడ్‌మాస్టర్‌గా పనిచేశారు. నెలకు 30 రూపాయలు జీతం. ఈ ఉద్యోగం స్వతంత్రంగా, నిర్భయంగా అత్యంత బాధ్యతాయుతంగా నిర్వహించారు. అక్కడ పని చేస్తున్న రోజుల్లోనే 'శుద్ధాంధ్రోత్తర రామాయణం' రాశారు. బందరు నుండి వెలువడే పురుషార్థప్రదాయినిలో భాగాలుగా ప్రకటించారు. క్రింది తరగతుల పిల్లల కోసం నీతులు బోధించే గీత పద్యాలతో నీతిదీపిక కూర్చారు. అక్కడ పని చేస్తుండగా పిల్లలకు సులభ పద్ధతిలో పాఠాలు చెప్పడానికి 'సంగ్రహ వ్యాకరణం' రాశారు. 1874వ సంవత్సరంలో ధవళేశ్వరంలో ఆంగ్లో - వెర్నాక్యులెర్ స్కూలులో ఉపాధ్యాయులుగా బాధ్యతలు స్వీకరించమని ప్రధాన ఆహ్వానం వచ్చింది. ఇక్కడ ఉండగానే చిన్నయ సూరిగారి మిత్రలాభం, మిత్రభేదం మినహా అదే శైలిలో దానికి తగ్గకుండా 'విగ్రహతంత్రం' రాసారు. అది ఎక్కువ మంది అభినందనలతో, అంగీకారంతో పాఠ్యపుస్తకంగా ఎన్నికైంది. మెట్రిక్యులేషన్ పాఠ్యపుస్తకం అయింది. అక్కడ ప్రధానోపాధ్యాయులుగా రెండేళ్ళు పనిచేశారు. అక్కడ ఉండగానే ప్రజాహిత కార్యక్రమాల పట్ల ఆకర్షితులయ్యారు. అందువల్ల పదవికి రాజీనామా చేసి రాజమండ్రి వచ్చారు. పంతులుగారు అక్కడి స్నేహితులు, శ్రేయోభిలాషుల సలహాలతో రాజమండ్రి ప్రభుత్వ కళాశాలలో తెలుగు పండిట్ పదవిని చేపట్టారు. నెలజీతం 25 రూపాయలే అయినా అనేక సంవత్సరాలు వీరు ఆ పదవిని నిర్వహించారు.

బ్రహ్మసమాజ సిద్ధాంతాలకు ప్రభావితుడై సంఘసంస్కరణ దృష్టితో రచనలు చేశాడు. నవల, నాటకము, జీవిత చరిత్ర స్వీయచరిత్ర, వ్యాసం, ప్రహసనం, విమర్శ మొదలైన కొత్త సాహిత్య ప్రక్రియలు తెలుగులో ఆవిర్భవించడానికి కారకులైయ్యారు. అముద్రిత పూర్వకావ్యాలను సేకరించి ప్రచురించాడు. శాస్త్ర విషయాలను సులభశైలిలో వచనంలోకి మార్చి రాశారు. సంస్కృత నాటకాలను తెలుగులోకి అనువదించారు.

నన్నయ్య నుండి తన కాలం వరకు ఉన్న కవుల చరిత్రలను, వారి పుట్టు పూర్వోత్తరాలను, కాలాలను ప్రమాణ బద్ధంగా నిర్ణయించి గ్రంథ రచన చేశారు. తరువాత వచ్చిన 'తెలుగు సాహిత్య చరిత్ర' రచనలకు ఇది ఆదర్శప్రాయమైంది. ఈయన రాసిన 'రాజశేఖర చరిత్ర' తొలి తెలుగు నవలగా ప్రసిద్ధి చెందింది. దీనిని ఆయన 'వచన ప్రబంధం' అని పేర్కొన్నారు. ఈ రచనకు ఆంగ్లంలోని గోల్డ్‌స్మిత్ రాసిన "ది వికార్ ఆఫ్ ది వేక్ ఫీల్డ్" మూలం. ఈయన వ్యంగ్యప్రధానమైన ప్రహసనాలనూ రాశారు. వీరి రచనలలో సంఘసంస్కరణ దృష్టి ప్రధానంగా కనిపిస్తుంది. ఈ ప్రహసనాల్లో వ్యంగ్యంతో పాటు, ప్రజలను ఆలోచింపచేసే లక్షణం కనబడుతుంది. వీటిలో 'పెద్దయ్య గారి పెళ్ళి' అనే పేరున్న 'బ్రహ్మ వివాహం' అనే ప్రహసనం ఎంతో పేరు పొందింది. "సత్యరాజా పూర్వదేశయాత్రలు" అనే ప్రహసనాన్ని హాస్యరసభరితంగా రాశారు. దీనికి ఆంగ్లంలోని 'గలివర్స్ ట్రావెల్స్' మూలం. వీరు సంస్కృతంలో కాళిదాసు రాసిన అభిజ్ఞాన శాకుంతలం, మాళవికాగ్ని మిత్రం నాటకాలను ఆంధ్రీకరించారు. "విగ్రహ తంత్ర విమర్శనం" పేరుతో తెలుగులో ఆధునిక విమర్శకు ఆద్యులైనారు.

**సంఘసంస్కర్తగా వీరేశలింగం :**

సంఘాన్ని సంస్కరించడానికి పూనుకొన్న వీరేశలింగం ఆ దిశగా ప్రయత్నాలు సాగించి సఫలీకృతుడయ్యారని చెప్పవచ్చు. స్త్రీలకు విద్యావకాశాలు కల్పించి వారిని విద్యావంతులుగా చేయడం, అలాగే అంటరానితనాన్ని నిర్మూలించడం ఈయన ముఖ్య ఉద్దేశ్యం. ఇవి మాత్రమే కాకుండా వితంతువుల దయనీయ దుస్థితిని మార్చేందుకు గానూ, వారికి పునర్వివాహాలు జరిపించటం, కులాంతర, మతాంతర వివాహాలను ప్రోత్సహించటం ద్వారా సంఘంలో క్రమేపీ మార్పు తీసుకురావడానికి ప్రయత్నించారు.

స్త్రీలు చదువుకుంటే కాని సంసారాలు సరిగా ఉండవు అని స్త్రీల కోసం, ముఖ్యంగా బాలబాలికల కోసం వీరేశలింగం గారు బాలికా పాఠశాలలను స్థాపించారు. వాళ్ళకు ఈయనే స్వయంగా చదువు చెప్పేవారు. అలాగే బాలురకు కూడా సరైన విద్య నేర్పడానికి పాఠశాలలు స్థాపించాడు. సంఘంలో ధర్మం, దయ, నీతి, ఆస్తికత, పరోపకారం, చిత్తశుద్ధి, శీలం, సత్ప్రవర్తన అలవరచటానికి రాజమండ్రిలో బాలబాలికల పాఠశాలలను ఈయనే మొదట స్థాపించారు. ఆడపిల్లలూ, మగపిల్లలూ కలిసి చదువుకొనే సహ విద్యావిధానాన్ని ఆంధ్రదేశంలో మొట్టమొదట అమలు పరిచినవారు వీరేశలింగం గారే.

ఆనాటి సమాజంలో వితంతువులంటే చులకన భావం ఎక్కువగా ఉండేది. ఈ పరిస్థితులను తట్టుకోలేక ఎంతోమంది స్త్రీలు, తమ భర్తలతో పాటు సహగమనం చేసేవారు. కందుకూరి వీరేశలింగం ఈ పరిస్థితులను సరిదిద్దడానికి ఎంతగానో ప్రయత్నించారు. చివరకు వారికి విముక్తి కల్పించారు. అయితే అది సంపూర్ణంగా జరగలేదు. నేటికీ సమాజంలో వితంతువుల పరిస్థితి పూర్వంలాగే కొనసాగుతున్నది.

**1881**వ సంవత్సరం డిసెంబర్ **11**వ తేదీన వీరేశలింగం పంతులు, రాజ్యలక్ష్మమ్మగారలు తమ ఇంట్లో మొట్టమొదటిసారిగా వితంతు వివాహం చేశారు. కృష్ణాజిల్లాలో తిరువూరు తాలూకాలో రేపూడి అనే ఊరు నుంచి ఎనిమిది, తొమ్మిదేళ్ళ బాలవితంతువును రాజమండ్రికి తెచ్చారు. వరుడు గోగులపాటి శ్రీరాములుగారు. వధువు పేరు గౌరమ్మ.

వీరేశలింగంగారు చేసిన ఈ ప్రయత్నాన్ని హర్షించే జనం కంటే, విమర్శించే జనమే ఎక్కువయ్యారు. ఆ వివాహానికి వెళ్ళిన వాళ్ళని సమాజం వెలివేసినంత పనిచేసింది. అద్దె ఇళ్ళలో ఉన్నవారిని, ఆ ఇంటి యజమానులు బయటకు వెళ్ళగొట్టారు. నిత్యావసర వస్తువులు కూడా అందనీయకుండా చేశారు. అటువంటి వాళ్ళు తప్పైందని ప్రాయశ్చిత్తాలు చేసుకొని మత గురువులు విధించిన షరతులకు ఒప్పుకొని వాళ్ళు ఇవ్వాలని చెప్పిన దండన, రుసుం చెల్లించి మళ్ళీ స్వసంఘంలో కలవాల్సి వచ్చింది.

సనాతన సాంప్రదాయవాదులెంతగా వితంతు పునర్వివాహాలను వ్యతిరేకించినా, వీరేశలింగంగారు పట్టిన పట్టు విడవకుండా ముందుకు సాగారు. తాను అనుకొన్న పనిని సాధించారు.

కందుకూరి గారికి స్త్రీల పట్ల అభిమానం, గౌరవం ఎక్కువగా ఉండేవి. అందుకే వారనుభవించే కష్టాలను, తన కష్టాలుగా భావించి వాటిని తీర్చేందుకు అహర్నిశలు కృషి చేశారు.

ఈ మహత్కార్య సాధనకై ఆయన ప్రాణాలకు తెగించి నడుం బిగించారు. వెంటనే ఆయన ప్రకటన వెలువడింది....

విజ్ఞాన తరంగమే వీరేశలింగం :

స్త్రీ కంట కన్నీరొలికిన యింట సిరి నిలువదు

ఇవి శిలాక్షరములు

స్త్రీ పునర్వివాహం ధర్మశాస్త్ర సమ్మతమే

పురాత సాంప్రదాయమే ఇవి వేదాక్షరాలు!

తరుణికి తలకట్టు తీసివేయుట తలను కోసివేయుటే

కనుక ఇది తగని పని

తలలు బోడులైన తలపులు బోడులుకావు.

విధవా వివాహాలు విధిగా జరగవలసిందే!

వీరేశలింగం గారి ఈ ప్రకటన నాటి సమాజము నందు బాంబువలె ప్రేలింది. సనాతనవాదులు అగ్నిహోత్రులై పోయారు. కందుకూరి వారి ప్రకటన వారికి గంగ వెర్రులెత్తించింది. కొన్ని వర్గాల వారు ముఠాలుగా ఏర్పడి పంతులుగారిని స్త్రీ పునర్వివాహము వాదనకు ఆహ్వానించారు. వాదన కార్యసాధన కాదని తెలిసి కూడా పంతులుగారు అందుకు అంగీకరించారు. పట్టిన పట్టు విడువకపోవడం, ఫాలాక్షునకైనా జడవకపోవడం పంతులుగారికి ఉగ్గుపాలతో పెట్టిన విద్యలు. పగబట్టిన పండితుల మధ్యకు పంతులుగారు మొండి చొరవతో ఒంటరిగా బయలుదేరారు. ఆయనకు తెలియకుండా విద్యార్థులు తగు రక్షణకై ఆయనను అనుసరించారు.''[11]

ఈ విధంగా పంతులుగారు సాంప్రదాయవాదుల అభిప్రాయాలను కూడా ఖండించి తను చేయదలచుకొన్న దానిని ఎన్ని ఇబ్బందులు ఎదురైనా విడిచిపెట్టకుండా కొనసాగించి ఈ సమాజంలో మార్పు కోసం నిరంతరం తపించిన ఆశయశీలిగా నిలిచిపోయారు.

**నాటకరంగ వికాసానికి వీరేశలింగం కృషి :**

తెలుగునాట, నాటక సంస్కృతి అంత తొందరగా వ్యాపించలేదు. తెలుగువారు శ్రవ్యకావ్యరచనకు ఇచ్చినంత ప్రాధాన్యత దృశ్యకావ్యానికి ఇవ్వలేదు. అందువల్లనే ఆంధ్రదేశంలో నాటక రచన, ప్రదర్శనలు చాలా ఆలస్యంగా ప్రారంభమైనాయి. కన్నడ సరిహద్దు ప్రదేశాల్లో జరిగిన నాటక ప్రదర్శనలు, హిందీ నాటక ప్రదర్శనలు, తెలుగునాడులో నాటక ప్రదర్శనకు ప్రేరణనిచ్చాయి. అంతేగాక ధార్వాడ నాటక కంపెనీ రాకతో 19వ శతాబ్ది ఉత్తరార్థంలో నాటకరంగం బాగా విస్తృతిని పొందింది.

క్రీ.శ. 1860 నాటికే తెలుగులో నాటక రచన ప్రారంభమైంది. కోరాడ రామచంద్రశాస్త్రిగారు 'మంజరీ మధుకరీయము' రాశారు. అయితే అది అంత ఖ్యాతి పొందలేదు. ఈ నాటకం ప్రదర్శనను పొందిన ఆధారాలు కూడా లేవు. కందుకూరి వీరేశలింగం పంతులుగారు అదే సమయంలోనే రాజమండ్రిలో ఒక నాటక సమాజాన్ని స్థాపించారు.

రత్నావళి, చమత్కార రత్నావళి అనే రెండు నాటకాల్ని రాసి 1880 ప్రాంతాల్లో ప్రదర్శింపచేశారు. అప్పటివరకు ధార్వాడ నాటక సమాజ ప్రదర్శనల్నే చూస్తున్న రాజమండ్రి పౌరులు వీరేశలింగంగారి నాటకాల్ని కూడా ఆదరించారు. ఈవిధంగా నాటక ప్రదర్శనలు రాజమండ్రిలో తొలిసారిగా ప్రారంభమైనాయి.

ఆ తర్వాత ధర్మవరం రామకృష్ణమాచార్యులు, కోలాచలం శ్రీనివాసరావుగారు బళ్ళారిలో నాటక సమాజాన్ని స్థాపించారు. నాటక రంగానికి ఒక స్థిరమైన చిరునామా ఏర్పాటు చేశారు.

1880లో కందుకూరి వీరేశలింగం గారు రాసిన 'వ్యవహార ధర్మబోధిని' అనే నాటకం ప్రదర్శించబడింది. ఇది విజయనగరం మహారాజావారి బాలికా పాఠశాలలో ప్రదర్శన పొందింది. కందుకూరి వారి నాటకాలను ప్రహసన ప్రక్రియగా పిలుస్తారు. ప్రహసన రచనలో బాగా రాణించిన తెలుగు రచయితగా కందుకూరి వారిని పేర్కొనాలి. కందుకూరి 'బ్రహ్మవివాహము' అనే ప్రహసనాన్ని రాసి 'హాస్యసంజీవని' పత్రికలో ప్రకటించారు. అయితే కందుకూరి వారి ప్రహసనాల్లో శిల్ప సంబంధమైన లోపాలున్నాయి. ఆయనను అభిమానించే వారు సైతం ఈ లోపాల్ని అంగీకరిస్తారు. కానీ, తెలుగులో నాటక ప్రదర్శనలు జరగని రోజుల్లో కందుకూరి వీటిని రాశారనీ, సాహసించి వాటిని ప్రదర్శించారనీ మాత్రం మనం గుర్తుపెట్టుకోవాలి. 'వినోదం' వాహికగా, 'సంఘసంస్కరణే' ప్రధాన సంకల్పంగా ఈ ప్రహసన రచన కొనసాగింది. అభిజ్ఞాన శాకుంతలము, మాళవికాగ్ని మిత్రము, ప్రబోధ చంద్రోదయం అనే సంస్కృత నాటకాల్ని అనువదించారు. అదే విధంగా రాగమంజరి, కళ్యాణ కల్పవల్లీ, వెనీస్ వర్తక చరిత్ర అనే ఇంగ్లీషు అనుసృజనలను, అలాగే ప్రహ్లాద, హరిశ్చంద్ర, దక్షిణ గోగ్రహణము అనే స్వతంత్ర నాటకాలు రాసి కందుకూరి వారు నాటక వాఙ్మయాన్ని సుసంపన్నం చేశారు.

తెలుగులో తొలి స్వతంత్ర నాటకకర్తగా వీరేశలింగం పంతులుగారిని చెప్పేందుకు ఆరుద్రగారి 'సమగ్రాంధ్ర సాహిత్యం'లోని ఈ వాక్యం ఆధారమవుతున్నది.

అతి బాల్య వివాహాల వల్లనే నిర్బంధ వైధవ్యం ప్రాప్తిస్తున్నదని శుద్ధ వ్యావహారిక భాషలో 'బ్రహ్మవివాహం' అనే నాటకం రాసారు. దానిని ప్రజలు గుంపులు గుంపులుగా కూర్చొని చదువుకొనేవారు. పంతులుగారు ఏ పేరు పెట్టినా లోకులు మాత్రం దాన్ని 'పెద్దయ్యగారి పెళ్ళి పుస్తకం' అని పిలిచేవారు. ఇది తెలుగులో మొట్టమొదటి సాంఘిక నాటకం.

కొందరు పరిశోధకుల దృష్టిలో వావిలాల వాసుదేవశాస్త్రిగారు రాసిన 'నందక రాజ్యమే'

మన భాషలో ప్రథమ సాంఘిక నాటకం. అయితే అది 1880లో ప్రచురణ అయ్యింది. వీరేశలింగం గారి 'బ్రహ్మవివాహం' 1876లోనే హాస్యసంజీవనిలో సీరియల్‌గా ప్రకటన పొందింది. 1878లోనే పుస్తకరూపం పొందింది. 'పెద్దయ్య గారి పెళ్ళి పుస్తకా'న్ని విద్యావిహీనులు సైతం విని ఆనందించేవారు.

భరతుడు నాట్యశాస్త్రం 18వ అధ్యాయంలో దశరూపక భేదాలను చెపుతూ ప్రహసన లక్షణాల్ని కూడా వివరించాడు. ఉత్తమ వంశంలో జన్మించిన వారి చరిత్రలు మార్గనాటకంలో ఉంటే ప్రహసనంలో మాత్రం వేశ్య చేటి నపుంసక విట ధూర్త బంధకి మొదలైన వారి కథలు, వాళ్ళ భాషా వ్యవహారాలు ప్రదర్శించబడతాయి. లోకంలోని మోసగాళ్ళ, దగుల్బాజీలు, నయవంచకులు మొదలైన వాళ్ళ బండారం బయటపెట్టడం ప్రహసనం ప్రయోజనం.

వీరేశలింగం పంతులుగారి ప్రధాన లక్ష్యం సంఘసంస్కరణ. అందుకు ఆయనకు ప్రహసనాలు చక్కగా ఉపకరించాయి. వీరేశలింగం ప్రహసన రచన గురించి కురుగంటి సీతారామయ్యగారు తమ 'నవ్యాంధ్ర సాహిత్య వీధు'ల్లో ఈవిధంగా రాశారు.

ప్రహసనము పంతులుగారి చేతిలో మంచి ఉన్నతికి వచ్చింది. వారి సంప్రదాయ దూషణాదులకు దోహదమిచ్చింది. పూర్వ సంప్రదాయాల మీద నైరాశ్యము కలిగించడానికి ప్రహసనము చాలా ఉపకరించింది. బాల్య వివాహాదులు మొదలైన ఆచారాలను ప్రహసనం ద్వారా విమర్శించాడీయన.

వీరేశలింగం గారు రాసిన ప్రహసనాలు సమాజంలో పెద్దమనుషులుగా చెలామణి అయ్యేవారి మోసాల్ని వారి స్వార్థపూరిత ప్రవృత్తుల్నీ బయటపెట్టాయి. ఈ నేపథ్యంలో వీరేశలింగం పంతులుగారు కొన్నిసార్లు న్యాయస్థాన వ్యాజ్యాల్ని కూడా ఎదుర్కోవలసి వచ్చింది. ఆయన తన ప్రత్యర్థి కొక్కొండ వెంకటరత్నం పంతులును ఒక ప్రహసనంలో అధిక్షేపించారు. వీరేశలింగం రాసిన ప్రముఖ ప్రహసనాలు హాస్యసంజీవనిలో ప్రచురితమయ్యాయి.

అవి :

1. అపూర్వ బ్రహ్మచర్య ప్రహసనం
2. విచిత్ర వివాహ ప్రహసనం
3. మహాబధిర ప్రహసనం
4. పునర్మరణ ప్రహసనం
5. బలౌత్కార గానవినోద ప్రహసనం

6. కలహ్రత్రయి ప్రహసనం
7. మహామహోపాధ్యాయ ప్రహసనం
8. యోగ నిద్రా ప్రహసనం
9. మహావంచక ప్రహసనం
10. అసహాయశూర ప్రహసనం
11. వేశ్యాప్రియ ప్రహసనం
12. కలిపురుష శనైశ్చర ప్రహసనం
13. కేతుక వర్ధిని
14. హాస్య సంజీవని మొదటి భాగం
15. హాస్య సంజీవని రెండవ భాగం
16. హాస్య సంజీవని మూడవ భాగం

కొన్ని ప్రహసనాల్లోని హాస్యం శృతి మించినట్లు కనబడుతుంది. వీటిలోని అసభ్య చిత్రీకరణలకు గురజాడ అప్పారావుగారే నొచ్చుకొని విమర్శించారు. అయితే ఈ ప్రహసనాలు తర్వాత కాలపు సాంఘిక నాటకరంగ వికాసానికి మార్గదర్శకంగా నిలిచాయి.

కందుకూరి గారు ప్రతి ప్రహసనంలోనూ ఏదో ఒక సాంఘిక దురాచారాన్ని గురించి ప్రస్తావించేందుకు ప్రయత్నించారు. పెద్దయ్యగారి పెళ్ళి, లోకోత్తర వివాహం ప్రహసనాల్లో వేశ్యాభిమానం, చాదస్తపుటాచారాలు, శాఖా భేదాలు అజ్ఞానం అమాయకత్వం మొదలైనవి చిత్రీకరించబడ్డాయి. జమాబందీ యోగాభ్యాసము ప్రహసనంలో కులాచారాన్ని విమర్శించాడు. వేశ్యా విషయ సంవాదం, చంద్రగ్రహణం, తేలు మందు, హిందూమత సభ, బహుభార్యత్వం బాలభార్యా వృద్ధభర్తృసంవాదం వంటి ప్రహసనాల్లో నాటి సాంఘిక దుస్థితిని చిత్రీకరించారు. 'కలిపురుష శనైశ్చర విలాసము' అనే ప్రహసనంలో, కలి దేశ ప్రజల్ని అజ్ఞానులుగా మద్యపాన ప్రియులుగా అసత్యవాదులుగా, దురాచారులుగా చేస్తారు. ప్రజలు ఏవిధంగా భ్రష్టులు కావడం మొదలుపెట్టారో తెలియచేసే ప్రహసనం ఇది.

భోగం మేళాలను అధిక్షేపించే ప్రహసనం 'వేశ్యాప్రియ ప్రహసనం' అపూర్వ బ్రహ్మచర్య ప్రహసనం, విచిత్ర వివాహ ప్రహసనం, మహాబధిర ప్రహసనం, కలహప్రియ ప్రహసనం వంటివి సాహితీ లోకంలో కొంతకాలం పాటు చర్చనీయాంశాలయ్యాయి. ఈ ప్రహసనాల్లోని కొన్ని మాత్రమే ప్రదర్శనకు నోచుకొన్నాయి. కందుకూరి వారు ఆరంభించిన

ప్రహసన రచనను చిలకమర్తివారు ముందుకు తీసుకుపోయారు.

కందుకూరి వీరేశలింగం గారు రాసిన నవలల్లో అత్యంత పేరు ప్రఖ్యాతలు సంపాదించుకొన్న నవల 'రాజశేఖరచరిత్ర' సమాజంలోని ప్రజల జీవన స్థితిగతులను, వారి మనస్తత్వాన్ని కళ్ళకు కట్టినట్లు ఈ నవలలోని పాత్రల ద్వారా వీరేశలింగం గారు చూపించారు. ఈ నవలలో రాజశేఖరుడు నాయకుడు. ఇతడు బాగా ధనవంతుడు. అంతేగాక కర్ణుడితో సమానమైన దానగుణం కలవాడు. ఈయన భార్య మాణిక్యాంబ. ఈమె భర్తమాట జవదాటని ఇల్లాలు. వీరికి రుక్మిణి, సీత అను కుమార్తెలు, సుబ్రహ్మణ్యం అనే కుమారుడు కలరు. రాజశేఖరుడు గొప్ప పండితుడు, అయినా ఛాందస భావాలు కలిగినవాడు. ఎవరు ఏది చెప్పినా నమ్మేవాడు. ఈయన ఇల్లు నిత్యం బంధువులతో, మిత్రులతో కళకళలాడుతుండేది. రాజశేఖరుడికి పొగడ్తలంటే ఇష్టం. అది అలుసుగా తీసుకొని ఇతరులు ఆయన దగ్గర నుండి అవసరమైనప్పుడల్లా డబ్బు గుంజేవారు. తన ఇంటి సంపదను ఊరి ప్రజలకు దానం చేయడంతో ఆగక, అప్పు చేసి మరీ ఇతరులకు సహాయపడుతుండేవాడు. తన పెద్ద కూతురి పెళ్ళి చేయడం కోసం ఎక్కువ మొత్తం అప్పు చేశాడు. కానీ ఆ అల్లుడు, తన స్నేహితుడితో కలసి కాశీకి వెళతాడు. అతడు అక్కడ చనిపోయాడని స్నేహితుడు రాజశేఖరుడి కుటుంబానికి చెపుతాడు. దానితో కూతురు విధవరాలౌతుంది. అప్పుల వాళ్ళతో పాటు, దొంగ రుక్మిణి నగను దొంగిలించడం ఒక సమస్యగా మారింది. ఆ నగను దొంగిలించినవాడు ఆ యింటి పనివాడుగా రాజశేఖరుడిగారి మిత్రుడు భూతవైద్యుడి చేత చెప్పిస్తాడు. పరుసవేది విద్య తెలుసంటూ వచ్చిన సన్యాసి అతడి చేతిలో బూడిద మూట ఉంచి, డబ్బూనగలతో పరారౌతాడు. దీనితో రాజశేఖరుడు పూర్తిగా అప్పులపాలయ్యాడు. ఉన్న ఆస్తిని కోల్పోయాడు. కుటుంబంతో సహా కాశీ యాత్రకు బయలుదేరతారు.

దారిలో వారికి రామరాజుతో పరిచయం ఏర్పడుతుంది. అతడి సహాయంతో వాళ్ళు పెద్దాపురం బయలుదేరుతారు. వాళ్ళకు దారి మధ్యలో చెరువు కట్ట దగ్గర ఒక సన్యాసి కనిపించి, వాళ్ళని దారి మళ్ళిస్తాడు. వాళ్ళు అడవి మధ్యన దొంగలకు దొరకుతారు. ఆ దొంగలలో ఒకడు రుక్మిణిని తల మీద కొడుతాడు. దానితో ఆమె స్పృహ తప్పిపోతుంది. కానీ రుక్మిణి చనిపోయిందని భావించి రాజశేఖరుడి కుటుంబాన్ని అక్కడనుండి వెళ్ళిపొమ్మని రామరాజు వాళ్ళని హెచ్చరిస్తాడు. దొంగలనుండి వాళ్ళకి రక్షణ కల్పిస్తాడు. రాజమహేంద్రవరం వెళ్ళిన తరువాత రాజశేఖరుడి కొడుకు సుబ్రహ్మణ్యాన్ని ఉద్యోగం

కోసం పిఠాపురం పంపిస్తారు. అక్కడ ఉన్నప్పుడు సుబ్రహ్మణ్యానికి శోభనాద్రిరాజుతో మైత్రి ఏర్పడుతుంది. సీతకు, తనకు తెలిసిన సంబంధం చేద్దామని అంటాడు. అతడి నుండి రాజశేఖరుడు పెళ్ళికోసం కొంత అప్పు చేస్తాడు. ఆ తరువాత రామరాజుతో విరోధం వస్తుంది. శోభనాద్రిరాజు దొంగని తెలుస్తుంది. దానితో రాజశేఖరుడు పెళ్ళి ఆపుతాడు. శోభనాద్రిరాజు తన అప్పు చెల్లించనందుకు రాజశేఖరుడిని జైలులో పెట్టిస్తాడు. తరువాత నీలాద్రిరాజు సుబ్రహ్మణ్యంపై నేరం మోపి, ధనాన్ని తాను దొంగిలించడం జరుగుతుంది. తరువాత సుబ్రహ్మణ్యం పిఠాపురం మహారాజు సమక్షంలో నీలాద్రిరాజు దొంగతనాన్ని బయట పెట్టిస్తాడు. రాజశేఖరుడు కూడా నిర్దోషిగా బయటకొస్తాడు. అదే సమయానికి రుక్మిణి, సీతను అపహరించిన దొంగను తరిమివేసి తల్లిదండ్రులని పురుష రూపంలో కలుస్తుంది. తాను చనిపోలేదని, పురుష వేషంలో వేరొకరి ఇంటిలో ఉన్నానని చెపుతుంది. అదే సమయానికి రుక్మిణి భర్త కాశీ నుండి తిరిగి వస్తాడు. దీనితో కథ సుఖాంతమౌతుంది. సుబ్రహ్మణ్యం-సీతల వివాహాలు జరిగాక, రామరాజు రాజ్యానికి తిరిగి వెళ్ళబోతూ రాజశేఖరుడికి కొన్ని నియమాలు చెపుతాడు. ఇవి మనందరికీ అనుసరణీయాలు. కందుకూరి సంఘసంస్కరణ దృష్టి ఇక్కడ కనిపిస్తుంది. ఆయన ఏ ప్రయోజనం కోసం ఈ నవల రాసారో అర్థమౌతుంది. "మీరిదివరకెన్నో కష్టములననుభవించి మాయాపదలనన్నిటిని గడచి మరల సుఖముననుభవించు దశకు వచ్చుచున్నారు. కాబట్టి మీకు నేను కొన్ని హిత వాక్యములను చెప్పబోవుచున్నాను. మీరు నా మాటలను సదవకాశముగా వినవలెను. పడిన తరువాత లేచుట గొప్పతనముగాని యెప్పుడును పడుకొండుట గొప్పతనము కాదు. మీరీ రీతిని మనసునందుంచుకొని వెనుకపడిన కష్టములకై విచారపడకుండవలయును. ఇతరులు చేయు ముఖస్తుతులకుబ్బి, ఆదాయమునకంటె నధికమైన ధనము దానము చేయకుండవలయును. ఒక్క కుటుంబంలో వారు పలువురు పది మందిలో నత్యంత మైత్రి కలిగియున్నను గృహము చేరిన తోడనే గర్భశత్రువులగా నుందురు. కాబట్టి మీ కుటుంబమునందట్టి కొరత కలుగకుండ గాపాడుచు రావలయును. విరోధమును సాధించుటకు మంచి యుపాయము శాంతిని వహించుటయే. మనకెవ్వరి మీదనైనను పగతీర్చుకో శక్తి కలిగియుండియు క్షమింతమేని, శత్రువులు సహితము మనలను జూచి బుద్ధి తెచ్చుకొని జ్ఞానవంతులగుదురు. కప్ప కరవవలెనని ప్రయత్నము చేసిననెంత ప్రయోజనకారియగునో బీదవాడు గొప్పవానిని పగసాధింప దలచుగొన్ననంత ప్రయోజనకారిగానేయుండును. వట్టి బెదిరింపులతోనే ముగిసెడు కోపమునెవరు లక్ష్యము

చేయుదురు. అట్టి కోపము వలన మన కార్యమును సాధించుకోలేకపోవుట యటుండుగా మీదు మిక్కిలి నష్టమును కూడా బొందుదుము. మీరు శోభనాద్రిరాజు మీద తొందరపడి మీ కోపమును చూపినందులకే కదా మీకు కారాగృహబంధనము సంభవించినది. కాబట్టి ఇక ముందెప్పుడు మీరు మీ కంటె నధికులైన వారి మీద మీ కోపమును కనపడకుండ వలయును. కొందరు మతిహీనులు పూర్వకాలమే మంచిదని పొగడి మీరు చేయు దోషములను కాలమునందారోపించి మిమ్ము నిరుత్సాహులను చేయుదురు. కాని, చక్కగానాలోచించి చూడగా బూర్వకాలమునకంటే నిప్పటికాలమే మంచిదని నాకు దోచుచున్నది. పుణ్యపాపములు మనుష్యుల ప్రవర్తనములో నున్నవికాని కాలములో నేమియులేవు. కాబట్టి మీరు చేసిన దోషములకు కాలమును దూషింపక మీ ప్రవర్తనమును తిన్నపరుచుకొనుటకే ప్రయత్నపడవలయును...”[12]

పైవిధంగా వీరేశలింగం పంతులుగారు తెలుగులో సంఘసంస్కరణోద్యమ ప్రభావంతో సాహిత్యాన్ని సృజించారు. నవల, నాటకం, స్వీయచరిత్ర జీవితచరిత్ర మొదలైన కొత్త ప్రక్రియలను తెలుగులో ప్రవేశపెట్టి, ఆధునిక యుగానికి నాంది పలికాడు.

## రఘుపతి వెంకటరత్నం నాయుడు (1862-1939):

రఘుపతి వెంకటరత్నం నాయుడుగారు 1862లో మచిలీపట్నం (బందరు)లో జన్మించారు. వీరి తల్లిదండ్రులకి ఇష్టం లేకపోయినప్పటికీ బ్రహ్మసమాజంలో చేరారు. దాని పట్ల ఆకర్షితుడై మచిలీపట్నంలోని నోబుల్ కాలేజీలో ఉపన్యాసకుడుగా పనిచేస్తున్నప్పుడు విద్యార్థులకు బ్రహ్మసమాజం గురించి, సంఘసంస్కరణకు సంబంధించి ఎన్నో ప్రసంగాలు చేశాడు. కాలేజీ యాజమాన్యంతో అభిప్రాయ బేధాలు వచ్చి ఉద్యోగ విరమణ చేసి సికింద్రాబాద్ వచ్చారు. దీనికి కారణం రఘుపతి వెంకటరత్నం నాయుడు క్రైస్తవ మతానికి విరుద్ధంగా ప్రసంగాలు చేస్తున్నాడని యాజమాన్యం భావించడమే. ఆయన తరువాత కాకినాడ చేరారు. కాకినాడ సంఘసంస్కరణోద్యమానికి ఆయువు పట్టు అయింది. వీరు ఒక అనాథ శరణాలయాన్ని పిఠాపురం రాజావారి సహాయంతో నడిపారు. అంతేగాక వీరేశలింగం గారి హితకారిణీ సమాజానికి కొంతకాలం అధ్యక్షులుగా పనిచేశారు. వీరు మద్రాసు శాసనసభ పరిషత్తు సభ్యులుగానూ, మద్రాసు విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షుడిగా కూడా పనిచేశారు. వీరు చేపట్టిన సంస్కరణలలో ముఖ్యమైనవి హరిజనోద్ధరణ, వేశ్యావృత్తి నిర్మూలన, వేశ్యా వివాహాలు, మద్యపాన నిషేధం మొదలైనవి. వీరు ఇద్దరు హరిజన బాలికల్ని స్వయంగా పెంచారు. వీరి భార్య మరణానంతరం తిరిగి వివాహం చేసుకోకుండానే

జీవితం గడిపారు. వీరు 1939లో మరణించారు.

వీరు 1882లో మచిలీపట్నం ప్రార్థనా సమాజాన్ని స్థాపించారు. విగ్రహారహితమైన ఆరాధన ప్రధాన ధ్యేయంగా ఈ సమాజం స్థాపించబడింది. పండిత శివనాథశాస్త్రి గారి బోధనల వల్ల వీరికి బ్రహ్మసమాజంపై ఆసక్తి కలిగింది. వీరు హిందూమత సిద్ధాంతాల్ని, క్రైస్తవ మత సిద్ధాంతాల్ని క్షుణ్ణంగా అధ్యయనం చేశారు. ఆస్తికత మీద, వేదాంతం మీద, సాహితీ విమర్శ మీద ఈయనతో సరితూగే వ్యక్తులు చాలా అరుదు. 1881లో వీరు 'ఏకేశ్వరోపాసన' సిద్ధాంతాన్ని వ్యాప్తి చేయటానికి 'బ్రహ్మ ప్రకాశిక', 'ఫెలో వర్కర్' పత్రికలను నడిపారు. అస్పృశ్యతను, పడుపు వృత్తిని ఈయన ప్రతిఘటించారు. వీరు కొందరు అనాథ బాలికలను పొన్నేరి స్టేషన్ నుండి తీసుకొచ్చి తన బిడ్డలుగా పెంచుకొన్నాడు. 'వీరు లేనిచో వారేమై ఉండే వాళ్ళు' అని ఒకరనగా, 'వాళ్ళు లేకపోతే నేనేమైయుండే వాడిని' అనగలిగిన ధీశాలి నాయుడుగారు. 1889 లో వీరి భార్య మరణించినా, 50 సంవత్సరాల పాటు వివాహం చేసుకోకుండా కఠిన బ్రహ్మచర్యాన్ని అనుసరించారు. హిందూ వితంతువుల మాదిరిగ ఉండాలని ఆయన ఎల్లప్పుడూ తెల్లటి దుస్తుల్నే ధరించేవారు. ఈవిధమైన వస్త్రధారణ వల్ల ఆయనకు 'ఆంధ్రదేశ శ్వేతాంబర ఋషి' అని పేరొచ్చింది.

వీరు 1904 నుండి 1909 వరకు పిఠాపురం రాజావారి కళాశాల ప్రిన్సిపాలు పదవిని చేపట్టారు. రాజావారు పూర్వం ప్రవేశపెట్టిన స్త్రీలకు - దళితులకు ఉచిత విద్యాప్రవేశం వంటి అభ్యుదయ చర్యల్ని నాయుడుగారు కొనసాగించారు. రాజావారు కళాశాల భవనాలకు, ఆటస్థలాలకు గానూ 35 ఎకరముల స్థలము, లక్షరూపాయలు విరాళంగా ఇచ్చారు. నాయుడుగారు తనకి రాజావారి కళాశాలతో ఉన్న అనుబంధాన్ని ప్రస్తావిస్తూ ఇలా అన్నారు. 'నా హృదయాన్ని అరంగుళం చీల్చి చూడండి, అక్కడ మీకు పిఠాపురం రాజాకళాశాల కన్పిస్తుంది' అన్నారాయన. రాజావారిచ్చిన విరాళంతో 1927లో కాకినాడ 'బ్రహ్మసమజ మందిరం', 'ఆంధ్రబ్రహ్మధర్మ ప్రచారక నిధి' ఏర్పాటైనాయి. తల్లితండ్రుల చేత విడిచిపెట్టబడిన శివువులను పెంచడం, సంఘం నుండి వెలివేయబడిన వారిని గౌరవంగా పోషించటం ఈ సమాజం ముఖ్య కర్తవ్యం. వీరు పెంచిన దళిత బాలబాలికలకు అగ్రకులాల వారితో వివాహాలు జరిపించారు. వితంతు పునర్వివాహం, స్త్రీ జనాభ్యుదయం, అస్పృశ్యతా నివారణ తన జీవిత పరమార్థంగా భావించి వాటి నిర్వహణ కొరకు అంకితమయ్యారు.

"రఘుపతి వెంకటరత్నం నాయుడుగారు గొప్ప సాహితీవేత్త. అంతకుమించి మంచి వక్త. వీరి ఉపన్యాసాలచే ఎందరో విద్యార్థులు ఉత్తేజితులయ్యారు. వారిలో దేవులపల్లి

కృష్ణశాస్త్రి, చలం, వేమూరి రామకృష్ణారావు, ముట్నూరి కృష్ణారావు, అయ్యదేవర కాళేశ్వరరావు, చిలకమర్తి లక్ష్మినరసింహం, పిళ్ళారశెట్టి సీతారామయ్య, ఆదిపూడి సోమనాథరావు, పెద్దాడరామస్వామి, కంభంపాటి రామశాస్త్రి (తారకం) మొదలైన వారు ముఖ్యులు. 1906లో రాజమండ్రి వాస్తవ్యులైన నాళం కృష్ణారావుగారు ఏలూరులో ఒక సమాజం స్థాపించారు. దానికి వెంకటరత్నం నాయుడుగారే శంకుస్థాపన చేశారు''. 1909లో పిఠాపురంలోనూ ఒక సమాజం స్థాపించబడింది. 1916లో ఆంధ్రబ్రహ్మమండలి స్థాపన జరిగింది. పిఠాపురం సంస్థానం వారి ద్రవ్యసహాయం, వెంకటరత్నం నాయుడిగారి దివ్యనాయకత్వం ద్వారా బ్రహ్మసమాజ వ్యవస్థ జయప్రధంగా సాగింది.''[13]

## ఉన్నవ లక్ష్మీనారాయణ (1873-1958):

గుంటూరు జిల్లా సత్తెనపల్లి తాలూకాలో వేములూరుపాడు గ్రామంలో 1873 డిసెంబర్ 4న జన్మించారు ఉన్నవ లక్ష్మీనారాయణగారు. వీరి తండ్రి శ్రీరాములు. వీరు సంస్కరణోద్యమానికి తనదైన పంథాలో కృషి చేసి విజయవంతుడయ్యాడు. ఈయన రాసిన 'మాలపల్లి' నవల సంస్కరణోద్యమ ప్రభావంతో వెలువడింది. వీరు ఐర్లండు వెళ్ళి డబ్లిన్ నగరంలో బారిష్టర్ చదివారు. స్వదేశం తిరిగి వచ్చి కొంతకాలం న్యాయవాదిగా పనిచేశారు. తరువాత దానిని వదిలిపెట్టి సంఘుసంస్కరణోద్యమానికి అంకితమయ్యారు. గుంటూరు వీరి సంస్కరణకి కేంద్రస్థానం. వీరు బ్రహ్మసమాజ మతావలంబికులు. వీరు ఎన్నో వితంతు వివాహాలు జరిపించారు. గుంటూరులో ఒక జాతీయ కళాశాలని ప్రత్యేకించి స్త్రీల కోసం స్థాపించారు.

వీరి సతీమణి ఉన్నవ లక్ష్మీబాయమ్మ. ఈవెు కూడా భర్తతో పాటు సంస్కరణోద్యమానికి కృషి చేసింది. వీరు కళాశాలలో హరిజన, క్రైస్తవ బాలికలకు కూడా ప్రవేశం కల్పించారు. ఉన్నవ లక్ష్మీబాయమ్మ కూడా గుంటూరులో 'శారదానికేతనాన్ని' స్థాపించి చనిపోయేంత వరకూ స్త్రీల అభివృద్ధి కోసం పాటుపడ్డారు.

'వీరు గుంటూరు క్రిస్టియన్ కళాశాలలో ఎఫ్.ఏ. పరీక్షలో ఉత్తీర్ణత సాధించారు. 1903లో ప్లీడర్ పరీక్షలో ఉత్తీర్ణులై గుంటూరులో ప్లీడరు వృత్తిని చేపట్టారు. వీరు 1913లో ఐర్లాండ్ వెళ్ళి డబ్లిన్ నగరంలో బారిష్టర్ చదివే రోజుల్లో వీరికి ఐర్లండు స్వాతంత్రోద్యమ నాయకులైన డివెలెరాతో పరిచయం ఏర్పడింది. అంతకు పూర్వమే వీరిలో నెలకొని ఉన్న

స్వాతంత్ర్య భావం మరింత పెరగటానికి వారి పరిచయం దోహదపడింది.

1920లో వీరు గాంధీ మహాత్ముని ఆదేశానుసారం బారిష్టర్ వృత్తిని పరిత్యజించి సహాయ నిరాకరణోద్యమాన్ని చేపట్టారు. 1921లో పల్నాటి పుల్లరి సత్యాగ్రహోద్యమాన్ని సాగించారు. ఫలితంగా అనేకసార్లు జైలుశిక్ష అనుభవించారు. వీరు 1905లో గుంటూరులో వితంతు శరణాలయం ఒకటి స్థాపించి 1907 వరకు దాన్ని నడిపారు. ఎంతోమంది వితంతువులకు వివాహాలు జరిపించారు. ఈయన 1922లో స్త్రీ విద్యా వ్యాప్తి ప్రధాన ధ్యేయంగా గుంటూరులో 'శారదానికేతనము'ను నెలకొల్పి, స్త్రీలకు సామాన్య విద్యతో పాటు, వృత్తి విద్యలో కూడా శిక్షణనిచ్చారు. ఇది వారి అభివృద్ధికి ఎంతగానో దోహదపడింది. ఉన్నవ వారు 1910లో ఏలూరులో జరిగిన కృష్ణా - గుంటూరు జిల్లాల సంయుక్త సభలో మొట్టమొదటి భాషా రాష్ట్రనిర్మాణాన్ని కోరుతూ తీర్మానాన్ని చేయించి మరుసటి ఏడాది విశాలాంధ్ర నిర్మాణానికి అఖండ ప్రచారం చేశారు. 1913లో బాపట్ల ఆంధ్ర మహాసభ ఆహ్వాన సంఘానికి కార్యదర్శిగాను, 1922లో చిత్తూరు ఆంధ్ర మహాసభకు అధ్యక్షులుగాను వీరు పనిచేశారు.

రాజకీయ పరిజ్ఞానంతో పాటు, ఆంధ్ర సాహిత్య తత్త్వ జిజ్ఞాస, ప్రజాహిత గ్రంథరచన, స్త్రీ విద్యాభ్యుదయ కాంక్ష వీరిలో ఒక్క రూపున మూర్తీభవించాయి.

వీరి రచనలలో అగ్రగణ్యం 'మాలపల్లి' అనే సాంఘిక నవల. అది ఆంధ్రదేశంలోని సమకాలీన రాజకీయ, ఆర్థిక, సాంఘిక, వైజ్ఞానిక పరిస్థితులకు ప్రతిబింబమైంది. 'మాలపల్లి'ని ఆనాటి బ్రిటీష్ ప్రభుత్వం నిషేధించింది. దానికి కారణం అది ప్రజల హృదయంలో ఎలాంటి విపరీత పరిణామాన్ని కలిగించునో అనే భయమే.

కానీ 'మాలపల్లి' సంఘంలో మార్పు తీసుకురావటానికి తోడ్పడిందేకాని, ప్రజలలో విప్లవ భావాలను రెచ్చగొట్టలేదు. తరాల నుండి సమాజంలో పేరుకుపోయిన కులతత్వాన్ని అంటరానితనాన్ని ఇది ప్రశ్నించింది. సమసమాజ నిర్మాణాన్ని ఇది కాంక్షించింది. దీనికి నిలువెత్తు నిదర్శనాలు సంగమదాసు, రామదాసు పాత్రలు.

'నాయకురాలు', 'భావతరంగాలు', 'స్వరాజ్య సోదే', 'బుడబుక్కల జోస్యం' మొదలైనవి వీరి ఇతర రచనలు. వీరు 'తిక్కన' నవలను రాయడం ప్రారంభించారు కానీ పూర్తి చేయలేకపోయారు. తిక్కన సాహిత్య విషయ విమర్శన రూపమైన ఆ కృషికి ఫలాన్ని అనుభవించే భాగ్యం ఆంధ్రులకు దక్కలేదు. వీరి సామాజిక కార్యకలాపాలలో అనుక్షణం తోడుగా నిలిచే సహధర్మచారిణి అన్నపదం సార్థకం చేసుకొన్న ఇల్లాలు లక్ష్మీబాయమ్మ.

వీరికి చిన్న వయస్సులోనే భార్యమరణం సంభవించింది. కానీ అది వీరి కార్యదీక్షకు మాత్రం భంగం కలిగించలేదు. వీరు జీవితాంతం ప్రజాసేవకు అంకితమయ్యారు. వీరు 1958 సెప్టెంబర్ 25వ తేదీన పరమపదించారు.

## నాళం కృష్ణారావు (1881 - 1961) :

నాళం కృష్ణారావు 1881 జనవరి 15న తూర్పుగోదావరి జిల్లా మండపేటలో నాళం కామరాజుగారికి కనిష్ఠ పుత్రుడుగా జన్మించారు. వీరు సంఘసంస్కరణే కాక సాహిత్యానికి కూడా విశేషంగా కృషి చేశారు. ఈయన 'మధురకవి'గా కీర్తి పొందాడు. బాలవాఙ్మయ పితామహుడుగా గుర్తింపు పొందాడు. చిన్న వయస్సు నుండీ వీరికి దయా హృదయం ఎక్కువ. పేదవారికి సేవచేయడానికి తన చదువును కూడా లెక్కచేయలేదు. ఈ పరిస్థితిని గమనించిన వీరి తండ్రి, కాకినాడలో ఉన్న తన మూడవ కుమారుడైన పద్మనాభం వద్దకు పంపి, విద్యాభ్యాసానికి ఏర్పాట్లు చేయించాడు. కాని అక్కడ కూడా చదువుపై శ్రద్ధ చూపక, ప్రజాహిత కార్యక్రమాల్లోనే ఎక్కువగా ఆసక్తి కనబరిచేవాడు. తరువాత రాజమండ్రి వచ్చినా వీరికి పాఠశాల విద్య ఏమాత్రం ఒంటబట్టలేదు. సాంఘిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ, గ్రంథాలయోద్యమంచే ఆకర్షితులయ్యారు. వీరు సేకరించిన కొన్ని గ్రంథాలతో 'శ్రీ వీరేశలింగం గ్రంథ భాండాగారం' అనే గ్రంథాలయాన్ని స్థాపించారు. అప్పటికే వీరు కందుకూరి వీరేశలింగంగారి సాంఘిక సేవా కార్యక్రమాలచే ఆకర్షితులయ్యారు. వీరు క్రమక్రమంగా పంతులుగారి అంతరంగిక శిష్యులుగానే కాక, కుడి భుజంగా ఉంటూ చాలాకాలం పనిచేసి, వితంతు వివాహ సంస్థలను స్థాపించి నిర్వహించారు. గౌతమీ గ్రంథాలయాన్ని ఆంధ్రదేశంలోనే ప్రముఖ పుస్తక భాండాగారంగా తీర్చిదిద్దడంలో వీరు అనేక కష్టనష్టాలను ఎదుర్కొన్నారు.

మానవసేవ' అనే సచిత్ర వారపత్రికను వీరు 1911 నుండి కొంతకాలం నడిపారు. ఆంధ్రదేశంలో ఇదే మొట్టమొదటి సచిత్ర మాసపత్రిక. బాలల జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు సరళమైన భాషలో తేటగీతి, ఆటవెలదులతో ఖండకావ్యాలను రాశారు. అవి : 'గోరు ముద్దలు', 'మీగడ తరకలు', 'తేనె చినుకులు', 'పాల తరగలు', 'విరిదండలు' మొదలైన రచనల ద్వారా వీరు బాలవాఙ్మయ పితామహులయ్యారు. ఇవేగాక తన పుత్రుని స్మృతి చిహ్నంగా 'పాపాయి' అనే కావ్యాన్ని 'ముద్దు' అనే భావకవితా సంపుటిని వెలువరించారు. ఇవే కాక సంఘసంస్కరణ దృష్టితో కొన్ని కావ్యాలు రాశారు. అవి 'స్త్రీ పట్ల పురుషులు చూపించే మహా పాతకాలు', 'వితంతు వివాహ చరిత్రం', 'మిత్రలేఖావళి'

(పద్యాత్మకం). వీరి సాహిత్య సేవకు గుర్తుగా ఆచార్య రాయప్రోలు సుబ్బారావుగారు వీరిని 'మధురకవి' బిరుదుతో సత్కరించారు.

నాళం కృష్ణారావుగారు ప్రబంధ ఉదాహరణలతో పదివేల సామెతలను, లోకోక్తులను, న్యాయాలను సేకరించి ప్రచురింప చేయించారు. తర్వాత అది 'శ్రీకృష్ణ దేవరాయాంధ్ర సాహిత్య విజ్ఞాన సర్వస్వం' అనే పేరుగల 800 పుటల బృహత్ గ్రంథం అయింది. ఆ గ్రంథాన్ని కృష్ణారావు మరణానంతరం (1961) వారి కుమార్తె ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ ప్రచురించారు. వీరి అర్ధాంగి సుశీలమ్మ ఆంధ్ర మహిళా సభను స్థాపించి, స్త్రీల అభివృద్ధికోసం కృషి చేశారు. ముందుగా వీరు వీరేశలింగంగారు స్థాపించిన ప్రార్థనా సమాజానికి, పురమందిరానికి కార్యదర్శిగా వ్యవహరించారు. వీరు ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘ ప్రథమ కార్యదర్శిగా పనిచేసి, ఆ ఉద్యమ వ్యాప్తికి తోడ్పడ్డారు. ఈవిధంగా అనేక రంగాలలో ప్రముఖ పాత్ర పోషించిన ఇంతటి ప్రతిభా పాటవాలు కలిగిన నాళం కృష్ణారావుగారి సేవలు నిరంతరం చిరస్థాయిగా నిలిచిపోయాయనడంలో సందేహం లేదు.

## సూర్యారావు బహద్దర్ (రావు వెంకటకుమార మహీపతి)(1885-1965) :

సర్వజ్ఞ సింగభూపాలుని వంటి పండిత ప్రభువులచే విస్తృతమైన 'రావు' వంశంలో పిఠాపురంలో 1885 అక్టోబర్ 5న జన్మించారు. వీరి తండ్రి గంగాధర రామారావు. వీరి తండ్రిగారు ప్రఖ్యాతిగాంచిన చాటు కథలకు నాయకుడు. తండ్రి ఏడుగురు భార్యలను వివాహమాడినా సంతానం కలుగనందున వెంకటగిరి రాజవంశం నుంచి ఒక బాలుని దత్తత చేసుకొన్న తరువాత మహారాణి మంగమాంబాదేవికి సూర్యారావు బహద్దర్ జన్మించారు. వీరి ఐదవ ఏటనే తండ్రిని, ఆరోవ ఏట తల్లిని కోల్పోయారు. వీరు మద్రాసు నెవింగ్టన్ కాలేజీలో చదివి ఇంగ్లీషులోనే కాక, సంస్కృతాంధ్రాలలో కూడా మంచి పాండిత్యాన్ని సంపాదించారు. చిన్ననాటి గురువైన మొక్కపాటి సుబ్బారాయుడు గారే వీరిని తరువాత కాలంలోనూ నిరాడంబరులైన వ్యక్తిగా మలిచారు. అలెగ్జాండర్‌కు అరిస్టాటిల్ ఎట్టివారో, వీరికి మొక్కపాటి సుబ్బారాయుడు అలాంటివారు. ఆంధ్ర సాహిత్య పోషకులలో రాజరాజనరేంద్రుడు, కృష్ణదేవరాయులు వంటి విద్వత్ ప్రభువుల కోవకు చెందిన వారు వీరు. వీరి సంస్థానానికి వచ్చే ఆదాయంలో అధిక భాగం ఆంధ్ర సాహిత్య పోషణకు వెచ్చించారు. ఆయన కొలువుకూటంలో సుప్రసిద్ధ నాటక కర్త పానుగంటి లక్ష్మీనరసింహారావుగారే కాక, శ్రీపాద లక్ష్మీనరసింహశాస్త్రి (న్యాయం), దెందులూరి

నరసింహశాస్త్రి (వేదాంతం), మహామహోపాధ్యాయ తాతా సుబ్బరాయశాస్త్రి (వ్యాకరణ), గుదిమెళ్ళ వెంకటరంగాచార్యులు (విశిష్టాద్వైత్యం), తుమురాడ సంగమేశ్వరశాస్త్రి (వీణ) మొదలైన హేమహేమీలున్నారు. వోలేటి పార్వతీశం, దేవులపల్లి వెంకట కృష్ణశాస్త్రి, వెంకట రామకృష్ణకవులు, వేదం వేంకటరాయశాస్త్రి మొదలైన సుమారు 48 మంది కవి పండితుల రచనలకు వీరు కృతిభర్తై ఆ కృతుల ప్రకటనకు కారణభూతులయ్యారు. ఇవేకాక పానుగంటి రాసిన 'సాక్షి' వ్యాసాలు ఆరు సంపుటాలను, నాటకాలను అన్నిటిని వీరే ప్రకటించారు. ఆరోజుల్లో మొదటి రోటరీ ముద్రణ యంత్రం, చిన్నమాంబా ముద్రాలేఖిని వంటి వాటి ద్వారా తెలుగు సాహిత్య ప్రచారానికి వీరు చేసిన సేవ సాటిలేనిది. ఆంధ్ర సాహిత్య పరిషత్, ఆ పరిషత్ ప్రకటిస్తున్న పత్రిక వీరి కీర్తికి చిహ్నాలు. 'తెలుగు భాషకు సమగ్రమైన నిఘంటువును తయారు చేయించటానికి వీరు చేపట్టిన కృషి ఫలితమే ఎనిమిది బృహత్ సంపుటాలలో వెలువడిన సూర్యారాయాంధ్ర నిఘంటువు. వీరు ఈ నిఘంటు నిర్మాణం కొరకు సుమారు మూడు లక్షల రూపాయల వ్యయం భరించారు. కాని వీరి జీవితకాలంలో ఆ నిఘంటు నిర్మాణం పూర్తి కాకపోవటం దురదృష్టకరం.

వీరు గొప్ప విద్యాపోషకులే కాక, పండితులు కూడా. వీరు ఆంగ్లంలోను, ఆంధ్రంలోను చక్కని రచన చేశారు. వివిధ పత్రికలలో పుస్తకాలకు ఉపోద్ఘాతాలుగా వీరు రాసిన వ్యాసాలన్నీ తరువాత కాలంలో గ్రంథరూపాన్ని పొందాయి. వీరు కొంతకాలం రాజకీయాలలో కూడా సేవలందించారు. బ్రహ్మసమాజం, హరిజనోద్ధరణ, స్త్రీ విద్య వంటి పలు సంఘసంస్కరణోద్యమాలను నిర్వహించారు. ఇతడు ఇతర సంస్థానాధిపతుల వలె తన ధనాన్ని లాభాన్ని సమకూర్చే వ్యాపారాలలో పెట్టుబడిగా పెట్టకుండా దానధర్మాల కోసమై వెచ్చించారు. కానీ దానధర్మాల వల్ల అప్పుల పాలై తన 'డంకన్‌హాస్'ను చెన్నైలోని 'గులాబి' భవనాన్ని కానూరులోని 'రోజరీ' భవనాన్ని కూడా అమ్ముకోవలసి వచ్చింది. పూలమ్మిన చోటనే కట్టెలమ్మే పరిస్థితి ఎదురైంది. వీరు 1964లో పిఠాపురంలో కన్నుమూసారు.

## దరిశి చెంచయ్య(1890-1964):

ఈయన విప్లవవాది, స్వాతంత్ర్య సమరయోధుడు మాత్రమే కాక సంఘసంస్కర్త కూడా. వీరు వెంకట సుబ్బయ్య దంపతులకు ప్రకాశం జిల్లా కనిగిరిలో జన్మించారు. ప్రాథమిక విద్య కనిగిరిలోనూ, హైస్కూల్ విద్య ఒంగోలులోని మిషన్ స్కూల్‌లో పూర్తి చేశారు. తరువాత చెన్నైలోని పచ్చయ్యప్ప కళాశాలలో ఇంటర్మీడియట్ చదివారు. చిన్నప్పటి

నుండే వీరిలో సంఘసంస్కరణ పట్ల అభిలాష ఎక్కువగా ఉండేది. ఆ అభిలాషే వీరిని బ్రహ్మసమాజ సభ్యునిగా చేసింది. వీరు పై చదువుల కోసం అమెరికా వెళ్ళారు. అందుకు అప్పుచేసి ధనాన్ని సమకూర్చుకున్నారు. అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్‌కో నగరానికి పోయి, అక్కడి విద్యాలయంలో బి.ఎస్.సి (వ్యవసాయ శాస్త్రం) పట్టా కొరకు కృషి చేశారు. ఆ సమయంలో వీరికి అక్కడ ఉన్న దేశభక్తులైన కొందరు సిక్కులతో పరిచయం ఏర్పడింది. అది మొదటి ప్రపంచ యుద్ధానికి సంసిద్ధమౌతున్న కాలం. ఆ దేశ భక్తులకు భారతదేశంలోని బ్రిటీష్ ప్రభుత్వాన్ని కూలద్రోయవలెనని సంకల్పం కలిగింది. వారికి దేశభక్తి ప్రబోధించడంలో భారతీయుడైన, అమెరికాలో ప్రవాసిగా ఉంటున్న లాలా హరదయాళ్ ప్రముఖ పాత్ర పోషించాడు. దాని ఫలితంగా రూపొందిందే గద్దర్ పార్టీ. దానిలో దరశి చెంచయ్య సభ్యుడై ఆయుధ ప్రయోగంలో తగు శిక్షణ పొందాడు. ఆ గద్దర్ పార్టీ శాఖలు యూరప్ దేశాలలోనూ, భారత్‌లోనూ దేశభక్తులను రహస్య స్థావరాల ద్వారా ప్రోత్సహించాయి. ఆయా శాఖలకు విప్లవ సాహిత్యాన్ని పంపించటానికి 'గదర్' అనే పేరుతో ఒక వార్తా పత్రిక శాన్‌ఫ్రాన్సిస్‌కో నుండి వెలువడింది. దానిని ఆయా ప్రదేశాలకు పంపించే బాధ్యత చెంచయ్యగారు నిర్వహించారు.

మొదటి ప్రపంచ యుద్ధకాలంలో, మొదటి బర్మాలోని భారతీయ సేనలలో తగు ప్రచారం చేసి, తిరుగుబాటు లేవదీసి, ఆ సేనల సాయంతో భారతదేశంలో బ్రిటీష్ ప్రభుత్వాన్ని కూలద్రోయవలెననే వ్యూహాన్ని గదర్ పార్టీ నిర్ణయించింది. ఆ కార్యాన్ని సాధించటానికి పార్టీ సభ్యులను కొందరిని పంపింది. వారిలో చెంచయ్యగారు కూడా ఉన్నారు. సయామ్ ద్వారా భూమార్గం నుండి బర్మాకు చేరవలెనని వీరు ప్రయత్నించారు. కానీ గద్దర్ పార్టీ ఇలాంటిది ఏదో ఒక ఎత్తు వేస్తుందని బ్రిటీష్ పాలకులు ముందుగా గుర్తించి తగు జాగ్రత్తలు తీసుకోవటం వలన వీరు సింగపూర్‌లో బ్రిటీష్ ప్రభుత్వానికి బందీగా చిక్కారు (ఆగష్టు 1915). వీరిని కొంతకాలం సింగపూర్, బాంగ్‌కాక్ జైళ్ళలో ఉంచి ఆ తరువాత భారత ప్రభుత్వం స్వదేశానికి తీసుకొని వచ్చి క్రమంగా కలకత్తా, లాహోర్, ఢిల్లీ, కన్ననూర్, కోయంబత్తూర్, వెల్లూరు జైళ్ళలో మొత్తం నాలుగున్నర సంవత్సరాలు ఉంచారు. ఆ నిర్బంధకాలంలో ప్రభుత్వం వీరిని కనీవినీ ఎరుగని ఘోరహింసలకు గురిచేసింది. అందువల్ల వీరి ఆరోగ్యం క్షీణించింది. యుద్ధం ముగిసి ఒకటిన్నర సంవత్సరం గడిచిన తరువాత, పలువురు ప్రజానాయకుల ఆందోళనలకు తలవంచి 1920లో బ్రిటీష్ ప్రభుత్వం ఆయన్ని విడుదల చేసింది (3-1-1920). జైలు నుండి విడుదలైన వీరు జీవిత పునరావాస సమస్య,

దారిద్ర్యాన్ని ఎదుర్కొన్నారు. చివరకు అనిబిసెంట్ ఆధ్వర్యంలోని దివ్యజ్ఞాన సమాజ కళాశాలలో వీరికి లెక్చరర్ ఉద్యోగం లభించింది. రాజకీయ అభిప్రాయ వైరుధ్యం వల్ల త్వరలోనే ఆయన ఉద్యోగాన్ని వదిలి, సంఘసంస్కరణకు నడుం బిగించారు. వేశ్యా వివాహాలు, రజస్వలానంతర వివాహాలు, అనాధ శిశువులకు, పతితలకు రక్షణ సంస్థల స్థాపన, సహపంక్తి భోజనాలు, స్త్రీ విద్య, హరిజనోద్ధరణ, తాలింఖానాల స్థాపన మొదలైన వివిధ కార్యక్రమాలను వీరు చేపట్టి నిర్వహించారు. ఆ సందర్భంలో వీరు ఎన్నో అవరోధాలను ఎదుర్కొని, స్థిరచిత్తంతో పనిచేశారు. 1940 వరకు వీరు కాంగ్రెస్ సోషలిస్టు పార్టీలో సభ్యులుగా చేరి, సోషలిస్టు భావాల వ్యాప్తికై కృషి చేశారు. కానీ క్రమంగా రష్యాలో రూపొందుతున్న నవసమాజం వీరి దృష్టిని ఆకర్షించింది. తరువాత వీరు భారత కమ్యూనిస్టు పార్టీలో చేరి, అనేక కార్మిక సంఘాలకు నాయకత్వం వహించి, వారి కోసం పోరాడారు. అందువల్లనే ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడటం వలన మూడున్నర ఏళ్ళు కారాగారంలో గడపవలసి వచ్చింది. వీరు 1949లో రాజకీయాల నుండి తప్పుకొన్నారు. 'నేనూ, నా దేశమూ' అనే పేరుతో స్వీయ చరిత్రను రాశారు. వీరు 1964లో పరమపదించారు.

## కనుపర్తి వరలక్ష్మమ్మ (1896-1978) :

సమాజ శ్రేయస్సుకోరి, అందులోనూ సగభాగమైన స్త్రీల పరిస్థితిని మెరుగు పరిచేందుకు వారిని అన్ని రంగాల్లో పైకి తీసుకురావాలనే తపనతో తన ప్రసంగాలు, ఉపన్యాసాలు, రచనల ద్వారా తుది శ్వాస వరకు కృషి చేసిన స్త్రీ మూర్తి శ్రీమతి కనుపర్తి వరలక్ష్మమ్మ. ఈమె 1896 అక్టోబర్ 6వ తేదీన గుంటూరు జిల్లా బాపట్లలోని పాలపర్తి హనుమాయమ్మ, శేషయ్యలకు జన్మించారు. రామమూర్తి, నరసింహం, భావనారాయణ, ఆంజనేయులు, కృష్ణమూర్తి ఈమెకు సోదరులు. సుబ్బలక్ష్మమ్మ, అనసూయ అక్కాచెల్లెళ్ళు.

ఆ కాలంలో స్త్రీలకు చదువంటే ఏమిటో తెలియదు. ఒకవేళ తెలిసినప్పటికీ కూడా చదువుకోవటానికి వారికి అవకాశం కల్పించేవారు కాదు. కేవలం స్త్రీని వంటింటికే పరిమితం చేసేవారు. చదువులు పురుషులకే అన్న అభిప్రాయం ఉండేది. ఈమె తండ్రి పాలపర్తి శేషయ్య దృష్టిలో ఆడపిల్లలకు చదువు అవసరం లేదనే అభిప్రాయం ఉండేది. ఆమె తల్లికి మాత్రం కూతురు చదువుపట్ల ఆసక్తి ఉండేది. ఈమె అన్నల సహకారంతో నాలుగో తరగతి పూర్తి చేసింది. ఈమె బాల్యం నుంచే కనపడ్డ కాగితమెల్లా చదివేది. ఇంటికి

వచ్చిన పత్రికలు, పుస్తకాలు వేటినీ వదిలేది కాదు. వీరేశలింగం పంతులుగారి గ్రంథాలు, చిలకమర్తి నవలలు, విజ్ఞాన చంద్రికా గ్రంథమండలివారి పుస్తకాలు, 'సావిత్రి' అనే మాస పత్రికను సోదరులు తెస్తూ ఉండేవారు. ఈమె వాటన్నిటినీ శ్రద్ధగా చదివేది. ఈమె సోదరుడు నరసింహం వీరేశలింగం వ్యాస సంపుటిని తెచ్చి రోజుకో వ్యాసం చదివి, దాన్ని నీ సొంత మాటలలో రాసి చూపమని ప్రోత్సహించేవారు. ఈమె అలాగే చదివి, సొంత మాటలలో రాసి చూపేది. ఆయన వాటిని చదివి తప్పులు సవరించి, తన అభిప్రాయాన్ని దానిమీద రాసేవాడు. ఇలా అన్న నరసింహం సాయంతో చదవడం, రాయడం వరలక్ష్మమ్మ చక్కగా నేర్చుకుంది.

ఈమె ఎన్నో వ్యాసాలు పత్రికలకు పంపగా, అవి ఉత్తమ వ్యాసాలుగా ఎంపికై పతకాలను అందుకొనే స్థాయికి ఈమెని చేర్చాయి. ఆ వ్యాసాలు సమాజంలోని మూఢాచారాలను, అజ్ఞానాన్ని నిర్మూలించేందుకు జ్ఞాన దీపికలైయ్యాయి. వరలక్ష్మమ్మ పెద్దన్న రామమూర్తి గారు గుంటూరులో వనితాగ్రంథ మండలిని స్థాపించారు. ఈ గ్రంథాలయంలోని పుస్తకాల లెక్కలు వరలక్ష్మమ్మ రాస్తూ ఉండేది. ఈమె ఆ గ్రంథాలయానికి వచ్చే కొత్త పుస్తకాలను అప్పటికప్పుడే ఎంతో ఆసక్తితో చదువుతూ ఉండేది. ఈమె ఆ విధంగా వేయి పుస్తకాలపైన చదివింది. ఈమె అత్తవారింటికి వెళ్ళేటప్పుడు నరసింహంగారు 'శబ్దార్థ చంద్రిక' అనే తెలుగు నిఘంటువును బహూకరించాడు. ఆ అమూల్యమైన కానుక సహాయంతో ఈమె ఎన్నో గ్రంథాలు స్వయంగా చదవగలిగారు.

ఆ రోజుల్లో నరసాపురం తాలూకా అభివృద్ధి సంఘం వారు స్త్రీల కోసం బహుమతి పరీక్షలు జరిపారు. వరలక్ష్మమ్మ నరసింహంగారి ప్రోత్సాహంతో ఆ పరీక్షలకు చదివి స్వర్ణపతకం గెలుచుకొని అన్న మాటను నిలబెట్టింది. ఈవిధంగా ఈమె 'డిగ్రీలు' లేని పాండిత్యాన్ని సంపాదించింది

ఈమెకు కనుపర్తి హనుమంతరావుతో 1909లో వివాహం జరిగింది. హనుమంతరావు సంస్కార హృదయుడు. ఆయన రాజమండ్రిలో చదువుకొనే రోజుల్లో కందుకూరి సంస్కరణోద్యమంతో ప్రభావితుడయ్యాడు. స్త్రీ విద్యపట్ల గాఢమైన అభిమానం ఏర్పరచుకొన్నాడు. ఆయన రాజమండ్రి నుండి వస్తూ ఎన్నో విలువైన పుస్తకాలను తెచ్చి వరలక్ష్మమ్మకు బహూకరించేవారు. రచనా విషయంలోనేకాక, ఉపన్యాసాలిచ్చే విషయంలో కూడా వరలక్ష్మమ్మకు భర్త ప్రోత్సాహం అపారంగా లభించింది.

తరువాత కాలంలో ఇది ఆమెను ఎన్నో రచనలు చేయడానికి ప్రోత్సాహాన్ని కల్పించింది. ఈ ఉత్సాహంతో, ఈమె 'సౌదామిని' అనే కలం పేరుతో 'అనసూయ' పత్రికకు ఒక కథను రాసి పంపారు. ఇది ఆమె మొట్టమొదటి కథ. తర్వాత ఇది ఆమె రచనా వ్యాసంగాలకు ద్వారం తెరచినట్లయింది. లక్కబరిణి, ప్రేమలత, స్వీయచరిత్ర, కనకవల్లి, మృతజీవులతో సంభాషణ మొదలైన కథలు రాసి 'అనసూయ' పత్రికకు వీరు పంపించారు.

సాహిత్యంలో లేఖా ప్రక్రియ ఒకటి. ఈ లేఖల ద్వారా సమాజాన్ని సరిదిద్దడానికి రచయితలు కృషి చేశారు. వారిలో కనుపర్తి వరలక్ష్మమ్మ గారు ఒకరు. వీరు రాసిన 'శారదాలేఖలు' కేవలం కాలక్షేపాలే కాదు, విజ్ఞానదాయకాలు కూడా. స్నేహితులతో సంభాషణ చేస్తున్నట్లు వీరు లేఖలు రాశారు. ఆనాటి సమాజంలోని పలు విషయాలు వారి సంభాషణలో చర్చనీయాంశాలు అయ్యాయి. అవే శారదాలేఖలుగా అక్షరరూపాన్ని పొందాయి.

కల్పలత' అనే స్నేహితురాలికి 'శారదా' రాసినట్లుగా ఈమె లేఖలు రాసింది. 1928లో 'గృహలక్ష్మి' ప్రథమ సంచికలోనే మొదటి శారదాలేఖ ప్రచురింపబడింది. నాటినుండి 1934 వరకు ఆమె వ్యాసాలు గృహలక్ష్మి పత్రికలో ధారావాహికంగా వెలువడ్డాయి.

ఈమె 1922 ప్రాంతంలో 'మా చెట్టు నీడ ముచ్చట్లు' అనే శీర్షికతో కొన్ని వ్యాసాలు 'లీలావతి' అనే కలం పేరుతో ఆంధ్ర పత్రికకు పంపారు. మంగళాంబ, కనకమ్మ, కళ్యాణి, సూరమ్మ, వరలక్ష్మమ్మలవే ఈ ముచ్చట్లు. వీళ్ళు తమ, తమ ప్రాంతాల యాసలతో వివిధ విషయాలపై చర్చించిన అంశాలే ఈ ముచ్చట్లు. ఇవి కాలక్షేపం కోసం రాసినవి మాత్రమే కాదు. సమాజానికి ఆమె అందించిన కాంతిరేఖలు.

అప్పటి వరకూ సాహిత్యరచనలు, ప్రసంగాలు చేసే వరలక్ష్మమ్మగారు స్త్రీలలో చైతన్యం తీసుకురావడం కోసం అనేక మహిళా సభలు నిర్వహించారు. వీటివల్ల ఆమెకు గాంధీ వంటి ప్రముఖులతో పరిచయం ఏర్పడింది. బెజవాడలో 1929లో మహిళా సభలు జరిగాయి. వరలక్ష్మమ్మ మిత్రురాలు శ్రీమతి పాటిబండ్ల త్రిపుర సుందరమ్మ, వాటిలో ఆమెను పాల్గొనవలసిందిగా ఉత్తరం రాసింది. వరలక్ష్మమ్మ బెజవాడకు బయలుదేరి వెళ్ళింది. అన్ని జిల్లాల నుండి చాలామంది మహిళలు వచ్చారు. ఆ సభలోనే వరలక్ష్మమ్మగారికి మొట్టమొదటి సారిగా శ్రీమతి దుర్గాబాయిదేశ్‌ముఖ్‌ను కలిసే అవకాశం లభించింది.

అంతేగాక బందరులో (మచిలీపట్నం) మూడవ ఆంధ్ర మహిళా సభ జరిగింది. ఆ సభకు 11 జిల్లాల నుండి ఎందరో మహిళా ప్రతినిధులు వచ్చారు. ఆ సభలో వరలక్ష్మమ్మ విడాకుల చట్టంపై ప్రసంగించి పలువురి ప్రశంసలు అందుకొన్నది.

వరలక్ష్మమ్మగారు స్త్రీల కోసం 'స్త్రీ హితైషిణీ మండలి'ని ఏర్పాటు చేసి, దాని ద్వారా బాలబాలికలతో నాటకాలు ప్రదర్శింపచేయించి స్త్రీల అభ్యుదయానికి ఎంతగానో కృషి చేశారు. బాలికలను ఉత్సాహపరిచేందుకు బహుమతులు కూడా ఇచ్చేవారు. వరలక్ష్మమ్మ అన్నగారైనా రామమూర్తి గుంటూరులో స్త్రీల కోసం ప్రత్యేకించి, 'వనితా గ్రంథమండలి' నడిపేవారు. ఈ గ్రంథాల పరిచయం ఆమెను విజ్ఞానవంతురాలిని చేశాయి. ఆ వెలుగును ఆమె మరెందరికో అందించడానికి స్త్రీ హితైషిణీ మండలి ద్వారా వరలక్ష్మమ్మగారు నిరంతరం కృషి చేశారు.

1934 ఫిబ్రవరి 20వ తేదీన సొసైటీల ఆక్టు ప్రకారం మండలి రిజిష్టరు అయింది. జాగర్లమూడి కుప్పుస్వామి చౌదరి గుంటూరు జిల్లా బోర్డు అధ్యక్షులుగా ఉండగా మండలికి భవనం నిర్మించడానికి 20 సెంట్లు భూమిని కూడా మంజూరు చేశారు. స్త్రీహితైషిణీ మండలిని ఈమె తన పుత్రికగా భావించేవారు. నిస్వార్థమైన సేవ, విజ్ఞానం, వివేకం కలగలసిన వరలక్ష్మమ్మగారు 13-8-1978న బాపట్లలోని తమ స్వగృహంలో కన్నుమూసారు. కానీ ఆమె నిలిపిన వెలుగుదివ్వెలు ఆనాడేకాదు ఏనాటికైనా తమ కాంతిని వెదజల్లుతూనే ఉంటాయి.

## సంగెం లక్ష్మీబాయమ్మ (1910-1979):

'ఈమె 1910లో జన్మించారు. ఆంధ్రపితామహ మాడపాటి హనుమంతరావు ప్రోత్సాహంతో గుంటూరులో ఉన్నవ లక్ష్మీనారాయణ దంపతులు నడుపుతున్న శారదానికేతనంలో చేరి దీక్షతో చదివి విద్వాన్ పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు. ఈమె ఉప్పు సత్యాగ్రహం సమయంలో గుమ్మిడిదల దుర్గాబాయితో వెళ్ళి సత్యాగ్రహోద్యమంలో పాల్గొని రాయవేలూరు జైలులో నిర్బంధించబడ్డారు. ఈమె హిందీ భాషలో మంచి పాండిత్యం కలవారు. ఈమె 'సాహితి', 'విదుషి' అనే పట్టాలను పొందారు. చెన్నై నుండి చిత్రకళారంగంలో (డ్రాయింగ్) డిప్లమో సంపాదించారు. ఈమె ప్రైవేటుగా 'కార్వే' యూనివర్సిటీలో విద్యనభ్యసించి డిగ్రీ పట్టా పొందారు. ఈమె గుల్బర్గా బాలికా పాఠశాలలో కొంతకాలం డ్రాయింగ్ టీచర్‌గా ఉద్యోగం చేశారు. తరువాత నారాయణగూడాలోని బాలికోన్నత పాఠశాలలోని బాలికల వసతి గృహానికి వార్డెన్‌గా కూడా పనిచేశారు. హైదరాబాద్ రాష్ట్రంలో బూర్గుల రామకృష్ణారావు మంత్రి వర్గంలో ఈమె విద్యాశాఖకు ఉపమంత్రిణిగా పదవీ బాధ్యతలు నిర్వహించారు. శాసనసభ సభ్యురాలిగా ఉండగానే మలక్‌పేటలో తన

స్వగృహంలో బాలికలకు స్త్రీ సదనాన్ని ప్రారంభించారు. వీరు అందులో అనాథ స్త్రీలకు, శిశువులకు ఉచిత భోజన వసతి కల్పించి వారికి వృత్తి విద్యలలో శిక్షణను ఇప్పించి, వారికి స్వయంఉపాధి మార్గాన్ని ఏర్పరిచారు. అది క్రమంగా ఇందిరా సేవా సదనంగా మారి, మాసెట్టి హనుమంతగుప్త బాలబాలికల ఉన్నత పాఠశాలగా వృద్ధి చెందింది. ఇందిరా సేవా సదనంలో బాలికలకు ప్రాథమిక వృత్తి శిక్షణ, సంగీత నృత్య తరగతులు, వ్యవసాయక్షేత్రం, పాల ఉత్పత్తి కేంద్రం, కోళ్ళ పెంపకశాల, ప్రాచ్యకళాశాల, వసతి గృహం నిర్మించబడ్డాయి. ఈమె 1950 నుండి 1954 వరకు శాసనసభ సభ్యురాలిగానూ, పద్నాలుగేళ్ళ పాటు పార్లమెంటు సభ్యురాలిగానూ పదవులు చేపట్టారు. ఆచార్య వినోబా భావే మొట్టమొదటిసారిగా తెలంగాణాలో పర్యటన చేసినపుడు ఈమె వారి వెంట ఉండి, వారి ఉపన్యాసాలను తెలుగులోకి అనువదించారు. భావే తెలంగాణాలో ముగ్గురు సభ్యులతో ఒక కమిటీని వేశారు. అందులో ఈమె కూడా ఒకరు. స్వాతంత్ర్య సమరయోధురాలిగా సేవలందించి ఈమె భారత ప్రభుత్వ తామ్రపత్రాన్ని పొందారు. సంఘ సేవకురాలిగా, బహు భాషాకోవిదురాలిగా ప్రజల మన్ననల్ని అందుకొన్నారు. ఈమె 1979లో జూన్ 2వ తేదీన కాలం చేశారు.

### ఈశ్వరీ బాయి జె. (1918-1991) :

పూర్వం హైదరాబాద్ సంస్థానంలోనూ, తరువాత ఆంధ్రప్రదేశ్‌లోను సామాజిక సేవా రంగంలో గణనీయమైన కృషి చేసిన స్త్రీ మూర్తి ఈమె. ఈశ్వరీబాయి ధైర్యసాహసాలు గల ప్రజానాయకురాలు. ఈమె బలహీన వర్గాలు, ముఖ్యంగా దళిత ప్రజల హక్కుల సాధన కోసం ఎన్నో పోరాటాలు జరిపారు. ఈమె మొదటి నుంచి బాబా సాహెబ్ అంబేద్కర్ మార్గంలో నడిచేది. వారి సిద్ధాంతాలను, ఆశయాలను బాగా అధ్యయనం చేసి, వాటి సాధనకై అహోరాత్రులు కృషి చేశారు.

ఈమె 1918 డిసెంబర్ 1వ తేదీన సికింద్రాబాద్‌లో ఒక సామాన్య హరిజన కుటుంబంలో జన్మించారు. తండ్రి బల్లెపు బలరామస్వామి, తల్లి రాములమ్మ. ఈమె ప్రాథమిక విద్యాభ్యాసం ఎస్.పి.జి. మిషన్ హైస్కూలులోనూ, ఉన్నత విద్యాభ్యాసం కీస్ హైస్కూలులోనూ జరిగింది. ఆనాటి హిందూ సంప్రదాయాన్ని అనుసరించి ఈమెకు తల్లితండ్రులు పదమూడవ ఏటనే డాక్టర్ జె.లక్ష్మీనారాయణగారితో వివాహం జరిపించారు. ఈశ్వరీబాయ్ సికింద్రాబాదులోని ఒక ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా కొంతకాలం పని చేశారు. ఈమెకు హిందీ, తెలుగు, ఉర్దూలతో పాటు మరాఠీ భాష కూడా వచ్చు.

ఈమె తరతరాల నుంచి సమాజంలో పీడనకు గురౌతున్న బానిసత్వంలో మగ్గుతున్న ప్రజలకు విముక్తి కలిగించడానికి ఎంతో కృషి చేశారు. దళిత ప్రజల ఆశలు, ఆకాంక్షలు తీర్చడం కోసం రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా జరిపిన పోరాటాలలో కీలకపాత్ర వహించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఆ పార్టీని బలోపేతం చేయటానికి నిరంతరం శ్రమించారు.

వీరు 1951లో ప్రప్రథమంగా జంట నగరాల పురపాలక సంఘం సభ్యురాలిగా ఎన్నిక కావటంతో, అది ఈమెకు రాజకీయ రంగప్రవేశం కల్పించినట్లయింది. 1967లో జరిగిన సాధారణ ఎన్నికలలో ఈమె నిజామాబాద్ జిల్లా "ఎల్లారెడ్డి" నియోజక వర్గం నుంచి శాసనసభకు పోటీ చేసి ఎన్నికయ్యారు. "రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా" అభ్యర్థులు ఇద్దరు మాత్రమే ఆ ఎన్నికలలో రాష్ట్ర శాసనసభకు ఎన్నికయ్యారు. ఒకరు ఈశ్వరీబాయి, రెండవ వారు తూర్పు గోదావరి జిల్లా అల్లవరం నియోజక వర్గం నుంచి ఎన్నికైన బి.వి. రమణయ్యగారు. శాసనసభలో సభ్యురాలిగా ఉన్న పది సంవత్సరాల కాలంలో ఈమె వివిధ ప్రజా సమస్యలపై పలు పర్యాయాలు శాసనసభలో స్వల్ప వ్యవధి ప్రశ్నలు వేసి, ప్రజల సమస్యలు పరిష్కరించటానికి కృషి చేశారు. గ్రామాలలోని బలహీన వర్గాలు, వ్యవసాయ కూలీలు, నిరుపేదలపై భూస్వాములు జరిపే అత్యాచారాల గురించి, షెడ్యూల్డు కులాల ప్రజలకు బంజరు భూములు పంపిణీ చేసే విషయం, నాన్‌గెజిటెడ్ ఉద్యోగుల జీతభత్యాల సమస్యలు, మహిళా సంక్షేమ శాఖలో అక్రమాలు, తుఫాను బాధితుల సహాయ పునరావాస కార్యక్రమాలు వంటి అనేక అంశాలపై ఈమె ప్రతేక శ్రద్ధ వహించారు.

1977లో వీరు అమలాపురం నియోజక వర్గం నుంచి పార్లమెంటుకు పోటీ చేశారు. కానీ ఓటమి పాలయ్యారు. ఈమె అధికారంలో ఉన్నా లేకపోయినా పేదప్రజల పక్షాన నిలిచి వారి హక్కుల కోసం పోరాటాలు జరిపారు. ఈమె ఆంధ్రప్రదేశ్‌లో వివిధ సందర్భాల్లో జరిగిన ప్రజాఉద్యమాల్లో క్రియాశీలక పాత్ర వహించారు. ఆంధ్రప్రదేశ్‌లో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా పార్టీ స్థాపనలోను, నిర్వహణలోను ఈమె ప్రధాన పాత్ర వహించి, ఆ పార్టీలో ఉన్నత పదవులు నిర్వహించారు. వీరు 1952 నుంచి 1990 వరకు నాలుగు దశాబ్దాలకు పైగా ప్రజాసేవలో ఉన్నారు. వారి అభ్యుదయానికి ఎనలేని కృషి చేశారు. దళితులు, వెనుకబడిన బడుగు వర్గాల అభ్యున్నతికి ఈమె చేసిన సేవ శ్లాఘనీయమైంది. ఈమె 1991 ఫిబ్రవరి 24వ తేదీన పరమపదించారు. వీరి ఏకైక పుత్రిక డాక్టర్ జె. గీతారెడ్డి ఆంధ్రప్రదేశ్ శాసనసభకు ఎన్నికై కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇప్పటికీ ఉన్నత పదవులను నిర్వహిస్తున్నారు.నిరుపమాన ధైర్య సాహసాలతో స్వయంకృషితో,

అచంచల ఆత్మవిశ్వాసంతో ప్రజల అభ్యుదయానికి పాటుపడ్డ మహిళామణి ఈ ఈశ్వరీబాయి.

19వ శతాబ్దంలో సమాజం అనేక సమస్యలతో సతమతమవుతూ ఉంది. ప్రధానంగా స్త్రీల పరిస్థితి మరీ దయనీయం. బాల్యవివాహాలతో, మూఢనమ్మకాలతో, అవిద్యతో, సతీసహగమనంతో, వితంతువుల దయనీయ జీవనంతో కూడుకొని ఉన్నది. ఇటువంటి స్థితిని నిర్మూలించేందుకు, సంఘానికి సంస్కర్తల అవసరం ఏర్పడింది. ఆ క్రమంలో విద్యావంతులైన ఎంతోమంది భారతీయులు సంఘసంస్కరణకు నడుంకట్టారు. ఈ కాలంలోనే జాతీయోధ్యమం మరొకవైపు కొనసాగుతున్నది. అయితే జాతీయోద్యమం ఆంగ్లేయులకు విరుద్ధంగా జరిగితే, సంఘ సంస్కరణోద్యమం ఆంగ్ల పాలనకు అనుకూలంగా వారి ప్రోత్సాహంతోనే ఉధృతమైంది. దీనికి కారణం ఆంగ్లేయులు ప్రవేశపెట్టిన కులరహిత విద్యావిధానం. దీనివల్ల అట్టడుగు వర్గాలవారు విద్యావంతులయ్యారు. మధ్యతరగతి విద్యావంతులు ఆలోచించడం ప్రారంభించారు. ఈ నేపథ్యం నుండే సంఘసంస్కరణోద్యమం బయలుదేరింది.

రాజారామ్మోహన్‌రాయ్, ఈశ్వరచంద్ర విద్యాసాగర్, కేశవ చంద్రసేన్, అనిబిసెంట్, కందుకూరి వీరేశలింగం, రఘుపతి వెంకట రత్నం నాయుడు, ఉన్నవ లక్ష్మినారాయణ, నాళం కృష్ణారావు, సూర్యారావు బహద్దర్, దరశి చంచయ్య, కనుపర్తి వరలక్ష్మమ్మ, సంగెం లక్ష్మీబాయమ్మ, ఈశ్వరీబాయి,జె. వంటి సంస్కర్తలు సంఘాన్ని ఉద్ధరించేందుకు అహర్నిశలు కృషి చేశారు. వీరి సేవలు సర్వదా స్మరణీయమైనవి.

## 1.4 సంఘసంస్కరణ ధ్యేయం

ధ్యేయం, లక్ష్యం, ఉద్దేశ్యం, అను ఈ పదాలు ఒకే అర్థానిచ్చేవని గ్రహించాలి.

మన సంస్కృతియే సంస్కరణ దృక్పథానికి మార్గం వేస్తున్నది. 'ఒక జాతి అనేక కాలములలో పురోగమించిన సంవిధానమునందు సముద్గమించిన సౌమనస విశేషమే సంస్కృతి. 'సమ్యక్ కృతియే' సంస్కృతి. అది ఒక ఉత్తమమైన ఆచరణం. మానవ శ్రేయస్సును ధరించునది ధర్మమైనచో ఆ మానవుడి ఉదాత్తాచరణమే సంస్కృతి'[14] అని డా॥ ప్రసాదరాయ కులపతి అంటారు.

అయితే కాలక్రమేణా ఇటువంటి ధర్మాచరణలో, ఉదాత్తాచరణలో, ఉత్తమాచరణలో లోపాలు పొడసూపి జాతి పురోగమనానికి ఆటంకం కలిగిస్తాయి. ఇటువంటి సమయాల్లో కొంతమంది మహాత్ములు, మహాపురుషులు వాటిని గ్రహించి, సంస్కరించి తిరిగి జాతి

పునరుద్ధరణకు పాటుపడుతుంటారు. ఇటువంటి వారిని 'సంస్కర్తలు' అంటున్నాం. వారి కార్యాచరణను 'సంస్కరణ' అంటున్నాం.

సంఘంలో వున్న దురాచారాన్ని రూపుమాపాలని, సంఘానికి మేలు చేయాలని నిరంతరం సంఘం గురించి ఆలోచించేవారు అతి కొద్ది మందే వుంటారు. వీరినే మనం మహాత్ములుగా కూడా భావించవచ్చు.

సంస్కరణ వాది ఈనాటి సమాజంలో ఉండే విప్లవ ధోరణులను దుయ్యబడుతూ, సామ్యవాదం (సోషలిజం) శాంతియుత పద్ధతుల్లో వస్తుందంటాడు. సంస్కరణవాదిది శాంతి మార్గంగాను, సాహితీ వేత్తది పోరాట మార్గంగాను కనిపిస్తుంది.

**కందుకూరి దృక్పథం :**

సంఘసంస్కరణకు ఆంధ్రరాష్ట్రంలో ఆద్యుడిగా కందుకూరిని పేర్కొనవచ్చు. సంస్కరణ భావాలు ప్రజలకి చేరడానికి తన భాషను సులభతరం చేశారు. నిజానికిది వీరేశలింగం జీవితంలోనే కాక, తెలుగు సాహిత్యంలోనూ, అలాగే సంఘ సంస్కరణోద్యమంలో కూడాను ఒక మలుపు.

సంఘ సంస్కరణ మీద తన భావాలను ప్రచారం చేయాలనే ఉద్దేశ్యంతోనే ఆయన ఇంగ్లీషు నుండి, సంస్కృతం నుండి నవల, ప్రహసనం, నాటకం అనే కొత్త సాహిత్య ప్రక్రియలను అరువు తెచ్చుకోవడంలో మొదటి వారయ్యారు అంటారు వి. రామకృష్ణ.

ఈ విధంగా సంఘసంస్కరణ కోసం సాహిత్యాన్ని ఆయుధంగా ఉపయోగించు కోవడమే కాకుండా నిజమైన సంఘసంస్కరణ లేదా మరెలాంటి సంఘసంస్కరణ అయినా వట్టి చర్యలతోను, తీర్మానాలతోను ముగిసిపోదు అని నిరూపించారు. సంఘసంస్కర్తకుండ వలసిన లక్షణాలను గురించి చెప్తూ సద్భావం గల ప్రతి మనిషి యితరులను సన్మార్గంలో నడిపించాలని అనుకుంటాడు. కానీ అలా చేయగల వాళ్లు కొద్దిమందే ఉన్నారు అంటారు రామకృష్ణ.

సంస్కరణ భావాలను ఉద్యమ రూపంలోకి మార్చిన ఘనత వీరేశలింగం పంతులుగారిచే 1875లో 'పరవస్తు రంగాచార్యులు' వితంతు వివాహమునకు అనుకూలంగా అనేక వ్యాసాలు రాశారు. కానీ 1878 నాటికి వీరేశలింగం యొక్క అభిప్రాయాలు ఒక రూపును సంతరించుకున్నాయి. వీరు విద్య ద్వారా సామాజిక రుగ్మతలను పారద్రోల వచ్చునని భావించి శాస్త్రీయమైనట్టి విద్యా విధానంతో స్త్రీ విద్యను ప్రోత్సహించారు. వీరి యొక్క

సంస్కరణ ధృక్పథం చాలా విశాలమైనది. ఈ ధృక్పథంలోని భావాల ఫలితంగా బాల్య వివాహముల ఖండన, కన్యాశుల్కంపై విముఖత, మూఢనమ్మకములపై తిరుగుబాటు, వర్ణవివక్షతపై తిరుగుబాటు దేవదాసీ వ్యవస్థ నిర్మూలన. ఈ విధమైనట్టి సాంఘిక దురాచారములను వ్యతిరేకిస్తూ నైతిక విలువల యొక్క ఆవశ్యకతను చాటి చెప్పారు.

సమాజంలో స్త్రీ ఎదుర్కొంటున్న సమస్యలపై అనేకమంది సంస్కర్తలు తమయొక్క దృష్టిని కేంద్రీకరించారు. దీనికి కారణం నిరక్షరాస్యతని వీరు భావించారు. బాల్యవివాహాలను, కన్యాశుల్కాన్ని వీరు తీవ్రంగా వ్యతిరేకించారు. 1878లో స్థాపించబడినటువంటి 'రాజమండ్రి సేవా సంఘం' ఈ సంఘంలో వయస్సు వచ్చిన తరువాతనే వివాహం అను నినాదం లేవదీసారు. 14 సంవత్సరముల వయస్సు వచ్చిన తర్వాతే వివాహం చేయాలని ఒక శాసనం చేసి ప్రభుత్వాన్ని అభ్యర్థించారు. 'మహదేవ గోవింద రనడే' ద్వారా ప్రతిపాదించబడిన ఈ బిల్లుపై ప్రార్థనా సమాజం వారు సంస్కరణ సంఘ సభ్యులు సంతకాలు చేశారు. కన్యాశుల్కానికి కూడా వ్యతిరేకంగా శాసనం చేయవలసిందిగా ప్రభుత్వాన్ని అభ్యర్థించారు. ఈవిధంగా కందుకూరి దృక్పథాన్ని అర్థం చేసుకోవచ్చు.

## గురజాడ లక్ష్యం :

19వ శతాబ్దంలో సమాజ అభివృద్ధికి ఆటంకాలైన అనేక దుష్కార్యాలను తనదైన శైలిలో కథ, నవలా, నాటకాలలో చిత్రించి వాటిని రూపుమాపటానికి ప్రయత్నించడమే కాక సంఘంలో ఎటువంటి గౌరవం లేకుండా, బానిసలుగా చూడబడుతున్న స్త్రీలకు గౌరవాన్ని, సమానత్వాన్ని పెంపొందింప చేయడం లక్ష్యంగా రచనలు కొనసాగించినవారు గురజాడ అప్పారావుగారు.

"చరిత్రలో ఏకాలమైనా విరుద్ధ శక్తుల సంఘర్షణలోనే ముందుకు సాగుతుంది. ఈ సంఘర్షణ రెండు రకాలు, పునాదిలో మార్పు రాకుండా ఉపరితలంలో వచ్చే మార్పుల మధ్య జరిగే సంఘర్షణ ఒకటి, పునాదిలోనే మార్పులు వచ్చినపుడు జరిగే సంఘర్షణ ఇంకొకటి. మొదటి రకం సంఘర్షణ నామమాత్రమైనది. రెండోరకం సంఘర్షణ గుణాత్మకమైనది. పరిణామాత్మకమైనది. గురజాడ జీవనం ఈ రెండో రకం సంఘర్షణ కాలానికి చెందింది. పాతకూ కొత్తకూ, విశ్వాసానికీ హేతువుకు, స్తబ్దతకూ చలనానికి, అవిద్యకూ విద్యకు, మానవతకూ అమానవతకు మధ్య భారతీయ జీవితం నలుగుతున్న కాలంలో గురజాడ జన్మించి జీవించి మరణించాడు. (21-09-1862 - 30-11-1915)"[15]

కందుకూరి వీరేశలింగం పంతులుగారి సాంఘిక విప్లవం, గిడుగు వెంకటరామమూర్తి గారి భాషా విప్లవం తనలో సమన్వయించుకొని, ఆధునిక తెలుగు సాహిత్య లోకమున సరికొత్త విప్లవాన్ని మేల్కొల్పిన నవయుగ వైతాళికుడు గురజాడ.

ఆధునిక తెలుగు సాహిత్యంలో స్త్రీకి మొదటిసారి ప్రాధాన్యం ఇచ్చినవారు గురజాడ.

స్త్రీని సమదృష్టితో చూసిన మొదటి కవి గురజాడ. పాతకాలపు ఇల్లాలు తన భర్త తనకు అలంకారం కోసం ఇచ్చే బంగారము, చీరలు మొదలగునవి. అతని ప్రేమకు గుర్తు అని భ్రమ పడేది. కానీ భార్యాభర్తల మధ్య ఉండాల్సింది కేవలం ఈ ఇచ్చిపుచ్చుకోడాలు కాదు, నిజమైన ప్రేమతత్త్వము, భార్యాభర్తల మద్య స్నేహం ఉన్నప్పుడే ఉంటుందని గురజాడ చెపుతారు.

అంతకు ముందు దాకా పతివ్రతా పరాయణురాలిగానే తప్ప గౌరవము, గుర్తింపులేని స్త్రీతో, పురుషుడు మేల్బును కానని, తాను ఆమెకు ప్రాణమిత్రుడనని పలకడం అంటే మొట్టమొదటిసారిగా కుటుంబ పరిధిలో స్త్రీకి సమాన స్థాయినిచ్చి గౌరవించటమే. అంతకు ముందు కవులు ఎవరు ఇలాంటి ఆలోచన చేసిన వారు కన్పించలేదు.

అప్పటిదాకా వచ్చిన సాహిత్యంలో భార్యను బానిసగానే పరిగణించారు. ఈ అజ్ఞానపు, అహంకారపు తెరను తొలగించి, 75 సంవత్సరాల క్రితమే భర్త అనే బంధాన్ని సరికొత్తగా నిర్వచించడం, స్త్రీ పట్ల గురజాడ ప్రకటించిన విప్లవాత్మకమైన భావం.

స్త్రీ, పురుషులిద్దరి మధ్య అసాధ్యమని తలచే స్నేహాన్ని ప్రతిపాదిస్తూ స్నేహానికి స్త్రీ, పురుష తారతమ్యాలు లేవని చెప్పడం గురజాడ కాలం నాటి సమాజానికి అత్యంత ఆధునికమైన విషయం.

గురజాడ తన సమకాలీన సమాజంలో ఆడపిల్లలు సంతల్లో పశువుల్లా అమ్మబడే దుస్థితికి యదార్థ రూపకల్పన చేసి 'కన్యాశుల్కం' నాటకం రచించాడు. తనను చెరబట్ట ప్రయత్నించిన రాజును నిర్భయంగా ఎదిరించి అతనికి అందకుండా ఆత్మహుతి చేసుకొన్న స్త్రీమూర్తి కథను 'కన్యక' రూపంలో వెలిబుచ్చి స్త్రీల దయనీయస్థితిని, ఆనాటి సమాజం యొక్క కర్కశత్వాన్ని మన ముందుంచాడు.

గురజాడ చిత్రించిన స్త్రీ మూర్తి ఊహాసుందరి కాదు. అతను సృష్టించిన స్త్రీ పాత్రలు అన్నీ సజీవమైనవి. వాటిలో నాటి వాస్తవికత స్పష్టంగా కనిపిస్తుంది. వారికి స్త్రీ పట్ల ఒక ఆదర్శం ఉంది. అది ఆయన రచనల్లో కనిపిస్తుంది. ప్రత్యేకించి బాధలకు గురౌతున్న

స్త్రీలను చిత్రించి, వారి సామాజిక స్థితిని చూపాలని, తద్వారా వారి స్థానాన్ని పైకి తీసుకురావాలనేది వారి లక్ష్యం. ఇది వారి సాహిత్యం ద్వారా తెలుస్తుంది.

బెంగాల్‌లో రాజారామ్మోహన్‌రాయ్ వంటి సంస్కర్తలు ఎంతోమంది సమాజంలోని దురాచారాలను రూపుమాపాలని ప్రయత్నాలు ప్రారంభించారు. ఉద్యమాలకు పుట్టినిల్లైన బెంగాల్‌లో మొదలైన ఈ సంస్కరణోద్యమం ఆంధ్ర రాష్ట్రానికి ఒక చివరనున్న విజయనగరానికి కూడా పాకింది. విజయనగర సంస్థానంలో రాజాగారి ఆంతరంగిక సలహాదారుగా ఉన్న గురజాడ అటు సామాజిక దురాచారాలను, ఇటు రాజకీయాలలోని లోటుపాట్లను కూడా అర్థం చేసుకున్నారు. అయితే తనకు తెలిసిన విజ్ఞానాన్ని ఇతరులకు పంచడమే మేధావి లక్షణం కాబట్టి ఆయన ఆ విషయాలను విశ్లేషిస్తూనే, వాటికి మూలమేమిటో తెల్పుతూ, సమాజాన్ని ధిక్కరించడానికి పూనుకున్నారు.

"బాల్యవివాహాలు, కన్యాశుల్కం, వరశుల్కం, స్త్రీ విద్యా విహీనత, వితంతువులు సమాజంలో ప్రధానమైన స్త్రీ సమస్యలు. ఇవి దేనికవి విడిసమస్యలు కావు. ఒకదాని కొకటి పెనవేసుకున్నవే"[16] అన్న విషయం రాజకీయంగా పరాయి పాలన, ఆర్థికంగా ఆకలి, దారిద్ర్యం, తాత్వికంగా మత ఛాందసత్వం, సాంఘికంగా సతీ సహగమనం, బాల్యవివాహాలు, కన్యాశుల్క వివాహాలు, అంటరానితనం వంటి మూఢచారాలు రాజ్యమేలుతున్న కాలాన్ని బట్టి స్పష్టమౌతుంది. గురజాడ ఈ కాలానికి సంబంధించినవాడు. నార్ల వెంకటేశ్వరరావు మాటల్లో  సూక్ష్మంగా చెప్పాలంటే నాటి సంఘానికి హృదయం లేదు.  నైరాశ్యం, క్రూరత, వికృత లక్షణాలతో ఆత్మని కోల్పోతున్న సంఘం అది. నీతి విధానాల్లోను పురుషుల కొకటైతే స్త్రీల కొకటి. పెద్దలనిపించుకునే కొద్దిమంది అదృష్టవంతుల కొకటైతే మిగతా అందరికీ మరొకటి. అసలు ఆ సాంఘిక వాతావరణమే దౌర్జన్య పూరితం. వాస్తవంగా కుళ్ళి కంపుకొడుతూ స్వతంత్ర భావాన్ని మానవ సంచలనాన్ని గొంతు పిసుకుతున్న వాతావరణం ఇటువంటి స్థితి నుండి సమాజాన్ని బయటకు తీసుకురావాలని ప్రయత్నించిన గురజాడ లక్ష్యం స్పష్టమౌతుంది.

## శ్రీపాద ఉద్దేశ్యం :

అనేక స్త్రీ సమస్యలతో చలనం లేకుండా కుహన విలువలతో కూరుకుపోయిన 19వ శతాబ్దాన్ని బాగుచేసేందుకు శ్రీపాదవారు అనేక సాహిత్య ప్రక్రియల ద్వారా రచనలు కొనసాగించి ప్రజలను ఆలోచింపచేయడమే ఉద్దేశ్యంగా పెట్టుకొని మార్పు కోసం కృషి చేశారు.

"తెలుగు కథానికా సాహిత్య చరిత్రలో శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి గారిది ఒక ప్రశ్నించే పుట. నిజానికి ప్రశ్నించే సాహిత్య స్రష్ట గురజాడ. ఆయన సృష్టికి స్థిర రూపానిచ్చి విస్తృతం చేసినవారు శ్రీపాద. ఆధునిక సాహిత్యం తొలిదశలో స్త్రీ ప్రధానంగా వచ్చింది. శ్రీపాద స్త్రీ పాత్రల సృష్టిలో అగ్రగామి. చలం, శ్రీపాదలు దాదాపు ఒకేకాలంలో రచనలు చేశారు. చలం కుటుంబ వ్యవస్థను తిరస్కరిస్తూ రచనలు చేస్తే, శ్రీపాద కుటుంబ వ్యవస్థను తిరస్కరించకుండా ఆ వ్యవస్థలోని లోపాలను ఎత్తి చూపారు. స్త్రీలతో ప్రశ్నింపచేశారు. ఎదిరింప చేశారు."[17]

"సంఘ సంస్కార ధ్యేయంగా, ఇంకో యాభైఏళ్ళకు రాబోయే సమస్యల్ని అప్పుడే ఊహించి క్రాంత దర్శనంతో కలకండల్లాంటి తెలుగు పలుకుబడుల్ని దివ్యాస్త్రాలుగా సంధించి పాఠకుల హృదయాల్ని జయించిన కథా చక్రవర్తి శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి."[18]

సంఘసంస్కరణ విషయంలో కందుకూరి వీరేశలింగం గారికీ, వ్యావహారిక భాషావాదంలో గురజాడ ఈయన వారసులయినప్పటికీ, శ్రీపాద కథారచనలో తమ వ్యక్తిత్వాన్నీ,ప్రత్యేకతనీ నిలుపుకొని అనేకమంది సాహితీ ప్రముఖుల మన్ననలందుకున్నారు.

శ్రీపాదసుబ్రహ్మణ్యశాస్త్రిగారి మూడు చిన్న కథ సంపుటాలను విశాలాంధ్ర పబ్లికేషన్స్ వారు పునర్ముద్రించడం జరిగింది. ఆ సందర్భములో వారు పలువురి సుప్రసిద్ధ కథా విమర్శకుల అభిప్రాయాలను వాటిలో పొందుపర్చారు అవి గాఢమయిన ప్రతిభకూ దృఢమయిన దీక్షకూ నిర్దిష్టమయిన కార్యదక్షతకూ నిష్కపటమయిన మాటకూ చెక్కుచెదరని పట్టుదలకూ మొక్కబోని ఆత్మవిశ్వాసానికీ పెట్టింది పేరు శ్రీపాద... అని డా॥ పోరంకి దక్షిణామూర్తి అభిప్రాయపడ్డారు. వచన సాహిత్యంలో అభ్యుదయోద్యమం తలెత్తటానికీ, బలపడటానికీ పరోక్షకారకుడయ్యారు. ఆ ఉద్యమంలో మమైక్యం చెందకపోయి కొడవటిగంటి కుటుంబరావు వంటి వారి మార్గాన్ని సుగమం చేశారు అని, డా॥ కేతు విశ్వనాథ రెడ్డి, పదాలలో అన్నమయ్యా, పద్యాలలో వేమనలకు వలెనే అచ్చతెనుగుతనం అఘ్రాణించాలి అంటే శ్రీపాద వారే శరణ్యం. వారి కథలకు వారే నిర్వచనం, వారే కొలమానమున్నూ... అని శ్రీవాకాటి పాండు రంగారావూ వ్యాఖ్యానించారు.

కందుకూరి వీరేశలింగం పంతులుగారి సంస్కరణోద్యమం ఉదృతంగా కొనసాగుతున్న రోజుల్లో, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి గారు జన్మించడం జరిగింది. వీరేశలింగంగారు చివరి దశలో ఉన్నప్పుడు సుబ్రహ్మణ్యశాస్త్రిగారు వారి రచనలు చదివి ప్రభావితుడై, వారి

సంఘుసంస్కారాశయాలను తమ రచనల ద్వారా ప్రచారం చేసి సమాజంలో మార్పు తీసుకురావాలనే తపనతో వీరు రచనలు ప్రారంభించారు. వీరేశలింగంగారు జీవించి ఉన్నప్పటికంటే కూడా వారు మరణించిన తరువాతనే సంఘుసంస్కారోద్యమ ప్రభావం ఆంధ్రసాహిత్యంపై అధికంగా కనబడుతుంది. ఇందుకు శ్రీ పాదసుబ్రహ్మణ్యశాస్త్రిగారి రచనలే దోహదపడ్డాయి అని చెప్పడంలో సందేహం లేదు.

సామాన్య రచయితలు అనే పదాన్ని పక్కన పెట్టి రచయితలను మంచి రచయితలు, గొప్ప రచయితలు అని ఎంచి చూసినట్లయితే శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు గొప్ప రచయితల కోవకు చెందుతారు. వీరి రచనలను మానసికానందం కోసం మాత్రమే కాకుండా సమాజాభివృద్ధి కోసం చదవాలి. శ్రీపాదవారు ఆంగ్ల సాహిత్యం జోలికి పోకుండా, దాని ప్రభావం ఇతని రచనలపై పడనీయకుండా గొప్పరచనలు ఎన్నో వెలువరించారు. తెలుగు సాహిత్యంలో కనబడుతున్న ఆధునికత పాశ్చాత్య ప్రభావం వల్లనే వచ్చిందనే మాటని శ్రీపాద వారి సాహిత్యం కాదని నిరూపించింది.

శ్రీపాద రచనల్లో ప్రధానంగా వస్తువు, ఇతివృత్తం, పాత్ర చిత్రణ ఈనాటికీ అత్యాధునికంగా ఉండి సమాజాన్ని ఆశ్చర్యపరుస్తున్నాయి

శ్రీపాదసుబ్రహ్మణ్యశాస్త్రి గారి రచనల్లో స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరిస్తూ వాటిని రూపుమాపే దశగా ప్రయత్నాలు జరపాలని పాఠకులకు తెలియజేశారు. వీరి రచనల్లో ప్రముఖంగా మనకు కనబడేవి బాల్యవివాహం, వితంతువులు, వేశ్యాసమస్యలు మొదలైనవి.

ఇవి ఆనాటి సమాజంలో కన్పించే ప్రధాన సమస్యలు. బాలికలకు పసితనంలోనే పెళ్ళి చేయడం అనే దురాచారం ఇది. పసిపిల్లను వృద్ధుడైన మగవాడికి ఇచ్చి వివాహం చేసేవారు. ఫలితంగా అనతికాలంలోనే అతను చనిపోవడం, ఆమెకు వైధవ్యం కలగడం జరిగేది. దీని వలన పచ్చగా సంసార సౌఖ్యాలతో ఉండాల్సిన స్త్రీలు చాలామంది వైధవ్యంతో రోజూ దుర్భరంగా కాలం గడపాల్సి వచ్చేది. 1871వ సంవత్సరం నాటి అంచనా ప్రకారం వివాహం జరిగిన ప్రతి పదివేల మందిలో ఒక వెయ్యి నూట ముప్పది రెండు మంది స్త్రీలు ఇరవై సంవత్సరములు కూడా నిండని బాలికలే. (భారతదేశ జనాభా లెక్కల సేకరణ 1871) అంటే ఆనాడు ఈ దురాచారం ఎంతగా ఉండేదో తెలుస్తుంది.

ఆనాటి సంఘంలో వితంతువులు ఎక్కువగా ఉండడానికి సగం కారణం బాల్యవివాహాలు జరగడమే. సమాజంలోని ఈ దురాచారానికి బలి అయిన స్త్రీ జీవితాంతం శాపగ్రస్తురాలిగా జీవించవలసి వచ్చేది. పైగా వారిని కుటుంబంలోనూ, సమాజంలోను

చులకనగా, నీచంగా చూడ్డం జరిగేది. కుటుంబంలో వాళ్ళచే గొడ్డుచాకిరి చేయించుకొనేవారు. ఇది శారీరక కష్టం. సంఘంలో అయితే ఏ శుభకార్యాలు జరిగినా వీరిని పిలిచేవారు కాదు. ఒకవేళ వాళ్ళు ఎదురైతే శాపనార్థాలు, ఈసడింపులు, ఛీదరింపులు తప్పేవి కావు. ఇలా వారు మానసికంగాను, శారీరకంగానూ కష్టాలు పాలవుతూ ఉండేవారు. జీవితాంతం అలాగే కుటుంబంలోని వారి కరుణా కటాక్షాల మీద ఆధారపడి, సంఘానికి భయపడుతూ గడపాల్సి వచ్చేది. 1881వ సంవత్సరములో 1/3 వంతు స్త్రీలు బ్రాహ్మణకులంలో వితంతువులే అంటే ఆనాటి సంఘంలో స్త్రీ ఎన్ని కష్టాలు పడి ఉంటుందో మనం ఆలోచించాలి.

ప్రాచీన కాలంలోని దేవదాసీ వ్యవస్థ యొక్క మరో రూపమే ఆనాటి సంఘంలోని వేశ్యావ్యవస్థ. వీరిని భోగం వాళ్ళు అని పిలవడం జరిగేది. వీరు సంగీత, నాట్యప్రదర్శనలిస్తూ జీవించేవారు. వేశ్యలను ఉంచుకొనడం ఒక గౌరవ సూచకంగా ఆనాడు ఉండేది. ఎటువంటి శుభకార్యాలయినా ఈ 'భోగం మేళా' లేకుండా జరిగేవి కావు. సమాజం వీళ్ళను నీచంగా చూడ్డం, గౌరవించకపోవడం వల్ల, ఇక్కడ కూడా స్త్రీ అవమానాలకు బాధలకు గురి అయ్యేది.

ఈ సమస్యలను కథా వస్తువులుగా చేసుకొని శ్రీపాద వారు కలుపుమొక్కలు, అరికాళ్ళ క్రింద మంటలు, ఇల్లు పట్టిన విధవాడపడుచు వంటి అద్భుతమైన కథలనెన్నింటినో రచించి వాటి ద్వారా సమాజ స్వరూపాన్ని మార్చే ప్రయత్నం ముమ్మరంగా చేశారు.

ఈ విధంగా శ్రీపాద వారి రచనలు సంఘాన్ని మేలుకొలపడానికి, మంచి చెడులను వివేచన చేసి తెలుసుకోవడానికి ఎంతగానో ఉపయోగపడ్డాయి. ఈ క్రమంలో వారు నిరంతరం సాగించిన కృషి ఎప్పటికీ మర్చిపోలేనిది.

## చలం ధ్యేయం :

చలాన్ని స్త్రీ స్వేచ్ఛా ప్రతినిధిగా పేర్కొనవచ్చు. ఎందుకంటే స్త్రీలకు స్వేచ్ఛా, సమానత్వాలు కావాలనే ధ్యేయంతో ఇతడి రచనలు కొనసాగాయి.

"అప్పటివరకూ రచయితలంతా కుటుంబ పరిధిలోనే ఆలోచించారు. కానీ చలం మాత్రం సమాజ నిమయాలను అతిక్రమించకుండానే అసలు కుటుంబమే లేకుండా స్త్రీ స్వతంత్రంగా ఉండలేదా? పురుషుడు స్వతంత్రంగా ఉండగలిగినప్పుడు స్త్రీకి మాత్రమే ఈ నియమాలెందుకు? కుటుంబ వ్యవస్థే స్త్రీని అణచివేస్తుంది. కాబట్టే ఈ కుటుంబాన్ని తిరస్కరించి స్త్రీ స్వేచ్ఛగా బతకగలగాలి అనే కోరికను వెలిబుచ్చుతాడు."[19]

మామూలు కుటుంబాలలోని భార్యాభర్తల మధ్య పరస్పర వంచన, వ్యక్తిత్వరాహిత్యాలనే స్త్రీలు అన్యోన్యత అనుకొని మురిసిపోతుంటారని చలం అభిప్రాయం. అలా అని పెళ్ళయిన స్త్రీలంతా వంచనతో బతుకుతున్నారని కాదు గాని, దాదాపుగా తొంబైశాతం స్త్రీలు పురుషుల చేత అన్ని రకాలుగా వంచింపబడుతున్నారనే చలం ప్రగాఢ నమ్మకం. పెళ్లయిన వాళ్ళను కూడా ప్రేమించడానికి ప్రోత్సహిస్తున్నాడంటే, పెళ్ళయిన వాళ్ళతో లేచిపొమ్మంటున్నాడు. ఇవేమి నైతిక విలువలు. ఈవిధంగా బూతు ప్రచారం చేస్తున్నాడనే అపవాదు చలం మీద వచ్చినా, అది నిజం కాదు. నిజానికి మనం జీవిస్తున్న ఈ సమాజంలో వివాహ వ్యవస్థ, కుటుంబం వీటిలో ఉన్న లోటుపాట్లను చలం స్పష్టంగా చిత్రించదల్చుకున్నారు.

స్త్రీ పురుష సంబంధాల చిత్రణలో చలం కోరిన స్వేచ్ఛ స్త్రీ పరంగా ఉద్రేకంగా మండుతూ రాసిన రాతలు, హృదయాలను కల్లోల పరిచాయి. అవేవో సొంత విషయాల్లో, కుటుంబ విషయాల్లో జోక్యం కలగ చేసుకున్నట్లు కొందరు భావించారు. అనుకున్న వాటిని బజారుకీడ్చి చర్చకు పెట్టడం చలం నేరమైంది. చలం కథలు తీవ్ర సంచలనాన్ని రేపాయి. తమ నీడను తామే చూసుకొని భయంతో నిలువునా ఒణికేటట్లు చేశాయి.

చలం సామాజిక, రాజకీయ, సాంస్కృతికోద్యమాలలో ఎప్పుడూ మమేకం కాలేదు. వాటిని కొన్ని సందర్భాలలో సానుభూతితో చూసినా, వాటిలో లోపాలే ఎక్కువగా ఆయనకు కనిపించాయి. ఆయన కాల్పనికావేశంలో ప్రతిదాన్ని ప్రశ్నించడం ఒక భాగం. ఆయన వాస్తవిక చిత్రణలో ప్రతిదాన్ని వివేచించడం, తర్కించడం ఒక గుణం. అయితే జాతీయోద్యమంలోని వ్యక్తుల త్యాగాలు ఆయన్ను ఆకర్షించాయి. గాంధీలోని చిత్తశుద్ధి ఆయన్ను కదిలించింది. ఆ ఉద్యమంలో కొందరి త్యాగనిరతినీ, నిజాయితీని చలం కాదనలేకపోయాడు.

"ఆంధ్రదేశాన్ని తన కలం బలంతో ఇంత కలవర పెట్టిన రచయిత ఇంకొకరు లేరనడం నిర్వివాదాంశం. ఏ మొగమాటం లేని మరే దాపరికమూ కన్పించని చలం రచనలకు ఏ ఆచ్ఛాదనలూ అలంకారాలు లేవు. ఏ మహాయిత నీడలో ఇంకే మహాకవి ప్రభావాలో చలం రచనలపై ప్రసరించలేదు. ఏ ఒకటి రెండో అలాంటి వాటిని జ్ఞప్తికి తేవచ్చునేమో కాని చలం సాహిత్యం స్వేచ్ఛా ప్రవృత్తితోనే వెలువడింది. చలం గుండెల నుండి సూటిగా దూసుకు వచ్చిన భావాలివి. ఆయన ఆత్మగానమే ఆ రచనలలో అంతర్లీనంగా విన్పించే

సంగీతం. చలం తెలుగు వేరు. అది వ్యాకరణానికి లొంగదు. చంధస్సుకు వంగదు. భాషానియమాలకు అందదు.''[20]

చలాన్ని ఎక్కువగా కుదిపివేసింది సమాజంలో అణచివేతకు గురౌతున్న స్త్రీ జాతి. బ్రిటీషు వాళ్ళ నుండి భారతదేశానికి స్వాతంత్ర్యం రావడం ఎంత ముఖ్యమో, పురుషాధిపత్యం నుండి స్త్రీలకు స్వాతంత్ర్యం రావటం అంత ముఖ్యమైంది చలానికి. కందుకూరి, గురజాడ సంస్కరణ భావాల నుండి సమరస్థాయికి స్త్రీ చేరుకోగల రచనలు చేశారు చలం.

నా జీవితంలో ఈ స్త్రీ సమస్య వచ్చి నా హృదయంలో రక్తాన్ని ఉడికించిందాకా, ఈవిషయమై స్త్రీలను అర్థం చేసుకోక సంఘం పెట్టే భాదల్ని నేను తెలుసుకొని మండిపడ్డదాకా, నేను వ్రాయగలనని నాకు తెలీదు. (చలం-1983) అని చెప్పుకొన్న చలం మాటల్లోని స్త్రీ జనజీవితాల పట్ల వ్యక్తమయిన ఆలోచనే చలం సాహిత్యాన్ని నడిపించింది.

కాత్యాయని విద్మహే (1987) అభిప్రాయం ప్రకారం ''చలం, స్త్రీని సామాజిక కట్టుబాట్ల నుండి విముక్తి చెయ్యాలన్న కార్యోత్సాహంతో స్త్రీని ఇన్నాళ్ల నుండి అణచి ఉంచిన కుటుంబ వ్యవస్థను, శీలం, పాతివ్రత్యం మొదలగు పురుషస్వామ్య సామాజిక భావాజాలాలను తీవ్రంగా ఖండించాడు. ఆ క్రమంలోనే తన రచనల్లోని 'స్త్రీ పాత్ర'లకు అధికమయిన స్వేచ్ఛను ప్రసాదించడం వల్లనా ప్రవర్తన 'విశ్వంఖలత్వం'గా అనిపిస్తుంది. పురుషుడు ఎంతోమంది స్త్రీలతో సంబంధాలుంచుకొని సగౌరవంగా బతుకుతున్నట్లే స్త్రీలు కూడా ఇలా చేయవచ్చుననే దానిని ఒక సిద్ధాంతంగా చేసి తన రచనల ద్వారా ప్రచారం చేసాడు. ఈ కారణం వల్లనే చలం నైతిక క్రమత్వం లేని వ్యవస్థను వాంఛించాడన్న విమర్శకు గురి అయ్యాడు.''[21]

సమకాలంలో తన మీద వచ్చిన విమర్శలకు సమాధానంగా చలం, ''నేను వాంఛించే మార్పు, ఈ వివాహంలో ఉన్న అక్రమాలు, అన్యాయాలు పోవాలని, ఈ దుర్మార్గాలు వొదిలించినంత మాత్రాన అసలు చచ్చేటంత దుర్భరం కాదు వివాహం. అంతేకాకుండా వివాహం వొద్దన్న వాళ్ళకి బలవంతంగా కట్టకూడదని, వివాహము అయినంత మాత్రాన సర్వము నీతిగా తలచడము, లేనంత మాత్రాన అవినీతి అనడము మూర్ఖమని నా వాదన'' అని అంటాడు. ఈ మాటలను బట్టి చలం కోరింది అనైతిక వ్యవస్థను కాదని, అజ్ఞానం, మూర్ఖత్వం, దుఃఖం, పీడనలేని స్త్రీ పురుష సమానత్వంతో కూడిన ఉత్తమ సాంఘిక

వ్యవస్థను కోరాడని అర్ధమవుతుంది. కానీ స్త్రీ సమస్యలను సమగ్రంగా అవగాహన చేసుకోవడంలో, వాటికి పరిష్కార మార్గాలను సూచించడంలో చలం కొన్ని పొరబాట్లు పడిన మాట నిజము (కాత్యాయనీ విద్మహే 1987). ఈ పొరబాట్లే చలంను విమర్శలకు గురి చేశాయి.

చలం రచనల్లో స్త్రీ పాత్రలు సంప్రదాయాలను ధిక్కరించేవిగాను, విశృంఖలత్వాన్ని ప్రదర్శించేవిగా ఉంటాయి. భారత సంప్రదాయానికి సరిపోని స్త్రీ ఆలోచనలు చలంలో కన్పిస్తాయి. అంతేగాకుండా చలం తన రచనల్లోని స్త్రీ పాత్రలను విశృంఖలంగా విహరింపజేస్తాడు. కాని వారి సమస్యలకు సరియైన పరిష్కారాన్ని చూపించడం కన్పించదు. చలం తీరని కోర్కెలతో, వాంఛలతో, అసంతృప్తితో జీవిస్తూ, తిరుగుబాటు తర్వాత తిరుగుబాటు అని ఎండమావులను ఎదురుచూసే 'స్త్రీ'ని ఊహించారు.

'స్త్రీ వాద రచయిత్రి ఓల్గా మాటలలో చలం సంస్కర్త కాదు. రాజకీయవేత్తా అంతకంటే కాదు. తాత్త్వికుడని చెప్పారు. అయినప్పటికీ చలం సంఘసంస్కరణోద్యమాలను, రాజకీయ స్వాతంత్రం కోసం సాగే జాతీయోధ్యమాన్ని కూడా చాలా దగ్గర నుంచి చూశాడు. చలం గారిపై వీరేశలింగం గారి ప్రభావం వుంది. గాంధీగారంటే చలానికి గౌరవం ఎక్కువ. చలం సంఘసంస్కరణోద్యమం, జాతీయోధ్యమం ఈ రెండింటిపై తీవ్రమైన విమర్శలు గుప్పించాడు. పరిమిత లక్ష్యాలకోసం పనిచేస్తున్న ఆ రెండు ఉద్యమాలూ చలానికి సరిపడలేదు. తాత్వికులనబడే వారికి పరిమితులు, పరిధులు వుండవు. ఈ కోవకు చెందినవాడే కనుక చలం యావత్ ప్రపంచంలో నెలకొన్న అశాంతి, హింస, దుఃఖం, దోపిడి, అణచివేతలను అర్థం చేసుకొని ప్రజలకు వివరించి వాటిని తొలగించే ప్రయత్నం చేశాడు.

ఈవిధంగా సమాజ స్థితిని, స్త్రీల గతిని మెరుగుపరచడమే ధ్యేయంగా పనిచేసిన చలం కృషి చిరస్మరణీయమైనది.

## బాపిరాజు భావం :

సంఘాన్ని సంస్కరించి పునర్నిర్మించడానికి ఆంధ్ర సాహిత్యంలో సాంఘిక సంస్కర్తలైన రచయితలు చేసిన కృషి అపారమైనది. వారి రచనల్లో కొందరు పరిష్కార మార్గాన్ని అన్వేషించి సూచించారు. మరికొందరు సాంఘిక సమస్యని యదార్ధంగా చిత్రించి చూపించారు.

స్వాతంత్ర్యానికి పూర్వం సంఘంలో పరిస్థితులు దుర్భరంగా ఉండేవి. సంఘంలో ఏర్పడిన అన్ని దుష్కార్యాలకు, అన్ని లోటుపాట్లకు పరాయి పాలనే ప్రధానమైన కారణం అనే అభిప్రాయం ఉండేది. అందుచేత "స్వాతంత్ర్య కాంక్షను దేశీయులలో ప్రజ్వలింప జేయడమే రచయితల, కళాకారుల, మేధావి వర్గాల ఆశయంగా ఉండేది."

దీనితోపాటు దేశంలో వేళ్లంటుకున్న అంటరానితనం, అవిద్య పెరిగిపోయి చేతి వృత్తులు కరువై దేశం అన్ని రంగాల్లో క్షీణగతికి చేరుకోవడం, ఆర్థిక వెనుకబాటుకు లోనుకావడం, సామాజిక దృక్పథం గల రచయితలను కలచివేశాయి. మూఢవిశ్వాసాలతో సంభవించిన అవివేకం దేశీయ సంస్కృతిని పెడత్రోవ పట్టించడం వల్ల సామాజిక బాధ్యతగల రచయితలంతా ఆందోళన చెందారు. ఇందువల్ల ఈ రచయితల రచనలన్నీ ఉద్యమాలతోనూ, సాంఘిక సంస్కరణలతోను ముడివేసుకున్నాయి.

బాపిరాజుగారు సాంప్రదాయాన్ని గౌరవిస్తూ ఉన్నతమైన ఆధునిక భావాలను స్వాగతించారు. హేతువాదం పట్ల, సంప్రదాయం పట్ల, మానవీయ దృక్పథం పట్ల, పూర్వాచారాల పట్ల వ్యతిరేకతను చూపిస్తూ ఒక నూతన మధ్య మార్గాన్ని బాపిరాజు ప్రవేశపెట్టాడు.

పూర్వాచారానికీ సంప్రదాయానికీ ధ్వజమెత్తి విశ్వనాథ రచనలు సాగించాడు. ఆయన శాస్త్ర ప్రామాణ్యాన్ని అంగీకరించని హేతువాదాన్ని ఒప్పుకోలేదు. చలం పూర్వాచారాలనూ, సంప్రదాయాన్ని తూర్పారబట్టాడు. హేతువాద, మానవీయ దృక్పథంలో ఆయన రచనలు చేసాడు.

బాపిరాజు ప్రవేశపెట్టిన మార్గంలో సంప్రదాయంలో మూఢవిశ్వాసాలు, శాస్త్రాన్ని గుడ్డిగా విచక్షణ లేకుండా నమ్మడం ఉండదు. ఆధునికులు మితిమీరిన స్వేచ్ఛను కావాలని శాస్త్రాలను విమర్శించలేదు. సంఘాన్ని సుస్థిరం చేసే పాత, కొత్త భావాలను ఆయన సమన్వయ పరిచాడు.

బాపిరాజు రచనలపై కొంత కాల్పనికోద్యమ ప్రభావం ఉన్నప్పటికీ ఆయన సామాజిక బాధ్యతను విడిచిపెట్టలేదు. వక్రమార్గం పడుతున్న సమాజానికి హితబోధ చేసి, ఉన్నతమైన మార్గాలలో నడిపించడానికి, సమన్వయ మార్గాన్ని కనుగొని సామాజిక బాధ్యతను నెరవేర్చాడు. వర్ణాశ్రమ ధర్మాలు, మతం, కులం పట్ల ఉన్న విశ్వాసాలు, వివాహ ధర్మం, ప్రణయం, ప్రేమ మొదలైన విషయాల పట్ల తన సమన్వయ దృక్పథాన్ని బాపిరాజు రచనల్లో పేర్కొన్నాడు. దీనిద్వారా బాపిరాజులో గల సంస్కరణ భావాలను మనం తెలుసుకోవచ్చు.

**I. వర్ణాశ్రమ ధర్మాలు - కులవ్యవస్థ :**

బాపిరాజుకు వర్ణాశ్రమ ధర్మాలు కులవ్యవస్థ పట్ల ఉన్న అభిప్రాయాన్ని ఈవిధంగా వ్యక్తపరిచాడు. సనాతనం నిర్మించిన వర్ణాశ్రమ ధర్మాలు, కులవ్యవస్థలు, మనకు పనికిరావంటాడు బాపిరాజు. ఈ శాఖాభేదాలు మనకు తీరని కొరత. అసలు కులం తేడాలేమిటి? ఏవిధంగాను గోడలు కట్టని మూఢ ముఖ్యమైన కులాలు వేదకాలంలో ఉండేవంటారు. వారిలో ఒకరికొకరికి సంబంధ బాంధవ్యాలు, భోజన ప్రతిభోజనాలు ఉండేవి కాదా? రాను రాను జన సమ్మర్థం ఎక్కువై భావ సంఘర్షణలు వృద్ధియై అనేక కులాలు ఉద్భవించాయి. అని కులాల పుట్టుకకు వేద ప్రామాణ్యం లేదంటాడు.

కులమత వైషమ్యపూరితమైన ఈ నికృష్ట జీవితానికంతటికీ చదువులేక పోవడమే కారణం. అని దేశోద్ధార ప్రణాళికలన్నీ కులతత్వ రాక్షసి కడుపులో ప్రాణాయస్వాహా అయిపోతున్నాయి. అంటాడు. బాపిరాజుతో చదువుకున్న వాళ్ళంతా విచక్షణను కలిగివుండి ఈ భేదాలను నమ్మకుండా, వర్ణాశ్రమ ధర్మాలను, కులవ్యవస్థను రూపుమాపాలని కోరాడు.

**II. మతము :**

బాపిరాజు గారికి మతం, వ్యవస్థ పట్ల గల ఆలోచనను ఈక్రింది పేర్కొంటున్న అంశాలను బట్టి తెలుసుకోవచ్చు. హిందూ మతంపైన దాన్ని ఆధారం చేసుకున్న దేవునిపైన బాపిరాజుకు అమితమైన నమ్మకం ఉంది. ఇతని రచనల్లో అస్తికభావం దర్శనమిస్తుంది. అయితే మనిషి మనిషిగా తీర్చే నాస్తిక భావం హింసను ప్రేరేపించే భగవద్భావం కన్నా గొప్పదని ఆయన విశ్వసించాడు.

ఇతర మతాలపై బాపిరాజుకు ఎటువంటి ద్వేషం లేదు. కులమతాల హెచ్చుతగ్గులను ఎప్పుడూ ప్రస్తావించడు. కులాలు, వర్గాలు, రాజకీయ పక్షాలు , ఇతర భావాల మధ్య ఐకమత్యాన్ని సామరస్యాన్ని కలిగింప కాంక్షించినట్లే ఆయన సర్వమత సామరస్యాన్ని కాంక్షించాడు. ఆయన రచనల్లో భిన్న మతాలకు సంబంధించిన పాత్రలు కనబడతాయి. మతసామరస్యం ఉంటుంది.

హిందూ మతం నుండే సిక్కుమతం, బ్రహ్మసమాజ, ఆర్య సమాజమతాలు ఉద్భవించాయని ఆయన విశ్వాసం మతాలన్నింటికి మానవాభ్యున్నతియే లక్ష్యం. స్వార్థపరులు కొందరు మతాన్ని, దాని లక్ష్యాలను మార్చి వక్రబాట పట్టించి, ప్రజలలో వైషమ్యాలను రెచ్చగొడతారు. మతానికి దుష్ట స్వరూపాన్ని రూపొందిస్తారు. ఇది అన్ని

మతాలలోను జరుగుతూనే ఉంది. లక్ష్యాలను నెరవేర్చడానికి అన్ని మతాలను పరిశీలించి చూస్తే మత సామరస్యం సాధించడం అంత కష్టమేమి కాదు అనేది బాపిరాజుగారి ఆలోచన.

### III. వివాహం ప్రేమ - కామం :

వివాహ వ్యవస్థ విషయంలో బాపిరాజుగారికి మహోన్నతమైన అభిప్రాయం ఉంది. ఇతడు విశ్వనాథ సత్యనారాయణ గారు చెప్పిన వివాహ వ్యవస్థను గౌరవిస్తూనే చలంగారు చెప్పినటువంటి ప్రేమ, మనస్సులకు ప్రాధాన్యతనిచ్చాడు.

'వివాహం ఒక పవిత్ర బంధమనీ, మోక్ష సాధ్యమనీ చెప్పిన హిందూ ధర్మశాస్త్రాలు, పురాణాలను ఆధారం చేసుకొని విశ్వనాథ తన రచనల్లో వివాహ సంస్థను నిరూపించాడు. విశ్వనాథ అభిప్రాయం వివాహ వ్యవస్థ గురించి ఈవిధంగా ఉంటే, చలం అభిప్రాయం వివాహ వ్యవస్థ గురించి మరోలా ఉంది.'

"స్త్రీ పురుష సంబంధాలు సక్రమంగా ఉండే సమాజ స్థాపన కొరకు స్త్రీలు తిరగబడి సంసార జీవితంలో అరాచకాన్ని సృష్టించమని చలం కోరాడు. ఎవరికీ ఏదీ హక్కు కాకూడని సామాజిక వ్యవస్థ ఆయన లక్ష్యం. Freedom and equality for the Oppressed Sex ఆయన మోటో."[22]

స్త్రీ పురుషుల సంయోగం వల్లనే మానవతకు పరిపూర్ణత సిద్ధిస్తుందన్న ఆధునిక భావాన్ని బాపిరాజు బలపరచి, ఆ సంయోగం పవిత్ర ప్రణయంతో పెనవేసుకొని ఉండాలంటాడు. పవిత్ర ప్రణయమంటే స్వేచ్ఛాచారుల 'కామం' కాదు - అనురాగంతో కూడిన ఆరాధనా భావం. అందువల్ల పవిత్ర ప్రణయాన్ని కాపాడలేని వివాహ విధిని బాపిరాజు అంత ముఖ్యమైనదిగా భావింపడు. మొదట పవిత్ర ప్రణయానికీ ఆ తర్వాత దాన్ని రక్షించే వివాహ విధికీ ఆయన ప్రాముఖ్యమిచ్చాడు.

ఇంద్రియలోలత్వాన్ని తగ్గించడానికీ ఈ వివాహ సంస్థ ఏర్పడిందని, వివాహమంటే ప్రేమ లేకుండా చేసేదికాదని తెలిసి వివాహ సంస్థలో దోషమేమైనా ఉంటే తొలగించి ఆ సంస్థను కాపాడమంటాడు బాపిరాజు.

ఈవిధంగా వివాహం పట్ల బాపిరాజుగారు తన అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు.

### IV. ప్రేమ :

ప్రేమ పట్ల బాపిరాజుగారికి ఒక నిర్దిష్టమైన అభిప్రాయం ఉంది. ప్రేమ అనేది రెండు మనసులకు సంబంధించినది. ఇద్దరి మనుషులకు సంబంధించినది. దీన్ని

బాపిరాజుగారి భావంలో చూడవలసి వస్తే మనస్సుతో మాటలతో, క్రియలతో ఆరాధనా పూర్వకంగా కలిసిపోవడం ఆయన దృష్టిలో ప్రేమ.

స్వేచ్ఛాచారపరులు అనుకునే 'ప్రేమ' బాపిరాజు దృష్టిలో ప్రేమ కాదు అది కామం. వారు కామాన్ని తీర్చుకోవటానికి ఒక నియమం లేదు. కోరిక పుట్టడం దాన్ని తీర్చుకోవడం వారి దృష్టిలో తప్పుకాదు. కాని బాపిరాజు నా కామవాంఛ నా భార్య వల్లే తీరాలి అంటాడు.

**V. కామం :**

బాపిరాజు దృష్టిలో కామమంటే ఇష్టం వచ్చినట్లు వాంఛలు తీర్చుకోవాలనుకునే ఆలోచనను ఖండిస్తాడు. ఈయన అభిప్రాయంలో కామమంటే "జాతిక్షేమానికీ, సంఘ సుస్థితికీ ఒక పురుషుడు, ఒక స్త్రీయే కూడి ఉండడం ఒప్పుకుంటే చాలు వివాహ కర్మా మానుకొన్నా నాకు సమ్మతమే" అనే అభిప్రాయాన్ని తన రచనల్లో వ్యక్తం చేశారు. కామం విషయంగా ఆయనకు అంత నిర్దిష్టమైన అభిప్రాయాలున్నాయి.

ఈవిధంగా సంఘసంస్కరణే ప్రధానంగా తలిచిన బాపిరాజు అభిప్రాయాలను బట్టి అతని భావాన్ని మనం అర్థం చేసుకోవడానికి అవకాశం ఏర్పడుతుంది.

## విశ్వనాథ సత్యనారాయణ అభిప్రాయం :

విశ్వనాథ సత్యనారాయణగారు భారతదేశం గర్వించదగిన కవిపండితులు. ఈయన నవ్య సాంప్రదాయ కవిత్వానికి సామ్రాట్టు. వీరు కేవలం సాంప్రదాయాన్ని పునరుద్ధరించడానికే కలం పట్టారని చాలామంది అభిప్రాయం. దీనికి కారణం వారి రచనల్లో కనిపించే భారతీయ సాంప్రదాయాభిమానం, వర్ణధర్మ పునరుద్ధరణ మొదలైనవి. కానీ ఈయన సాంప్రదాయానికి ప్రాధాన్యతనిస్తూనే తమ రచనల ద్వారా సంస్కరణ భావాలను కూడా ప్రకటించారు. లోతుగా పరిశీలించి చూస్తే ఈ విషయం స్పష్టమవుతుంది.

వీరు మొట్టమొదట తెలుగుజాతి పౌరుషాన్ని ప్రపంచానికి తెలియచెపుతూ 'ఆంధ్రపౌరుషం' అనే గ్రంథాన్ని 1917లో రాశారు. తరువాత వీరి కలం ఆగలేదు. తెలుగు సాహిత్యాన్ని అంచుల వరకు తాకి చూసింది. తెలుగులోని అన్ని ప్రక్రియలను వీరు తమ శిల్పనైపుణ్యంతో కథాకథన చాతుర్యంతో పరిపూర్ణం చేశారు.

వీరి సాహిత్యాన్ని పరిశీలిస్తే 20వ శతాబ్దం పూర్వార్థంలో సమాజం ఎదుర్కొంటున్న సమస్యలు, ఆలోచనా ధోరణులు మనకు కొట్టొచ్చినట్లు కనపడతాయి. వీరి సాహిత్య సృష్టిలో జాతి ఎటువంటి సుఖదుఃఖాలు అనుభవించింది, జీవితం గురించి మారుతున్న కాలంలో

ప్రజలు చేస్తున్న తర్కవితర్కాలు, వాటి అనుభవాల యధార్థం వాస్తవ జీవితంలో పరిపూర్ణతా సాధనకోసం మనిషిపడే జీవుని వేదన, పంచకోశాత్మక ప్రవృత్తుల ద్వారా ప్రపంచం సాధించే పరిపూర్ణానుభూతి యొక్క కళాత్మకాభి వ్యక్తి ప్రతిఫలించాయి.

విశ్వనాథ వారిది తిరోగమన సాహిత్యమని, అది ప్రజలను ముందుకు నడిపించక తిరిగి వేదకాలం నాటికి తీసు వెళ్ళేదిగా ఉందని త్రిపురనేని మధుసూదనరావుగారి అభిప్రాయం.

ఎన్నో వేల ఏళ్ళ నుంచి ఈ దేశంలో అన్యాయం, దోపిడి, పీడన, పెత్తనం నిరాఘాటంగా కొనసాగుతున్నాయి. వర్ణం, ధర్మం, మతం, కులం పేరిట ఇవి చెలామణి అవుతున్నాయి. వీటిని నిలబెట్టడమే విశ్వనాథ ధ్యేయం.

కానీ విశ్వనాథ నవలాదృక్పథాన్ని ఈక్రింది మాటల్ని బట్టి అర్థం చేసుకోవచ్చు.

భారతీయతా వైముఖ్యమును ప్రదర్శించు పాశ్యాత్య ధోరణులనరికట్టుటకు రాజకీయంగా గాంధీ మొదలగువారు వేదాంత పరంగా స్వామి వివేకానందుడు, అరవిందుడు, ఆనందకుమారస్వామి మున్నగు ప్రముఖులెందరో తీవ్రంగా ప్రయత్నించారు. అలాగే సాహిత్యపరంగా ప్రయత్నం చేసినవారు విశ్వనాథ. పారమార్థిక విజ్ఞాన సంపద ఆధునిక నాగరికతా ప్రభంజనముచే దేశాన కనుమరుగగుచుండగా దానిని పునః స్థాపించుటకు, దాని ఔన్నత్యాన్ని విపులీకరించి చెప్పటానికి విశ్వనాథ కంకణం కట్టుకొన్నారు.

ఇంతేగాక విశ్వనాథ రచనల్లో సమకాలీన సమస్యలు, వాటికి పరిష్కారాలు కనపడతాయి. ప్రధానంగా జాతికి మేలు చేకూర్చే రచనలు చేయటంలో విశ్వనాథ గొప్ప ప్రతిభ చూపాడు. ఇది విశ్వనాథ నవలల్లో, కథల్లో ప్రతిఫలిస్తుంది.

"చారిత్రక సత్యములనరయుట యందు పాశ్యాత్యులు ప్రవేశపెట్టిన విధానముల వలన గలుగు ననర్థకములు దొలగించుటకొరకు పురాణవైర గ్రంథమాలయనుపేర నీ నవలలు ప్రత్యేకముగా వ్రాసెను. వైదిక మత వ్యాఖ్యాన తత్పరత విశ్వనాథవారిలో గలదనుటకీ నవలలు ప్రత్యేక్ష సాక్ష్యములు. ఈ రెండు విషయములను లోకమునకు తేటతెల్ల మొనర్చి యదార్థ నిరూపణమే పరమార్థముగనివి వ్రాసెను, వేదకాలమునాటి సాంఘిక మార్యద ఆనాటి ధర్మము, శీలము, ప్రగతి, ఆధ్యాత్మిక శక్తి వర్ణాశ్రమధర్మ పరిరక్షణము తన కాలమున పునః ప్రతిష్ఠింపవలయునని విశ్వనాథ వారి యాశయమైనట్లు తోచును."[23]

ఏ కవికైనా సాహిత్యాన్ని సృజించడానికి ప్రధానంగా అతని చుట్టూ ఉన్న సమాజం ప్రేరణనిస్తుంది. కడుపునిండినవాడు శ్రీనాథుడైతే, కడుపు మండినవాడు శ్రీశ్రీ అవుతాడు.

దీనికి కారణం వారి జీవన నేపథ్యం, చుట్టూ ఉన్న పరిస్థితులు. ఇవి ఆ కవి రచనలో కూడా ప్రతిఫలిస్తాయి. ఇటువంటి సంబంధం విశ్వనాథ రచనల్లోనూ కనబడుతుంది. బ్రిటీష్ వాళ్ళు భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను విచ్ఛిన్నం చేయడం విశ్వనాథ మనసును కలచివేసింది. ప్రాచీన సాహిత్యం మొత్తం పనికిరానిదని, అందులో వాస్తవంలేదని, అది మనిషిని తప్పుదారి పట్టించిందనే వాదనని వ్యతిరేకిస్తూ విశ్వనాథ రచనా ప్రస్థానంలో అడుగుపెట్టారు. ప్రాచీనకాలంలో అంతా చెడేలేదని, మంచి కూడా ఉందని, దానిని గుర్తించమని లోకానికి చాటేందుకే విశ్వనాథ నవ్యసంప్రదాయ సాహిత్యాన్ని సృజించారు. ‘‘మంచి గతమున కొంచెమేనోయ్’’ (గురజాడ అప్పారావు - దేశభక్తి గేయం) అని కొందరు అంటే, ఆ ఉన్న కొంచెమైనా మనం నిలబెట్టుకోవాలన్నది విశ్వనాథ వారి తపన. చెట్టుకున్న ఆకులు రాలిపోయి, కొత్త చిగుళ్ళు రావచ్చు. అది కొత్తదనం అవుతుంది. కాని చెట్టు మొదలు మాత్రం పాతదే. అలాగే మనుషులు పుడుతూ మరణిస్తున్నా, వారిలో ప్రవహించే జాతి సంస్కృతి ఒక్కటేనని విశ్వనాథ చాటారు. ఆకులు మారవచ్చు కానీ మొదలనే మార్చాలనుకొంటే ఆ చెట్టు కూలిపోతుంది. అలాగే ఒక జాతి తన ఉనికిని కోల్పోవడానికి తన గతజీవన నేపథ్యాన్ని విస్మరించడం కారణమవుతుంది. కావున సాంప్రదాయ మొదలు పై చిగురించిన క్రొత్త చిగుళ్ళు ఆశాజనకమైనవి, ఆస్వాదనీయమైనవి. అవి విశ్వనాథ వంటి కవి కోకిలకు రుచిని పంచాయి. ‘కోకిలమ్మపెళ్ళి’ని వారి నోట పలికించాయి. విశ్వనాథ వారు సిద్ధాంతానికి, శిల్పనైపుణ్యాన్ని జోడించి అనల్పకల్పనతో నవలలు రాశారు. 60 నవలలు రాసిన వీరు ఒక్కో రచనలో ఒక్కో వైవిధ్యాన్ని కనపరిచారు.

విశ్వనాథ సత్యనారాయణగారికి సంప్రదాయ సంస్కృతులన్న ప్రాణము. ‘‘స్వస్థాన వేష భాషామతములు నిలబెట్టుట స్వర్గముకన్న గొప్పది. లక్ష కృత్రిమ సిద్ధాంతములకన్న గొప్పది.’’[24]

ఈవిధంగా విశ్వనాథ సత్యనారాయణగారి దృక్పథం వారి రచనల్లో కనిపిస్తుంది. వీరు సాంప్రదాయాభిమానులైనా, ఆధునికతను పూర్తిగా వ్యతిరేకించలేదు. మంచి ఎక్కడున్నా దాన్ని గ్రహించాలనే సిద్ధాంతం వీరిది. సాంప్రదాయాన్ని వ్యతిరేకించినంత మాత్రాన అది ఆధునికత కాలేదు. ఏ సాహిత్యం జాతిని చైతన్యవంతం చేస్తుందో, ఆదర్శమార్గంలో నడిపిస్తుందో, అది నిజమైన ఆధునికత, సాంప్రదాయ పునాది మీద నిలబడ్డ ఆధునిక భవనం. అది పది కాలాలపాటు నిలుస్తుందన్నది విశ్వనాథ వారి అభిప్రాయం. ఇది వారి రచనలను సహృదయ దృష్టితో పరిశీలిస్తే అర్థమవుతుంది. నదిలో ఎన్ని ఉపనదులు

కలిసి ప్రవహించినా, ఎన్ని చీలికలు వచ్చినా వాటికి మూలం ఒక్కటే, అంతం కూడా ఒక్కటే. అదే సముద్రం. అలాగే సాంప్రదాయం ఒక్కనాటితో పుట్టింది కాదు, ఒక్కరోజుతో అంతమయ్యేది కాదు. అది మానవజాతి తరతరాల వారసత్వ సంపద. మనిషి మనుగడకు, మమతానురాగాలకు అద్దం పట్టే తరగని సంపద. దాన్ని నిలబెట్టాలన్నదే విశ్వనాథ వారి ఆశయం.

## పాదసూచికలు

1. వజ్రభారతి 1947 - 2007, స్వతంత్ర భారతదేశంలో వివిధ రంగాలలో తెలుగువారి 60 ఏళ్ళ ప్రగతి సమీక్ష, సంపాదకులు : శ్రీ మండలి బుద్ధప్రసాద్, శ్రీ గుత్తికొండ సుబ్బారావు, డా॥ జి.వి. పూర్ణచంద్, శ్రీ ఇమ్మడిశెట్టి రామకుమార్, శ్రీ తాతా రమేశ్‌బాబు, అరవయ్యేళ్ళ సంస్కరణోద్యమాలు, శ్రీ తెలకపల్లి రవి, పుట : 356
2. సంస్కరణోద్యమ సాహిత్యంలో స్త్రీ నవలా ప్రక్రియ 1850 - 1920 (అముద్రితం) పరిశోధన : దంటు పద్మావతి, పుట : 274
3. పైదే, పుట : 55, 56
4. కందుకూరి వీరేశలింగం, అక్కిరాజు రమాపతిరావు, పుట : 70
5. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి కథలు, నవలలు ఆధునిక చైతన్యం (అముద్రితం), పరిశోధన : కుమ్మరి రాజు, పుట : 96
6. భారతీయ సాహిత్య నిర్మాతలు రాజారామమోహన్‌రాయ్, సౌమ్యేంద్రనాథ్ ఠాకూర్, పుట : 68
7. స్వాతంత్ర్యానంతర తెలుగు కవిత్వంలో సంఘసంస్కరణ, డా॥ పోతిరెడ్డి చెన్నకేశవులు, పుట : 130
8. పైదే, పుట : 133
9. పైదే, పుట : 132
10. తెలుగు వైతాళికులు : కందుకూరి వీరేశలింగం, రచన : డాక్టర్ అక్కిరిజు రమాపతిరావు, సంపాదకులు : డాక్టర్ నాగభైరవ కోటేశ్వరరావు, పుట : 10, 11
11. రాజారామమోహనరాయ్, నదీరా & యడవల్లి, పుట : 47, 48
12. కందుకూరి వీరేశలింగము రాజశేఖర చరిత్రము, నవల, పుట : 211, 212
13. భావనామ ఉగాది ప్రత్యేక సంచిక, గౌరవ సంపాదకుడు : యం.వి.యస్. ప్రసాద్, సంపాదకుడు : వి. విఘ్నేశ్వర రావు, పుట : 115
14. స్వాతంత్ర్యానంతర తెలుగు కవిత్వంలో సంఘసంస్కరణ, డా॥ పోతిరెడ్డి చెన్నకేశవులు, పుట : 1
15. కథాంశం (తెలుగు కథానికా సాహిత్య విమర్శ) రాచపాళెం చంద్రశేఖర రెడ్డి, పుట : 29
16. రజత రంజని (ఈ శతాబ్ది సాహిత్య దర్పణం), కె.కె. మీనన్, పుట : 43
17. కథాంశం (తెలుగు కథానికా సాహిత్య విమర్శ), రాచపాళెం చంద్రశేఖరరెడ్డి, పుట : 108
18. తెలుగు కథానిక - పుట : 70
19. తొలితరం తెలుగు కథా రచయితలు స్త్రీ సమస్యల చిత్రణ, ఎన్. రజని, పుట : 51
20. తెలుగు కథా రచయితలు పరిశీలనాత్మక వ్యాస సంకలనం, చలం, కె.సభా, పుట : 19
21. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి కథలు - స్త్రీ, పరిశోధన : కె.నరేశ్‌రావు, పుట : 33, 34
22. అడివి బాపిరాజు అతని రచనలు విమర్శనాత్మక పరిశీలన (అముద్రితం), వి. తిరుపతయ్య, పుట : 198
23. విశ్వనాథ నవలా శిల్పము, డా॥ మంచికలపాటి ప్రసన్నాంజనేయులు, ఉపోద్ఘాతము, పుట : xv
24. పైదే

# తెలుగు కథ -ఆవిర్భావ వికాసాలు

*తెలుగు కథలు రాస్తున్న వాళ్ళు తక్కువేమీ లేరు. ఆ మాటకొస్తే చదువుతున్న వాళ్ళు కూడా కొరతేమీ కాదు. ఎవరు ఏమి రాసినా సమాజ ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకొని రాయబడిన కథలే చిరకాలం మన్నుతాయి. రాశామని పించుకోవడానికి మాత్రమే రాసిన కథలు అనుకున్నంత ప్రాచుర్యాన్ని సంతరించుకోవు. ఈ క్రమంలో తెలుగు కథ పుట్టుపూర్వోత్తరాలు మొదలైన వాటిని తెలియజేసే ప్రయత్నం చేస్తాను.*

## 2.1 తెలుగు కథ పుట్టుక

తెలుగు సాహిత్య ప్రక్రియల్లో కథా ప్రక్రియకు ఒక విశిష్ఠమైన స్థానం ఉంది. సృజనాత్మక సాహిత్య కథ మహోన్నతంగా కొనసాగుతుంది. తెలుగు కథది 110 ఏళ్ళ ప్రస్థానం. ఇది ఆవిర్భవించినప్పటి నుండి ఎన్నో కొత్త పుంతలు తొక్కుతూ సమాజానికి సంబంధించిన ఎన్నో అంశాలను స్పృశిస్తూ సాగుతుంది.

"పాశ్చాత్యసాహిత్యం ద్వారా భారతీయ సాహిత్యానికి పరిచయమైన ఆధునిక సాహిత్య ప్రక్రియ కథానిక. దీని పుట్టుకకు ఆధునిక సామాజిక నేపథ్యముంది. ఆధునిక తెలుగు కథానిక ఒక్కసారిగా హఠాత్తుగా ఊడిపడలేదు. 1819 నాటి రావిపాటి గురుమూర్తి శాస్త్రి (The Tales of Vikramarka) నుంచి 1909 నాటి పనపాటికము శ్రీనివాసాచార్యులు, 'భోజసుతా పరిణయము' దాకా తొంభై ఏళ్ళ తెలుగు వచనం కథానికా పుట్టుకకు పురిటినొప్పులు పడింది. గురజాడ అప్పారావు 'దిద్దుబాటు' (1910 ఫిబవరి, ఆంధ్రభారతి) తొలి తెలుగు కథానిక అని ఎక్కువ మంది భావించారు. కానీ ఆచంట వేంకటసాంఖ్యాయనశర్మ 'లలిత' కాకపోతే, 'విశాఖ' తొలి తెలుగు కథలు అనే వాదాలున్నాయి. ఇటీవల భార్గవీరావు 'నూరేళ్ళపంట'లో బండారు అచ్చమాంబ 'స్త్రీ విద్య' (1902 హిందూసుందరి) తొలి తెలుగు కథానిక అని ప్రతిపాదించారు."[1] తెలుగులో పుట్టిన మొట్టమొదటి కథగా గురజాడ అప్పారావుగారి 'దిద్దుబాటు'ను పేర్కొంటారు. దీన్ని అందరూ అంగీకరించాల్సిన విషయమే. ఎందుకంటే కథకు ఉండవలసిన అన్ని లక్షణాలు ఈ దిద్దుబాటులో సంపూర్తిగా ఉన్నాయి కాబట్టి.

కథ్ ధాతువు నుంచి 'కథ' పుట్టిందని పూర్వులు చెప్తుంటారు. దీనికి సంభాషించడం, చెప్పడం, విశ్లేషించడం, వ్యాఖ్యానించడం వంటి అర్థాలున్నాయి. అగ్నిపురాణంలో కూడా కథానిక ప్రస్తావన వుందనీ, సంస్కృతంలో ఇతివృత్తభేదాన్ని బట్టి కథానికకు ''కథా, ఆఖ్యాయికా, ఖండ కాథా, పరికథా'' అనే భేదాలున్నాయని చెప్పారు. నేడు కథ-కథానిక అనేవి ఒకే అర్థంలో వాడబడుతున్నాయి. ఏ భాషకు చెందినవారైన కథంటే ఆసక్తిని కనబరచడం విశేషం. భారత దేశంలోఅతిపురాతన కాలం నుండీ కూడా కథాభీజాలు ఉన్నట్లు తెలుస్తుంది. యావత్ ప్రపంచానికి కథా సాహిత్యాన్ని అందించింది భారత దేశమేనని విదేశీయులు కూడా అంగీకరిస్తున్నారు. వేదాలు పుట్టిన కాలం నుంచి కథలుండటం, గుణాఢ్యుడు 'బృహత్కథ' రాయటం, నన్నయ ప్రసన్న కథకి ప్రాధాన్యత ఇవ్వటం, కావ్యాలలోనూ కథలు ఉండటం, ఈ విధంగా మన దేశంలో తెలుగులో కథా మూలం బలంగా ఉన్నట్లు స్పష్టం అవుతుంది.

ఆధునిక కథ సాహిత్యం 1910తో ప్రారంభమైంది. ఆధునిక తొలి కథానిక గురజాడ అప్పారావు రచించిన ''దిద్దుబాటు.'' ఇది 'ఆంధ్రభారతి' పత్రికలో ప్రచురింపబడింది. అప్పటి నుంచి నేటి దాకా తెలుగు కథ దినదిన ప్రవర్థమానమవుతూ పటిష్టంగా తయారౌతుంది. నానాటికి కథా ప్రపంచం విస్తరిస్తోంది.

రెండు మూడు దశాబ్దాల క్రిందట సాహిత్యం అంటే కేవలం కవిత్వమే అనే ప్రచారం జరిగింది. కవులకు ఉన్నంత ప్రాధాన్యత కథా రచయితలకు దక్కలేదు. కథలు వ్రాసిన వారి చరిత్రగానీ కథా సాహిత్య విమర్శ గ్రంథాలు గానీ వెలువడటం చాలా తక్కువ. 1910 లో తెలుగుకథ ప్రారంభమైతే 1960 దాకా సరైన కథా విమర్శ వెలువడలేదు. అంటే కథకి, కథా విమర్శకి మధ్య 50 సంవత్సరాల అంతరం ఏర్పడింది. తొలితరానికి చెందిన కథా సమీక్షకులు ఆచంట జానకీరామ్, నోరి నరసింహశాస్త్రి మొదలైన వాళ్ళని పేర్కొనాలి. తరువాతి తరానికి చెందిన వారిగా ఆర్.ఎస్. సుదర్శనం, టి.ఎల్. కాంతారావు, రామమోహనరాయ్, శార్వరి, పోరంకి దక్షిణామూర్తి, వావిలాల సుబ్బారావులను చెప్పుకోవచ్చు. నేటి తరానికి చెందిన కాథా విమర్శకులలో కోడూరి శ్రీరామమూర్తి, పాపినేని శివశంకర్, కాత్యాయనీ విద్మహే, ఓల్గా, మృణాళిని, వల్లభాచారి, రాచపాళెం చంద్రశేఖరరెడ్డి, బి.ఎస్. రాములు మొదలైన వారున్నారు.

''కథారచన అనేది అగ్గిపుల్లలతో మేడ కట్టడం లాంటిది. ఒక్క దశ వచ్చేసరికి ఒక్క పుల్ల ఎక్కువయినా మొత్తం కూలిపోతుంది. ఇంత శ్రద్ధగా 'బేలన్స్' గమనించాల్సిన

ఆవశ్యకత ఒక కథా రచనలో తప్పించి మరెక్కడా కనబడదు. అందుచేతనే సృజనాత్మక వచన సాహిత్య ప్రక్రియలన్నింటిలోకీ కథా రచన క్లిష్టమైనదిగా నేను భావిస్తాను" అన్నాడు ప్రఖ్యాత కథా రచయిత హెచ్. యి. బేట్స్ - తాను రచించిన 'మోడరన్ షార్ట్‌స్టోరీ' అనే రచనలో.

బేట్స్ కథా రచయిత కాబట్టి యిలా చెప్పాడనుకోవడానికి అవకాశం లేదు. కథారచన, నవలారచన, రెండింటిలోనూ ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన సోమర్‌సెట్ మామ్ కూడా ఇంచుమించు ఇలాంటి అభిప్రాయాన్నే వ్యక్తం చేశాడు."[2]

" 'కథ' అనేది సమాజానికి అద్దమూ, దీపమూ కావాలంటారు. గురజాడవారి ధర్మమా అని పుట్టుకతోనే యౌవ్వనాన్ని సంతరించుకున్న తెలుగు కథ చిరకాలంగా ఈ బాధ్యతను నెరవేరుస్తూనే ఉంది."[3]

కథలు రాయడం అంత తేలికైన విషయం కాదు. ఊహాజనితంగా కథ రాయడానికి ఎంతో ప్రతిభ కావాలి. వాటి విలువ తెలుసుకోడానికెంతో పరిజ్ఞానం ఉండాలి. వాటిని అర్థం చేసుకోవడానికి విచక్షణాజ్ఞానం కావాలి, కథలు కళ్ళకి వెలుగునిస్తాయి. బుద్ధికి పదును పెడతాయి. మనస్సుకు ఉత్సాహం, ఉల్లాసం కలిగిస్తాయి. కథలు చదవడం, వినడం, ఎప్పుడు దండగ అనుకోరాదు.

## 2.2 తెలుగు కథ వికాసం

1910లో గురజాడ 'దిద్దుబాటు'తో ప్రారంభమయిన తెలుగు కథ ఎంతోమంది సమర్థులైన కథా రచయితల చేతిలోకి చేరి నానాటికీ కొత్త రూపాన్ని సంతరించుకుంటూ ఏడాది పూర్తయ్యేసరికి ఇంకో అడుగు ముందుకు వేస్తూ బాల్యయౌవన దశలు దాటి 1940 నాటికి ప్రౌఢ దశకు చేరుకుంది. తరువాత నుండీ 1952 వరకూ ఆకస్మికమైన మార్పులతో ఎంతో ఎత్తు ఎదిగి, అంతర్జాతీయ కీర్తిని గడించింది. ఆ తరువాత మళ్ళీ 1965 వరకూ తెలుగు కథానిక రకరకాల ధోరణుల్నీ, మార్గాల్నీ అవలంభించి, విస్తృతంగా వ్యాపించి తన కీర్తి ప్రభల్ని బహుముఖంగా వ్యాపింపజేసింది. 1965 నుండీ 1990 వరకూ అనగా ఈ మూడు దశాబ్దాల పాటు తెలుగు కథానిక పాతవైభవం వల్ల, క్రొత్త నాణ్యతతో విరాజిల్లుతూ వచ్చింది. అందువల్ల తెలుగు కథానికా చరిత్రను పరిణామ వికాసాల్ని బట్టి స్థూలంగా కొన్ని యుగాలుగా విభజించవచ్చు.

పోలాప్రగడ సత్యనారాయణమూర్తిగారు తెలుగు కథా సాహిత్యాన్ని నాలుగు యుగాలుగా వర్గీకరించారు.

| | | | | | |
|---|---|---|---|---|---|
| 1. | 1910 | To | 1940 | - | తొలిదశ |
| 2. | 1940 | To | 1952 | - | మహోన్నత దశ |
| 3. | 1952 | To | 1965 | - | ఉజ్జ్వల దశ |
| 4. | 1965 | To | 1992 | - | మిశ్ర దశ |

తెలుగు కథ గొప్పతనం విశ్వవ్యాప్తం కావాలంటే, తెలుగు కథలు ఇంగ్లీషులోకి అనువదింపబడాలి. పాలగుమ్మి పద్మరాజు 'గాలివాన' కథ ప్రపంచ ఖ్యాతిని గడించిందంటే కారణం అది ఆంగ్లంలోకి అనువాదం కావడమే. జాతి ఔన్నత్యాన్ని పెంపొందించేందుకు సమైక్యతను సాధించేందుకు తెలుగు కథా రచయితలు పాటుపడాలి. తెలుగు కథా విశ్వఖ్యాతిని గడించాలని మనసారా కోరుకుందాం.

## 2.3 తెలుగు కథ లక్ష్యము

ఏ కథా రచయిత అయినా కథ రాయడానికి ఓ నిర్ధిష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుంటాడు. కథలు సాహిత్యంలో ఒక ప్రక్రియగా అవతరించినప్పటి నుండి సమాజ శ్రేయస్సునే లక్ష్యంగా చేసుకోవడం జరుగుతూ వస్తుంది. సమాజంలో ఉండే మంచీ చెడులు రచయిత గ్రహించి కథా వస్తువులుగా ఎంచుకుని కథలు వ్రాసి పాఠక లోకానికి అందిస్తాడు. అంటే దీని ముఖ్య ఉద్దేశ్యం మంచిని గ్రహించి చెడును త్యజించమని కథ ద్వారా ప్రబోధించడమే.

కథా, సమాజాన్ని చైతన్య పరిచే ఒక చక్కటి సాహిత్య సాధనం. రచయిత ఈసాధనాన్ని ఆయుధంగా చేపట్టి చెడును నిర్మూలించేందుకు కృషి చేస్తాడు.కథలు సమాజంలో జరిగే ప్రతీ విషయాన్ని విశ్లేషించి ప్రజలకు చెప్పగలిగే మాధ్యమాలు. బాల్య వివాహల నుండి, సాంఘిక దురాచారాలు అనబడే వేశ్యవృత్తి, మూఢనమ్మకాలు వంటి ఎన్నింటినో రూపుమాపడానికి కథా సాహిత్యం ఎంతగానో తోడ్పడింది. అలాగే స్త్రీ విద్య వితంతు పునర్వివివాహాలు వంటి ఎన్నింటినో ప్రోత్సహించడానికి కూడా కథ సహకరించింది.

వివాహ వ్యవస్థకు సంబంధించిన ఎన్నో విషయాలను కథల ద్వారా కథారచయితలు తెలియజేస్తూన్నారు. ఈ కథ దిన దిన ప్రవర్ధమానం చెందుతూ ఎంతో మంది కొత్త రచయితలను పుట్టిస్తూ నిరాటంకంగా సాగుతుంది. కథ స్పృశించని సమస్య లేదు. కార్మికుల కష్టాల నుండి వెట్టిచాకిరి వ్యవస్థను ధూమపానం, మధ్యపానం సమస్యను సైతం ఇది

నిర్మూలించడానికి ఉపయోగపడుతుంది. కథా లక్ష్యం ఏమిటో ఒక్క మాటలో చెప్పవలసివస్తే మెరుగైన సమాజాన్ని స్థాపించడంగా పేర్కోనవచ్చు.

'కథా సాహిత్యపు అభివృద్ధిని చూసి పాఠకులు ప్రశ్నించవచ్చు. కథలు వ్రాయుట ఎందుకు ? ఎవరికి ? ధనవంతులను ఆనందింప జేసేందుకా ? నిరుపేదలకా ! అని. ఈ విధంగా ప్రశ్నించడం అవసరం కుడా. వాదప్రతివాదాలు సైతం జరుగుతున్నాయి.'

ఎవరు ప్రశ్నించిన కథా రచయిత సమాధానం ఒక్కటే నశిస్తున్న మానవతా విలువలను కాపాడటం, కుహనా సంస్కారంతో అస్తవ్యస్తమైపోతున్న సమాజాన్ని సంస్కరించి పునర్పయనింప జేయడం అని చెపుతాడు. ఇది నూటికి నూరుపాళ్ళు వాస్తవమేనని మనం అంగీకరించాలి.

'కథంటే చిన్న పిల్లలు అమిత ఆశక్తిని కనబరుస్తారు. పెద్దవాళ్ళకు కూడా ప్రీతి. వినోదానికిగాని, భావనా శక్తికిగాని,విజ్ఞాన అభివృద్ధికిగాని, పరిహాస పరిణతికిగాని, ఉద్ధృతమైన ప్రకోపానికి గాని, పరమార్థచింతకుగాని కథ తన కర్తవ్యాన్ని నిర్వర్తిస్తుందని చెప్పవచ్చు.'

"పత్రికాయుగం వెలసిన తర్వాత విశిష్టరూపం ధరించిన కృతి విశేషాలలో చిన్న కథ ఒకటి. దీనికి 'కథానిక' అనే పారిభాషిక పదాన్ని ప్రయోగించిన విమర్శకుడు శ్రీ ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి. కథానిక గురించి చిన్న చిన్న వ్యాసాలు చాలా వెలువడ్డాయిగాని పుస్తక రూపంలో క్షుణ్ణమైన చర్చ ఇంత వరకూ కనబడదు.ఈ లోపాన్ని సవరించడానికి ఖాసింఖాన్ 'కథానికా రచన' గ్రంథాన్ని వెలువరించారు. ఇది ఇలాంటి మొదటి ప్రయత్నం.

లక్ష్య లక్షణాలలో లక్ష్యం మొదటిదీ, లక్షణం తర్వాతదీ ! ఉత్తమ కథానికకు లక్ష్య ప్రాయమైనవి పాశ్చాత్య సాహిత్యంలో వందల కొద్దీ ఉన్నవి. కేవలం చిన్న కథలలోనే సాహిత్య శిఖరాలందుకున్న రచయిత లెందరో ఉన్నారు. లక్షణ గ్రంథాలు కూడా సమృద్ధిగానే ఉన్నాయి. వీటిలో కొన్నింటినినైనా తెలుగులోకి తెచ్చుకుందామనే పూనిక మనలో కనబడదు. అనువాదాల వల్ల భాషా వికాసానికి హాని కలుగుతుందనుకోవడం పొరబాటు. ఇతర భాషల సాహిత్యంతో రాపిడి వల్ల స్వభాషలో ఉత్తమ సాహిత్యం జన్మించినట్లు ఎన్నయినా నిదర్శనాలు చూపించవచ్చు.

కథానికా రచన ఒక లక్షణ గ్రంథం. ఇందులో కథానికకు చెందిన వివిధాంగాలు దిగ్మాత్రంగా చూపబడ్డాయి. 'లక్షణం ఒక చూపుడు వేలు లాంటివి. రచయిత స్వప్రతిభ చేత తన దారి తాను తీసుకుంటాడు. లక్షణం అతనికి దిశ చూపిస్తుంది. దాని సహాయంతో సాహిత్య కళాకారుడు తన మార్గం తానే తీసుకుంటాడు' అంటున్నారు ఖాసింఖాన్‌గారు."[4]

"ప్రాచీనాంధ్ర భాషలో ఏ కథలున్నాయో ఎవరికీ స్పష్టముగా తెలియదు. జనుల నానుడిలో వుండే కథలు ఉండవచ్చు. అవి వచన రూపంలో ఉండొచ్చు, ఉండకపోవచ్చు. కొన్ని గేయరూపంగాను, మరికొన్ని ద్విపదులలోను, కొన్ని సరళమైన పద్యాలలోను ఉంటాయి. ముద్రితమైన కొన్ని నేటికి లభిస్తున్నాయి. అముద్రితములు చాలావరకు కాలగర్భంలో కలిసిపోయినవని చెప్పాలి. కథనా కావ్యాలలో కవితా పాటవము కంటె కథా ధోరణి ప్రధానము"[5].

కథను కేవలం కథగా చూడటం కాదు మనిషి జీవితపు ప్రతిబింబంగా పరిగణించాలి. కథ ద్వారా అందరు ఎన్నో నేర్చుకోవచ్చు. మరెన్నో తెలుసుకోవచ్చు. అందుకే కథ ఉన్నతమైన స్థానానికి చేరుకుంది. సమాజాన్ని ఉన్నతమైన స్థితిలోనికి పయనింపచేయాలని కథా రచయితలంతా కోరుకుంటున్నారు.

తెలుగుదేశంలో ప్రతి రెండో వాడు కవి అయి వుంటాడని హరీన్ ఛట్టో అన్నాడట బహుశా ప్రతి మూడో వాడు కథలు వ్రాసేవాడై వుంటాడు.

ఎందుకంటే ఈ రోజులలో కవిత్వం కంటే కథలు వ్రాయడమే కొంచెం కష్టంతో కూడిన పని. కథ అనే సరికి ఒక మొదలు, తుది, ఇతివృత్తం, పాత్రలు, సన్నివేశాలు, మంచీ చెడ్డ చాలా ఉంటాయి.

కథలు ప్రజలకి అర్ధమయ్యేలా వుండాలి. లేకపోతే ముందు పత్రికల వారే అచ్చువేసుకోరు. అంతేకాదు,దానికి కొంత ఊహాశక్తి కావాలి. నిత్య జీవితంలో కనిపించే మనుష్యులనే పాత్రలుగా మార్చి ఆసక్తికరమైన ఇతివృత్తం ఒకటి అల్లాలి. కొంత కష్టంతో కూడినదైనా కథలు వ్రాసేవారు కూడా తెలుగుదేశంలో తక్కువగా లేరు. అది అలా వుంచి కథలకు ప్రస్తుతం దేశంలో మంచి గిరాకీ వుంది. విస్తృతమైన మార్కెట్ వుంది. డిమాండును మించి ఉత్పత్తి చేస్తున్న పరిశ్రమ ఏదైనా తెలుగు దేశంలో వుంటే, అగ్రగణ్యమైనది కథా పరిశ్రమేనని చెప్పక తప్పదు.

## 2.4 తెలుగు కథ లక్షణాలు

కథానిక-కథ రెండు ఒకటే అని ఇంతకు ముందు పేర్కొనటం జరిగింది. కథన్న తరువాత కొన్ని లక్షణాలు ఉండి తీరుతాయి. లక్షణాలు లేని కథను కథగా పరిగణించడం జరగదు. ఈ కారణం వలననేమో 1910 కి ముందు కొన్ని కథలు వెలువడినా ప్రచారంలోకి రాలేదు, వచ్చినా గుర్తుంపు పొందలేదు. 1910 నుండి కథలు నియమబద్ధమైన లక్షణాలతో వెలువడటం జరిగింది.

'విలియం హెన్రీ హడ్సన్ వ్రాసిన "An Introduction to the Study of Literature" అను గ్రంథములో లక్షణాలను గురించి పేర్కొనడం జరిగింది. ఇంగ్లీషులో హెచ్.జి. వెల్స్ చిన్న కథలు చాలా వ్రాసాడు. ఫ్రాన్స్‌లో మెరిమ్మీ, గాటియరు, డాడెటు, జర్మనీలో పాల్ హైసీ, రషియాలో పుష్కిను, టాల్‌స్టాయి, గోర్కి, చిఖోవు గొప్ప కథా రచయితలుగా హడ్సన్ తెలియజేసాడు. ఈ కథలకు సంబంధించి అతడు రాసిన కొన్ని లక్షణములను పరిశీలిద్దాం.'

"The short story has firmly established itself as favourite form in Modern Literature... It is now very commonly recognised that a true short story is not merely a novel on a reduced scale or a digest in thirty pages of matter which would have been quite as effectively or even more effectively handled in three hundred.

But on the whole, the increasing popularity of the story has brought with it the increasing sense that considerations of art involve various specific requirements of matter and treatment. The subject of the story must be one that can be adequately and effectively developed within the prescribed limits.... whatever its particular theme and object, a story should leave us with the conviction that, if even nothing would have been lost, nothing would have been gained by further elaboration... I do not mean that a story must necessarily be confined to a single incident or moment. A story may be little more than an anecdote worked up into literary form and its success may entirely depend upon the skill shown in telling. It may deal with some one phase of character or experience or a detached critical sense. But on the other hand it may cover a wider field of time and involve a larger sequence of events than many novels.

A second fundamental principle of composition thus come to light - that of unity; under which head we include unity of motive, of purpose, of action and in addition to unity of impression. It may be laid down as a rule to which so far as I see, there can be no exception, that a short story must contain one and only informing idea and that this idea must be worked out to its logical conclusion with absolute singleness of aim and singleness of effect are therefore the two great canons by which we have to try the value of a short story as a piece of art. Attainment of this unity is one of the principle difficulties of short story writing. Perfection of workmanship in it needed - the complete adaptation of means to end - gives peculiar aesthetic pleasure to the thoughtful reader. By reason of its brevity and concentration the short story manifestly demands particular care in all the details of composition. While the brevity thus specified is the most obvious characteristic of the kind of narrative in question, the evolution of the story into a definite type has been accompanied by the development also of some fairly well-marked characteristics of organism. Far more than in the novel, everything superfluous and redundant must be omitted, the proper perspective must be maintained, the emphasis justly distributed, the necessary values given to the

successive movements of the narrative and the separate parts strictly subordinated to the whole."[6]

కథలను మంచి కథలు, గొప్ప కథలని ఖేరీజు వేసిమరీ చెప్పవచ్చు. మంచి కథలను మించి అన్ని విధాలుగా గొప్పగా వుండి అమితంగా ఆకర్షణను ఆదరణను పొందిన వాటిని గొప్ప కథలని నిర్ణయించాలి. ఇప్పుడు మంచి కథంటే ఏమిటో, దాని లక్షణాలేమిటో పరిశీలిద్దాం.

మంచి కథకు ఉండవలసిన లక్షణాలు, క్లుప్తత, అనుభూతి ఐక్యత, సంఘర్షణ, నిర్మాణ సౌష్టవం.

## 1. క్లుప్తత :

క్లుప్తత తనంతకు తానుగా రాదు. రచయిత దాన్ని కష్టపడి సాధించవలసిందే. ముందు క్లుప్తత అంటే ఏమిటో ఆలోచిద్దాం. కథ పొడవు తక్కువగా ఉండటమూ, క్లుప్తతా ఒకటే కాదని ఇంతకు ముందే అనుకున్నాం. ఇతివృత్తాన్ని బట్టి కథ పొడవు ఉంటుంది. కాబట్టి ఇతివృత్తం అవసరాలకు మించి కథ పెరగటాన్ని క్లుప్తత లోపించటంగా మనం భావించవచ్చు. కథలో క్లుప్తత అనేక కారణాల వల్ల లోపించవచ్చు. వాటిలో కొన్ని ముఖ్యమైన వాటిని పరిశీలిద్దాం.

**i) *సందర్భశుద్ధి లేకుండా కథలో వర్ణనల్ని చొప్పించటం :-*** చాలా మంది తెలుగు కథా రచయితలకు ఒక సుదీర్ఘమైన ప్రకృతి వర్ణనతో కథను ప్రారంభించే అలవాటు ఉంది. ఆ వర్ణనకూ కథాంశానికీ ఎలాంటి సంబంధం ఉండదు. అనేక సంధర్భాల్లో ఈ ప్రకృతి వర్ణన కాలాన్ని సూచించటం లాంటి చిన్న బాధ్యతను కూడా నిర్వహించదు.

ప్రకృతి వర్ణనలే కాకుండా మన కథల్లో కథాంశంతో సంబంధం లేని ఇతర వర్ణనలు కూడా చాలా తరుచుగా దర్శనమిస్తాయి. పాత్రల్ని ఆపాదమస్తకం వర్ణించటం, పాత్రలు తిరిగే ప్రాంతాలను వర్ణించటం, వారు ఏం ఆలోచిస్తున్నారని రచయిత ఊహిస్తున్నాడో ఆ భావాలను వర్ణించటం మొదలైన చాపల్యాలు ఎదురౌతూనే ఉంటాయి.

***ii) రచయితకు పాఠకుని సమర్థత మీదా, ఆలోచనా శక్తి మీద గౌరవం లేకపోవటం:*** తాను అన్ని విషయాలను గురించీ వివరంగా చెబితే తప్ప పాఠకునికి ఏమీ అర్థంకాదన్న అభిప్రాయం కొంతమంది రచయితలకుంటుంది. వీరు సర్వసాధారణ విషయాలను కూడా వివరిస్తారు. వీరిలో కొందరు ఛలోక్తుల్ని కూడా పాఠకుల ఊహాశక్తికి వదిలిపెట్టకుండా

తామే వివరిస్తారు. ఇలాంటి కథల్లో పాఠకుడికి క్రియాశీలమైన పాత్ర ఉండదు. తాను ఆలోచించి తెలుసుకున్నదీ, తానుగా అనుభవించిందీ ఏమీలేకపోవటం చేత అతనిలో ఎలాంటి సంవేదనా కలగదు.

**iii) *అనవసరమైన సంభాషణలూ, సంఘటనలూ కథలో చోటు చేసుకోవటం :*** అనవసర సంభాషణలూ, సంఘటనలూ కథలో చోటు చేసుకోవటాన్ని కొందరు విమర్శకులు "మందకొడి కథనం" అంటారు. వారి అభిప్రాయం ప్రకారం దానికి కారణం కథా రచయిత మనసులో కథా నిర్మాణం (డిజైన్) స్పష్టంగా లేకపోవటం. ఉదాహరణకు మధురాంతకం రాజారాం రాసిన ఎన్నో కథలు క్లుప్తత లోపించటం చేత బలహీనంగా తేలిపోయాయి. కథా ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకొని రచయిత వాటిని నిర్దాక్షిణ్యంగా కుదించి ఉంటే అవి ఇప్పుడున్న రూపం కంటే మెరుగైన రూపంలో ఉండేవి.

## 2. అనుభూతి ఐక్యత :

మంచి కథకు రెండవ లక్షణంగా అనుభూతి ఐక్యతను చెప్పుకోవచ్చు. దీన్ని ఇంగ్లీషులో "యూనిటీ ఆఫ్ ఇంప్రెషన్" అంటారు. 1842వ సంవత్సరంలో నథానియల్ హాథార్న్ కథల మీద సమీక్ష చేస్తూ ఎడ్గర్ ఆలన్ పో "అనుభూతి ఐక్యత"ను కథకు ఉండవలసిన ప్రధాన లక్షణంగా చెప్పాడు. ఈ సందర్భంలో "అనుభూతి" అన్న పదాన్ని కథ పాఠకునిలో కలుగజేసే భావప్రకంపనగా అర్థం చేసుకోవాలి.

మొదటి వాక్యం నుంచి చివరి వాక్యం వరకూ కథ, కథాంశం అన్న తీగ మీదనే నడవాలి. కథనంలో ఏకాగ్రత తప్పినా, అలసత్వం చోటు చేసుకున్నా కథకు తీగమీద నడిచేవాడికి పట్టేగతే పడుతుంది. "పులి తరుముకొస్తున్న వాడు తాను ఎక్క దలుచుకున్న చెట్టు దగ్గరకి ఎలా పరుగెడతాడో అలా కథకుడు సూటిగా తన కథాంశం వద్దకు పరుగెత్తాలి, అన్నాడు హెచ్. జి. వెల్స్. కథల్లో అనుభూతి ఐక్యత, క్లుప్తతలాగే రచయిత కష్టపడి సాధించినప్పుడు మాత్రమే కుదురుతుంది. అప్రయత్నంగానో, అకస్మాత్తుగానో కుదరదు. పాఠకుని ప్రతిస్పందననూ, అనుభూతినీ రచయిత "కంట్రోల్" చేయగలిగి ఉండాలి."[7]

## 3. సంఘర్షణ :

మానవుడు ఏదో ఒక సందర్భంలో సంఘర్షణకు గురౌతుంటారు. ఆసంఘర్షణ పాక్షికంగా ఉండొచ్చు. దీర్ఘ కాలంగా ఉండొచ్చు. స్వల్పకాలంగా ఉండొచ్చు. "మంచి కథకు మూడవ లక్షణం సంఘర్షణ. సంఘర్షణ అనేక రకాలుగా

ఉండవచ్చు. ఇద్దరు వ్యక్తుల మధ్య, ఒకే వ్యక్తిలోని రెండు అంశాల మధ్యా రెండు భావాల మధ్యా, రెండు సిద్ధాంతాల మధ్యా, రెండు జీవిత దృక్పథాల మధ్యా - ఇలా ఎన్నిటి మధ్యనైనా ఉండవచ్చు. అంతే కాకుండా ఈ సంఘర్షణ భౌతికంగా కానీ, మానసికంగా కానీ ఉండవచ్చు. ఈ రెంటిలో ఒకటి సులభమనీ, మరొకటి కష్టమనీచెప్పడానికి వీల్లేదు. రచయిత తన కథలో ఎన్నుకునే సంఘర్షణ అతని అభిరుచిని బట్టీ, జీవితానుభవాన్ని బట్టి ఉంటుంది. సాధారణీకరణం చేసిన వ్యక్తుల మధ్య సంఘర్షణను పెద్దిబొట్ల సుబ్బరామయ్య, భావాల మధ్య సంఘర్షణను కొడవగంటి కుటుంబరావు, తాత్విక దృక్పథాల మధ్య సంఘర్షణను రావిశాస్త్రి, ప్రతీకలుగా రూపొందించిన పాత్రల మధ్య సంఘర్షణను కాళీపట్నం రామారావు మనసులోని రెండు భావోద్రేకాల మధ్య సంఘర్షణను బుచ్చిబాబు గొప్పగా చిత్రించగలిగారు. అలాగే ప్రకృతికీ, మానవునికీ మధ్య రాయలసీమలో జరుగుతున్న సంఘర్షణను సింగమనేని, కేతువిశ్వనాథరెడ్డి, చక్రవేణు, స్వామిలాంటి ఎందరో రచయితలు చిత్రిస్తున్నారు. స్త్రీ పురుషుల మధ్య అసమ నైతిక - ఆర్థిక సూత్రాలు సృష్టించిన సంఘర్షణను ఓల్గా, సత్యవతి చిత్రిస్తున్నారు. మానవుని సాంఘిక, మానసిక జీవితాలు రానురానూ మరింత క్లిష్టంగా, సంఘర్షణా మయంగా తయారవుతున్నాయి. వ్యవస్థకూ, వ్యక్తికీ మధ్య కూడా సంఘర్షణ పెరిగిపోతూ ఉంది. కాబట్టి సంఘర్షణాత్మకమైన కథా వస్తువులకు కరువు లేదు, రాదు.''[8]

## 4. నిర్మాణ సౌష్టవం :

మంచి కథకు ఉండవలసిన నాలుగవ లక్షణం నిర్మాణ సౌష్టవం. దీన్నే కొంతమంది విమర్శకులు ''ప్లాట్'' (plot) అని కూడా అంటారు. ''కథ''లోని కథకు చక్కని నిర్మాణం తప్పకుండా ఉండాలనీ, నిర్మాణం ద్వారానే కథాంశం పాఠకుని మనసుని తాకుతుందనీ చాలా మంది విమర్శకులూ, రచయితలూ భావిస్తారు.

ఏనాడో అరిస్టాటిల్ చెప్పిన ఆదిమద్యాంతాల సిద్దాంతం ఈనాడు కూడా పనికొస్తుందనీ, అది నాటకానికే కాక కథకు కూడా వర్తిస్తుందనీ సోమర్సెట్ మాం అంటాడు.

కొందరి కథల్లో ఆదిమధ్యాంతాలు స్పష్టంగా కనిపిస్తాయి. కొందరి కథల్లో ఆద్యంతాలు మసకమసకగా ఉంటాయి. అలాంటి కథల్లో మధ్య భాగం మాత్రమే ఉన్నట్టు అనిపిస్తుంది. చెకోవ్ రాసిన ఎన్నో కథలు అలా కనిపిస్తాయి. చెకోవ్ కథలకు ఆద్యంతాలు ఉండవనీ, అవి తాబేళ్ళలా ఉంటాయనీ సుప్రసిద్ధ కథా నవలా రచయిత గాల్స్ వర్థీ అన్నాడు. చెకోవ్

రాసిన కొన్ని కథలు ఒక సంఘటనల వరసను కాకుండా ఒక "స్థితి"ని వర్ణించే మాట నిజమే. ఆ కథల్లో ఆద్యంతాలు కాగితం మీద కనిపించవు. రచయిత మనసులో ఉంటాయి. పాఠకుని ఊహలో రూపుదిద్దుకుంటాయి. కాబట్టి కథనంలో కనిపించనంత మాత్రాన ఆ కథలకు ఆద్యంతాలు లేవని భావించటం పొరపాటే.

ఆద్యంతాల సమస్యను గురించి చెకోవ్ అభిప్రాయాన్ని కూడా తెలుసుకోవటం మంచిది. అతడు తన మామూలు చమత్కార పద్ధతిలో ఇలా అన్నాడు, కథ రాయటం పూర్తి చేశాక ప్రారంబాన్నీ, ముగింపునూ తీసెయ్యాలి. కథకు ఆది, అంతం ఉండాల్సిన అవసరం లేదనటానికీ, రాసిన తరువాత వాటిని తీసెయ్యాలనటానికీ చాలా భేదం ఉంది. రాసిన తరువాత తీసెయ్యాలంటే కథలో వాటిని అదృశ్యంగా ఉంచాలనీ, వాటిని పాఠకుని ఊహా శక్తికి వదిలి పెట్టాలనీ అర్థం.

ఆది సంగతి ఎలా ఉన్నా, అంతం విషయంలో చాలా మంది రచయితలకు స్థిరమైన అభిప్రాయాలున్నాయి. ఉదాహరణకు సోమర్సెట్ మాం తన కథల్ని అసందిగ్ధంగా ముగించటానికే ఇష్టపడతానన్నాడు. నా కథల చివర వరుసగా కొన్ని చుక్కలుండవు. ఒకే ఒక చుక్క (ఫుల్ స్టాప్) ఉండటమే నాకు ఇష్టం, అన్నాడు మాం. 'ముగింపులో పాఠకుణ్ణి విస్మయ చకితుణ్ణి చేసే అంశం నెలకొని ఉండటం సాధారణంగా మంచి కథల లక్షణం' అంటాడు మధురాంతకం రాజారాం తన 'కథన రంగం' అన్న వ్యాసంలో. దీన్ని మరోరకంగా 'కొసమెరుపు' అనవచ్చు. కొసమెరుపే కథా నిర్మాణంలోని ప్రధాన సూత్రంగా ఓ. హెన్రీ ఎన్నో కథలు రాశాడు. బహుశా జీవితాంతం ఒకే శిల్పంతో కథలు రాసిన కీర్తి (లేదా అపకీర్తి) అతనికే దక్కుతుంది.

వల్లంపాటి వెంకట సుబ్బయ్యగారు మంచి కథను గురించి, దానికి ఉండవలసిన లక్షణాలను గురించి తన కథా శిల్పంలో సవివరంగా చర్చించడం జరిగింది. కానీ గొప్ప కథకు సంబంధించిన అభిప్రాయాన్ని వీరు తెలియజేయలేదు. అంటే దీనికి కారణం మంచి కథకి గొప్ప కథకి మధ్య ఎక్కువ తేడా లేకపోవడమే. మంచి కథకు మించి అన్ని విధాలుగా బాగున్న కథే గొప్పకథ అవుతుంది. ఈ విషయం మనందరికీ తెలుసు. ఈ మంచి కథ గొప్ప కథల మధ్య చెప్పుకోదగిన తేడా లేకపోవటం వలన మంచి కథకు ఉన్న లక్షణాలన్నింటినీ గొప్ప కథకు కూడా మనం ఆపాదించుకోవాలి. గొప్ప కథను గురించి పోరంకి దక్షిణా మూర్తిగారు తన కథానికా స్వరూప స్వభావాలలో ఈ విధంగా పేర్కొన్నారు.

"మంచి కథల్లోనే ఒకానొక విలక్షణత సంతరించుకొన్నది 'గొప్పకథ.' మంచికథ అనిపించుకొన్నదల్లా గొప్పకథ కాబోదు. మంచి కథ కావడానికి తోడు, జీవితంలోని ఒకానొక మహత్తర సత్యాన్ని అద్భుత శిల్పనైపుణ్యంతో కళ్లకు కట్టించి, హృదయాన్ని ఒకొనొక మహత్తర అనుభూతితో నింపించి, పదే పదే చదవాలనిపించే కథను 'గొప్పకథ' అని చెప్పవచ్చు. ఈ సందర్భంలో, బుచ్చిబాబు చెప్పింది మళ్ళీ గుర్తుకు వస్తుంది. "వస్తువు స్వీకరించడం, ఊహలో వ్యక్తుల రూపకల్పన చేయడం ఒకెత్తూ, వ్రాసేటప్పుడు కళానుగుణమైన ఆవేశానికి లొంగిపోయి కళానుగుణమైన సత్యాన్ని ప్రదర్శించడం ఒకెత్తూ. ఆ సత్యం కథకుణ్ణీ చకితుణ్ణి చేస్తుంది. తన లోపలి చీకటి తెరలు తొలగినట్లవుతుంది. ఒక్క క్షణం ఊపిరి బిగపెట్టి ఒక వెలుగు చూస్తాడు. ఆ క్షణం ఆధ్యాత్మికానుభూతి పొందుతాడు. అట్లా పొంది అందులో కాస్తో కూస్తో పాఠకుడితో పంచుకో గలిగితే అతని కథ గొప్పకథ అవుతుందనుకుంటాను.

కథానికా రచనను గురించి చెప్పే సందర్భంలో విక్టర్ జోన్స్, మపాసా రాసిన 'వెండెట్టా' (ప్రతీకారం) కథనూ బైబిలులోని 'ద గుడ్ సెమారిటన్' కథనూ విశ్లేషించి చూపి, మపాసా కథ శిల్పరీత్యా చక్కగా ఉన్నప్పటికీ పరమార్థపరంగా గొప్పకథ అనిపించుకోదని ఖండితంగా చెప్పాడు. 'ద గుడ్ సెమారిటన్' లోని వస్తువు మతసంబంధమే అయినప్పటికీ ఒక మనిషి, తోటి మానవుల పట్ల నిర్వర్తించవలసిన విధిని నిరూపిస్తున్నందు వల్ల అతనికి, ఆ విధితో సంబంధమున్న విషయం నిరూపితమైనందు వల్ల - ఇతర కథా వస్తువులన్నీటి కంటే ఇది విశిష్టమైనది, ఉదాత్తమైనది అని స్పష్టం చేశాడు. మపాసా కథలోని ముసలమ్మ, కొడుకు చావుకు కారకుడైన వాడి మీద పగతీర్చుకొన్న తరువాత తృప్తిగా నిద్రపోతుంది. అలాగే, ఆ కథ చదివిన పాఠకుడు కూడా హాయిగా నిద్రపోవచ్చు. కాని పాఠకుణ్ణి నిద్రపుచ్చటం కాదు, సాహిత్య ప్రయోజనం; నిద్రలో మునిగిన వాణ్ణి సైతం మేల్కొలపాలి. ఆ విధమైన మేల్కొలుపు, ఈ రెండో కథలోనే ఉంది. ఒకానొక పరిపూర్ణ సత్యాన్ని ఆవిష్కరించి హృదయాన్ని ఉదాత్తమైన అనుభూతితో నింపుతుంది. ఇందువల్లే ఇది గొప్పకథ అయింది. ఈ మాదిరి రచనలు ఏ భాషలో వెలువడినా చిరస్మరణీయాలవుతాయి.

ఈ మాదిరిగా గొప్పకథలని చెప్పదగ్గవి తెలుగు సాహిత్యం కూడా సమకూర్చుకొన్నది. ఉదాహరణకు గుడిపాటి వెంకటాచలం రాసిన 'ఓ పువ్వు పూసింది.' పద్మరాజు రాసిన 'పడవ ప్రయాణం, గాలివాన,' బుచ్చిబాబు రాసిన 'పొగలేని నిప్పు' విశ్వనాథశాస్త్రి 'కార్నర్ సీట్, నీడలు.' హేతు వాదానికీ వివరణకూ విశ్లేషణకూ లొంగకుండా అతీతమైన జీవిత

గాంభీర్యాన్ని, సౌందర్యాన్ని చలం, మమకార పారమ్యాన్నీ, ప్రవర్తన నివృత్తినీ పద్మరాజు, మాలిన్యం సోకకుండా దానికదే పరమార్థమైన మమత్వాన్ని బుచ్చిబాబు, ఒక విషాదాన్ని రాచకొండ ఆయా రచనల్లో అనల్పశిల్ప నైపుణ్యంతో ప్రదర్శించారు, హృదయసంస్పందన కావించే ఉత్తమ రచనలందించారు.”[9]

కథానికను పోరంకి దక్షిణా మూర్తిగారి ప్రకారం మూడు రకాలుగా విశ్లేషించవచ్చు. దీన్నే ఆయన 'త్రిమితీయ విశ్లేషణ' (three - dimensional) అని పేర్కొన్నాడు. అవి

1) వస్తుగత విభాగం

2) రూపగత విభాగం

3) సంవిధాన విభాగం.

**1) *వస్తుగత విభాగం :*** రచనకు మూలభూతమై ప్రేరక బీజంతో మొదలుకొని పరమార్థ సంసిద్ధ పర్యంతరం సాగే అంతః స్రోతస్విని వస్తుగత విభాగం. ఈ వస్తుగత విభాగంలో గమనార్హమైన అంశాలు నాలుగున్నాయి.

(i) కథాబీజం

(ii) కథా వస్తువు

(iii) ఇతివృత్తం

(iv) పరమార్థం

**2) *రూపగత విభాగం :*** ఆది నుంచి అంతం వరకు వివిధావయవ సుసంఘటితమైన కథా శరీరం రూపగత విభాగం.

ఈ విభాగంలో పరిశీలించవలసిన అంశాలు ఆరున్నాయి.

(i) ఎత్తుగడ

(ii) నడక

(iii) చిక్కు, లేదా విషమస్థితి

(iv) పట్టు, లేదా పరాకాష్ఠ

(v) విడుపు, లేదా చరమసీమ

(vi) ముగింపు.

**3) *సంవిధాన విభాగం :*** అవయవ సుసంఘటన కావించి, సౌష్ఠవం చేకూర్చి, సౌంధర్యం పోషించే వివిధాంశ సమాహారం సంవిధాన విభాగం. సంవిధాన విభాగంలో పరిశీలించవలసిన అంశాలు ప్రధానంగా ఐదు ఉన్నాయి.

(i) పాత్ర

(ii) సంఘటన

(iii) సంఘర్షణ

(iv) సన్నివేశం

(v) కథనం.

## 2.5 తెలుగు కథ భేదాలు

ఈనాడు కథ తెలుగు సాహితీ సామ్రాజ్యాన్ని పాలిస్తూందనడం ఎంతమాత్రం అతిశయోక్తికాదు. వస్తువులోనూ, శిల్పంలోనూ, శైలిలోనూ, నిర్వహణలోనూ, వైవిధ్యాన్ని కనబరుస్తూ నేర్పు చూపిన సృజనాత్మక ప్రతిభా సమర్థులైన తెలుగు కథా రచయితలు ఎందరో వున్నారు. వారిలో చెప్పుకోదగ్గవారు విశ్వనాథ, శ్రీపాద, గురజాడ, కొడవటిగంటి, చలం, దీక్షితులు, మునిమాణిక్యం, బుచ్చిబాబు, అడివి, పాలగుమ్మి, వేలూరి, తిలక్, గోపీచంద్, మల్లాది, టేకుమళ్ళ, చాసో, రావూరి, మధురాంతకం, బలివాడ, వాకాటి, సుదర్శనం, ఇనాక్, కాళీపట్నం, రావిశాస్త్రి, వంగపండు వంటివారు. వీరు తమ సాహిత్యాన్ని విశ్వవ్యాప్తం చేశారు.

తెలుగు సాహిత్యంలో అనంత వైవిధ్యంలో లెక్కలేనన్ని కథలు వెలువడ్డాయి. వాటిని నిశితంగా పరిశీలిస్తే ఈ కింది భేదాలు కనబడతాయి.

1. సాంఘిక కథలు
2. చారిత్రక కథలు
3. పౌరాణిక కథలు
4. రాజకీయ కథలు
5. ఆర్థిక కథలు
6. కాల్పనిక కథలు
7. జానపద కథలు
8. మనో విశ్లేషణ కథలు
9. చైతన్య స్రవంతి కథలు
10. వైజ్ఞానిక కథలు
11. కళారంగ కథలు
12. సాహిత్య కథలు
13. విమర్శ కథలు
14. అనువాద కథలు
15. అపరాధ పరిశోధక కథలు
16. ఆధ్యాత్మిక కథలు
17. దేశభక్తి కథలు
18. తాత్త్విక కథలు
19. వరకట్నం కథలు
20. స్త్రీ కథలు
21. స్త్రీవాద కథలు
22. దళిత కథలు

23. దళితవాద కథలు
24. జాతీయ సమైక్య కథలు
25. సంఘసంస్కరణ కథలు
26. జీవిత చరిత్ర కథలు
27. స్వీయ చరిత్ర కథలు
28. విప్లవ కథలు
29. హేతువాద కథలు
30. అస్తిత్వ కథలు
31. అధిక్షేప కథలు
32. సామ్యవాద కథలు
33. దయ్యాల కథలు
34. పునర్జన్మ కథలు
35. పోలీసు కథలు
36. సారా కథలు
37. అత్తగారి కథలు
38. ఆత్మ కథలు
39. లేఖక కథలు
40. మనీ కథలు
41. మినీ కథలు
42. నిరుద్యోగం కథలు
43. కార్టూన్ కథలు
44. పోరాట కథలు
45. కథలో కథ కథలు
46. వ్యంగ్య కథలు
47. బాలల కథలు
48. నీతి కథలు
49. ప్రకృతి బీభత్స కథలు
50. శృంగార కథలు
51. కరుణ కథలు
52. ప్రేమ కథలు
53. రిక్షావాలా కథలు
54. కార్మిక కథలు
55. డైరీ కథలు
56. స్త్రీ - పురుష సంబంధ కథలు
57. కులాంతర ప్రేమ కథలు
58. వేట కథలు
59. హాస్య కథలు
60. అధికార సంబంధ కథలు
61. దుండగుల కథలు
62. మాండలిక కథలు
63. వినోదాత్మక కథలు
64. సంస్కరణ కథలు
65. వేశ్య కథలు
66. రైతు కథలు
67. ఉపాధ్యాయ కథలు
68. ఉద్యోగ కథలు
69. దొంగ కథలు
70. గిరిజన కథలు మొదలైనవి.

ఇలా రకరకాల భేదాలతో అనేక కథానికలు తెలుగులో వచ్చాయి అని వెలమల సిమ్మన్నగారు ఆధునిక సాహిత్య విమర్శ సిద్ధాంతాలు అనే గ్రంథంలో పేర్కొన్నారు. ఈ కథానికా సాహిత్యం ఈనాడు ఎంతో వైవిధ్య భరితంగా విరాజిల్లుతుంది.

ఇప్పుడు కొన్ని సాహిత్య ఉద్యమాలు తెలుగు కథమీద ఎటువంటి ప్రభావాన్ని కనపర్చాయో విశ్లేషణాత్మకంగా తెలియజేస్తాను.

## 2.6 తెలుగు కథ - సంస్కరణోద్యమం

సంస్కరణోద్యమం అనేక ప్రక్రియల (కథ, నవలా, కవిత్వం వంటివెన్నో)పై తన ప్రభావాన్ని కనపర్చింది. ప్రస్తుతం తెలుగు కథపై సంస్కరణోద్యమ ప్రభావం ఎంత మేరకు ఉంది అనే విషయాన్ని చర్చించటం జరుగుతుంది. ఇదే విషయానికి సంబంధించి మరింత విపులంగా తరువాత అధ్యాయాల్లో మరింత సవివరంగా తెలియజేస్తాను.

దేశాన్ని పురోగమించనివ్వకుండా అడ్డుకుంటున్న ఎన్నో సాంఘిక సమస్యలను తొలగించాలని మేధావులయిన విద్యావంతులగు గురజాడ, చలం, కందుకూరి వీరేశలింగం, సామినేని ముద్దు నరసింహనాయుని, పరవస్తు రంగాచార్యులు వంటి మరెందరో సంఘసంస్కరణను భాద్యతగా తమ భుజస్కందాలపై ఎత్తుకున్నారు. కందుకూరి వీరేశలింగం రాకతో సంఘసంస్కరణమనేది ఓ ఉద్యమంలా రూపుదాల్చింది ఆంధ్రరాష్ట్రంలో. రాజారామ్మోహనరాయ్ రాకతో యావత్ భారతదేశం అంతటా సంస్కరణలు ప్రారంభమయ్యాయి.

19వ శతాబ్దం అనేక మూఢ నమ్మకాలతోనూ, పెక్కు స్త్రీ సమస్యలతోనూ, మరెన్నో సాంఘిక దురాచారాలతోనూ కొట్టు మిట్టులాడుతుండేది. దీనిని సవరించకపోతే మానవ వినాశనం ఖాయం అని భావించి వాటిని రూపుమాపే దిశగా ప్రయత్నాలు జరిగాయి. ప్రజలలో ఆలోచనలను రేకెత్తించేందుకు సమాజాన్ని చైతన్య పరిచేందుకు సాహిత్యం ద్వారా రచయితలు, కవులు, కళాకారులు తమ వంతు చేయూతనందించారు. ఈ సంధర్భంలో తెలుగు సాహిత్యంలో ఒకటైన కథా ప్రక్రియపై సంస్కరణోద్యమం పై కనబరచిన ప్రభావాన్ని తెలియజేస్తాను.

1910లో వెలువడిన గురజాడ "దిద్దుబాటు" ఓ గొప్ప సర్దుబాటనే చెప్పాలి. వేశ్యాలోలుడైన గోపాలరావు సమాజాన్ని ఉద్దరించే ఉద్యమంలో పాల్గొంటున్నానంటూ ఇంటి నుండీ వెళ్ళి అర్ధరాత్రి దాటాక గానీ ఇంటికి చేరడు. ఇలా కొంతకాలం గడిచిన తరువాత అతగాడి నిర్వాకమంతా ఇరుగు, పొరుగు వారి ద్వారా తెలుసుకున్న భార్యా కమలిని అతనిని మార్చే ప్రయత్నం చేసింది ఇలా.

"తలుపు; తలుపు: "

తలుపు తెరువబడలేదు. ఒక నిమిషమతడూరుకొనెను.

"ఎంత ఆలస్యము చేస్తిని? బుద్ధి గడ్డితిన్నది. రేపటి నుంచి జాగ్రత్తగా వుంటాను. ఒక్కపాట సరదాతో కుదరలేదు. లేకుంటే, పోకిరీ మనిషివలే పాట ముగిసిన దాకా కూర్చోవడమేమి?" అని విచారిస్తూ గోపాలరావు తలుపు చేతనంటగానే రెక్క విడబారెను. గదిలోకి పోయి దీపము వెలిగించి గది నలుదిసెల పరికించెను. కమలిని కానరాలేదు. వీధి గుమ్మముజేరి తలుపు తెరచి చూడ చుట్టకాల్చుచు తలయెత్తి చుక్కలు పరీక్షించుచున్న రాముడు వీధి నడుమ కానవచ్చెను. కోపములో వానిని పిలిచెను. అతడు చుట్ట పారవైచి "బాబు" అని డగ్గరెను. అమ్మగారెక్కడ? అని అతనిని ప్రశ్నించెను. అతడు ముఖము తేలవేసెను. ఎచ్చటను కానక మోచేతుల నడుమ తలయుంచి యోచించుచుండ కమలిని చేవ్రాలు నొక యుత్తరము కానవచ్చెను.

"అయ్యా, పది దినములాయె రాత్రులన్నింటికి మీ రాకయే నేనెరుగను. మీటింగులకు బోవుచుంటి మంటిరి. మా చెలుల వలన నిజము నేర్చితిని. నేనింటనుండుటను గదా, మీరు కల్లలు పలుక వలసి వచ్చె. మీ త్రోవకు అడ్డముండకుండుటయే పతి మేలుకోరిన సతికి కర్తవ్యము కదా? నేనీరేయి కన్నవారింటికి జనియెద సంతసింపుడు." ఉత్తరమును ముగించి గోపాలరావు తన్ను తాను తిట్టుకొనెను. తనచెడు బుద్ధికి తగిన శాస్తి జరిగినదని విలపించెను.

తాతలనాటి నౌకరు రాముడికి "పంతులుకి బుద్ధి వచ్చింది. ఇక యెన్నడూ సానుల పాట వినరు. రాత్రులు యిల్లు కదలరు. ఇది ఖరారు. మిమ్ములను గెడ్డము పట్టుకొని బతిమాలుకున్నానని చెప్పమన్నారు. మీరులేని రోజూ యుగముగా గడుపుతున్నారు." అని కమలినితో చెప్పి తీసుకొని రమ్మనెను.

తను చెప్పిన మాటలు కమలినితో రాముడు చెప్పునో లేదో యని వానిని తనయెదుట చెప్పమనెను. రాముడు "అమ్మా! నా మాటినుకోండి ఆడోరు యజమాని చెప్పినట్టల్లా యిని వల్లకుండాలి. పట్టంలోకి బంగార బొమ్మలాంటి సానమ్మ వచ్చింది. ఆపై మీ సిత్తం అంతాను" అనెను. "ఓరీ వెధవా" అని గోపాలరావు కోపముతో లేచెను.

అంతట మంచము క్రిందనుండి అమృత నిష్యందినియగు కలకలనగువును కరకంకణముల హృద్యారావమును విననయ్యెను (దిద్దుబాటు).

విద్యావంతురాలై ఉండడం వల్ల వివేకంగా ఆలోచించి అతడి తప్పు అతనికే తెలిసి వచ్చేలా చేసింది. అందుకే దిద్దుబాటులో కమలిని మహిళలందరికీ ఆదర్శం.

మన సమాజంలో గోపాలరావు వంటివారు ఎంతోమంది ఉన్నారు. రోజూ ఎన్నో భార్యభర్తల కలహాలు మనం చూస్తూనే ఉన్నాం. నేడు వారికి దొరికే పరిష్కారమేంటంటే విడాకులు తీసుకోవడమో లేదా ఒకరినొకరు హతమార్చుకోవటమో. ఇది సరికాదు. తెలివిగా ఆలోచించడం చాకచక్యంగా సమస్యను సమూలంగా పరిష్కరించడం చేయాలి.

ఇది కేవలం విద్యవలనే సాధ్యమవుతుంది. విద్యనభ్యసిస్తే వివేకం పెరుగుతుంది. వివేకం పెరిగితే మహోన్నతులు కాగలుగుతారు. అందుకే గురజాడ చదువుకున్న స్త్రీ గురించి "దిద్దుబాటు"లో ఇలా అంటాడు.

"భగవంతుడు సృష్ఠిలో కల్లా ఉత్కృష్ణమైన వస్తువు స్త్రీ రత్నమే... నీ కూతురు బడికి వెళుతున్నది కదా! విద్య విలువ నీకే బోధపడుతుంది."

కమలిని గోపాలరావుని సంస్కరించి సన్మార్గంలోకి తీసుకొచ్చిన కథ దిద్దుబాటు కనుక సంస్కరణోద్యమ ప్రభావం 'దిద్దుబాటు' కథ పై ఉందని చెప్పవచ్చు.

## 2.7 తెలుగు కథ - జాతీయోద్యమం

మన దేశ చరిత్రలో సంఘసంస్కరణోద్యమం, జాతీయోధ్యమం చిరస్థాయిగా నిలిచిపోయే ఉద్యమాలు. ఇవి మతం కోసం కానీ, కులం కోసం కానీ, ప్రాంతం కోసం కానీ జరిగినవి కానేకావు. వాటికి పరిమితులున్నప్పటికీ, స్వదేశీరుగ్మతలకి, విదేశీ వలస పాలనకు వ్యతిరేకంగా జరిగినవి. సంస్కరణోద్యమాన్ని ప్రజల కోసం సంస్కర్తలు, మేధావులు నడిపిస్తే, జాతీయోద్యమాన్ని ప్రజలే నడిపించారు. దేశ చరిత్రలో జాతీయ సమస్య పరిష్కారానికి ప్రజలు పాల్గొన్న గొప్ప ఉద్యమం జాతీయోద్యమం.

స్వాతంత్ర్య పోరాటంలో ఎందరో యువతీయువకులు పాల్గొన్నారు. నమ్మిన సిద్ధాంతం కోసం కుటుంబాన్ని, జీవితాన్ని లక్ష్యపెట్టని సంసారులు సైతం ఆ ఉద్యమంలో ఉన్నారు. తమ వారసులంతా నశించినా బీటవోని ధైర్యంతో నిలిచిన వృద్ధులు కూడా ఉద్యమంలో పాల్గొన్నారు.

"నా కన్ననూ, దేశ మాతయే ముఖ్యమనే" తల్లులూ "మా యింటిలో నోము నోచుకొను వారు ఖద్దరు వస్త్రములు ధరించియే నోచుకొనవలయును" అన్న వారు సైతం లేకపోలేదు.

ఆనాటి ఉద్యమకారుల త్యాగశీలత ఈనాటి తరానికి స్ఫూర్తిదాయకం కావాలి.

"జాతీయోద్యమం గురించి కొంచెం ఆలోచించాలి.

పారతంత్ర్య భారతాన్ని స్వతంత్రదేశంగా చేయటమే జాతీయోద్యమం యొక్క ముఖ్యోద్దేశం కాని, ఇది బహుముఖమైనది.

1. సహాయ నిరాకరణ.
2. సత్యాగ్రహం.
3. విదేశీ వస్తువుల బహిష్కరణ.
4. నూలు వడకడం, ఖద్దరు కట్టడం.
5. విద్యావిధానంలో మార్పులు తెచ్చి భారతీయ సంస్కృతీ ప్రధానంగా భోదించడం.
6. హరిజనోద్ధరణ.
7. సర్వమత సమన్వయం.
8. పన్నులు కట్టకుండా ఉండడం.
9. స్కూళ్ళను, ఆఫీసులను, కోర్టులను బహిష్కరించడం సమ్మెలు చేయడం.
10. జైళ్ళకు పోవడం.
11. స్త్రీ జనాభ్యుదయం.
12. నిరక్ష్యరాస్యతా నిర్మూలనం.
13. మధ్యపాన నిషేదం.
14. వయోజన విద్య.
15. హిందీ

ఈ విధంగా చాలా భాగాలు కలది జాతీయోద్యమం. ఇరవయ్యో శతాబ్ది తొలి భాగంలో ప్రారంభమైన ఈ ఉద్యమం, భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించడంతో బలహీనమయింది. అంతవరకు అది ప్రజల ఉద్యమం. తరువాత ప్రజల ప్రభుత్వం దానిని దాఖలు చేసుకుంది.''[10]

తెలుగు సాహిత్యం జాతీయోద్యమ సంధర్భంలో ఏ విధంగా ప్రతిస్పందించిందీ, అందులోనూ ముఖ్యంగా కథా ప్రక్రియ జాతీయోద్యమాన్ని ప్రజలలో ఏ విధంగా ప్రేరేపించిందీ తెలియజేస్తాను.

``భారతీయ సంఘం పరాధీనతలో అన్ని విధాలా మలమల మాడిపోతున్నది.... తెలుగు కథాకరులు యక్షగానాలే వింటున్నారు. వారికి చీమైనా కుట్టడం లేదు.'' ``..... ప్రేమ గాధల వల్ల స్వాతంత్ర పోరాటంలో ప్రోత్సాహం దొరకాలి.''[11]

"ఇది సంఘర్షణ యుగము. భారత హృదయం స్వాతంత్ర్యం కావాలని పరితపిస్తున్నది... ఏ మూల చూచిన స్వతంత్ర భావమే మన కథా సాహిత్యంలో ప్రతిబింబించాలి."[12]

**గృహోద్ధరణమే దేశోద్ధరణము:-** ఈ కథను పరిశీలిస్తే నేడు చాలా మంది 'మేము సంఘానికి మేలు చేకూర్చే కార్యక్రమాలు నిర్వహిస్తాం, దేశబాగు కోసం పాటు పడతాం' అంటూ ఊకదంపుడు ప్రసంగాలు ఇచ్చే వారే కానీ, ఆచరణలో చూపించే వారు చాలా తక్కువని తెలుస్తుంది.

ఒకటి మొదలు పెట్టి అది పూర్తి కాకుండానే ఫలితాన్నాశించి, ఫలితం దక్కక దాన్ని వదిలి పెట్టి మరోదాన్ని చేపట్టే మనస్తత్వం గల వ్యక్తులు చాలామందే ఉంటారు రమణరావులా. ఈ కథలో రమణరావుది చెంచల మనస్తత్వమని తెలుస్తుంది. నిలకడలేని కార్యచరణ కలవాడని కూడా మనకు అర్థమవుతుంది.

'రమణరావు బెజవాడలో నివశించేవాడు. స్వాతంత్ర్యభిలాషతో శాంతి ఉద్యమంలో పాల్గొని, ఆంధ్రదేశమంతటా తిరిగి ప్రచారం చేపట్టి రెండేళ్ళు జైలు శిక్షను కూడా అనుభవించాడు. కానీ దాని తరువాత ఉద్యమం పట్ల కొంత అపనమ్మకం కలిగి వృధాగా కష్టపడ్డానే, స్వరాజ్యమున కొంచెమైన సంపాదించుకోలేకపోయానే అనుకొనే వారిలో ఇతడు కూడా చేరాడు. అది కూడా సహనములేని సహవాసదోష కారణంగా. ఇలా ఉండగా, మహత్మాగాంధీ గ్రామోద్ధరణ ప్రణాళిక ఇతడి చెవిని బడినప్పటి నుండీ హృదయంలో మరుగున పడిన దేశభక్తి ఒక్కసారిగా తిరిగి మొలకెత్తింది. గ్రామోద్ధరణ కోసం ఎన్నో విధాలుగా ప్రయత్నిస్తున్నాడు. నాయకుల సలహాలను కూడా తీసుకొంటున్నాడు. కానీ ఎక్కువ ప్రతిఫలము త్వరలోనే కలుగుతుందనే సూచన అతనికి కనబడుటలేదు. అతడు రహస్యంగా చేస్తున్నవి ఏ మాత్రం చెల్లవని అతడికి తెలిసింది. పైగా ప్రభుత్వం వారి నుండి పొందిన ఉద్యోగం కూడా కోల్పోవలసి వస్తుందేమో అన్న భయం అతడిలో మొదలైంది. అంటే ఉద్యోగాన్ని వదిలిపెట్టడం అతడికి కష్టం కాదు కానీ, ఉద్యోగము లేకుండా, కనీసం దేశ సేవకుడిగానన్నా లేకుండా ఉండటం అతనికి ఇష్టం లేదు. అయితేలోకానికి "శాంతి సమరసైనికుడగు నాతడుద్యోగమెట్లు స్వీకరించె"నని సందేహం కలగొచ్చు. ఆ విధంగా చేసిన వారు చాలా మంది ఉన్నారు. "ఉడుకారిన తరువాత ఉద్యమాన్నే దూషించే ప్రబుద్ధులు కూడా చాలా మంది ఉన్నారు." వారిలో ఇతడు చేరడు గానీ, చేస్తే గౌరవంగా ఉద్యోగం చేసి సంసారం చేయాలి, లేకపోతే దేశసేవ చేయాలనే మనస్తత్వం కలవారిలో ఇతడొకడు.

కమలాదేవి రమణరావు భార్య. భర్త అంటే ఆమెకు ప్రేమేగాని అతడి విచిత్ర వ్యాపారము ఆమెకు సరిపడదు. దేశసేవ కోసం తమ జీవితాలను ఒకసారి వినియోగింపదలచినప్పుడు దానికి కట్టుబడి ఉండాలి కానీ చేతగాకపోతే చచ్చు పెద్దమ్మయై పడివుండాలి. ఒక దాని నుండీ మరోదానికి మారడం పనికిరాదనేది ఆమె ఊహ. కొన్ని రోజుల నుండీ రమణరావు ఓ సమస్యతో సతమతమవుతున్న విషయం ఆమెకు తెలుసు. దాని పరిష్కారం అతడికి చెప్పాలనుంది. చివరకు ఒక రోజు చెప్పాలని నిర్ణయించుకుంది.

"ఓహో! దేవీగారేమో ఆలోచించునట్లున్నదే"

"..............."

"అబ్బ అంత దీర్ఘాలోచనా"

".............."

"వినపడదా! లేక కో-"

"..............."

"ఎప్పటి నుండి ఈ మూగతనము"

"............."

"యేమిటో మేముకూడ తెలిసికోకూడదా నీ ఆలోచన, కొంచెం చెప్పుదూ."

"............."

"ఏమి కమాలా! మాట్లాడవు నిద్రాయేమి తొమ్మిదిఘంటలకే"

"ఊ........."

"మూగవేషం వేశావే"

"నీవు నేర్పిన విద్యయే నీరజాక్ష"

"ఎత్తుకు పైయెత్తా! ఏమిటో చెబుదూ! విసిగించక"

"మీరు జెప్పారా సాయంత్రము?"

"ఓహో! అదా! ఏమిటో ఆలోచిస్తుంటివి."

"నేగూడా ఆలోచిస్తూనే యున్నాను."

"చెప్పమంటూంటే!!"

"మీరు చెప్పండి మొదట."

"ఊ, విను. గ్రామోద్ధరణలో ఫలితం త్వరగా గనపడవలయునంటే స్త్రీలు తమయింటిని మొదట ఉద్ధరించుకొనాలి-"

“అవును పురుషులు చేతగానివారైతే.”

“ఆ. ఆ. ఏమన్నావు. చేతగాకకాదు, స్త్రీలు గూడ వారికెక్కువ సాయపడాలి.”

“సాయపడకేం జేస్తున్నారు. కాని పురుషులకు పట్టుదలలేదీ! నాన్ కోఆపరేషనులో కొన్ని దినములు మహావీరులవలె పనిజేసి ధనమాన ప్రాణములకు లెక్కింపక పాటుపడి తరువాత ఆయుద్యమమందు నమ్మకమువీడి, తిరిగి కన్నవారి కాళ్ళుపట్టి ఉద్యోగం సంపాదించి మరల గ్రామోద్ధరణయట. రేపుదయమున మరే యుద్ధరణకు బయలుదేరుతారో నమ్మకవేమున్నది.”

“చతురురాలి చీవాట్లుచాలు. ఇంతకు మునుపు జేసినదానిని గూర్చి త్రవ్వకుము. ఇకపై యుద్దేశ్యములు మార్చక పాటుబడెదను.”

“సరే అట్లే గానివ్వండి. ఇపుడేమి జేయదలచితిరి?”

“నీవు నేటి సర్వవిషయములను చదువుచున్నదానవుగదా! మన స్నేహము ఆదర్శప్రాయముగా జేయుట కెట్టి పద్ధతి యవలంబింపబడవలయునో తెలియక ఆలోచిస్తున్నా.”

“మీకు దెలియదని ఒప్పుకొంటిరి. సరి, నేను చెప్పెద వినండి.”

“నీ కామార్గము దెలిసేనా ఊరుకున్నావు.”

“తెలిసినంత మాత్రమున గంతులు వేయవలయునా? ఒక గృహ మాదర్శప్రాయముగ నుండవలయునన్న యింటనుండువారి దినచర్యయందెక్కువ మార్పు గలుగవలయును.”

“ఏమిటది. కాఫీకి వేసినయెత్తా.”

“అవసర మెందుకండి! ఆరోగ్యప్రదముగ సూర్యోదయమునకు ముందే లేచి కాలకృత్యములు నిర్వర్తించి”

“కాఫీ త్రాగి-”

“కాఫీ టీ వగైరా పానీయములను తుదముట్టింపవలయును. ప్రాణమానములను లెక్కింపక దేశసేవకై తెగించు వారుకూడ కాఫీ మొదలగు వానిని త్యజింపకుండుట హేయము. మిమ్ముజూచియే మేమును నేర్చుకొంటిమి. కాని మేము చక్కబడి మిమ్ము చక్కజేయగలము. అట్టి సదుద్ధేశ్యముతోడనే, ఆంధ్రసోదరీమణులింకమీదట యీ రీతి తప్పక వర్తింతురని నమ్మకము చేతనే యిటుల నడవ సాహసించుచున్నాను.”

“కాఫీకి స్వస్తి జెప్పితిరి. తరువాత-”

“చేతగాని సోమరులవలె యెనిమిది గంటల వఱకు నిద్రింపక, లేచినంతనే

యితరులు పనిజేయలేదని వారిపైన నధికారము వహింపక సర్వము నేనే గావించుకొందును. సర్వేశ్వరుడు ఆరోగ్యమగు శరీరము నిచ్చియుండ, యితరులచే బనిజేయించి ఆరోగ్యమును, అర్థమును నష్టపరచుకొననేల?

"కమలా! కోమలమగు శరీరము ఉదయము నుండియు పనిజేసిన నలసిపోదా!"

"అబ్బ! ఎంతదయో? ఇట్లే మగవారు స్త్రీలు దుర్బలులగుటకు మార్గములు జూపుచున్నారు. నాకిష్టమై నేను జేయుదుననుచుండ మీకేమి కష్టము. ఉదయమునజేయు పనులచే నారోగ్యమును, తన్మూలమున శరీరవికసనము గలుగునుగదా!"

"ఇక వంటకు గూడ నీవే దిగెదవా?"

"నీకేమి? వంటలక్క జేయు భోజన మెంతలక్షణముగనున్నది మనకు దెలియనిదిగాదు. అది యామె ఇతరులకొఱకై జేయుటచే నట్లున్నది. మనకొఱకై నేనేజేసిన నెంతరమ్యము గానుండునో జూతురుగాక! దీనివలన మనకు నెలకు పదిరూపాయలుగూడ మిగులును. ఇంతకు మీ భాగమునకు మీరుద్యోగము జేసి సంపాదించుచున్నారు. నా భాగమునకు నే నింటి పనులు జేయుదును. ఇది నాయుద్యోగము."

"ఈ ప్రకారముగ పైకము మిగిలించి వంకో వడ్డాణమో..."

"జేయించుకున్న మీకు నష్టమేమి? పీడించి పీకబిసికి ఉన్నను లేకున్నను సొమ్ములు తెప్పించుకొను నిల్లాండ్ర కంటె ఇది యుత్తమముగదా! చాకచక్యముచే, చతురతచే పైకము మిగిలించి ఆభరణముల జేయించుకొన్న యే భర్త యడ్డగించును. ఎక్కడికి బోవును? సమయమున కుపయోగపడును గదా?"

"పని జేసిజేసి మధ్యాన్నము బాగుగా గుఱ్ఱుపెట్టి"

నిద్రించుట కంటే పనికి మాలిన పనిలేదు. రాటమున్నది. అది యారంభింతును. వచ్చిన అమ్మలక్కలతో పనికిరానియు, నితరులకు హానిగల్గించునవియు నగు నధిక ప్రసంగములాడక ప్రపంచవిషయములను, సంస్కరించుకొనవలసిన విషయముల రాటము వద్ద నుండియే ప్రసంగింతును. ఉత్తమ గృహస్థురాలి కింతకంటె మంచి మార్గములేదు. ఇదెంతయు మేలుగూర్చును."

"విదేశ వస్తువుల నుపయోగింపకుండుటకు మార్గమేమి వెదకితివి?"

"మనకు అన్నపానాదులు దేవుడిచ్చిన మనభూమి యందే బండుచున్నవి. మీరు శలవుదినములలో క్లబ్బులకు వృధాగా మిత్రులతో దిరుగకపోయినచో మనకుగావలసిన ప్రతిదానిని మనభూమియందు బండించునేర్పాట్లు జేయవచ్చును. వర్తకమే ప్రపంచకము

నావరించుకొనియున్న యిక్కాలములో విశేషవస్తువులు ముట్టక కాలముగడుపుట కష్టముగ గన్పట్టవచ్చును. కాని సాధ్యమైనంతవఱకు మనవస్తువులనే వాడుకొని నభ్యాసపడవలయును. ఈ విషయమున జెప్పుటకెన్నేనియు గలవు. జేయుట కంతకంటెను గలవు. ఇది నావంటి సోదరీమణుల కొకసూచన. దీనికి మీ వంటి వారు దోహదము గల్గించునట్లైన సౌఖ్యమున దేలియాడగలదు."

"ఉపన్యాసముల కేమిగాని కార్యములు జేయువలయును గదా!"

"చూతురుగాక! రేపటి నుండియే, ఈ పద్ధతి నవలంబించెదను. ఎందులకుగాదో చూడవలయును."

"ఇంతకు అందరికి విద్య వచ్చినయుండిన గదా నిదిబెరుగును. సంసారములు జేయుచుండువారికి నేర్చుకొనుటకనుకూలము లేవి?"

"అట్టి సందేహము మీకక్కఱలేదు. ఇంట్లో ఆడవారికి పనులుండుట పాతికకాలము, పనికిరాని వృథా ప్రసంగాలు ముప్పాతికభాగము. నేనిప్పుడు జెప్పునది మధ్యరకము కుటుంబినుల మాట. వీరాప్రసంగములకుపయోగించు కాలమును తెలిసిన ఇతరుల వద్ద ఆసమయమందే నేర్చుకొనుట చాల మంచిపనిగదా! తుదకు ప్రపంచపరిస్థితులను చేయవలసిన కార్యపద్ధతులనైన నెఱింగవలయును (గృహోద్ధరణమే దేశోద్ధరణము)."

గృహోద్ధరణమే దేశోద్ధరణము అనే దానికి కమలాదేవి ఆలోచనలు ఆచరణ సాధ్యాలు. ముందు మనల్ని సంస్కరించుకొని తరువాత మన వాళ్ళని, మన చుట్టు పక్కల వాళ్ళని, మన గ్రామాన్ని సంస్కరిస్తే క్రమంగా రాష్ట్రం, దేశం, యావత్ ప్రపంచమే సంస్కరించబడుతుంది. అనే దానికి ఈ కథ గొప్ప ఉదాహరణ. కనుక జాతీయోద్యమం తెలుగు కథపై తన ప్రభావాన్ని కనపర్చినట్లు గ్రహించాలి.

## 2.8 తెలుగు కథ - స్త్రీ వాద ఉద్యమం

స్త్రీ వాద ఉద్యమం ఎందుకు ఆవిర్భవించవలసి వచ్చింది? అసలు స్త్రీవాద ఉద్యమ సాహిత్యమంటే ఏది? దీని వల్ల ఎటువంటి ప్రయోజనం ఉంది? ఇటువంటి ప్రశ్నలు నేడు ఎక్కువగా తలెత్తుతున్నాయి. సభలలోనూ, సాహిత్యంలోనూ ఈ అంశానికి సంబంధించి విస్తృతమైన చర్చలు కూడా జరుగుతున్నాయి. కవులు, రచయితలు ఎవరికి తోచిన అభిప్రాయాన్ని వారు వ్యక్తపరుస్తున్నారు. స్త్రీ వాదం ఎందుకు ఆవిర్భవించవలసి వచ్చిందంటే, సృష్టి ప్రారంభమయిన తరువాత స్త్రీ పురుషులిద్దరూ ఈ భూమి పై జీవనం

ప్రారంభించారు. జాతిని పెంపొందించడంలో వీరిద్దరూ సమాన ప్రాధాన్యాన్ని కలిగి ఉన్నారు. కానీ సమాజం పరిణామం చెందే కొద్దీ స్త్రీ వెనకబడ సాగింది. పురుషుడు అభివృద్ధి మాత్రం సమస్తాన్ని శాసించే దాకా వచ్చింది. దీనికి గల కారణాలను అన్వేషించే క్రమంలోనే స్త్రీ వాదం ఆవిర్భవించింది.

స్త్రీ వాద ఉద్యమం మొదట అగ్రదేశాలలోనే ఆరంభమైనట్లు ఆధారాలు ఉన్నాయి. "ప్రపంచ దేశాలలో అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్-మొదలయిన దేశాలలో స్త్రీల పోరాటాలు మొదట మొదలయ్యాయి.

అమెరికాలో 1840లో, బ్రిటన్‌లో 1850లో, జర్మనీలో 1860 మధ్యలో ఫ్రాన్సులో 1860చివర్లో ప్రారంభమయ్యాయి. నార్వే, ఫిన్లాండ్, ఐర్లాండ్‌లలో 1890 నుండి మొదలయ్యాయి. ముఖ్యంగా అమెరికా, ఫ్రాన్స్, బ్రిటన్ దేశాల స్త్రీల పోరాట ప్రభావం మనదేశంపై ఉంది."[13]

మొదట, స్త్రీల సాహిత్యం కూడా పురుషుల చేతే రాయబడేది. రానురానూ స్త్రీలే స్త్రీవాద సాహిత్యాన్ని వెలువరించడం ప్రారంభమయింది. దీనికి కారణం స్త్రీ సాహిత్యాన్ని స్త్రీలే రాస్తే వారి సమస్యలు, రోధనలు, వేదనలూ వాస్తవానికి అతి దగ్గరగా ఆవిష్కృతమౌతాయి. అదే పురుషుడి చేత రాయబడితే, కృత్రిమంగా తయారౌతుందనే అభిప్రాయం.

"స్త్రీ వాదంలోంచి పుట్టిందే స్త్రీ వాద సాహిత్యం. తమ అంతరంగాలను తామే ఆవిష్కరించుకోగలమన్న నమ్మకం ఏర్పడింది. తమ సమస్యలకు తామే పరిష్కారాలు వెతుక్కోగల స్థైర్యం, కాదన్న వారిని ధిక్కరించే ధైర్యం అలవడిన క్రమంలో స్త్రీ వాద సాహిత్యం విశేషంగా వెలువడింది.

ఇందులో కొన్ని విభాగాలు కూడా ఏర్పడ్డాయి. ఏ వాదంలోనైనా అతివాదం, మితవాదం ఉన్నట్లే ఇక్కడ కూడా ఉన్నాయి. అలాగే సామ్యవాద సిద్ధాంత పరిధిలోనే దీన్ని చూడాలని ఆశించిన వారున్నారు. ఇంతకంటే తీవ్రమైన దృష్టితో దీన్ని చూడాలన్నవారూ ఉన్నారు. ఎప్పుడైతే స్త్రీ వాద సాహిత్యం ప్రధానంగా కవిత్వం - ప్రభంజనంలా రావడం మొదలైందో అప్పుడే దీని మీద విమర్శలు బయలుదేరాయి. విశేషమేమిటంటే కమ్యూనిస్టు దృక్పథంతో దీన్ని విమర్శించిన వారే ఎక్కువగా ఉండటం."[14]

ఈ నేపథ్యంలో తెలుగు సాహిత్యంలో ఒకటిగా విరాజిల్లుతున్న కథా ప్రక్రియపై స్త్రీ వాద ఉద్యమం ఎటువంటి ప్రభావాన్ని చూపించిందో తెలియజేస్తాను.

పి. సత్యవతి రాసిన 'గోవు' కథలో గోమతి పేదరికంలో పుట్టి కష్టాలననుభవించి, వయసు పైబడ్డాక పెళ్ళి చేసుకొని భర్త దగ్గర సుఖపడదామనుకొని, అక్కడ సైతం భర్తవలన, ఆడపడుచువలన అంతులేని దుఃఖానికి, వేదనకి గురైన స్త్రీ.

క్రిమినల్ లాయరుగా పేరు ప్రఖ్యాతలున్న సుందరరావుకు పెళ్ళి చేసుకోవాలనే ఆలోచన కలిగిందనే విషయం పెళ్ళిళ్ళపేరయ్యా అయిన పరమేశ్వరానికి తెలుస్తుంది. మొదట ఆశ్చర్యపడి, తరువాత సుందర్రావుగారింటికి వెళ్ళి అతడి అక్క స్వరాజ్యలక్ష్మిని కలిసి పెళ్ళి విషయాన్ని ప్రస్తావించి, తిరిగి ఇంటికి చేరతాడు. ఇదే విషయాన్ని తన భార్యతో చెప్పగా, "అదేమిటండీ! ఎవరో ఎందుకు! మన వెంకట్రావు చెల్లెలు గోవుంది కదా! పాపం దాన్ని ఓ ఇంటి దాన్ని చేసి పుణ్యం కట్టుకోండి, వాళ్ల వదినే కట్నం ఇచ్చి దానికీ జన్మలో పెళ్ళి చెయ్యదు. దానిక్కూడా మొన్నమొన్ననే నలభై దాటాయి. తల్లి లేని పిల్ల. పదేళ్లు తేడా ఫరవాలేదులెండి. మీ పుణ్యాన అది సుఖపడుతుంది." అని కర్తవ్యం బోధచేసింది (గోవు)."

అలా రెండో పెళ్ళి వాడైన సుందర్రావుని చేసుకొని గోమతి ఆ ఇంటికి చేరుతుంది. అక్కడ 'కొత్తొక వింత' అన్న చందంగా ఆర్టిఫిషియల్ ప్రేమలు, పలకరింపులు, సదుపాయాల సమకూర్పులు జరుగుతుంటాయి. ఇదంతా మేడిపండులో పురుగులుంటాయనేది ఎంత వాస్తవమో ఈ పిలుపులు, ప్రేమలూ అన్నీ అంతే అవాస్తవాలని గ్రహించడానికి ఎంతో కాలం పట్టలేదు గోమతికి. తనని ఆప్యాయంగా పిలిచేదీ, పలకరించేదీ ఇంటి పని, వంటి పని చేయించుకోడానికేనని తెలుసుకుంది.

సరిగ్గా ఆ సమయానికే గోమతి శరీరంలో మరో ప్రాణానికి అంకురార్పణ జరిగింది. ఈ ఆనందకరమైన విషయాన్ని సుందర్రావుకు చెప్పింది. అప్పుడు మొదలౌతుంది అసలు కథ.

"ఇదెంత మాత్రం వీల్లేదు గోమతీ ఎంత మాత్రం వీల్లేదు. మా కిరణ్మయికి పెళ్ళయి దానికి బిడ్డపుడితే నేను తాతయ్యనవుతాను. ఇప్పుడు నువ్వు మళ్లీ తండ్రిని చెయ్యడానికి వీల్లేదు. నా పరువేం కావాలి. ఈ వయస్సులో నాకు పిల్లలేమిటి? నీకు నలభై ఏళ్ళొచ్చాయి. కిరణ్మయి, బాబూ వాళ్లే మన పిల్లలు. వాళ్ళు నిన్ను స్వంత అమ్మకన్నా ఎక్కువ ప్రేమిస్తారు" అన్నాడు ఆయన.

"ఈ ఒక్క నలుసునీ నాకు దక్కనీయండి. మిమ్ముల్నేం అడగను" అని ప్రాధేయపడింది గోమతి.

'విను గోమతీ నీకింకేం కావాలన్నా అడుగు. మేం నిన్ను సరిగ్గా చూడం అనుకుంటే నీ పేర కొంత డబ్బు బ్యాంక్‌లో వేస్తాను. వరలక్ష్మి నగలలో సగం యిప్పుడే నీకిస్తాను. నెల నెలా నీపేర రికరింగ్ డిపాజిట్ కడతాను. నేను పోయాక నీకొచ్చేలా ఇంకో ఇన్సూరెన్సు పాలసీ తీసుకుంటాను.'

'అవన్నీ నాకవసరంలేదండీ నేను డబ్బులో పుట్టి పెరగలేదు. వున్నదాంతోనే నాకు సంతృప్తి కానీ నా బిడ్డ అనేది ఈ ఒక్కటే.'

"నా మాట విను గోమతి. ఈ బిడ్డ పుట్టడం వల్ల ఎన్నో సమస్యలొస్తాయి. తార దగ్గర ఎబార్షన్ చేయించుకో ఈ వయస్సులో పిల్లల్ని కనడం బాగోదు."

ఈ వయస్సులో పెళ్ళి చేసుకోవడం బాగుందా?

ఈ వయస్సులో వయసొచ్చిన ఆడపిల్ల పడకగది పక్కన భార్యతో పడుకోవడం బావుందా? ఈ వయస్సులో జుత్తుకి రంగు వేసుకోవడం బావుందా... వంటికి స్ప్రే సెంట్లు కొట్టుకోవడం బావుందా? అని గోమతి అడగలేదతన్ని.

"అవునమ్మా వాడు చెప్పిందే సబబు. నువ్వు కూడా ఆలోచించు, మనవడు పుట్టే ఈడులో కొడుకులేమిటమ్మా? నీవు మాత్రం వయస్సులో తక్కువా? నీ ఈడుకి నిజంగా కిరణ్మయంత కూతురుండవలసిన మాట... ' అని సన్నాయి నొక్కులు నొక్కింది ఆవిడ వృద్ధ మహారాణి.... జంబుకం (గోవు)."

గోమతి, భర్త ఆడపడుచు చెప్పిన మాటలు వినకపోయేసరికి, ఆమెకు తెలియకుండా వారికి తెలిసిన హాస్పటల్‌లో తెలిసిన డాక్టర్ తారాతో గోమతికి అబార్షన్ చేయిస్తారు. హాస్పటల్‌లో రెండు రోజులు గడిపి, వొట్టి చేతుల్తో భర్త ఇంటికి చేరుతుంది గోమతి.

'ఓ గదిలో అందరూ టీవీ చూస్తుంటారు. మరో గదిలో ఒంటరిగా పడుకొని ఉన్న గోమతిని స్వరాజ్యలక్ష్మి, 'రా అమ్మ గోమతి, నువ్వు కూడా వచ్చి ఇలా కూర్చో, ఒక్కదానివే ఏం పడుకుంటావు? జరిగిన దానికి బాధపడకూడదు. నువ్వలా వుంటే మాకేం బావుండదు.' అని చెయ్యి పట్టుకుని లేవదీస్తుంది ఆవిడ.

ఆమెలేచి వెళ్ళి వాళ్ళతో కలుస్తుంది. ఇంతలో టీవీలో ముగ్గురాడవాళ్ళు... స్త్రీలు ఎంతో పురోగతిని సాధించారనీ, అన్ని రంగాలలో ప్రగతిని సాధిస్తున్నారని, ఉదాహరణకు ఇందిరాగాంధీని పేర్కొన్నారు. విమానాలు నడిపేస్తున్నారనీ, బిజినెస్ మ్యాగ్‌నెట్‌లు అవుతున్నారనీ, గవర్నర్‌లు సైతం అవుతున్నారని పదిమంది పేర్లని పదే, పదే చెప్తూ ఈ పది మంది ప్రగతే యావత్ భారత దేశపు మహిళలందరి ప్రగతిగా ప్రచారం చేస్తూంటే,

గోమతికి నలబై కోట్ల మంది స్త్రీలలో ఇరవై మంది సాధించిన ప్రగతి ఏ పాటిదో ఆలోచించకుండా మురిసిన స్త్రీలను చూసి ఓ పక్క వాంతీ, మరో పక్క దుఃఖమూ ముంచుకొచ్చాయి.

"ఇంజెక్షను చేయించుకోడానికి వెళ్ళొచ్చిన గోమతికి గుమ్మంలో ఎదురైన స్వరాజ్యలక్ష్మి మనిషి వేషంలో ఉన్న తోడేలుగా కనిపించింది. తను ఇంటికి వచ్చి రెండు రోజులయినా ఇంతవరకు కన్పించని ప్లీడరుగారు పెద్ద మనిషి మొహం తగిలించుకున్న దొంగలా అనిపించాడు. అవునూ ఏమయినట్లు ఆయన.

హైకోర్టులో అర్జెంటు కేసుండి హైద్రాబాద్ వెళ్ళినట్లు చెప్పారు. కానీ, నిజం అది కాదనీ, వేసక్టమీ చేయించుకోడానికి అక్కడున్న డాక్టర్ మిత్రుడి దగ్గరకు వెళ్ళాడనీ, వున్న వూళ్లో ఆ పని చేయడానికి ఇష్టం లేకపోయిందనీ తరువాత తెలిసింది గోమతికి.

అప్పుడు ఆమె కళ్లల్లో నలభైఏళ్లుగా కాపురం వుండిపోయిన బెరుకు, బెదురు, దైన్యం, నిస్సహాయత మాడి మసి అయిపోయేలా ఒక్క చూపు చూసింది గోమతి(గోవు)."

హింసా ప్రవృత్తితో తనను చిత్రవధ చేసిన స్వరాజ్యలక్ష్మి, సుందర్రావుల పై గోమతి తిరగబడింది. విశ్వరూపం దాల్చింది. తోడేలు మొహం తగిలించుకున్న స్వరాజ్యలక్ష్మి అసలు రూపం కనబడింది. మొహం చాటేసిన ప్లీడరుగారి పిరికి మొహమూ కనబడింది. వాళ్ళ ఆస్తిపాస్తులన్నీ ఎందుకూ కొరగాని పేక ముక్కల్లా కనబడ్డాయి. తోడేలు మొహాన్ని ఊడదీసి చెత్తలో పారేసింది. దొంగ మొహాన్ని ఉతికి పెరట్లో ఆరేసి, నిజం మొహంతో తిరగరా పిచ్చి నాయనా... అని గాండ్రించింది.

ఈ విధంగా తిరుగుబాటు నేపథ్యంలో పి.సత్యవతి గారు రాసిన 'గోవు' కథపై స్త్రీవాదోద్యమం ఆశించినంత ప్రభావాన్ని కనబరచిందని చెప్పాలి. ఈ కథలో జరిగిన సంఘటన లాంటి సంఘటనలు నేడు ఎన్నో చోట్ల జరుగుతున్నాయి. దీనికి పరిష్కారం మనుషుల ఆలోచనా ధోరణిలో మార్పు రావడమొక్కటే శరణ్యం.

## 2.9 తెలుగు కథ - దళిత ఉద్యమం

"ఈ దేశంలో సంపద పుష్కలంగా ఉంది. అంతకంటే రెట్టింపు సమృద్ధిగా కులాలున్నాయి. కులాల అంతరాలను గమనించిన ఆంగ్లేయులు ఈ దేశాన్నే కొల్లగొట్టారు. ఈ దేశ ప్రజలను బానిసలను చేశారు. అనంతర కాలంలో భారతీయులు స్వేచ్ఛా, సమానత్వం, మానవత్వం అహింసవంటి మానవ హక్కుల్ని భూమికగా పోరాటాన్ని

సాగించారు. స్వాతంత్ర్యాన్ని శోధించారు. తుదకు పొందారు. అధికారాల్ని అగ్రవర్ణ మేధావులు హస్తగతం చేసుకొన్నారు. వీరు అంతకు పూర్వం వల్లించిన మానవహక్కులు మటుమాయమయ్యాయి. ఆర్థిక, రాజకీయపరంగా సమాజంలో ఆధిపత్యం, అణచివేత, దోపిడి వంటివి కొన్ని కులాల అసంతృప్తికి దారి తీశాయి. శ్రమ ఒకరిదైతే, సంపద మరొకరి పాలయింది. దీనికి రాజకీయం తోడయింది. దళితుల జీవనం దుర్భరమయింది. బుగ్గిపాలైంది. భానిసత్వం తప్పకపోయింది.

సామాజిక న్యాయానికి కేంద్ర బిందువులయిన సమానత్వం, మానవత్వం కోసం ఆరాట, పోరాటాలు ప్రారంభమయ్యాయి. పీడన నుండి విముక్తి చట్టం ముందు సమానం, సంపదలు సమానం వంటి అంశాల భూమికగా దళితుల పోరాటం ఆరంభమైంది.''[15]

''ఈ దేశంలో దళితులు ఎప్పుడు పుట్టారో దళిత సాహిత్యం కూడా అప్పుడే పుట్టింది. అయితే అది నివురు కప్పిన నిప్పులా దాగి ఉంది. దాగి ఉంది అనడం కంటే దౌర్జన్యంగా, బలవంతంగా, అమానుషంగా దాచివేయబడింది అనడం సమంజసం.

ఇవాళ భారతీయ సాహిత్యంలోనూ, సమాజంలోనూ ప్రధాన చర్చనీయాంశం 'దళిత వాదం', 'దళిత సాహిత్యం.' భాషలు వేరు కావచ్చు, ప్రాంతాలు వేరుకావచ్చు, మనుషులు వేరుకావచ్చు, కాని బాధ మాత్రం ఒక్కటే. కులాలు వేరు కావచ్చు, తెగలు వేరు కావచ్చు కానీ దళితులు ఎదుర్కొంటున్న సమస్యలు ఒక్కటే. దళిత వాదం ఇవాళ ఉన్నపళంగా పుట్టుకొచ్చింది కాదు. ఈ పుట్టుక వెనక వేల సంవత్సరాల అణచివేతలూ, మూకుమ్మడి ఊచకోతలూ, మానసిక, శారీరక, సామాజిక పరమైన తొక్కివేతలు చరిత్రలో సాక్ష్యాలుగా నిలుస్తాయి. తరతరాల భారతదేశ సామాజిక జాఢ్యాల నుంచి అణచివేతల నుంచి, అణచుకున్న ఆవేదనల నుంచి, ఆవేశాల నుంచి, తమ హక్కులను, తమ స్థానాలను ఎలుగెత్తి ప్రశ్నిస్తూ ఎదురు తిరిగిన నూతన చైతన్యమే ఇప్పటి దళిత వాదానికి లేదా దళితోద్యమాలకు చారిత్రక భూమికగా నిర్ధారించవచ్చు.''[16]

ఈ సందర్భంలో తెలుగు కథపై దళిత ఉద్యమం ఎటువంటి ప్రభావాన్ని కనబరిచింది వివరిస్తాను. అనాధిగా, అన్ని విధాలుగా ఎన్నెన్నో అవమానాలని, ఛీత్కరింపులని చవిచూచిన వర్గం దళిత వర్గం. కొలకలూరి ఇనాక్ గారు రాసిన '**అస్పృశ్యగంగ**'ను పరిశీలిస్తే ఈ విషయం తెలుస్తుంది.

కథలో వినాయక్ ఆశావాది. ఎండిపోతున్న గొంతుల్ని తడుపుకోడానికి కూడా చుక్క నీరు దొరకక పిల్లలు, పెద్దలు అందరూ నీటిని సంపాదించేందుకు బిందులతో వీధులెంట

తిరుగుతూ ఇబ్బందుల పాలౌతుంటే, ఎప్పటికైనా తన ఇంటి వద్దే బావిని త్రవ్వించి తన కుటంబానికే కాక అతనుండే వీధంతటికీ, చుట్టు ప్రక్కల ప్రాంతాలన్నింటికీ దాహార్తిని తీర్చగలను అనే నమ్మకం ఉండేది వినాయక్‌కి. ఈ నమ్మకమే అతడిని ముందుకు నడిపించింది. నీటిని పుట్టించింది. ఈ పని నిర్వహించే సమయంలో అతడెన్నో అవమానాలను ఎదుర్కోవలసి వచ్చింది. కారణం, ఇతడు హరిజనుడు కావడమే. ఇంటి పని వాళ్ళ నుండి తోటి ఉద్యోగస్తుల దాకా వినాయక్ హరిజనుడు అవడం వల్ల తక్కువగా చూస్తూండేవారు చేతల్తోనూ, మాటల్తోనూ కూడా.

చిన్నతనంలో వినాయక్ తను పొందలేక పోయినవి, తను తెలుసుకోలేకపోయినవి, తన పిల్లలు తెలుసుకోవాలని, పొందాలనుకునే మనస్తత్వం గల వ్యక్తి, తను ఎదుర్కొన్న అవమానాలు మాత్రం వారికి ఎదురవకూడదని భావించే వ్యక్తి వినాయక్. ఒకవేళ ఎదురైనా ఆ అనుభవం వారిని క్రుంగిపోయేలాగా చేయకూడదని వాటి నుంచో ఎన్నో పాఠాలు నేర్చుకోవాలని వినాయక్ పిల్లలకు చెప్తూండే వాడు. తనను అన్ని వర్గాల వారు కలవనివ్వలేక పోయినా, తనలో అన్ని వర్గాల వారిని కలుపుకోవాలని ఆశపడే వ్యక్తి వినాయక్. ఇందుకే బావిలో నీళ్ళు పడిన సంధర్భంలో,

" 'అయితోడి పారబొయ్యాల్ల' ఎవరేవరో ఏమేమో అంటున్నారు.

ఎవరూ తోడి చూచి శుభ్రం చేయలేరు. ఆ బావిలో గోవిందు చెమట ఉంది, రక్తముంది, కన్నీరుంది. అది పెద్ద ఊట. దానికి అడ్డంలేదు. అంత పెద్ద జల. పిడికిలి అంత రంధ్రం. బండ పగిలి కన్నం పడి నీరు పైకి ఎగదన్నింది. మూడు నిలువుల నీరొచ్చింది.

గోవిందు భార్య కడవతో నీళ్ళు తోడి కడవతో కడవడు నీళ్ళు తెచ్చింది.

"నీల్లు తాగు సావీ"

"నువ్వు తాగు" అని కడవ నోటి దగ్గర పెట్టాడు. చేయి అడ్డం పెట్టుకొని గోవిందు తాగాడు. దాహం తీరేదాకా తాగాడు. సగం కడవ తాగినట్లు తాగాడు. పక్కకు పడ్డ నీళ్ళతో గోవిందు ముఖం కడిగాడు వినాయక్. నీళ్ళు తాగు సావీ అంటూనే ఉన్నాడు గోవిందు. కడవలో మిగిలిన నీళ్ళు అతను తాగబోతుంటే గోవిందు వారించాడు. 'నా యంగిలి సావీ మారాజా'.

"నీ ఎంగిలేమిటి నా ఎంగిలేమిటి? నీటికి ఎంగిలిలేదు. గంగకు ఎంగిలిలేదు. నీ ఎంగిలని నేను మానదలిస్తే చస్తే బావిని వాడుకోరాదు. బావి అంతా నీ ఎంగిలే! నీ చెమటే! నీ నెత్తురే! నీ కన్నీరే. నీ బీడి ముక్కలే! నీ బీడి బూడిదే (అస్పృశ్యగంగ)!"

"నేలే మట్టే అయినా గంగ పవిత్ర." అతను కడవలో నీళ్ళు తాగుతుంటే గోవిందు, అతడి భార్య, కొడుకు ఆశ్చర్యంగా చూస్తూ నిలబడ్డారు. ఇంట్లో వాళ్లందరూ, వస్తూ పోతూ తొంగి చూచిన వాళ్ళందరూ నీళ్ళు తాగారు (అస్పృశ్యగంగ)."

వినాయక్ కుల మతాల ప్రస్తావన లేకుండా హెచ్చుతగ్గుల తారతమ్యాన్ని చూపకుండా, సహృదయంతో సమానత్వ బావాన్ని పెంపొందింప చేసేందుకు తప్పించాడనడానికి ఈ కథ నిదర్శనం. 'తొంగి చూచిన వాళ్ళందరూ నీళ్ళు తాగారు' అంటే ఆ తొంగి చూసిన వారిలో ఇతర కులస్థుల వాళ్ళు కూడా ఉండొచ్చు కనుక వారిలో చైతన్యం కలిగినట్లు భావించాలి. అంటరాని తనాన్ని నిర్మూలించే ఉద్దేశ్యంతో రాయబడిన కథ ఈ అస్పృశ్యగంగ. ఈ అస్పృశ్యగంగ చైతన్యాన్ని కలిగింపజేసింది. కాబట్టి దీనిపై దళిత ఉద్యమ ప్రభావం ఉందని చెప్పాలి.

అలాగే "జాతంటే యాంది?" కథలో యండ్లూరి సుధాకర్ దళితుల్లో ఒకరైన మాదిగల గురించి, వారి కష్టాల గురించి, నష్టాల గురించి, వారి అగచాట్ల గురించి అవమానాల గురించి తెలియజేశారు.

ఇటీవల ప్రాంతాల విభజన పోరు జోరందుకుంది. అలాగే కులాల విభజన హోరూ ఊపందుకుంది. అలాగే జాతుల మధ్య పోరు ఎప్పటి నుంచో ఉంది. ఈ నేపథ్యంలో మాదిగల శక్తి సామర్థ్యాల్ని తెలుపుతూ ఇలా అంటారు సుధాకర్.

"సెంద్రమండలం మీదికి బొయ్యేవోడికి సెప్పులు గావాల. ముండ్ల తుప్పల్లో దిరిగేవోడికి సెప్పులు గావాల్సిందే. సెంద్రుడు కాడికి యెగిరి బొయ్యినోడు యెంత గొప్పో నిప్పుదగలకుండా, ముల్లు దగలకుండా యెన్నెలంత సల్లంగుండే తోలు సెప్పులు కనిపెట్టెవోడు యెందులో తక్కువా?"[17]

అగ్రకులస్తుల నుండీ నీటి కోసం, కూటి కోసం ఎన్ని చీత్కరింపులు ఎదుర్కోవలసి వచ్చిందో మాదిగల, 'జాతంటే యాంది?'లో చూడొచ్చు.

కథలో ఇస్రాయేలు, సుదయ్యలకు మాదిగ దాసుడు ఎదురై, ఈ ముగ్గురూ కలిసి కల్లు తాగేందుకు తాటితోపుల దగ్గరకు వెళ్తారు. అక్కడ ఇస్రాయేలు, మాదిగ దాసుడు కల్లు తాగుతూ సుధ మావను కూడా తాగమంటారు. అతడు పరకడుపు అవడం వల్ల కల్లు తాగడం కంటే ఏమన్నా తింటే ఎలా ఉంటది అనుకొంటునప్పుడు మాదిగ దాసుడు అతడితో ఇక్కడకు దగ్గరలోనే యానాదోళ్ళ ఇళ్ళు ఉన్నాయి. అక్కడికి వెళ్ళి రూపాయికి వుసిళ్ళు పట్టుకొస్తా అంటూ వెళ్ళి దోసెడు వుసిళ్ళతో ఇస్రాయేలు, సుదయ్య దగ్గరకు వచ్చి

సుదయ్యను వుసిళ్ళు తింటూ కల్లు తాగమంటే, సుదయ్య మాత్రం వుసిళ్ళు తిని, భలే ఇదిగా ఉన్నాయి. వీటి గురించి వినడమే కానీ వివరం తెలియదు. వివరం చెప్పమని మాదిగ దాసున్ని అడుగుతాడు. అప్పుడు దాసుడు,

"ఉసిళ్ళు ఎల్తురు పురుగులు గదా! ఎల్తురెంత సొచ్చంగ వుంటాదో ఉసిళ్లు అట్టుంటాయి. యీటిల్ని యానాదోళ్ళు బడతరు. మిరగ మొచ్చి మబ్బు ఏలిందంటే సినుకులు బడతయ్యి. ఇంగ దండిగ వోనలు కురిసేలకి మద్ది రాతిరిగానీ, తొలికోడి కూసేటాలకి గానీ యానాదోళ్లు పుట్టల కాడికొస్తరు. ఒకేల పుట్టలు గట్టిగుంటే కుంటల్లోంచి బుంగల్తో నీల్లు దెచ్చి బాగ తడుపుతరు. పిసికిన పిండి మాదిరి పుట్ట మెత్తంగుంటది. కఱ్రబెట్టి సిన్నకంత జేసి యాందో మందేస్తరు. యేసే సరికి ఉసిళ్ళు పిగిలి ఉక్కకు తట్టుకోలేక లోన్నుంచి రొయ్యిమంటా బయటకొస్తయ్యి.

ఇంగ యీల్లేం జేస్తరంటే పక్కన వొక గుంట దొవ్వుకుంటరు. దాంట్లో దీపం యెలిగిచ్చి పెద్దబుంగ పెట్టుకుని గమ్మున కూకుంటరు. ఇంగ ఆ యెలుతురు జూసి బిరబిర మంటా, ఓయమ్మ తిర్నాల మాదిరిగా లచ్చిలు, లచ్చిలు ఉసుళ్ళు పైకొస్తయి. అయన్నీ బుంగలోకొచ్చి పడతయ్యి. అయ్యి దెచ్చి వాల్ల ఆడోల్లకిచ్చి ఈల్లు సారాయి బోరాయి తాగను బొయ్యేది.

ఉసిళ్లని కుండబొచ్చెల్లో యేసి ఏంచి చేటల్లో బోసి సెరుగుతరు. రెక్కలు గిక్కలు బొయ్యి లచ్చినంగ తయారవతయి. ఇంగ బుట్టలకి బోసుకొని మన గూడేలకొచ్చి అమ్ముకొని బతుకుతరు (జాతంటే యాంది?)."

ఇందులో వెనుక బడిన కులాల్లో ఒకటైన యానాదుల జీవన స్థితిగతులను, వారి వృత్తిని మనం చూడొచ్చు. సుదయ్య దాసుడితో 'పుట్టలో ఉసిళ్ల బదులు పాములుంటే ఏం చేస్తారు' అన్నప్పుడు దాసుడు యానాదోడికి పాము, మాదిగోళ్ళకి గొడ్డు కనబడితే పండగే. పాముల్ని పట్టడంలో యానాదోళ్ళకి సాటి ఎవరూ ఉండరు. అది యానాదోళ్ళలో ఉన్న గొప్ప విద్య అంటూ వివరిస్తాడు.

అగ్రకులం వాళ్ళ అకృత్యాలని భరించలేక విసుగు చెంది ఉక్రోషంతో మాదిగ దాసుడు ఇంకా ఇలా అంటున్నాడు.

"ఎలికల్ని దింటరని యానాదోల్లనీ, గాడిదల్ని దింటరని ఎరికలోల్లనీ, గొడ్డుని దింటరని మాదిగోల్లనీ అసింట బొండని అసయ్యించుకున్నరు ఈ పెద్ద కులపోల్లు. యం జేసినం మనం? మనం ఎవురి కొంప కొల్లేరు జేసినం? మట్టిన్నమ్ముకున్నం గానీ ఎవరి పొట్టన్నా గొట్టినమా?

“రేయ్ యిస్రయేలా! నువ్వు జెప్పురా! నీకు దెలియదంట్రా, మనోల్లని ఎంత యీనంగా జూసింగ్రో?” అని బుజం బట్టి వూపేవరకి మా బావ నోరు దెరిసి అన్నడు.

“ఒరే దాసుగా! తాలుకోరా, అయ్యి గవనానికొస్తే పేగులు సుర్రుమంటయ్యి” అని ఆరిపోయిన సుట్ట దీసి ఎర్రంగ ఎలిగించుకోని తుపుక్కున వుమ్మేసి యిట్టంటున్నడు.

“మన మెంత కష్టపడి పనిచేసినా, పొద్దుగూకులు శాకిరి జేసినా మనకి రేకు డబ్బాలతో నీళ్ళిచ్చేవోల్లు. దోసిలి పడితే పై నుంచి కూడు బెట్టేవోళ్లు. అసలు ఆ పంతుల్లు బెట్టింగ్రు పుండు. ఇప్పుడు సీము కారుతా వుంటే సీ! సీ! అంటా వుండారు. మాదిగోల్లని లే! యానాదోల్లనీ లే! ఎవుర్ని పైకి రానియ్యడంలే! మనోడు పై కొస్తే యాం జరుగుద్దీ? ఎవుడికి నష్టం?

మనోల్లని గుడికి రానిచ్చినరా? బడికి రానిచ్చినరా? మడికి రానిచ్చినరా? యియ్యాల తక్కువ జాతోల్లని మనల్ని ఎత్తి పొడస్తా వుండరే?

జాతంటే యాందో జెప్పమనండి ఎవురినైనా? ఎవరికీ దెలియదు. జాతంటే ఆడా మగా రొండేగానీ ఈ జాతులన్నీ లేనేలేవు. ఈ కులాలు గిలాలూ ఏముండవు. తెలివిగల్లోడు ఈ పుస్తకాలు సదివేకన్నా పురుగుల్ని జదివి గ్యానము దెచ్చుకోవాల!

యేమి? బేపనోన్ని గోస్తే పాలు, మాదిగోన్ని గోస్తే నీల్లు వస్తయ్యా? జాతి జాతి అంటుండరే నా ముంగల జాతి యాడుండది? ఇప్పుడు కల్లు దాగితిమి యామైంది? కడుపులోకి బొయ్యింది. రేపు మనం బొయ్యేది యాడకి? ఆ కాట్లోకే గదూ (జాతంటే యాంది?)!.”

మనకు స్వాతంత్ర్యం రాకముందు నుంచీ తెల్లజాతీయులు - నల్లజాతీయులు మధ్య పోరు సాగుతూనే వుంది. స్వాతంత్ర్యం రావడంతో తెల్ల జాతీయులు (ఆంగ్లేయులు) దేశాన్ని వదలి వెళ్ళగానే అధికారాన్నీ అగ్రకులస్తులు చేజిక్కించుకున్నారు. అన్నీటిలోనూ హరిజనుల్ని చిన్నబుచ్చారు. తక్కువ కులస్తులంటూ హేళన చేశారు. ఇప్పుడు రోజులు మారాయి, తరాలు మారాయి, దశాబ్దాలు పెరిగాయి. నేడు ఈ వివక్ష తంతు అంతగా కనపడకపోవచ్చు కానీ పరోక్షంగా ప్రభావం తీవ్రంగానే ఉంది. ఎక్కడోకక్కడ, ఎప్పుడోకప్పుడు ఈ జాడ్యం పొడ చూపుతూనే ఉంది. ప్రజలందరి తలరాతలు భగవంతుడు రాశాడనుకుంటే, భారతదేశ ప్రజల భవిష్యత్తును మాత్రం హరిజన కులస్తుడయిన అంబేద్కర్ రాయడం ఒక గొప్ప విశేషం. దీనిని బట్టి తెలుగు కథా శక్తి సామర్థ్యాల్ని, దళిత ఉద్యమం ప్రభావాన్ని అంచనా వేయ్యెచ్చు.

## పాదసూచికలు

1. ఆధునిక తెలుగు సాహిత్యంలో ప్రక్రియలు, ధోరణులు, ప్రధాన సంపాదకులు : డా॥ ఆవుల మంజులత, సంపాదకులు : ఆచార్య ఎస్వీ. సత్యనారాయణ, సామాజిక ఉద్యమాలు : తెలుగు కథానిక, డా॥ రాచపాళెం చంద్రశేఖరరెడ్డి, పుట :99
2. తెలుగు కథ నాడూ, నేడూ ; కథ సాహిత్య వ్యాసాలు, కోడూరి శ్రీ రామమూర్తి, పుట : 11
3. పైదే, పుట : 115
4. కథానికా లక్ష్యము - లక్షణాలు (వివిధ రచయితల వ్యాసాలు), సంకలన కర్త : డా॥ వేదగిరి రాంబాబు, కథానికా రచన - శ్రీశ్రీ, పుట : 52
5. కథానికా లక్ష్యము - లక్షణాలు (వివిధ రచయితల వ్యాసాలు), సంకలన కర్త : డా॥ వేదగిరి రాంబాబు, మన కథా పరిశ్రమ - నండూరి రామమోహన రావు, పుట : 68
6. కథానికా లక్ష్యము - లక్షణాలు (వివిధ రచయితల వ్యాసాలు), సంకలన కర్త : డా॥ వేదగిరి రాంబాబు, కథా లక్షణములు - అక్కిరాజు ఉమాకాంతమ్, పుట : 53, 54
7. కథా శిల్పం, వల్లంపాటి వెంకట సుబ్బయ్య, పుట : 14
8. పైదే, పుట : 15
9. కథానికా స్వరూప స్వభావాలు, పోరంకి దక్షిణామూర్తి, పుట : 320, 321
10. రజిత రంజని (ఈ శతాబ్ది సాహిత్య దర్పణం), కె.కె. మీనన్, పుట : 93
11. జాతీయోద్యమ కథలు, ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి, పుట : ఈ సంకలనం గురించి............
12. పైదే
13. స్త్రీవాద కథలు స్త్రీల జీవిత చిత్రణ, డా॥ఎ. సీతారత్నం, పుట : 23
14. ఆధునిక తెలుగు సాహిత్యంలో ప్రక్రియలు, ధోరణులు, ప్రధాన సంపాదకులు : డా॥ ఆవుల మంజులత, సంపాదకులు : ఆచార్య ఎస్వీ.సత్యనారాయణ, స్త్రీవాద సాహిత్యం - అవగాహన, డా॥ సుమతీ నరేంద్ర పుట : 113
15. దళిత కథలు - 4 (ఆర్థిక, రాజకీయ కథలు) (1910-1998), డా॥ కె.లక్ష్మీనారాయణ, పుట : దళితుడి పోరుబాటలో........

16. ఆధునిక తెలుగు సాహిత్యంలో ప్రక్రియలు, ధోరణులు, ప్రధాన సంపాదకులు : డా॥ ఆవుల మంజులత, సంపాదకులు : ఆచార్య ఎస్వీ. సత్యనారాయణ, దళిత సాహిత్యం - సామాజిక, తాత్విక భూమిక, డా॥ ఎండ్లూరి సుధాకర్ పుట : 117
17. మల్లెమొగ్గల గొడుగు, మాదిగ కతలు, ఎండ్లూరి సుధాకర్, గొడ్డు చాకిరీ చేసి రాసిన కథలు, జి.లక్ష్మీనరసయ్య, పుట : 8

# తెలుగు కథా సంస్కరణోద్యమ ప్రభావ చిత్రణ

## (గురజాడ అప్పారావు, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి, గుడిపాటి వెంకటాచలం, అడవి బాపిరాజు, విశ్వనాథ సత్యనారాయణ)

*సంస్కరణ భావాలతో కథలు రాసిన వారు, ఇంకా రాస్తున్న వారు తక్కువేమి లేరు. కానీ అలా రాసినవి సమాజానికి ఎంత వరకు ఉపయోగ పడ్డాయన్న విషయం ఆలోచించాలి. సాంఘిక దురాచారాల నుండి సమాజాన్ని కాపాడేందుకు ప్రజలలో ఆలోచనలను కలిగించేందుకు ఆ సమస్యల తీవ్రతను వివరిస్తూ కథలు రాసిన గురజాడ అప్పారావు, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి, గుడిపాటి వెంకట చలం, అడవి బాపిరాజు, విశ్వనాథ సత్యనారాయణల కృషి అపారమైనది. వారి సాహిత్య సేవ మరువలేనిది.*

### 3.1 గురజాడ అప్పారావు (సెప్టెంబరు 1862 - నవంబర్ 1915)

ఆధునిక తెలుగు కథకు ఆద్యుడిగా, సంస్కరణోద్యమానికి కథా సారధిగా గురజాడ అప్పారావుగారు సుపరిచితులు. ఆయన 1862 సెప్టెంబరు 21న విశాఖ జిల్లా, ఎలమంచిలి తాలూకా, రాయవరం గ్రామంలో జన్మించారు. ఆయన తండ్రి వెంకట రామదాసు, తల్లి కౌశలమ్మ. గురజాడ వెంకట అప్పారావు కుటుంబం తాతల కాలంలో కృష్ణాజిల్లా గురజాడ గ్రామం నుండి విశాఖ మండలానికి తరలి వెళ్ళింది. గురజాడ అప్పారావుగారి తండ్రికి సంస్కృత భాషలో నైపుణ్యం ఉంది. ఆయన విజయనగరం సంస్థానంలో పేష్కారుగానూ, రెవిన్యూ సూపర్‌వైజర్‌గానూ ఖిల్లేదారుగానూ ఉద్యోగ బాధ్యతలు నిర్వహించారు.

గురజాడ తండ్రి చీపురుపల్లిలో ఉద్యోగం చేస్తున్న కాలంలో, గురజాడ పదేళ్ళ వయస్సు వరకూ అక్కడే చదువుకున్నారు. తరువాత బి.ఏ. పట్టభద్రుడయ్యే వరకు విజయనగరంలో గిడుగు రామమూర్తితో కలిసి చదువుకున్నారు. వారిద్దరూ మొదటి నుంచీ ప్రాణస్నేహితులు.

హైస్కూల్‌లో చదువుకునే రోజుల్లోనే శ్లోకాలు రాసేవారు. విద్యాభ్యాసమంతా పేదరికంలో సాగింది.

గురజాడ అప్పారావు గారు 1882 వ సంవత్సరంలో మెట్రిక్యులేషన్ పూర్తి చేశారు. ఈ సంవత్సరంలోనే "కుక్క" అన్న ఇంగ్లీషు పద్యం ప్రచురించడం జరిగింది. ఇది అలభ్యం.

1882 - 1884లో యఫ్.ఏ. చదివారు. యఫ్.ఏ. చదువుతున్న కాలంలోనే 1883లో 'సారంగధర' అన్న ఇంగ్లీషు పద్యకావ్యం ప్రచురించడం జరిగింది. గురజాడ అప్పారావుగారు, ఆయన తమ్ముడైన శ్యామలరావూ విజయనగరంలోని 'ఇండియన్ లీజర్ అవర్,' 'తెలుగు హార్స్' అన్న పత్రికల్లో తరచుగా ఇంగ్లీషు పద్యాలు రాస్తూండేవారు. ఆ సందర్భంలో ఒకసారి 'ఇండియన్ లీజర్ అవర్'లో వెలువడిన 'సారంగధర'ను మెచ్చుకొని, అప్పటి ప్రముఖ కలకత్తా పత్రిక 'రీస్ అండ్ రయ్యత్' (రాజు, రైతు) అన్న ఇంగ్లీషు పత్రికాధిపతి శంభుచంద్ర ముఖర్జీ దానిని తన పత్రికలో రెండోసారి ప్రచురించారు (ప్రచురణ ఆగష్టు 11, 18 సంచికలు), ప్రోత్సహిస్తూ ఉత్తరం రాశారు. వారిద్దరికీ ఉత్తర ప్రత్యుత్తరాలు సాగాయి. మొదట ప్రోత్సహించిన వారిలో చెప్పుకోవలసిన వారు 'ఇండియన్ లీజర్ అవర్' సంపాదకుడు గుండుకుర్తి వెంకట రమణయ్య ముఖ్యులు.

1884 - 1886 సంవత్సరాలలో బి.యే. ఫిలాసఫీ, రెండోభాష సంస్కృతం 1884వ సంవత్సరంలోనే విజయనగరం మహారాజు కాలేజీ హైస్కూలులో ఉపాధ్యాయుడిగా ఉద్యోగం చేపట్టారు. జీతం 25 రూపాయలు.

1885వ సంవత్సరంలో అప్పల నరసమ్మతో వివాహం జరిగింది.

1886లో ఉపాధ్యాయ వృత్తికి సెలవు పెట్టి డిప్యూటీ కలెక్టర్ ఆఫీస్‌లో హెడ్‌క్లర్క్ ఉద్యోగం చేపట్టారు.

1887వ సంవత్సరంలో నాలుగో లెక్చరర్‌గా ఉద్యోగాన్ని చేపట్టారు. జీతం వంద రూపాయలు. 1887వ సంవత్సరంలోనే విజయనగరం మహారాజు ఆనంద గజపతితో పరిచయం ఏర్పడింది. అదే సంవత్సరంలోనే విజయనగరంలో ఒక కాంగ్రెస్ సభలో ఉపన్యాసమిచ్చారు. గురజాడ అప్పారావు గారికి 1887లో లక్ష్మీనరసమ్మగారు జన్మించారు. ఈమె మొదటి సంతానం.

1888లో విశాఖపట్టణం స్వచ్ఛంద సేవాదళంలో సభ్యత్వం పుచ్చుకొన్నారు.

1889వ సంవత్సరంలో ఆనంద గజపతి ఆస్థానంలో డిబేటింగ్ క్లబ్బు ఉపాధ్యక్ష పదవి చేపట్టారు.

గురజాడ అప్పారావుగారికి 1890లో ద్వితీయ సంతానంగా కుమారుడు (వెంకట రామదాసు) జన్మించారు. అదే సంవత్సరంలో గురజాడ గారి 'విక్టోరియా ప్రశస్తి' గీతాలను వైస్రాయి దంపతులకు రీవారాణి డిసెంబరు 12న బహూకరించారు.

1891లో మూడవ లెక్చరర్ ఉద్యోగాన్ని చేపట్టడం జరిగింది. జీతం నూటిరవై ఐదు రూపాయలు. వీరు బోధించినవి ఎఫ్.ఏ., బి.ఏ., క్లాసులకు ఇంగ్లీషు, వ్యాకరణం, సంస్కృత సారస్వతం, తర్జుమా, గ్రీక్, రోమన్ చరిత్రలు. అదే సంవత్సరంలో సంస్థాన శాసన పరిశోధక పదవి చేపట్టడం జరిగింది.

1892లో అప్పారావుగారి తమ్ముడైన శ్యామలరావు మద్రాసు లా కాలేజీలో చదువుతూ మరణించడం జరిగింది. అదే సంవత్సరం ఆగష్టు 13న 'కన్యాశుల్కం' నాటకం మొదటి కూర్పు ప్రదర్శనం జరిగింది.

1894వ సంవత్సరంలో భాగవతుల లక్ష్మీనారాయణశాస్త్రి రాసిన 'శ్రీరామ విజయమ్' అన్న సంస్కృత నాటకానికి గురజాడ సమీక్ష రాశారు. ఇది విజయనగరం ఆంధ్రాంగ్ల పత్రిక 'తెలుగు హార్స్'లో ప్రచురించబడింది. ఈ సమీక్షే ఆ గ్రంథానికి పీఠికగా ప్రచురింపబడింది. భాగవతుల లక్ష్మీనారాయణశాస్త్రిగారి మరో సంస్కృత కావ్యమైన 'సంక్షిప్త రామచరితమ్'కి కూడా పీఠిక గురజాడే రాశారు. ఈ పీఠికలన్నీ ఇంగ్లీషులో రాసినవి.

1896లో 'ప్రకాశిక' పత్రికకు సంపాదకునిగా బాధ్యతలు చేపట్టినట్లు డిక్లరేషన్ ఉన్నట్లు తెలుస్తున్న, ఈ పత్రిక వెలువడిన ఆధారాలు లేవు. అదే సంవత్సరంలో ఆనంద గజపతి భార్య మరణించడం జరిగింది.

1897లో 'హరిశ్చంద్ర' అనే ఇంగ్లీషు నాటకానికి పీఠిక రాయడం జరిగింది గురజాడ. అదే సంవత్సరంలోనే 'కన్యాశుల్కం' నాటకం తొలి కూర్పును విజయనగరం మహారాజు ఆనంద గజపతి గారికి అంకితమివ్వడం జరిగింది. అలాగే ముద్రించడం కూడా జరిగింది. పీఠికలో, గ్రాంథిక భాషలోని అసౌకర్యాలు, యిబ్బందులూ వివరంగా చెప్పి, వాడుక భాషను కావ్య భాషగా పెంపొందించడం వల్ల కలిగే మేలును నొక్కి వక్కాణించడం జరిగింది. ఇది సాహిత్య భాషగా వాడుక భాష స్థాపనకు, నవ్య ఆధునిక భాష వ్యాప్తికి అంకురార్పణంగా చెప్పవచ్చు. అదే సంవత్సరంలో ఆనంద గజపతి మరణించడం జరిగింది.

1898లో ఆనంద గజపతిరాజు అక్క అయిన అప్పలకొండయాంబ (రీవా రాణి)కి గురజాడ అప్పారావుగారు ఆంతరంగిక కార్యదర్శి అయ్యారు.

1902లో గురజాడకు మూడవ సంతానంగా కుమార్తె కొండయ్యమ్మ జన్మించారు.

1903లో ఆనంద గజపతి తల్లి అయిన అలక రాజేశ్వరికి గురజాడ అప్పారావుగారు దత్తత హక్కు కల్పించారు. దీన్ని చెల్లుబాటు కానివ్వకుండా దాయాదులు దావా వేశారు. దావా 1913 వరకూ సాగి తుదకు రాజీ అయ్యింది. దీన్ని నడిపించాల్సిన బాధ్యతంతా గురజాడపైనే పడింది.

1905లో గురజాడ తండ్రి విజయనగరానికి చేరువలోని ఊటగడ్డ అన్న ఏరును బండిలో దాటుతూ వుండగా, హఠాత్తుగా ఆ ఏరు పొంగడం వల్ల మునిగిపోయి దుర్మరణం చెందారు.

1906వ సంవత్సరంలో పాఠశాలల్లో తెలుగును సులభంగా బోధించేందుకు కావలసిన బోధనా భాషకోసం, తూర్పు జిల్లాల విద్యాధికారి జె.ఏ. ఎట్స్‌తోనూ, విశాఖపట్టణం మిసెస్ ఏ.వి.యస్. కాలేజి ప్రిన్సిపాల్ పి.టి. శ్రీనివాసయ్యంగార్‌తోనూ, పర్లాకిమిడి కాలేజి లెక్చరర్, మిత్రుడైన గిడుగు రామమూర్తితోనూ కలిసి విస్తృతమైన చర్చలూ, కృషి, మహోద్యమంగా జరిపారు. అదే సంవత్సరంలో 'కొండుభట్టీయం' రచన వెలువరించడం జరిగింది.

1907లో 'నీలగిరి పాటలు' ప్రచురించడం జరిగింది.

1908లో మద్రాసు కాంగ్రెసు మహాసభలో పాల్గొన్నారు. దాన్ని గురించి ఇంగ్లీషు పత్రికల్లో ఆంగ్ల వ్యంగ్య పద్య రచన వ్యాఖ్యలు చేశారు.

1909లో గురజాడ 'కన్యాశుల్కం' రెండో కూర్పు రూపొందించి ప్రచురించడం జరిగింది.

1910వ సంవత్సరంలో గురజాడ అప్పారావుగారు ఆకాశంలో తోకచుక్క (హాలీస్ కామెట్) కనిపించగా కలిగిన భయాందోళనను 'చన్నకాలపు చిన్నబుద్ధులు'గా వ్యాఖ్యానించడం జరిగింది. అదే సంవత్సరంలో సకల కులాల వారితో బరంపురంలో సహపంక్తి భోజనాలు చేశారు గురజాడ. ఈ సంఘటన అతడిలోని సంస్కరణ భావాన్ని గ్రహించేందుకు ఎంతగానో దోహదపడుతుంది. అదే సంవత్సరంలో 'ముత్యాల సరములు', 'కాసులు' ప్రచురించడం జరిగింది. ఇది మొదలుకొని, ఆ సంవత్సరంలో అనేక ఆధునిక కవితా గీతాలు, ఆధునిక కథలు వివిధ పత్రికలలో ప్రచురించబడ్డాయి. వాడుక భాషకోసం వాదోపవాదాలతో, అనేక వ్యాసాలు కూడా అదే సంవత్సరంలో ప్రచురించారు. ఆ 1910వ సంవత్సరంలోనే 'బిల్హణీయం' ప్రథమాంకం ప్రచురణ అయ్యింది. మొత్తం మీద 1910వ

సంవత్సరం గురజాడ జీవితకాలంలో ఓ అద్భుతమైందిగా పేర్కొనాలి, ఆధునిక భాషకోసం పోరాటం ప్రారంభించడం దగ్గర నుంచీ ఎన్నో అద్భుతమైన గురజాడ రచనలు ప్రచురణకు నోచుకోవటం విశేషమే.

1911వ సంవత్సరంలో 'బిల్హణీయం' ద్వితీయాంకం ప్రచురించడం జరిగింది. అలాగే 'లవణ రాజు కల' కూడా ప్రచురించబడింది. 1911వ సంవత్సంరలోనే మద్రాసు విశ్వవిద్యాలయం బోర్డ్ ఆఫ్ స్టడీస్‌లో గురజాడకు సభ్యత్వం లభించింది. ఆ సంవత్సరంలోనే ఆంధ్ర సాహిత్య పరిషత్తు స్థాపించడం జరిగింది.

1912లో కలకత్తా వంగీయ సాహిత్య పరిషత్తు వారితో తేనేటి విందులో పాల్గొన్నారు గురజాడ (జనవరి 23). అదే సంవత్సరంలో 'కన్యక'ను ప్రచురించడం జరిగింది. 1912లోనే ఆనంద గజపతిరాజు అక్క అయిన అప్పలకొండయాంబ (రీవా రాణి) మరణించడం జరిగింది.

1913లో గురజాడ 'సుభద్ర' రచన చేపట్టారు. అదే సంవత్సరం ఫిబ్రవరి 12న ఉద్యోగ విరమణ జరిగింది. పెన్షన్ 140 రూపాయలు. అదే సంవత్సరంలో మద్రాసు విశ్వవిద్యాలయం ఫెల్లో పదవి చేపట్టారు.

1914వ సంవత్సరంలో మద్రాసు విశ్వవిద్యాలయానికి 'విశ్వవిద్యాలయాలు, సంస్కృత, మాతృభాషలు' అన్న నివేదిక సమర్పించడం జరిగింది. ఆ సంవత్సరంలోనే మద్రాసు విశ్వవిద్యాలయం పాఠ్యక్రమంలో వాడుక భాషను చేర్చరాదన్న నిర్ణయానికి అసమ్మతిగా 'అసమ్మతి పత్రం' సమర్పించడం జరిగింది గురజాడ. 1914వ సంవత్సరంలోనే అనారోగ్యం పాలయ్యారు. అదే సంవత్సరంలో 'దించు లంగరు'ను రచించడం జరిగింది.

1915వ సంవత్సంరంలో తన అనారోగ్యాన్ని గురించి, శరీర స్థితిని గురించి వైద్యునికి వివరించడం జరిగింది (పంపిన తేదీ ఏప్రిల్ 9). 1915లోనే 'లంగరెత్తుము'ను కూడా రాయడం జరిగింది. అదే సంవత్సరంలో నూతన గృహప్రవేశం కూడా జరిగింది. 1915 నవంబరు 30న గురజాడ మరణించారు.

ఇంతటి గొప్ప చరిత్ర కలిగిన ఉత్తమ శ్రేణి రచయితను గురించి, అతడి రచనల గురించి ప్రముఖులు వారి అభిప్రాయాన్ని ఇలా వ్యక్త పరిచారు.

ప్రయాగ వేదవతి, స్టేషన్ డైరెక్టర్, ఆకాశవాణి, విశాఖపట్టణం కేంద్రం, వారి అభిప్రాయం ప్రకారం, 'Book of the homed' and 'Books of all time' అన్న విభజనలో

గురజాడవారి అక్షర రచనలు అన్ని కాల పరీక్షల్లో నెగ్గినవి. ఒక శతాబ్దం అంటే వంద సంవత్సరాలు గడిచినా నేటికీ అవి మనస్సు మీటుతాయి. ఆలోచనలను మేల్కొలుపుతాయి.

'ముత్యాల సరాలు' వంటి ఆలోచనలు ప్రతీ తరం చదవవలసినవే. అందులో విమర్శకులు, సాహితీ విశ్లేషకుల ఆలోచనా నేత్రంతో చూసినప్పుడు ఆ అందాలు మరింత అందాన్ని సంతరించుకుంటాయి."[1]

మధురాంతకం రాజారాం అభిప్రాయంలో చెప్పాలంటే "ఆంధ్రావళికి సమ్మోదం కలగజేయడమే ధ్యేయంగా కలం బట్టిన కవి బ్రహ్మలా, గురజాడ అప్పారావుగారు మూఢ విశ్వాసాల రుగ్మతలో చివికిపోతున్న సమాజం కోసం సరిక్రొత్త టానిక్కులు తయారు చేయడంలో సలిపిన ప్రయత్నాలలో నుంచీ తెలుగు కథానిక మొదటిసారిగా వెలుగు చూచింది"[2] అంటాడు.

"తరాలు మారినా, మహాకవి స్పృశించిన సమస్యలు సమూలంగా అదృశ్యం కాలేదు, కదా పైపెచ్చు మరింత జటిలం అయ్యాయేమో అంటారు"[3] కీ॥శే॥ కె.వి. హనుమంతరావు డైరక్టర్, ఆకాశవాణి, విశాఖపట్టణం.

కథక చక్రవర్తి శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు గురజాడను గురించి "జాతి ఎంతగా బానిస అయిపోవాలో అంతగానూ బానిస అయిపోయాక, భాష ఎంత శృంఖలాబద్ధం అవ్వాలో అంతగానూ శృంఖలాబద్ధం అయిపోయాక, సాహిత్యం ఎంతగా దిగజారిపోవాలో అంతగానూ దిగజారిపోయాక పుట్టుకొచ్చాడీ మహాకవి"[4] అంటారు.

## 3.2 గురజాడ కథల పై సంస్కరణోద్యమ ప్రభావం

సంస్కరణోద్యమ సాహిత్యం అనగానే ముందు గుర్తొచ్చే పేరు గురజాడ అప్పారావు. ఆ మాటకొస్తే తెలుగు సాహిత్యంలో కొన్ని ప్రక్రియలను తలచుకున్నా ముందు గుర్తొచ్చేది అప్పారావుగారే! అలా గురజాడను గురించి గుర్తు చేయగలిగే ప్రక్రియల్లో ముఖ్యమైంది తెలుగు కథ. ఏ ఉద్యమమైనా ముందుకు వెళ్ళటానికి కనీసం ఒక వర్గపు ప్రజల్లోనయినా ప్రచారం పొందటానికి సాహిత్యం అవసరం ఎంతో ఉంటుంది. సంస్కరణోద్యమ భావాలను ప్రజల మధ్యకు తీసుకెళ్లటానికి సాహిత్యాన్ని ఆధారం చేసుకున్నాడు గురజాడ.

గురజాడ రాసినవి ఐదు కథలు. అవి దిద్దుబాటు, సంస్కర్త హృదయం, మెటిల్డా, పెద్దమసీదు, మీ పేరేమిటి. ఈ ఐదు కథలు సంస్కరణోద్యమాన్ని బలోపేతం చేసేందుకు ఎంతగానో ఉపయోగపడ్డాయి. ప్రతి కథలోనూ ఏదో ఒక సామాజిక సమస్యను వస్తువుగా చేపట్టి ఆ కథలను తీర్చిదిద్దారు.

## 1. దిద్దుబాటు

తెలుగు కథల్లో ఒకటిగా ఖ్యాతికెక్కి తొలి తెలుగు కథగా పేరుగడించిన 'దిద్దుబాటు' గురజాడ కథల్లోనే కాక సమస్త తెలుగు కథల్లోనే చాలా గొప్పది. కథను కథకు ఉండవలసిన లక్షణాలకు అనుగుణంగా క్లుప్తంగా, స్పష్టంగా రాయడం ఈనాటికీ కథారచయితలు కాదలచినవారంతా అలవరచుకోవలసిన ముఖ్య అంశం. గురజాడ కథల్లో వేశ్యాసమస్య, మత సమస్య, స్త్రీ హింస వస్తువులుగా వున్నాయి. గురజాడ కాలంలో జరిగిన సంస్కరణోద్యమంలో బాల్యవివాహ విషయాలు మాత్రమే కాక వేశ్యాసమస్య కూడా కీలకమైంది. చిత్తశుద్ధి లేని సంస్కరణావాదులు కొందరు ఉపన్యాసాలలో వేశ్యలను దూషించినా తరువాత వారినే ఆరాధిస్తూండేవారు. ఒకానొకప్పుడు రాజకీయపరంగా, సాంస్కృతికపరంగా, సామాజిక పరంగా ప్రముఖ పాత్ర పోషించిన వేశ్యవృత్తి క్రమేపీ క్షీణించడం ప్రారంభమై కొన్నాళ్ళకు సాంఘిక దురాచారంగా మారింది. కుటుంబ జీవనానికి ఆటంకం అయింది. ఇటువంటి సందర్భంలో కుటుంబంలో స్త్రీ నిర్వహించవలసిన బాధ్యతను తెలియజేస్తుంది 'దిద్దుబాటు' కథ. నేటి స్త్రీ చరిత్రను పునర్లిఖించిన కథ ఇది. భర్త తిరస్కారానికీ, నిరాదరణకు గురై ఏమి చేసినా సహించే పతివ్రతాస్థాయిని మించి శక్తియుక్తులను ప్రయోగించి అతడ్ని సరిదిద్దిన మహిళా చాతుర్యమే ఈ దిద్దుబాటు.

**'దిద్దుబాటు' కథ సంక్షిప్త పరిచయం :**

ప్రతిరోజు సంఘాన్ని ఉద్ధరించాలంటూ సమాజంలో ఉన్న రుగ్మతలను రూపుమాపేందుకు కృషి చేస్తున్నానంటూ ఇంటి నుంచి వెళ్ళి అర్ధరాత్రి దాటాక గాని కొంపకు చేరడు గోపాలరావు. అతగాడు సానులతో గడపటాన్ని ఇరుగుపొరుగు ద్వారా కమలిని తెలుసుకొని నేనుండటం వలనే కదా నాకు అబద్ధాలు చెప్పవలసి వస్తుంది. నేను లేకపోతే ఆ అవసరం ఉండదు కదా అంటూ తాను పుట్టింటికి వెళ్ళిపోతున్నట్లు ఒక ఉత్తరం రాసి బల్లపై ఉంచి ఆమె దాక్కుంటుంది. త్వరగా ఇంటికి వెళ్ళిపోదాం అనుకుంటూనే ఇంకొంచెంసేపు, ఇంకొంచెంసేపు అనుకుంటూ రోజూ సమయానికే ఇంటి బాట పడతాడు గోపాలరావు. తలుపు తొయ్యాలని ప్రయత్నం చేస్తుండగా అది తీసే ఉండటాన్ని గ్రహించి ఆశ్చర్యపోయి ఇంకెప్పుడు ఇంతసేపు ఉండకూడదు అనుకుంటూ లోనికి వెళ్ళి కమలిని ఉన్న పడక గదిలోకి చేరతాడు. అక్కడ ఆమె కనపడకపోవడంతో పనిమనిషి రావుడిని పిలిచి ఆరా తీస్తాడు. రావుడు సైతం నాకు తెలియదు అనటంతో

రావుడిపై ఆగ్రహాన్ని ప్రదర్శిస్తాడు. ఇలా సాగుతుండగా అగ్గిపుల్ల వెలిగించి కమలిని ఆ గదిలోనే ఇంకా ఎక్కడైనా ఉందేమోనని వెతుకుతుండగా బల్లపై కమలిని రాసిన ఉత్తరం కనిపిస్తుంది. దానిని చదివి పనిమనిషి రావుడిని మీ అమ్మగారి పుట్టింటికి వెళ్ళి కమలినితో పంతులుకి బుద్ధి వచ్చిందట, ఇటువంటి పొరబాటు ఇంకెప్పుడూ చేయడంటూ లెంపలేసుకున్నానని చెప్పమన్నాడు. మిమ్మల్ని గడ్డం పట్టుకొని బ్రతిమాలుకున్నానని చెప్పి తీసుకొని రమ్మనమంటాడు. ఇదంతా మంచం క్రింద ఉండి వింటున్న కమలిని గోపాలరావు ఆతృత, దిగులు, పరివర్తన గ్రహించి గొల్లున నవ్వుతూ మంచం క్రింద నుంచి బయటకు వస్తుంది.

## కథా ఉద్దేశ్యం :

'దిద్దుబాటు' కథలో సంస్కర్త ముసుగులో ఉండి ఇంటిని, సమాజాన్ని గుల్ల చేస్తున్న గోపాల్రావు పాత్ర వంటి కుహనా సంస్కర్తల్లో మార్పు తీసుకురావడం గురజాడ ఉద్దేశ్యం. అటువంటి వ్యక్తుల ముసుగు తొలగించి, వారిలో పరివర్తన కలిగించడం ఆ ఉద్దేశ్యంలో భాగం. దిద్దుబాటు అంటే సరిచేయడం, బాగు చేయడం, మార్చడం ఆ పని స్త్రీ ద్వారా చేయించడాన్ని బట్టి గురజాడ ఆధునిక సాహిత్యంలో స్త్రీకి ప్రాధ్యాన్యతనిచ్చినట్లు గుర్తించాలి.

## 'దిద్దుబాటు' కథ పై సంస్కరణోద్యమ ప్రభావం :

దిద్దుబాటు కథలో చదువుకున్న భార్య అయిన కమలిని, చదువుకున్న భర్త గోపాల్రావును వక్రమార్గంలో నడవనీయకుండా మార్చగలిగింది. చదువుకోని స్త్రీ అయితే ఈ పనిని ఇంత సమర్ధవంతంగా నిర్వహించి ఉండి ఉండేది కాదు. చదువుకోవడం వల్ల తాను సంపాదించిన తెలివితేటల్ని, వివేకాన్ని అవసరానుగుణంగా అమలుపరిచి తనేంటో నిరూపించుకుంది.

విద్య వుంటే వివేకం పెరుగుతుంది. మంచీ చెడులను తెలుసుకోగలిగే విచక్షణ కలుగుతుంది. దాని ద్వారా సమస్యలను రూపుమాపేందుకు అవకాశం లభిస్తుంది. దిద్దుబాటు కథలో స్త్రీ లోలుడైన గోపాల్రావు సానులతో గడపడం కోసం ప్రతిరోజూ సంఘాన్ని ఉద్ధరించే ఉద్యమాలు చేస్తున్నానని ఇంటినుండీ వెళ్ళి ఎక్కువరోజులు ఇంటికి రాకపోవటానికి గల కారణాన్ని ఇరుగుపొరుగు స్త్రీల ద్వారా కమలిని తెలుసుకొని, తాను పుట్టింటికి వెళ్ళిపోతున్నట్లు ఉత్తరం రాసి గోపాలరావుకు తన అవసరాన్ని, అతడు చేస్తున్న

పొరబాటును రెండింటినీ గుర్తింపచేయించింది. భయం వల్లనైతేనేమీ లేదా సహృదయంతోనైతేనేమీ గోపాల్రావులో చివరకు మార్పు చోటు చేసుకోవడం విశేషం. ఈ విశేషానికి కారకురాలు కమలిని. ఈ కథలో కమలిని భర్త గోపాలరావును ఎలా దిద్దగలిగిందో (సరి చేయగలిగిందో) అలా నేటి స్త్రీలంతా వారికున్న సమస్యలను రూపుమాపుకునేందుకు ప్రయత్నం చేయాలి. కమలిని గోపాల్రావుపై ప్రభావాన్ని కనబరిచినట్లు గుర్తించడం జరిగింది కనుక 'దిద్దుబాటు' కథపై సంస్కరణోద్యమ ప్రభావం బలంగా పనిచేసినట్లు గుర్తించవచ్చు.

## 2. మెటిల్డా

గురజాడ రాసిన కన్యాశుల్కం నాటకం గురించి శ్రీశ్రీ (శ్రీరంగం శ్రీనివాసరావు)గారు ఇలా అంటారు "ఇది గతించిపోతున్న వ్యవస్థ యొక్క అవశేషాలు (శిథిలాలు) చేస్తున్న కరాళ నృత్యం" ఏ వ్యవస్థ అయినా శిథిల దశకు చేరుకుంటే, దాని స్వరూపం వికృతంగా ఉంటుంది. నాటి వివాహ వ్యవస్థే కాక, నేటి వివాహ వ్యవస్థ కూడా దాని ప్రాముఖ్యతని కోల్పోతుందనేది గురజాడ అభిప్రాయం. "సామాజిక పరిణామ చరిత్రలో వివాహ సంస్థకున్న ప్రాధాన్యాన్ని నేను తక్కువ చేస్తున్నాననుకోకు వివాహ సంస్థ పురోగతికి దోహదం చేసినదన్న మాట నిజమే. అయితే వివాహ బంధాన్ని తెంచుకోరాదనే నియమం చెప్పనలవికాని కన్నీటి గాథలకు కారణం. ఈ సత్యాన్ని మనమెవ్వరమూ విస్మరింపలేము ........" అంటారు గురజాడ. దాన్ని బట్టి వివాహ-కుటుంబ వ్యవస్థను గురజాడ సమాజ పరిణామ దృష్టితో పరిశీలించినట్లు అర్థమవుతుంది. కొంతమంది స్త్రీలు అవిద్యతోనూ, బానిసత్వంలోనూ ఉంటే, మరికొంత మంది స్త్రీలు చదువుకున్న వారైనప్పటికీ కూడా భర్త దగ్గర అదే స్థితిలో ఉండడం గుర్తించాలి. ఇది విచారకరం. అంటే వారికి ఆర్థిక స్వాతంత్ర్యం లేదని అతడు తెలుసుకున్నాడు. మగవాడు పెట్టే హింసను స్త్రీ భరించడం అనేది వివాహ వ్యవస్థ శిథిలమౌతుందనడానికి నిదర్శనం. ప్రేమను పంచినా, ద్వేషాన్ని పెంచుకున్నా మగవాడివంతే. వీటిలో మొదటిది కలలోనే కాదు, అసల ఆలోచనలకే అందనంత దూరంలో వుంది మెటిల్డాకు. ఈ వాస్తవాన్ని తెలిపే కథే మెటిల్డా. గురజాడ మొత్తం సాహిత్యానికి సామాజిక జీవితమే ఆధారమైనాగాని ఈ కథలో మాత్రం కొంత వైవిధ్యం కనబడుతుంది. ఈ కథకు వంటలక్క చెప్పిన యధార్థ సంఘటనే మూలమని గురజాడ దానిని కొంత మార్చి రచించినట్లు తెలుస్తుంది. భిన్న వయసుగల భార్యభర్తల జీవితగాథే ఈ కథ.

## 'మెటిల్డా' కథ సంక్షిప్త పరిచయం :

మెటిల్డా రూపవతి. భగవంతుడు సృష్టించిన ఈ విశాల అందమైన విశ్వంలో మనోహరమైంది సొగసైన స్త్రీ అనటానికి ఉదాహరణగా చెప్పుకోదగిన సౌందర్యం ఆమె సొంతం. అయితే ఆమె భర్త మాత్రం ముసలివాడు. వయసులో ఆమెకంటే చాలా పెద్దవాడు. చుట్టుప్రక్కల వాళ్ళచేత 'ముసలిపులి'గా పిలువబడుతున్నవాడు. అతడు మెటిల్డాను నిత్యం గృహనిర్బంధంలోనే ఉంచేవాడు. ఆ ఇంటికి ఎప్పుడూ, ఎవ్వరూ రావడం, పోవడం లాంటివి జరిగేవికావు. మెటిల్డా ఎన్నడూ గుమ్మంలోకి కూడా రాకూడదనే నియమం కూడా ఉంది. ఆమె ముఖాన విచారం విలయతాండవం చేస్తూండేది.

అనుహ్యంగా ఓరోజు కాలేజీ విద్యార్థి ఒకడు ఆ దారి గుండా వెళుతూ గుమ్మం ఎదురుగా నిలబడి మెటిల్డాను చూస్తాడు. ఇది గమనించిన ముసలిపులి ఆ విద్యార్థిని లోనికి పిలిచి "ఈ ముండను తీసుకుపో. నీకు దానము చేశాను. తీసుకుపో నాకు శని విరగడైపోతుంది" అంటూ కఠోరంగా మాట్లాడతాడు. తరువాత రోజు మెటిల్డా దైన్యంతో ఆ కాలేజీ విద్యార్థిని ప్రాథేయపడుతూ "మీరు మీనేస్తులూ నా కాపురం మన్ననివ్వరా? మీకు నేనేం అపకారం చేశాను? తలవంచుకు మీ తోవను మీరు పోతేనే బతుకుతాను. లేకపోతే నా ప్రారబ్ధం" అని ఉత్తరం రాస్తుంది. మరి కొంతకాలం గడిచాక ముసలిపులిగా పిలువబడుతున్న మెటిల్డా భర్త ఆ కాలేజీ విద్యార్థిని పిలిచి వాళ్ళ వల్ల ఎన్నో విషయాలను తెలుసుకున్నట్లుగానూ, తాను మారినట్లుగానూ చెబుతాడు.

## కథా ఉద్దేశ్యం :

శిథిలావస్థలో ఉన్న వివాహ వ్యవస్థకు మూలమైన స్త్రీల దుస్థితిని చిత్రించడంతో పాటు విభిన్న వయసుల వారి మధ్య వివాహం సఫలం కాదని తెలియజేయడం - దీని ఉద్దేశ్యం.

## ' మెటిల్డా ' కథ పై సంస్కరణోద్యమ ప్రభావం :

మెటిల్డా కథలో ముసలిపులిగా పిలువబడే మెటిల్డా భర్తను కాలేజీ కుర్రవాడు మార్చగలిగాడు. దీనితో మెటిల్డాకు కొంత ఊరట లభించినట్లయింది. అంతకు ముందు గృహ నిర్బంధంలో ఉండి చీటికీ మాటికీ చివాట్లతో గడిచేది ఆమె జీవితం. ఇటువంటి దుస్థితి ఆ కాలం నాటి స్త్రీలకే కాదు నేటికాలం స్త్రీలకు కూడా అడపాదడపా ఎదురౌతూనే

ఉంది. ఆ దుస్థితి పోవాలంటే పురుషుల ఆలోచనా దోరణుల్లో మార్పురావాలి. కథలో కాలేజీ కుర్రవాడి పాత్ర ఎంతో ప్రభావవంతమైంది. ఆ కుర్రవాడు సౌందర్యరాశి అయిన మెటిల్డాను ఆమె ఉండే ఇంటిదారి గుండా వెళుతూ చూస్తాడు. ఇది పసిగట్టిన ముసలిపులి ''అబ్బాయీ యిలారా'' అంటాడు. అది విని తంతాడేమో అని భావించి పరుగుచ్చుకుందామనుకుంటాడు ఆ విద్యార్థి. కాని ఆ పని చేయడు. దానికి కారణం ఇతడి మీద వచ్చే అభాండం కంటే మెటిల్డా మీద వేసే అభాండం తీవ్రంగా ఉంటుందని తలచి అతడికేమైనా పర్వాలేదనుకొని మెటిల్డాను మాత్రం కాపాడాలనే ఉద్దేశ్యంతో వెళతాడు.

పులి అతడ్ని "లైబ్రరీ గదిలోకి తీసుకెళ్లాడు కుర్చీమీద కూలబడి, రౌద్రాకారమైన చూపుతో యింగ్లీషున అడిగాడు.

"నా పెళ్ళాం వైపు చూస్తున్నావా?"

"కిటికీలోంచి కనపడుతూండే మీ లైబ్రరీ చూస్తూ మీరు ఎటువంటి మనుష్యులు, ఏమి చేస్తుంటారు అని ఆలోచిస్తున్నాను."

"నా పెళ్ళాన్ని చూడలేదూ?"

"చూశాను, ఎదుట నిలుచుంటే కనపడరా, అంతే." పిడుగులాగ "జానే జానే?" అని పిలిచాడు. మెటిల్డా రాలేదు.

"వొస్తావా రావా, లంజా!" అన్నాడు. ఒణుకుతూ మెల్లగా వచ్చి తలవొంచుకు నిలబడ్డది.

ఇంగ్లీషున నాతో మళ్ళీ అన్నాడు :

"ఓ తెలివి తక్కువ పెద్దమ్మా! చూడు ఎంతసేపు చూస్తావో, యీ ముండ మొహం వేపు! ఏం నా వేపు చూస్తావేం, దాని వేపు చూడక? నామొహం, దాని మొహం కన్న బాగుందనా?"

నేను మాట్లాడలేదు. కథ బాగుంది కాదని, కాలు గుమ్మం వేపు సాగించబోతూండగా, కనిపెట్టి మెల్లగా "వుండు" అన్నాడు.

నిలిచాను.

నిమిషం కిందట కన్నుల రాలిన నిప్పులు చల్లారాయి.

"అబ్బాయి!" అన్నాడు.

"నిజవాడ్డ ఎన్నడైనా నేర్చావా? తల్లిదండ్రుల దగ్గిరగాని గురువుల దగ్గరగాని" నా తల్లీదండ్రీ తలపుకు వచ్చారు.

“నేర్చవలసిన అవసరం లేకుండా, నిజాయితీ నాకు పుట్టుకతోనే వొచ్చింది” అన్నాను.

“అయితే, పుట్టుకతో పుట్టిన ఆ నిజాయితీ చూద్దాం. చెప్పు నా పెళ్లాం అందంగా వుందా లేదా?”

“ఆమె అందంగానే వున్నాదనుకుంటాను.”

“సంశయవేమైనా వున్నదా?”

“లేదు”

“తోవంట వెళ్లేటప్పుడు రోజూ, దానికోసం యీ వేపు చూస్తూవుంటావా లేదా?”

“నిజమాడమన్నారు గనుక వొప్పుకోక విధి లేదు. చూస్తున్నాను గాని, చెడ్డ తలపు మనసులో యీషత్తు వుంటే దేవుడు సాక్షి!”

“దాని మాటకేం; అది కంటికిక్కనపడితే నీకు ఆనందం, అవునా కాదా? నిజవన్నదేదీ?”

“అవును”

“అయితే ఈ ముండని తీసుకుపో ; నీకు దానం చేశాను. తీసుకుపో! నాకు శని విరగడైపోతుంది (మెటిల్డా).”

విద్యార్థి మాటలకు ముసలి పులిలో సంఘర్షణ మొదలైంది. దాని ఫలితంగా అతడు చేస్తున్నది తప్పని అతడికే తెలిసి వచ్చింది. తప్పు చేసిన వాడు ఆ తప్పును తెలుసుకోవడం గొప్పతనం. ఇక్కడ పులి తన తప్పును తెలుసుకొని గొప్పవాడయ్యే ప్రయత్నం చేస్తున్నాడు. ఇది హర్షించదగిన విషయం. బాల్య వివాహాలు ఆ కాలంలో విస్తృతంగా జరుగుతుండేవి. కాలానుగుణంగా తగ్గిపోయాయి. నేడు ఎక్కడోకక్కడ, ఎప్పుడోకప్పుడు నూటికో కోటికో వెలుగులోకొస్తున్నాయి. దీనికి పేదరికంతో పాటు స్త్రీలకు పూర్తిగా అందని విద్య, స్వేచ్ఛా, స్వతంత్ర్యాలే కారణం. చట్టాలు స్త్రీ పురుషులంతా సమానమేనని ఘోషిస్తున్నా, ఆచరణలో అమలు జరిపేందుకు మనం అంగీకరించడం లేదు. ఈ కథలో ముసలిపులి మారాడు అనడానికి బలమైన ఆధారం వుంది. కొంతకాలం తరువాత ముసలిపులి ఆ కాలేజీ విద్యార్థితో ఇలా అంటాడు.

“నాకు నీవూ, నీ స్నేహితుడు రామారావూ మరొక గొప్ప ఉపకారం చేశారు. మీ మాటలవల్లా, చేష్టలవల్లా నా భార్య యెగ్యురాలని తెలుసుకొన్నాను. ఆలోచించుకోగా ఆనాటి నుంచి కళ్ళెం వొదిలేశాను. నా పెళ్ళాం బహు బుద్ధిమంతురాలు ఇచ్చిన స్వేచ్ఛనైనా పుచ్చుకోలేదు. ఎక్కడికి కావలిస్తే అక్కడికీ వెళ్ళమన్నాను. ఎవరిని కావలిస్తే వారిని

చూడమన్నాను. ఎక్కడికి వెళ్ళకోరలేదు. ఎవర్నీ చూడకోరలేదు. నాకు నీతో లోకం మరి ఎవరితో ఏం పనంది. అలాగే సంచరించింది.

"దాని చర వొదిల్చావు. అది నా చర కూడా వొదలడానికి కారణమైంది......... (మెటిల్డా)"

కథలో ముసలిపులిలో వచ్చిన మార్పు నిజ జీవితంలో మన సమాజంలోనూ రావాలి. కాలేజీ విద్యార్థి ముసలిపులిపై ప్రభావాన్ని కనబరిచినట్లే సంస్కరణోద్యమం 'మెటిల్డా' కథ పై ప్రభావాన్ని కనబరిచినట్లు గుర్తించాలి.

## 3. సంస్కర్త హృదయం

ఇది సమకాలీన ఉద్యమాన్ని నిశితంగా విమర్శించిన కథ. సమకాలిన ఉద్యమంలో భారతీయ జీవితం ప్రతిబింబించినట్లుగా చెప్పాడంటే సామాజిక జీవితాన్ని సమాజ పరిణామక్రమంలో ఆలోచించాడని అర్థమవుతుంది. ఈ కథ ఆంగ్లంలో రాసినా, ఆంగ్లేయులకు ఈ కథ వల్ల ఎటువంటి ప్రయోజనం లేదు. మన ఉద్యమాల్లో ఉండే లొసుగులు వెలుగులోకి రావడం తప్ప. గురజాడలో ఉన్న నిజాయితిని తెలియజేసే కథ ఇది. దానితో పాటు రచనా వస్తువు పట్ల గురజాడకున్న సమకాలిన దృష్టి ప్రతిస్పందనలు అర్థం చేసుకోవాలి.

సమాజాన్ని పీడించే సాంఘిక సమస్యల విషయంలో గురజాడకు ఆవేశం కంటే ఆలోచనే ఎక్కువ. తన సమకాలీకులలో కొందరి ఆవేశాన్ని చూసే గురజాడ ఈ కథ రాశారేమో అనిపిస్తుంది. మనిషికి ఆదర్శాలుండవలసిందేగాని, అవి ఆచరణకు సాధ్యమై, శారీరక మానసిక పరిధికి లోబడే ఉండాలన్నది గురజాడ ఉద్దేశ్యం. లోకం విచక్షణతో చూడకుండా అసహ్యించుకొనే దానిలో కూడా అంతర్గతంగా దాగి ఉన్న కాస్త మంచిని గ్రహించగలగడం ఆయనలోని మనవతా దృష్టికి నిదర్శనం.

గురజాడ చేపట్టిన సంస్కరణోద్యమంలో వేశ్యావృత్తి నిర్మూలన కూడా వుంది. వేశ్య సమస్యకుపరిష్కారాన్ని కనుగొనే క్రమంలో రెండు వర్గాల అభిప్రాయాలు వెలుగులోకొచ్చినట్లు తెలుస్తుంది. ఒక వర్గం వారు వేశ్యల్నే బహిష్కరించాలనే వాదన వినిపిస్తే, మరో వర్గం వారు వేశ్యల్ని ఆ వృత్తి నుంచీ తప్పించి, సామాజిక జీవన స్రవంతిలో కలపాలని భావించినట్లు ఊహించవచ్చు. మొదటిది మడి దృష్టి, రెండవది మానవతా దృష్టి. సమాజంలో వేశ్య ఒకనాడు ఉన్నతంగా జీవించినాగాని, క్రమేపీ ఆమె ధనవంతుల పడుపుకత్తెగా

మారిపోయింది. అది ధనవంతులకి హోదాగా పరిణమించింది. కందుకూరి కూడా ఈ సత్యాన్ని తన స్వీయచరిత్రలో పేర్కొన్నాడు.

"అంటే వేశ్యను ఆర్థికంగా కృంగదీస్తే, ఆ వృత్తి పోతుందని ఉద్యమకారుల ఆలోచన ఆర్థికంగా దెబ్బతీయడం, జీవితాన్ని నాశనం చెయ్యడమే. విజయనగరం సంస్థానోద్యోగిగా గురజాడ వేశ్యలతో సన్నిహితంగా ప్రవర్తించి, వాళ్ళ ఆలోచనలు వాళ్ళ మనస్తత్వం అవగాహన చేసుకొన్నాడు. వాళ్ళు కూడా అందరిలాంటి మనుషులే అనుకొన్నాడు. "సాని పిల్లలో ఉండే మానవత్వాన్ని మరిచిపోకు. ఆమె సైతం వొక మానవ వ్యక్తి అనే మాటను విస్మరించకు. ఆమె విచారం, కన్నీళ్ళు, సంతోషం, ఆనందబాష్పాలూ నీ నా సుఖదుఃఖాల వంటివే. మన అనుభూతులవలె అవీ గణుతింపదగినవే, గంభీరమైనవే. అవినీతిపరురాలైన భార్యా లేక వ్యభిచారి అయిన భర్తా, కాదా వీరిద్దరితోనూ కూడిన సమాజము ఏ రీత్యా ఒక సానిపిల్ల కంటే మిన్న? వ్యభిచారమే తన వృత్తిగా 'లేబిల్' వేయబడ్డ భోగం పడుచు సమాజాన్ని మోసగించడంలేదు. ఆమెకున్న లేబిల్ దృష్ట్యా ఆమె జీవితం సరియైన తోవనే సాగుతున్నది. ఆమె యే వివాహ బంధాలను వైవాహిక సూత్రాలనూ ఉల్లంఘించడం లేదు" అంటాడు గురజాడ. ఇంతటి అవగాహనతో గురజాడ వేశ్యా నిర్మూలనోద్యమకారుల్లోని ఆలోచనారాహిత్యాన్ని, పిచ్చి ఆవేశాన్ని వాళ్ళకు గుర్తు చేస్తూ 'సంస్కర్త హృదయం' అనే కథను రచించాడు."[5]

## 'సంస్కర్త హృదయం' కథ సంక్షిప్త పరిచయం :

సీతాపూర్ కాలేజీలో రంగనాథయ్యగారు కెమిస్ట్రీ ప్రొఫెసర్‌గా పనిచేస్తూంటాడు. సంఘసంస్కరణ పట్ల అమితోత్సాహం కలవాడు. ఉద్ధృతమైన ఉన్నత భావాలు కూడా కలవాడితడు. మానవుడిలో ఉండే శారీరక, మానసిక దౌర్బల్యాలంటే అతడికి జుగుప్స. అన్యాయాలు, అవినీతి, అక్రమాలు ఏ రూపంలో కనబడినా వేళ్ళతో సహా పెకిళించేయాలనే పట్టుదల కలవాడతడు. వేశ్య వ్యతిరేక ఉద్యమంలో పెనుగాలులు సృష్టిస్తున్నాడా అయ్యర్. వకీళ్ళు కొందరు వేశ్యాప్రియులవడాన్ని తెలుసుకొని వారిపై విరుచుకుపడతాడు. ఓనాడు వారిని దేశద్రోహులుగా చిత్రిస్తూ వ్యాసం ప్రచురిస్తాడు. జిల్లా మున్సబు ఆగ్రహానికి కూడా బలి అవుతాడు. అతగాడి విజృంభణతో మున్సిపల్ కౌన్సిల్‌లో, దేవస్థానం బోర్డులో చీలికలు ఏర్పడతాయి. అలా ఏర్పడిన రెండు వర్గాలు కొట్టుకొనే స్థాయికి దిగుతాయి. ఊళ్ళో క్లబ్బులో

కూడా ప్రోనాచీ, యాంటీనాచీ అని రెండు చీలికలు ఏర్పడతాయి. ప్రోనాచీలు దుష్ప్రచారం చేపట్టినా, వేశ్యలు ఎగతాళి చేసిన అయ్యరు వాటినేమీ లెక్కచేయలేదు. క్లాసురూంలో సైన్సు పాఠం చెప్తూ కూడా ఏదో ఒక అవకాశాన్ని కల్పించుకొని పడుపు వృత్తిని ఏకిపారేస్తూంటాడు.

ఇటువంటి మనస్తత్వం కలిగిన ప్రొఫెసర్ రంగనాథయ్యరు ప్రకృతి ఆరాధకుడు. ప్రతిరోజూ షికారుకని స్వర్ణరేఖానది తీరానికి వెళ్ళేవాడు. స్నేహితులతో కలిసి కవిత్వం, విజ్ఞానం వంటి విషయాలను చర్చిస్తూండేవాడు. అతడు చేపట్టిన ఉద్యమం అతడి భార్యకు నచ్చేదికాదు.

ఒకరోజు బాగా చీకటి పడేదాకా అయ్యరు స్వర్ణరేఖానది తీరంలోనే ఉన్నాడు. అంతలో సరళ అనే వేశ్య అక్కడున్న దేవాలయానికి వస్తుంది. ఆమెను చూసిన వెంటనే ప్రొఫెసర్‌లో అలజడి రేగింది. "ఓహో! ఏ మా సౌందర్యరాశి" అని ఆశ్చర్యాన్ని వెలిబుచ్చాడు. ఆమె గురించి తెలుసుకోవాలని తపన పడతాడు. తన హృదయం తప్పని హెచ్చరిస్తే, దాన్ని ధిక్కరిస్తాడు.

మళ్ళీ సోమవారం అక్కడికి వచ్చిన సరళ వివరాలను తన స్నేహితులనడిగి తెలుసుకొంటాడు. ఆమె వేశ్య అన్న విషయాన్ని తెలుసుకొని విచారిస్తాడు. అయితే వెంటనే అతడిలో మనిషి మేల్కొని 'సరళ సునాయాసంగా లభిస్తే' అనే కోరిక తలెత్తుతుంది.

తరువాత రోజు గుడిలో సరళ పక్కనే నిలుచుంటాడు. ఆమె సహచర్యం కోసం వెంపరలాడతాడు. తరువాత రోజు కాలేజీ ప్రిన్సిపాల్తో అతడికి కలిగిన వేశ్యాసంస్కరణాభిలాషను తెలియజేస్తాడు. అప్పుడు ప్రిన్సిపాల్ హెచ్చరిస్తాడు.

సరళను సంస్కరించేందుకు పన్నిన పథకంలో భాగంగా, ఆమెకు పురాణ పాఠాలను బోధించడానికి విశ్వనాథశాస్త్రిని 50 రూపాయలకు కుదురుస్తాడు. అతడి బోధలు ఆమె దగ్గర చెల్లలేదు. అయ్యరుకు మనశ్శాంతి కరువైంది.

ఇంతలో క్రిస్మస్ శెలవులు వస్తాయి. "కేలం లేబరేటరీలో కూర్చుని ఏకాంత వాసం చేస్తున్నాడు. ఎలక్ట్రిసిటీ మీద ప్రయోగాలు చేస్తూ తననుతానే మరచిపోతున్నాడు. రోజుల తరబడీ యిదే పరిశోధన.

ఒకనాటి సాయంకాలం, చేసిన ప్రయోగం చూసుకుంటూ, సంతోషం పట్టలేకపోయాడు. అతని వదనం ఉజ్జ్వలంగా వుంది. కనులలో సంతృప్తి వెల్లివిరుస్తోంది.

అందరూ కోరదగిన పరిశోధన విజయవంతంగా ముగియ వచ్చింది. ఆనందంతో, ఆవేశంతో, కుర్చీ మీద చతికిలపడ్డాడు. ఎదురుగా బెంచీ మీద ఒక చక్కని ముద్దులొలికే పిల్ల కూర్చుని వుంది. ఆ పిల్లవి నల్లని కళ్ళు, గాలి కెగిరే ఉంగరాల జుత్తు, అప్పుడే కనుచీకటి పడుతోంది, ఎదురుగా వున్నదెవరని చూశాడు. ఏదో భ్రమ తప్పితే మరేమీ లేదు. కళ్ళు నలుపుకుని మళ్లీ చూశాడు. భ్రమ కాదు. నున్నగా జారిపడుతూ ఉంగరాల జుత్తుతో వున్న అతి చక్కని చిన్నది! ఆ పిల్లను చూడగానే, కవితావేశం ఉప్పొంగి యింగ్లీషులో పాడడమారంభించాడు (సంస్కర్త హృదయం)."

పాడడం ఆపి ఆ పిల్లని ఎవరు నువ్వు, ఇక్కడ నీకేం పని అని అడుగుతాడు. అందుకు ఆమె నేను సరళ చెల్లి తరళను అంటూ తెచ్చిన వుత్తరం అతడికిస్తుంది. సరళ అయ్యరును ఇంటికి ఆహ్వానిస్తుంది ఉత్తరం ద్వారా. ఆరోజు చీకటి పడ్డాక ఒంటరిగా సరళ ఇంటికి చేరతాడు. చేరిన తరువాత భయపడి తిరిగి తన ఇంటిదారి పట్టబోతుంటే తరళ పిలుస్తుంది. తిరిగి సరళ ఇంటికి వెళతాడు. సరళ గదిలోకి కూడా చేరుకుంటాడు. సరళను తధేకంగా చూస్తూ తనలోనీ పశుత్వాన్ని బయటపెడతాడు. ఆమెను చూసిన ఆనందంలో అతడు పడుపు వృత్తికి వ్యతిరేకంగా రాసిన ఉపన్యాసాన్ని మరచిపోతాడు. అతడికి ఆమె పెదవుల్ని ముద్దు పెట్టుకోవాలనే కోరిక కలుగుతుంది. ఆమె ప్రశ్నలకు సమాధానాన్ని చెప్పలేకపోతాడు. ఆమె వీణను సుతిమెత్తగా మృదు మధురంగా మీటుతూ జావళీ పాడుతుంది. అయ్యరు గబుక్కున లేచి ఆమె పెదవులను ముద్దు బెట్టుకొని 'దగాలో పడ్డాను' అని అరుస్తూపోయి, తన ఉద్యోగానికి రాజీనామా చేస్తాడు.

**కథా ఉద్దేశ్యం :**

"ఒకరిని లేవనెత్తబోయి మనమే కింద బడటం" అనే తత్వాన్ని విమర్శించడం. అంటే సమస్య ఉధృతి అర్థం కాకుండా దాని తీవ్రతను అంచనా వేయకుండా పరిష్కరించడానికి పూనుకొంటే ఎదురయ్యే దుష్ఫలితాల్ని గుర్తింప చేయడం దీని ఉద్దేశ్యం.

**'సంస్కర్త హృదయం' కథ పై సంస్కరణోద్యమ ప్రభావం :**

'చెప్పేవారికి వినేవాళ్ళు లోకువ' అనే నానుడికి ఈ కథలో రంఘునాదయ్యర్ నిదర్శనం. ఆ సంగతి అలా ఉంచితే ఒకరికి నీతులు చెప్పే ముందు, ఆ నీతుల్ని మనం పాటించాలి

కదా. ఈ కథలో రంఘునాదయ్యర్‌గారు అలా చేయలేదు. దానికి తోడు పడుపు వృత్తిపై తిరస్కార భావంతో ఊకదంపుడు ప్రసంగాలు ఇస్తూ పత్రికల్లో వ్యాసాలు ప్రచురించేవాడు. తనదాకా వచ్చేసరికి ఆ అవకాశాన్ని అంది పుచ్చుకొన్నాడు. ఆనందంలో మునిగి తేలాడు. ఇటువంటి మనస్తత్వం గల వ్యక్తులు మన సమాజంలో ఆనాడూ ఉన్నారు, ఈనాడూ ఉన్నారు. డాంబికాలు ప్రదర్శిస్తూ మనుషుల్లో మహాత్ముల్లా కనబడాలనుకొనే వ్యక్తి రంగనాధయ్యర్ అని చెప్పక తప్పదు. ఎందుకంటే అతడిలో భావాలు అటువంటివే కాబట్టి. మనిషిలోని దౌర్బల్యాలను అసహ్యించుకొనే రంగనాధయ్యరుకు, ఆ దౌర్బల్యాలు అతడిలోనే ఉన్నాయని సరళ నిరూపించింది.

సరళ సౌందర్యరాశి సిద్ధాంత పరంగా వేశ్యవృత్తి పట్ల వ్యతిరేక భావాలున్నా రంఘునాధయ్యర్ వంటి ప్రొఫెసర్‌నే మతి పోగొట్టగలిగిన సౌందర్యం ఆమె సొంతం. ప్రొఫెసర్ ఉద్దేశ్యంలో దేవతల అందాన్ని సరళ పుణికి పుచ్చుకుంది. ఆమె అందమైన విగ్రహంలో ఏ క్రూరత్వమూ దాగిలేదు. ఆమె రాసిన అక్షరాలు ముత్యాలసరాలలాగా ఉంటాయి.

డబ్బు తీసుకొని ఆమెను మార్చడానికి వచ్చిన విశ్వనాథ శాస్త్రిని, తన ప్రశ్నల వర్షంతో సతమతం చేయగల చాతుర్యం ఆమెది. అతడి ద్వారా భగవద్గీత వ్యాఖ్యానాన్ని చెప్పించుకొంది. ఆఖరికి "చంద్ర వంశపురాజుల నెత్తురు సానివాళ్ళదే కాదుటండీ" అని అడిగి శాస్త్రిని నోరు మెదపనీయకుండా చేసింది. అతడ్నే కాదు ప్రొఫెసర్ని సైతం ఆమె సందేహాలతో స్తంభింపచేసింది. సరళ సకల కళా సంపన్నురాలు. జావళీలు, సంస్కృత శ్లోకాలూ కంఠస్తం చేసింది. ఆమె వీణా వాదన మనోహరంగా ఉంటుంది.

ఇన్ని ఉండి ప్రొఫెసర్‌ని ఆరాధించి విఫలమైంది. ఆమె వేశ్య వృత్తి మురికి కూపం అని గ్రహించి, దాని నుండీ బయటపడేయమని ప్రొఫెసర్‌ని వేడుకుంటుంది. అతడితో ప్రపంచపు సరిహద్దుల దాకా పోవాలనుకుంటుంది. కానీ అంతలోనే ఆవేశంతో ప్రొఫెసర్ ఆమెను ముద్దుపెట్టుకొని పారిపోతాడు. ఆ ముద్దు ఆమెకోసం కాదు. అతడికోసమే. తనలోనున్న అసలు మనిషి కోసమే.

రంగనాధయ్యర్ గురజాడకు 'అసంతృప్తి' కలిగించిన కుహనా సంస్కర్తలకు ప్రతినిధి. ప్రాపంచిక భౌతిక విషయాల నుంచీ కాక పుస్తకాల నుంచే సిద్ధాంతాలను రూపొందించుకొని జీవితంలో వాటిని ఆచరణలో పెట్టలేక విఫలుడైన సైంటిస్టు ఇతడు. ఇతరుల

బలహీనతలను గుర్తించగలిగినంత తేలికగా తన బలహీనతలని గుర్తించలేదితడు. తనలోని దౌర్బల్యాలను సంఘసంస్కరణ ముసుగులో కప్పి ఉంచగలడు. ఉబికి వస్తున్న కోరికల్ని తన అంతరాత్మే ప్రశ్నిస్తే, దాన్నే నిరోధించగల సమర్థుడు.

గురజాడ రంగనాథయ్యర్ పాత్ర అనే నాణానికి ఉన్న రెండు ముఖాలను - సిద్ధాంతం, ఆచరణ అనే వాటిని క్లుప్తంగా చిత్రించాడు. రంగనాధయ్యర్ సరళను వశపరుచుకునేందుకు శాస్త్రికి లంచం ఎరచూపేటంతగా ఎదిగాడు. సరళ ఎదురుగా ఉన్న బల్ల మీదకు వంగి మోచేతులని చేతుల మీద మొహం పెట్టుకొని నిలబడి చూస్తుంటే అతడు ఆవిడ అందాన్నే తాగేస్తున్నాడా అన్నట్టు తదేక దీక్షతో ఆమె వంకే చూడగల గట్టి గుండె కలవాడు. ఆమె సిగ్గుపడుతున్నా అతడు చేస్తూన్న మొరటుపని గుర్తుకురాలేదు. ఇంతటి శారీరక మానసిక దౌర్బల్యాలున్న ప్రొఫెసరుకు ఇతరుల్లో అవి ఉన్నాయని వింటేనే చిరాకు పడడం గురజాడ సమకాలీన సంస్కర్తల్ని దెప్పి పొడవడమే.

"గురజాడ ప్రొఫెసర్ని గురించి "కొన్ని సిద్ధాంతాలు, కొన్ని నమ్మకాలు ప్రొఫెసరుకున్న మాట నిజమే. కాని అవి అనంతమైన జీవిత సంఘర్షణ నుంచి జనించినవి కావు. అందువలన బలీయమైనవి కావు. లేకుంటే భోగం పిల్ల సరళ కనిపించగానే ఇట్టే అతని మనసుకు "ఎరవేసినట్లవుతుందా?" అంటాడు. రంగనాథయ్యరు పాత్రకు నిర్వచనమిదే. స్త్రీ పురుష సంబంధాలను గురించి, మానవ పరిణామాన్ని గురించి గురజాడ అభిప్రాయాలు చదివితే, ఈ పాత్ర సృష్టిలోని రహస్యం బాగా తెలుస్తుంది."[6]

చివరకు తనలో చెలరేగిన కోరికను తీర్చుకొనేందుకు సరళ ఇంటికి వెళ్ళి ఆమె అందాన్ని ఆరాధిస్తూ, ఆమె సంగీతాన్ని ఆస్వాదిస్తూ అంతరాత్మలో తలెత్తిన కోర్కెను నెరవేర్చుకొనేందుకు గబుక్కున లేచి ఆమె పెదవులపై ముద్దు పెట్టి ఉద్యమాన్ని, అతడిలోని ఉద్దేశ్యాన్ని కూడా నీరు కార్చాడు. ఇది అతడిలోని డొళ్ళతనాన్ని బయటపెట్టినట్లయింది.

ఏదేమైతేనేమి చేసిన పొరపాటు గ్రహించేందుకు ప్రొఫెసర్‌కు ఎంతో సమయం పట్టలేదు. అతడు చేసిన పని లోకులు తెలుసుకొని అవహేళన చేస్తారని గానీ లేదా అమాయకంగా నవ్విన సరళ నవ్వు అతడి మీద అతడికే ఈర్ష్య, అసహ్యం కలిగించయినా కానీ, ఆ రాత్రికి రాత్రే ఆ ఊరు విడిచి వెళ్ళిపోతాడు. చివరకు తన ఉద్యోగాన్ని కూడా వదులుకుంటాడు. రంగనాథయ్యర్ పై లోకం ప్రభావం అలాగే వేశ్య అయిన సరళ ప్రభావం బలంగా పనిచేసి అతన్ని మార్పుకు గురి చేశాయి. కాబట్టి 'సంస్కర్త హృదయం' కథ పై సంస్కరణోద్యమ ప్రభావం ఉందనే చెప్పాలి.

## 4. పెద్దమసీదు (మతము : విమతము)

గురజాడ రాసిన కథల్లో చాలా చిన్న కథ “పెద్ద మసీదు” (మతము : విమతము). గురజాడ కాలానికి సంబంధించిన ఇతివృత్తం ఇందులో కనబడదు. క్రీ.శ. పదహారో శతాబ్దం నాటి చారిత్రక వాస్తవంతో కూడుకొన్న కథే ఈ పెద్దమసీదు (మతము : విమతము). ఆ వాస్తవానికి అక్షర రూపాన్ని కల్పించి పాఠకులకు తెలియజేసే క్రమంలో గురజాడ సఫలీకృతుడయ్యాడనే చెప్పాలి.

**‘పెద్దమసీదు’ కథ సంక్షిప్త పరిచయం :**

నారాయణభట్టు, పుల్లంబొట్లు ఇద్దరూ బ్రాహ్మణులు. వీరు ఓరోజు సాయంత్రం కాశి నుండీ (కార్తీకమాస శుక్లపక్ష దశమి) స్వగ్రామమైన చికాకొల్లుకు వస్తుంటారు. నారాయణభట్టు స్వగ్రామం చేరుకున్నందుకు సంతోషించి, శ్రీకాకుళ క్షేత్ర మహిమను, వైభవాన్ని వర్ణిస్తూ, దాన్ని పుల్లంబొట్లుకు చూపించబోతాడు.

ఆ క్షేత్ర స్థానంలో మసీదు వెలసి ఉంటుంది. దాంతో నారాయణ భట్టు నిశ్చేష్టుడు అయిపోతాడు. ఓ ప్రక్క అతడు బాధపడుతుంటే, మరోపక్క పుల్లంబొట్లు హేళన మొదలుపెడతాడు. నారాయణభట్టు తన గ్రామంలో ఆ గుడి లేని జీవితం శూన్యమని, తిరిగి కాశీకి ప్రయాణమవుదామంటాడు. అందుకు పుల్లంబొట్లు తన ఊరికి వెళ్దామంటాడు. కానీ నారాయణభట్టు స్వస్థలంపై అభిమానంతో శోకిస్తూంటాడు. ఆవిధంగా వారిద్దరూ మసీదు దగ్గరకు చేరుకుంటారు. మసీదు దగ్గర 50 సంవత్సరాల వయసుగల సాహెబు ఒకడు చిలుం పీలుస్తూంటాడు. నారాయణభట్టు అతడ్ని శివాలయం గురించి ఆరా తీస్తాడు. అప్పుడా సాహెబు “హా సైతాన్కా ఘర్” అని పలుకుతాడు. నారాయణభట్టు తన బంధువులను గురించి ఆరా తీస్తాడు. తెలుగులో సాహెబు ‘లేరు’ అని బదులిస్తాడు. నారాయణభట్టు తన మేనమామైన రామావధాన్లు, చిన్నమామ లక్ష్మణభట్టు ఏమైయ్యారో అని రోధిస్తూంటే, ఆ సాహెబు ‘నారాయణ’ అంటూ విలపిస్తాడు.

ఈ కథ విషయంలో సంపూర్ణమని, అసంపూర్ణమని వాదాలు వినబడుతున్నాయి. అవసరాల సూర్యారావు “కథ మధ్యలో ఆగిపోయింది. రాసి కొట్టివేసినదాన్ని బట్టి యీ సాయెబు నారాయణభట్టు చినమామ లక్ష్మణభట్టు - లచ్చన్న అని తెలుస్తుంది. లేచి తన మేనల్లుణ్ణి కౌగిలించుకోబోతాడు. కాని వద్దు వద్దంటూ నారాయణభట్టు దూరం తొలుగుతాడు”[7] అన్నాడు.

ఆయనే ఆణిముత్యాలకు రాసిన ప్రవేశికలో "ఇది అప్పారావుగారి అసంపూర్ణ రచనలలో ఒకటి"[8] అన్నారు.

భాస్కర స్వర్ణాంబ"అసంపూర్తిగా వుంది యీ కథ. కానీ దాన్నే ముగింపుగా అనుకోవచ్చు"[9] అన్నారు. నార్లా వెంకటేశ్వరరావు "More than one writer on Gurajada has called it an incomplete story. They are wholly wrong: it is a complete story. If another sentence, even another word is added to it, it would lose all the force of it, dramatic climax" అన్నాడు. కథను సంక్షిప్తంగా చెప్పి, It is not silly to call this an incomplete story? What is worse, is it not an insult to the consumate artistry of Gurajada"[10] అని ప్రశ్నించాడు.

విశాలాంధ్ర వాళ్ళు 1972 అవసరాల సూర్యారావు పరిష్కరించిన ఆణిముత్యాలులో, ఈ కథాంతంలో "సాయిబు చేతి నుండి చిలుము నేలవాలి ముక్కలై నిప్పులు నలుదిసల చెదర 'నారాయణ' యని సఖేదముగా పిలిచెను" అని ఉంది. దాని తర్వాత....... అని అసంపూర్ణ సూచనగా చుక్కలగీత ఉంది. దీన్ని అసంపూర్ణ కథగా భావించి సూర్యారావు "కానీ అయితే నువ్వే నా మావా' అనే నారాయణభట్టు వాక్యంతో కథానిక పూర్తయినదన్నా అనుకోవచ్చును"[11] అన్నాడు.

1984లో సెట్టి ఈశ్వరరావు పరిష్కరణలో సూర్యారావు ఉదహరించిన "'అయితే! నువ్వా మావా' అన్నా వాక్యాన్ని 'అయ్యో! మవ్వా మావా' అని ఉదహరించాడు. ఈ వాక్యం 1955 ప్రచురణలో ఉందన్నాడు. అంతేకాక, ఆ వాక్యం అయినాక... అని చుక్కల గీత నుంచాడు."[12] అంటే పైవాక్యం ఉన్నా కథ పూర్తికాలేదని ఈయన ఉద్దేశమన్నమాట.

"వాదోపవాదాలిట్లా ఉన్న ఆ కథ దానంతట అది ఒక సంపూర్ణతను కలిగి ఉంది. ఏకరసవ్యంజకతకు భంగం లేదు. ముగింపు కథానికకు తగినట్టే ఉంది. ఇంతలోనే కథ అయిపోయిందే అనిపిస్తుంది. గురజాడ ఈ కథను ఇంకా పెంచి ఉంటే ఎలాగుండేదో ఊహించవలసిన పనిలేదు.

ఈ కథకే 'మతము-విమతము' అని ఇంకొక పేరున్నట్లు తెలుస్తున్నది సూర్యారావు (1972) 'పెద్దమసీదు' అని ఈశ్వరరావు (1984) 'మతము-విమతము' అని పేర్లుంచారు."[13]

**కథా ఉద్దేశ్యం :**

మనుషుల్ని విడగొట్టే సంస్కృతి కలవారిని, అసమానతల్నీ, అస్ప ృశ్యతని పెంచి పోషించే మనస్తత్వం కలవారిని ఖండించడం దీని ఉద్దేశ్యం.

**'పెద్ద మసీదు' (మతము : విమతము) కథ పై సంస్కరణోద్యమ ప్రభావం :**

ఈ కథ భారతదేశ సంస్కృతి, సాంప్రదాయాలకు అద్దం పట్టేదిగా వుంది. భారతదేశం భిన్న జాతులు, విభిన్న మతాలతో కూడి భిన్నత్వంలో ఏకత్వంగా ఉంది అనడానికి ఈ కథ నిదర్శనం. ఇటీవల కాలంలో మత వైషమ్యాలు, కుల కక్షలు పెచ్చిరిల్లుతున్నాయి. వాటిని రూపుమాపేందుకు ఆ కాలంలోనే వీటిని ఊహించి గురజాడ "పెద్ద మసీదు" (మతము : విమతము) కథ రాయడాన్ని బట్టి గురజాడలోనీ ఆలోచనా శక్తి, సమస్యల పట్ల అతడికి గల అవగాహన ఎంత పటిష్టమైందో అర్థం చేసుకోవాలి. హిందువులైనా, ముస్లీంలైనా, క్రైస్తవులయినా ఎవరైనా ఒకటేనని, మతాల సారం కూడా ఒకటేనని చాలా చక్కగా తెలిపాడు గురజాడ ఈ కథ ద్వారా. కథలో నారాయణభట్టు తన మేనమామ రామావధాన్లు, చిన్నమామ లక్ష్మణభట్టు ఏమయ్యారో అని దుఖిఃస్తూంటే, సాహెబు 'నారాయణ' అంటూ రోధిస్తూ నారాయణ భట్టును ఆలింగనం చేసుకుంటాడు. నారాయణభట్టు హిందూ మతానికి సంబంధించినవాడు, సాహెబు ఇస్లాం మతానికి చెందినవాడు. వీరిద్దరూ రోదిస్తూ ఆలింగనం చేసుకోవడం వల్ల మనుష్యులంతా ఒకటే అన్న భావం స్పురిస్తుంది. మతాలు మనుషులు కల్పించుకున్నవే కానీ భగవంతుడు రూపొందించినవి కావని తెలుస్తుంది. నారాయణభట్టు, సాహెబు కలవడాన్ని బట్టి ఈ కథ విడగొట్టే విషమ సంస్కృతిని రూపుమాపిందని అర్థం చేసుకోవాలి. కనుక "పెద్ద మసీదు" (మతము: విమతము) కథ పై సంస్కరణోద్యమ ప్రభావం బలంగా పని చేసిందనే చెప్పాలి.

## 5. మీ పేరేమిటి?

**దేవుడు చేసిన మనుషుల్లారా!**

**మనుషులు చేసిన దేవుళ్లారా! మీ పేరేమిటి!**

ఈ కథ మతంపట్లు ఎంత మూర్ఖంగా, ఉన్నాయో తెలుపుతుంది. మూఢ నమ్మకాలతో, స్వార్థ ప్రయోజనాలను సాధించుకునేందుకు ఎలా ప్రయత్నించారో ఈ కథలో చూడొచ్చు.

మతం తాలూకు సమగ్రమైన సాంఘిక స్వరూపాన్ని గురజాడ "మీ పేరేమిటి?" కథలో చిత్రించారు. మతాన్ని అడ్డం పెట్టుకొని తమ పబ్బం గడుపుకోవాలని చూసే వ్యక్తులు ఆనాడూ ఉన్నారు, ఈనాడూ ఉన్నారు. ఈ కథా వస్తువు ప్రస్తుత సమాజాన్ని అద్దం పడుతుంది.

**'మీ పేరేమిటి?' కథ సంక్షిప్త పరిచయం :**

రామగిరి అనే విష్ణుక్షేత్రం గల ఊళ్ళో శైవం కూడా బలంగానే ఉంటుంది. అక్కడ బౌద్ధకట్టడాలు కూడా చాలానే ఉంటాయి. అక్కడ శైవులకూ, వైష్ణవులకూ నిత్యం వైరమే. శైవమతానికి మొనగాడు శరభయ్య. వైష్ణవ మత పక్షాన ప్రతినిధి మనవాళ్ళయ్య. వీళ్ళిద్దరి స్వార్థ ప్రయోజనాల కొరకు మత మార్పిడులు కూడా జరుగుతుంటాయి. ఆఊళ్ళో లక్షాధికారి సారధినాయుడు. అతడి బావమరిది అయిన గ్రామ మునసబు రామినాయుడు. వీళ్ళిద్దరూ ఏ మతం వైపు మొగ్గు చూపితే ఆ మతం జోరు మీదుంటుంది. వీరిద్దరినీ వాళ్ళ వైపు తిప్పుకోవడానికి శరభయ్య, మనవాళ్ళయ్య నిత్యం ప్రయత్నాలు జరుపుతుంటారు. రంగాచార్యులు ఆ ఊళ్ళో వైష్ణవానికి ధర్మకర్త. అతడి కొడుకు కృషమాచార్యులు. అతడు ప్రయోజకుడు కాడు. కోడలు నాంచారమ్మ. అక్కడ ఏపనికైనా శైవులంతా ఒకటౌతారు. వైష్ణవులు మాత్రం ఏకం కాలేరు.

ఒకనాడు దక్షిణదేశ ప్రాంతం నుంచీ అయ్యావార్లంగారు వచ్చి సారధి నాయుడికీ, ఇంకొంతమంది నాయళ్ళకీ వైష్ణవ మతం ఇప్పించి వెళతాడు. ఆ క్షణం నుంచీ వారు శివాలయం వైపే చూడకపోవడం శరభయ్యకు రోకటిపోటు తగిలినట్లే ఒక ఎత్తుఎత్తాడు. ఆ సమయంలోనే హైదరాబాదు రాజ్యం నుండి శివాచార్లు ఆ ఊరికి వచ్చి రోజూ అర్ధరాత్రి సమయంలో శివార్చన చేస్తూంటే అది కోలాహలంగా ఉండేది. ఆ ఊరి నాయళ్ళు ఈ తంతు చూసి ఆకర్షితులై శైవంలోకి చేరుకుంటుంటారు. అయితే ప్రధాన వ్యక్తయిన సారధినాయుణ్ని మార్చడానికి శైవులంతా అతడి ఇంటికి వెళ్ళి అతన్ని ఆహ్వానిస్తారు. దీన్ని గ్రహించి సాతాన్లు ఆ విషయాన్ని రంగాచార్యులతో చెప్తాడు. అప్పుడు ఆయన "యే మతమైనా ప్రవృత్తి వున్న వారికి తోవ వుంది" అంటాడు. మనవాళ్ళయ్య రంగాచార్యులతో మాట్లాడి ప్రయోజనం లేదనుకొని సారధినాయుడు శివాచార్లు గుండం తొక్కదలచుకొంటే ఆ వేళ రాత్రి రెండు జాములప్పుడు మీటింగు పెట్టి సారధినాయుణ్ణి శివాచార్ల గుండం దగ్గరికి వెళ్ళనీయకుండ మనవాళ్ళయ్య ఆపుతాడు. అందరూ ఉపాయం ఆలోచించే పనిలో ఉంటే, రామానుజయ్య మనవాళ్ళయ్యను రాగిధ్వజం చేతిలో పట్టుకొని నాలాయిరం పఠిస్తూ గుండం తొక్కమంటే, మనవాళ్ళయ్య రామానుజయ్యనే తొక్కమంటాడు. రామినాయుడు మనవాళ్ళయ్య మహిమను శంఖించాడు. మనవాళ్ళయ్య వైష్ణవుడు కనుక అగ్నిగుండం తొక్కనూ నీటి గుండం తొక్కుతాననంటాడు. ఆ మీటింగు మరోరోజుకు వాయిదా పడుతుంది. రామినాయుడు అంగీకరించలేదు. మనవాళ్ళయ్య ఆలోచించి "శ్రీరామస్వాం వారి తాలూకు

ఉత్సవ విగ్రహం తేవాలి. పెరుమాళ్వారు లేకుండా గరుడాళ్వారు బయల్దేరడు" అంటాడు. అందరూ ఉత్సవ విగ్రహం కోసం వెళ్ళి రంగాచార్యుల్ని మొల మీద గుడ్డలేకుండా అక్కడికి మోసుకొస్తారు. అతడు శూద్రులు ఉత్సవ విగ్రహాలు తాకరాదంటాడు. మనవాళ్ళయ్య 'బతికానురా దేవుడా' అనుకొని రంగాచార్యులునే గుండం తొక్కమంటాడు. రామినాయుడు ముసలోణ్ణి విడిచిపెట్టి కృష్ణమాచార్యుల్ని పట్టుకురమ్మంటాడు. రంగాచార్యులు దానికి అతడు ఊర్లో లేడంటాడు. ఇంతలో మనవాళ్ళయ్య రంగాచార్యులతో గుండం తొక్కించడానికి జనాన్ని పురుమాయిస్తాడు.

అంతలో అనూహ్యంగా ఒక చేత్తో సురకత్తి మరో చేత్తో దీపం పట్టుకొని వచ్చి అక్కడికి ప్రత్యక్షమౌతుంది నాంచారమ్మ. ఆమెను చూచి అందరూ భయభ్రాంతులై దూరంగాపోతారు. నాంచారమ్మ మనవాళ్ళయ్యను, రామినాయుణ్ణి 'ఏం కావాలని' అడుగుతుంది. వారు ఏమీ వద్దంటారు. అప్పుడామె వాళ్ళని గుండం తొక్కమంటుంది. ఇద్దరూ సాకు చెప్పి తప్పించుకొంటారు. వాళ్ళ ప్రధానాశయం సారధినాయుడు మతం మారకుండా ఉండటమో అన్న రహస్యాన్ని ఆమె భయటపెట్టి "ఏ దేవుడి మీదనైనా నిజమైన నమ్మకమన్నది ఏడిస్తే, ఒక గుండవేగాదు, అన్ని కష్టాలూ తరించవచ్చును" అని పలికి పీరు సాయెబును పిలిచి గుండం తొక్కమంటుంది. శివుని శూలం, వైష్ణవ తిరునామం, పీరు అంతా ఒకటేనని మతసమైక్యతను బోధిస్తుంది. పారిపోయిన మనవాళ్ళయ్య తిరిగొచ్చి, ఆమెకు నమస్కరించి పీరుసాయెబుతో గుండం తొక్కించే కార్యక్రమాన్ని చేపడతాడు.

**కథా ఉద్దేశ్యం :**

స్వార్థపరులు మతం పేరిట సంఘాన్ని చీల్చాలని ప్రయత్నం చేస్తూ దాని కోసం కఠోరమైన విధానాన్ని అవలంబిస్తూ తమ స్వప్రయోజనాల కోసం మతాన్ని ఎలా వాడుకుంటున్నారో తెలుపుతూ మతమౌఢ్యాన్ని వ్యతిరేకించడమే దీని ఉద్దేశ్యం.

**'మీ పేరేమిటి?' కథ పై సంస్కరణోద్యమ ప్రభావం :**

ఈ మతం గట్టిది, ఆ మతం ఒట్టిది అంటూ విభజన చేసి దుష్ప్రచారం చేసే మత మూడులు ఈ సమజాంలో తక్కువేమీ లేరు. ఇందుకు ఉదాహరణగా మీ పేరేమిటి కథలో శరబయ్యను, మనవాళ్ళయ్యను చెప్పుకోవచ్చు. వీరు తమ స్వప్రయోజనాలను సాధించుకొనేందుకు మత మార్పిడ్లు చేపట్టడానికి కూడా వెనుకాడలేదు. కథలో నాంచారమ్మ

మనవాళ్ళయ్యను, రామినాయుణ్ణి 'ఏం కావాలి' అని ప్రశ్నించినప్పుడు ఏమి వద్దంటారు. వాళ్ళను పరీక్షించేందుకు నాంచారమ్మ మనవాళ్ళయ్యను, రామినాయుణ్ణి గుండం తొక్కమంటే సాకు చెప్పి తప్పించుకుంటారు. దీని బట్టి వారిలో దోషాలున్నాయని స్పష్టమౌతుంది. ఆ దోషాల్నే వారి, వారి మతాలకు పులిమే ప్రయత్నం చేస్తున్నారు. ఇటువంటి పోకడ ఆనాడే కాదు, ఈనాడు కూడా ఉందని తెలుస్తుంది.

"ఏ దేవుడి మీదనైనా నిజమైన నమ్మకమన్నది ఏడిస్తే, ఒక్క గుండవేగాదు, అన్ని కష్టాలూ తరించవచ్చును" అంటూ పీరుసాయెబును పిలిచి గుండం తొక్కమంటుంది. ఆమె బోధలకు మనవాళ్ళయ్యలో పరివర్తన కలిగి పీరుసాయెబు గుండం తొక్కేందుకు ఏర్పాట్లు నిమిత్తం అక్కడికి తిరిగి వస్తాడు. స్వచ్ఛమైన మనసుతో కల్మషం లేకుండా ఆ పీరు సాయబు గుండం తొక్కుతాడు. ఇలా పీరు సాయెబు గుండం తొక్కడాన్ని చెడుపై మంచి విజయం సాధించినట్లుగా గుర్తించాలి. నాంచారమ్మ హిత వాక్యాలకు మనవాళ్ళయ్యలో కలిగిన మార్పు హర్షించదగింది. ఈ మార్పు నేటి సామాజానికి చాలా అవసరం. ఆవిజయాన్ని సంస్కరణగా పరిగణించాలి. దీన్ని బట్టి 'మీ పేరేమిటి?' (దేవుడు చేసిన మనషుల్లారా! మనషులు చేసిన దేవుళ్లారా! మీ పేరేమిటి?) కథ పై సంస్కరణోద్యమ ప్రభావం బలంగా పనిచేసిందని చెప్పాలి.

## 3.3 శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి (ఏప్రిల్ 1891 - ఫిబ్రవరి 1961)

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు ఖర సంవత్సర చైత్ర శుద్ధ చతుర్దశీ గురువారం నాడు (23-4-1891) లక్ష్మీపతి సోమయాజులు, మహాలక్ష్మీ సోదెమ్మ దంపతులకు తూర్పుగోదావరి జిల్లా రామచంద్రపురం తాలూకా పొలమూరు గ్రామంలో ఒక మధ్య తరగతి వైదిక పండిత కుటుంబంలో జన్మించారు. శ్రీలక్ష్మీపతి సోమయాజుల గారికి పురుష సంతానంలో శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు మూడవవాడు."శ్రీలక్ష్మీపతి సోమయాజులుగారు వేదం అశీతిద్వయమూ, శ్రౌతం కాండత్రయమూ, జోతిష్యం స్కంధత్రయమూ క్షుణ్ణంగా అభ్యసించిన పండితులు."[14]

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారికి ఏడవ సంవత్సరంలో ఉపనయనం జరిగింది. మూడవ తరగతి చదువుతున్నప్పుడు అతడి తండ్రి లక్ష్మీపతి సోమయాజులు స్కూల్ మాన్పించి వైదిక విద్యను నేర్పించేందుకు చేరుస్తాడు.

"పుట్టింది శుద్ధశ్రోత్రియ కుటుంబంలో. 25 ఏండ్ల వరకూ సంస్కృతమే తప్ప తెలుగుతో పరిచయం కూడా లేదు. చాటుమాటుగా అప్పకవి చందోగ్రంథం చదివి పద్యాలు

రాయదలచుకుంటే, తండ్రి చీవాట్లు అన్నగారి దేహశుద్ధి ఇంట్లో అక్క పెత్తనం, తల్లి మాత్రమే "పోనివ్వండి వాడు మీలాగే పంచాంగాలు రాసుకుంటూ ఉండాలనా? ఏమో తెలుగుభాషలో గొప్పవాడవుతాడేమో" అని అగ్నిహోత్రావధాన్లు లాంటి తండ్రి పెత్తనానికి కొంచెం అడ్డు తగిలిన ప్రేమమూర్తి. ఈ వాతావరణంలో పుట్టి పెరిగిన శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు తెలుగు భాషలో మొదట పద్యాలు వ్రాసి, నాటకాలు వేసి, వేయించి చివరకు వచనంలో స్థిరపడటమే కాక అనేక కథలు రాయటమే కాక, వ్యవహారిక భాషలో తెలుగు రాస్తే ఎంత మధురంగా ఉంటుందో నిరూపించిన కథక చక్రవర్తులో ఒకరు.

వీటన్నింటికి మించి వీరేశలింగంగారి సంస్కరణోద్యమాన్ని మనసారా అభిమానించి, రచనల రూపంలో విస్తృత ప్రచారం చేసిన ధన్యజీవి."[15]

"తెలుగు కథా వనంలో విరబూసిన దివ్య పారిజాతం సుబ్రహ్మణ్యశాస్త్రి శ్రీపాదం! పదాలలో అన్నమయ్యా, పద్యాలలో వేమనలకు వలెనే కథలలో అచ్చ తెలుగుతనం ఆఘ్రాణించాలి అంటే శ్రీపాదవారే శరణ్యం. వారి కథలకు వారే నిర్వచనం, వారే కొలమానమున్నూ.........

'నాకో మంచి నవల చదవాలనిపించినప్పుడల్లా నేనో నవల రాసుకుంటాను' అన్నాట్ట బెంజిమిన్ డిజ్రాలీ ............ బహుశ శాస్త్రిగారూ అలాగే రాసి వుండాలి తమ కథల్ని అంటారు వాకాటి పాండురంగారావు గారు.

అతడి మేనమామ కూతురు సీతమ్మతో శాస్త్రిగారికి 12వ సంవత్సరంలో వివాహం జరిగింది. పెళ్ళినాటికి స్మార్తం పూర్తవుతుంది అతడికి. కావ్య పాఠాన్ని పెద్దన్నగారి దగ్గర నేర్చుకున్నాడు. పెద్దన్నగారికి శాస్త్రిగారి పట్ల ప్రేమ ఎక్కువ.

శాస్త్రిగారికి ఇంగ్లీషు చదువుకోవాలనే కోరిక వున్నా, స్వధర్మభ్రంశం తటస్థిస్తుందనే భయంతో తండ్రి ఒప్పుకోడు. వారాలు చేసుకుంటూ ఎందరో ఉద్దండులైన వల్లూరు, వేటపాలెం గ్రామాలలో శ్రీ గుంటూరి సీతారామశాస్త్రిగారి దగ్గర, శ్రీ దర్భా బైరాగి శాస్త్రిగారి దగ్గర సంస్కృత కావ్యాలు, కానూరు అగ్రహారంలో శ్రీ ప్రవా పర్వతావధానులు గారి దగ్గర 'పరాయితం' చెప్పించుకుంటాడు.

తెలుగు కావ్యాలు చదవడాన్ని, తెలుగు కవిత్వం అల్లడాన్ని ఈ రెండూ కులం చెడ్డవాళ్ళే చేస్తారు అని తండ్రి, చిన్నన్నగారు భావిస్తారు. గురువులు కూడా నిషేధించారు. దాంతో ఆవేదన, ఆలోచన, పట్టుదల పెరిగి 'నా తెలుగు నేనెందుకు చదవకపోవాలీ!' అనిపిస్తుంది శాస్త్రిగారికి.

తెలుగు వారే తెలుగు గ్రంథాలను విస్మరించడంతో అది గమనించిన శాస్త్రిగారు ఏదేమైనా తెలుగులో 'గజం ఎత్తు' పుస్తకాలు రాయాలనే పట్టుదల కలుగుతుంది ఆయనకు. అతడు విన్న విషయాలకు చక్కటి కథా రూపాన్ని ఇవ్వాలని రసవంతంగా చెప్పాలనే కోరిక అతడిలో బలంగా నాటుకుంటుంది. వల్లూరులో సంస్కృత కావ్యాలు చదివేరోజుల్లో ఒక వృద్ధ వితంతువు కోరిక మేరకు 'మధన కామరాజు కథలు' చదివి వినిపించాల్సి వస్తుంది. ఆ సంఘటనతో అతడిలో చిన్నతనంలోనే కథా రచన పట్ల ఆసక్తి పెరుగుతుంది, కథలు రాయిస్తుంది.

'వసుచరిత్ర' చదివి వచనంలో ఉన్నంత సుఖం పద్యంలో లేదని తెలుసుకుంటాడు. అతడికి పదిహేను సంవత్సరాలప్పుడు వేటపాళెంలో చదువుకుంటుండగా అరేబియన్ నైట్స్ శుకసప్తతి కథలు చదివి ప్రేరితుడై కథలు రాయడం మొదలు పెడతాడు. తెలుగులో రచనలు చేస్తుండడం వల్ల అతడి గురువుగారు ఆగ్రహించడం వల్ల ఇంకొన్ని ఇతర కారణాల వల్ల చదువును అర్ధంతరంగా విడిచిపెట్టి ఇంటికి తిరిగి రావల్సి వస్తుంది సుబ్రహ్మణ్యశాస్త్రిగారు.

పెద్దన్నగారి ప్రోత్సాహంతో సుబ్రహ్మణ్యశాస్త్రిగారు నన్నయ భారతాన్ని చదవడం ప్రారంభించారు. వీరేశలింగం పంతులుగారి కవుల చరిత్ర చదివిన శాస్త్రిగారికి కులవిద్యల మీద నిరసన కలుగుతుంది. పంతులుగారి ఉపన్యాసాలు వినడం, చదవడంతో ఆ అభిప్రాయం మరింత బలపడుతుంది. అప్పుడే ఒకరి చేతిలో ఇంగ్లీషు నవలొకటి చూసి, ఆ నవలా రచయిత ఎన్నో అటువంటి నవలలు రాశాడన్నా విషయం తెలుసుకొని "మనం గజం ఎత్తు పుస్తకాలు రచించాలి" అని గట్టిగా భీష్మించుకుంటాడు శాస్త్రిగారు. తండ్రి పంచాగాన్ని రచించమనేవాడు. మరో పక్క చిన్నన్న అభ్యాస రచన మాన్పించడానికి ప్రయత్నించడంతో తన కవితా రచనలకు ఆటంకం కలగడం వల్ల ప్రతీకారం మొదలెడతారు శాస్త్రిగారు. వీరేశలింగం పంతులుగారి ఉపన్యాసాలు, బోధలు సుబ్రహ్మణ్య శాస్త్రిగారిని "శుద్ధ ప్రచ్ఛన్న బ్రహ్మసమాజకుని"గా మార్చేసాయి. పెద్దల్ని ధిక్కరించే స్వాతంత్ర్యమన్నా, సత్తా అన్నా లేదతడికి.

పదిహేడవ సంవత్సరంలో భార్య కాపురానికి వస్తుంది. శ్రీ మంత్రి ప్రగడ భుజంగరావు పంతులుగారి 'వారకాంత' చాటు ప్రబంధం చదివి దానిని నాటకంగా మార్చి వ్రాసి, రాయవరంలోని మిత్రులు మల్లిడి సత్తిరెడ్డిగారి సాయంతో వారి ప్రెస్‌లో ఆ నాటకం 1909లో ప్రకటించారు. ముద్రించబడిన శాస్త్రిగారి మొట్టమొదట రచన అది. ఛందస్సు నేర్చుకొని

పద్యరచన మొదలెట్టారు. వారు మిత్రులతో కలిసి 'కళాభివర్ధినీ పరిషత్తు' అనే నాటక సమాజాన్ని స్థాపించి నాటకాలు ప్రదర్శించారు. కొన్ని నాటకాలలో వేషాలు వేసి ప్రేక్షకుల అభిమానాన్ని కూడా చూరగొన్నారు. కొంతకాలం సంగీత సాధన కూడా చేశారు.

గురువు దగ్గరే సాహిత్యం నేర్చుకోవాలని పిఠాపురం సంస్థాన కవులైన శ్రీ వెంకటరామకృష్ణ కవుల నాశ్రయించారు. అష్టావధాన మర్మాలను అక్కడే తెలుసుకొని కొంతకాలం అష్టావధానాలు చేస్తూ దేశమంతా పర్యటించారు వారు. పిఠాపురం గురువులు శాస్త్రిగారి దృష్టిని పద్యరచన నుండీ వచనం వైపు తిప్పారు. వచనారచనే శాస్త్రిగారి జీవితానికి వెలుగునిచ్చింది.

"1913లో రామదేవ విజయము, సాహసిక రాజపుత్రము అనే చారిత్రక నాటకాలు, 'పాణీగృహీతా శ్రవణానందశృంఖల' అనే విమర్శ గ్రంథము, గీత మంజరి మోహాలేఖ, జలక్రీడ-అనే ఖండకావ్యాలు ప్రకటించారు. శాస్త్రిగారి తొలినవల 'మిధునానురాగము' (1914), 'వీర పూజ' అనే చరిత్ర గ్రంథాన్ని మద్రాసు వెళ్ళి కాశీనాథుని నాగేశ్వరరావుగారి సాయంతో 1915లో అచ్చు వేయించారు. శ్మశానవాటిక (1917), అనాథ బాలిక (1924), రక్షాబంధనము (1925) మొదలైన నవలలు, మహాభక్తి విజయము (1918), మర్యాదరామన్న కథలవంటి చిన్న చిన్న పుస్తకాలను ఇరవైకి పైగా ప్రచురించారు.

మద్రాసులో ఉండగా, ఆంధ్రపత్రికలో పని చేసే కోటం రాజు పున్నయ్యగారి ప్రేరణతో శాస్త్రిగారు ఒక గంట వ్యవధిలో 'ఇరువురమొక్కచోటికే పోదము' అనే మొదటి చిన్న కథ వ్రాసి (1915) ఆంధ్ర పత్రికలో ప్రచురించారు."[16]

సుబ్రహ్మణ్యశాస్త్రిగారు 1917లో ఆయుర్వేదౌషధాలు తయారుచేసే 'గంధర్వ ఫార్మసీ'ని స్థాపించి మందుల వ్యాపారం చేశారు. 1920లో 'కౌశికీ ప్రెస్'ను స్థాపించి (రాయవరంలో) 'ప్రబుద్ధాంధ్ర' పక్ష పత్రికను సంస్కృతాంధ్ర భాషలలో వెలువరించారు. ఆర్థిక సమస్యలు రావడంతో ప్రెస్‌ను అమ్మేసి 'ప్రబుద్ధాంధ్ర'ను పక్షపత్రిక నుండీ మాసపత్రికగా మార్చి రాజమండ్రికి తరలించారు. ఆ పత్రిక మధ్య మధ్యలో ఆగిపోతూ, తిరిగి నడుస్తూ 1939 సెప్టెంబరు వరకూ సాగింది. తరువాత కొన్నాళ్ళు రాయవరంలో మల్లిడి సత్తిరెడ్డిగారి 'రెడ్డిరాణీ' పత్రికకు సహాయపడ్డారు శాస్త్రిగారు. రాజమండ్రి వచ్చిన తర్వాత ఇంకొకరి పేరు మీద 'అభ్యుదయ' మాసపత్రికను స్థాపించి రెండు నెలలు నడపడం జరిగింది శాస్త్రిగారు. మళ్ళీ తిరిగి 'ప్రభుద్దాంద్ర' మాసపత్రికతో, గంధర్వ ఫార్మసీతో, కళాభివర్ధనీ పరిషత్తులతో రాజమండ్రిలోనే స్థిరపడ్డారు శాస్త్రిగారు.

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారి ఒక్కొగానొక్క కుమార్తె చిన్న వయసులోనే చనిపోయింది. 'ప్రబుద్ధాంధ్ర'లో పద్యరచనలు ఆగిపోయి వచనా రచనలే వెలువరించడం జరిగింది. 'హిందీ వల్ల తెలుక్కి జరుగుతున్న అపకారం' శీర్షికతో ఆనాటి హిందీ ప్రచారకుల అతిధోరణిని శాస్త్రిగారు తమ పత్రికలో తీవ్రంగా దుయ్యబట్టారు. జాతీయోద్యమంలో అంతర్భాగంగా ఉన్న ఖద్దరు ఉద్యమాన్ని తూర్పారబెట్టారు. 'గంధర్వ ఫార్మసీ' మందుల షాపును కూడా మూసివేశారు. తన బావమరిది కంభంపాటి అప్పన్నగారి కుమార్తెను పెంచి, పెద్దచేసి, వివాహం జరిపించి కూతురు లేని లోటును తీర్చుకున్నారు శాస్త్రిగారు. వీరు కొన్నాళ్ళు ఫిడేలు శిష్టు సర్వశాస్త్రి దగ్గర నేర్చుకున్నారు.

రాజరాజు, కలంపోటు, నిగళ బంధనం, టీపార్టీ (రూపికలు) - నాటక నాటికా రచయితగా శ్రీపాదవారి రచనా చాతుర్యాన్ని తెలియజేసే రచనలు, గ్రాంథిక వాదులైన శ్రీ విక్రమ దేవవర్మగారు, వ్యావహారికంలో వ్రాసిన శాస్త్రిగారి 'రాజరాజు నాటకాన్ని అంకితం పుచ్చుకునేందుకు అర్హులయ్యారు. కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ గారు కూడా 'రాజరాజు' నాటకం చదివి ముగ్ధులై 'భారతి' పత్రికలో వ్యాసం రాశారు.

శాస్త్రిగారి నవలల్లో సైకలాజికల్ నవలగా ప్రసిద్ధి పొందిన 'ఆత్మబలి' పౌరాణిక నవల 'నీలా సుందరి' ప్రముఖుల ప్రశంసలందుకోవటం జరిగింది. మూడు సంపుటాలతో అసంపూర్ణంగా నిలిచిపోయిన శాస్త్రిగారి స్వీయ చరిత్ర 'అనుభవాలు -జ్ఞాపకాలు'ను తెలుగులో వెలువడిన స్వీయచరిత్రలో సాటిలేనిదిగా నిలిచిపోయింది.

శాస్త్రిగారు రెండు వైద్యగ్రంథాలు కూడా వ్రాసి ప్రకటించారు. శ్రీ మధునా పంతుల సత్యనారాయణ శాస్త్రి, శ్రీ బూదూరు రామానుజులు రెడ్డిగార్లతో కలిసి, 'వసంత వాచకము'లను కూడా వ్రాశారు.

వాల్మీకి రామాయణాన్ని మొట్టమొదట తెలుగులోకి అనువాదం చేసిన ఖ్యాతి శాస్త్రిగారికే దక్కింది. బాలరామాయణం, శతనీతి, స్వప్న వాసవదత్తం, చాణక్య నీతి దర్పణం, చాణక్య సూత్రం వంటివెన్నో శాస్త్రిగారి సంస్కృతానువాదాలకు తార్కాణాలు ప్రశ్నోత్తర మాలిక మొదలైన కొన్ని అనువాదాలు ఇంకా పుస్తక రూపాన్ని సంతరించుకోవలసిన శాస్త్రిగారి రచనలు ఎన్నోవున్నాయి. వాటిలో చాలా రచనలు అలభ్యం.

శాస్త్రిగారు తమ గ్రంథాలు తామే అచ్చు వేయించుకుంటూ దేశం తిరుగుతూ, గ్రంథ విక్రయం చేస్తూ పత్రికా రచనలపై వచ్చే చాలీచాలని ఆదాయంతో ఆర్థికపరమైన ఇబ్బందులను అనుభవిస్తూ జీవితయాత్ర చేశారు. 'కళాభివర్దినీ పరిషత్తు' తరపున

రాజమండ్రిలో నన్నయ్య, శ్రీనాథుడి జయంతోత్సవాలు కవి పండితులకు సన్మాన కార్యక్రమాలు, సంగీత సభలు, సాహిత్య సభలు ఎంతో ఘనంగా నిర్వహించారు. నాటి బెజవాడ (విజయవాడ)లో ఆంధ్ర పతాకాన్ని ఎగురవేశారు. వారి మాట మాదిరిగానే కార్య ప్రణాళిక సూటిగా, హుందాగా, 'నిర్మోహమాటంగా' ఉంటుంది. వారెటువంటి రాజకీయ పార్టీతో గానీ సాహితీ సంఘాలతోగాని, పరిషత్తులతో గాని సంబంధం పెట్టుకోలేదు.

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు కొన్ని మారుపేర్లయిన శాస్త్రి, వాచస్పతి, తార్కికుడు, వసంతుడు, కుమార కవిసింహుడు, భట్టాచార్యుడు, కౌశికుడు వంటి వాటితో వ్యాసాలు, వ్యాఖ్యలు, విమర్శలు పత్రికలలో ప్రకటించారు.

1951 ఏప్రిల్ 22న శాస్త్రిగారికి రాజమండ్రిలో షష్టిపూర్తి మహోత్సవం ఘనంగా జరిగింది. 1956 ఏప్రిల్ 25న విశాఖపట్నంలో కనకాభిషేక సన్మానం జరిగింది. ఇప్పటికి తెలుగు కథకులలో కనకాభిషేకం జరిగింది కేవలం శాస్త్రిగారికే.

ఆదిలో సరళ గ్రాంధికాన్ని తన రచనలో వాడినా, గిడుగు రామమూర్తి, గురజాడల వ్యవహారిక భాషను వంట పట్టించుకొని జీవితాంతం వ్యవహారిక భాషలోనే రచనలు సాగించి వ్యవహారిక భాషకు ఎంతో ఆదరణ చేకూర్చిపెట్టారు.

ఇంతటి ప్రతిభావంతుడు సంస్కరణ భావాలు గల శ్రేష్ఠుడు గురించి ఎంతోమంది ఉద్దండులు తమ అభిప్రాయాల్ని ఇలా తెలియజేస్తున్నారు.

"మల్లాది రామకృష్ణశాస్త్రి అభిప్రాయం ప్రకారం "శ్రీపాద వారి కథలు విని వుండకపోతే తెలుగుల ఉనికి అయోమయం. చదువరులకు చదువు చెప్పగలిగినది ఆయన రచన. తీయందనపు తీయందనము చవులిచ్చినదాయన శైలి. ఆయన రచనలు మరో భాషకు లొంగవు. జాను తెనుగు నేర్చినవారికి, తెలుగువారైన వారికీ శ్రీ శాస్త్రిగారి కథలు చదివి ఆనందించే అదృష్టం."

పిలకా గణపతి శాస్త్రి అభిప్రాయం ప్రకారం "అచ్చమైన వ్యవహారికాంధ్రం వ్రాసిన వారిలో ప్రథమ గణ్యులు శ్రీపాదవారు."

విశ్వనాథ సత్యనారాయణ అభిప్రాయం ప్రకారం "సర్వదా తమరీనాటి యాంధ్ర వ్యవహారిక భాష నిర్మాతృగణ ప్రధమగణనీయులు."

కొడవటి గంటి కుటుంబరావు అభిప్రాయం ప్రకారం "ఫ్యూడల్ సంస్కృతి నుంచి వచ్చిన శాస్త్రిగారు, ఆ సంస్కృతి పాత్రల చేత ఫ్యూడల్ సంస్కృతి భాషను మాట్లాడించినట్లు మరెవరూ మాట్లాడించలేరు."

మధునా పంతుల సత్యనారాయణ శాస్త్రి అభిప్రాయం ప్రకారం "శ్రీపాదవారు యదార్థముగా ఆయన చూపులకు కనిపించిన వస్తువు, ఆయన చెవులకు వినిపించిన మాటలు మూటగట్టుకొని కథలలో బెట్టి కళ కట్టించును."

ఉషశ్రీ అభిప్రాయం ప్రకారం "భాషా విషయకంగా ఎంత వ్యవహార వాదియో, భావ విషయంలో అంత తెలుగువాడు - సుబ్రహ్మణ్యశాస్త్రి. ఏ సహృదయున్నైనా తెలుగు భాషలో తెలుగు కథ రాసిన ఖ్యాతి ఎవరికి దక్కుతుందని అడిగితే నిర్మొహమాటంగా 'వడ్లగింజలు' రాసిన సుబ్రహ్మణ్యశాస్త్రిగారిదే ఆ ఖ్యాతి అని చెప్పి తీరుతారు."[17]

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు చివరకు కొంతకాలం పక్షవాతంతో అవస్థపడి తన డెబ్భైయవ సంవత్సరంలో (25-2-1961)న రాజమండ్రిలో పరమపదించారు. శాస్త్రిగారి మరణంతో తెలుగుదేశం చిత్తశుద్ధిగల రచయితని, ఉన్నత భావాల గల సంస్కర్తని, మంచి కథా శిల్పిని కోల్పోయినట్లయింది.

## 3.4 శ్రీపాద కథల పై సంస్కరణోద్యమ ప్రభావం

నాకు లభించిన శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారి కథలన్నింటినీ పరిశీలించి వాటిలో ఇరవై కథల్ని సంఘసంస్కరణ భావాలున్నవిగా నేను గ్రహించాను. ఆ గ్రహించిన వాటిని సిద్ధాంత గ్రంథంలో పొందు పరుస్తున్నాను. అవి

1. రామలక్ష్మి
2. సుభద్రమ్మ
3. వెలిపెడితే అల్లుడైనాడు
4. మేనరకము తప్పలేదు
5. అన్నపూర్ణ
6. జూనియరు, కాదు. అల్లుడు
7. 'వయస్సూ, బుద్ధీ కూడా పెరుగుతాయి'
8. క్రిందికా? పైకా?
9. ముందు హాలాహలము - పిదప అమృతము
10. బ్రాహ్మణాగ్రహారం
11. బుచ్చి వెంకయ్యమ్మ
12. సాగర సంగం

13. మొదటి దాటి

14. తులసి మొక్కలు

15. పెళ్ళాడతగ్గ మొగాడేడీ?

16. తల్లి ప్రాణం

17. ఘటన

18. అరికాళ్ళ కింద మంటలు

19. కలుపు మొక్కలు

20. ఇలాంటి తవ్వాయి వస్తే........?

## 1. రామలక్ష్మి

కుహనా సంస్కర్త వలన ఇక్కట్లు ఎదుర్కొంటూ వివేకంతో వాటిని ఛేదించి తాను కోరుకున్న యువకుణ్ణి వివాహమాడిన వితంతు యువతి సాహసగాథను తెలియజేసేదే రామలక్ష్మి కథ.

**'రామలక్ష్మి' కథ సంక్షిప్త పరిచయం :**

సంస్కార వివాహం చేసుకున్న వైశ్యదంపతుల పెళ్ళి ఊరేగింపు చూడడంతో ప్రేరణ కలిగి వితంతువైన రామలక్ష్మి ఇవతల మేడపై నుండీ, సూర్యారావు అవతల మేడపై నుండీ ఒకరినొకరు తదేకంగా చూసుకోవడం ప్రారంభిస్తారు. అంతటితో ఆగక మళ్ళీ, మళ్ళీ ఆమెను చూడాలని ఇతడు, ఇతడిని చూడాలని ఆమె ఎన్నోసార్లు ప్రయత్నం చేస్తారు.

దానితో రామలక్ష్మిలో చోటు చేసుకుంటున్న మార్పును సూర్యారావు తన ఆలోచనా దొంతరుల్లో గమనించగలుగుతాడు. ఓ పక్క సూర్యారావు తల్లితండ్రులు అతనికి ఇంటి దగ్గర మేనమామ కూతురితో పెళ్ళి చేయాలనే ఆలోచనలో ఉంటారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ సూర్యారావు తండ్రి సూర్యారావుకు ఉత్తరం రాస్తాడు. సూర్యారావు శెలవులు ఇవ్వగానే ఇంటికి వెళ్ళేందుకు తన పెట్టె సర్దుకుంటుండగా అవతలి మేడ మీద నుంచీ రామలక్ష్మి అతని మీదికొక పూల బంతిని విసిరి పారిపోతుంది. అది కాస్తా సూర్యారావు మీద పడవలసింది దురదృష్టవశాత్తు గదిలో కూర్చొని చదువుకుంటున్న రంగారావు ఒడిలో పడుతుంది. ఏమిటో అది అని రంగారావు ఆత్రుతతో ఉలికిపడి చూస్తాడు. అది బంతి పూల బంతి. దానికో చీటి కట్టి ఉంటుంది. దాన్ని మెల్లగా తెరిచి చూస్తాడు రంగారావు. అందులో "మీరు సంకురాత్రి పండక్కి యింటికి వెళ్లకండి" అని రాసి ఉంటుంది.

అప్పుడు రంగారావు విషయాన్ని ముందుగానే పసికట్టి "తప్పదు. నాస్థానమున నా మిత్రుడు రంగారావు సకలమును మాట్లాడును" అని సమాధానం రాసి బంతికి కట్టి సూర్యారావు పడక మీదకి వెళ్ళాక వసారాలోకి వచ్చి ఆమె ప్రత్యుత్తరము కోసం ఎదురు చూస్తూండటాన్ని గమనించి రంగారావు చీకట్లో ఉండి చీటీ ఉన్న బంతిని అవతలికి విసిరి మెల్లగా లోనికి జారుకుంటాడు.

తెల్లవారు జామున సూర్యారావు మోటరు వాహనంపై ద్రాక్షరామము మీదగా రామచంద్రపురము వెళ్ళిపోతాడు. రంగారావుకు గతంలో పెళ్లవుతుంది. ఆమెను విడిచిపెట్టడం కూడా జరిగిపోయింది. పునర్వివాహ ప్రయత్నంలో తలమునకలై ఉంటాడు. ఆ విషయం అతడి మిత్రుడైన సూర్యారావుకు తప్ప మరెవరికీ తెలీదు.

స్నేహితుని సలహామేరకు అతడు అందరాని కన్యలమీద ఆశను విడిచిపెట్టి వితంతువును పెళ్ళాడాలనే ఉద్దేశ్యంతో వీరేశలింగం పంతులుగారితో ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుతూ ఉంటాడు. ఇతడు కోరుకునే వితంతువు అతి అందంగా ఉండాలనుకోవడం వల్ల వీరేశలింగంగారు రంగారావుకు వివాహం చేయలేకపోతారు. ఎన్నోసార్లు అతడు పంతులుగారి ఆశ్రమానికి వెళ్ళి ఎంతోమంది వితంతువులను చూసి "ఇంతకంటే అందగత్తె వచ్చినప్పుడు తెలుపండి. తొందరలేదు, గాని సాధ్యమైనంత తొరగా పెళ్ళి కావాలి" అని చెప్తాడు. పంతులుగారు రంగారావు మోసగాడా అని ఆలోచించి విసుగు చెందుతారు. కానీ పూర్వాచార పరాయణుని పుత్రునకు వితంతు వివాహము చేసి తీరాలని పట్టుదల వల్ల ఆ విసుగును జయిస్తారు. రంగారావు ఎవరైనా తన భార్య ప్రస్తావన ఎత్తినప్పుడల్లా ఆమె రంగూను లేచిపోయిందంటూ బొంకుతుంటాడు.

"రామలక్ష్మి యేడెనిమిదిసార్లు రంగారావు మీదికి బంతులు విసురుతుంది. ఒక బంతిలో ఉన్న జాబులో "ఎక్కడికి రమ్మంటే అక్కడికి వస్తాను" అని వుంది. రెండో దానిలో "పెళ్ళి చేసుకోవాలి తెలిసిందా? మరియొక్క విధంగా అయితే - అయితే - రాను తెలిసిందా?" అని వుంది. మూడో దానిలో "తొరగా కావాలి" అని వుంది. నాల్గవ దానిలో "మొగ వేషంతో ఊరు దాటుతాను. సిద్ధం చెయ్యండి" అని వుంది. అయిదో దానిలో "రేపు మా అన్నయ్య బందరు వెడతాడు. తెల్లారగట్ల బయలుదేరితే మంచిది" అని ఉంది. మూడుసార్లు ఆ రాత్రి బంతులు రాకపోకలు చేశాయి (రామలక్ష్మి)."

వీరేశలింగం పంతులుగారు కలకత్తా వెళ్ళారని, అక్కడ గొప్ప సంస్కరణసభ జరగబోతుందని, తొంబదితొమ్మండుగురు వితంతువులు ఆ సభా సమక్షమున పెళ్లి

చేసుకోవడానికి తగిన ఏర్పాట్లు జరిగినట్లు, అందులో వందోదిగా మన వివాహం జరిగితే బాగుంటుందని వీరేశలింగంగారు ఆ సంగతి రాసి ప్రోత్సహించినట్లు, రంగారావు నిన్ను కలకత్తా చేరుస్తాడని నేను అక్కడ కలుస్తానని, ముందు వెళ్ళి ఏర్పాట్లు సిద్ధం చేస్తానని సూర్యారావు రంగారావుకు జాబు రాసినట్లు ఆమెను నమ్మించి సంకేతం ప్రకారం తెల్లవారుజామునే జట్కా బండి మీద ముందు పిఠాపురానికి, అక్కడనుండి తునికి తీసుకొనివచ్చి రైలెక్కించి కలకత్తా చేరుస్తాడు.

రంగారావు బాగా తెలివిగా ఆలోచించి కలకత్తాలో తెలుగు వారెవరూ అందుబాటులో లేని ప్రాంతంలో వారి బస ఏర్పాటు చేస్తాడు. రంగారావు ఆమెను రెండు రోజుల్లోనే పుణ్యస్త్రీగా తయారుచేస్తాడు. రోజులు గడిచిపోతున్నా సూర్యారావు రాకపోవడంతో రామలక్ష్మిలో దిగులు చోటుచేసుకుంటుంది.

ఓ రోజు రామలక్ష్మి రంగారావును ''వారింకా వచ్చారు కారేమండి?'' అని అడుగుతుంది. అప్పుడు రంగారావు ''కారణం తెలియదు. రేపు తంతి కొడతాను'' అనగా, రామలక్ష్మి ''సభ యెప్పుడండీ?'' అని అడుగుతుంది. ''నాకు తెలియదు. ఆ వివరం మొదట అతడు రాయలేదు. వీరేశలింగం గారి బసయినా తెలిస్తే వెళ్లి మాట్లాడి వుందును'' అని అంటాడు. దానితో ఆమె ''రేపు తప్పకుండా తంతి కొట్టాలి సుమండి'' అని ఉద్విగ్నస్వరముతో చెప్తుంది.

తంతి కొట్టారా అని ఆమె అడగగా ''కొట్టే వచ్చాను. ఇక వీరేశలింగంగారి బస కనుక్కుంటాను'' అని బయలుదేరి వెళ్ళిన రెండు గంటలకు తంతి ఒకటి వస్తుంది. రామలక్ష్మి దానిని ప్రాణప్రదంగా దాచుకొని ఉవ్విళ్ళూరుతుంటుంది. ఇంతలో రంగారావు వస్తాడు. అమితమైన ఉత్సాహంతో ''తంతి వచ్చిందండీ'' అంటూ దానిని రంగారావు మీదికి విసురుతుంది. రంగారావు దానిని చదువుతుండగా అమృతవాక్కులు వినబడతాయనుకుంటున్న రామలక్ష్మికి పిడుగులాంటి వార్త వినబడుతుంది. ఏమి రాశాడండీ అని మళ్ళీ అడుగగా, రంగారావు ''ధూం: మూర్ఖుడు : మోసం చేశాడు'' అని అతడు తంతిని నేలకేసి కొడతాడు.

రామలక్ష్మికి దుఃఖం పెల్లుబికి, నేలకొరిగి ఏడుస్తూ ''ఏమని రాశారండి?'' అని మళ్లీ అడుగగా ''ఛండాలుడు రాయడానికేమి వుందీ? తనకి మేనమామ కూతురు తప్పింది గాదుట. క్షమించవలసినదని నీతో చెప్పమన్నాడు. నీ ఇష్టం వచ్చిన వాణ్ని పెళ్ళాడి సుఖించమన్నాడు. నిన్ను తరువాత తాను వచ్చి చూసి దీవిస్తాడుట'' అని అతడు

సమాధానమిస్తాడు. యేడుస్తూనే ఆమె "ఆ తంతి ఇలా ఇవ్వండి" అని చేయి చాపగా, "యెందుకూ వెధవతంతీ?" అని దానిని చించేసి బయటకు వెళ్ళిపోతాడు (రామలక్ష్మి)."

రామలక్ష్మి యేడుపుకు అవధులు లేవు. ఆమె స్థితి చెప్పడానికి వీలు లేకుండా ఉంటుంది. ఇంతలో విషయాన్ని పసిగట్టిన ఇంటి యజమానుగడు నగేంద్రనాథ బెనర్జీ రంగారావు అక్కడ లేకపోవడాన్ని గ్రహించి, మోసం చేశాడని తెలుసుకొని, రంగారావుని వెతికి, అతని దగ్గరకు వెళ్ళి తంతిని చూపించమంటే, కోపంతో దాన్ని చించేశానంటాడు. సరే నకలు సంపాదించొచ్చులే అంటే, "మీరు అలా చెయ్యండి" అని నగేంద్రనాథ బెనర్జీని పంపించి, రంగారావు తిరిగి బసకొచ్చి తన తోలు పెట్టెతో అక్కడనుండి వుడాయిస్తాడు. కోపంగా ఉన్న రామలక్ష్మి అతడిని ఆపే ప్రయత్నం చేయలేదు.

కొంతసేపటికి బెనర్జీ వచ్చి తంతి కలకత్తా నుంచే వచ్చింది అని చెప్పి రామలక్ష్మి సంజ్ఞలతో రంగారావు వెళ్ళిపోయాడని తెలుసుకొని, ఇప్పుడు నీ సంగతేంటంటూ నగేంద్రనాథ బెనర్జీ ఒక తెలుగు వాడితో అడిగిస్తాడు. తెలుగుమాట వినబడడంతో ఆమెకు ప్రాణం లేచి వచ్చి తలుపు చాటునుండీ అతనికి క్లుప్తంగా సమాధానమిస్తుంది. ఆంధ్రుడనేక ప్రశ్నలు అడుగగా రామలక్ష్మి "పేరు సూర్యారావుగారు కాకినాడ కాలేజిలో ఎఫ్.ఎ. చదువుతున్నారు. వారికి తంతి కొట్టాలి" అని మాత్రమే సమాధానమిస్తుంది. ఆ ఆంధ్రుడు ఆమె చెప్పిందాన్ని బెనర్జీకి చెప్తాడు. బెనర్జీ సూర్యారావుకు టెలిగ్రామ్ పంపి సూర్యారావును వెంటపెట్టుకొని ఇంటికి తీసుకొస్తాడు. జరిగిందంతా రామలక్ష్మి సూర్యారావుకు చెప్పగా, సూర్యారావు బెనర్జీకి ఇంగ్లీషులో చెప్తాడు. ఆ ఇంట్లో వారందరికి ఇంగ్లీషు వచ్చి వుండటంతో రామలక్ష్మికి వచ్చిన కష్టాన్ని తెలుసుకొని బాధ పడతారు. ఆ రోజు సాయంత్రం కలకత్తాలోని బ్రాహ్మసామాజికుల ప్రధాన కార్యస్థానములో రామలక్ష్మి - సూర్యారావుల వివాహం వైభవంగా జరుగుతుంది.

**కథా ఉద్దేశ్యం :**

సమాజంలో నమ్మకద్రోహులు, వంచనకు గురిచేసేవాళ్ళు ఉంటారు. అటువంటి వారి విషయంలో ఆచితూచి అడుగు వేయాలనేదే ఉద్దేశ్యం.

**'రామలక్ష్మి' కథ పై సంస్కరణోద్యమ ప్రభావం :**

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు వాస్తవికతకు దగ్గరగా ఉండే కథలు రాయడంలో మంచి నేర్పరులని తెలుస్తుంది. రామలక్ష్మి కథలో వితంతువైన రామలక్ష్మికి పునర్వివాహం జరిపించి అతడు సంస్కరణాభిలాషి అని నిరూపించుకున్నాడు. రంగారావు పాత్ర ద్వారా

సమాజంలో ఇటువంటి వారు కోకొల్లలు. వీరు మిత్రద్రోహానికైనా, వంచనకైనా ఒడికట్టడానికి ఏ మాత్రము వెనుకాడరని తెలుపుతూ, అటువంటి వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించినట్లు మనం గ్రహించాలి. అంతేగాక నగేంద్రనాథ బెనర్జీ వంటి ఉన్నతమై పాత్ర ద్వారా ఆపదలో ఉన్న రామలక్ష్మిని ఆదుకొని, ఆమెకు బెనర్జీ కుటుంబం అండగా ఉండటాన్ని చూపించి సమాజంలో ఇంకా మానవీయ విలువలు నశించిపోలేదు అని నిరూపించారు. కనుక 'రామలక్ష్మి' కథ పై సంస్కరణోద్యమ ప్రభావం బలంగా పని చేసిందనే చెప్పాలి.

## 2. సుభద్రమ్మ

ఆడవాళ్ళు రంగూన్ వెళ్ళకూడదనే అభిప్రాయాన్ని తిరస్కరించే ఆదర్శప్రాయుడైన ఒక రెడ్డి యువకుడి గృహస్థ జీవితగాథే సుభద్రమ్మ కథ.

**'సుభద్రమ్మ' కథ సంక్షిప్త పరిచయం :**

కూలీనాలీ చేసైనా డబ్బు సంపాదించాలనే ఉద్దేశ్యంతో పూర్వం చాలామంది ఆంధ్రదేశాన్ని విడిచి రంగూన్ వెళ్ళేవారు. అలా వెళ్ళిన వారిలో కొందరు రెడ్లు వ్యాపారాలు చేసి లక్షలు సంపాదించారు. వారు లక్షాధికారులైనా కానీ కూలీల మాదిరిగానే భార్యాపిల్లలను రంగూన్ తీసుకురావడానికి ఇష్టం లేక స్వదేశంలోనే ఉంచేసేవారు.

సమాజంలో నైతికంగా దిగజారిపోయిన ఆడవాళ్ళు మాత్రమే రంగూన్ వెళ్తారు అనే దురభిప్రాయం వ్యాప్తిలో ఉండేది. అటువంటి అభిప్రాయం ఏర్పడటానికి రంగూన్‌లో "ఈ రంగూన్‌కు వచ్చెడి స్త్రీలు 100కి 50 మంది యీ రంగూన్‌లో వేశ్యావృత్తిలో జాతి మత వివక్షత లేక వేశ్యలకని నియోగించిన వీధులయందు కాపురముండి, మార్గమున బోవు ప్రతివానిని గొంతెత్తి బిలుచుచు కొంత కాలమునకు వ్యాదులచే పీడింపబడుచు, వేశ్యావృత్తి మానుకొని 10 రూపాయలు సంపాదించుటకు మన యాంధ్ర సోదరుల చెంత చేరి 30, 40 మంది పురుషులు మధ్య కాపురము చేయుచు పలురకముల పచ్చడులు తయారుచేసి, నూనెతో తాలింపులు చేసి అమ్ముకొనుచు కాలము గడిపెదరు. ఆ పచ్చడులు మన సోదరులు లెస్సగా భుజించెదరు గాని, అన్నమును వండరాదు; అన్నమును తాకరాదు; దరి జేరరాదు. ఆ యింటియందు వీరుల మధ్యనే ఉంపుడు భర్తలతో శయనింపవచ్చును. ఇట్టి హేయమైన పనులు తప్పుగా పరిగణింపరు; గాని అన్నమును వండరాదు. సామర్థ్యము గల యువకులు స్వదేశమునుండి తమ యిల్లాండ్రను బర్మాకు తీసికొని రారాదు. అట్లెవ్వరేని

తీసుకవచ్చినయెడల వారిని జాతి నుండి తొలగించెదరు. అక్కటా; యిదేటి న్యాయము? తమ యుంపుగత్తెలతో సమస్తోపచారములు చేయించుకొనుట తప్పుగాదు గాని, తమ యిల్లాండ్రను రంగూనుకు తీసికొని వచ్చుట తప్పా? ...... సోదరులారా ! వింటిరా, బర్మాలో మన యాంధ్ర సోదరుల యాచారములు పవిత్రమయిన మన హిందూధర్మశాస్త్రముల, ధర్మముల నేవిధమున గాపాడుచుంటిరో; విని సంతసించుడు (సుభద్రమ్మ)."

"-----బర్మాలోగల యితర తెగలవారు బర్మాకు వచ్చెడి (తెలుగు స్త్రీలను) జాతి, నీతిలేని జంతుజాలముగా దలంచుట. బర్మాలో గల మన యాంధ్రులను గూర్చి వ్రాయవలెననిన భారతమును మించును (సుభద్రమ్మ)."

అలా ఆడవారు రంగూన్ వెళ్ళకూడదనే ఆచారం సమాజంలో పాతుకుపోయిన రోజుల్లో తూర్పుగోదావరి జిల్లా రాయవరం గ్రామానికి చెందిన రామారెడ్డి భార్య సుభద్రమ్మ కాపురానికి వచ్చిన తొలిరోజుల్లో ఆమెను స్వదేశంలో వదిలిపెట్టి వర్తకం కోసం రంగూన్ వెళ్తాడు. భర్త ఎడబాటుతో దిగులు చెంది మంచం పట్టిన సుభద్రమ్మ భర్త చూడటానికి రావడంతో కోలుకుంటుంది. తనతో రంగూన్ వెళదాం రమ్మన్న భర్తతో సుభద్రమ్మ "కులంలో లేని ఆచారమా?" అంటూ వెళ్ళడానికి ఇష్టపడదు. తిరుపతి యాత్రలకు వెళ్ళి తిరిగి వచ్చేటప్పుడు రామారెడ్డి, భార్యను మద్రాసుకు వెళ్తున్నట్లు నమ్మించి రంగూన్‌కు తీసుకువెళతాడు. సాహసించి భార్యను రంగూన్ తీసుకొచ్చినందుకు 'కులం బాగుపడే పని' చేశావంటూ భార్యా, భర్తలను రెడ్డి మిత్రులంతా అభినందిస్తారు. ఆ వెంటనే వారు కూడా తమ కుటుంబాలను స్వదేశం నుంచి రంగూన్ తీసుకొచ్చుకుంటారు. అప్పుడు సుభద్రమ్మ "ఇదిగో వినండి నాపేరు సుభద్రమ్మ, నాతండ్రి పేరు వేంకటరెడ్డి నా పుట్టినయిల్లును, అత్తిల్లును గూడ రాయవరమునందే గలవు. పుట్టింటివారు బేతి రెడ్డివారు. అత్తింటివారు మారం రెడ్డివారు...నాభర్త పేరు రామారెడ్డి...(సుభద్రమ్మ)" అంటూ ప్రారంభించి కథాపాత్రలో కనబడుతున్న సుభద్రమ్మ తన అనుభవాన్ని వినిపిస్తుంది.

'రెడ్లు ఇక్కడకు తమ ఆడువాండ్రను దీసికొని వచ్చుటకు భయపడవలసిన కారణమేమియునులేదు. అంటూ కథ పూర్తవడం వల్ల ఇది సందేశాత్మక కథగాతేలింది. తూర్పుగోదావరిజిల్లా రాయవరం రెడ్డి కుటుంబానికి సంబంధించిన ఈ కథ తిరుపతి, పుదుచ్చేరి తిరిగి, నౌకాయానం చేసి చివరకు రంగూన్ చేరింది. సంఘసంస్కార దృష్టిగల రచయిత, తన సమకాలిక సమాజంలో రెడ్ల కుటుంబాలలో ఉన్న ఒక అపోహను తొలగించేందుకు ఈ కథలో చైతన్యవంతుడైన ఒక రెడ్డి యువకుని పాత్రను సృష్టించారు.

రచయితకు రెడ్ల కుటుంబాలతో గల సాన్నిహిత్యం వారి సమస్యల పట్ల సానుభూతిని కలిగించి ఈ కథ వ్రాయించింది.

సుభద్రమ్మ చెప్పిన ఈ కథకి 'సుభద్రమ్మ' అనే శీర్షికగా పాత్ర పేరు పెట్టిన శాస్త్రిగారి కథలలో ఇది రెండవది.

**కథా ఉద్దేశ్యం :**

శాస్త్రిగారి కథలన్నీ ఏదో ఒక సందేశాన్ని నిర్దేశించేవిగా ఉంటాయి. అందులో భాగంగా ప్రస్తుత కథ 'సుభద్రమ్మ'లో పూర్వం రెడ్డి కులాలలో వున్న మూఢవిశ్వాసాన్ని తెలియజేశారు. మూఢ విశ్వాసాల వలన మనుషులు ఎదగరు అనేది ఉద్దేశ్యం.

**'సుభద్రమ్మ' కథ పై సంస్కరణోద్యమ ప్రభావం :**

ఈ కథ రెడ్ల కులంలో చైతన్యాన్ని తీసుకువచ్చేందుకు ఉద్దేశించి రాయబడింది. కథలో రచయిత ప్రస్తావించిన రెడ్డి కుటుంబాల స్త్రీల విదేశీయానం వారిని చెడగొడుతుందనే అభిప్రాయం పూర్వం వున్నమాట వాస్తవమే. కానీ నేడు ఇటువంటి పరిస్థితి లేదు. ఈరోజుల్లో రెడ్ల కులాలే కాదు అన్ని కులాలకు సంబంధించిన స్త్రీలు విదేశాలలో అడుగుపెడుతున్నారు. దీనికి చదువే ప్రధానకారణం. ఆ చదువు వలన విచక్షణాజ్ఞానం పెరిగి మంచి చెడు వివేచనం కలుగుతుంది. దాని వలనే ఏవైనా సాధ్యమవుతాయనేది తధ్యం. ప్రస్తుత కథలో రెడ్డి కులానికి చెందిన రామారెడ్డి తన భార్యను రంగూన్ తీసుకువెళ్ళి మిగతా తన మిత్రులందరినీ చైతన్య పరిచాడు. ఆ సంఘటనని రెడ్డి కులంలో జరిగిన సంస్కరణగా భావించాలి. కనుక 'సుభద్రమ్మ' కథ పై సంస్కరణోద్యమ ప్రభావం బలంగా పనిచేసినట్లు స్పష్టమవుతుంది.

## 3. వెలిపెడితే అల్లుడైనాడు

తండ్రి వెలివేసిన ఓ పండిత యువకుణ్ణి వితంతు యువతి తండ్రికి గుణపాఠం చెప్పి ఆ యువకుణ్ణి వివాహమాడటాన్ని తెలియజేసే కథే వెలిపెడితే అల్లుడైనాడు.

**'వెలిపెడితే అల్లుడైనాడు' కథా సంక్షిప్త పరిచయం :**

"చింతపల్లి బ్రహ్మాణంలో కలత గొట్టు పండితులకు నాయకుడు పద్మనాభశాస్త్రి గుంటూరు జిల్లాకు చెందినవాడనీ పరాయిశాఖకు సంబంధించిన వాడనీ పాండిత్యంలో అందరినీ మించిపోవడం వలన యువపండితుడు విశ్వనాథశాస్త్రి అంటే పద్మనాభశాస్త్రికి

కడుపుమంట. విశ్వనాథశాస్త్రి కాలువదోనె ప్రమాదం నుంచి మాల స్త్రీని రక్షించాడని అతన్ని పద్మనాభశాస్త్రి బ్రాహ్మణకులంలోంచి వెలివేయిస్తాడు. అలా వెలివేసినా అతనికి ఏలోపం జరగకుండా సీతారామయ్యనాయుడు అతని కుటుంబము ఆశ్రయం ఇచ్చి ఆదుకుంటారు.''

ఆ సందర్భంలో పద్మనాభశాస్త్రి వితంతు కుమార్తె నరసమ్మ పండితోత్తముడైన విశ్వనాథశాస్త్రిని వలచి అతన్ని ప్రోత్సహించడంతో రాత్రికి రాత్రి రాజమండ్రి వెళ్ళి వారిద్దరూ వివాహమాడ్తారు.

వారము రోజులు గడుస్తాయి. కాకులు కూస్తుండగా రాజమండ్రి నుంచి ఒక పడవ వచ్చి రేవులో ఆగుతుంది. తెలవారగానే కాకినాడ నుంచి ఒక మోటారు వచ్చి పడవ దగ్గర ఆగుతుంది. పడవలోంచి పోలీసు డిప్యూటీ సూపరెంటు ఉద్యోగి వేషముతో దిగేటప్పటికి నాయుడు ఎదురువచ్చి వారికి నమస్కరిస్తాడు. ఆ వెంటనే పోలీసు భటులు దిగుతారు. అలా జరుగుతుండగానే నాయని కమతములో పనిచేసే వారంతా వచ్చి అక్కడ నిలబడతారు. నాయని గాదెలదొడ్డిలో నుంచి బ్యాండు వాద్యము వస్తుంది. దూదేకుల సాయిబు బాకాను ఊదగా పడవలో నుంచి విశ్వనాథశాస్త్రి, నరసమ్మ పెళ్ళికొడుకు పెళ్ళికూతురు వేషాలతో దిగి మోటారు ఎక్కుతారు. పోలీసు అధికారి డ్రైవరు ప్రక్కన కూర్చుంటారు. రక్షకభటులు బయలుదేరగా ఊరేగింపు కూడా బయలుదేరుతుంది. నాయని పెద్దపాలికాపు విశ్వనాథశాస్త్రి వలన చిట్టచివర కాలువ నుండి ఉద్ధరింపబడిన పద్దెనిమిదేండ్ల యువతి, భర్త మహోత్సాహముతో ముందు నిశానీ కొడుతుంటుంది.

క్షణాల్లో ఈ సంగతి ఊరంతా వ్యాపిస్తుంది. కళ్ళున్నవారు చూసి హృదయమున్నవారు ఆనందించారు. ఎంతోమంది ఆశ్చర్యపోయారు. బ్రాహ్మణులందరూ తలుపులు బిగించుకుంటారు. పద్మనాభశాస్త్రి బ్రతికున్నాగానీ చితిపై ఉన్నట్లు బాధపడుతుంటాడు.

ఎవరికి తోచినట్లు వారు మాట్లాడుకుంటుంటారు. పన్నెండు గంటల సమయంలో పోలీసు డిప్యూటీ సూపరేంటు కచేరి సావడిలో విచారించి 'తప్పుడు బకీరు ఇప్పించినందుకు కేసు కడుతున్నాం' అని పద్మనాభశాస్త్రితో టోకాయించి చెప్తారు.

''నీకంటె నీ కూతురు బుద్ధిమంతురాలు. ఆమెకు హృదయం వుంది. మానవ జన్మకి అలంకారం అయిన ప్రణయం ఆమెలో నిండుగా వున్నది. ఇప్పటికైనా నువ్వు బుద్ధి తెచ్చుకోవడం మంచిది. అసూయవల్ల నువ్వు ఆ బాల పండితుని వెలిపెడితే, ప్రణయం వల్ల నీ కూతురు అతణ్ణి గౌరవించింది. నువ్వు ఎవర్ని వెలిపెట్టావో అతడు నీకు ఇప్పుడు

అల్లుడు జాగ్రత్త. అతనికి గాని నీ కూతురికి గాని ఏమయినా ఆపత్తు వస్తే మీ మెడలమీద తలలు వుండవు (వెలిపెడితే అల్లుడైనాడు)'' అంటాడు.

**కథా ఉద్దేశ్యం :**

బ్రాహ్మణ కులాల్లో ఈర్ష్యద్వేషాలు ఉంటాయని ప్రస్తుత కథ తెలియజేసింది. వాటివలన మనుషులు పురోగతి సాధించడం అసంభవం అనేది ఉద్దేశ్యం.

**' వెలిపెడితే అల్లుడైనాడు ' కథ పై సంఘసంస్కరణోద్యమ ప్రభావం :**

మన సమాజంలో పద్మనాభశాస్త్రివంటివారు కోకొల్లలు. ఇటువంటివారు ఆ కాలంలోనూ ఉన్నారు. ఈకాలంలో కూడా వున్నారు. చాలా అరుదుగా కనబడేవారు విశ్వనాథశాస్త్రి వంటివారు. ఇటువంటి వారు ఆకాలంలోనూ తక్కువే ప్రస్తుతకాలంలోనూ ఇంకా తక్కువే. పద్మనాభశాస్త్రిని ఈర్ష్యారాగద్వేషాలకు ప్రతీకగా గుర్తించాలి. విశ్వనాథశాస్త్రిని సహృదయం గల సంస్కరణాభిలాషిగా గుర్తించాలి. కథలో మామ పద్మనాభశాస్త్రి అల్లుడైన విశ్వనాథశాస్త్రిని వెలివేసినప్పుడు పద్మనాభశాస్త్రి వితంతు కూతురు విశ్వనాథశాస్త్రిని వివాహమాడి వెలివేసిన వాణ్ణి ఇంటికి అల్లుడుగా తీసుకొచ్చి తండ్రికి గుణపాఠం చెబుతుంది. ఇటువంటి చొరవ తెగువ వున్న స్త్రీలు చాలా అరుదుగా కనబడతారు. అది శ్రీపాద వారి కథల్లో కనబడే ఓ ప్రత్యేకత. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారి కథలు దాదాపు సంస్కరణ భావాన్ని చైతన్యాన్ని ప్రేరేపించేవిగా వుంటాయి. వాటిల్లో ఒకటిగా పేర్కొన్న దగినదే ఈ వెలిపెడితే అల్లుడైనాడు. ఈ కథలో వితంతు పునర్వివాహం, అన్యాయం జరగకుండా నివారించడం వంటివి కనబడతాయి. సమాజాన్ని సన్మార్గంలో నడిపించడానికి ఉపయోగపడే ఏ చర్య అయిన శ్రేయస్కరమైందే కాబట్టి ఈ కథలో వితంతు పునర్వివాహం జరిగినట్లు మనం తెలుసుకున్నాం కాబట్టి ' వెలిపెడితే అల్లుడైనాడు' కథ పై సంస్కరణోద్యమ ప్రభావం బలంగా పనిచేసినట్లు చెప్పాలి.

## 4. మేనరికము తప్పలేదు

కూతురు భవిష్యత్తు నాశనం కావడానికి ఓ తండ్రి తానే కారణమనుకుంటూ ఎటువంటి అవస్థను చవిచూశాడో తెలిపే కథే 'మేనరికము తప్పలేదు.'

**'మేనరికము తప్పలేదు' కథ సంక్షిప్త పరిచయం :**

తన దర్జాకి తగిన సంబంధం కాదని, ప్లీడరు ప్రకాశరాయడు తన అక్క సోదెమ్మ

కొడుకు చలపతికి కూతురు సుందరమ్మనివ్వడానికి నిరాకరించి తల్లి చెప్పినా వినక, కూతురు మనసూ గ్రహించక పట్టుపట్టి బందరు సంబంధం చేస్తాడు. అల్లుడు మద్రాసులో చదువుతూ ప్రమాదానికి గురై చనిపోతాడు. కూతురి జీవితానికి తానే అన్యాయం చేశానంటూ కుమిలిపోతున్న ప్రకాశరాయడు మనోవ్యాధితో మంచం పట్టి కొడుకు రామారావుతో సుందరమ్మ భవిష్యత్తును గురించి తెలుపుతూ వీరేశలింగం పంతులుగారు చెప్పినట్లు చేయమంటూ మరణిస్తాడు. రామారావు వీరేశలింగంపంతులుగారిని తీసుకువెళ్ళి ముందుగా తాను ఒక వితంతువును మద్రాసులో పెళ్ళి చేసుకుని వచ్చి వితంతు సోదరి సుందరమ్మకు చలపతినిచ్చి మేనరికం పెళ్ళి జరిపిస్తాడు.

ప్రకాశరాయడు ఇంట్లో ముసలి తల్లీ, భార్య సుబ్బమ్మ పట్టుబట్టడం వలన కూతురు సుందరమ్మకు రజస్వల అనంతరం వివాహం చేయాలనుకున్న ఆలోచన నెరవేరదు. సుందరమ్మకు చలపతి పట్ల ఆసక్తి . మేనరికం చేయాలంటూ ముసలమ్మ పట్టుబడుతుంది. సుందరమ్మ తన కోడలు అవబోతుందంటూ సోదెమ్మ ముచ్చట పడుతుంది. వర్తకం చేస్తున్నవాడికి తన కూతుర్ని ఇవ్వడం ససేమిరా ఇష్టంలేక దర్జాకి లోపంగా భావించి బందరు సంబంధం చేస్తాడు తండ్రి. 'జన్మానికల్లా వకటే ముద్దు' కథలో వేంకటలక్ష్మి కాపురం చెడిపోవటానికి తల్లి కనకమ్మ మూర్ఖత్వం కారణమైతే, తండ్రి మొండిపట్టు కూతురు సుందర్మ మనసుపడ్డ మేనరికం పెళ్ళి కాకపోవడానికి కారణమవుతుంది. ఈ కథలో కూతురు వైధవ్యం పొలవడానికి తండ్రి ఏ మాత్రం బాధ్యుడు కాదు. కేవలం దైవికంగానే జరుగుతుందది.

సుందరమ్మకి తండ్రి చేసిన పెళ్ళి వల్ల వైధవ్యం ప్రాప్తించినా, కొడుకు రామారావు చేసిన మేనరికంతో ఆమెకు సౌభాగ్యమే దక్కుతుంది చివరకు. సుందరమ్మకు పునర్వివాహం జరిపించే విషయంలో ముసలమ్మ అభ్యంతరం చెప్పకుండా పరిస్థితులను అర్థం చేసుకొని మానసిక పరివర్తన సహజంగా ఎలా కలిగిందో ఆమె మాటలను బట్టి గ్రహించాలి.

"దిక్కుమాలిన లోకం, యిష్టంలేని పెళ్ళి చేస్తే యెవరూ యేమీ అన్నపాపాన్ని పోలేదు. ఇవి చేస్తే తమ కొంపలు మునిగిపోయినట్లు యేడుస్తారు."

"ఆ యేడుపే వాళ్ళకి తగులుతుంది." అంటూ ముసలమ్మ సమర్థిస్తుంది. వితంతువుని కోడలుగా చేసుకోవాలనుకుంటుంది సోదెమ్మ.

సుబ్బమ్మ "అయినా" కాలం మునపటిలాలేదు. మనల్ని యెవరూ యేమీ చెయ్యలేరు..........." అంటూ కొడుక్కి ధైర్యం ఇస్తుంది. తానే కూతరు జీవితాన్ని అంధకార

బంధురం చేశానని బాధపడిన సుందరమ్మ తండ్రి "వీరేశలింగం పంతులుగారు నా స్నేహితులు. వారి వుపదేశం అనుసరించు" అని కూతురు భవిష్యత్తును కొడుకు చేతిలో పెట్టి కన్నుమూశాడు. రామారావు తాను ముందుగా వితంతువును పెళ్ళాడి తరువాత తన చెల్లెలికి పునర్వివాహం జరిపిన ఆదర్శ యువకుడు. ఈవిధంగా ఒకే కథలో రెండు వితంతు పునర్వివాహాలు జరిపించగలిగారు రచయిత. పనిలో పనిగా నౌఖరీకంటె వర్తక వాణిజ్యాలు ఉత్తమమైనవనే అంటూ తమ మరో ఆశయాన్ని ఈ కథలో రామారావు పాత్ర ద్వారా సమర్థించి సఫలం చేసుకోగలిగారు.

**కథా ఉద్దేశ్యం :**

ఒకరికి సలహా ఇవ్వాలనుకున్నప్పుడు ముందుగా దాన్ని మనం పాటించాలనేది ఈ కథ ఉద్దేశ్యం.

**'మేనరికము తప్పలేదు' కథ పై సంస్కరణోద్యమ ప్రభావం :**

ఈ కథలో రెండు వితంతు పునర్వివాహాలు చూడొచ్చు. సాధారణంగా మనుషుల స్వభావం ఏంటంటే ఇతరులకు సలహాలు ఇవ్వడానికి ముందుకు వస్తారు గాని అలా ఇతరులకు ఇవ్వబోయేముందు తాము అమలు జరపాలి అన్నదానిని పక్కన పెడతారు. ప్రస్తుత కథలో రామారావు పాత్ర శక్తివంతమైంది ప్రభావవంతమైంది. తండ్రి కూతురు సుందరమ్మకు వీరేశలింగం పంతులుగారి సూచనమేరకు పునర్వివాహం జరిపించండంటూ ఆ బాధ్యతను కొడుకైన రామారావుపై పెడితే ముందుగా రామారావు తాను వితంతు పునర్వివాహం చేసుకుని తరువాత తన చెల్లికి జరిపిస్తాడు. సహజంగా ఇలా చేయడానికి ముందుకు వచ్చేవారు చాలా అరుదుగా కనబడతారు. ఇటువంటివారు పూర్వం ప్రస్తుతం కూడా తక్కువగానే ఉంటారని చెప్పుకోవాలి. రామారావు పాత్ర ఆదర్శవంతమైంది. అతడి అభిప్రాయాలు పునర్వివాహాన్ని ప్రోత్సహిస్తున్నాయి. సంఘసంస్కరణలో పునర్వివాహం ఒక భాగం కనుక ప్రస్తుత కథైన 'మేనరికం తప్పలేదు'లో రెండు పునర్వివాహాలు జరిగినట్లు చిత్రించబడింది కనుక 'మేనరికం తప్పలేదు' కథ పై సంస్కరణోద్యమ ప్రభావం బలంగా పనిచేసినట్లు చెప్పవచ్చు.

## 5. అన్నపూర్ణ

ఆంగ్ల విద్యాప్రభావం వలన కలిగిన విశాల సంస్కార దృక్పథం వల్ల ఎంతో కొంత ఆంగ్ల విద్యా సంస్కారం అలవడిన ఇంకా మూఢాచారాలను పట్టుకొని వ్రేలాడే ఛాందస

ప్రవృత్తిలో నలిగిపోతున్న అమాయకురాలిని సంస్కారభావాలు గల భర్త ఎలా రక్షించాడో తెలియజేసే కథే అన్నపూర్ణ.

**'అన్నపూర్ణ' కథ సంక్షిప్త పరిచయం :**

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారి సంస్కరణ భావాలు గల కథలలో ఇది కూడా ఒకటి. ఇందులో వైదిక బ్రాహ్మణ ప్రస్తావన వుంది.

ఈ కథలో రాజమహేంద్రవరాన్ని (రాజమండ్రి) కథా రంగంగా ఎంచుకోవడం జరిగింది. ఇందులో పాత్రలు వైదిక బ్రాహ్మణ కుటుంబాలకు చెందినవిగా కనబడుతుంటాయి. కానీ, ఏ ఒక్కటీ కూడా వైదిక వృత్తికి సంబంధించినవి కావు.

కథలో సీతారామయ్య వైద్య విద్యను అభ్యసించిన విద్యాధికుడు. వైద్య విద్య అభ్యసించి తిరిగి వచ్చిన సీతారామయ్యను ఆంగ్ల విద్యా సంస్కారం ప్రాయశ్చిత్తానికి విముఖుణ్ణి చేస్తుంది. బాల్యంలో సీతారామయ్య తల్లిదండ్రులను కోల్పోతాడు. అప్పటినుండీ అతణ్ణి అతని మేనత్త పోషిస్తుంటుంది. ఆమె వితంతువు. విద్య లేకపోయినా, ఆమెకు హృదయముంటుంది, వివేకముంటుంది. ఉదార బుద్ధితోపాటు, పరిస్థితులను అర్థం చేసుకొని ఎదురించే సాహసం ఉంటుంది. తిరిగి వచ్చిన తన మేనల్లుడు సీతారామయ్యకు ప్రాయశ్చిత్తం చేసి శుద్ధపత్రిక "ఇవ్వడానికి మూడువందల రూపాయలడిగిన శంకరాచార్యస్వాముల వారి ధర్మసంరక్షణంలోని ఆంతర్యాన్ని, విలువని గ్రహించి "స్వాములవారి సందేశమును బట్టి చూడగా, మా వానికి శుద్ధపత్రిక రూపాయలిచ్చునుగాని, మతాధికారి యిచ్చునట్లు తోచుటలేదు. అట్లయిన మా రూపాయలు మాయింటనుండియే మాకు శుద్ధ పత్రిక నిచ్చును, ఇక స్వాముల వారితో మాకేమి సంబంధము" అని, స్వాములవారినే తిరస్కరించిన సాహసికురాలు సూరమ్మ. "సీతారామయ్య ప్రాయశ్చిత్తము చేయించుకొనుటకేమంత యకార్యకరణము చేసినాడు నాయనా (అన్నపూర్ణ)" అంటూ బాపన్నను నిలదీసి అడుగుతుంది సూరమ్మ. ఈ కథలో కనిపిస్తున్న సీతారామయ్య, సూరమ్మలు ఆ కాలంనాటి వైదిక బ్రాహ్మణ కుటుంబాల్లో వచ్చిన చైతన్యానికి నిదర్శనం.

ఎంతో కొంత ఇంగ్లీషు చదువు చదివినా దాని వంట పట్టించుకోని వాడు బాపన్న. అతడు బావ సీతారామయ్య ప్రాయశ్చిత్తం చేయించుకోవడానికి సిద్ధపడకపోతే చెల్లెలు అన్నపూర్ణతో పునస్సంధానానికి అంగీకరించనంటూ మొండి పట్టుపడతాడు.

యోగుల వద్ద అద్భుతమైన మహిమలుంటాయని నమ్మి యోగి వేషంలో వచ్చిన అపరిచితుణ్ణి (సీతారామయ్యను) తన ఇంట్లో ఉంచుకొని భక్తితో పూజిస్తున్న మూర్ఖుడు

బాపన్న. అతని భార్య రత్నమ్మ. ఆమె ఆడపడుచైన అన్నపూర్ణను పెట్టిన కష్టాలు చెప్పనలవికావు. భర్త సాన్నిహిత్యం కోసం తపిస్తూ వదిన పెడుతున్న కష్టాలు ఎంతో ఓర్పుతో భరిస్తూ, ఇక సహించలేని స్థితిలో గోదావరిలో దూకి ఆత్మహత్యకు సిద్ధపడుతుంది అన్నపూర్ణ. ఆమెను ఆ ప్రయత్నం నుంచి తప్పించి ఇంటికి చేర్చిన యోగి ప్రవర్తనను సహించలేక దూషిస్తూ చివరకు ఆ యోగి రూపంలో వున్నవాడు తన భర్త సీతారామయ్య అని తెలుసుకొని తన పొరపాటును గుర్తించిన మహాసాధ్వి అన్నపూర్ణ. అర్థంలేని, ప్రయోజనంలేని మూఢాచారాలకు బానిసగా బాపన్నను పేర్కొనవచ్చు. తోటి స్త్రీపట్ల అమానవీయంగా ప్రవర్తించిన స్త్రీకి ప్రతీకగా రత్నమ్మను పేర్కొనవచ్చు.

కథలో సీతారామయ్య పాత్రకున్న ప్రాధాన్యత ఎంతో గొప్పది. కానీ కథను అన్నపూర్ణతోనే ముగించటం వలన కథకు 'అన్నపూర్ణ' అనే శీర్షిక పెట్టారు శాస్త్రిగారు.

**కథా ఉద్దేశ్యం :**

ఇరవైయ్యో శతాబ్దంలో సమాజం నిండా మూఢనమ్మకాలు పేరుకుపోయి వున్నాయి. వాటిని రూపుమాపాలి. యోగులు అనేవాళ్ళు సాధారణ మనుషులే వాళ్ళకు మాయలు, మంత్రాలు అనేవి ప్రత్యేకంగా వుండవు అనేది ఉద్దేశ్యం.

**'అన్నపూర్ణ' కథ పై సంస్కరణోద్యమ ప్రభావం :**

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారి సంస్కరణ భావాలు గల కథల్లో సంస్కరణ భావాన్ని, చైతన్యాన్ని పాఠకులు చూడగలిగే కథ అన్నపూర్ణ. ఒకనాటి వైదిక బ్రాహ్మణ కుటుంబాలలో వున్న మూఢనమ్మకాలను, మూఢవిశ్వాసాన్ని ఈ కథలో బాపన్న పాత్ర ద్వారా చూపించారు. అలాగే స్త్రీని స్త్రీయే హింసిస్తున్నట్లు రత్నమ్మ పాత్ర ద్వారా చూపించారు. ఇటువంటి స్త్రీ హింస ఆ కాలంలోనే కాదు ప్రస్తుత కాలంలో కూడా ఎన్నో రూపాలలో కనబడుతుంది. ఇది కూడా నిర్మూలించబడాలి. అంతేకాకుండా ఉన్నత విద్యను అభ్యసించి మూఢవిశ్వాసాలకు లొంగనట్లు సీతారామయ్య, అతని మేనత్త సూరమ్మలను చూపించాడు రచయిత. వీరిని ఆకాలంనాటి వైదిక బ్రాహ్మణ కుటుంబాల్లో వచ్చిన చైతన్యానికి ప్రతీకలుగా పేర్కొని మిగతా వ్యవస్థలన్నింటిలోనూ చైతన్యాన్ని కలిగించేందుకు రచయిత కృషి చేశారు. చైతన్యమంటే మార్పు ఈ మార్పుకు సీతారామయ్య, సూరమ్మలు నిదర్శనం కనుక దీనిని బట్టి 'అన్నపూర్ణ' కథ పై సంస్కరణోద్యమ ప్రభావం బలంగా పనిచేసిందని చెప్పవచ్చు.

## 6. జూనియరూ, కాదు. అల్లుడు

బ్రాహ్మణ కులాలకు చెందిన వంశాలలో రజస్వలానంతర వివాహలు దోషంగా భావించే సంఘటనను తెలిపే కథే జూనియరూ, కాదు. అల్లుడు.

**'జూనియరూ, కాదు. అల్లుడు' కథా సంక్షిప్త పరిచయం :**

అవి బ్రాహ్మణ కుటుంబాలలో రజస్వలానంతర వివాహాలు తప్పుగా భావించే రోజులు. రజస్వల అయిన పిల్లను పెళ్ళాడడానికి ఇంగ్లీషు చదువులు చదివినవారు సైతం, సంఘ ఆచారాలకు భయపడి సాహసించేవారు కాదు. లోకానికి జడిసి బ్రాహ్మణ కులాలకు చెందిన ఇంటి పెద్ద తన పిల్ల రజస్వల విషయం బయటకు పొక్కకుండా వుంచేందుకు ఎన్నో తంటాలు పడుతుండేవాడు. వితంతు పునర్వివాహం ఎలా తప్పుకాదో రజస్వలానంతర వివాహం కూడా అలాగే తప్పుకాదు. అవి ఆనాటి బ్రాహ్మణ సమాజాలను వేదించే సమస్యలు. ఒకానొకప్పుడు శాఖాంతర వివాహాలు కూడా బ్రాహ్మణుల్లో నిషేధం.

చెంచయ్య పంతులనే నెల్లూరు ప్లీడరు (నియోగి) తన దగ్గర గుమస్తాగా చేరి జూనియరయిన చెంచురామయ్య అనే వైదిక యువకునికి, పెద్ద చదువు లేకపోయినా సెంటు భూమి లేకపోయినా, రజస్వల అయిన తన కూతురు సుబ్బలక్ష్మికి ఎన్నో సంబంధాలు తిరిగిపోగా, 'ఇక లాభంలేదని' శాఖాంతర వివాహం చేస్తాడు. ఈ కథలో రజస్వలానంతర వివాహంతోపాటు శాఖాంతర వివాహం కూడా చూడవచ్చు.

"పిల్ల రజస్వల అయింది. కొంప మునిగింది" అని చెంచయ్య పంతులు భార్య వేంకటసుబ్బమ్మ కంగారు పడుతుంటే "అత్తగారూ, విచారించవలసినది యేమీ లేదు. పూర్వకాలంగాదిది. ఈశ్వర నిర్ణయం యిలావుంది. కాలానికి మనం అడ్డుపడలేము. జరగవలసిన ఉత్సవాలన్నీ చెయ్యమన్నాను."

"మీరిలా అనడం ఆశ్చర్యంగా వుంది."

"ఏమీ?"

"మీ జపతపాలూ, మీ నిష్ఠా చూసి అందరూ ఆశ్చర్యపడుతున్నారు. దానికి ఇది విపరీతంగా వుంటుంది."

"అయితే యిప్పుడు చేయవలసింది యేమిటి?"

"పెద్దలు చెప్పినట్లు మనం యిప్పుడు నడుచుకోలేము. నిజమే"

"మీకు తెలవనిదేమీ లేదు"

"తెలిసినా తెలవకపోయినా యిప్పుడంతా కాలాన్ని అనుసరిస్తున్నారు. శాస్త్రాలకీ, నడతలకీ చాలాదూరం వుందని మీ మామగారు చెబుతూ వుండేవారు. లోకంలో చాలామంది పిల్లలు యిలాగే పెళ్ళికాకుండానే రజస్వల అవడం వుంది, గాని వారంతా రహస్యం దాచుచున్నారు."

"మా విషయంలో మీ అభిప్రాయం యేమిటి?"

"పాపం అన్నప్పుడు దాస్తే మాత్రం పోతుందా?"

"బుద్ధి పూర్వకంగా పాపం చెయ్యడం తప్పు. తప్పుని కప్పిపుచ్చడానికి అబద్ధమాడడం అంతకంటే తప్పు దాచటం నాకు యిష్టం లేదు."

"అవును ఈశ్వర నిర్ణయం యిలా వుంది, ఎవరేం చెయ్యగలరూ? మీ ధైర్యం యెంతవరకూ వుందో చెప్పలేను."

"సంఘం కొంతవరకూ వ్యతిరేకిస్తుంది; గాని నన్ను యెదిరించి నిలవలేదు."

"ఆ ధైర్యం మీకు వుంటే జరిగింది యెలాగా జరిగిపోయింది కనుక యిక చాటు యెందుకూ?"

"నాకు నచ్చిన మాట చెప్పేరు మీరు. నా మాటకేంగానీ నిజంగా మీ విచక్షణతా, మీ ధైర్యమూ అసాధారణంగా వున్నాయి. మీ అమ్మాయికి ధైర్యం చెప్పండి."

"మీరు అలా చెబుతూ వున్నప్పుడు నాకు మాత్రం అధైర్యం యెందుకూ?"

"వివేకం అంటే అదీ. లక్షలు వెలగల మాట అన్నావు. ఆడవాళ్ళంతా యిలా ధైర్యంగా నిలబడితే సంఘం మళ్ళీ హుటాహుటి నడకలతో బాగుపడుతుంది (జూనియరూ, కాదు అల్లుడు)" అంటాడు పంతులీ కథలో.

సంఘం వ్యతిరేకిస్తుందన్న విషయం పంతులుకు తెలుసు. కాని ఎదిరించి నిలబడలేదనేదే పంతులు ధైర్యం. కూతురు రజస్వల వేడుకలు జరిపించడాన్ని నెల్లూరంతా వింతగా చెప్పుకుంటుంటారు. అక్కడ అంతవరకు అటువంటి సాహసకార్యం అంతకుముందు ఎప్పుడూ జరగలేదు. ఇంగ్లీషు విద్యను అభ్యసించిన ఒక పెద్దమనిషి సైతం పంతులు దగ్గర కూర్చోవడమే ప్రమాదంగా తలచి సంఘానికి భయపడి వెళ్ళిపోతాడు.

అన్యశాఖ అనీ, పిల్ల రజస్వల అయిందనీ కాదు రంగమ్మ తటపటాయింపు. పంతులు అంతస్తెక్కడ, తన అంతస్తెక్కడ అనేదే ఆమె సందేహం. "డబ్బు, ఉద్యోగాలు పెద్ద సంసారమూ వీటికంటే, మర్యాదా, అమ్మాయి సుఖమూ మనకి కావలసినవి" అంటాడు పంతులు.

స్థిరపడిన సంఘాచారాలను ఎదిరించే ధైర్యాన్ని పరిస్థితులే కలిగిస్తాయనేది ఈ కథ ద్వారా తెలుస్తుంది. కూతురు రజస్వల కాకుంటె, పంతులు తన హోదాకీ, స్తోమతకి తగిన జమీందారీ సంబంధం తన నియోగిశాఖలోనే చూసి చేసేవాడు. అతడి కూతురు రజస్వల అయిన తరువాత కూడా అలాంటి సంబంధం కోసం ఎంతగానో ప్రయత్నిస్తాడు. కాని కూతురు రజస్వల అయిందని తెలుసుకుని వివాహం చేసుకోవడానికి ఎవరూ రారు. తానన్ని విధాలా అభిమానించి, జూనియరుగా చేసుకుని, ఇంట్లోనే అట్టేపెట్టుకున్న చెంచురామయ్యకిచ్చి (వైదీకికి) పెళ్ళి చేయాలని పంతులు కాని, అతని భార్యకాని ఎన్నడూ అనుకోలేదు. పోనీ చెంచురామయ్యకి కానీ, అతని తల్లి రంగమ్మకి కానీ అటువంటి ఆలోచన వచ్చే సావకాశమే లేదు. దానికి కారణం - శాఖలు ఒకటికావు. అంతస్తుల్లో పోలిక లేదు.

"దర్జా సాగించుకోలేనివాడు పెళ్ళాడకూడదని నా మతం. ఎప్పటికైనా, నేనైశ్వర్యవంతుణ్ణయినా కావాలి, ఐశ్వర్యవంతుడి కూతుర్నైనా పెళ్ళాడాలి. మూడోదారి పనికిరాదు నాకు" అనే చెంచురామయ్య చివరికి రెండోదే సాధిస్తాడు.

శాఖాభేదాల విషయం ప్రస్తావిస్తూ "దిక్కుమాలిన శాఖాభేదం యేమీ బాగాలేదండీ యిదీ నియోగులికీ వైదికులకీ భేదం యేమిటండీ? ఆచారాల్లో వృత్తుల్లో యేమీ భేదం లేనప్పుడు, వెనక యెప్పుడో పుట్టిన భేదాలు యింకా వుంచుకోవడం యెందుకండీ? మీరు మా యింట్లో యెందుకు భోంచెయ్యకూడదో చెప్పండి." అని వేంకట సుబ్బమ్మ రంగమ్మతో అన్నం తింటూ అంది. మజ్జిగ లాగే అన్నం కూడా వడ్డించమనాలి" అని రంగమ్మకి మజ్జిగ వడ్డిస్తుంది. రజస్వలానంతర వివాహాలు శాఖాంతర వివాహాలు సాధ్యమైనన్ని ఎక్కువ జరగాలనేది రచయిత ఉద్దేశ్యం. గోదావరి జిల్లా నుండి నెల్లూరి జిల్లాకు తరలి వెళ్ళటాన్ని పాఠకులు గమనించవచ్చు.

**కథా ఉద్దేశ్యం :**

కులాంతర వివాహాలు శాఖాంతర వివాహాలు తప్పుకాదు. అవి సాధ్యమైనంత ఎక్కువగా జరిగితే సమానత్వం సౌభ్రాతృత్వం పెరుగుతాయనేది ఉద్దేశ్యం.

**'జూనియరు కాదు. అల్లుడు' కథపై సంస్కరణోద్యమ ప్రభావం :**

అగ్రకులంగా మనం పేర్కొంటున్న బ్రాహ్మణ కులంలో ఉండే మూఢనమ్మకాలను మూఢాచారాలను రచయిత తెలిపి వాటిని నిర్మూలించేందుకు కృషి చేశాడు. ప్రస్తుత కథలో బ్రాహ్మణ కులాలలోని శాఖాంతర వివాహాలు దోషం కాదని తెలియజేసేందుకు చెంచెయ్యపంతులు తన కూతురికి శాఖాంతర వివాహం చేసి నిరూపించాడు. అలాగే

ఆడపిల్ల రజస్వల కావడం అది పదిమందికి తెలియడం పొరపాటు కాదని తెలుపుతూ పంతులుగారు వేడుకలు జరిపించమంటారు. పూర్వం ఇటువంటి మూఢనమ్మకాలు మూఢాచారాలు ఎక్కువగా వుండేవి. కాలం మారుతున్న కొద్ది మనుషులలో కూడా విచక్షణ పెరిగి కొంతవరకు వాటిని విడిచిపెట్టడం జరిగింది. ఏదేమైతేనేం ప్రస్తుత కథైన 'జూనియరు, కాదు. అల్లుడు' బ్రాహ్మణ కులంలో చైతన్యాన్ని, ప్రేరణను, సంస్కరణ కలిగినట్లు రచయిత చిత్రించాడు కనుక సంస్కరణోద్యమంలో అవన్నీ భాగము అవడం వలన 'జూనియరు, కాదు. అల్లుడు' కథా ప్రభావం సంస్కరణోద్యమంపై బలంగా పనిచేసినట్లు చెప్పవచ్చు.

## 7. 'వయస్సూ, బుద్ధీ కూడా పెరుగుతాయి'

పద్నాలుగేళ్ళయినా నిండని ఆడపిల్లకీ, పదహారేళ్ళయినా నిండని మగపిల్లవాడికీ పెద్దవాళ్ళు తొందరపడి పునస్సంధానం జరిపించడం వల్ల ఎటువంటి అనర్థాలు ఎదురవుతాయో తెలియజేసే కథే 'వయస్సూ, బుద్ధీ కూడా పెరుగుతాయి.'

**'వయస్సూ, బుద్ధీ కూడా పెరుగుతాయి' కథ సంక్షిప్త పరిచయం :**

భార్య లచ్చమ్మ మంకుపట్టు పట్టడంతో సోమంచి వీరయ్య పదహారేళ్ళయినా నిండని ఎఫ్.ఎ. చదివే కొడుకు భాస్కరరావుకి పునస్సంధానం (కార్యం) ముహూర్తం పెట్టించి కార్యపు పెళ్ళివారితో మాచవరం వస్తాడు. కార్యం జరగటం అమ్మాయి తల్లిదండ్రులకు ఇష్టం ఉండదు. బ్రహ్మసమాజానికి చెందిన ప్రకాశం పంతులుగారు ఈ చెడ్డపని జరగకూడదంటూ ఊళ్ళో పెద్దల్ని హెచ్చరించి వెళ్తాడు.

ఆ సంగతి తెలిసిన కొందరు విద్యార్థులు కార్యానికి ముందే రామచంద్రాపురం వచ్చి భాస్కరరావును హేళన చేస్తుంటారు. దాంతో భాస్కరరావు ఆ మాటలను భరించలేక ఎవరికి తెలియకుండా మద్రాసు పారిపోతాడు. "నాలుగైదేళ్ళ దాకా రాను నాకోసం విచారించకండి" అని భాస్కరరావు ఇంటికి ఉత్తరం రాస్తాడు. లచ్చమ్మ కొడుక్కి ఎలాగైనా తనింటి దగ్గరే కార్యం చేద్దామంటే వీరయ్య "తొందర పడకు నాలుగేళ్ళు వూరుకుంటే వయస్సూ, బుద్ధీ కూడా పెరుగుతాయి" అని సమాధాన పరుస్తాడు భార్యని.

"ఆడపిల్లలకి పద్నాలుగేళ్ళు దాటితేగాని పునస్సంధానం చెయ్యగూడదని శాసనం పుట్టబోతూ వుంటే మగపిల్లలకి ఈ వద్రృతం యేమిటోయి" అంటాడు ఓ పెద్దమనిషి ఈ కథలో.

భాస్కరరావు లచ్చమ్మ - వీరయ్య మాటకు ఎదురు చెప్పలేనివాడు. పదహారేళ్ళయినా నిండవతనికి తెలివైనవాడే. అత్తామామల స్థితిని తెలుసుకుంటాడు. ముఖాన ఉత్సాహం కరువౌతుంది. పీటల మీద కూర్చున్న భాస్కరరావును చూసి "ఒక ముసలావిడ వచ్చి "వడక పెళ్ళికొడుకులా ఉన్నాడు. ఏం తొందర వచ్చిందమ్మా" అని పక్క కోసరిల్లెను (వయస్సూ, బుద్ధీ కూడా పెరుగుతాయి)" దాంతో గ్రామస్థులంతా నవ్వుకుంటుంటారు.

భాస్కరరావు ప్రక్కన పీటల మీద కూర్చున్న పెళ్ళికూతురు సుందరమ్మ కట్టుకున్న పట్టుచీర కళ్ళనీళ్ళతో తడవడాన్నీ, అతను గమనించకపోలేదు. అతడి కార్యం కూడని పనంటూ, ప్రకాశంపంతులు గ్రామస్థులను హెచ్చరిస్తాడు, విద్యార్థులు అతన్ని హేళన చేయడం జరగడంతో మనస్తాపం చెంది పారిపోవాలని నిర్ణయించకుంటాడు దాంతో కార్యం ఆగిపోతుంది.

ఒకనాటి బ్రాహ్మణ కుటుంబాలలో వేళ్ళూనుకున్న దురాచారాన్ని హేళన చేసేందుకు బ్రహ్మసమాజ భావాలపట్ల ఆకర్షితులైయున్న ప్రకాశంపంతులుగార్ని, విద్యార్థుల్ని, గ్రామస్థుల్ని సమర్థవంతమైన పాత్రలుగా ఉపయోగించుకున్నాడు రచయిత.

రచయిత ప్రకాశరావు పంతుల రూపంలో దర్శనమిస్తుంటాడు. ఎవరేమనుకున్నా వెనుకాడకుండా తనకు తోచిన నాలుగు మాటలు అనేసి దురాచారాలు జరగకుండా ఆపడానికి నడుం కట్టుకున్న సంస్కారవాది ప్రకాశంపంతులు. ప్రకాశంపంతులు రామచంద్రాపురం బాలికా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, పైగా పెళ్ళికూతురు సుందరమ్మకు ఒకప్పటి గురువు. అంతేకాక బ్రహ్మసమాజ మతాభిమాని. పక్కింట్లో దురాచారం జరుగుతుంటే గ్రామస్థులు బొబ్బట్లు, పూరీలు తిని పేకాడుకుంటూ కూర్చోవటం ఇంగ్లీషు చదువు చదివే కార్యపు పెళ్ళికొడుకు తల్లిదండ్రులకు ఎదురు చెప్పలేకపోవటాన్ని చూసి పంతులుకి పట్టరాని కోపం వస్తుంది.

"మేం బ్రాహ్మలం అని విర్రవీగితే చాలదు. ఏ లక్షణం చేత బ్రాహ్మలవుతారో ఆ లక్షణం చూపించాలి. ఈ దేశంలో సంఘాన్ని నడిపే పూచీ బ్రాహ్మల మీద వుంది. అది నిర్వహించకపోతే బ్రాహ్మణ్యం యెలా నిలుస్తుందీ? నిజానికి యే దురాచారాలు జరిగినా బ్రాహ్మల్లోనే యెక్కువగా వున్నాయి. వాటిని తగ్గించుకోవాలనే జ్ఞానం ఒక్క బ్రాహ్మడికైనా వున్నట్లు లేదు......"

'దేశ స్వాతంత్ర్యం కంటె సంఘ సంస్కారం ముఖ్యం' అని సుబ్రహ్మణ్యశాస్త్రిగారి నిశ్చయం, సంస్కర్త వీరేశలింగం పంతులుగారి తత్త్వమూ ఇదే. ఈ అభిప్రాయమే కథలో పంతులినోట చక్కగా పలికించారు రచయిత.

"సంఘం యింత కుళ్ళిపోతూ వుంటే 'స్వరాజ్యం అదిగో హైదరాబాదు అవతల వుందం'టే యెవడు నమ్ముతాడు." అంటూ పంతులు పదమూడేళ్ళయినా నిండని ఆడపిల్లకి గర్భాదానం జరగడం అక్కడక్కడ చూశాను. గాని పదహారేళ్ళు నిండని పిల్లవాడికి తల్లిదండ్రులు పునస్సంధానం తలపెట్టడమూ (అందరూ అందుకోసం కట్టకట్టుకుని రావడమూ) అన్నిటికంటే యఫ్.యే. చదువుతూ వున్న యువకుడు అందుకు సిద్ధపడడమూ - ఇలాంటి ఘోరం నేనెక్కడా చూడలేదు, వినలేదూ." "ఈ కార్యం యెలా నెరవేరుతుందో చూస్తాను" అని వెళ్ళి విద్యార్థులకి పురెక్కించి పంపి పెళ్ళికొడుకుని హేళన పట్టించాడు. "బ్రాహ్మలేపని చేసినా యింతే" అంటారు యిసడిస్తూ బ్రాహ్మణేతరులు (వయస్సూ, బుద్ధీ కూడా పెరుగుతాయి)."

**కథా ఉద్దేశ్యం :**

బాల్యవివాహాలు ఎన్నో అనర్థాలకు కారణమవుతాయనేది ఉద్దేశ్యం.

**'వయస్సూ, బుద్ధీ కూడా పెరుగుతాయి' కథ పై సంస్కరణోద్యమ ప్రభావం :**

భారతదేశంలో ఒకానొకప్పుడు బాల్యవివాహాలు జోరుగా జరుగుతుండేవి. దానివలన వితంతు సమస్య ఎక్కువై సమాజాన్ని పట్టి పీడిస్తుండేది. అలా బాల్యవివాహాలు వైధవ్యానికి కారణాలవుతున్నాయి. కొన్నాళ్ళకు బాల్యవివాహాలు నిషేధచట్టం విలియమ్ బెంటింగ్ చెయ్యటంతో కొంతవరకు అదుపులోకి వచ్చాయి. నేడు అప్పుడున్న ఉదృతి ఇప్పుడు లేకపోయినా ఎక్కడోకక్కడా అప్పుడప్పుడు కనబడుతున్నాయి. ప్రస్తుత కథైన 'వయస్సూ, బుద్ధీ కూడా పెరుగుతాయి'లో బ్రాహ్మణులలో చిన్నవయస్సులో జరుగుతున్న పునస్సంధానం (కార్యం) ఆపించే ప్రయత్నం రచయిత ప్రకాశంపంతుల ద్వారా చేయించాడు. ఆ దురాచారాన్ని రూపుమాపి బ్రాహ్మణ కులాలను సంస్కరించడానికి కృషి చేశాడు. కాబట్టి 'వయస్సూ, బుద్ధీ కూడా పెరుగుతాయి' కథపై సంస్కరణోద్యమ ప్రభావం బలంగా పనిచేసిందని చెప్పాలి.

## 8. క్రిందికా? పైకా?

బాలవితంతువైన కృష్ణవేణమ్మ పునర్వివాహం చేసుకొని ఆడదానికి భర్తతో వుండడం తప్పుకాదనుకుంటే తన జీవితం అదోగతి పాలవలేదు, ఊర్ధ్వగమనం చెందిందని తెలపడాన్ని తెలియజేసే కథే క్రిందికా? పైకా?

**'క్రిందికా? పైకా?' కథ సంక్షిప్త పరిచయం :**

ఈ కథలో వితంతు యువతైన క్రిష్ణవేణమ్మ తన గోడు వినిపిస్తున్నట్లు గమనించాలి. వితంతు యువతైన క్రిష్ణవేణమ్మని నారాయణమూర్తి వలలో పడనివ్వకుండా ఆమె వదిన తప్పించి తన పినతల్లి కొడుకైన మాధవరావుతో (విధురుడు) రాజమండ్రి పంపించగా అక్కడ వీరేశలింగం పంతులుగారు స్వయంగా క్రిష్ణవేణమ్మ, మాధవరావుల వివాహం జరిపించి ఆ వార్తను పత్రికల్లో వేయిస్తారు. ఆ వార్త చూసిన క్రిష్ణవేణమ్మ తల్లిదండ్రులు, అన్నావదినలు ఆమెను చూడడానికి వస్తారు. అక్కడ ఆమెతో "బహిరంగంగా వచ్చి చూడ్డానికి సాహసించలేక అర్ధరాత్రి వచ్చేము" అనీ, "నేను స్వయంగా సాహసించలేకపోయాను, మంచిపని చేశావు" అనీ తండ్రి కూడా కుమార్తె సాహసాన్ని మెచ్చుకుంటం గమనించాలీ కథలో.

వితంతు వివాహ సంఘసంస్కారకథలలో ఈ కథ కూడా ఒకటి. ఉత్తమ పురుషలో కథాకథనం సాగిన కథలలో ఇది రెండవది; సంఘసంస్కర్త వీరేశలింగం పంతులు గారిని కథలో పాత్రగా చేసిన వాటిలో ఇది మూడవది; పంతులుగారు పెదవి విప్పి మాట్లాడిన కథలలో ఇది మొట్టమొదటిది; పూర్తిగా వాడుక భాషలో రచించిన శాస్త్రిగారి తొలి కథ ఇది.

ఈ కథ చెప్తున్న క్రిష్ణవేణమ్మ పద్దెనిమిదేళ్ళు నిండు యవ్వనంలో ఉన్న ఉద్విగ్న చిత్తురాలైన, బ్రాహ్మణకుటుంబంలోని ఒక బాల వితంతువు.

నారాయణమూర్తి భార్య పోగా బోగందాన్ని ఉంచుకుని కాలక్షేపం చేసే విలాస పురుషుడు. అతని మాయకు పడిపోబోయింది కృష్ణవేణమ్మ మొదట్లో.

ఆడవాళ్ళు దీక్షపూని సాధించదలచుకుంటే సాధ్యం కానిది లేదని నిరూపించే పాత్ర కృష్ణవేణమ్మ వదినది. వదిన పేరు కథలో ప్రస్తావించలేదు. ఆమె ప్రయత్నం లేకపోయినట్లైతే క్రిష్ణవేణమ్మ, మాధవరావుల వివాహం జరిగుండేది కాదు.

కృష్ణవేణమ్మను పెళ్ళాడిన మాధవరావు అంతకు ముందే ఇద్దరు భార్యలను పోగొట్టుకున్న దురదృష్టవంతుడు. వరకట్న వ్యవహారాల్లో తేడా లేకుండా వుండి ఉంటే క్రిష్ణవేణమ్మను మొదటే పెళ్ళాడి వుండేవాడు.

కథలో కృష్ణవేణమ్మతో "ముక్కుపచ్చలారని దశలో పెళ్ళయి భర్త చనిపోతే, బాల వితంతువు తన స్థితి ఏమిటో తెలియక, మిగిలిన పిల్లలని చూచి వేసే అమాయకమైన ప్రశ్నలు ఈ కథలో కృష్ణవేణమ్మ నోట ఎంతో సహజంగా వెలువడ్డాయి. ఆ ప్రశ్నలు ఎన్నో ఆలోచనలను రేకెత్తిస్తాయి. "నీ మొగుడు చచ్చిపోయాడు. నువ్వు వెధవముండవయి

పోయావు" అని తోటి పిల్ల కృష్ణవేణమ్మతో అన్నప్పుడు "చచ్చిపోయేవాడికి నన్నెందుకు పెళ్ళి చెయ్యాలి? మంచివాణ్ని తెచ్చి మళ్ళీ పెళ్ళి చెయ్యండి" అన్నదిట తల్లితో కృష్ణవేణమ్మ. పైగా "అందరికి ఇహలోక స్వర్గంగా వున్న ప్రపంచం నాకు ఎందుకు నరకంలా వుంది? నన్నిలాగ దేవుడు చేశాడా? మనుష్యులు చేశారా అని ఆలోచించేదాన్ని" అంటుంది. "పెళ్ళాం చచ్చిపోతే మొగుళ్ళు మళ్ళీ పెళ్ళాడేటప్పుడు మొగుడు చచ్చిపోతే ఆడాళ్ళు మళ్ళీ యెందుకు పెళ్ళాడగూడదూ?" అని ప్రశ్నించిన కృష్ణవేణమ్మ మన సంఘాచార సౌదాన్ని పునాదులతో కదిలించి వేసింది. ఈ కథ ఒక్క కృష్ణవేణమ్మ కథకాదు; ఒకప్పుడు ఈ సమాజంలో అను నిత్యం అవమానాలతో దుర్భర దయనీయావస్థననుభవించిన అనేక వేల బాల వితంతువల ఆక్రోశానికి ప్రతిధ్వని ఇది (క్రిందకా? పైకా?)."

**కథా ఉద్దేశ్యం :**

మనదేశంలో పూర్వం వితంతు సమస్య సంఘాన్ని పట్టి పీడిస్తూ వుండేది. దానికి కారణం బాల్యవివాహాలు. వితంతు సమస్యను నిర్మూలించాలంటే పునర్వివాహాలు సాధ్యమైనంత ఎక్కువగా జరగాలనేది ఉద్దేశ్యం.

**'క్రిందికా? పైకా?' కథ పై సంస్కరణోద్యమ ప్రభావం :**

సమాజంలో వితంతు సమస్య సంఘాన్ని ఎదగనివ్వకుండా నిర్మూలించేదిగా ఉండేది పూర్వం. దీనికి కారణం చిన్నతనంలోనే ఆడపిల్లలకు పెద్ద వయస్సు వారితో పెళ్ళిళ్ళు కావడం. ఈ సమస్య మరెన్నో స్త్రీ సమస్యలతో ముడిపెట్టబడుతుంది. ప్రస్తుత కథైన 'క్రిందికా? పైకా?' లో బాలవితంతువైన కృష్ణవేణమ్మను దుర్భర దారిద్ర్య జీవితాన్ని అనుభవిస్తున్నట్లు రచయిత చిత్రించకుండా పునర్వివాహం చేసుకున్నట్లు తెలియజేసి సమాజంలో ఎంతోమంది వితంతువులలో చైతన్యం కలిగించే ప్రయత్నం చేశారు. ఒక కులమనే కాదు ఒక మతమనే కాదు అన్ని కులాలవారికి అన్ని మతాల వారికి కూడా పునర్వివాహాలు అవసరం అని నిరూపించారు. పునర్వివాహం జరగడంతో తన జీవితం అధోగతి కాదు, ఊర్ధ్వగమనమే అని కృష్ణవేణమ్మతో చెప్పించడాన్ని బట్టి ఆమెలోని చైతన్యాన్ని చొరవను తన వంటివారికి స్ఫూర్తి కావాలని రచయిత కాంక్షించినట్లుగా కృష్ణవేణమ్మ పాత్ర బట్టి తెలుస్తుంది. స్త్రీ జీవితాన్ని బాగు చేసేందుకు రాయబడిన ఈ కథలో సంస్కరణ భావం చోటు చేసుకుంది. కాబట్టి 'క్రిందికా? పైకా' కథపై సంస్కరణోద్యమ ప్రభావం శక్తివంతంగా పనిచేసినట్లు చెప్పొచ్చు.

## 9. ముందు హాలాహలము - పిదప అమృతము

ఓ బీద బ్రాహ్మణ యువకుణ్ణి ప్లీడరుగారి వితంతు కుమార్తె ఎలా పెళ్ళాడిందో తెలియజేసే కథే 'ముందు హాలాహలము - పిదప అమృతము.'

**'ముందు హాలాహలము - పిదప అమృతము' కథ సంక్షిప్త పరిచయం :**

ప్లీడరుగారికి ఇద్దరు కూతుళ్ళుంటారు. వారిద్దరూ వితంతువులే. రామశర్మకు తల్లిదండ్రులు వుండరు. అతనికి డబ్బులేదు కాని మంచి పాండిత్యం కలవాడు. వ్రతాలూ, పూజలూ, అభిషేకాలు జరిపిస్తూ జీవితయాత్ర చేస్తుంటాడు. పక్కనుండే ప్లీడరు లక్షాధికారి, భార్యలేదు అతని కూతుళ్ళిద్దరూ విధి వక్రీకరించి పుట్టిల్లు చేరతారు. ప్లీడరుగారు రామశర్మను అవమానించగా అతని కూతుర్లు మాత్రం రామశర్మ మీద అభిమానాన్ని పెంచుకుంటారు. ప్లీడరుగారి రెండో అమ్మాయి రామశర్మ మీద మనసు పడుతుంది. చెల్లెలి మనసు తెలుసుకున్న అక్క చెల్లెలెని పెళ్ళాడేవిధంగా రామశర్మను ఒప్పించి, తండ్రికి తెలియనివ్వకుండా వీరేశలింగారి తోటకు తీసుకువెళ్ళి పంతులుగారి చేతులు మీదుగా వారిద్దరి పెళ్ళి జరిపిస్తుంది. పెళ్ళి జరిగిందన్న విషయం తెలుసుకుని ప్లీడరుగారు తమ మనసు మార్చుకొని కూతురునీ, అల్లుడునీ చేరదీస్తారు.

ఈ కథలో రామశర్మకి, ప్లీడరుగారికీ పట్టింపులు వస్తాయి. రామశర్మ ఉండే ఇల్లు, స్థలము తన స్థలంలో కలుపుకోవాలని ప్లీడరుగారు ప్రయత్నిస్తే అది వీలవదు. దాంతో ప్లీడరుకు రామశర్మకు మధ్య మనస్పర్థలు వస్తాయి. ప్లీడరుగారు ఎంతటి ఘనుడంటే కావాలని కిటికీలోంచి రామశర్మ ఇంటిమీదా నూతిమీద కిళ్ళీలు నమిలి ఉమ్మి వేస్తుంటాడు. ఓసారి కావాలనే రామశర్మ మీద ఉమ్మివేస్తాడు. రామశర్మకు అతణ్ణి ఎదిరించే స్తోమత లేక మౌనంగా వుంటాడు. అటువంటప్పుడు ఆ ప్లీడరుగారి వితంతు కుమార్తెలిద్దరూ రామశర్మ దయనీయ స్థితిని తెలుసుకుని తండ్రికి తెలియకుండా డబ్బిచ్చి, తలంటుపోసి ధైర్యం చెపుతారు. గతంలో ఒక బీద బ్రాహ్మణుడికి రామశర్మ వివాహం జరిపించాడని ప్లీడరుగారు వెలివేయిస్తే, అతడి కూతుళ్ళిద్దరూ రామశర్మని ఆదరించి అభిమానిస్తారు. "వారికి (రామశర్మకి) మానాన్న (ప్లీడరు) చేసిన అపకారాన్ని తీర్చుకున్నాను గదా అది నాకు తృప్తిగా వుంది" అంటుంది రామశర్మని పెళ్ళాడిన ప్లీడరు కూతురు.

కథలో ప్లీడరుగారు వీరేశలింగం పంతులు గారి సమక్షంలో రామశర్మ చేతులు పట్టుకుని "జరిగిపోయిందంతా నేనిప్పుడే మరిచిపోయాను. నువ్వుకూడా మరిచిపో. నా ఆస్థినీ, నా చిట్టితల్లినీ నీ చేతుల్లో పెడుతున్నాను." విధిలేక అంటాడు. కూతురుతో ప్లీడరుగారు

"నువ్వు మళ్ళీ పెళ్ళాడినందుకు నాకు విచారం లేదు; గాని నాతో చెబితే యింతకంటె మంచి సంబంధం తెస్తును. చాలా వైభవంగా పెళ్ళి చేస్తును" అంటాడు.

స్త్రీలు సాహసించి ముందడుగు వేసి పురుషులకు ధైర్యం చెప్పే ఉదంతం శ్రీపాద కథల్లో సర్వసాధారణం. చెల్లెలి మనసు తెలుసుకున్న అక్క, పెళ్ళికి ప్రోత్సహించడమే కాక రామశర్మకి కూడా ధైర్యం చెపుతుంది.

"కథారంగం రాజమండ్రి; కథాకాలం సంస్కర్త వీరేశలింగంగారు జీవించిన ఇరవైయో శతాబ్ది పూర్వార్థం; కథాపాత్రలు వైదిక బ్రాహ్మణ కుటుంబానికి చెందినవి, డబ్బున్న ప్లీడరుగారి వితంతు కుమార్తెకీ, వైదిక వృత్తి చేసుకొనే బీద బ్రాహ్మణ యువకుడికీ (సంస్కర్త పంతులుగారి పౌరహిత్యంలో) జరిగిన వివాహం ఇతివృత్తం అయిన ఈ కథ ఒకనాటి ఆంధ్ర బ్రాహ్మణ సమాజ జీవితంలోని వాస్తవిక పరిస్థితులను వెల్లడిస్తుంది. ఒకప్పుడు డబ్బులేని బ్రాహ్మణ యువకులకీ పెళ్ళయే అవకాశాలు ఇంచుమించులేవు. ఆడపిల్లలను అమ్ముకునే తండ్రులు, సంచులకొద్దీ డబ్బు గుమ్మరిస్తేకాని పిల్లనిచ్చేవారు కాదు. డబ్బిచ్చి పిల్లలను కొనుక్కునే వృద్ధులకి పెళ్ళిళ్ళు త్వరగా అయేవి. ఆర్థిక స్తోమత లేని బ్రాహ్మణ యువకుడు పెళ్ళాడదలిస్తే బాల వితంతువే శరణ్యం. అందుచేతనే డబ్బు గుమ్మరించే స్తోమత లేని ఒక బ్రాహ్మణ యువకుడు మరో బీద బ్రాహ్మణ వితంతు కుమార్తెను పెళ్ళాడిన ఒక ఉదంతాన్ని కథకుడు సందర్భవశాన ఈ కథలో ప్రస్తావించడం జరిగింది. కథలో ప్లీడరుగారు చిన్నతనాన వారాలు చేసుకుని మధూకరం ఎత్తి ఎన్నోకష్టాలు పడి చదువుకుని స్వశక్తితో పైకి వచ్చి పాతిక లక్షలకి అధికారి అయ్యాడు. మొదటినుంచీ పెంకివాడే ఆయన. డబ్బు కలవాడవడం చేత అతని దౌష్ట్యానికి ఎదురులేక నిరాఘాటంగా సాగిపోయియింది. ముందు కష్టాలు పడ్డా చివరికి సుఖం లభిస్తుందని సూచించడమే కథా శీర్షిక ఉద్దేశం (ముందు హాలాహలము - పిదప అమృతము)."

**కథా ఉద్దేశ్యం :**

వితంతు సమస్య నిర్మూలించాలంటే పునర్వివాహాలు ఎక్కువగా జరగాలనేది ఉద్దేశ్యం.

**'ముందు హాలాహలము - పిదప అమృతము' కథ పై సంస్కరణోద్యమ ప్రభావం :**

పూర్వం వితంతువుల పట్ల సమాజము శాస్త్రాలు కటోరమైన నియమాలను, నిబంధనలను రుద్ది వారి జీవితాన్ని ఆగమ్యగోచరంగా తయారుచేసేవి. ఐతే ప్రస్తుత కథైన

‘ముందు హాలాహలము - పిదప అమృతము’లో రచయిత శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి గారు ప్లీడరుగారి వితంతు కుమార్తెలిద్దరూ దుర్భర దారిద్ర్యమైన జీవితాన్ని అనుభవించినట్లు చిత్రించకుండా వారిద్దరి కుమార్తెల్లో అక్క, చెల్లిని రామశర్మకి ఇచ్చి పంతులుగారి సమక్షంలో వివాహం జరిపించినట్లు చిత్రించి తనలోని సంస్కరణ భావాన్ని తెలియజేసాడు. కథలో అక్కది శక్తివంతమైన పాత్ర. ఆమె కూడా వితంతువే అయినా చెల్లెలి జీవితాన్ని బాగు చేసేందుకు పూనుకుని సఫలీకృతురాలు అయింది. ఇలా ఎంతోమంది వితంతువులు తమ జీవితాలను బాగు చేసుకోవాలనే సందేశాన్ని రచయిత ఈ కథ ద్వారా అందించారు. బ్రాహ్మణ కుటుంబాలలోనే మూఢనమ్మకాలు, మూఢాచారాలు పనికిరాని కట్టుబాట్లు ఎక్కువగా ఉండేవని తెలియజేస్తూ బ్రాహ్మణ కులాన్ని సంస్కరించేందుకు కృషి చేశాడు. ఈ కథలో బ్రాహ్మణ కులాలకు చెందిన వారికి వితంతు పునర్వివాహం జరిపించినట్లు తెలుస్తుంది కనుక ‘ముందు హాలాహలము - పిదప అమృతము’ కథపై సంస్కరణోద్యమ ప్రభావం బలంగా పనిచేసిందని చెప్పాలి.

## 10. బ్రాహ్మణాగ్రహారం

ఒకనాటి బ్రాహ్మణాగ్రహారాలలో పలువురు వ్యక్తుల ప్రవృత్తుల్ని, నడతల్ని పెంచడంకానీ, తగ్గించడంకానీ చేయకుండా ఉన్నది ఉన్నట్లు చిత్రించినదే ‘బ్రాహ్మణాగ్రహారం’.

**‘బ్రాహ్మణాగ్రహారం’ కథా సంక్షిప్త పరిచయం :**

“ఔటులైనిది బ్రాహ్మణా గ్రహారమునకు;
వివిధ ప్రవృత్తుల, వివిధ గతుల
ఛాయలేగాని అసత్యముల్ లేవిందు;
పెంచనులేదు, కుదించలేదు;
ఆత్మవృత్తము వాఙ్మయాధర్మమున యందు,
తన రూపు మించుటద్దమున తోచు
నట్లవగాహన మ్మగునంచు కూర్చితి
భిన్న స్థలమ్ముల వృత్త మొకట”[18]
“ఋషుల తీర్చిన ధర్మ ప్రవృత్తి యిదియె?
బ్రాహ్మణుని బ్రతు కేమికావలయు ముందు?

ఉడికిన ఫలమ్ముమలే దూరకుండగాదు

దిద్దుకొనుట యొక్కటే మంచి తెరువు నేడు?"[19]

"శాస్త్రిగారు తమ రచనా సముద్దేశాన్ని ఈ పద్యరూపంలో ప్రకటించారు. ఒకనాటి బ్రాహ్మణా గ్రహారాలలోని వివిధ వ్యక్తుల ప్రవృత్తులూ, నడతలూ ఉన్నదున్నట్లు పెంచకుండా, కుదించకుండా భిన్నస్థలాలలో జరిగిన సంఘటనలను ఒక్కచోట చేర్చి ఆయా పాత్రల (వ్యక్తుల) సంభాషణతో అతి వాస్తవికంగా చిత్రించిన రేఖాచిత్రమే (Outline or Sketch) ఈ రచన. "ఇందులో అసత్యం ఏమీలేదు. వాఙ్మయాదర్శంలో ఆత్మవృత్తం (అంటే - లోకవృత్తం) ప్రతిఫలిస్తుంది. కనుక ఉన్నదున్నట్టు చిత్రించాను. బ్రాహ్మణాగ్రహారాలలో నేడు బ్రాహ్మణుడు బతుకుతున్న తీరు ధర్మబద్ధమైనదేనా? ఋషులు తీర్చిన ధర్మ ప్రవృత్తి ఇదేనా? ఇలానే సాగితే ముందు ముందు బ్రాహ్మణుని బతుకేమౌతుందో! లోపల్లోపల ఉడుక్కున్నందువల్ల ప్రయోజనం లేదు. ఉపేక్ష చేయడానికి వీల్లేదు. ఇప్పటికైనా, తప్పులు దిద్దుకోవడం ఒక్కటే మంచి మార్గం." బ్రాహ్మణుని వాస్తవిక పరిస్థితి గురించి శాస్త్రిగారు పడే ఆందోళనా, ఆవేదన ఆ మాటలు  చక్కగా వెల్లడిస్తాయి.

అగ్రహారంలో అందరూ కర్మిష్ఠులే; చయనాలు చేసిన వాళ్ళే, వేదం తల్లకిందులా వల్లించిన విద్వాంసులే; పరమ ప్రామాణికులే, ఏం లాభం? ఒకరిని చూసి ఒకరు ఓర్వలేరు; వాళ్ళు చేసే అనాచారం అంతా ఇంతాకాదు; ఎదుటివాణ్ణి మట్టం చేయడానికి ఎంత డబ్బైనా ఖర్చుపెడతారు; కోర్టులకెక్కి దొంగ సాక్ష్యాలు చెబుతారు; డబ్బుకోసం గడ్డి కరుస్తారు; బోగం దానింట్లో మకాం పెడతారు; ఇల్లు పట్టిన వితంతువుల్ని వలలో వేసుకోడానికి చూస్తారు; ప్రాయశ్చిత్తాల పేరుతో డబ్బు గుంజుతారు; అంతా దగా మోసం; కుళ్ళూ, కృత్రిమం - నూరిళ్ళ బ్రాహ్మణాగ్రహారం, అంతా పండితుల్లోనే జమ; అంతా కర్మిష్ఠుల్లోనే లెక్క, పెళ్ళాడి పెళ్లాన్ని ఏలుకోనివాడికి ఒక్కరూ గడ్డిపెట్టరు. పోనీ పిల్లకి మళ్ళీ పెళ్ళి చేద్దాం అంటే ".......... ఇంకా తరవాయే? అవి కారికలు కావు, అవి సభలు కావు; అవి బెదిరింపులు కావు; అవి బహిష్కారాలు కావు_______"

ఒక బ్రాహ్మణాగ్రహారంలో ఏడుచోట్ల భిన్న వ్యక్తులు మధ్య సాగిన సంభాషణలను ఒక క్రమంలో 'రికార్డు' చేసినట్లుంటుందీ రచన. కథ లేకపోయినా, పాత్రల శీలస్వభావాలను సంభాషణల ద్వారా చక్కగా రూపుకట్టించవచ్చునని ఈ రచనతో మరోసారి నిరూపించారు రచయిత. ఒకనాటి వైదిక బ్రాహ్మణ వ్యక్తుల వైధికపు పలుకుబళ్ళతో నిండిన వ్యావహారిక భాషను ఇంత అధికంగా సంగ్రహించుకొన్న శాస్త్రిగారి రచన మరొకటి కనబడదు. ఇటువంటి రచనలు తెలుగులో అపురూపం.

శాస్త్రిగారీ రచనలో పాత్రలచేత "మన మతం వొట్టి వెధవ మతం కాదుట్రా?" అని 'ఛీ, ఏం జాతిరా మనదీ?" అనిపించి, ఇంగ్లీషు విద్యాసంస్కృతులను మెచ్చుకున్నారు. మధ్య మధ్య 'భావకవిత్వం'మీద కొన్ని విసుర్లు కూడా ఉన్నాయి. ".......గ్రౌండంతా నేను ప్రిపేరు చెయ్యగా మధ్య వచ్చివాడు తన్నుకుపోతాడా?" లాంటి సంభాషణలు వైదిక బ్రాహ్మణ పాత్రల నోట రావడం కొంత వింత కలిగిస్తుంది. అనుకరణం కాకపోయినా, రచన కొంతవరకూ గురజాడవారి 'కన్యాశుల్కం' పాకానపడింది. ఈ రచనను ఒకనాటి బ్రాహ్మణాగ్రహారాల్లోని జీవద్వ్యక్తుల 'బొమ్మల కొలువు' (Picture gallery) అనవచ్చు (బ్రాహ్మణాగ్రహారం)."

**కథా ఉద్దేశ్యం :**

పూర్వం బ్రాహ్మణులలో ఉండే అన్యాయం, అవినీతి, అక్రమాలను రచయిత కళ్ళకు కట్టినట్లు చిత్రించాడు. కులం బాగుపడాలంటే అంతటి కుళ్ళు ఉండకూడదనేది ఉద్దేశ్యం.

**'బ్రాహ్మణాగ్రహారం' కథ పై సంస్కరణోద్యమ ప్రభావం :**

"అగ్రహారంలో అందరూ కర్మిష్ఠులే; చయనాలు చేసినవాళ్ళే, వేదం తల్లకిందులా వల్లించిన విద్వాంసులే; పరమ ప్రామాణికులే. ఏం లాభం? ఒకరిని చూసి ఒకరు ఓర్వలేరు; వాళ్ళు చేసే అనాచారం అంతా ఇంతాకాదు; ఎదుటివాణ్ణి మట్టం చెయ్యడానికి ఎంత డబ్బైనా ఖర్చుపెడతారు; కోర్టులకెక్కి దొంగ సాక్ష్యాలు చెబుతారు; డబ్బుకోసం గడ్డికరుస్తారు; భోగందానింట్లో మకాం పెడతారు; ఇల్లు పట్టిన వితంతువుల్ని వలలో వేసుకోడానికి చూస్తారు; ప్రాయశ్చిత్తాల పేరుతో డబ్బు గుంజుతారు; అంతా దగా, మోసం; కుళ్ళూ, కృత్రిమం - నూరిళ్ళ బ్రాహ్మణాగ్రహారం, అంతా పండితుల్లోనే జమ; అంతా కర్మిష్ఠుల్లోనే లెక్క" అంటాన్ని బట్టి బ్రాహ్మణ కులాల్లో వినాశనం ఎలా విలయతాండవం చేస్తుందో తెలియజేశారు రచయిత. ఇప్పటికైనా తప్పును దిద్దుకోవడం ఒక్కటే మంచి మార్గమంటూ హితం చెప్పి వాస్తవిక పరిస్థితులను గురించి ఈ కథ ద్వారా వివరిస్తు ప్రజల్ని ఆలోచింపచేయిస్తూ పరిష్కారంగా దిద్దుబాటు తప్పదంటూ హెచ్చరించారు. ఈ కథ సమాజానికో మేలుకొల్పు లాంటిది. కులాన్ని, సమాజాన్ని, వ్యవస్థని బాగు చేసుకోవాలంటే సంస్కరణ తప్పదంటూ తెలియజేసి ఈ కథ ద్వారా సమాజంపై తన ముద్ర వేశారు. ఈ కథలో రచయిత బ్రాహ్మణ కులాలవారి పోకడలను గురించి తెలుపుతూ అవి సవరించుకోకపోతే వినాశనం తప్పదంటూ హెచ్చరించడం జరిగింది. మొత్తం మీద ఈ కథా ఉద్దేశ్యం కులాన్ని బాగుచేయాలనేదే

అంటే మార్పు రాబట్టడానికి ప్రయత్నాలు ముమ్మరం చేయాలనేది అభిప్రాయం. కథ మార్పును కోరుకుందంటే సంస్కరణాలోచనలు మొదలైనట్లే లెక్క.కాబట్టి 'బ్రాహ్మణాగ్రహారం' కథ పై సంస్కరణోద్యమ ప్రభావం వుందని చెప్పొచ్చు.

## 11. బుచ్చి వెంకయ్యమ్మ

రెడ్డి కులంలో జరిగిన వితంతు పునర్వివాహం గురించి తెలిపే కథే బుచ్చి వెంకయ్యమ్మ.

**'బుచ్చి వెంకయ్యమ్మ' కథా సంక్షిప్త పరిచయం :**

"కాలం వక్కలా వుండదు. నేడు రెడ్డి కులంలో మళ్ళీ పెళ్ళి చేసుకున్నదాన్ని నేను ఒక్కతినే. నిజమే. అయితే ఈ సంఖ్య యిలా వుండిపోదు. పురుషుని మీద ఆశ వున్న యౌవన వితంతువు వివాహానికవకాశం యివ్వకపోతే ఐహిక సుఖాలని జయించలేక పోవచ్చును. తప్పుదారి చూపడం కంటే కొత్తదారీ, ఆక్షేపించడానికి వీల్లేని దారీ వుంటే పూర్వాచారమో అని యెందుకు కుళ్ళిపోతారూ? శాస్త్రాలు మరాలి. మారితేగాని మన సంఘాలు చచ్చిపోతాయి. ఇలాగే మన పెద్దలు యింకా బిర్రబిగిస్తే కొద్దిరోజుల్లోనే మన శాస్త్రాలు చూసేవాళ్ళు లేకా, ఆదరించేవాళ్ళు లేకా నశించిపోతాయి (బుచ్చి వెంకాయమ్మ)" అని హెచ్చరిస్తుంది.

ప్రేమించి పునర్వివాహం చేసుకున్న రెడ్డికులానికి చెందిన వితంతు యువతి బుచ్చి వెంకయ్యమ్మ.

వీరేశలింగం పంతులుగారిని కథాపాత్రగా ప్రవేశపెట్టిన శాస్త్రిగారి కథలలో ఇది కూడా ఒకటి. వీరేశలింగం గారి చేతుల మీదగా రెండు వితంతు పునర్వివాహాలు జరిగినట్లు తెలుస్తుంది. భూపతిరెడ్డికి బుచ్చి వెంకయ్యమ్మకీ గురువైన పీసపాటి వెంకటరామయ్య (వైదిక బ్రాహ్మణుడు) మద్రాసులో వీరేశలింగంపంతులుగారి సంక్షేమంలో వున్న ధనవంతురాలైన అన్నపూర్ణమ్మ (వైశ్య) అనే వితంతువుని వివాహం చేసుకుంటాడు. అది కులాంతర వివాహం, పురోహితుడు రానని అనడంతో బుచ్చి వెంకయ్యమ్మ పునర్వివాహానికి పంతులుగారే పౌరహిత్యం బాధ్యత వహిస్తారు. ఇది రెడ్డి కులంలో జరిగిన పునర్వివాహం. ఇందులో రాఘవరెడ్డి వితంతు కుమార్తె అయిన బుచ్చి వెంకయ్యమ్మకి తన దగ్గరే పెరిగిన అనాథ యువకుడు భూపతిరెడ్డికిచ్చి వివాహం జరిపించడమే కాకుండా మరో పది పునర్వివాహాలు జరిపించేందుకు ఏర్పాట్లు చేస్తాడు.

ఈ కథా రచనకు గల నేపథ్యాన్ని తెలుపుతూ శాస్త్రిగారు ఇలా పేర్కొన్నారు. "బాల వితంతువగు ఒక రెడ్డి యువతి మరల పెళ్లి చేసికొన్నట్లు ఒక కథ కల్పించండి" అని నన్నాయన కోరెను. అట్టి కథల వలన కులమున చలనము పుట్టవచ్చునని ఆయన ఊహ. "నా బిడ్డకు అట్టి సౌభాగ్యము కలుగక పోవచ్చును. అయినా యీ విషయమున కదలిక పుట్టి తీరవలసియున్నది" అని ఆయన ఖచ్చితముగా చెప్పినప్పుడు "మిత్రుని వాంఛ అని యుత్సాహంతో దీనిని వ్రాసితిని. ఇది ప్రకటింపదలచినప్పుడు కొన్ని చమత్కారములు జరిగినవి. వానినన్నింటిని ఇక్కడ చెప్పవలసిన పనిలేదు. ఈ కథ సంగతి విని మరియొక రెడ్డి మిత్రుడు "ప్రకటింపు"డని చెప్పెను. ఒక మిత్రుని ప్రోత్సాహమున వ్రాయబడిన యీ చిన్నకథను మఱియొక మిత్రుని ప్రోత్సాహమున ప్రకటించుచున్నాను. నా మిత్రుని యుద్దేశము ఈ కథ వలన నెరవేరినచో నేను మిత్ర కార్యమును నెరవేర్చినవాడనగుదును."

ఈ కథలో పీసపాటి వెంకట రామయ్య అనే వైదిక బ్రాహ్మణుడు, బుచ్చి వెంకయ్యమ్మకు పునర్వివాహం పట్ల ప్రేరణ కలిగించి రెడ్డి కులాలలో చైతన్యం కోసం కృషి చేశాడు. అతడు రావడంతో రాఘవరెడ్డిలో గుర్తింప తగ్గ మార్పు కలుగుతుంది. వెంకట రామయ్య శ్రమించి పైకి వచ్చినవాడు. రాఘవరెడ్డికి చదువు నేర్పి లోక జ్ఞానాన్ని పెంపొందింపజేసి, శకునాల పట్ల విముఖత కలిగింపజేశాడు. బుచ్చివెంకయ్యమ్మకి, భూపతిరెడ్డికి కూడా చదువు చెబుతాడు. మద్రాసులో వైశ్య వితంతువుని పెళ్ళాడి రాయవరంలో వున్న రెడ్డికి ఉత్తరం రాస్తాడు. ఆ ఉత్తరమే బుచ్చి వెంకయ్యమ్మ భూపతిరెడ్ల వివాహానికి తోడ్పడింది.

గురువుగారి మార్గాన్ని అనుసరించాలని అనుకుంటుంది బుచ్చి వెంకయ్యమ్మ. తల్లి అందుకు ముందు ఇష్టపడదు. తండ్రి ప్రోత్సహించగా చివరికి ఇష్టపడుతుంది. తల్లి కులాచారంలో లేని పెళ్ళి జరిపించినందుకు రెడ్డి కులం వాళ్ళు "మీ పని చేస్తాం. మీ అన్నం తినం. మీ నీళ్ళు తాగం" అంటారు. "మీకు కులమే కావలిస్తే రంగూన్ వెళ్ళండి. కులం చెడ్డ మా పని మీకెందుకూ" అని రెడ్డి వాళ్ళందరినీ పనిలోంచి తీసివేస్తాడు. ఆ కులంలో పడుచువారు కొందరు వచ్చి "మీ బిడ్డకి మళ్ళీ పెళ్ళి చేశాక మాకు కొంచెం సుఖాశ కలుగుతోంది. మీరు మాకోసం వితంతువును వెదకనక్కర్లేదు. మేమే తెచ్చుకుంటాము. పెళ్ళి చేయించండి. మీ కమతంలో పనిచేసుకుని బతుకుతాం" అన్నప్పుడు వారందరికీ పెళ్ళిళ్ళు ప్రయత్నాలు ప్రారంభిస్తాడు రాఘవరెడ్డి.

శ్రీపాదవారు బ్రాహ్మణ కుటుంబాలకు సంబంధించిన కథలే వ్రాస్తారనే వాదన వ్యాప్తిలో వుంది కాని ప్రస్తుత కథ బ్రాహ్మణేతర కులాలవారి కథలు కూడా వ్రాస్తారని నిరూపించింది.

**కథా ఉద్దేశ్యం :**

రెడ్డి కులంలో పాతుకుపోయి వున్న మూఢ నమ్మకాలను, మూఢాచారాలను రూపుమాపినట్లైతే కులం బాగుపడుతుందనేది ఉద్దేశ్యం.

**'బుచ్చి వెంకాయ్యమ్మ' కథ పై సంస్కరణోద్యమ ప్రభావం :**

అగ్రకులాలకు చెందిన వాటిలో రెడ్డికులం కూడా ఒకటిగా పేర్కొనవచ్చు. పూర్వం ఈ అగ్రకులంలో శకునాల మీద నమ్మకాలు, కులాంతర వివాహాల పట్ల అయిష్టత ఎక్కువగా వుండేది. ఇప్పటికి పూర్తిగా అటువంటి తత్వం పోకపోయినా కొంత మెరుగైందని చెప్పాలి. బుచ్చి వెంకయ్యమ్మ కథలో, బుచ్చి వెంకయ్యమ్మకు, భూపతిరెడ్డికి అలాగే పీసపాటి వెంకటరామయ్య, అన్నపూర్ణకు కులాంతర వివాహం జరిపించి ప్రజలలో అవగాహనను చైతన్యాన్ని కల్పించారు శాస్త్రిగారు. ప్రస్తుత కథ శాఖాంతర కులాంతర వివాహాలను ప్రోత్సహిస్తున్నట్లు తెలుస్తుంది కనుక శాస్త్రిగారు రాసిన 'బుచ్చి వెంకయ్యమ్మ' కథపై సంస్కరణోద్యమ ప్రభావం బలంగా పనిచేసినట్లు చెప్పాలి.

## 12. సాగర సంగం

కులం కట్టుబాట్లకు జడిసి పెళ్ళి కోసం మతమార్పిడి జరుపుకున్న నిమ్నజాతుల యువతీయువకుల ప్రణయ గాథను తెలిపే కథే సాగరసంగం.

**'సాగరసంగం' కథ సంక్షిప్త పరిచయం :**

కథలో నరసీములు మాలకులానికీ, గంగన్న మాదిగ కులానికీ చెందిన వాళ్ళు. నరసీములకు ఒకడే కొడుకు పేరు కాటన్న. గంగన్నకు ఒకటే కూతురు, పేరు సోమాలు. ఈమెకు తల్లి ఉండదు. తగిన ఈడు రావడంతో కాటన్నకు, సోమాలుకు ప్రణయం పుడుతుంది. వారిద్దరి వివాహాన్ని చూడాలంటూ పెదకాపు పేర్రెడ్డి అతని భార్య రంగమ్మ ముచ్చటపడుతుంటారు. వాళ్ళ పెళ్ళికి కులం అడ్డువస్తుందని తెలుసుకుంటారు.

"కులమా? కొడుకా? ఏది కావాలో తేల్చుకో" అంటూ కులం పెద్దలు నరసీముల్ని హెచ్చరిస్తారు. అప్పుడు కులంకంటే కొడుకే ఎక్కువంటూ, కులం కూడు పెట్టదంటూ కులానికి దూరమైపోతామని, వారిద్దరినీ వేరుచేయడం దారుణమంటూ నచ్చచెప్తూ పోలమ్మ

భర్తకి ధైర్యం చెబుతుంది. క్రైస్తవమతంలో చేరిన దేవసహాయం, మధురం దంపతుల ప్రోత్సాహంతో నరసీములూ, పోలమ్మా క్రైస్తవ మతం పుచ్చుకుంటారు. పేర్రెడ్డి భార్య రంగమ్మ గంగన్నని ఒప్పించి, మతాంతరులను చేసి కాటన్నకి, సోమాలుకీ వివాహం జరిపిస్తారు.

క్రైస్తవ మతంలో ఉన్న యాకూబూ, దావీదూ "మాలాడికీ, మాదిగదానికీ పెళ్ళా? ఎక్కడైనా జరిగిందా యిలాగా? మతంలో కలిశాక యిక కులమేమిటంటున్నారు దేవసహాయంగారు." "పిల్లదొరక్క ఆయన (దేవసహాయం) కులం చెడ్డాడు. అందర్నీ తనతో సమానం చేసుకోవాలని ఆయన యిలా చేశాడు. ఛీ : కిరస్తానీ మతం మంచిది కాదోస్"

"అవునోస్" ..... అనుకుంటూ మాలకీ, మాదిగకీ మతం ఇచ్చి పెళ్ళి చేసినందుకు ఎంతో బాధపడ్డారు (సాగర సంగం)."

కులాతీత మతంగా పేరున్న క్రైస్తవ మతంలో చేరినవారు కూడా కుల తారతమ్యాలు చూపిస్తున్న యదార్థస్థితిని వాస్తవానికి దగ్గరగా చూపించాడు రచయిత. హిందువులు మతాంతరులు కాకుండా కులభేదాలు విస్మరించి వివాహాలు చేసుకోవడం మంచిదనే సూచన చేశాడు రచయిత. హిందూ సంఘం కట్టుబాట్లను సడలించకపోతే తమ సౌకర్యాల కోసం కొందరు అన్యమత స్వీకారం చేస్తారని రచయిత ఈ కథ ద్వారా హెచ్చరించాడు.

నిమ్నజాతుల వారికి సంబంధించిన సమస్యలపైన కూడా కథలు రాసి శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు తనకు తానే సాటి అని నిరూపించుకున్నారు.

ప్రస్తుత కథలో స్త్రీ పాత్రలు చాలా చురుకైనవి, సంస్కరణ దృష్టి కలిగినవీ, కులానికన్నా అనురాగానికీ ప్రాధాన్యతనిచ్చాయి ఆ పాత్రలు.

"కోరుకున్న పెనిమిటి దొరికితే కులమెందుకూ? కూడెందుకూ?" అనగలిగిన సాహసం ఉన్నది గనుకనే భర్తకి ధైర్యం చెప్పి, కొడుకు సుఖం కోసం క్రైస్తవమతం పుచ్చుకోడానికి ప్రోత్సహించింది.

పెదకాపు పేర్రెడ్డి భార్య రంగమ్మ ముద్దు ముచ్చటైరిగినది. కాటన్నా, సోమాలూ ప్రేమించుకున్నారని కనిపెట్టి, కులాలు వేరైనా వారిద్దరికీ పెళ్ళి జరిపించి తీరాలని పట్టుపట్టి, అందుకు భర్తను కూడా ప్రోత్సహించింది రంగమ్మ. తనతో చెప్పకుండా సోమాలుకి సంబంధం నిశ్చయించవద్దనీ, లేకపోతే తానే సంబంధం చూసి తన ఇంటి గుమ్మంలోనే

పందిరి వేయించి దానికి పెళ్ళి జరిపిస్తాననీ గంగన్నని ఒప్పించింది. చీరలిచ్చీ, వస్తువులు చేయించి ఇచ్చీ, గాజురాయిలా ఉన్న సోమాలిని పెట్టెలు తీర్చిన నీలంలా నిగనిగా మెరిసేలా మార్చేసింది రంగమ్మ. ప్రేమికుల పెళ్ళి జరిపించి తన ముచ్చట తీర్చుకున్న ఉదారహృదయ రంగమ్మ. ప్రేమించిన వాడికోసం ప్రాణాలైనా ఇవ్వడానికి సిద్ధపడతానన్న ఉజ్జ్వల ప్రణయిని సోమాలు, పఠితను ఆకర్షించే స్త్రీ పాత్ర. కులాంతర వివాహ కథల్లో ఈ కథ విశిష్టమైనది.

**కథా ఉద్దేశ్యం :**

కులాంతర వివాహాలు, శాఖాంతర వివాహాలు సబబుకాదు అనే అభిప్రాయాన్ని వ్యక్తపరిచేవారు ఉన్నారు సమాజంలో. కానీ మనుష్యులంతా ఒక్కటే అన్న భావం వెల్లిమిరుస్తున్నప్పుడు, ఆకారమంటూ ఉండని కులానికి అంత ప్రాధాన్యత ఎందుకు అనేది ఉద్దేశ్యం.

**'సాగరసంగం' కథ పై సంస్కరణోద్యమ ప్రభావం :**

కథా శీర్షిక కథాంశానికి చక్కగా సరిపోయింది ఈ కథలో. కులాంతర వివాహాలని నిరాకరించేవారు పూర్వమే కాదు నేటికాలంలో కూడా చాలామంది ఉన్నారు. అటువంటి వారిలో మార్పు తీసుకురావాలనే ఉద్దేశ్యంతోనే ఈ కథ రాయబడినట్లు భావించాలి. కథలో కనిపించిన కుల పెద్దలు అన్ని కులాల్లోనూ ఉంటారు. ప్రస్తుత కథలో కనిపించిన కులపెద్దలు కులాంతర వివాహానికి సిద్ధపడుతున్న నరసీముల్ని 'కులమా? కొడుకా' తేల్చుకోమంటూ హెచ్చరిస్తారు. కానీ పోలమ్మ మాత్రం వారిని విడదీయొద్దంటూ భర్తకు ధైర్యం చెప్పి మతాన్ని మార్చుకొని కాటంరాజు-సోమాలుల పెళ్ళిని సఫలం చేయడాన్ని గుర్తించాలి. పేర్రెడ్డి భార్య రంగమ్మ కూడా వారి వివాహానికి తోడ్పాటు ధైర్యాన్ని అందిస్తుంది. ఈ కథ నిమ్నజాతులకు సంబంధించిన ఒక కులంలో రెండు శాఖలకు సంబంధించిన వారికి వివాహం జరిగినట్లు చిత్రించడం చూడొచ్చు. మానవులంతా ఒక్కటే, మనుషులంతా సమానమే అనే మాటలు రాతలకో సంభాషణలకో మాత్రమే పరిమితం చెయ్యకుండా ఆచరణలో కూడా అమలు పరచాలి. అంతేకాని ఆకారంలేని కులానికి ప్రాధాన్యతనిచ్చి మనుష్యుల్ని సమాజాన్ని ఎదగనివ్వకుండా చెయ్యకూడదంటూ సంఘాన్ని, సమాజాన్ని, కులాన్ని సంస్కరించేందుకు శాస్త్రిగారు కృషి చేశారు. ఈకథలో నిమ్నకులాలలో సంస్కరణను చూడగలిగారు కాబట్టి 'సాగర సంగం' కథ పై సంస్కరణోద్యమ ప్రభావం బలంగా వుందని చెప్పొచ్చు.

## 13. మొదటి దాడి

దేశ స్వాతంత్ర్యం కోసం కారాగారాన్ని అనుభవించడం కన్నా రాజకీయాల్లో అసాధారణ గౌరవ మర్యాదలు పొందటం కన్నా, సంఘసంస్కరణ ఉద్దేశ్యాలతో అన్యాయాన్ని అరికట్టడం ద్వారా జాతికీ దేశానికి ఎలా సేవ చేయవచ్చో తెలియజేసే కథే మొదటి దాడి.

**'మొదటి దాడి' కథా సంక్షిప్త పరిచయం :**

వివేకవంతులై స్త్రీలు తలుచుకుంటే ఎన్ని సాంఘిక దౌర్జన్యాలనైనా అరికట్టవచ్చుని తెలియజేస్తుందీ కథ.

తొమ్మిదోయేట వితంతువైన జానకమ్మ బి.ఏ. పాసవుతుంది. సంఘసంస్కార భావాలు అలవరచుకుంటుంది. దబ్బన్న మామగారి కూతురు సుందరిని షష్ఠిపూర్తి చేసుకున్న వేంకట సోమయాజులు తాత రహస్యంగా పెళ్ళి చేసుకుంటున్నాడని తెలుసుకొని, దాడి జరిపి పెళ్ళి జరగకుండా అడ్డుకొని ఆడవాళ్ళందరికీ ధైర్యం చెప్తుంది జానకమ్మ. పునర్వివాహ ఆలోచన మానుకుని తన జీవితాన్ని స్త్రీ జనాభ్యుదయానికి వినియోగిస్తుంది.

జానకమ్మ పినతండ్రి కూతురు సుభద్ర రాజకీయాలలో తిరుగుతూ మూడు నెలలు జైలు శిక్ష అనుభవించి వచ్చి జైలు కెళ్ళిన వాళ్ళే నిజమైన దేశాభిమానులంటూ నమ్మి 'దేశమాత పిలుస్తోంది - అగ్నిహోత్రంలోకి (రాజకీయాల్లోకి) దూకు' అంటూ జానకమ్మను దురుసు మాటలంటూ వెళుతుంది. సంఘ పునర్నిర్మాణాన్ని పక్కన పెట్టి రాజకీయంలో విలయతాండవం చెయ్యడం ఆమెకి (జానకమ్మకి) అంతగా రుచించలేదు. జానకమ్మకు మొదటి నుంచి సంఘసంస్కరణ పట్ల ఆశక్తి ఎక్కువ. ఆంగ్ల సాహిత్య పరిచయము, కాలేజీలో విదేశీ స్త్రీల వలన కలిగిన సహచర్యము ఆమెకి గల సంఘసంస్కరణాభిమానాన్ని మరింత ఎక్కువ చేస్తాయి. చిన్నతనంలోనే ఆమె వితంతువవడం, సమాజం ఆమెను చిన్నచూపు చూడటం కూడా దానికి కారణం అవుతుంది. అలా సంఘసంస్కరణ దృష్టే జానకమ్మను ఉద్యోగం వైపు కూడా మొగ్గుచూడనివ్వలేదు. సంఘసంస్కారమే ముఖ్యంగాని రాజకీయాలు కాదనేది ఆమె అభిప్రాయం. ముసలి పెళ్ళికొడుకు (పెళ్ళితాత) తో సుందరి పెళ్ళిని జరగనివ్వకుండా 'మొదటిదాడి' జరిపి తనలోని సంస్కరణ భావాలకు కార్యరూపం ఇస్తుంది.

కథలో కనిపించె సుభద్రమ్మ, జానకమ్మలు విభిన్న దృక్పథాలకు ప్రతినిధులు. సుభద్రది రాజకీయావేశం అయితే, జానకమ్మది సంఘసంస్కరావేశం. సంఘసంస్కరణ వాదులు వాస్తవ దృష్టిగల కార్యవాదులని రచయిత ఉద్దేశ్యం. పెళ్ళికూతురు సుందరి

సైతం జానకమ్మ ప్రోత్సాహంతో పెద్దలను లక్ష్యపెట్టకుండా 'పెళ్ళితాత'ను "ముసలిపీనుగా" అని తిట్టి వచ్చి జానకమ్మను కౌగలించుకొంటుంది. స్త్రీలు వివేకంతో సాహసంతో ముందడుగు వేస్తే తమనుతాము ఉద్ధరించుకోవడంతో పాటు సంఘాన్ని కూడా ఉద్ధరించగలరని ఈ కథ ద్వారా నిరూపించారు శాస్త్రిగారు. సంఘంపైన, సంఘంలోని మతాచారాలపై స్త్రీ సాగించిన 'మొదటిదాడి' ఈ కథ.

"శారదా బిల్లు కూడా పైకెక్కదీస్తాడో యేమిటో అప్రాచ్యుడు" అనే మాటను బట్టి బాల్యవివాహాలను నిషేధించే 'శారదాబిల్లు' అప్పటికీ అమలులోకి వచ్చినట్లు స్పష్టమౌతుంది.

చక్కని వాడుక భాషలో వ్రాసిన ఈ కథలో రచయిత సన్ని వేశోచితంగా ప్రయోగించిన కొన్ని ఉపమాలంకారాలు ఉదహరింపదగినవి.

"శరసంధానం చేసిన ధనస్సులా వున్న ఆమె కనుబొమ్మలు చూసి యువకుడు కూడా చకితుడయిపోయాడు."

"జలసిక్తమైన గ్రీష్మలతలాగ సుందరి ఆశాభరితులరాలై తలయెత్తి చూసింది."

"జానకమ్మ ఒక చేత్తో మార్కండేయుణ్ణి బుజ్జగిస్తూ వొక చేత్తో శూలం యెత్తి యముడి మీద విసరబోతూ వున్న కాలాగ్ని రుద్రుడిలాగ భయంకరంగా నిప్పులు కక్కుతూ చూస్తూ నుంచుంది (మొదటిదాడి)."

**కథా ఉద్దేశ్యం :**

పూర్వం భారతదేశంలో బాల్యవివాహాల జోరు ఉధృతంగా వుండేది. దానివలన వితంతువులు పెరిగి సమాజంలో అన్ని విధాలుగాను హింసను ఎదుర్కొంటు వుండేవారు. కాబట్టి బాల్యవివాహాలు ఎన్నో అనర్థాలకు కారణాలవుతాయనేది ఉద్దేశ్యం.

**' మొదటిదాడి' కథ పై సంస్కరణోద్యమ ప్రభావం :**

పూర్వం సమాజంలో బాల్యవివాహాలు ఎక్కువగా జరుగుతూ వుండేవి. చట్టాలు వచ్చి వాటిని కొంతవరకు నిరోధించడంతో చాలా వరకు సద్దుమణిగాయి, దానికి తోడు ప్రజలకు విద్యా అవకాశాలు పెరగడం వలన విచక్షణాజ్ఞానం కలిగి బాల్యవివాహాల పట్ల విముఖత కనబరచడం జరుగుతుంది. ప్రస్తుత కథైన 'మొదటిదాడి'లో దబ్బన్న మామగారి కూతురు సుందరిని షష్ఠిపూర్తి చేసుకున్న వేంకట సోమయాజులు తాత రహస్యంగా పెళ్ళి చేసుకోబోతుంటే జానకమ్మ ద్వారా ఆ పెళ్ళిని భగ్నం చేయించి సుందరికి విముక్తి కలిగినట్లు రచయిత చిత్రించి సమాజాన్ని స్త్రీలను చైతన్య పరిచాడు రచయిత. ఈ కథ

చైతన్యాత్మకమైంది సంస్కరణాత్మకమైంది. కనుక 'మొదటి దాడి' కథపై సంస్కరణోద్యమ ప్రభావం శక్తివంతంగా పనిచేసినట్లు చెప్పొచ్చు.

## 14. తులసి మొక్కలు

వేశ్యాకులంలో కూడా శీల నైశిత్యం గల జాతి రత్నాల వంటి స్త్రీలుంటారని నిరూపించే కథే తులసి మొక్కలు.

**'తులసి మొక్కలు' కథా సంక్షిప్త పరిచయం :**

తన శిష్యుడైన ఒక బ్రాహ్మణ యువకునికి ఒక వేశ్యాయువతితో సంస్కర్త వీరేశలింగం పంతులు జరిపించిన సంస్కరణ వివాహాన్ని ఈ కథలో చూడొచ్చు.

వేశ్యలన్నా, వేశ్యావృత్తి అన్నా విముఖత కనబరిచే వీరేశలింగం పంతులే స్వయంగా ఒక వేశ్యను బ్రాహ్మణ యువకునికిచ్చి వివాహం జరిపించడం విశేషం.

మిత్రులతో గోదావరి నదిలో 'మునిగి ఈత' పందెంలో పాల్గొన్న రాజమండ్రి కళాశాల విద్యార్థి (బి.ఏ.) జంద్యాల ప్రకాశం గుండు వారి రేవులో స్నానం చేసే వేశ్యాయువతి రంగనాయికను నీటి అడుగు నుంచి ఈదుకుంటూ వచ్చి పొరపాటున పట్టుకోవడంతో ఆమె తల్లీ, ఆమె అన్న మాధవరావూ అతన్ని పోలీసులకప్పగించి కేసు పెడతారు.

తన శిష్యుడు ప్రకాశం పోలీసు కేసులో ఇరుక్కున్నాడని తెలుసుకుని వీరేశలింగం పంతులు అతన్ని కేసు నుంచి తప్పించేందుకు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రామదీక్షితులు గారిని కలుస్తాడు. పందెంలో తాను గెల్చుకున్న వందరూపాయలను అపరాద రుసుముగా చెల్లించడానికి సిద్ధపడతాడు ప్రకాశం. వీరేశలింగం పంతులు జోక్యం చేసుకుని కేసు రాజీ అయ్యేలా చూడమని అడిగినప్పుడు 'ఆ పిల్లకి మీ శిష్యుడు కన్నెరికం చేయడం ఒక్కటే మార్గం' అంటూ ప్రాసిక్యూటర్, రంగనాయిక అన్న మాధవరావు ఉద్దేశ్యాన్ని తెలిపి, ఆమె బాధపడుతుంది అంటాడు. రంగనాయిక తల్లితో మాట్లాడడానికి వీరేశలింగం పంతులుగారు ఆమెను ఒకసారి తన తోటలోనికి రప్పించమంటాడు.

వేశ్యాజాతి అంటేనే ఆమడ దూరం వెళ్ళే పంతులు మాట్లాడేందుకు రమ్మనడం తల్లి రాజామణికి ఆశ్చర్యం కలిగిస్తుంది. పంతులు దగ్గరకు వెళ్ళిన రాజామణినీ, ఆమె కూతుళ్ళనూ ఎంతో ఆదరంగా చూసి పంతులు 'రంగనాయికకు పెళ్ళి చేయకూడదా' అంటూ సలహా ఇస్తాడు. రంగనాయిక పెళ్ళికి అంగీకరించిందని తెలుసుకుని రాజామణితో మాట్లాడి పెళ్ళి ఏర్పాట్లు చేయండని చెప్పి పంతులు మరునాడు తన శిష్యుడు ప్రకాశాన్ని

ఆమె ఇంటికి తీసుకువెళ్ళి, 'ఇతనే పెళ్ళికొడుకు' స్వచ్ఛమైన వెలనాటి బ్రాహ్మణ కుటుంబంలో పుట్టాడు. అతనికి నా అన్నవారు ఎవరూ లేకపోయినా కష్టపడి చదివి బి.ఏ.లోకి వచ్చాడు. ఇతడు నా శిష్యుడు. కమ్మ వితంతువుని పెళ్ళాడదామని అనుకుంటున్నాడు. రంగనాయికను పెళ్ళాడడానికి ఇంతకంటే యోగ్యుడైన వరుడు ఈ భూమిమీద ఉండడు. మీ అమ్మాయిని పట్టుకున్న వాడే పెళ్ళాడాలి అనుకుంటున్నాడు. అంటూ చెప్పి అందరి ఆమోదంతో రంగనాయికకి ప్రకాశానికి తాంబూలాలు ఇప్పిస్తాడు. పంతులే ముహూర్తాన్ని నిర్ణయించి వరుడు ఫలానా అని ముందు ఎవరికీ చెప్పవద్దు అంటూ పెళ్ళిపీటల మీదే నలుగురికీ తెలియాలి అంటాడు. ప్రయత్నాల్లో ఉండమంటాడు. పంతులుగారి ఆహ్వానం మేరకు వేశ్య ఇంట్లో పెళ్ళికి రాజమండ్రిలో నగర ప్రముఖులు అందరూ వస్తారు. బ్రహ్మపీఠం అధిష్టించి పంతులు వేశ్యా యువతి రంగనాయికకూ బ్రాహ్మణయువకుడు ప్రకాశానికి వైభవంగా వివాహం జరిపిస్తాడు. ప్రకాశమే పెళ్ళికుమారుడని తెలుసుకుని ఆశ్చర్యపోయిన పలువురు పంతులుగారిని ప్రశంసిస్తారు. కాలేజీ ప్రిన్సిపల్ దొర, పంతులుగారిని, ఆదర్శయువకుడు ప్రకాశాన్ని, రంగనాయిక తల్లినీ అభినందిస్తాడు. ప్రకాశం మీద పెట్టిన కేసును కూడా ఉపసంహరిస్తారు పోలీసులు. వీరేశలింగం పంతులు కోరిక మేరకు అక్కడ వారంతా సకలవర్ణ భోజనాలలో పాల్గొంటారు. పత్రికలు ప్రశంసిస్తాయి. దేశభక్తులు తమ హర్షాన్ని వెలిబుచ్చుతారు. 'మూర్ఖాచార పరాయణుల దుర్విమర్శలు కూడా గుహల్లో అంధకారంలా ఆ ఆనంద సందోహానికి దూరదూరంగా వినబడ్డాయి.'

"గంజాయి వనంలాంటి వేశ్యాకులంలో శీల నైశిత్యం కల రంగనాయిక ఒక తులసి మొక్క. ఆ కులంలో పుట్టి, ఆ వాతావరణంలో జీవిస్తున్నా, ఆమె అందులో ఇమడలేదు. ఆమె అక్క విటుడొకడు వచ్చి తన చెయ్యి పట్టుకోబోగా "బోగందాన్నయితే మాత్రం చెయ్యిపట్టుకోవడమే?" అని కస్సుమంటుంది. "సానయితే యింత లోకువా? నాకక్కరలేదు సానరికం" అంటుంది. "నేను చెయ్యలేనమ్మ సానరికం, నాకు పెళ్ళి చేసెయ్యి" అంటుంది తల్లితో. "బోగందైతే మాత్రం; ఎదిగిన బిడ్డ ; తప్పుకాదూ !" అని ప్రకాశం చేసిన పనిని తప్పు పట్టిన ఒక వృద్ధ బ్రాహ్మణ వితంతువు వ్యాఖ్యానం రంగనాయిక మనస్సులో బాగా నాటుకుంది.

"..........నేను మంచి బ్రాహ్మణ్ని చూసి, కూడా వెళ్ళిపోయి వారింట్లో చాకిరీ చేస్తూ బతుకుతాను" అని అక్కలడిగినప్పుడు వారికి సమాధానం చెబుతుంది. తన కుటుంబ మార్గానికి భిన్నంగా, తన ఆశయానికి కోరికకీ అనుగుణంగా పెళ్ళి చేసుకుంది రంగనాయిక.

తన జాతిలో కూడా శీలనైశిత్యం కల వాళ్ళుంటారని నిరూపించిన జాతిరత్నం రంగనాయిక (తులసి మొక్కలు)."

అన్య కులంలోని వితంతువుని పెళ్ళి చేసుకోవడం కంటె వేశ్యాయువతిని బ్రాహ్మణ యువకుడు పెళ్ళి చేసుకోవడం శాస్త్రిగారి దృష్టిలో గొప్ప సంస్కరణ. పంతులు గారు వేశ్యావృత్తినే గాని ఆ కులంవారిని ద్వేషించలేదని నిరూపించేందుకు శాస్త్రిగారీ కథలో "మీ వృత్తిని నేను అసహ్యించుకుంటాను; కాని మంచి వుద్దేశ్యంతో కబురు పంపించాను గనుక మిమ్మల్ని గౌరవించడం నావిధి" అని పంతులిచే పలికించారు. "స్త్రీగాని పురుషుడు గాని ఏక చారత్వాన్ని విడిచిపెడితే వారి వివాహం భ్రష్టమైపోయిందన్నమాట" హిందూ సంఘంలో పురుషుడికి వున్న అధికారాలు స్త్రీకి లేక పోవడాన్ని ఖండించారాయన. హిందూ సంఘం కూలిపోవడానికి ఇటువంటి దోషాలే కారణం అంటారాయన. రాజామణితో పంతులుగారు మాట్లాడిన మాటల్లో తీవ్రమైన సంఘ విమర్శ ఉంది. "హిందూజాతి లాంటి మూఢజాతి ప్రపంచంలో లేదు. మహానుభావులెందరో ఈ సంఘంలో పుట్టినా అంతా అనాలోచితంగా వర్ణవ్యవస్థకి కట్టుపడడం చేత సంఘం కుళ్ళిపోయింది, హిందూ సంఘం స్త్రీల గౌరవాన్ని మరచిపోయి వుంది. అంచేతనే దేశం యిప్పుడిలా వుంది..........." "ఇంగ్లీషు దొరతనం రాబట్టి గాని లేకపోతే మనం యింకా అధోగతి పాలై వుందుము" అంటారు.

'ఏంటినాచ్'గా పేరుపడిన వీరేశలింగం పంతులు శీల నైశిత్యం కల వేశ్యలు వివాహాలు చేసుకుని సంసారాలు చేసుకుంటూ సుఖంగా జీవించడానికి అనుకూలుడని నిరూపించడానికి రచయిత ఈ కథలో చేసిన యత్నం ప్రశంసనీయం. వాస్తవ జీవితంలో పంతులుగారి సంస్కారాశయాలన్నీ కథలో ప్రతిబింబించాయి. "ఆ జాతి వారి యందు (వేశ్యాజాతి) సహితము నందఱును సానులే కావలసినదని నియమములేదు. ఇష్టమున్న వారు పరిణీతలయి సంసారులుం గావచ్చును..........." అని వీరేశలింగంగారు 'వేశ్యలు' అనే తమ వ్యాసంలో వ్రాసిన వాక్యం, ఈ కథలో పంతులు గారి పాత్ర సృష్టికి రచయిత కుత్సాహాన్ని కలిగించి ఉండవచ్చు అయితే, వేశ్యాకులం వ్యభిచారం కోసం పుట్టింది కాదనే శాస్త్రిగారి స్థిర నిశ్చయం ఈ కథలో కూడా మారలేదని కథలో పంతులుగారితో వాదించిన రాజామణి మాటల్ని బట్టి గ్రహించవచ్చు. "సానులు వుండడమా, మానడమా అంటే మనడానికి నేనే కాదు సంఘమే ఒప్పుకోదు; కాని నా బిడ్డకు మీరు పెళ్ళి చేస్తానంటే మీరు చెప్పిన కారణాల వల్ల ఒప్పుకుంటాను. సాధ్యమైతే మీరు ప్రయత్నించవచ్చు" అంటుంది పంతులుతో రాజామణి.

“మాలో పెళ్ళిళ్ళు కూడా జరుగుతూనే వున్నాయి. కాని మంచి వరులు దొరకడం కష్టం. ఈ కారణం చేత గూడా కొందరు తమ బిడ్డల్ని సానులుగా చేస్తున్నారు. అగ్రజాతుల వారెవరేనా పెళ్లాడడానికి సిద్ధపడితే మా పిల్లలలో అనేకమంది కులస్త్రీలు అవుతారు” అంటుంది రాజామణి.

“పెళ్ళి చెయ్యడానికి సానులు అంగీకరించడం ఒక కష్టం; సాని కూతుర్ని పెళ్ళాడడానికి అగ్రజాతుల యువకులు సిద్ధపడడం అంతకంటే కష్టం. రంగనాయిక పుణ్యం మంచిది కనుక నువ్వు మా ప్రకాశము గూడా చటుక్కున అంగీకరించారు” అంటాడు పంతులు (తులసి మొక్కలు).”

**కథా ఉద్దేశ్యం :**

పరిస్థితుల ప్రభావం వలన వేశ్యలైనా మారి జీవితాన్ని చక్కదిద్దుకోవాలనుకోవడం తప్పు కాదనేది ఉద్దేశ్యం.

**‘తులసిమొక్కలు’ కథ పై సంస్కరణోద్యమ ప్రభావం :**

ఈ కథ వేశ్యా వివాహాన్ని ప్రోత్సహిస్తుంది. సమాజంలో ఎటువంటి గుర్తింపు లేకుండా పూర్వం, ప్రస్తుతం హీనంగా చూడబడుతున్న వేశ్య వృత్తిలో వున్న వారిని సంస్కరించి వాళ్ళ జీవితాలలో వెలుగు తీసుకువచ్చేందుకు శ్రీపాదవారు తులసిమొక్కలు కథ వ్రాసినట్లు భావించాలి. ప్రస్తుత కథ ద్వారా వేశ్య అయిన రంగనాయికకు, అగ్రకులానికి చెందిన, బ్రాహ్మణ యువకునికి (ప్రకాశం) వివాహం చేసి కులాంతర వివాహాలు, మతాంతర వివాహాలు తప్పుకానట్లే వేశ్యా వివాహం కూడా తప్పుగా పరిగణించకూడదని తెలియజేశారు. అన్ని కులాలకు, మతాలకు చెందిన పురుషులు, వేశ్యలుగా దుర్భర జీవితాన్ని అనుభవిస్తున్న స్త్రీలకు క్రొత్త జీవితం ఇచ్చేందుకు ప్రయత్నించాలనే అభిప్రాయాన్ని తెలియజేస్తూ సమాజంలో మార్పు కోసం కృషి చేశారు, పురుషులను ఆ ఆలోచనల వైపు మరలించారు. ఈ కథ ఓ దుర్భరమైన జీవితం అనుభవిస్తున్న స్త్రీకి సహృదయంగల వ్యక్తి నిండు జీవితాన్ని ఇచ్చినట్లు చిత్రించబడింది కనుక శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు రాసిన ‘తులసి మొక్కలు’ కథపై సంస్కరణోద్యమ ప్రభావం బలంగా పనిచేసినట్లు చెప్పవచ్చు.

## 15. పెళ్ళాడతగ్గ మొగాడేడీ?

వైదిక బ్రాహ్మణ కుటుంబాలలో పూర్వం బాలవితంతువులు అనుభవించిన అవమానాలు, ఛీత్కరింపులు, నరకయాతనలు, వేదశాస్త్రాలు చదివి దయా సత్యశౌచాలను

పక్కనపెట్టి బ్రాహ్మణ శ్రేష్ఠులు సాగించిన దౌర్జన్యాలు, ఆకృత్యాలూ, దారుణాలూ మతం వేరైనా కనికర దృష్టితో సేవాభావంతో కష్టాలలో ఉన్న వారిని ఆదరించిన క్రైస్తవులలో ఉండే మానవత్వాన్ని మంచితనాన్ని గురించి తెలియజేయడం, ఇలా భిన్న మతాల మధ్య బేధాన్ని పాఠకులకు స్పష్టంగా తెలియజేసే కథే 'పెళ్ళాడతగ్గ మొగాడేడీ?'

**'పెళ్ళాడతగ్గ మొగాడేడీ?' కథ సంక్షిప్త పరిచయం :**

నిప్పూ, నీళ్ళూ కడిగేటంతటి గడ్డు చాదస్తపు కుటుంబంలో పుడుతుంది సుభద్రమ్మ. తొమ్మిదోయేడే వితంతువైపోవడం వల్ల కన్నవారికి గర్భశత్రువైపోతుంది ఆమె. ఎక్కువగా ఆమె కాకినాడలో చెల్లెలి దగ్గర ఉండటంతో, తల్లితండ్రులకి సుభద్రకు జుట్టు తీయించడం కుదరదు. సుభద్రమ్మ మరిది కాకినాడ కాలేజీలో మేష్టరుగా పనిచేస్తుంటాడు. అతడు బ్రహ్మ మతావలంబికుడు కాకపోయినప్పటికీ ఆ మతం పట్ల అభిమానాన్ని పెంచుకున్నవాడు. అతడి బోధనల వల్ల, కాకినాడలో బ్రహ్మమతావలంబికులైన స్త్రీల పరిచయం వల్లా బ్రాహ్మణ జాతంటే రాక్షసజాతని అర్థమవుతుంది సుభద్రకు. పునర్వివాహం చేసుకోవాలనే కోరిక కలిగిన సుభద్రమ్మ మరిది సుందరం ఎన్ని సంబంధాలు తీసుకొచ్చినా ఆసక్తి కనబరచకుండా సొంత ఊరైన పాలమూరులోనే రామశర్మను పెళ్ళి చేసుకొనేందుకు నిర్ణయించుకుంటుంది. భార్య పోవడంతో పరామర్శించేందుకు అతడి దగ్గరకు వెళ్ళిన సుభద్రమ్మ "వితంతువుని పెళ్ళి చేసుకో రాదుటోయి?" అని అడుగుతుంది.

ముందు రామశర్మ తన పట్ల దురుద్దేశాన్ని కలిగి ఉన్నాడనుకుంటుంది సుభద్రమ్మ. కానీ అతడు రాసి పంపిన ఉత్తరాల వల్ల ఆమెకతడి మీద నమ్మకం కలుగుతుంది. అతన్ని పెళ్ళాడి సుఖపడొచ్చని భావించి అర్ధరాత్రి అతడితో బయలుదేరుతుంది. అన్నలూ, తండ్రీ సుభద్రమ్మను చావకొట్టి రోడ్డు పక్కన పడేస్తే నమ్మించిన రామశర్మ పిరికివాడిలా ఆమెనొదిలి పారిపోతాడు. ఆ సంఘటనతో సుభద్రమ్మకు పెళ్ళిపట్ల అసహ్యం కలుగుతుంది. యోగ్యుడైన వాడ్ని చూసి పెళ్ళి చేసుకోమంటూ ఆదరించి ఆశ్రయం ఇచ్చిన జకరయ్య అన్నప్పుడు, 'వివాహ ఆలోచనే విరమించుకున్నానంటూ' సుభద్రమ్మ ఆవేశంగా చెపుతున్న మాటలు పాఠకున్ని ఆలోచనలో పడేస్తాయి.

"స్త్రీల మానం కాపాడలేని జాతి యిది. స్త్రీల జీవిత లక్ష్యాన్ని అర్థం చేసుకోలేని మతం ఇది. స్త్రీకి యుక్త వయస్సు రాకుండానే పెళ్లి చేసేయ్యాలనే నిర్బంధాన్ని సృష్టించడానికి ముఖ్య కారణం యేమిటో నాకిప్పుడు స్పష్టంగా బోధపడింది. జాతి కనుగుణమైన విద్యనేర్చిన బాలిక నిజంగా స్త్రీ రత్నం అవుతుంది. అలాంటి రత్నాన్ని

సంపాదించాలంటే పురుషుడు పురుషకారాన్ని చూపించాలి. అది చూపించలేనివాడు శాశ్వత బ్రహ్మచారిగా వుండిపోవలసిందే; గాని మరి దారిలేదు. అప్పుడు స్త్రీ ప్రాణకోటికి సహజమైన సౌఖ్యమూ, ఆనందమూ అనుభవించడానికి జాత్యంతరుణ్ణి కూడా కోరితే కోరవచ్చు. ఇదే తటస్థిస్తే దేశానికి వొక విధమైన దౌర్భాగ్యం కలుగుతుందంటే నిజమే. ఇలాంటివేమీ తటస్థించకుండా వుండాలనే మన పూర్వులు స్త్రీని పశువుగా తయారుచేసే సన్నివేశాలు కల్పించారు. అయితే వారు స్త్రీ పశువయిపోతే ఆ స్త్రీల చేతుల్లో పెరిగే మొగపిల్లలు పశు పతులయిపోతారని గ్రహించలేకపోయారు. ఇలాంటి అవిచారిత ధర్మాల నేర్పరచడం వల్ల తామే పశువులయిపోవడం కూడా వారు గమనించలేకపోయారు. త్రికాలజ్ఞాన సంపన్నులని పొగడబడే మునులు ఇలాంటి అపసిద్ధాంతాలు ఏర్పరిస్తే జాతి నిర్వీర్యం అయిపోతుందనీ, దేశం అన్యాక్రాంతం అయిపోతుందనీ గ్రహించలేకపోయారు......ఇంతకీ, మా మరిదిగారి బోధనల వల్ల నాకు ప్రపంచకం అంటే యేమిటో, స్త్రీ కర్తవ్యం యేమిటో విశదపడ్డాయి. మీ సౌజన్యాన్నీ, మీ కర్తవ్య పరాయణతనీ చూడడం వల్లా, అనుభవించడం వల్లా నాకు నేను చెయ్యవలసిన పనికూడా తెలిసింది. కనుక నేనిప్పుడు పెళ్ళి సంగతి వెనక్కి తీసేస్తున్నాను. ఆంధ్ర స్త్రీలోకం యిప్పుడు నానాబాధలూ పడుతోంది. నా జీవితాన్నంతా స్త్రీలకూ పిల్లలకూ సేవ చెయ్యడంలో గడిపేస్తాను. సేవలో వుండే సౌఖ్యమూ, ఆనందమూ మరి దేనివల్ల కలిగే వాటికీ తీసిపోవు (పెళ్ళాడతగ్గ మొగాడేడి)."

ఆపదలో ఉన్న సుభద్రమ్మను రక్షించి ఆదరించిన ఆమెకు మతదీక్ష ఇప్పించాలనుకోడు జకరయ్య. డబ్బుకోసం గడ్డితినే మనిషికాదతడు. సేవాభావమూ, సహాయ గుణము కలిగిన నిజమైన క్రైస్తవుడు జకరయ్య.

సామాజిక వాస్తవికతను అద్దం పట్టే ఈ కథ రచయితలో గల సంఘసంస్కరణా భావాన్ని స్పష్టం చేస్తుంది.

**కథా ఉద్దేశ్యం :**

వైదిక బ్రాహ్మణ కుటుంబాలలో బాల వితంతువుల దుస్థితి మహా దారుణంగా ఉంటుంది. వారి జీవితాలను ఇంకా అగమ్యగోచరం చేయకుండా ఉండాలంటే పునర్వివాహాలు తప్పనిసరి అనేది ఉద్దేశ్యం.

**'పెళ్ళాడ తగ్గ మొగాడేడీ?' కథ పై సంస్కరణోద్యమ ప్రభావం :**

అగ్రకులమనీ, అగ్రకులాలకు చెందినవారమని, శాస్త్రాలను అవపొసన పట్టామంటూ చెప్పే బ్రాహ్మణ వంశాలలో బాలవితంతువులకు ఎదురవుతున్న నిరాదరణను

సుబ్రహ్మణ్యశాస్త్రిగారు ఈ కథలో అద్భుతంగా చిత్రించారు. శారదాచట్టం అమలులో ఉండటం వలన కాలం మారుతున్న కొద్దీ బాల్యవివాహాలు కొంతవరకూ నిషేధించబడి వితంతు సమస్య కొంతవరకూ రూపుమాపబడింది. పూర్వం శాస్త్రాలను అడ్డం పెట్టి స్త్రీలను హీనంగా చూస్తుండేవారు బ్రాహ్మణులు. దురదృష్టవశాత్తు ఆడపిల్లలు భర్తను కోల్పోతే ఇక అంతే. వారికి బ్రతికుండగానే నరకాన్ని చూపిస్తుండేవారు. నేడిటువంటి దుస్థితి లేదు. దానికి కారణం వివాహ వయో పరిమితిని చట్టబద్ధంగా పెంచి అమలుజరపడం విద్యావకాశాలు దక్కడం వల్ల మంచి-చెడులు విచక్షణ చేయగలగడం వంటివి. ప్రస్తుత కథలో వైదిక బ్రాహ్మణ కుటుంబంలో తొమ్మిదోవయేడే వితంతువైన సుభద్రమ్మను చూడొచ్చు, ఆచారం పేరుతో సుభద్రమ్మను హింసించడానికి చూసిన ఆమె తల్లి తండ్రుల్నీ చూడొచ్చు. పునర్జీవితాన్ని ఇస్తానంటూ ముందుకొచ్చి నమ్మించి ఆపద సమయంలో విడిచిపెట్టి పారిపోయిన రామశర్మను చూడొచ్చు. అయితే దీనికి భిన్నంగా స్వకులం కాకపోయినప్పటికీ దయ, కరుణ నిండుగా వున్న జకరయ్య వంటి క్రైస్తవ ఉత్తముల్నీ అరుదుగా చూడొచ్చు. స్వకులం వారి చేత హింసననుభవించి ఇతర మతమైన క్రైస్తవమతం వారి వద్ద సుభద్రమ్మ ఆశ్రయం పొందినట్లు చూపించి బ్రాహ్మణ కులాలు సంస్కరించాలనే అభిప్రాయాన్ని వ్యక్తం చేసినట్లు గ్రహించాలి. సనాతన మూఢాచారాలు, సాంప్రదాయాలూ, కట్టుబాట్లు విడిచిబెట్టి మనుషుల్లోనే భగవంతుడ్ని చూడాలి, అన్ని మతాలూ సమానమే, అన్ని మతాల సారమూ ఒక్కటే అన్న సందేశాన్ని అందించినట్లు గ్రహించాలి. బ్రాహ్మణ కులాలలో గల లోపాలను ఎత్తి చూపి సంస్కరణల బాట పట్టించాలంటూ రచయిత శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి చేసిన కృషి శ్లాఘనీయమైంది. ఈ కథ వితంతు జీవితాన్ని చిత్రించి ఆమె చేతే "నా జీవితాన్నంతా స్త్రీలకూ పిల్లలకూ సేవ చెయ్యడంలో గడిపేస్తాను. సేవలో వుండే సౌఖ్యమూ, ఆనందమూ మరి దేనివల్ల కలిగే వాటికీ తీసిపోవు" అని చెప్పింది. ఎంతోమందికి స్ఫూర్తిని కలిగించాడు రచయిత. ఈ కథ చైతన్యాన్ని, సంస్కరణను, సమానత్వాన్ని దర్శింపచేయించింది కనుక 'పెళ్ళాడ తగ్గ మొగాడేడీ?' కథ పై సంస్కరణోద్యమ ప్రభావం బలంగా పనిచేసిందని చెప్పాలి.

## 16. తల్లి ప్రాణం

తండ్రి కంటే తల్లికి పిల్లలపై ప్రేమాభిమానాలు ఎంత గాఢంగా ఉంటాయో తెలియజేసే కథ 'తల్లి ప్రాణం'.

**'తల్లి ప్రాణం' కథ సంక్షిప్త పరిచయం :**

రామబ్రహ్మం భద్రమ్మల ఒక్కాగానొక్కా కుమార్తె సుందరమ్మ. ముసలి తల్లి పట్టుదల వల్ల అతడి అక్క మంకుపట్టుకి తలొగ్గి భార్యకి, కూతురికి ఇష్టం లేకపోయినా బలవంతంగా తన అత్తకొడుక్కిచ్చి సుందరమ్మకు పెళ్ళి చేస్తాడు రామబ్రహ్మం. సుందరమ్మ రజస్వల వార్త, మేనల్లుడి (అల్లుడు) మరణ వార్త రెండూ ఒకేసారి వస్తాయి.

పాతిక సంవత్సరాల వాడైన కృష్ణశాస్త్రిని (పండితున్ని) ఇంటికి పిలిపించి సుందరమ్మకు చదువు చెప్పించడం నాయనమ్మ వెంకు సోదెమ్మకు ససేమిరా ఇష్టం ఉండదు. చదువు మాన్పించడం తల్లికి ఎందుకనో ఇష్టం ఉండదు. ఇటు తల్లిని అటు భార్యని శాంతింప చేయలేక నలిగిపోతాడు. రామబ్రహ్మం తన జిత్తులతో యత్తులతో హేతువాదాలతో చదువుకు ఆటంకం జరగనీయకుండా చూడగలుగుతుంది భద్రమ్మ.

కూతురు సుందరమ్మకి, కృష్ణశాస్త్రికీ మనసులు కలిసినట్లు గ్రహించి ప్రోత్సహిస్తుంది భద్రమ్మ. తల్లి ఏర్పాటులతో అమ్మమ్మ తాతయ్య సహకారంతో సుందరమ్మ కృష్ణశాస్త్రిని పెళ్ళాడి, మోటారులో ఊరేగుతూ వీధుల్లోకి రాగా అది చూసిన నాయనమ్మ నెత్తి నోరూ బాదుకుంటుంది. తండ్రి ఆశ్చర్య చకితుడవుతాడు. అల్లుడూ కూతుర్ని చూసి తల్లి సంతోషిస్తుంటుంది.

తన మాటే నెగ్గాలంటూ మంకు పట్టు పట్టి మనువరాలి సుఖాన్ని చూడలేనిది వెంకుసోదెమ్మ. కొడుకు తన చెప్పు చేతల్లో ఉండేటట్లు చూసుకుంటుంది భర్త తన చెప్పుచేతల్లో ఉండాలని కోడలూ ఎలా కోరుకోకుండా వుంటుంది? అటువంటి ఆలోచనే రాలేదు వెంకు సోదెమ్మకి. ఆమె తన కూతురుని వెనుకేసుకొస్తుంది. కోడలు తన కూతురిని (మనుమరాలిని) వెనకేసుకురావడం తప్పుకాదని తెలుసుకోలేకపోతుంది.

కూతురు సౌఖ్యం ముందు భర్తా, అత్తగారూ సంఘమూ భద్రమ్మకి తృణప్రాయం. తన కూతురికి జరిగిన అన్యాయానికి తోడు భర్త - తల్లిమాటా, అక్క మాటా పట్టుకుని కూతురికి చదువుమానిపించాలనడం సహించలేని భద్రమ్మ రామబ్రహ్మాన్ని ఎదిరించి లొంగదీసుకుంది! చివరికి తన మాటే నెగ్గించుకొంది.

'పుట్టిన ఒక్క పిల్లా మోడయిపోయి, దుఃఖ దేవత లాగ వుసూరుమంటూ కళ్ళ యెదట మసులుతూ వుంటే కన్న తల్లి కడుపెంత తరుక్కుపోతుందో' ఎరిగిన భద్రమ్మ కడుపు తీపి, ఒకప్పుడు కుక్కిన పేనులా అణిగి మణిగి ఉన్న ఆమె భర్తనీ అత్తగారినీ లెక్క చేయని కొరకరాని కొయ్యగా చేసేసింది. ఆమె మాటలు రామబ్రహ్మానికి ఈటెలతో

పొడిచినట్లు వుంటాయి. ఒక క్షణంలో ఆమె తోక తొక్కిన ఊరగాంగనలాగా, మరో క్షణంలో మహిషాసురమర్ధినిలాగా అయిపోతుంది. అయినా ఆమె ప్రణయవతీ విలాసవతీ కూడా. తన మాట నేర్పుతో విలాసాలతో భర్తని స్వాధీన పరుచుకొనే చాకచక్యం కూడా ఆమెకుంది.

ఇక రామబ్రహ్మం సెమీ గ్రాడ్యుయేటయినా చిన్నప్పటి నుంచీ తల్లి చెప్పు చేతల్లో పెరగడం వల్ల ఆమె ఆజ్ఞలకు బద్ధుడై ఉండటం అలవాటయిందతనికి అతను తల్లికి విధేయుడవడం చేత భార్యకి కూడా విధేయుడయి ఉండే ధోరణే అబ్బింది. అందువల్ల అతడు స్వాతంత్రుడూ, వ్యవహర్తా కాలేకపోయాడు. అటు మాతృ వాత్సల్యమూ, ఇటు భార్య ప్రణయమూ పుష్కలంగా లభిస్తున్నా, మొదట నుంచీ అతనికి 'తల్లి' అన్నా భయమే. పెళ్ళామన్నా ఒణుకే. తల్లినీ కాదన లేక భార్యనీ ఎదిరించలేక వారి మధ్య నలిగిపోయిన వ్యక్తి రామబ్రహ్మం.

వితంతు పునర్వివాహం సంస్కరణాశయంతో వ్రాసిన శాస్త్రిగారి కథలలో విరుద్దత తత్త్వాలు గల పాత్రల భావ సంఘర్షణకు అత్యధిక ప్రాధాన్యం లభించిన కథ ఇది.

"సుందరి వివాహానికి భద్రమ్మ ఆఖరున వేసిన బీజము - మాట మాటలోను ఉత్తమ నాటకాలలోని వ్యంగ్య వైభవాన్ని తలపులోకి తెస్తూ రాబోయే అవస్థను తెలుపుతాయి."

**కథా ఉద్దేశ్యం :**

పిల్లల శ్రేయస్సు కాంక్షించని ముసలివాళ్ళ అభిప్రాయాలు నిష్ప్రయోజనాలు అనేది ఉద్దేశ్యం.

**'తల్లి ప్రాణం' కథ పై సంస్కరణోద్యమ ప్రభావం :**

ఈ కథలో భద్రమ్మ వంటి వారు పూర్వమూ నేడూ  కూడా చలా అరుదుగా కనబడుతారు. భద్రమ్మ పాత్రను బట్టి ఈ కథలో చైతన్యమూ, సంస్కరణమూ పుష్టిగా ఉన్నట్లు తెలుస్తుంది. వితంతువైన కూతురి జీవితాన్ని చక్కదిద్దేందుకు భద్రమ్మ భర్తను అత్తను కూడా ధిక్కరించి తన కూతురి శ్రేయస్సే ముఖ్యమని నిరూపించింది. ఇటువంటి వాళ్ళు ఈ కాలంలో సైతం అప్పుడప్పుడు మాత్రమే కనబడతారు. ప్రస్తుత కథ 'తల్లి ప్రాణం' వితంతు పునర్వివాహాన్ని ప్రోత్సహించినట్లు ఋజువు చేయబడింది. కనుక 'తల్లిప్రాణం' కథపై సంస్కరణోద్యమ ప్రభావం శక్తివంతగా పని చేసినట్లు చెప్పొచ్చు.

## 17. ఘటన

వరకట్న దురాచారాన్ని నిర్మూలించేందుకు యువతులే నడుం కట్టి ఉద్యమించిన వైనాన్ని తెలియజేసే కథే 'ఘటన.'

**'ఘటన' కథ సంక్షిప్త పరిచయం :**

సుభద్ర తండ్రి పెద్దల్లుడు లాగానే కాబోయే రెండో అల్లుడు కూడా ఉద్యోగస్తుడై ఉండాలనే ఉద్దేశ్యంతో సుభద్ర ఇష్టాన్ని పటించుకోకుండా కల్లూరి వారి సంబంధాన్ని కాయం జేస్తాడు. సుభద్రకు మాత్రం ఆ ఊరికి చెందినవాడు రెండో పెళ్ళివాడు అన్ని విధాలా యోగ్యుడైన కిరీటిరావుపైనే ఉంటుంది మనసంతా.

అంతలో పెళ్ళికి తరిలి వస్తారు మగ పెళ్ళివారు. మంగళ స్నానాలు పూర్తయిన తర్వాత సభాపతిగారికి ఇవ్వవలసిన కన్యావరణలా, సభాకట్నాల విషయంలో గ్రామస్తులకీ పెళ్ళికొడుకు తరుపు పెద్ద (పెళ్ళికొడుకు మాతామహుడు) యాజులకీ పుట్టింపుల వచ్చి మనస్పర్థలు ఏర్పడతాయి.

పట్టింపులతో సుముహూర్తం దాటిపోయే పరిస్థితి ఏర్పడుతుంది. పెళ్ళి కొడుకు తరుపున వచ్చిన పెద్ద కరణం (ముస్సద్దీ) కలగజేసుకొని యుక్తులు కురిపిస్తూ, ఏర్పడిన ప్రతిష్ఠంభనను తప్పించే ప్రయత్నంలో ఉండగా, సంస్కరణా భావాలుకల సిస్టర్ జానకీదేవి కొందరు యువతులను వెంట పెట్టుకుని వచ్చి "వరకట్నం ఇవ్వడం చట్టవిరుద్ధం శిక్షార్హమైన నేరం" అని కన్యాదాతనీ, పెళ్ళికొడుకు తాతని నిలదీస్తుంది. "మొగుణ్ణి కొనుక్కోవడం నాకిష్టం లేదు" అంటూ పెళ్ళికూతురు సుభద్ర నిక్కచ్చిగా తేగెసి చెప్పేస్తుంది. లేచి వెళ్ళిబోతున్న పెళ్ళికొడుకు తండ్రితో పుచ్చుకొన్న పదివేల రూపాయల కట్నాన్ని "ముందు అక్కడ పెట్టి మరీ కదులు" అని నిస్సందేహంగా అంటుంది. పెళ్ళికి హాజరైన ఉన్నతోద్యోగుల్ని, పెద్దల్ని సాక్ష్యులుగా కోర్టుకు రావలసి ఉంటుందని గట్టిగా హెచ్చరిస్తుంది. ఆ శుభముహూర్తానికి పెళ్ళి జరగలేదు కానీ ఉదయం ముహూర్తానికి సుభద్ర మనసుపడిన కిరీటిరావుతో కానీకట్నం లేకుండా జానకీదేవి వివాహాన్ని జరిపించినట్లు ఆంధ్రపత్రికలో వార్త వస్తుంది. కథ ముగుస్తుంది.

వరకట్న దురాచారాన్ని నిర్మూలించడానికి స్త్రీలే నడుం కట్టి ముందుకు నడవాలని సిస్టర్ జానకీదేవి వంటి తిరుగుబాటు పాత్ర ద్వారా రచయిత మహిళా లోకాన్ని ఉత్సాహపరిచారు.

వైదిక బ్రాహ్మణ కుటుంబాలలో వివాహ సమయంలో వచ్చే పట్టింపులూ, సంప్రాదాయాలు, మర్యాదలూ నియమాలు, సభాపతుల కీయవలసిన కన్యావరణలూ సభాకట్నాలూ, వాటిలోని ఔచిత్యాలూ కథలో ఎంతో విపులంగా చర్చించారు. వివాహ సంప్రదాయాలతో శాస్త్రిగారికి గల విశేష పరిచయాన్ని ఈ కథ అద్దంపడుతుంది. వైదిక

సంభాషణలతో పలుకుబళ్ళతో నిండిన సంభాషణలు కథకి చక్కని వాతావరణాన్ని కల్పించాయి. వితంతు పునర్వివాహ విషయంలోనే కాక వరకట్న నిర్మూలన విషయంలో కూడా రచయిత సంస్కార భావాలని చాటుతుందీ కథ.

**కథా ఉద్దేశ్యం :**

ఒకప్పుడు కన్యాశుల్కం విజృంభించింది. క్రమేపే దాని ప్రాబల్యం అంతరిస్తూ వచ్చింది. ఇప్పుడు దాని స్థానంలో వరకట్నం పుట్టుకొచ్చి సమాజాన్నేలుతుంది. ఎంతో మంది ఆడవాళ్ళని బాధిస్తుంది. అసలు కన్యాశుల్కాలు, వరకట్నాలు వుండకూడదనేదీ ఉద్దేశ్యం.

**'ఘటన' కథ పై సంస్కరణోద్యమ ప్రభావం :**

ఈ కథ వరకట్న దురాచారాన్ని నిర్మూలించే ఉద్దేశ్యంతో రాయబడింది. కన్యాశుల్కం అంతరించిన తరువాత దాని స్థానంలో చేరిన వరకట్నం ఎంతోమంది స్త్రీల జీవితాలను నిర్దాక్షిణ్యంగా కొల్ల గొట్టేస్తుంది. నేడు ప్రతిరోజూ ఈ దురాచారానికి బలైన స్త్రీలను గురించి ఎక్కడోకక్కడ వింటూనే ఉన్నాం. ప్రస్తుత కథైన 'ఘటన'లో కనిపిస్తున్న సిస్టర్ జానకీదేవి వంటివారు సమాజాని కెంతో అవసరం. ఆమెలో ఉన్న చైతన్యాన్ని ఇతర స్త్రీలలో కూడా కలిగించి సమాజాన్ని చైతన్యపరిచే ప్రయత్నం చేశాడు రచయిత. సిస్టర్ జానకీదేవి ద్వారా మహిళలందరిలో చైతన్యం తీసుకొచ్చేందుకు రచయిత కృషి చేసినట్లు మనకి తెలుస్తుంది. కనుక సంస్కరణలో వరకట్న నిర్మూలన కూడా ఒక అంశం కాబట్టి దాన్ని నిర్మూలించే కథగా దీన్ని గుర్తించాం కనుక 'ఘటన' కథ పై సంస్కరణోద్యమ ప్రభావం బలంగా పని చేసిందని చెప్పాలి.

## 18. అరికాళ్ళ కింద మంటలు

ఒకప్పటి బ్రాహ్మణ కుటుంబాలలో ఇల్లు పట్టిన బాలవితంతువులు అనుభవించిన దుర్భర, దారిద్ర్య దయనీయ దురావస్థను కరుణరసాత్మకంగా చూపించిన కథే 'అరికాళ్ళ కింద మంటలు'.

**'అరికాళ్ళ కింద మంటలు' కథ సంక్షిప్త పరిచయం :**

తెల్లవారుజామున లేచినప్పటి నుండీ ఇంట్లో పెద్దవాళ్ళూ, చిన్నవాళ్ళూ లగాయించి "మా పనులు ముందు చెయ్యి, అంటే మా పనులు ముందు చెయ్యి" అంటూ పోరు పెడుతుంటారు రుక్కమ్మను. ఎవరి పని ముందు చెయ్యకపోయినా ఆ పనిగల వాళ్ళకు

కోపమే. చేజేతులారా ప్రాణం తీసుకోలేని దుస్థితి రుక్కమ్మది. ఇంటిలో ఒక్కరికైనా జాలీ, దయా ఉండవు ఆమె పట్ల.

"తల చెడ్డ వాళ్ళింటో వుండగా పుని స్త్రీ పడుచు మడి కట్టుకోడం మేమిపోయ్?" "తల అంటుకోనా దువ్వుకోనా, జడ వేసుకోనా యింకెందుకోయ్ దానికా దిక్కుమాలిన జుట్టు? "....... అది చేసిన వంట నన్ను తినమంఛావా యేవిపోయ్!" "యెల్లుండి దశమినాడు మంచిదన్నారు. కోటిలింగానికి వెడితే వొక్క నిమిషం పని" "మొగుడు చచ్చిన పడుచు పిల్లలికి మంచి రోజులుకావివి. మొన్ననే వీరేశలింగం తోటలో వొక వెధవ పెళ్ళి అయిందట. ఇంకా నలుగురు వెధవ కొడుకుల కోసం వెతుకుతున్నారట ముండల్ని తోటలో వాళ్ళు..... తరువాత యేమనుకున్నా యిక కలిసిరాదు సుమా." "రేపులేదెల్లుండి దశమీ బుధవారం తప్పదు. నీకిదే చెప్పడం ఏమనుకున్నావో" అంటూ మనవరాలు రుక్కమ్మకి జుట్టు తీయించుమని అల్లుణ్ణి (రుక్కమ్మ తండ్రిని) తొందర పెట్టేస్తుంది ముసలమ్మ (అరికాళ్ళ కింద మంటలు)."

అన్ని రకాలుగా ఇంటిలో అందరూ ఆమెకు అరికాళ్ళ కింద మంటలు పెట్టి నిలవనివ్వకుండా చేస్తుంటే తెగించి అర్థరాత్రి జట్కా బండివాడి సహాయంతో రుక్కమ్మ వీరేశలింగం పంతులుగారి తోటకి వెళుతుంది. తన స్థితి దుర్భరమని తెలుసుకున్న రుక్కమ్మ అలా చెయక తప్పలేదు.

కొన్ని బ్రాహ్మణ కుటుంబాలలో ఇల్లు చేరిన బాలవితంతువులను పని మనుషుల కన్నా దారుణంగా ఎలా చూసేవారో ముసలమ్మలూ, తల్లులూ, అక్కలూ, చెల్లెళ్ళూ, తమ్ముళ్ళూ యెంత లోకువ చేసేవారో కళ్ళకు కట్టినట్లు వాస్తవానికి దగ్గరగా చూపించాడు రచయిత.

"మేఘాల మీద యెగిరిపోయింది జట్కా. మళుపు కూడా తిరిగేసింది." -అనే వాక్యాలు రుక్కమ్మ జీవితం కొత్త మలుపు తిరగడాన్ని సూచిస్తాయి.

కన్నవారూ, కావలసిన వారూ రుక్కమ్మ పట్ల కటికి తనం చూపగా, చెప్పకుండానే ఆమె దయనీయ స్థితిని అర్థం చేసుకున్న జట్కా బండివాడు ఎంతో కనికరంతో "పంతులుగారి తోటకయితే నాకేమీ యివ్వనక్కర్లేదు తల్లీ" అంటూ "అక్కడికి వెళ్ళీ వెళ్ళగానే ఆయనకు మీకు పెళ్ళయి పోతుందండి .........." "మీరు పుణ్యం చేసుకున్నారు. ఏమీ భయపడకండమ్మాయిగారు, ఇక మీకు సుఖమేగాని కష్టం లేదండమ్మాయిగారు......" అని ధైర్యోత్సాహాలు కలిగించి ఆమెకు బతుకు పై ఆశ చిగురింపజేస్తాడు.

శాస్త్రిగారు వ్రాసిన వితంతు పునర్వివాహ కథలన్నింటిలో వితంతు పునర్వివాహాన్ని కేవల సంస్కార దృష్టితో కాక మానవతాదృష్టితో చూచిన ఒక విశిష్ట దృక్పథం ఈ కథలో కనబడుతుంది. వితంతువుల కడగండ్లను వివరిస్తూ వారి పునర్వివాహావశ్యకతను చాటి చెప్పే అనేక గంభీరోపన్యాసాలు కలిగించలేని హృదయ పరివర్తనాన్ని శక్తివంతమైన ఈ సంభాషణాత్మక కథ ఒక్కటే కలిగించగలదు (అరికాళ్ళ కింద మంటలు).''

**కథా ఉద్దేశ్యం :**

పూర్వం బ్రాహ్మణ కుటుంబాలలో ఎటువంటి సాంఘిక దురాచారాలు ఉండేవో శాస్త్రిగారి కథల ద్వారా తెలుసుకోవచ్చు. బాల వితంతువుల పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో వారి రాతల్లో చూడొచ్చు. వితంతు సమస్యను రూపుమాపాలంటే ఆడపిల్లలకు చిన్న వయసులోనే పెళ్ళిళ్ళు చేయటాన్ని మానుకోవాలనేది ఉద్దేశ్యం.

**'అరికాళ్ళ కింద మంటలు' కథ పై సంస్కరణోద్యమ ప్రభావం :**

ఈ కథలో పనికిరాని ఆచారాలను పట్టుకొని వేలాడిన వాళ్ళు కనబడతారు, ఆధునికంగా ఆలోచించి జీవితంతో పోరాటం చేసిన వాళ్ళు కనబడతారు. కథలో రుక్కమ్మ పాత్ర ఎంతో చైతన్యవంతమైంది. బాల వితంతువుగా దుర్భర జీవితాన్ని అనుభవించలేక అర్థరాత్రి జట్కాబండి వాడి సహాయంతో తన జీవితంలో వెలుగును నింపుకునేందుకు సంస్కర్త వీరేశలింగంపంతుగారి తోటకు వెళుతుంది. అలా ఆమె అర్థరాత్రి వీరేశలింగంగారి తోటకి వెళ్ళిన స్ఫూర్తిని తన వంటి బాల వితంతువు లెందరో అందుకొని తమ జీవితాలను కూడా బాగు చేసుకోవాలనే సందేశాన్ని రచయిత రుక్కమ్మ ద్వారా అందించాడు. ప్రస్తుత కథ 'అరికాళ్ళ కింద మంటలు'లో బాధించబడుతున్న బాల వితంతువుకి సంస్కర్త వీరేశలింగంపంతులి ద్వారా ఉపసమనం లభించినట్లు తెలియజేయబడింది. కాబట్టి 'అరికాళ్ళ కింద మంటలు' కథ పై సంస్కరణోద్యమ ప్రభావం శక్తివంతంగా పని చేసినట్లు చెప్పొచ్చు.

## 19. కలుపు మొక్కలు:

లోకంలో పెద్ద మనుషులుగా చలామణి అవుతున్న కొందరు వ్యక్తులు ఎంతటి అవినీతిపరులూ, లంచగొండులూ అయి ఉంటారో, అలాగే సంఘంలో పతితులుగా గుర్తించే వేశ్యలలో ఎటువంటి పరోపకార బుద్ధిగల త్యాగమూర్తులుంటారో తెలియజేసే కథే కలుపుమొక్కలు.

**'కలుపు మొక్కలు' కథా సంక్షిప్త పరిచయం :**

కొడుకు స్కూలు మాస్టారుగా ఉద్యోగం కోసం జిల్లా బోర్డు ప్రెసిడెంటుకి సిఫారుసు చేసుకోవడం కోసం సబ్‌కలెక్టరుగారిని ఆశ్రయిస్తాడు ఓ ఘనాపాఠీ బ్రాహ్మడు. సిఫార్సు చేసేందుకు నాకేమీ లంచం అవసరం లేదు, పాల కోసం ఆవును తోలి పెడితే చాలు అంటాడు ఆ సబ్‌కలెక్టరు. ఇంట్లో మనవరాలికి పాలు లేకపోయినా, కొడుక్కి ఉద్యోగం దక్కితే చాలని భార్య వద్దన్నా పట్టించుకోకుండా సిఫార్సు ఉత్తరం కోసం ఆవునీ, మణుగు నేతిని సబ్‌కలెక్టరుగారికి పంపుకుంటాడు అవధాని.

ప్రెసిడెంటుగారికి ప్రత్యక్షం చేయిస్తానని అతని గుమస్తా: లంచం అందుకుని ఇంకో రూపాయి జవానుకు ఇవ్వాలంటాడు. సబ్‌కలెక్టరుకు, ప్రెసిడెంటుకు సరిపడదు కాబట్టి సబ్ కలెక్టరు ఇచ్చిన సిఫారసు ఉత్తరం పనికి రాదంటూ, "మెరక వీధిలో ఉండే దుగ్గిరాల శేషాచలం అనే వేశ్యని ప్రెసిడెంటుగారితో సరసానికి ఒప్పిస్తే చాలు" అని వెంటనే పని జరిగే పథకం చెప్తాడు అవధానికి గుమస్తా.

తనకి నచ్చకపోయినా అవధాని దుగ్గిరాల శేషాచలాన్ని కలిసి అతడు వచ్చిన పనేంటో విన్నవిస్తాడు. ప్రెసిడెంటునీ, గుమస్తానీ పశువుల కంటే అధములని తిడుతూ ఒకప్పుడు మేళానికి వెళితే ప్రెసిడెంటు తనిని బసకి రమ్మని కబురు పంపాడని చెబుతూ తాను తిరస్కరించాననీ చెప్పి "నేను శిఫారసు చెయ్యడం అంటే యేమిటో తమకిప్పుడు బోధపడిందా?"

"తెలిసిందమ్మా."

"నేనంగీకరిస్తా ననుకోండి. అయితే అబ్బాయిగారికి ఉద్యోగం ఇవ్వడం నిరుకా?"

"అలాగే చెప్పాడు గుమస్తా."

"అంటే నా ఆత్మ ద్రోహమూ, మన ప్రెసిడెంటు పశుత్వమూ కలిస్తే వొక బ్రాహ్మణ కుటుంబానికి భుక్తి ఏర్పరుస్తాయన్నమాట. కదుటండీ?"

"........"

"కనుక బాబయ్యా, ఈ రాత్రి ప్రెసిడెంటుని తీసుకురమ్మని వూర కుక్కతో చెప్పండీ."

"అమ్మా......."

"ఒక్క దమ్మిడీ అయినా పుచ్చుకోదనిన్నీ చెప్పండి (కలుపు మొక్కలు)". అంటుంది శేషాచలం. "నేను వచ్చిన దారినే వెళ్ళిపోతాను. నువ్వు ఆత్మద్రోహానికి సిద్ధపడవద్దు" అంటూ బ్రతిమలాడతాడు అవధాని. శేషాచలం ఎంత యోగ్యురాలో తెలుసుకుని క్షమించమంటాడు.

కాని, శేషాచలం ...... "నా మూలంగా వొక వేద మూర్తి కుటుంబానికి జీవనాధారం ఏర్పడడం నా అదృష్టం. నా జీవితంలో ఇదెంతో పవిత్రమైన సంఘటన. ఇలాంటిది మళ్ళీ లభించదు. ఇంతకీ నేను పతివ్రత నెలాగా కాను. మగనాలి నంతకంటేగాను. కనక దీని వల్ల నాకిప్పుడు కొత్తగా సంభవించే పాతివ్రత్యం కూడా ఏమీ లేదు. నాకు విచారం లేదు. తమరూ విచారించవద్దు (కలుపు మొక్కలు)." అంటుంది.

సానుల్లో సంసారులకంటే మిన్నైన ఇల్లాళ్ళు, సానులయి ఉండీ పాతివ్రత్యానికి ఒరవడి పెట్టువారు వేలల్లో ఉంటారని చెపుతుంది శేషాచలం.

తెనుగు రక్తం చప్పబడిపోతూ వుంది- కలుపు మొక్కలు " 'తెనుగు రక్తం చప్పబడిపోతూ వుంది' అనే శీర్షికతో మొదట 'ప్రబుద్ధాంధ్ర' పత్రికలో ప్రకటించిన కథలో చివరి (5వ) ప్రకరణాన్ని పూర్తిగా మార్చి కథకి 'కలుపు మొక్కలు' అనే పేరు పెట్టారు రచయిత. ఆ మార్పులివి :

మొదటి కథలో వేశ్య పేరు 'ఆణిముత్యం' 'కలుపు మొక్కలు'లో దుగ్గిరాల శేషాచలంగా మారింది.

అవధాని కొడుకు తనకు ఆణిముత్యం (వేశ్య) సిఫార్సు వల్ల వచ్చిన ఉద్యోగం 'మూడు నెలల సెలవులో వచ్చిన కాళీ అనీ, రెండు సంవత్సరాల కాళీ మూడు వందలు లంచం ఇచ్చిన వారికి దక్కిందనీ, నెలకి పాతిక రూపాయల జీతం గల మూడు మాసాల కాళీలో సెలవు పెట్టిన ఆయన సెలవు ఉపసంహరించుకుని పనిలో చేరిపోవడం వల్ల అది లేకుండా పోయిందనీ, బోలెడు డబ్బు ఆవూ లంచం రూపేణా పోవడమేగాక, నీతిగా బతికే 'ఆణిముత్యం' వ్రతభంగానికి సిద్ధపడిందనీ, ఉద్యోగం చేయనంటే విన్నారుకాదనీ, నలుగురికీ ఉపకరించేవన్నీ మంచి వృత్తులే గనుక కాఫీ హోటలూ, భోజన హోటలూ పెడతానంటాడు తండ్రితో అదేం పనిరా పూటకూటిల్లా?' అంటాడు తండ్రి - 'నా వుద్యోగం కోసం నువ్వు చేసిన పనులు అంతకంటె మంచివా నాన్నా? అని ఎదురడిగి 'దేశ దేశాల వాళ్ళు మన దేశం వచ్చి హోటళ్ళు పెట్టి లక్షాది కారులవుతుండగా మన తెలుగు కుర్రాళ్ళ దూరం యోచించ లేక దిక్కు మాలిన నౌకరీల కోసం యెగబాకుతున్నారు. పైగా ఆ విజాతీయ పదార్థాలు తినడం వల్ల తెనుగు రక్తం చప్పబడిపోతోంది కూడానూ' అంటాడు కొడుకు. ఇదే మొదటి కథకు ముగింపు.

కలుపు మొక్కలు పేరుతో సవరించిన ఈ కథలో భోజన హోటల్ పెట్టే విషయం పూర్తిగా తొలగించి ప్రెసిడెంటుగారి గుమస్తా ఉద్యోగాలిప్పించడానికి రోడ్డు కంట్రాక్టు

లిప్పించడానికి పార్టీలతో బేరమాడుకొనే లంచాల విషయం సంభాషణగా నడిపించారు. నెలకి పాతిక రూపాయల జీతం వచ్చే రెండునెలల కాళీ మేష్టరీ ఉద్యోగం అవధానిగారబ్బాయికి సిఫార్సు కోసం వేశ్య శేషాచలాన్ని ఏర్పాటు చేయించానని గుమస్తా అనగానే ప్రెసిడెంటు "ఇక ముందు నువ్వు సంతకం పెట్టమన్న చోట "యేమి" టని అడక్కుండా చూడకుండా సంతకం పెడతాను సరా?....." అంటాడు. రాత్రి ఎనిమిదిన్నరకి శేషాచలం ఇంటికి వెళ్ళడానికి సిద్ధంగా ఉండమని ప్రెసిడెంటుతో చెబుతాడు గుమస్తా. ఇది కథకి ముగింపు (కలుపు మొక్కలు)."

**కథ ఉద్దేశ్యం :**

దేశంలో అన్యాయం అవినీతి, అక్రమాలు లంచగొండితనం నానాటికి పెచ్చు మీరిపోతున్నాయి. వీటికి రాజకీయాలు ఆద్యం పోస్తున్నాయి. దేశం సుభీక్షంగా వుండాలంటే లంచగొండినతం ఉండకూడదనేది ఉద్దేశ్యం.

**'కలుపు మొక్కలు' కథ పై సంస్కరణోద్యమ ప్రభావం :**

ఏ వ్యవస్థలో చూసినా అన్యాయం, అవినీతి వాటి ప్రతాపాన్ని కనబరుస్తున్నట్లు మనం గుర్తించవచ్చు. ఇక ప్రభుత్వ వ్యవస్థల గురించైతే చెప్పినవసరం లేదు. ఏది పొందాలన్నా, ఏం చేయాలన్నా లంచాన్ని రుచి చూడందే ఇసుమంతన్నా ఆశక్తి కనబరచరు అధికారులు. ప్రస్తుత కథ ద్వారా సుబ్రహ్మణ్యశాస్త్రిగారు ఆ సంఘటనను ఆధార పూర్వకంగా నిరూపించారు. కొడుక్కి మాస్టారు ఉద్యోగం కోసం జిల్లా బోర్డు ప్రెసిడెంటునూ సబ్ కలెక్టరునూ కలిస్తే ఒకరేమో లంచం అవసరం లేదంటూనే ఆవునూ మణుగు నేతిని కోరితే మరొకరు స్త్రీమానాన్నే కోరతాడు. వీరిద్దరి కంటే ఉత్తమురాలైన దుగ్గిరాల శేషాచలం అనే వేశ్య ఓ ఘనాపాఠి అవధాని కుటుంబానికి జీవనాధారం కల్పించేందుకు తనను కావాలనుకున్న ప్రెసిడెంటుకు మానాన్ని అప్పగించేందుకు సిద్ధపడినట్లు చిత్రించి రచయిత ప్రజలందరినీ ఆలోచింప చేయించాడు. ఒక కుటుంబ శ్రేయస్సును కోరుకుంటున్న వేశ్య తన జీవితాన్ని బలి చేసుకోవడానికి సైతం వెనుకాడలేదంటే ఆమెలో గల ఔనత్యాన్ని మనం అర్థం చేసుకోవాలి.

సంఘంలో పేరుకుపోయిన అవినీతిని ఈ కథలో నీతి పరురాలైన వేశ్య శేషాచలం దుయ్యబడుతుంది. నాగరిక సంఘ జీవితానికి ఈ కథ ఒక చెంపపెట్టు సబ్ కలెక్టరూ, జిల్లా బోర్డు ప్రెసిడెంటు, అతని గుమస్తా వీరు ముగ్గురూ సంఘ జీవితంలో కలుపు మొక్కలు.

అటువంటి కలుపుమొక్కల వంటి వారిలో మార్పును ఆలోచననూ చైతన్యాన్ని కలిగించే ఉద్దేశ్యంతోనే రచయిత సుబ్రహ్మణ్యశాస్త్రిగారు ఈ కథ రాయడం జరిగింది. కాబట్టి సంస్కరణోద్యమ లక్ష్యం కూడా సమాజంలో మార్పు, చైతన్యం, పరివర్తన కలిగించుడమే కాబట్టి అటువంటి భావాలు పుష్టిగా గల 'కలుపు మొక్కలు' కథపై సంస్కరణోద్యమ ప్రభావం శక్తివంతంగా పని చేసిందని చెప్పొచ్చు.

## 20. ఇలాంటి తవ్వాయి వస్తే.....?

అంటరానితనం నిర్మూలించాలని చెప్పే పెద్దలకు వాస్తవ దృక్పథం లేదనీ, అందులో చాలామంది కీర్తి కోసం, ఓట్లకోసం ముందుకు వచ్చారేగాని అస్పృశ్యతను నివారించడం వారి ధ్యేయం కాదని నిరూపించిన కథే 'ఇలాంటి తవ్వాయి వస్తే.......?'

**'ఇలాంటి తవ్వాయి వస్తే.......?' కథ సంక్షిప్త పరిచయం :**

అస్పృశ్యులుగా గుర్తించిన మాల మాదిగలు క్రైస్తవ మతంలో ప్రవేశించినా సాంఘికంగా వారి స్థితి బాగుపడలేదనే అభిప్రాయాన్ని సహేతుకంగా నిరూపించారు రచయిత.

ఒక గ్రామంలో చెరువు నీటికోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్న సవర్ణులు, అంటరానివారు ఈ కథకి వస్తువులు.

ఆ ఊరు ఎనభై ఇళ్ళు గల వెలనాటి బ్రాహ్మణాగ్రహారం. అందులో రెండు చెరువులుంటాయి. ఒకటి మాదిగలకూ, రెండోది మిగతా అన్ని కులాలవారికి. మాదిగల చెరువులో కుష్ఠురోగి పడి చావడంతో వారికి నీటి సమస్య ఏర్పడుతుంది. సవర్ణులు వారి చెరువులో మాదిగలకు అవకాశం ఇవ్వరు. మతం వేరైనా తురకలు మాత్రం సవర్ణుల చెరువులో చెరువు నీళ్ళ యదేచ్ఛగా వాడుకోవచ్చు. మిషనరీ వారు మాదిగ పల్లెలో కొందరికి క్రైస్తవ మతాన్ని ఇస్తారు. మతం పుచ్చుకున్న ఆ మాదిగలు మెరుగుదల లేకుండా పూర్వంలానే వుంటారు. మతం మార్చినా వారిని ఆ గూడేల నుంచి మాత్రం మార్చలేదు మిషనరీలు. వారికి సవర్ణుల మధ్య తిరిగే అవకాశాన్ని కూడా కల్పించలేదు. తమతో బంధుత్వాన్ని కూడా కలుపుకోలేదు మిషనరీలు. బ్రాహ్మణుల కంటే దారుణంగా మాదిగలను "అక్కడే - అక్కడే" అంటూ దూరదూరంగా వుంచుతున్నారు వారు. మతము, పేరు మార్చుకున్న క్రాఫింగ్ పెట్టుకున్న కిరస్తానీ పంతులు కూడా బ్రాహ్మలు కనబడితే ప్రక్కకు దూరంగా తప్పుకోవలసి వస్తుంది.

ఆ ఊరికి కొత్తగా బదిలీ అయివచ్చిన కిరస్తానీ పంతులు మంచి ఘటికుడు. బుర్ర దింపుకుపోయే రకం కానేకాదు. మాదిగల మాట ఎట్లా వున్నా, పెద్ద చెరువులో తురకలు

దిగితే మెదలని సవర్ణులు, కిరస్తానీలను అందులోనూ చదువుకున్న అతన్ని సైతం దిగనివ్వకపోవటాన్ని చూసి ఎంతో బాధ కలుగుతుంది.

"ఎప్పుడో యిక్ష్వాకులనాడు రాజ్యాధిపత్యం చెలాయించి వుండిన యిస్లాము మతానికా గౌరవం యేమిటి, యిప్పుడు రాజ్యాధిపత్యం చెలాయిస్తూనే ఉండిన క్రైస్తవ మతానికీ అగౌరవం యేమిటి?" అని యెన్నోమాట్లు తర్కించుకుంటాడతను.

అలా తర్కించుకున్నప్పుడల్లా, మిషనరీల ప్రవృత్తే తమ ఈ దౌర్భాగ్యానిక్కారణం అన్నట్లు తోస్తూ వచ్చిందతనికి (ఇలాంటి తవ్వాయి వస్తే.....?)."

ఇస్లాం మతంలో కలిసినా హిందువులు హిందువులను విడిచి దూరంగా పోలేదు. అలా కలిసిన వారిలో పంచములు ఉన్నాగాని వారు హిందువులను విడిచిపెట్టి దూరంగా పోలేదు. హిందువులుగా ఉన్నప్పుడు బ్రాహ్మడు - క్షత్రియుడు - వైశ్యుడు - శూద్రుడు - చాకలి - మంగలి - మాల - మాదిగ - ఇలా విడివిడిగా వున్న వారంతా ఇస్లాం మతం పుచ్చుకోగానే ఒక్కటైపోతారు. కేవలం మిషనరీలే ఇస్లాం వారితో ఐక్యం కాలేదుగా. వాళ్ళలో వాళ్ళకి ఎలా కుదురుతుంది ఆ ఐక్యత? ఇదంతా ఏమిటనే ప్రశ్నకు జవాబు దొరకదు అతనికి. హిందువులు తనకి హైందవ జాతీయత ఇవ్వలేదనుకున్న మరి మిషనరీలన్నా ఇచ్చారా తమ జాతీయత? వాళ్ళదొక కొత్త జాతి. పునాది వుందా దానికి? ఎన్నిసార్లు తర్కించుకున్నా రాజకీయం వరకేగాని ఆధ్యాత్మికంగా అతనికి అస్తిత్వం కోల్పోయినట్లు అనిపిస్తుందతనికి. అనుబంధమేకాని ఆత్మీయత కరువైనట్లు అనిపిస్తుందతనికి.

ఆ ఊళ్ళో పెద్దలు చెరువు నీళ్ళు, మాదిగలు వాడుకోవడానికి అవకాశం ఇవ్వలేదు. రాయబారానికి వెళ్ళిన కిరస్తానీ పంతులిని హేళన చేస్తారు. సాయం చేయమని తాలూకా కాంగ్రెస్ సంఘాధ్యక్షునికి కలుస్తాడు పంతులు.

"కాంగ్రెస్సులో చేరని వారి విషయమై పని చెయ్యడం మాకెలా వీలు మరి? ముందు మీరూ మీ వూరి హరిజనులూ అందరూ కాంగ్రెస్సులో చేరండి..... ఇదిగో రశీదు బుక్కు.....పాతిక రూపాయలు మాత్రం నా చేతికిచ్చెయ్యండి మీరు.....మీఫోటో పత్రికల్లో పడాలంటే మీకు మరో దారేదీ?..... నాకీ పదవి రావడంతోనే మీకిలాంటి చిక్కురావడం నా అదృష్టం.....విషమ సమస్యగా మార్చేస్తాను చూసుకోండి దీనిని" అంటూ కాంగ్రెసు సంఘ అధ్యక్షుడు చెప్పగా పంతులు చూపులు చెదిరిపోతాయి.

అతడి సమస్యకు పరిష్కారం చూపమంటూ దానికి తోడ్పాటును అందించమంటూ హరిజన సేవక సంఘాధ్యక్షుణ్ణి కూడా కోరతాడు కిరస్తానీ పంతులు. ఖద్దరు కట్టి, హిందీ

నేర్చుకుంటేనే తప్ప హరిజనులకు ముక్తిలేదనీ, అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న కాంగ్రెస్ అగ్రవర్ణాలవారి ఓట్లు సంపాదించాలంటే అల్ప విషయాలలో కలిగించుకోకూడదనీ, కాంగ్రెసు వారికి ఓట్లేసి ఎన్నుకోవడం ఒక్కటే తక్షణ కర్తవ్యమనీ, ఏ పోరంబోకు భూమిలో చెలమ తీసుకున్నా కావలసినన్ని మంచినీళ్ళు దక్కుతాయి కనుక తగాదా వద్దంటూ ఆ హరిజన సంఘాధ్యక్షుడు పంతులుకు సలహా చెప్పి పంపిస్తాడు.

పంతులు మాదిగ పెద్దలని సంప్రదిస్తాడు. విస్సన్న అనే మాదిగ గ్రామ నౌఖరు కరీమ్ అనే ముస్లీం యువకుని ప్రోత్సాహంతో ఇస్లాం మతం తీసుకుని 'ఇస్మాయిల్'గా మారి కరణంగారింట్లోకి వెళితే "వాడు తురకమతంలో కలిశాడు. ఫరవాలేదులే" అంటూ కరణంగారూ ముసలమ్మా సరిపెట్టుకుంటారు. బ్రాహ్మలంతా స్నానాలాడే చెరువులో అందరూ చూస్తుండగానే కరీమూ, మతాన్ని మార్చుకున్న ఇస్మాయిల్ (మాదిగ విస్సనా) ఒకేసారి గభీమంటా చెరువులో దూకుతారు. వారి వెనకే మాదిగలంతా వరస కట్టడంతో బ్రాహ్మలు ఇకచేసేది లేక దిక్కులు చూస్తూండిపోతారు.

అంటరాని తనమైన సాంఘిక దురాచారానికి రచయిత ఈ కథలో ఊహించని గొప్ప పరిష్కారాన్ని చూపించారు.

అంటరాని వారికి క్రైస్తవ మతం కల్పించలేకపోయిన ఔన్నత్యాన్ని ముస్లీం మతం ఎలా కల్పించిందో తెలియజేసిందీ కథ.

**కథా ఉద్దేశ్యం :**

కుల వివక్షత అనేది ఎన్నో అనర్థాలకు ఇంకెన్నో విధ్వంసాలకు కారణం అవుతుంది. కాబట్టి కులవివక్షత చూపకూడదనేది ఉద్దేశ్యం.

**'ఇలాంటి తవ్వాయి వస్తే...?' కథ పై సంస్కరణోద్యమ ప్రభావం :**

ఈ కథ సున్నితంగా కనబడుతున్నా జటిలమైన సమస్యకు గొప్ప పరిష్కారాన్ని చూపించింది. కథలో జరిగిన సంఘటన వంటి సంఘటన నిజజీవితంలో ఎక్కడోకక్కడ, ఎప్పుడొకప్పుడు మనం వినే వుండుంటాం. ఇటువంటి సున్నితమైన సమస్యలు ఒక్కొక్కప్పుడు ముదిరి యుద్ధ వాతావరణాన్ని తలపిస్తాయి. ఐతే రచయిత సమస్యను తెలివిగా సర్దుబాటు చేసేందుకు మత మార్పిడి చేయించి చెరువులో దూకినట్లు చిత్రించి సమస్యను ముదరనీయకుండా అదుపు చేసాడు. మాదిగలకు నీరు ఇవ్వటం బ్రాహ్మలకు ఇష్టం వుండదు. వారికని కేటాయింపబడిన చెరువులో కుష్ఠురోగి చస్తాడు. నీళ్ళులేక అవస్థలు

పడలేక పరిష్కారం దొరకక ఇక్కట్లు ఎదుర్కొంటున్న విస్సన్న అనే మాదిగ గ్రామనౌకరు కరీమ్ అనే మహమ్మదీయుడి ప్రోత్సాహంతో ఇస్లాం మతం పుచ్చుకొని 'ఇస్మాయిల్'గా మారి వారిద్దరూ కలిసి బ్రాహ్మలందరూ చూస్తుండగానే చెరువులో దూకుతారు. వారి వెనకాల మాదిగలంతా చెరువులో దిగుతుండడంతో బ్రాహ్మలంతా ఆ సంఘటనను నిర్ఘాంతపోయి చూస్తుండిపోతారు. దీనిని బట్టి ఒక్కరిగా సాధించలేనిది ఏదైనా సమూహంగా సాధించవచ్చని నిరూపించాడు. బ్రాహ్మలకి మత మార్పిడి మహాపాపం కానీ హరిజనులు ఏ మతంలో శ్రేయస్సు వుంటుందో, ఏమతంలో భద్రత వుంటుందో ఆ మతాన్ని తీసుకోవడానికి ఏ మాత్రం నిరాకరించరని ఈ కథ ద్వారా తెలిపి తానేంటో నిరూపించుకున్నారు.

"ఈ ఆలోచన రేపే గుణంలో ఉపదేశానికి లేని శక్తి ఉంది. అస్పృశ్యతా నివారణకుగాను చేసిన ఉపదేశం అంతా చెయ్యలేని పని శాస్త్రిగారి కథ ఒక్కటే చేస్తుంది. ఉపదేశం మన వ్యక్తిత్వాన్ని పరాభవిస్తుంది. ఆలోచన రేపే గుణం వ్యక్తిత్వాన్ని నిద్రలేపుతుంది." మార్క్సిస్టు సాహిత్య పరిచయం లేకపోయినా జీవిత సత్యాన్ని ఈకథలో ఎంతో నిపుణంగా చిత్రించారు రచయిత. ఇది శాస్త్రిగారి అభ్యుదయ కథలలో గణింపదగిన కథ (ఇలాంటి తవ్వాయి వస్తే......?)."

ఇది సామాజిక సమస్యకు సామూహిక సమస్యకు కూడా గొప్ప పరిష్కారాన్ని అందించినట్లు భావించాలి. కనుక 'ఇలాంటి తవ్వాయి వస్తే...?' కథ పై సంస్కరణోద్యమ ప్రభావం శక్తివంతంగా పని చేసినట్లు చెప్పవచ్చు.

## 3.5 గుడిపాటి వెంకటాచలం (మే 1894-మే 1979)

తెలుగు సాహిత్య ప్రపంచంలో తన మనసు సహకరించినంత కాలం తనదైన పంథాలో రచనలు చేసి ఓ ధృవతారలా ఒక్క వెలుగు వెలిగి ఆరిపోయిన రచయిత, మహా మనీషి శ్రీ గుడిపాటి వెంకటాచలం. ఈ సమాజంలో ఉన్న స్త్రీల అవస్థల్ని, సమాజపు పోకడల్ని తన రచనల్లో చేర్చి కొన్ని ప్రసంశల్ని, మరికొన్ని విమర్శల్ని, ఇంకొన్ని దూషణల్ని, మరికొన్ని బహిష్కరణల్ని చవిచూసినవాడతడు. చివరిదాకా నమ్మిన సిద్ధాంతాన్ని, చేసుకొన్న ప్రమాణాన్ని ఏ సందర్భంలోనూ తప్పకుండా జీవితాన్ని ముగించిన గొప్ప వ్యక్తి, నిరాడంబరుడు గుడిపాటి వెంకటాచలం.

గుడిపాటి వెంకటాచలం కొమ్మురి సాంబశివరావు, వెంకట సుబ్బమ్మ దంపతులకు 1894 మే 18న మద్రాసులో జన్మించారు. చలం తాతగారైన గుడిపాటి వెంకట్రామయ్య చలాన్ని దత్తత తీసుకోవడం వల్ల చలం ఇంటిపేరు గుడిపాటిగా మారుతుంది.

చలం తాతగారైన గుడిపాటి వెంకట్రామయ్య సర్వే డిపార్టుమెంటు, సెటిల్‌మెంటు డిపార్టుమెంటుల్లో పనిచేసి, సెటిల్‌మెంటు ఆఫీసరుగా రిటైర్డ్ అయ్యారు. 'దివాన్ బహదూర్ కూడా అయ్యారు.' మంచి ఆస్తిపరులు. పూర్వాచార పరాయణుడు. ఆయన కృష్ణాజిల్లా తోట్లవల్లూరు జమిందారుకి రెసీవర్‌గా కూడా పనిచేశారు. వారు పురాణాలతోనూ, బ్రాహ్మణ సంతర్పణలతో కాలం వెలిబుచ్చుతుండేవారు. రెసీవర్‌గా పదవీవిరమణ చేసిన తర్వాత తెనాలిలో స్థిరపడ్డారు.

చలం తన పుట్టుకను గురించి "మొదలంటూలేని ఈ సృష్టికైన ప్రథమ చలనం శూన్యంలో స్పందించినప్పుడు పంచభూతాలతో పాటు అవ్యక్తంగా నేనూ జన్మించాను. ఈ లక్షన్నర కోటి ప్రాణులతో కలిసి కాంతికి, శబ్దానికి, స్పర్శకి క్రమంగా స్పందించి స్పందించి వ్యక్తిత్వాన్ని ప్రతిష్టించుకున్నాను"[20] అని ఆత్మకథలో తాత్వికంగా తెలియజేశారు.

చలం చిన్నప్పటినుండే పార్శ్వపు తలనొప్పితో (Migraine) బాధపడుతూ వుండేవాడు. దానివల్ల బాల్యాన్ని ఆటపాటలకు దూరంగానే గడపాల్సి వచ్చింది. చలానికి నలుగురు తమ్ముళ్ళు, నలుగురు చెల్లెళ్ళు. తాతగారి ప్రభావం చలం మీద బలంగా పనిచేసి దైవభక్తి అలవడుతుంది. నిత్యం సంధ్యావందనాలు చేస్తూ, కులాచారాలు పాటిస్తూ, పూజా పునస్కారాలు నిర్వహిస్తూ, పురాణ శ్రవణానికి హాజరయ్యేవాడు. బడి ఎగేసి కూడా పురాణ కాలక్షేపమే చేస్తుండేవాడు. ఎంతోమంది పౌరాణికులతో చర్చలు జరుపుతుండేవాడు.

చిన్నప్పటి నుండీ కూడా చలం తన తండ్రైన కొమ్మురి సాంబశివరావు ప్రేమను చవిచూడలేదు. దాంతో చలం మనసులో తండ్రి పట్ల ద్వేషం పెరిగింది. చలం తన జ్ఞాపకాలను గురించి తన ఆత్మకథలో "నా మొదటి జ్ఞాపకం అయిదేళ్ళప్పుడు మా నాన్న నన్ను కొట్టడం, రెండో జ్ఞాపకం ఆయన నన్ను కొట్టడం, మూడో జ్ఞాపకం మళ్ళీ కొట్టడం. ఇంతకన్నా ఏదన్నా వరమడిగితే నిరంతరం, వీణ్ని కొట్టే వరమియ్యమని అడుగుతాడు. ఆ మధ్య ఓ సంవత్సరం ఆయనే చదువు చెపుతానని బడి మాన్పించాడు. పాఠాలు చెప్పమంటే - ప్రశ్నలడిగి కొట్టడం, మా నాన్న అంటేనే ద్వేషం నాకు. ఆ నాన్న నించి వీలైనంత తప్పుకు తిరిగేవాణ్ణి. ఇంట్లో దాక్కునేవాణ్ణి. ఆ ద్వేషం జీవితమంతా నిలిచిపోయింది. ఈనాటి వరకు గూడ, ఆయన్ని "నాన్న" అనిగాని, ఇంకేమనిగాని పిలిచి, ఎరుగను అంత అసహ్యం. ఎంత కొట్టినా ఇంక చాలుననిగాని, ఇంక చెయ్యననిగాని, భరించలేననిగాని నేను అనలేదు. ఊరికే ఏడుస్తాను బాధ భరించలేక. ఎంతసేపు ఏడుస్తానో చూద్దామని ఆయన పంతం పట్టి కొట్టేవాడు. అట్లా ఇద్దరికీ జన్మవిరోధ మేర్పడింది"[21] అని

చెప్తాడు చలం తన ఆత్మకథలో. అంత చిన్న వయసులోనే చలం మనసుపై ప్రభావాన్ని కనబరచిన అటువంటి సంఘటన వల్ల రాబోయే జీవితంలో ప్రేమకోసం, ప్రేమించబడగల ఆదర్శమూర్తుల కోసం చలంలో అన్వేషణ ప్రారంభమయింది. ఆ సందర్భంలో చలం "నాకెంత దిగులు పుట్టేదో! ప్రతిరాత్రి ప్రతిజ్ఞలు తీసుకొనేవాణ్ణి.

1. ఎన్నటికీ పెళ్ళి చేసుకోకూడదు.
2. పెద్దవాళ్ళు బలవంతాన చేసినా పిల్లల్ని కనకూడదు.
3. పిల్లల్ని కన్నా వాళ్ళని ఏడిపించకూడదు.
4. వాళ్ళు ఏడ్చినా, ఏమైనా సరే వాళ్ళని కొట్టకూడదు."[22]

అంటూ చలం ప్రతిజ్ఞ చేసుకుంటాడు.

చలం 'తోట్లవల్లూరులో ఉన్నప్పుడు జమీందార్ల వైభవాన్ని చవిచూశాడు. ఆ అనుభవాన్ని ఇలా తెలియజేశాడు. "మేము ఆ వూరికి Princes, గుర్రాలు, ఏనుగులు, నౌకర్లు, కృష్ణానది. దాని వొడ్డున తోటలు, ఇసిక లంకలు. ఆ లంకల్లో అడవులు. మా ఇంటి ముందే కోట. దాని వెనక అందమైన తోట, ఆ కోట ఎన్ని అంతస్తులో! పై అంతస్తులన్నీ మూసి వుండేవి. జనంలేని ఆ గదుల్లో కూచుని ఎన్ని కలలు కనేవాణ్నో. అంతఃపుర జీవితాన్ని గురించి మా పెద్దవాళ్ళ కథల ఆధారంతో, అందరు పిల్లలకి చెప్పినట్లే మాకు మా అమ్మ రామాయణం కథలు చెప్పేది. సీత ఏడ్చి ఏడ్చి భూమాతలో ప్రవేశించిందంటే, ఆ అన్యాయానికి గుంజుకునేవాణ్ణి. ఆ శ్రీరాముణ్ణి తలచుకుంటే ఈనాటికీ కోపం చల్లారలేదు.

భారతం చివర పాండవులు నరకంలో కాలారనీ, కౌరవులు సింహాసనాల మీద కూచున్నారంటే నా గుండె దహించుపోయి "ఎందుకు ఎట్లా?" అంటో మా అమ్మని ప్రశ్నలు వేసేవాణ్ణి. ఆమెకి మాత్రం ఏం తెలుసు? చివరికి భీముడు వాయుదేవుడితో కలిశాడని, అదేదో న్యాయంలాగు చెప్పేది పిచ్చి మా అమ్మ.

"కలిసి?"

"అంతే"

"అంతేనా?"

అదేం Justice అని ఎదురు తిరిగేది నా హృదయం. ఈనాటికీ ఎదురు తిరుగుతోంది."[23] అని తన ఆత్మకథలో అంటాడు చలం.

చిన్నప్పటినుండీ అనారోగ్యంగా ఉండడం వల్ల చదువుమీద ఏకాగ్రత కనపరచలేకపోయేవాడు. దానివల్ల పరీక్షలు తప్పి టీచర్లకి విస్మయం కలిగించేవాడు. మిత్రులు అతన్ని బలవంతంగా బడికి తీసుకెళ్ళేవారు. వీలయినప్పుడల్లా బడి ఎగ్గొట్టి, తండ్రి చెప్పే చదువును తప్పించుకొని, అమ్మమ్మ చుట్టుపక్కల వాళ్ళకు చెప్పే భారతాన్ని వినేవాడు. చలం తన స్కూలు జీవితంలో కూడా నిష్కారణంగా స్నేహితుల ద్వేషానికి, అసహనానికీ గురైయ్యాడని తెలియజేశాడు ఆయన ఆత్మకథలో.

చిన్నప్పటినుండీ చలానికి ఆడపిల్లలతో పరిచయం ఎక్కువ. బాల్యం నుంచే వాళ్ళపై అభిమానం చూపడం, వాళ్ళ అభిమానం పొందడం జరిగేది. హైస్కూలు చదివేటప్పుడు 12వ ఏట ఒక అమ్మాయికి ప్రేమలేఖ కూడా రాశారు చలం. చలం బాల్యప్రేమ(calf love)ను గురించిన స్మృతులు మనం "మ్యూజింగ్స్" ప్రథమ భాగంలో చూడవచ్చు. ఆడపిల్లలతో ఆయనకు గల ఆ పరిచయాలు ప్రేమలుగా మారి ఆయన జీవితంలో యదార్థ సంఘటనలుగా రూపొందాయి. "మ్యూజింగ్స్", "ప్రేమలేఖలు"లో కొన్ని కథలలో ఎదురయిన వ్యక్తులు, కొన్ని పాత్రలు అతడికి తారసపడ్డవారే. వున్నత పాఠశాలలో చదివే రోజుల్లో చలం యింట్లోనే రామాయణ భారత భాగవతాదులే కాకుండా ఆంధ్ర ప్రచారిణీ గ్రంథమాల ప్రచురణలూ, వేదం వేంకటరాయశాస్త్రి గారి గ్రంథాలూ, ప్రాచీన అధునాతన గ్రంథాలూ ఎక్కువగా చదివేవాడు.

అప్పట్లో చలానికి బాగా నచ్చిన నాటకాలు ప్రతాపరుద్రీయం, కన్యాశుల్కం. ఆ రెండింటిలోనూ అప్పుడప్పుడూ వేషాలు కూడా వేస్తుండేవారు. తానే కొన్ని నాటకాలు రాసి ప్రదర్శనలు కూడా ఇస్తూండేవారు.

అతడు ఫోర్తు ఫోరం చదువుతున్న రోజుల్లో హెన్రీవుడ్ నవల అనువాదం చేయడం ప్రారంభించాడు. ఆంధ్ర ప్రచారిణి గ్రంథమాల వారిని ప్రచురించమని అడిగితే వారు కొన్ని పేజీలు పంపమని చూసి, "ఎవరో పెద్ద రచయిత పంపారనుకొని చాలా బావుంది. ఆ పుస్తకమంతా పంపమన్నారు." అలా అతడి మొట్టమొదట రచన బావ మీద ద్వేషంతో మొదలైనట్లు తన ఆత్మకథలో చలం చెప్పారు.

బ్రహ్మసమాజ సిద్ధాంతాలకి, బ్రహ్మసమాజ బోధనలకు క్రమేపీ చలం ఆకర్షితుడయ్యాడు అని చెప్పడానికి ఆధారం వుంది. అది "1910 ప్రాంతం. మా తాతగారి యిల్లు. నాకు 16 ఏళ్ళు దాటాయి. కాకినాడ కాలేజీలో చదువుకుంటున్నాను. నేను కాకినాడ వెళ్ళినప్పటినుంచి అక్కడి బ్రహ్మసమాజం వాళ్ళతో స్నేహం చేస్తున్నాను. ఆ పుస్తకాలే

చదువుతాను. వాళ్ళ ప్రార్థనలో నేనూ కలుస్తున్నాను. నా జీవితంలోకి బ్రహ్మసమాజం ప్రోద్బలం ఎక్కువగా వచ్చింది. కాకినాడ కాలేజి ప్రిన్సిపాల్ రఘుపతి వెంకటరత్నం నాయుడు గారంటే నాకు భక్తి, ప్రేమ, గౌరవం. ఆయన వల్ల నా జీవితం నైతికంగా ఆధ్యాత్మికంగా చాలా influence అయింది. హిందుమతాచారాలు, కులభేదాలన్నా నాకు ఎంత విరోధమో! వాటిని నిర్మూలం చెయ్యాలని గట్టి నిశ్చయం యిప్పుడు. బ్రహ్మసమాజంలో లేనివారు ఎంత గొప్పవారైనా పనికిరాని వారనే నా ఉద్దేశ్యం."[24] ఆ భావాలని బట్టి సమాజానికి ఉ పయోగపడే సంస్కరణాభిప్రాయాలు ఆరోజుల్లోనే చలంలో తలెత్తాయని తెలుస్తుంది.

'1911లో చలానికి పెద్దల బలవంతం వల్ల వివాహం జరుగుతుంది. భార్య పేరు రంగనాయకమ్మ(T). ఆమె (బెజవాడ) విజయవాడకు చెందిన ఉప్పులూరి రామశేషయ్యగారి మూడవ సంతానం. ఆమె యిద్దరు సోదరీమణుల పేర్లు రంగనాయకమ్మలే. 1911లో స్కూల్ ఫైనల్ పూర్తయ్యాక చలం కాకినాడ పిఠాపురం మహారాజా వారి కాలేజీలో చేరతాడు. అప్పుడు ఆ కాలేజీ ప్రిన్సిపాల్ రఘుపతి వెంకటరత్నం నాయుడు. అతడు బ్రహ్మసమాజానికి స్తంభంలాంటివాడు. పిఠాపురం రాజు సహాయ సహకారాలతో ఆయన యెన్నో సంస్థలను స్థాపించాడు. ఆంధ్రదేశంలో అప్పట్లో 1875లో దామోదరయ్య ప్రోత్సాహం వల్ల బందరులోనూ, 1878లో వారణాసి రామబ్రహ్మం ప్రయత్నం వల్ల బాపట్లలోనూ, వీరేశలింగం కృషి వల్ల రాజమండ్రిలోనూ, నాయుడిగారి కృషి వల్ల కాకినాడలోనూ బ్రహ్మసమాజ మందిరాలు వెలిసాయి

'ఆంధ్ర ప్రదేశ్‌లో ఏర్పడిన బ్రహ్మసమాజ ప్రభావం అప్పటి ఆ సమాజ సభ్యులవల్ల వేగంగా వ్యాప్తి చెందింది. బ్రహ్మసమాజ లక్ష్యాలయిన యీశ్వర కారుణ్యం వ్యక్తమయ్యేవిధంగా గంభీరమైన ఉపన్యాసాలివ్వడం, ప్రార్థనా గీతాలు పాడడం, కులతత్వాలనూ, మూఢ సాంఘికాచారాలనూ, కట్టుబాట్లనూ అస్పృశ్యతనూ, వేశ్యా వృత్తినీ యెదిరిస్తూ వారు చిత్తశుద్ధితో, క్రమ నైతిక నిష్ఠతో ఉద్యమాన్ని నడపడం, చలాన్ని యెక్కువగా ప్రభావితం చేశాయి. చలంతో బాటు దేవులపల్లి కృష్ణశాస్త్రి వంటి ప్రముఖులు కూడా ప్రభావితులై బ్రహ్మసమాజ సభ్యులుగా చేరారు. కృష్ణశాస్త్రి బ్రహ్మసమాజ ప్రార్థనా గీతాలు కూడా రాస్తుండేవారు. చలం 'ధర్మ సాధని' 'బ్రహ్మ మెసెంజర్' మొదలయిన పత్రికల్లో వ్యాసాలు రాస్తూండేవారు. కృష్ణశాస్త్రి బ్రహ్మసమాజానికి నూతన వన్నె తీసుకొచ్చాడని చలం అభిప్రాయపడ్డాడు.'

చలం బి.ఏ. పూర్తి చేశాక రఘుపతి వెంకటరత్నం నాయుడుగారు తన కళాశాలలోనే చలానికి ట్యూటర్‌గా ఉద్యోగవకాశాన్నిచ్చారు. ఆ అవకాశంతో చలం బ్రహ్మసమాజ కార్యకలాపాలను ముమ్మరం చేశాడు. మానవ సౌభ్రాతృత్వం చలాన్ని ఎంతగానో ఆకర్షించింది. చలం, చలం స్నేహితులు అతివాదులుగా చలామణి అవుతుండేవారు. బ్రహ్మసమాజంలో చలం యజ్ఞోపవీతం తీసివేస్తే, భార్య రంగనాయకమ్మ మంగళసూత్రం తీసివేసి తన పేరు మాలతీబాయిగా మార్చుకొంది. చలాన్ని అన్నివిధాలా అనుసరించింది. స్త్రీ స్వేచ్ఛా పోరాటాన్ని చలం మొదట తన జీవితం నుండే ప్రారంభించాడు. భార్య రంగనాయకమ్మను అత్తవారింట్లో రకరకాల దాసీపనుల్ని చేయటాన్ని మాన్పించాడు. యింటికి కొంతదూరంగా వున్న తోటలో బాడ్‌మింటను కోర్టు ఏర్పాటు చేసి అందులో ప్రతిరోజూ సాయంకాలం చలం, చలం తమ్ముళ్ళూ, చెల్లెళ్ళూ, రంగనాయకమ్మ వెళ్ళి బాడ్‌మింటను ఆడేవారు. అలా ఆడటానికి వెళుతున్న సందర్భంలో యిళ్ళలో వాళ్ళందరూ వాకిళ్ళ ముందు నిలబడి వాళ్ళను వింతగా చూసేవారు. కొందరు ధైర్యం చేసి తిట్టేవారు. కొందరు వాకిళ్ళలోనే వుమ్మేసేవారు. ఈ సంఘటనలన్నీ చలానికి బ్రహ్మసమాజం పై పట్టును, అభిమానాన్ని నానాటికీ పెంచాయే కానీ ఏమాత్రం దిగజార్చలేదు. స్త్రీ స్వాతంత్ర్యాన్ని కోరి, కుల చిహ్నాలని ఛేదించి, విగ్రహారాధన తిరస్కరించి, స్వచ్ఛమైన బ్రహ్మసమాజకుడుగా చలామణి అయిన చలం తరువాత తన జీవితంలో ఎదురైన ఒక ప్రేమ సంఘటన పట్ల తనలో రగుల్కొన్న నైతికానైతిక మీమాంస కారణంగా బ్రహ్మసమాజం నుండీ బయటకొచ్చేశాడు. దానికి కారణం చలం జీవితంలోకి రత్తమ్మ ప్రవేశించడం. చలం తన శృంగార వాంఛను తీర్చుకోవడానికి ఒక స్త్రీతో తృప్తిపడక కొత్త శృంగార సంబంధాల కోసం వెంట వెంటనే తపిస్తూండేవాడు.

'చలం మొదటి సంతానమైన రవికి మూడేళ్ళ వయసున్నప్పుడు రాజమండ్రిలో వూరికి దూరంగా కంచుమర్తి వారి బంగళాలో ఉండాల్సి వచ్చింది. కానీ తరువాత అక్కడ వుండడం కూడా కష్టమనిపించి పట్టణానికి దూరంగా ఉన్న మాలపల్లిలో కాలం వెలిబుచ్చారు. ఆవిధంగా అప్పటినండే చలం సమాజం నుండీ వెలినీ, తిరస్కారాన్నీ, బహిష్కరణను చవిచూడవలసి వచ్చింది. రవి బాల్యం నుండే ఎంతో ప్రతిభావంతుడిగా కనబడేవాడు. రవి ఆరోగ్యం కోసం చలం తిరగని ప్రదేశాలు లేవు. యేడోవ ఏట నుండీ రవి గుండెజబ్బుతో అవస్థపడుతుండేవాడు. దాంతో చలం నియమాలు విడిచిపెట్టి జపాలూ, శాంతులూ చేయించేవాడు. కానీ డాక్టర్ మేజర్ నాయుడు లాంటి వారే ఏమీ చేయలేమని అనడంతో చలంలో అనంత దుఃఖం చోటు చేసుకుంటుంది. "ఈశ్వరా! మా పట్ల నువ్వు వున్నావని

ధైర్యంతో సత్యానికి లోకాన్ని ధిక్కరించి ఏకాకులమై నిలిచాం. నువ్వు వొదిలావా మమ్మల్ని నువ్వు లేవు - వుంటే ఇట్లా వొదలవు మమ్మల్ని" అని ఆక్రోశించాడు చలం. చివరకు 1929లో రవి మరణించాడు. రవి మరణంతో చలంలో నిరీశ్వరవాదం తలెత్తింది. రవి జబ్బుతో వున్నప్పుడు అతనితో గడిపిన ఆరేళ్ల వ్యధాత్మక జీవితం పూర్తి వేదనతో నిండిపోకుండా రవికీ-చలానికీ మధ్య ప్రేమైక మూర్తిగా చలం వదిన డాక్టర్ రంగనాయకమ్మ రక్షణగా నిలిచింది.

1919 రాజమండ్రిలో ఉపాధ్యాయ శిక్షణ పూర్తి చేసుకున్నాక హోస్పేటలోని మున్సిపల్ హైస్కూల్లో చలం ప్రధానోపాధ్యాయుడిగా చేరాడు. యాజమాన్యంతో సరిపడక ప్రధానోపాధ్యాయ వృత్తికి రాజీనామా చేయవలసి వచ్చింది. తరువాత ఉపాధ్యాయుడిగా, శిక్షణ పాఠశాల ఉపాధ్యాయుడుగా, పాఠశాల పర్యవేక్షకుడిగా తెనాలి, గుంటూరు, నర్సారావుపేట, బెజవాడ, కనిగిరి, విశాఖపట్టణం, ఏలూరు, భీమునిపట్నం, నూజివీడు మొదలైన ప్రదేశాలలో పనిచేశాడు.

1921 ఏప్రిల్ 13న చలం హోస్పేటలో ఉండగానే రెండవ సంతానం సౌరిస్ జన్మించింది. 'సౌరిస్' అన్నది ఒక ఆంగ్ల నవలలోని ఫ్రెంచి కథానాయిక పేరు. సౌరీస్ పై చలం ప్రభావం ఎంతో వుంది. వదిన డాక్టర్ రంగనాయకమ్మకు (వొయ్యికి) సౌకర్యంగా ఉండాలనే ఉద్దేశ్యంతో నివాసం బెజవాడ (విజయవాడ)కు మార్చాడు. డాక్టరుగా ఆమెకు ఆదాయం పెదగడంతో కుటుంబంలో ఆర్థిక సమస్యలు తొలిగి విలాసవంతమైన జీవితం ఏర్పడింది. చలం 1921లో హోస్పేటలో ఉండగానే 'శశిరేఖ' నవల రాశాడు. అప్పటికే చలం రచయితగా ఖ్యాతి సంపాయించుకున్నాడు. ముద్దుకృష్ణతో కలిసి, 'జ్వాల' అనే పత్రిక కూడా నడిపాడు. తరువాత పత్రికా సంపాదకత్వ బాధ్యతను ముద్దుకృష్ణకే వదిలి చలం వైదొలిగాడు.

చలంకు లాగానే అతడి కూతురు సౌరిస్ రచయిత్రిగా తానేంటో నిరూపించుకుంది. ఆమె 'ఆనా వీలర్', 'జీవన రాగం' అనే నవలలూ, 'సుందర్' అనే నాటకం, 'ఉష' మొదలయిన కథలూ, 'జీసస్ జీవితం' మొదలయిన ఆధ్యాత్మిక రచనలూ 'ప్రేమసందేశం', 'విరహ సందేశం' మొదలయిన భావ చిత్రాలూ, కొన్ని అధివాస్తవిక కవితలూ రచించింది. చలం చివరి దశలో సౌరిస్ సంరక్షణలోనే ఉన్నాడు.

చలం మూడవ సంతానం వసంత్‌కుమార్. వసంత్‌కి చదువు అంతగా అబ్బలేదు. అతడు కళాకారుడు, శిల్పి. చెడు స్నేహాలతో చలం పద్ధతులకు విరోధం పెంచుకున్నాడు.

తాగుడు అలవాటు కూడా వుంది. స్థిమితం అనేది లేని వసంత్‌తో చలం "ఈ జీవితం నీది. నువ్వేం చేసుకున్నా దీన్ని చేసుకో. అంతేగానీ మా కోసం నువ్వేమీ యోచించనక్కరలేదు"[25] అన్నాడు.

చలం తాను రాసిన 'బిడ్డల శిక్షణ' (1924) పుస్తకంలో పిల్లల పెంపకాన్ని గురించి, కుటుంబ జీవనంకి సంబంధించి అతడు ఏమి ఆశిస్తున్నాడో వివరంగా చెప్పాడు. అది ఆరోజుల్లో విప్లవాత్మకమైన పుస్తకంగా పరిగణించబడింది. చలం వసంత్‌కుమార్ స్వేచ్ఛకు అడ్డురాలేదు. 1947 నవంబరులో చలం యెవరి గురించో యేదో రాస్తే వసంత్ అది తనకు అనువయించుకొని అపార్థం చేసుకొని వొకరోజు వున్నట్టుండి యిల్లు వదిలి వెళ్ళిపోయాడు. తర్వాత తిరిగిరాలేదు. అతని జాడ తెలియలేదు. వసంత్ చర్యతో చలం సున్నిత మనస్తత్వం అమితంగా గాయపడింది.

చలానికి నాలుగో సంతానంగా నిర్మల జన్మించింది. బాగా తెలివైంది కూడా. ఆమె స్వతంత్రంగా మెలిగింది. బాగా చదువుకొంది. చలం మేనల్లుడికి నిర్మలకీ చనువు ఏర్పడి, ఆ చనువు వివాహం దాకా దారితీస్తే, నిర్మల నిరాకరించింది. "ఏ మొగాడికి భార్య అయ్యేట్టుగా లొంగిపోలేను ఎవరికి" అంది. చలం కూడా ఆమె ఇష్టాన్ని కాదనలేదు. రంగనాయకమ్మ మనస్థాపానికి గురయింది. పిల్లలు పెళ్ళిళ్ళు లేకుండా విచ్చలవిడిగా యెదుగుతున్నారని దిగులు చెందింది. చలం పద్ధతుల పట్ల వైరం పెంచుకుంది. నిర్మల బొంబాయిలో ఉద్యోగం చేసి రిటైర్ అయింది.

చలం అయిదో సంతానం చంపక. ఈమె ముద్దు పేరు 'పకపక'. చదువు విషయంలో చంపక అంతగా ఆసక్తి కనబరిచేది కాదు. ఆమె స్వభావం నెమ్మదత్వం. ఆమె చలం నుంచీ కారుణ్య స్వభావాన్ని, సున్నితత్వాన్ని, ప్రేమించే గుణాన్ని పుణికి పుచ్చుకుంది. 'చలం ప్రేమికుడు,' కవి అయిన రహ్మాన్ చంపకను పెళ్ళి చేసుకొన్నాడు.

చలం పెంచుకొన్న అమ్మాయి పేరు నర్తకి. నర్తకి అసలుపేరు రాజ్యలక్ష్మి. తన పదవయేట భర్తను వదిలి, చలం కుటుంబంలో ప్రవేశించిన చలం కుటుంబ భారాన్ని నిర్వహించింది. చలాన్ని చివరి క్షణాల దాకా నర్తకి సంరక్షిస్తూ వచ్చింది. నర్తకి గురించి చిన్నారావుకు వొక వుత్తరంలో

"నర్తకి ఒక్కతే నన్ను చూస్తుంది. నా బాధలకి సేవ చేస్తుంది. నా బాధంతా తనూ పడుతుంది. మొన్న ఈతకి వెళ్ళి మునిగిపోయింది. ఎవరో చూసి బయటికి లాక్కపోతే ఈసారికి నాకు వున్న ఒక్క ఆధారమూ పోయివుండును. నామీద గొప్ప జాలితో భగవాన్

నర్తకిని బతికించి నాకిచ్చారనిపించింది. కాని ఎంత షాక్ ఐనానని! ఆ నర్తకే చచ్చిపోతే ఇంక ఎవరు లేరు నాకు" అంటూ తాను నర్తకి మీద యెంత ఆధారపడ్డాడో చెబుతాడు చలం."[26]

అప్పట్లో చలం ఇంటికి దేవులపల్లి వేంకట కృష్ణశాస్త్రి, వేదుల సత్యనారాయణ, మల్లవరపు విశ్వేశ్వరరావు, జల సూత్రం, రుక్మిణీ నాథ శాస్త్రి, నండూరి సుబ్బారావు, చింతా దీక్షితులు, బి.వి. నరసింహారావు, హారీన్, శ్రీశ్రీ, మొదలైన వారు వస్తుండేవారు. సుహృద్భావ వాతావరణం ఏర్పడేది. చింతా దీక్షితులుగారు చలం మొదటి కథ 'రుక్మిణీ'ని కొడాలి ఆంజనేయులు సంపాదకత్వంలో వెలువడే 'సాహితీ'లో అచ్చయ్యేలా చూసి చలం లాంటి కథకుడిని పాఠకలోకానికి పరిచయం చేశారు. చలం జీవితంలో మరో ముఖ్య మలుపుకు కూడా చింతా దీక్షితులే కారకులయ్యారు. చలంలో ఆధ్యాత్మిక చింతన ప్రేరేపించేందుకు రమణ మహర్షి దగ్గరకు తాను వెళ్తూ చలాన్ని కూడా తీసుకెళ్ళాడు. అలా చలం జీవితంపై ప్రభావాన్ని కనబరచిన వ్యక్తుల్లో చింతా దీక్షితులు ఒకరయ్యారు.

1924 లో చలం ప్రమోషన్ మీద బందరు బదిలీ అయ్యాడు. అక్కడ చలానికి అహోబలరావుతోనూ, జంగం కోటయ్య దేవర కొడుకు సుబ్రహ్మణ్య దేవరతోనూ స్నేహం ఏర్పడింది. అహోబలరావును చలం తానెరిగిన గొప్ప వ్యక్తులలో వొకడుగా భావించేవాడు.

1927-28 మధ్య ఏలూరులో నండూరి సుబ్బారావుతో స్నేహం యేర్పడింది. అతడు ఎంకి పాటల్ని చలానికి వినిపిస్తూ వుండేవాడు.

1930లో చలం స్త్రీ పుస్తకాన్ని ప్రచురించాడు. "1933లో ఆంధ్రయూనివర్శిటీ పెట్టిన నవలల పోటీకి చలం 'మైదానం' నవల పంపాడు. బహుమతి వస్తుందని చలం ఆశించలేదు. ఆ విషయం గురించి దీక్షితులకు రాస్తూ "మీకు తెలీదూ? తన మెదడు సరిగా తలలో వున్న మనిషి ఎవడూ నాకు బహుమానం ఇవ్వాలనుకోడు. అందులో అంత ఘరానా సంస్థ యూనివర్సిటీ ఇస్తుందా?" అని సందేహించాడు చలం. చలం అనుకున్నట్టే ఆ బహుమతిని అప్పట్లో విశ్వనాథ సత్యనారాయణ, అడివిబాపిరాజు పంచుకున్నారు. మైదానం నవల (1927) ఆనాటి మధ్య తరగతి నైతిక విలువల్ని 'షాక్' చేయడం కోసం కూడా రాసినట్లు చలం చెప్పుకొన్నాడు."[27]

1935లో చలానికి బెజవాడ నుండీ కనిగిరికీ, అక్కడి నుండీ 1936లో నెల్లూరుకీ బదిలీ అయింది. 1936లో చలం జీవితంలో గొప్ప సంఘటన చోటు చేసుకుంది. అదే రమణ మహర్షి దర్శనం కలగడం.

1935-36లో చలం 'మ్యూజింగ్స్' రాయడం ప్రారంభించాడు. మరోపక్క అతడి ఆరోగ్యం కూడా అంతంత మాత్రంగా వుంది. తనకున్న బాధల్ని ఉత్తరాల ద్వారా రమణ మహర్షికి తెలియజేస్తూండేవాడు.

1938లో కాశీలో సంస్కృతి విద్యామందిర్ అనే సంస్థ చలానికి "సాహిత్య మనీషి" అనే బిరుదు ఇచ్చింది. ఆర్భాటాలకు అంతగా ఇష్టపడని చలం బిరుదులూ, సన్మానాలూ, సభలంటే ఇష్టం లేదంటూ ఆ బిరుదును సున్నితంగా తిరస్కరించాడు.

1939 చలాన్ని టెక్స్ట్‌బుక్ కమిటీకి మెంబరుగా వేసుకున్నామని అధికారులు తెలియపరచగా, 'యెంత దుర్గతిలోకి పతితుణ్నయ్యానో' అని తన సహజ ధోరణిలో ఆ గౌరవాన్ని నిరాకరించాడు.

1941లో లీల చలం జీవితంలోకి ప్రవేశించింది. అప్పుడు చలానికి గుడివాడ నుండీ ఏలూరికి బదిలీ అయ్యింది. 'మ్యాజింగ్స్'ను లీలకే అంకితమిచ్చాడు.

1949లో లీల చలాన్ని విడిచిపెట్టింది. 1956లో లీల మరణించింది.

1940లో చలానికి ఏలూరు నుంచీ భీమిలికి బదిలీ జరిగింది. ఐదేళ్ళ తరువాత తిరిగి మళ్ళీ భీమిలి నుంచి ఏలూరుకే రావడం జరిగింది. 1948లో ఆయన స్వయంగా ఉద్యోగ విరమణ చేశాడు.

12-10-1948న చలం వదినగారైన డాక్టర్ రంగనాయకమ్మ (వొయ్యి) మరణించింది.

1950లో జీవితంలో ఎదురైన ఎన్నో ఎదురుదెబ్బల వలన ఎంత మార్చాలని ప్రయత్నించినా మారటం అనేమాట పక్కనపెట్టి ఇసుమంతైనా కదలిక లేని సమాజం పట్ల విసుగు చెందటమే కాకుండా, తెలుగు దేశంపై, రచనా వ్యాసాంగంపై తలెత్తిన తిరస్కారభావం ఇలా అన్నీ కారణమై తిరిగి మళ్ళీ చలం కుటుంబంతో సహా తిరువణ్ణామలై తిరిగి వెళ్ళిపోయాడు.

1960లో చలం 'బుజ్జిగాడు' అనే పిట్ట కథ రాశారు. "1960 ప్రాంతాల్లో చిత్తూరు నుంచి శారదా పీఠం ఆధ్వర్యంలో కీ.శే. కె.సభా (1923-1980) నాయకత్వంలో వందమందికి పైగా రచయితలూ, కళాకారులూ తిరువణ్ణామలైకు తరలి వచ్చి, రమణాస్థాన్‌లో చలానికి సన్మానం చేశారు. అది ఆయనకి జరిగిన మొదటి సన్మానం."[28]

1961లో 'భగవాన్ పాదాల ముందు దివాన్' లాంటి కావ్యరచనలు చేశాడు చలం.

1970లో తిరువణ్ణామలైలో చలం భార్య అయిన రంగనాయకమ్మ (T) మానసిక ఆందోళనతో బాధపడి గుండెపోటుతో మరణించింది.

1974 జులైలో చలానికి పక్షవాతం వచ్చింది. అంతకుముందు కూడా ఒకసారి వచ్చి తగ్గుతుంది.

"చలం మరణించడానికి ముందుగానే ఆయన దహనం గురించి ఆ తండ్రీ కూతుళ్ళిద్దరూ చర్చించుకున్నారు. పాడెకట్టడానికి వీల్లేదని చలం పట్టుబట్టేడు. ఎప్పుడూ కూచునే వీల్‌ఛైర్‌లోనే తీసుకెళ్ళమన్నాడు. శవం వెంట భక్తులు నడుస్తూ భజన చెయ్యడం రమణాశ్రమం పద్ధతి. అలా వీల్లేదని చలం ఒకవేళ భక్తులు వద్దంటే బాధ పడతారేమోనని సౌరీస్, భజన చేస్తే లేచి వచ్చి తంతానని చలం, ఇలా తన దహన కార్యక్రమాన్ని గురించి సౌరిస్‌తో అంత సాధారణ విషయంగా మాట్లాడాడు. ఇన్ని ఏళ్ళ సాధనలో చలం ఏం కనుగొన్నాడా అని ఆత్రంగా చూసేవారికి ఇదే జవాబు.

తన మరణాన్ని అతి సహజంగా, నిబ్బరంగా స్వీకరించగలగడం.

1979 ఏప్రియల్, మే నెలల్లో కఫం వల్ల బాధపడి చివరకు మే నెల 4వ తేదీన ప్రాణాలు వదిలాడు. తమిళ దేశంలో జన్మించిన చలం తమిళ దేశంలోనే రమణస్థాన్ ప్రాంగణంలో ప్రాణాలు వదిలి పంచభూతాలలో మిగిలాడు."[29]

## 3.6 చలం కథలపై సంస్కరణోద్యమ ప్రభావం

ప్రస్తుతం ప్రియదర్శిని ప్రచురణల ద్వారా మార్కెట్‌లో అందుబాటులో ఉన్న చలం కథలు - 1 చలం కథలు - 2, చలం కథలు - 3 భాగాలలో 98 కథలు అందుబాటులో ఉన్నాయి. ఆ తొంభై ఎనిమిది కథల్లోనూ దాదాపు అన్నింటిలో చలం ఏదోక స్త్రీ సమస్యను ఇమిడ్చి పాఠకులకు అందించారు. అయితే నేను 98 కథల్లోనూ శీర్షికలను బట్టి విషయాన్ని గ్రహించి వాటిలోని సంస్కరణాభావాన్ని వెలికితీసి విశ్లేషించి సిద్ధాంత గ్రంథంలో చూపించడం జరిగింది. ఆవిధంగా నేను తీసుకున్న కథలు మొత్తం 13 అవి.

1. జెలసీ
2. దెయ్యమేనా
3. వితంతువు
4. పతివ్రత
5. హరిజన విద్యార్థి
6. నాయుడు పిల్ల
7. హిందూ - ముసల్మాన్

8. భోగంమేళం

9. మాదిగ అమ్మాయి

10. ఎరికలమ్మ

11. దెయ్యాలు

12. పునర్వివాహం

13. హరిజన సమస్య

## 1. జెలసీ

ఓ అందాల రాశి ఆకస్మికంగా వితంతువయినప్పుడు అతి సునాయాసంగా ఆమెను దక్కించుకొని పునర్వివాహం చేసుకొన్న ఓ జెంటిల్‌మెన్ పడకగదిలో ఆమె మొదటి పెళ్ళి విషయాలను ప్రస్తావిస్తూ 'మొదటి రాత్రి ఎలా జరిగింది, ఏం చేశాడు' అంటూ మొదలుపెట్టి అసంతృప్తి మాటలు మాట్లాడుతూ చివరకు తన మిత్రుడితోనే అక్రమ సంబంధాన్ని అంటకట్టిన తీరును 'జెలసీ' కథలో చూడొచ్చు.

**'జెలసీ' కథ సంక్షిప్త పరిచయం :**

ఈ కథలో 'నేనూ' అంటూ ఓ పాత్ర మొదలవుతుంది. ఆ పాత్రకి పేరు లేకపోవడం వల్ల ఆ 'నేను'ను రచయిత చలంగా గుర్తించాలి. ఇక కథలోకొద్దాం.

చలం, చలపతిరావులు మంచిమిత్రులు. బి.ఏ. చదువుతున్నప్పుడు చలపతిరావుకు ఓరోజు సాయంత్రం ఆకస్మికంగా వితంతువుల మీద ప్రేమ పుట్టుకొస్తుంది. వాళ్ళ కష్టాలన్నీ ఒక్కసారిగా ఇతడి కళ్ళముందు మెదిలి కరుణ ఉప్పొంగుకొస్తుంది. వితంతువుని తప్ప మరెవరిని పెళ్ళే చేసుకోనంటూ భీష్మించుకుంటాడు. మేనమామ తన కూతుర్ని ఇచ్చి పెళ్ళి చేయడానికి ముందుకు వస్తే "ముందు వితంతువును కానియ్యి" అని చీవాట్లు తింటాడు.

యల్.టి. చదివేందుకు చలం, చలపతిరావులు ఒకే గదిలో అద్దెకుండాల్సి వస్తుంది. ఆ సమయంలోనే చలపతిరావు కన్ను ఆ ఇంటి యజమాని కుమారస్వామి భార్య రాజమ్మ మీద పడుతుంది. ఆమె నవ్వు వాళ్ళను తన్మయుల్ని చేసేది. దాంతో చదువు సాగక రోజూ కాలేజీలో చివాట్లే వాళ్ళకి. ఆమె దర్శనం మాత్రం ఎప్పటికో ఒక్కసారి అయ్యేది. చేసుకుంటే అటువంటి పిల్లనే లేకపోతే అసలు చేసుకోనంటాడు చలపతిరావు.

అటువంటి పిల్ల కావాలి, ఆమె వితంతువు ఐవుండాలి, ఆమె తనని వలచి వొళ్ళో వాలాలని మూడు షరతులు పెడతాడు చలపతి.

అది జరగటం అసంభవం. సాధ్యమవ్వాలంటే కుమారస్వామిని హత్య చేయటం తప్ప మరో మార్గం లేదు. మరో పక్క రాజమ్మ చలపతిరావు వైపు కన్నెత్తి కూడా చూడటం లేదు.

అంతలో నాలుగేళ్ళు గడిచిపోతాయ్. కుమారస్వామి భార్య అయిన రాజమ్మను చలపతిరావు పెళ్ళి చేసుకుంటాడు. అసంభవం అనుకున్న మూడు షరతులూ నెరవేరాయంటూ అమితమైన సంతోషంతో చలపతిరావు మిత్రుడు చలానికి ఉత్తరం రాస్తాడు.

వారి పెళ్ళై మూడేళ్ళు గడుస్తుంది. ఒకసారి చలానికి బెజవాడ (విజయవాడ) వెళ్ళవలసిన అవసరం వస్తుంది. మూడురోజులు చలపతిరావు ఇంట్లో గడిపి, రాత్రికి మెయిలికి వెళ్తానంటూ వారి దగ్గర నుండీ శెలవు తీసుకుంటాడు. మెయిలు మిస్ అవుతుంది. స్టేషనులో పడుకోవాలంటే చలి చంపుతుంటది. తిరిగి వచ్చి గేటు దూకి వారిద్దరినీ లేపకుండా వరండాలో మామూలు మంచం వాల్చుకొని పడుకుంటాడు చలం. అంతలో లోన గదిలో నుంచి ఇద్దరి గొంతులూ వినబడుతుంటాయి.

ఇలా,

"మరి అప్పుడు నన్ను బైటి గదిలో చూసేదానివి కదా" .........

"ఎప్పుడు?"

"అదే (కష్టంగా) ఆ కుమారస్వామితో వుండేప్పుడు అప్పుడు ......... నువ్వు నన్ను చూశావు కదా, నామీద యిష్టం కలగలేదూ?"

"ఎందుకు కలుగుతుంది? మీరెవరో!"

"అంతేనా! మరి యిప్పుడో!"

"అడుగుతారా?"

"అప్పుడు ప్రేమరానిది యిపుడు మాత్రం వొస్తుందా యేమిటి?"

"ప్రేమించంది, మిమ్మల్నెందుకు పెళ్ళి చేసుకుంటాను?"

"అతను ......... ఆ కుమారస్వామి ......... బతికి వున్నపుడే, నిన్ను నాతో రమ్మంటే వచ్చేదానివా?"

"తప్పుకాదూ?"

"మరి యింక నామీద ప్రేమ యేమిటి?"

జవాబులేదు.

"పోనీ, అతన్నెక్కువ ప్రేమించావా, నన్నా!"

"మిమ్మల్నే సందేహమా?"

"అతను నా అంత ప్రేమగా వుండేవాడా, నీ మీద?"

"ఆఁ."

"కాని అప్పుడప్పుడు కోప్పడేవాడే?"

"ఆ కోపం యేముందిలేండి! - హాస్యానికి."

(నొచ్చుకున్న కంఠంతో) "ఐతే అతను బతికి వుంటేనే బాగుండుననుకుంటున్నావా?"

"ఛా"

"ఏం"

"అప్పుడు మీరెట్లా తెలిసేవారు?"

"నేను తెలియక పోతేనేం? అతనితో బాగానే వుందిగా?"

"కాని, మీ ప్రేమో?"

"అంటే ప్రేమలు నీకు మార్పుతూ వుండాలన్న మాట. నేను చస్తే బాగుంటుందా యిప్పుడు?"

"పోండీ మరీని"

"చెప్పు."

మాటాడలేదు ఆమె.

"చెప్పమంటే. నేను చావాలనే వుంది.

అందుకనే మాట్లాడవు - చెప్పవేం?"

"పొండి ఆయనతో యెట్లా వుంటే మీకేమండీ? ప్రతి రాత్రి ఆయన ప్రస్తావన తెచ్చి చంపుతారు. ఆయనేమన్నా దెయ్యమై పట్టాడా యేమిటి మిమ్మల్ని? ఇంత గాఢంగా ప్రేమిస్తున్నానే చాలదూ?"

మాటలు లేవు. ఏడుస్తూ వూపిరి పీలుస్తున్న చప్పుడు.

"చూడు. ఇంకెప్పుడు ఆ సంగతి యెత్తనుగాని ఇది వొక్కటి చెప్పుచాలు. నిజం చెప్పాలి. మొదటిరోజు శోభనం గదిలో మొదట అతనేం చేశాడు?"

"ఏమండీ? ఏం చేస్తారేం? మీకు తెలియదా? మీరేం చేశారు?"

"నేనా? నా మొహం, నాకా అదృష్టం కూడాను? చెప్పుమరి?"

"ఎందుకండి అదంతా యిప్పుడు? ఎప్పుడో మరిచిపోయినాను."

“మరిచిపోలేదు. జ్ఞాపకం తెచ్చుకో. నిజం చెప్పు, అబద్ధం చెప్పానా? (గొంతు మార్చి) ఇదొక్కటి చెప్పు. నిద్రపోతాను. ఏం చేశాడు? నువ్వు యిష్టపడ్డావా? చెప్పదూ? మీ ఇంట్లోనేగా - కుంచవరంలో ఆ యింటి పడమర గదిలో - జ్ఞాపకం వస్తోంది కదూ?”

“ఏం లేదు ఏముంది? నే సిగ్గుపడుతూ నుంచున్నాను.”

“అప్పటికీ నీకు తెలుసా?”

“ఏమిటీ?”

“అబ్బా, నన్ను చంపకు, ఇదే - ఇదంతా.”

“నిజం నాకేమి తెలీదు, అప్పటికి.”

“ఆ, తెలియకుండా వుంటుందా యేం?”

“ఎట్లా తెలుస్తుంది? నిజం.”

“అప్పుడే నన్నమాట - పాపం, నిన్ను ఏం తెలీనిదాన్ని - వొంటరిగా”

(నువ్వు .........)

“ఎందుకు నవ్వుతావు?”

“ఏం లేదు.”

“ఏం లేదు? చెపుతావా చెప్పవా?”

“ఏం లేదండీ? వొంటరిగా - ఏమిటి? మరి భార్యనైనాక -”

“అవును, ఏం చేశాడు?”

“అబ్బా! నాకు తెలీదు, నిద్రవొస్తోంది.”

“చెప్పాలి, చెప్పితీరాలి, నిన్ను నిద్రపోనీను యీ రాత్రి చెప్పిందాకా?”

“ఆయన లేచివొచ్చి, చెయ్యి పట్టుకొని......”

“వొద్దు... వొద్దు....... ఆ కొత్తదనం, ఆ సిగ్గు అదంతా హాయిగా వాడనుభవించాడు. అంతా పాతైనీకంతా తెలిసి మామూలైపోయిన తరువాత - యిప్పుడు - వాడు అన్నీ తాకి వొదిలేసి మిగిలినవి, ఇదే నా బతుకా? ఛీ, ఛీ వెధవని - ”

“నేను ప్రేమిస్తున్నానుగా?”

“అవునులే, ప్రేమించడమూ, అవీ, అన్నీ అతను నేర్పాడు నీకు. ఆ చూపులు, ఆ నవ్వు, అన్నీ అతని కోసం నేర్చుకుని, నా మీద చూపుతున్నావు. నేను ముద్దు పెట్టుకుంటే, అతను పెట్టుకున్న ముద్దులతో పోల్చుకుంటావు అవి మొదటివి. కొత్తవి. అవే బాగుండి ఉంటాయి నీకు అవునా?”

"ఏం చేయమంటారు నన్ను?"

"ఒప్పుకున్నావు గదా నిజమని! అహో! నీ ప్రేమంతా అతనిదే. అతన్ని తలచుకుంటూ నామీద చూపుతావు. చీకట్లో అతనినే అనుకుని తృప్తి పడతావు అవునా?"

"ఛీ?"

"అవునులే నాకు తెలుసు?"

"కాదండీ"

"నోరుముయ్యి మాట్లాడకు. కొందరి కులటలకి బతికి వున్న పరాయి వాళ్ళ మీద ప్రేమ. నీకు చచ్చిన పరాయి వాడి మీద."

"నిజంగా ఆయన జ్ఞాపకమే లేరండీ. మీరు తప్ప యీ హృదయంలో ఎవరూ లేరు."

"నిజమా? నిజమా? ఎట్లా నమ్మను? మూడేళ్ళల్లోనే మరిచిపోతావా? అబద్ధం! అయితే మరి నేను చచ్చినా అంతే?"

"ఛా".

"ఛా, ఏమిటి? మరి అతన్ని కూడా ప్రేమించావా? చచ్చిన ఆరోనెలలో నన్ను పెళ్ళాడావా? అంతేగా? నేను చస్తే, మళ్ళీ-"

"ఊరుకోండీ."

"మాట్లాడవేం?"

"నాకు తెలీదు. నిద్ర వస్తోంది, పడుకోనీండి."

"అది ఒంక, చెప్పు ముందు - నిజంగా నా మీద ప్రేమేనా?"

"మళ్ళీ మొదలా?"

"వాడు - ఆ కుమారస్వామి."

"పడుకోండీ - ఏమిటండీ, ప్రతి రాత్రి యీ గోల! మీకేమన్నా మతి చెడిందా! ఆయన ధర్మమా అంటో మీ స్నేహితుడు ఈ మూడు రోజులు వున్నాడు. ఆయన వున్నాడని ఊరుకున్నారు. బతికిపోయినాను. రైలుకు వెళ్ళాడో లేదో మొదలుపెట్టారు."

"అతనింకా ఉండాలనే ఉందన్నమాట?"

"ఆ!"

"అప్పుడే కన్నేశావన్నమాట."

"ఛీ, నోరుముయ్యండీ"

"అవును, నేను బతికి వుండగానే తరువాత భర్తను సిద్ధం చేసుకుంటున్నావన్న మాట."

"మీకు మతిపోయింది."

"మరి కుమారస్వామి బతికి వుండగానే, నన్ను చూసుకోలా? అట్లానే!

"నేను మాటాడను."

"ఎందుకు మాటాడతావు? నిజం చెప్పు వాడిమీద కన్ను వెయ్యాలా? నాకు తెలిసిందిలే. ఎన్నడూ లేనిది మళ్ళీ మంగళవారం వస్తానన్నాడు. ఓసి దొంగ - ఓసి-ముండా."

"ఛీ, ఊరుకోండీ - మీకు పిచ్చి మితిమీరిపోతుంది మరిన్నీ."

"అవును, పిచ్చే - నీకు హృదయం లేదు. నిన్ను చంపినా పాపం లేదు. నీవంటి వాళ్ళు బతికి వుండకూడదసలు - రాక్షసివి. మొగుడు బతికి వుండగానే మెగుణ్ని చూసుకోవడమా? రెండోసారి. ఇంక యేముంది? నన్ను చంపేట్టున్నావే! మాటాడవేం? పాపం ఆ నిర్భాగ్యుణ్ని, ఆ అమాయకుణ్ని, కుమారస్వామిని చంపావా, నాకోసం? ఆ చంపే వుంటావు. ఎంత ఘాతుకరాలివే!"

ఏడుస్తోంది ఆమె.

"ప్రతి మొగాడితోను - యిట్టా నన్ను కట్టి చంపకపోతే పొమ్మన రాదూ, పోతాను!"

"పోవాలనే చూస్తున్నావూ? వాడి దగ్గరకేనా! పో, పో, పో ముందు (జెలసీ)."

అంతలో దెబ్బల మోత, ఏడుపు. గడియతీస్తున్నట్లు అనిపించి అమాంతంగా చలం పక్కమీద వాడు లేచి చిన్న గేటు దూకి, చిన్న వీధుల్లో పరుగు లంకించుకుంటాడు. రైల్వేస్టేషనుకు చేరుకుంటాడు.

చలం తనలో తాను చలపతిరావు వంటి "నైస్‌మాన్" ఇలా మాట్లాడాడేమిటి? నిష్కారణంగా ఈ గదులలో ఎంతెంత ఘోరకృత్యాలు జరుగుతాయో! కోటూ తలగుడ్డ ఇంటికి రాగానే తీసేసినట్టే మానర్సు, సెన్సు, రెస్పెక్టు అన్నీ తీసి చిలకొయ్యకి తగిలిస్తారు. ఈ పెద్ద మనుష్యులందరూ. ఏ కోపమో, జెలసీ కామమూ, ఇట్లింటివి పట్టుకొని ఊపేప్పటికి మనుష్యులమనుకొని ప్రవర్తించే వారందరూ, కుక్కలూ, కోతులూ, పెద్దపులులూ, ఎలుగుబంట్లుగా మారతారు గాబోలు అనుకుంటాడు.

**కథా ఉద్దేశ్యం :**

అనుమానం పెనుభూతంగా మారుతుంది అంటారు. అసలు పెనుభూతంగా ఎందుకు మారాలి? పెనుభూతంగా మారకూడదంటే అసలు అనుమానాలే ఏర్పడకూడదనేది ఉద్దేశ్యం.

**'జెలసీ' కథ పై సంస్కరణోద్యమ ప్రభావం :**

ఈ కథలో చలం రెండు కోణాలు చూపించాడు. ఒకటి పెద్దమనుష్యులుగా చెలామణి అయ్యే కొందరు ప్రబుద్ధుల ఆలోచనా విధానం ఎలా వుంటుందో తెలపటం దానితోపాటు ఇటువంటి మనస్తత్వం గలవాళ్ళు ఆకాలంలోనే కాదు ఈ కాలంలోనూ ఉంటారు. వారి విషయంలో జాగ్రత్తగా ఆలోచించి, ఆచీ, తూచీ అడుగువేయాలని స్త్రీలను హెచ్చరించటం ఒక కోణమయితే, వితంతువుకు పునర్వివాహం జరిగినట్లు తెలియచేసి తనలోని సంస్కరణాభావాన్ని ప్రకటించాడు. ఇది రెండో కోణం. మొదటి కోణానికి చెందినవారు రెండు రకాలుగా ప్రవర్తిస్తుంటారనేది అతడి ఉద్దేశ్యం (పైకి ఒకలాగా లోనొకలాగా). ఆ విషయాన్ని ప్రస్తుత కథలో చలపతిరావు పాత్ర ద్వారా చూపించాడు. ఇక పునర్వివాహక ప్రస్తావనకొస్తే కథలో రాజమ్మ వితంతువు అయిపోగా ఆమెనట్లా వదిలేయకుండా సమాజపు కట్టుబాట్లతో ఆమె జీవితం దుర్భరమైపోయినట్లు చిత్రించకుండా చలపతి తిరిగి ఆమెను వివాహం చేసుకున్నట్లు చూపించి స్త్రీ సమస్యల్లో ఒకటైనా వితంతు సమస్యను రూపుమాపేందుకు తన వంతు కృషి సలిపాడు. చలపతి ఆమెను పెళ్ళి చేసుకున్నాగానీ మానసికంగా ఇబ్బందులకి గురి చేశాడు. కానీ ప్రస్తుతం పునర్వివాహక దృష్టితో చూడాల్సిన అవసరం వుంది.

వితంతు సమస్యను రూపుమాపడం అనేది ప్రశంసించదగ్గ విషయం. ఆ దిశగా కృషి సలిపిన చలం హర్షనీయుడు. సంఘసంస్కరణలో వితంతు పునర్వివాహం కూడా ఒకటి కనుక ప్రస్తుత కథలో వితంతు పునర్వివాహం జరిగినట్లు చూపించడం వల్ల 'జెలసీ' కథ పై సంస్కరణోద్యమ ప్రభావం శక్తివంతంగా పనిచేసిందని చెప్పొచ్చు.

## 2. దెయ్యమేనా?

స్నేహితులు కొందరు నాటకానికి వెళ్ళి అది పూర్తయేంత వరకు వుండటంతో తెల్లవారుజామున నాలుగవడం వల్ల స్నేహితుల్లో ఒకడు ఇప్పుడేం నిద్ర? పదండి క్రిష్ణ ఒడ్డుకు వెళ్ళి స్నానం చేసి హోటలికి వెళదాం అంటూ బయలు దేరిన సందర్భంలో ఏం జరుగుతుందో తెలియచేసే కథే దెయ్యమేనా?

**'దెయ్యమేనా' కథ సంక్షిప్త పరిచయం :**

కొందరు మిత్రులు నాటకం చూసి తెల్లవారిపోవటంతో నిద్రపోకుండా సాన్నం కోసం కృష్ణానదికి వెళ్ళదామని, అటునుండీ హోటలకి వెళ్ళదామని నిశ్చయించుకొని బయలుదేరి వెళ్ళుతున్నప్పుడు వారితో కలిసిన ఓ పల్లెటూరి వెంకన్న తన ఊళ్ళో జరిగిన అనుభవాన్ని వారికిలా చెబుతుంటాడు.

ఒక మునసబుగారు ఒకామెను వుంచుకుంటాడు మరొక పల్లెలో. మునసబుగారు రావటానికి వీలుగాకపోయినప్పుడల్లా వాళ్ళ కమతగాడు వెంకన్న ఆమెకు అలవాటవుతాడు. ఒకసారి మునసబుగారు రారన్న వార్త చెప్పి ఆమెతో కొంతసేపు గడిపి ఇంటికి వెళ్ళి తెల్లవారుఝామున మరోవూరు వెళుతుంటాడు వెంకన్న. విరబోసిన జుట్టుతో తెల్లచీరతో ఒక స్త్రీ దారిలో తటస్థపడుతుంది. చూస్తే శారదమ్మ (మునసబుగారి స్త్రీ) రమ్మంటుంది. ఆమె నడక తీరు వేగం అనుమానం కలిగిస్తుంది. నిగ్గదీస్తాడు. బొమికల గలగల శబ్దం లాంటి నవ్వు నవ్వి తెల్లగా దీనంగా నుంచుని - అలికిడికాగానే నీళ్ళలోకి దూకి మాయమౌతుంది. చచ్చిపోయిన శారదమ్మను చూద్దామని యింటికి వెళతాడు. ఆమె మంచం మీదే ఉంటుంది అదే అలంకరణతో ముట్టుకుంటాడు. మంచం మీదకు లాక్కుంటుంది. భయపడతాడు. జీవంతో ఉన్న శారదమ్మే. కోర్కెలు తీరని ఎవతె పిశాచమయి ఈ నాటక మాడిందో! మర్నాడు బండి శేషన్న 'ఆడమనిషి నీతో మాట్లాడుతోంది ఎవరు' అని అడుగుతాడు.

**కథా ఉద్దేశ్యం :**

మన దేశంలో చాలామంది మూఢనమ్మకాల ఉచ్చులో ఊరికే పడిపోతుంటారు. అందులో భాగంగానే దెయ్యాలు, భూతాలంటూ భయపడుతుంటారు. అసలు దెయ్యాలే లేవనేది ఉద్దేశ్యం.

**'దెయ్యమేనా?' కథ పై సంస్కరణోద్యమ ప్రభావం :**

ఇది ఆధునిక యుగం. శాస్త్ర సాంకేతిక రంగాలు నానాటికీ అభివృద్ధి చెందుతూ పురోగతి వైపు పరుగులు తీస్తూ దేశాన్ని కూడా పరిగెత్తిస్తున్నాయి. ఇటువంటి సమయంలో ప్రజలు కొందరు ఇంకా సనాతన మూఢాచారాల్ని మూఢనమ్మకాల్ని పట్టుకొని వెళ్ళాడుతూ సమాజాన్ని, వారి కుటుంబాన్ని ముందుకు బదులు వెనక్కి నడిపించే ప్రయత్నం చేస్తున్నారు. ఇటువంటి వాళ్ళు పూర్వమూ ఉన్నారు, ఈ రోజుల్లోనూ ఉన్నారు. అటువంటి వారిలో

మార్పు తీసుకొచ్చేందుకు చలం 'దెయ్యమేనా' కథను రాసినట్లు భావించాలి. ప్రస్తుత కథ 'దెయ్యమేనా'లో తన అనుభవాన్ని వినిపిస్తున్న వెంకన్న తన మస్తిష్కం నిండా ఆ మునసబు మనిషి అయిన శారదమ్మ ఆలోచనలే నింపుకోవడం, అదే ఆలోచనలు అతడి మేదడులో మెదలడం వల్ల భ్రాంతికి లోనవుతాడు. ఆమె దెయ్యం రూపంలో అతడికి కనిపించిన తరువాత ఇక ఆమె ఇంటికి వెళ్ళకుండా ఉన్నట్లైతే అతడి అభిప్రాయాన్ని అంగీకరించడం సబబుగా ఉండేది. కానీ అతడు నిర్ధారణ చేసుకోవడానిక ఆమె ఇంటికి వెళ్ళినందు వలన అతడి అభిప్రాయం సబబు కాదని భావించాలి.

ఇలా చలం మూఢనమ్మకాల్లో కూరుకుపోయిన వాళ్ళని బయటకి తీసేందుకు ఈ కథరాసి మూఢవిశ్వాసాల పట్ల తన నిరసనను తెలిపి ప్రజల్ని చైతన్యం పరిచేందుకు కృషి చేశాడు. మూఢనమ్మకాల్ని నిర్మూలించడం సంస్కరణలో భాగమే కాబట్టి 'దెయ్యమేనా?' కథ పై సంస్కరణోద్యమ ప్రభావం బలంగా పని చేసినట్లు భావించాలి.

## 3. వితంతువు

ఓ స్త్రీ పెళ్లై భర్తను కోల్పోయి వితంతువయిపోవడంతో ఒంటరితనాన్ని భరించటానికి కనీసం పిల్లలన్నా లేకపోవడం వల్ల ఎటువంటి మనస్థాపానికి గురౌతుందో తెలిపే కథే 'వితంతువు.'

**'వితంతువు' కథ సంక్షిప్త పరిచయం :**

ఈ కథలో ఓ స్త్రీ హృదయం కనబడుతుంది. ఈ వేళ స్త్రీవాదం అనేది ఏ అంశాన్నయితే గట్టిగా చర్చిస్తోందో ఆ అంశాన్ని గురించి ఆరోజుల్లోనే చలం కథ రాయడం ఓ గొప్ప విశేషం.

బాల వితంతువే ఈ కథలో ప్రధాన పాత్ర. కథానాయిక కూడా. కథ ప్రారంభం నుండీ కథ చివరిదాకా ఆ వితంతువే తన వ్యథను వినిపిస్తుంటుంది.

కథలో వితంతువు శారీరక సుఖాన్ని ఎరగదు. దానివల్ల ఆమెకు ఆ సుఖాన్ని తెలుసుకోవాలని కుతూహలం ఎక్కువగా ఉంటుంది. అంతకంటే గట్టిగా తల్లి అవాలనే కోరిక తలెత్తుతుంది. స్త్రీ సహజమయిన అవాంఛను పెళ్లితో ఎందుకు ముడి పెట్టాలన్నది చలం ఈ కథ ద్వారా వేసిన పెద్ద ప్రశ్న. ఇటీవల స్త్రీవాదులు తెలుసుకోవాలనుకుంటున్నది కూడా అదే.

కథ రెండు భాగాలుగా ఉంది. మొదటి భాగంలో లోకంలోని తల్లుల అదృష్టం, పిల్లల పట్ల వాళ్ల నిర్లక్ష్యవైఖరి చూసి తనే తల్లి అయితే తన పిల్లల్ని ఎంత బాగా పెంచుకునేదో

పిల్లలు కోసం తన తపన, భర్తతో కాపురం లోని సంగతుల పట్ల కుతూహలం మొదలయిన విషయాలను ఆ వితంతువు తనంతట తాను "ఈ పిల్లి బాగా మరిగింది పాలు తాగడం. ఈవాళ పాలు అందడం లేదు. గోలపెడుతుంది. ఆకలి, దానికి. పాపం నాకుమల్లేనే నిద్రపట్టదు. పోనీ యెలికల్ని పట్లరాదూ? ........ నా శాలువ కప్పుకొని మొగుడి పక్కన మంగమ్మ నిద్రపోతున్నట్టుంది మళ్ళీ తెలార్లూ ఆ గదిలో ఏం చేస్తారో తలుపులు మూసుకుని? ఆయనే బతికి వుంటే నేనేం చేస్తో వుండేదాన్ని? నన్నిట్లా పొయ్యి దగ్గర కూచోనిచ్చేవాడా! చిన్నవాడే! ఎట్లా ఆ రోగం వచ్చిందో కాని? కార్యమయినా అయితే బావుండేది. అంతా తెలిసేది. ఏం చేస్తారో తెలుసు. కాని ఎట్లా చేస్తారో, అప్పుడు వాళ్ళు ఎట్లా వుంటుందో తెలియాలని వుంది. కొందరు ఏడుస్తారు, ఎవర్నన్నా అడగాలని వుంటుంది. సిగ్గు, భయం, చెప్పరనుకుంటా. వాళ్ళకీ సిగ్గే. అప్పుడు సిగ్గు వుండదేమో! మాట్లాడ్డం మాత్రం సిగ్గు. నీకెందుకంటారు! ఒకవేళ ఒక బిడ్డ కూడా వుండేదేమో! ఆయన కళ్ళు బావుండేవి. ఆ కళ్ళే వొచ్చేవి అబ్బాయికి. నా చిన్ని ఎర్రని నోరు వొచ్చేది. ఎంత బాగుండేవాడని! అప్పుడు యీ వొదిన్ని యూమైనా లేఖ్క చేసేదాన్నా మా నాన్న యిచ్చిన శాలువ లాక్కొని మంగమ్మకియ్యనిచ్చేదాన్నా! అబ్బాయికి కావాలనేదాన్ని. ఇప్పుడు తెల్లారకట్టే లేచి మంగమ్మ కొడుక్కి వేణ్ణీళ్ళు కాచాలంటే ఎంతో కష్టంగా వుంటుంది. అప్పుడు నా బాబుకోసం యెన్ని నీళ్లన్నా సంతోషంగా కాచేదాన్ని కదూ! ఇప్పుడైనా పుట్టకూడదూ! మొగుడు లేకుండా కనే పద్ధతి లేదూ! చెట్లకి కాయలు కాయటంలా? పోనీ ఒకబ్బాయి యెక్కడైనా దొరికితే బావుండును! అట్లా కాదు కాదు. నాలోంచే రావాలి. నా అబ్బాయి కోసం ......... అట్లా కాకపోతే మంగమ్మ కొడుకు మీద నాకు ప్రేమ వుండకూడదూ? ......... నిద్ర వొస్తోంది. కొంచెంగా పడుకుంటే రాదు మళ్ళీ చలి (వితంతువు)." అంటుంటుంది. అలా మొదటి భాగం సాగుతుంది.

ఇక రెండోభాగంలో ఆమె బిడ్డ కోసం ఒక మగవాడితో సంబంధం పెట్టుకొని బిడ్డ కడుపున పడగానే ఆ మగవాడిని వదిలించుకుని ఆ బిడ్డకోసం ఆలోచించడం జరుగుతుంది. ఈ బిడ్డ పుట్టడం అన్నది వివాహితగా ఉండి జరిగితే ఎంతో అపురూపంగా చూసే సంఘం, వితంతువుగా గర్భవతి అయిన తనను బాధ పెట్టడంలో ఎంత అన్యాయం ఉందో తర్కిస్తూ ఉంటుంది. దాన్ని తలుచుకుంటూ "నా సంగతి తెలిస్తే వీళ్ళూరుకోరు. కాని నన్నింట్లోంచి బైటికి పోనీరు. నా బిడ్డని యెవరికో ఇప్పించి మళ్ళీ నన్ను చాకిరీకి తెచ్చుకుంటారు. నేనెక్కడన్నా నా బాబుతో సుఖంగా బతుకుతున్నా వీళ్ళు వోర్చుకోరు తమదైన హక్కును

తమకి భుక్తమైన సొంత సౌఖ్యాన్ని నేను దొంగిలించినట్టు ఏడుస్తారు. సూర్యనారాయణ చెల్లెలిని నలుగురూ నన్నూ నా బిడ్డతో సహా చూపిస్తోంటే, అన్నయ్య సహించగలడా?

కాని నేనొప్పుకోను నా బాబుని, నా చిట్టి బంగారాన్ని ఎవరికీ ఇవ్వను. నాకు తప్ప వాడి మీద ఎవరికి వుంటుంది దయ! మామయ్యలూ, అత్తయ్యలూ, తాతయ్యలూ వీళ్ళకీ వుండదే కనికరం! పరాయి వాళ్ళకి వుంటుందా! నేనివ్వనీను. నేనే పెంచుకుంటా, నన్ను వీళ్ళేం చేసినా సరే గోలచేస్తా, యేడుస్తా. వెళ్ళిపోతా. కాని, నా బాబుని లేకలేక నా చేతుల్లోకి వొచ్చిన నా భాగ్యాన్ని పారేసుకొను, నా ముద్దులమూట చిరునవ్వొక్కటి చూడకుండా వుంటానా? నేను స్వంతంగా పాలిచ్చుకుంటా నా బాబు నన్ను గుర్తుపడితే ఇన్నీ కష్టాలు వెలీ తిట్లూ, అన్నీ తన కోసమే, అని తెలుసుకుంటే, నన్నూ, నా మొహాన్ని, గుర్తుపట్టి, చేతులు జాచి, నా వేపు "అమ్మా" అంటే పకపక రత్నాలు నవ్వితే, నామీదే అంత ప్రేమ చూపితే నాకింకేం కావాలి? వీళ్ళకి నా బిడ్డ మీద కూడా కోపం ఎందుకొస్తుందో? నేనంటే పోనీ అపరాధం చేశాననుకోవచ్చు. నోరెరగని ఆ పసిగుడ్డేం చేసింది? ఒకవేళ నన్ను వాళ్ళల్లో వుణ్ణిచ్చినా వుంటానా! వాడిముందు నన్ను లోకువుగా చూస్తే నేను భరించగలనా? వాణ్ణి తిట్టి, వాడిచేత చాకిరీ చేయించుకుంటే - ఎక్కడికన్నా వెళ్ళిపోతా - యెక్కడికో. నాన్న అంటే ఏ మననూ? చచ్చిపోయినాడంటా. కాదు........."నేనే నీ నాన్న" అంటా (వితంతువు)" అనుకుంటుంది.

**కథా ఉద్దేశ్యం :**

ఈ సృష్టిలో స్త్రీకి మాతృత్వంపై గల మమకారాన్ని కొలమానాలతో కొలవలేము, సంపదలతో కొనలేము అనేదిఉద్దేశ్యం.

**'వితంతువు' కథ పై సంస్కరణోద్యమ ప్రభావం :**

ఆ కాలంలో వితంతువుల పరిస్థితి చూస్తే ఎంతో భయం వేసేది. ఇంటిలో తన కుటుంబ సభ్యుల దగ్గర నుండీ వీధి జనము వరకూ ప్రతివాళ్ళు జంతువులకంటే కూడా హీనంగా చూస్తుండేవారు వితంతువును. వాళ్ళ ప్రమేయం లేకుండా పెళ్ళిళ్ళు చేయడం. ఊహ తెలిసి తెలియకముందే వాళ్ళ ప్రమేయం లేకుండానే వితంతువులు కావడం వారు చేసిన దోషమా? అని చలం ఈ కథ ద్వారా సమాజాన్ని ప్రశ్నించాడు.

నేడిటువంటి పరిస్థితులు పూర్తిగా కాకపోయిన ఎంతో కొంత మారాయని చెప్పొచ్చు. ప్రస్తుత కథలో వితంతువు సుఖానికి దూరమై ఆత్మ క్షోభననుభవించి చైతన్యం పొంది

తల్లి అవుతుంది. ఆమె తల్లి అయిన విషయాన్ని కథపరంగా పక్కన పెట్టి వితంతువులో చైతన్యం రావడాన్ని గుర్తించాలి.

ఇలా వితంతువులందరిలో చైతన్యం కలగాలన్నదే చలం ఉద్దేశ్యం. ఓ మనిషి మరో మనిషిని క్రూరంగా చూడటం ఏమిటి? మూఢనమ్మకాలతోనూ, పనికిరాని కట్టుబాట్లతో అవసరంలేని సంకెళ్ళు వేసి హీనంగా చూడడాన్ని చలం ఈ కథ ద్వారా ఖండించారు. వితంతువులయిన మాత్రాన వాళ్ళు మనుషులు కాకుండా పోతారా? మనసు లేకుండా పోతుందా అంటూ తనలోని సంస్కరణా భావాన్ని ప్రకటించి సమాజాన్ని ఆలోచింపజేసి మార్పు దిశగా అడుగులు వేయమన్నాడు. కనుక ఈ కథను మార్పు కోరేదిగా గుర్తించాలి. దీన్నిబట్టి 'వితంతువు' కథ పై సంస్కరణోద్యమ ప్రభావం ఉందనే చెప్పాలి.

## 4. పతివ్రత

స్త్రీ పురుషుల ప్రణయ సంబంధాన్ని, స్త్రీల పాతివ్రత్యాన్ని, త్యాగాన్ని తెలియజేసే కథే 'పతివ్రత'

**'పతివ్రత' కథ సంక్షిప్త పరిచయం :**

"రైల్లో అంతా యోచనే లేదు. అలిసి పోయినాడు. టైఫాయిడ్ జరం. ఇంకా పూర్తిగా నయమై పత్యం కూడా తీసుకోలేదు. సుశీల రాసిన ఉత్తరం చదివాడు. తనకి సరిగా తెలీను కూడా తెలీదు బయలుదేరుతున్నాని. దుర్గతో చెప్పనన్నాలేదు. తను రైల్లోంచి రాసిన ఉత్తరంలో తెలుసుకుంటుంది కాని ఏం తెలుసుకుంటుంది? తనేం రాయగలిగాడు? తనకి మాత్రం ఏం స్పష్టం? ఇప్పటికైనా ఎట్లా తెలుసు తనకి ఎందుకు బయలుదేరాడో చెప్పినా ఎవరికర్థమౌతుంది! (పతివ్రత)!"

సుశీల అడవిలో ఇంకొకరితో ఉంటుంది. అతడి రెండో భార్య దుర్గ మంచిదే అయినా ఆమెలోని గర్వాన్ని తనకు అర్పణ చేసుకోలేకపోవటాన్ని సహించలేకపోతాడు. తిరుగుళ్ళకు అలవాటు పడినదైనా సమస్థం మరిచిపోయే సుశీల దగ్గరే ఎక్కువ ప్రశాంతత దక్కుతుందని అక్కడకు వస్తాడు. ఆమె ఆదరిస్తుంది. తన వద్దనున్న నగలు కూడా అమ్మి అతన్ని చూసుకుంటుంది. సుశీల రెండో భర్త కూడా ఏమీ అభ్యంతరం చెప్పడు. పూర్తిగా సత్తువ వచ్చిన తర్వాత శారీరక సుఖాన్ని కూడా అందిస్తుంది. ఎంత జరిగిన మీ భార్యను కాకుండా ఎట్లా పోతాను అంటుంది. తనకొచ్చిన కష్టాలకంటే ప్రేమించినవారిని సుఖపెట్టడమే ఎక్కువ ఆమెకు. పతీవ్రత అంటే అంతేగా మరి.

**కథా ఉద్దేశ్యం :**

అయిన వారిని మర్చిపోవడమనేది తేలిక విషయం కాదు అనేది ఉద్దేశ్యం.

**'పతివ్రత' కథ పై సంస్కరణోద్యమ ప్రభావం :**

అనాదిగా సంఘంలో పతివ్రత అంటే భర్త హింసల్ని భరించేది, సేవలందిస్తూ ఉండేదిగా శాస్త్రాలు చెబుతూ వచ్చాయి. కానీ దాని వలన స్త్రీ జీవితం అగమ్యగోచరంగా తయారవుతుందన్న విషయాన్ని గ్రహించగలిగే స్థితికి ఇంకా రాలేదు సమాజం. కానీ శాస్త్రాలను పక్కన పెట్టి ప్రస్తుత కథ పతివ్రతలో సుశీల పాత్ర ద్వారా చలం స్త్రీకి స్వేచ్ఛనిచ్చినట్లు చిత్రించి ఆ పాత్ర ద్వారానే తనను విడిచిపెట్టి మరొకరిని పెళ్ళాడి, ప్రశాంతత కోసం మళ్ళీ తిరిగి తన దగ్గరకొచ్చిన భర్తతో 'ఎంత జరిగినా మీ భార్యను కాకుండా ఎట్లా పోతాను' అన్నట్లు తెలియచేసి పాత్రలో స్త్రీకి గల స్వతంత్ర్యాన్ని, స్వేచ్ఛను నిరూపించాడు చలం. ఈ కథ ద్వారా స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు స్త్రీకి ఉండాలని తెలుస్తుంది. కాబట్టి 'పతివ్రత' కథ పై సంస్కరణోద్యమ ప్రభావం ఉందని చెప్పాలి.

## 5. హరిజన విద్యార్థి

చదువుకోవడానికి కూడా హరిజనుడు ఎటువంటి పరిస్థితిని ఎదుర్కోవలసి వచ్చిందో తెలియజేసే కథే 'హరిజన విద్యార్థి.'

**'హరిజన విద్యార్థి' కథ సంక్షిప్త పరిచయం :**

ఈ కథలో నాకు, నన్ను అంటూ ఉత్తమ పురుష పదాలు కనపడుతుంటాయి. వాటి ద్వారా చలం మాట్లాడుతున్నట్లు పాఠకులు అర్థం చేసుకోవాలి. ఇందులో చలంగారి అనుభవాన్ని, అతడి ఆలోచనా ధోరణిని కళ్ళకుకట్టినట్లు చూడగలిగే అవకాశం పాఠకులకు దక్కింది.

కథ ఇలా ప్రారంభమవుతుంది.

"నేను హరిజన విద్యార్థిని, నాకొక్క సీటు దయ చేయండి." అంటాడు ఓ ముక్కుపోగువాడు.

"హరిజన విద్యార్థివైతే నాకేం?" అనాలనిపిస్తుంది చలానికి. కానీ చలం మాట్లాడిన ఆ తెలుగు పదం ఆ ముక్కుపోగు వాడికి అర్థమవుతుందో లేదో అనిపిస్తుంది. ఏదైమేతేనేం హరిజనున్ని అన్నమాట పాస్‌వర్డ్‌గా అనిపిస్తుంది.

“ఆ మాట అనగానే వెంటనే లేచి కావలించుకోవాలి, ఆ మాట అన్న మనిషిని. తరువాత గంగాళంలో నీళ్ళు తోడించి ఇద్దరమూ కలిసి పోసుకోవాలి. లేకపోతే క్రిష్ణకు వెళ్ళాలి. తరువాత విస్తళ్ళు తాకుతూ భోజనం చెయ్యాలి. ఒకటే గ్లాసులోంచి తాగాలి. కూతురు వుంటే వివాహమాడి మా కులగోత్రాలను పవిత్రం చేస్తాడేమో కనుక్కోవాలి. ఉద్యోగాలు, స్కాలర్‌షిప్పులు, సీట్లు, ప్రమోషన్లూ అన్నీ తలుపులూ “హరిజనుణ్ణి” అనే మాటతో విడిపోతాయి (హరిజన విద్యార్థి).”

హరిజనుడు అనే పదం తెలియక ముందు ఎవరి దగ్గర కూడా కుల ప్రస్తావనే తీసుకురాని చలానికి అతన్ని దూషించే వారుండరనీ నమ్మకం. హరిజనోద్ధారకులందరూ ఇది వరకు చలం వంటి వాళ్ళని వెలివేసిన వాళ్ళే. ఈనాడు అందరూ కలిసే భోజనాలు చేస్తున్నారు కనుక వెలివేయటమనేది కనపడటం లేదు. చలం పూర్వం మాలవారితో సహపంక్తి భోజనాలు చేశాడు. కనుకే చలానికి వెలి తప్పలేదు.

సంవత్సరం క్రితం ఒక కుర్రాడు చాలా కాలం స్కూల్ ఎగ్గొడతాడు.

చలం “ఎందుకు రాలేదు” అంటాడు.

అతడు కారణాన్ని చలంతో ఇలా చెప్పడం ప్రారంభిస్తాడు.

“నేను హరిజన విద్యార్థి నండి........”

“హరిజన విద్యార్థివా? నాకు తెలీనే తెలీదే. ఇన్నాళ్ళూ ఆ సంగతి తేలీక నిన్ను దగ్గిరికి రానిచ్చానే? ఇంక దూరంగా వుండు” అన్నాను.

“ఇంకా చాలా మంది ఉన్నారండి.”

“ఉంటేనేం? వాళ్ళను కులం అడగనూ అడగను. వాళ్ళు చెప్పనూ చెప్పరు. నువ్వు చెప్పావుగా, తెలిసి ఇంక నిన్నెట్టా రానిస్తాను (హరిజన విద్యార్థి)” అన్నాను.

ఆ విద్యార్థి వాదనేంటంటే అతడు హరిజనుడు కనుక మిగతావాళ్ళని పక్కన పెట్టి అతడికి సీటిమ్మంటాడు. చలం న్యాయమేమిటా అని ఆలోచించారు.

“హరిజనుడవైతే నేం”? అని పదే పదే అడిగితే “బీదవాణ్ణి గనుక” అని సమాధానం వస్తుంది.

కులాన్నిగాక బీదరికాన్ని మాత్రమే పరిగణించాలని చాలా మంది అనుకుంటున్నదే అంతకన్నా ప్రత్యేకమయిన చలంగారి వాదన ఇందులో గమనార్హం. అనువంశికంగా బీదరికం అలవాటు అయినవాడి కష్టం కన్నా గతంలో వైభవాన్ని ప్రస్తుతంలో బీదరికాన్ని అనుభవిస్తున్నవాడి కష్టం ఎక్కువయినది.

పూర్వీకుల దరిద్రం కారణంగా సీటు అడిగిన వాడికన్నా నా పూర్వీకులు దేశానికి జ్ఞానాన్ని యిచ్చారు. నాకు సీటు ఇవ్వమనడం ఎక్కువ అర్హతనిస్తుంది. ఇప్పటి హరిజన ప్రేమ రాజకీయం.

"ఇతరులు దారిద్ర్యంలో కష్టాలలో సానుభూతి చూపే హృదయం...... ఎప్పుడూ చూపుతుంది. ఆ సానుభూతి ఫాషన్ అయ్యే వరకు ఆగదు.

హరిజన నిధికి చందాకి ఒకామె నా దగ్గరికి వస్తే "మీరు అతనికన్న హీనస్థితులో వున్నారు. ముందు మిమ్మల్ని మీరు వుద్ధరించుకోండి" అన్నాను.

"మీరు" అంటే ఎవరండోయ్?

"అంటే స్త్రీలు"

"మాకేం?"

"మీరందరూ అంటరాని వారే!"

"ఏం!"

"బహిరంగంగా మొగవారు తాకకూడదుగా!" ఒక్క గాజుల వాళ్ళూ, మంగలవాళ్ళూ తప్ప. అంతేకాదు మీలో చూడరాని వాళ్ళు ఉన్నారు. హరిజనుల కన్న అధమస్థితి మీది."

"చూడరాని వాళ్ళెవరు?"

"గోషావాళ్ళు"

"కాని అంత బీదవాళ్ళం కాదుగా!"

"నాకేం? అందరూ యాచకులే. మొగుళ్ళ దగ్గర."

"ఆస్తి వున్న స్త్రీలెందరు? ఎందరు బైటపడి కానీ సంపాదించగలరు?"

"మీ బట్ట మీది కాదు. మీ తిండి మీది కాదు." అన్నాను. ఆమె వెళ్ళింది కోపంతో.

ఇంకా స్త్రీల ఉద్యమంలో పని చెయ్యడం కొంతవరకే ఫాషన్ అయింది - మీటింగులూ కాన్ఫరెన్సులూ కనుక అంతవరకే పనిచేస్తారు. వివేకవంతులందరూ పూలదండలూ అచ్చులో పేర్లు అదృష్టముంటే బొమ్మలూ!"

**కథ ఉద్దేశ్యం :**

తరతరాలుగా హరిజనులు ఎదుర్కొంటున్న కష్టాలు చెప్పడానికే అలవి కానివి. కులాల హెచ్చుతగ్గులు ఉండకూడదనేది ఉద్దేశ్యం.

**'హరిజన విద్యార్థి' కథ పై సంస్కరణోద్యమ ప్రభావం :**

భారత రాజ్యాంగ నిర్మాతయైన అంబేద్కర్ రాజ్యాంగం ప్రకారం హరిజనులకు కల్పించిన రిజర్వేషన్‌లు కానీ సమాన హోదా వంటివి ఎంతవరకు అమలు జరుగుతున్నయో మనందరికీ తెలుసు.

వ్యవస్థలో లోపాలు చోటుచేసుకొని హరిజనులు అనగదొక్కబడుతున్నారు. ఎవరైనా అగ్రకులాలు వాళ్ళు హరిజనుల్ని తమలో కలుపుకోవాలని చూస్తుంటే అగ్రకులానికే చెందిన మరికొందరు వారిని ప్రత్యక్షంగానో పరోక్షంగానో వెలివేస్తున్నారు. ఇటువంటి తంతు ఆ రోజుల్లోనూ ఈ రోజుల్లోనూ ఉంది. కాలం మారింది. విద్యావకాశాలు పెరిగాయి. హరిజనులు కూడా తమ ప్రతిభను చాటుకొంటున్నారు. మనుష్యులంతా ఒక్కటే అన్న భావం మానవులందరిలోనూ పెంపొందాలి అంటూ చలం 'హరిజన విద్యార్థి' కథ ద్వారా సందేశాన్నిచ్చినట్లు భావించాలి.

చలం ఈ కథలో పేర్కొన్న "నేను హరిజన విద్యార్థిని. నాకొక్క సీటు దయ చేయండి." "ఆ మాట అనగానే వెంటనే లేచి కావలించుకోవాలి ఆ మాట అన్న మనిషిని. తరువాత గంగాళంలో నీళ్ళు తోడించి ఇద్దరము కలిసి పోసుకోవాలని లేకపోతే క్రిష్ణకు వెళ్ళాలి. తరువాత విస్తళ్ళు తాకుతూ భోజనం చెయ్యాలి. ఒకటే గ్లాసులోంచి తాగాలి" అన్న మాటలు పరిశీలిస్తే కనుక 'హరిజన విద్యార్థి' కథలో సంస్కరణా భావాలు ఉన్నట్లు స్పష్టమైంది. కాబట్టి 'హరిజన విద్యార్థి' కథపై సంస్కరణోద్యమ ప్రభావం వుందని చెప్పడంలో సందేహం లేదు.

## 6. నాయుడు పిల్ల

ఇరవై సంవత్సరాల నాయుడు పిల్ల తనకిష్టం లేకపోయినా తల్లితండ్రుల కోసమని తనకంటే వయసులో 30 ఏళ్ళు పెద్దవాడయిన మరో ముసలి నాయుడ్ని పెళ్ళి చేసుకొని ఎటువంటి మానసిక క్షోభను అనుభవించిందో తెలియచేసే కథే 'నాయుడు పిల్ల'.

**'నాయుడు పిల్ల' కథ సంక్షిప్త పరిచయం :**

ఈ కథలో 20 సంవత్సరాల అమ్మాయి కథ ప్రారంభం నుండీ కథ చివరిదాకా తన ఇష్టాలు, కష్టాలు, నష్టాలు ఏకరువు పెట్టడం చూడొచ్చు. అన్ని కుటుంబాల్లో అందరాడపిల్లల్ని అడిగినట్లే ఆమె తల్లిదండ్రులు కూడా ఆమెను "ఈ సంబంధం నీ కిష్టమేనా" అని అడుగుతారు. ఆమె ఒప్పుకోవాలా వద్దా అనే సందేహంలో వుంటుంది. మాటవరసకి ఆమె

తల్లిదండ్రులు నీ ఇష్టమే అన్నప్పటికీ మరోపక్క పెళ్ళికొడుకు వాళ్ళు వచ్చి మీ అమ్మాయి నివ్వమంటే "మహా దురవస్థలోంచి తప్పించడానికి వొచ్చిన దైవం లాగ" కనపడతాడు అతడు వాళ్ళకి. నీ అంత అదృష్టవంతురాలు లేదంటుంది తల్లి. "నాలుగు భవంతుల ఇల్లు, గుర్రంబండి, బంగారు సులోచనాల జోడు, వెండి పొడుంకాయ ఇవన్నీ తలుచుకోమంటుంది. అంతకంటే యేం కావాలి! పరజాలు కట్టినా, గుర్రంబండి యెక్కి తిరగొచ్చును కదా! కిటికీలు మూసినా, ఆ పెద్ద ఇంట్లో వుండొచ్చు కదా! వొంటరిగా అయిన వెండిగిన్నెల్లో కాఫీ తాగొచ్చు కదా! యెవరూ చూసే వారుండక పోయిన, బనారసు చీరెలు కట్టొచ్చు. కాసుల పేర్లేసుకోవచ్చు ఇంకేం (నాయుడు పిల్ల)!" అంటుంది. ఆమె కుటుంబం ఆర్థిక పరిస్థితిని తలుచుకొని గతంలో ఆమె తండ్రి చేసిన వేయి రూపాయల బాకీకి గానూ రాసిచ్చిన ప్రామిసరీ నోటు కన్యాశుల్కం కింద ఇచ్చేస్తానంటాడు ఆ పెళ్ళికొడుకు. ఇంకా కొంతైనా తల్లిదండ్రుల కష్టాలు తీరుతాయని చేసుకోవడానికి ఒప్పుకుంటుంది, పెళ్ళవుతుంది.

మూడు నెలలు గడుస్తుంది. "నా అంత తెలివి తక్కువ మొద్దు లోకంలో లేదు. ఇంత ఘోరమైన పొరపాటు యెవరూ చెయ్యాలా. ఇంతవరకు యేదో సౌఖ్యపడతాననుకున్నా, మొద్దయినా, మొగుడొకడుంటే చాలననుకున్నా. నేను తవ్వుకున్న పెద్ద గోతిలో నేనే పడ్డా. నేను చేసిన ఈ ఘోరమైనపొరబాటు ఆడవాళ్ళందరికీ వెయ్యి కంఠాలతో చాటించాలనిపిస్తోంది. నా అరుపు విని వొక్కళ్ళన్నా యిలాంటి నరకం నించి తప్పించుకుంటే చాలు. ఈడుకాని వాళ్ళ పెళ్ళి కూడదని తెలిసి కూడా యీ పని చేశాను. కోర్కె లోకంలో వున్న ప్రేమనంతా అనుభవిద్దామనీ, చేసుకుంది నాకంటే ముప్పయేళ్ళు పెద్దవాణ్ణి. ఆ కోర్కె పోయిందనుకున్నాను. మరచిపోగలననుకున్నాను. యెంత పిచ్చిదాన్ని, కొంతమంది నన్నూ నా హోదాని చూసి వోర్వలేకపోతున్నారు కూడాను (నాయుడు పిల్ల)."

ఆమెకు పెళ్ళైన తరువాత గదిలోకి పంపిన మొదటి రాత్రి తెల్లవారుజామున మెలకువ వస్తుంది. చుట్టూ పరికించి చూస్తుంది. ఆమె నాన్న గదిలో పందిరిమంచం మీద యీ కొత్తాయన పక్కన పడుకొని వుంటుంది. బయట నుంచీ సూర్యకాంతితో వెలుగు సన్నగా లోపలికి పడుతుంటుంది. దీపం మాత్రం తెలతెలబోతూ వుంటుంది. అతడివైపు చూస్తుంది. అతడు "లావుగా, పెద్దగా, బొర్ర కనపడుతో వెల్లకిత్తులగా పడుకొని వున్నారు. మంచం పందిరివైపు నోరు తెరుచుకొని, గురక పెడుతున్నారు, ఆ గురకే నన్ను లేపింది. ముక్కులోంచి వూపిరి పీల్వటం లేదు. గాలి బదులు యేదో నల్లగా కాలువగట్టి, ఆ పొట్ట మీసాల్లోంచి కారుతోంది - ఆ నోరు బాబోయి! కట్టించుకున్న పళ్ళు రాత్రెప్పుడో తీసేశారు. చిగుళ్ళు

మొండి తునకలు కనపడుతున్నాయి. చప్పిదవడలు. చొంగ, తలకి చలిటోపి తగిలించారు. ఆ కోతి టోపిలోంచి మొఖం యేం అందంగా కనపడుతోందని! ముద్దు లొలికిపోతుంది. ఆ రొమ్ము మీద వెంట్రుకలు పక్కల్నా గుండ్రంగా గొరిగించాడు! చొక్కా తీసేస్తే ఆ వొళ్ళు ముడతలూ ఆ చంకలు, అమ్మోయి! కళ్ళు మూసుకున్నా."

ఆ వైభవాన్నేనా కావాలనుకున్నది అనుకుంటుంది. ఇంకా జీవితం ఎంత కాలముంటుంది. రాత్రి పెట్టిన ఫలహారాలు, తమలపాకుల, తొడిమలు ఆమెను, ఆమె జీవితాన్ని చూసి వెక్కిరిస్తున్నట్లుంటుంది. పెళ్ళంటే అదేనా? రాత్రి అంత అసహ్యం పుట్టలేదు. మెడను చూసుకుంటే అతడు కట్టిన బంగారు గొలుసు కనపడుతుంది. ఆమె ఒళ్ళు రక్తం చిమ్మి మెరుస్తున్నట్లుంటుంది. ఆ వొంటితో ఇంకా సౌఖ్యమెక్కడిది? సంతోషమేలా దక్కుతుంది? ఆమెమీద ఆమెకే జాలిపుడుతుంది బతికినన్నాళ్ళు అతడితో ఏం చేస్తుంటుంది?

పెళ్ళైన కొత్తలో నాయుడుగారికి వారంరోజులు చిన్న పెళ్ళాం, ఆమె కొత్త అందం, నవయవ్వనాన్ని ఇస్తాయి. కాని ఆరిపోయే దీపం ఎంతసేపు వెలుగుతుంది? ఎప్పుడోకప్పుడు ఆరిపోవడం తప్పదు. ఒక్కసారిగా బగ్గుమంటుంది. దీపమయితే భగ్గుమంది కానీ ఆమె జీవితంలో మాత్రం వెలుగు లేదు. ఆమె జీవితంలో వచ్చిన వెలుగుకు మాత్రం శాంతిలేదు. అప్పుడే ఆమెలో యవ్వనం మొదలవుతుంటుంది. ఆమె చేసుకున్న ముసలాయన బండి, మేడ, భోజనాన్నిస్తాడు. వాటిల్లో తన సౌఖ్యాన్ని చూసుకొని, తలెత్తిన కోర్కెలను చంపుకోవచ్చు అనుకుంటుంది. కానీ అలా జరగలేదు. ఇంకా ఎక్కువవడం ప్రారంభమాయ్యాయి. అవన్నీ అతన్ని చూస్తే చచ్చిపోతున్నాయి.

అయిందేదో అయిపోయింది ఊరికే దిగులు పడుతూ ఉండటంలో ప్రయోజనం ఉండదు. అంటూ మనసునీ, గుండెనీ రాయి చేసుకొని ఆ ముసలాయన్ని సంతోషపెట్టాలనుకుంటుంది. కానీ ఆమె వల్ల కాదు. యవ్వనంలో ఆమె నరాలు పీకేస్తున్నట్లు అనిపిస్తుంటుంది. మగ నౌకర్లని చూసినా ఏదో తెలీని బాధ. ఏ నిముషాన ఏం పాడుపని చేస్తానో అని భయపడుతుంటుంది. "చచ్చిన వాళ్ళు ఎంత ఏడ్చినా తిరిగి రానట్టే మండిపోయిన యవ్వనం కోసం పెనుగులాడితే ఏం లాభం" అంటూ తన మనసుకి ఎంత నచ్చచెప్పుకున్నా అదే ఆలోచన స్ఫురణకొస్తుంది. చివరకు ఆమెకు జంతువుల్ని, పక్షుల్ని చూసినా ఈర్ష్య కలుగుతుంది. ఆమెకు బిగ్గరగా అరచి, గాలిని కౌగిలించుకోవాలని అనిపిస్తుంది.

ఆమెకు ఆ ఇంటినుండీ తప్పించుకొని పారిపోవాలనిపిస్తుంటుంది. కానీ యెక్కడికెళ్తుంది. తండ్రి రానివ్వడు. పైగా అప్పు కూడా తీరలేదు. "సంఘం, ఈ కులం ఈ వివాహ చట్టం, యేరి, యేరి ఈ ముసలినిచ్చాయి. సృష్టి ఆగదు. సంఘం ఆగదు. ఆ కాల్చే కోర్కా ఆగదు. లోలోపల దగ్ధమై నశించేది నేనే. నన్ను తాకడం, నా దగ్గర నుండి పాలు తాగడం, ఎంత ఇష్టంగా వుంటుంది, నా పిల్లలకీ? మొదటామెకీ బిడ్డలు లేరు. మా ఇద్దరిదేనా తప్పు? పాపం ఆమెకూడా నాకు మల్లేనే బిడ్డలకోసం ఏడ్చి ఏడ్చి అట్లానే పోయింది గావును (నాయుడు పిల్ల)?" అనుకుంటూ ముసలిభర్తతో ఉండలేక మండుతున్న కోర్కెను అనుచుకోలేక గతంలో తన ప్రమేయం లేకుండానే చుట్టుపక్కల వాళ్ళ వీధి గోడలపై తమ పేర్లు ఎక్కించిన తరువాత ప్రేమ పుట్టుకొచ్చిన పార్థసారథి గుర్తుకు వస్తాడు. ఆ వెంటనే ఓ రోజు అనూహ్యంగా ఓ తమాషా జరుగుతుంది. "నేను కలలోనన్నా అనుకోలా, నాకంత అదృష్టమొస్తుందని. విచ్చిన బొడ్డు మల్లెల వాసన వేస్తోంది. పైరుగాలి తిరిగింది. హృదయారాటం ఎక్కువయింది .......... నా వెనుక ఎవరో నుంచున్నారు చీకట్లో. భయం వేసింది.

"నాన్నమ్మా!"

కలలో జరిగిన సంగతేదో మళ్ళీ జ్ఞాపకమొచ్చినట్లుంది.

"పార్థసారధీ!"

వుక్క వల్ల రెవికన్నా వేసుకోలేదు. నన్ను ఇనపకమ్ముల వంటి చేతులతో బిగించి, ముద్దు పెట్టుకున్నాడు. ఆహా! యేన్నేళ్ళమట్టి కలలు కంటున్నా అట్లాంటి ముద్దులకోసం?

ఏమేమిటో గారాబపు మాటలన్నాడు ......... ఇంక నాకేమక్కర్లేదనిపించింది లోకంలో. జన్మమంతా ప్రేమలేకుండా గడపవలసి వచ్చినా దిగులులేదు. అనుభవించాను. నాశనములేని ఆ నిముషాన్ని సంఘం, నీతీ, పతివ్రతలూ, నాయుడుగారూ, ఎవ్వరూ, ఈ నిమిషాన్ని నా దగ్గర్నించి లాక్కోలేరూ కదా? ......... అరిటి తోటలోకి తీసికెళ్ళా, చివరికి నా చిన్న ప్రియుడితో తోటలో చెయ్యీ చెయ్యీ కలిపి నడిచాను. నా కలలన్నీ నిజమైనాయి. ఆ ముద్దులతో నా ముసలి తనమంతా పోయింది. ఆ కోపం ముడతలు కరిగిపోయినాయి. తోటలో గచ్చు అరుగు మీద నా పార్థసారధి చేతుల మధ్య పడుకున్నాను ముద్దులతో అలసిపోయి అట్లానే పడుకొని నా చెవులో తన సంగతంతా చెప్పాడు. ఇంటరుమీడియెటు పరీక్ష తప్పి కలకత్తా వెళ్ళాడు. అక్కడ చదువుతో నాన్ కో ఆపరేషన్ చేసి, ఇంటికి వొచ్చాడు. రాగానే నాకోసం వెతికాడు. ఇన్నాళ్ళు నన్ను మరచిపోనేలేదట. నాకు పెళ్ళయిందని తెలీగానే

గుండెల్లో రాయి పడ్డది. బతుకుమీద ఆశేపోయింది. ఎందుకోగాని నేను తనని మరిచిపో లేదనీ, ఈ ముసలాయనతో సౌఖ్యంగా వుండననీ, తనని చూడగానే ప్రేమిస్తానని నమ్మకం పుట్టింది. వారం నించి నా ఇల్లు కనిపెట్టి వున్నాడు; రెండు రాత్రులు వరుసగా నేనిట్టా తిరగడం చూశాడు. ఈవాళ ధైర్యం చేసి గోడదూకి ఒచ్చాడు.....నేను యెప్పటికీ తనదాన్నేనన్నాడు ప్రేమ వుంటే ఈ పెళ్ళి అడ్డమా! తనిట్లా కలుసుకోవటం తప్పేకాదని రూఢి పరిచాడు. అట్లా సమాధానం చెబుతూ వుంటే నాకెంతో బావుంది (నాయుడు పిల్ల)."

ఆమె, పార్థసారథి ప్రతిరోజూ రాత్రులు కలుస్తూనే ఉంటారు. ఆమె కడుపులో బిడ్డ తయారవుతున్నాడు. తనతో వచ్చేయ్యమంటూ పార్థసారథి బలవంతం చేస్తూంటాడు.

ఓరోజు పార్థసారథి బలవంతంతో ముసలి భర్తని, అతడి ఇంటిని, సౌఖ్యాలున్నా సంతృప్తిలేని ఆ జీవితాన్ని కాదని వెళ్ళిపోతుంది. ముసలినాయుడు కోర్టుకెళ్ళి ఆమెను తనకే దక్కించుకుంటాడు. కోర్టు అలా తీర్పు ఇచ్చినా ఆమె అతడి దగ్గర ఉండటానికి నిరాకరించి ఆ ఊరు బైటే పదిరోజులు పాటు తల దాచుకుంటుంది. చేసిన తప్పుకు పార్థసారథికి జైలు శిక్ష అనుభవించాల్సి వస్తుంది. ఇంతలో ఆమె తల్లి అవుతుంది. మగపిల్లాడికి జన్మనిస్తుంది.

బారసాల కూడా జరుగుతుంది. ఆ పిల్లాడికి శేషగిరిరావు నాయుడని పేరు పెడతారు. కాని ఆమె మాత్రం "పార్థా" అని పిలుస్తుంటుంది. ఆమె ముసలి భర్తయిన నాయుడు గారు పిల్లాడ్ని ఎత్తుకోబోతే ఓపికంతా కూడగట్టుకొని ఆమె "పో" అని అరుస్తుంది. ఆ ముసలినాయుడుగారు "శేషా" అన్నాగానీ పిల్లవాడు అటువైపు చూడనన్నా చూసేవాడు కాదు. ఆమె మాత్రం "పార్థా" అంటే ఆమె వంక చిరునవ్వులు చిందించేవాడు.

అంతలో కోర్టు సమన్లు రానేవస్తాయి పిల్లవాడ్ని తండ్రికి అప్పజెప్పమని. ఆమె కోర్టుకు వెళుతుంది. ఆమెనేవో ప్రశ్నలడుగుతారు. తరువాత పిల్లాడు తండ్రి ఆస్థి కనుక పిల్లాడ్ని ముసలి భర్తకే అప్పజెప్పమంటారు. ఆమె ఇవ్వనంటూ రోదిస్తుంది. చివరకు మెజిస్ట్రేటు కాళ్ళపై పడి ప్రాధేయపడుతుంది. ఫలితం ఉండదు.

అంతలో ఆమె ముసలి భర్తయిన నాయుడుగారు "అంత పిల్లవాడి మీద దయగలిగిందైతే వొచ్చి యింట్లో వుండమనండి! నేనొక్క పల్లెత్తు మాట అన్నానా?" అంటాడు.

మెజిస్ట్రేటు వెళ్ళమంటాడు అంతలో ఆమెకో ఆలోచన వస్తుంది. "అసలు యీ అబ్బాయి ఆ ముసలాయనకి పుట్టలేదు" అంటుంది. దాంతో అక్కడున్న వారంతా నిశ్శబ్దం

అయిపోతారు. చివరకు మెజిస్ట్రేటు కూడా. నవ్వు ఆపుకుంటూ మెజిస్ట్రేటు "ఆ సంగతేమిటో మాకు తెలీదు. అయినా ఆయన కొడుకే" అంటాడు.

"నన్ను అబ్బాయినీ నాయుడితో వెళ్ళమని వుత్తరువు చేశారు. నాకు అధైర్యం వొచ్చింది. ఇంతా సిగ్గు విడిచి చెప్పినా కార్యం లేదు. యెవడు ఆ ముసలివాడు మధ్య? మళ్ళీ న్యాయమట. పక్షపాతం లేదట! ఆ ముసలివాడు మేస్ట్రీటుకి లంచం ఇచ్చి వుండాలి. పార్థని మళ్ళీ ప్లీడరుని కనుక్కోమన్నాను. అతనూ అదే అన్నాడు, నాయుడి భార్యని కనుక, యెట్లా కన్నా ఆ బిడ్డ నాయుడి బిడ్డేనట! యేం తెలివిగా, సరసంగా వుంది! ఆంబోతుకి కన్నాదూడలు, కాపువాడివైనట్లు? నన్ను ముసలాయన కొన్నాడు. తిండిపెట్టాడు. కనుక నా దూడలు మూసలాయనవే! మళ్లీ వీళ్ళు మనుషులట! నాగరికమట! ఋషులూ, యోగులూ వున్నదేశమట ! స్వరాజ్యంట యిదీ న్యాయం! నేను గొడ్డునా చెట్టునా (నాయుడు పిల్ల)?"

న్యాయస్థానం పిల్లాడ్ని నాయుడిగారికే ఇవ్వాలంటూ తీర్పు చెబుతుంది. తన ప్రియుడైన పార్థకోసం పిల్లాడ్ని ముసలి నాయుడికి ఇచ్చేస్తుంది.

కొన్నాళ్ళకు నాయుడిగారింట్లో దాసి చేత పిల్లాడికి జబ్బుచేసిందంటూ కబురు పంపుతారు. ఆ మాట విన్న ఆమే తన ప్రియుడుకి ఇష్టం లేకపోయినా పిల్లాడి దగ్గరకు వెళ్తుంది. నాయుడుగారు ఆమెను కసితో పొమ్మంటారు. పిల్లవాడు తల్లిని చూశాక మరణిస్తాడు. ఆమె రోదనకు అవధులుండవు.

**కథా ఉద్దేశ్యం :**

ఈడు-జోడు అనే పదాలు పెళ్ళి కావాల్సిన ఆడపిల్లలూ, మగపిల్లలూను సంబోధించటానికి వాడే పదాలు. అయితే ఆ పదాల్ని సంబోధించడానికి వాడడమే కాదు, వాటిని పాటించడానికి ప్రయత్నం చేయాలనేది ఉద్దేశ్యం.

**'నాయుడుపిల్ల' కథ పై సంస్కరణోద్యమ ప్రభావం :**

ఈ కథ ద్వారా సున్నితమైన సమస్యలెన్నో సమాజానికి ఆటంకంగా ఉండి దాన్ని ప్రగతి వైపు నడవనివ్వకుండా వెనక్కి లాగుతున్నట్లు గుర్తించాలి. అవి పేదరికం, కన్యాశు ల్కం, బాల్య వివాహాలు. కన్యాశుల్కం అనేది గురజాడ కాలంలో ఎంతగా విజృంభించిందో, దాని వల్ల ఎటువంటి దారుణాలు జరిగాయో, ఎంతమంది ఆడపిల్లలు జీవితాలు బలయిపోయాయో లెక్కకందదు. అయితే రోజులు మారుతున్న కొద్దీ కన్యాశుల్కం అంతరించిపోయిన నేటికాలంలో దాని స్థానంలో వరకట్నం అవతరించింది. ఈ వరకట్న

దాహానికి ఎంతోమంది ఆడపిల్లల జీవితాలు బుగ్గిపాలు అయిపోతున్నాయి. అది రూపుమాపాలంటే పెద్దవాళ్ళ ఆలోచనా ధోరణిలో మార్పురావాలి. అలాగే పేదరికం భారీ నుంచి ప్రజల్ని తప్పించాలంటే సమన్యాయం, సమానత్వం అనేవి పెంపొందాలి. ఇక బాల్యవివాహాలుగా పేర్కొంటున్న చిన్న వాళ్ళయిన ఆడపిల్లలకు వారికంటే రెట్టింపు వయసున్న మగవాళ్ళకిచ్చి పెళ్ళిళ్ళు చేయడం రూపుమాపబడాలంటే కూడా పెద్దల ఆలోచనా ధోరణి మారాల్సిందే. ప్రస్తుత కథలో చలం ఓ నాయుడు పిల్లచేత 50 సంవత్సరాల వాడ్ని వివాహం చేసుకోవడం వల్ల ఆ అమ్మాయి ఎన్ని అవస్థలు పడిందో ఆమెతోనే చెప్పించి తనలాగా ఇతర కులాల్లో ఉన్న ఆడపిల్లలకు అటువంటి అవస్థ ఎదురవనివ్వకూడదని హెచ్చరింపచేయించాడు. ఇది కూడా సంస్కరణ గానే భావించాలి. కనుక 'నాయుడుపిల్ల' కథ పై సంస్కరణోద్యమ ప్రభావం పనిచేసిందని చెప్పడంలో సందేహం లేదు.

## 7. "హిందూ-ముసల్మాన్"

హిందూవులకీ-ముస్లీంలకు మధ్య తలెత్తిన వైరాన్ని చూపించే కథ 'హిందూ ముసల్మాన్'

**"హిందూ-ముసల్మాన్" కథ సంక్షిప్త పరిచయం :**

పంజాబు సమీపంలో మతఘర్షణలు జరిగినపుడు 'హిందువులతో బాధించబడ్డ ముస్లింలు' సమూహాలుగా పశ్చిమ పంజాబు వైపు (పాకిస్తాన్‌లోనిది) వలస పోతుంటారు కట్టుబట్టలతో. అంతలో సూర్యాస్థమయం అవుతుంటుంది వారు పడుతున్న బాధలతోనే.

ఆ ప్రాంతమంతా నిర్మానుషంగా ఎడారిని తలపిస్తుంటుంది. తెలియని ఎవరో ముగ్గురు వచ్చి కలుస్తారు వాళ్ళని. కనిపించిన తురకనల్లా చంపమన్నారన్న వార్తనంటిస్తారు. ఇంకొంతసేపటికి పడమర నుంచీ తూర్పుకు ఇంకొ గుంపు చేరుకుంటుంది. వాళ్ళు 'ముస్లింలచే బాధింపబడ్డ హిందువులు.' హిందువులు నరుకుతారన్న వార్త వల్ల కోపోద్రేకులైన ముస్లీంలు హిందువులు గుంపుపై దండెత్తుతారు. తిరిగి మళ్ళీ ఘర్షణ చెలరేగుతుంది. ఎందుకు గలాట జరుగుతుందో తేలీక దీనంగా మాట్లాడుకుంటుంటారు ఇద్దరు హిందు-ముస్లింలు.

ఇది పుకారని అగ్రనాయకుల ఆదేశం వల్ల జరిగింది కాదని, అసత్యమయిన వార్తల వల్ల ఇటువంటి సంఘటనలే జరుగుతాయని తెలుసుకొని ఆ గలాటాను సద్దుమనిగిస్తారు.

అప్పటికే అవ్వాల్సిందంతా అవుతుంది. అబద్దాన్ని చేరవేసిన ఆ ముగ్గురు వ్యక్తులు ఏమయ్యారో తెలీదు.

**కథా ఉద్దేశ్యం :**

మత వైషమ్యాలు ఎన్నో దారుణాలకు కారణమవుతాయనేది ఉద్దేశ్యం.

**'హిందూ-ముసల్మాన్' కథ పై సంస్కరణోద్యమ ప్రభావం :**

అసత్యాలను పుంఖాను పుంఖాలుగా ప్రచారం చేయటం వల్ల మనుష్యులలో వైషమ్యాలు పెరిగి ఘర్షణలు తలెత్తుతున్నాయి. ఇటువంటివి మనదేశంలో ఎక్కువగా జరుగుతున్నాయి. కారణం విచక్షణాజ్ఞానం లేకపోవడం. ఆ విచక్షణ కోల్పోవడానికి కారణం అవిద్య. ఈ రెండూ ఎప్పుడు ఒకదానితో ఒకటి ముడిపడి ఉంటాయి. అందుకే విద్యావకాశాలు పెరగాలి. మంచి-చెడుల విచక్షణను సమకూర్చుకోవాలి మానవులు. అప్పుడే మనుష్యులకు ప్రేమించుకోవడమే నైజమౌతుంది. లేకుంటే విధ్వంసాలు జరుగుతాయ్. మతాలు మానవత్వానికి అడ్డుగోడలు కావని చలం ఈ కథ ద్వారా సందేశాన్నిచ్చాడు. విధ్వాంసాల వల్ల శాంతి సమకూరదు. దానికి కారణం తెలుసుకొని దానిని నిర్మూలించినట్లయితేనే శాంతి సౌరభాలు ప్రసరిస్తాయంటూ చలం 'హిందూ-ముసల్మాన్' కథ ద్వారా నిరూపించాడు. ప్రస్తుత కథలో హిందువుల చేత బాధింపబడ్డ ముస్లింలు, ముస్లింల చేత హింసించబడ్డ హిందువుల వారి మధ్య తలెత్తిన ఘర్షణకు అసత్య ప్రచారాలు కారణమని తెలుసుకొని, తలెత్తిన ఘర్షణను నిరోదించినట్లుగా రచయిత చిత్రించి చిరకాలంగా హిందూ-ముస్లింలు అంటే కేవలం వైరమే కాదు ప్రేమ సహనాలు కూడా అని రచయిత నిరూపించి పాఠకులను ఉత్తేజపరిచాడు. కాబట్టి ఓచైతన్యాన్ని, రెండు మతాలు మధ్యగల మత సామరస్యాన్ని తెలియజేసిన కథ కనుక 'హిందూ-ముసల్మాన్' కథపై సంస్కరణోద్యమ ప్రభావం శక్తివంతంగా పని చేసిందని చెప్పాలి.

## 8. భోగం మేళం

పెళ్ళి వేడుక జరగవలసిన చోట సాంఘిక దురాచారమైన భోగం మేళం వల్ల పెళ్లి ఎలా పెటాకులవుతుందో తెలిపే కథే భోగం మేళం.

**'భోగం మేళం' కథ సంక్షిప్త పరిచయం :**

సాంఘిక దురాచారమైన భోగం మేళంను నిషేధించినట్లు బిల్లు రావడంతో దాని గురించి సాంబయ్యా, కాలేజీ ప్రిన్సిపాల్, క్లయింటు వెంకయ్య, ప్లీడరు రాజారావులు

అనుకూలంగానూ, విముఖతగానూ మాట్లాడుకుంటుంటారు. అంతలో ప్లీడరు రాజారావు యదార్థంగా జరిగిన ఓ కథ చెబుతానంటూ కథ ప్రారంభిస్తాడు.

అతగాడి ప్రాణ స్నేహితుడు, రూంమేట్ అయిన ప్రభాకరం పెళ్ళికి వెళతాడు. ప్రభాకరం చేసుకోబోయేది హైకోర్టు జడ్జీ కూతుర్ని. అతడు "కూతురికి శరీరావసరమని గాని, లేకపోతే పెళ్ళి చెయ్యడమనే తక్కువ స్థితికి దిగడనుకో." మామగారు పదివేలు కట్నం ఇస్తానంటాడు ప్రభాకరానికి. మామగారికి ఒక్కటే కూతురు గనుక అతడి యావదాస్థికి హక్కుదారుడవుతాడు మావాడు. పెళ్ళి ఏర్పాట్లన్నీ చకచకా జరిగిపోతుంటాయి. అంతలో జడ్జి గారి తమ్ముడు భోగం మేళంతో సహా దిగుతాడు పెళ్ళికి. "అతడు రసికావతంసుడు."

అతగాడు తీసుకొచ్చిన వేశ్యకు పదహారు సంవత్సరాలు కూతురు కూడా వుంటుంది. ఆమె పేరు రాధా. 'ఆమెను ప్రకటించి పైకి తీసుకురావలనేదే అతగాడి ప్రయత్నం. తీరా భోగం మేళం వచ్చింది గనుక, ఆమెని వీలైనంత ఉపయోగించుకుంటారు. ఆ పెళ్ళిలో రాధ వైపు సరిగా చూడనన్నా చూడనివ్వడు ఆ జడ్జి తమ్ముడు. నిజంగా చాలా అందం. అందమే కాదు ఆమెలో ఓ గుణం వుంటుంది. తల్లిలోనూ వుంటుందిలే! అదీ జడ్జీగారి తమ్ముణ్ణి ఆమె గుమ్మానికి కట్టేసింది అనుకున్నాం. రాధను చూస్తున్న వాళ్ళకు ఆమెను అమాంతంగా కౌగలించుకోవాలనిపిస్తుంటుంది. కౌగిలించుకుంటే ఏమి అనదని, కౌగలించుకోమంటూ ఆహ్వానమిస్తున్నట్లు రూఢిగా తెలుస్తుంటుంది. ఆ పెళ్ళిలో అందరూ రాధ గురించే మాట్లాడుకుంటారు. పైగా ఆమె పాడడం, ఆడడం, జావళీలు అభినయం, ఆహ్వానం, వేళ్ళు, చేతులు రొమ్మునించి కాంతులు వాళ్ళ మీద ప్రయోగించడం, వాళ్ళు కోర్కెల్ని అణుచుకోలేక అవస్థ పడుతుంటారు. పైగా జడ్జీ తమ్ముడు వాళ్ళ భుజాల మీద కొడుతూ ఆమెను వర్ణిస్తూ ఆమే ప్రతిభను గుర్తించారా లేదా అంటూ అడగటం. ఆమెను వాళ్ళకు కనపడనీయకుండా చెయ్యడం చేస్తుంటాడు. అంతేగాక ఆమెను "అనాఘ్రాత పుష్ప"మంటూ వర్ణిస్తూ ఆమెను కళకే అంకితం చెయ్యబోన్నట్లు పెళ్ళిలో ప్రకటిస్తుంటాడు. ఎవరైనా ఆ అమ్మాయి వైపు చూడబోతే జడ్జి తమ్ముడు కొట్టడానికి కూడా వెనుకాడడం లేదు. భోగం వాళ్ళందరికీ వేరే గదులు. ఆ మేళంలో మిగిలిన వారంతా రాధకు కాపలా. అది అలా వుండగా హఠాత్తుగా పెళ్ళి మూడో రోజు పెళ్ళికొడుకు కనపడడం లేదని ఓ పక్క, మరో వైపు నుంచీ రాధ కూడా కనపడడం లేదంటూ చెప్తూ రాజారావు దిండు మీద వాలతాడు.

ఎంతగా వెతికినా, ఎన్నిచోట్లు చూసినా కనపడరు వాళ్ళు. పైగా పెళ్ళికొడుకుకి కట్నం రూపంలో ఇచ్చిన పదివేలు, వెండి పళ్ళాలు, జడ్జీగారి తమ్ముడు రాధకు చేయించిన మూడువేల నగలు కూడా కనబడవు. అలా అదృశ్యమైన ఆ పెళ్ళికొడుకు పదేళ్ళ తరువాత అతడి మిత్రుడైన రాజారావుకు మరో ఊరిలో తారసపడుతాడు. అలా చాలాకాలం తరువాత కలుసుకున్నవారిద్దరూ ఓ కాఫీ హోటల్లో మాట్లాడుకుంటుంటారు. అతను ఆ వూళ్ళో రాధతోనే వున్నట్టు కొంచెం "సీడీ"గా అయినాడేమో అనిపిస్తుంది రాజారావుకి. కానీ, ఏం చెప్పలేడు. ప్రభాకరం మామూలుగానే ఉన్నట్టు ఉంటాడు. అంతే ఘనకార్యం చేసినట్లుగాని, అంత రసికురాల్ని అనుభవించినట్లుగాని ఉండడు. దరిద్రమూ ఉండదూ. ధనము వుండదు.

అంతలో రాజారావు మిత్రుడు ప్రభాకరాన్ని "ఏం జరిగిందిరా? ఎందుకు వచ్చేశావు?"

"ఏం లేదురా. పెళ్ళికొడుకుని గనుక రాధతో పరిచయం సులభమయింది. పెళ్లి కొడుకు గ్లామర్ రాధ మనసులో పనిచేసింది గావును."

"సరేలే, ఎందుకు మాయమైనావు?"

"నీకా వీలు కలిగితే నువ్వు పారిపోయి వుండవా?"

"ఏమోలే, అంతవరకూ రానివ్వనేమో."

"ఎంత వరకు?"

"అన్నిటినీ, అందరినీ వొదిలి పారిపోయేటంత వరకు."

"అంటే జీవచ్ఛవానివి గనుక."

"సరేలే ఆ అమ్మాయి ఎందుకు వచ్చిందిరా?"

"ఏమిటో! చాలా కాలమైంది. మరిచిపోయినాను. పినమామగారిని తప్పించుకొని రాధ గదిలోకిపోయి, ఆమె నాట్యాన్ని పొగుడుతున్నాను. దగ్గరగా నుంచునీ, "ఏదో అందరూ అంటారు, ఆ మాట" అంది. నేను ప్రత్యేకంగా అంటున్నాని ఆమెకి చెప్పే మార్గం, నాకు అది తప్ప ఇంకో మార్గం కనపడలేదు. అంతేననుకుంటా. ఆవిధంగా తప్ప స్త్రీ మీద ఇంకో విధంగా గౌరవం కనపర్చలేమనుకో. అది వీలుండగా, వయసులో వుండగా, తక్కిన పొగడ్తలన్నీ వుత్తసారంలేని మాటలు. ఆమె అందం చూశావుగా! తనే నన్ను రాత్రి జడ్జీగారి స్టడీ గదిలో కలుసుకోమంది. అక్కడా సోఫామీద నాట్యమాడిందనుకో. ఇంక ఆమె లేకుండా బతకలేనని ఆరాత్రే సోఫా మీద తెలిసిపోయింది నాకు. తరువాత పారిపోవడమా? జీవితంలో ముఖ్యమైన మార్పులు జరిగే సంగతులు ఎందుకు చేశామో, ఎప్పుడూ అర్థం కాదనుకుంటా."

"సరేకాని, ఇప్పుడేం చేస్తున్నావు?"

"ఏం లేదు. ఆ డబ్బు జాగ్రత్తగా వడ్డీకి వేశాం బాగానే బతుకుతున్నాం."

"రాధ వుందా నీ దగ్గిర? వాళ్ళ బంధువులు గోలచెయ్యలేదా?"

"మాకు తెలిసిన వాళ్ళల్లో నిన్నే మొదట చూడటం (భోగం మేళం)." అంటూ సాగుతున్న వాళ్ళ సంభాషణ ముగుస్తుంది. మిత్రుడు వెళ్ళిపోతాడు. రాజారావు కూడా వచ్చేస్తాడు. అది తెలుసుకున్న పెళ్ళి జనం ఇదంతా భోగం మేళం వల్ల జరిగిన అనర్థం అనుకుంటుంటారు. అంతలో సూరిశాస్త్రులు గారు వస్తారు. అతడు డాక్టర్. జరగాల్సిన పెళ్ళికి ఓ పెద్ద. అతడి కొడుకు కూడా డాక్టరే. రామయ్యగారితో ఏదో గబగబ మాట్లాడుతుంటారు. అంతలో "క్షమించండి ఉండండి. ఇప్పుడే వస్తాను" అంటూ లోపలికి వెళతాడు రామయ్యగారు. లోపల హడావిడిగా ఉంటుంది.

లోపల నగలు ఏమైనా పోయినాయా? చూసి వస్తానంటూ పెళ్ళికొడుకు మేనమామ కూడా లోపలికి వెళతాడు. వెంటనే బయటకు వస్తాడు. భోజనాలయ్యాక పెళ్ళికొడుకు వుండడు. వెతికినా కనపడడు కూడా. సూరిశాస్త్రుల గారి కోడలు కూడా కనపడదు. ఊరేగింపుకోసం ఏర్పాటు చేసిన కారు కూడా కనపడదు.

**కథా ఉద్దేశ్యం :**

అక్రమ సంబంధాలు ఎన్నో అనర్థాలకు కారణమవుతాయనేది ఉద్దేశ్యం.

**'భోగం మేళం' కథ పై సంస్కరణోద్యమ ప్రభావం :**

ఈ కథ చదివిన వాళ్ళకి చలం ఇలా రాశాడేమిటి అనిపించి ఉండవచ్చు. ఇంకొందరికి చలం మీద చిర్రెత్తు కొచ్చి ఉండుండొచ్చు. కానీ చలం ఏ దృష్టితో ఈ కథ రాశాడో ఆ దృష్టిని అందుకోగలిగినట్లయితే అది సబబే అనిపిస్తుంది. ప్రస్తుత కథ ద్వారా భోగం మేళం సాంఘిక దురాచారమని, అందులో వున్న స్త్రీలకు ఆ కాలంలోనూ ఈ కాలంలోనూ కూడా విలువలేదని వారి దుస్థితి మహా దయనీయం అని తెలియజేశాడు. అంతే కాకుండా కథ చివరిలో "పెళ్ళికొడుకు భోజనాల తరువాత కనపడలేదు. సూర్యశాస్త్రుల కోడలు కూడా కనిపించలేదు" అని రాయడంలో దాని అర్థం అలా చేయకుడదని, దానివల్ల కుటుంబగౌరవాలు దెబ్బతింటాయని వ్యంగ్యంగా తెలియజేశాడు. ఇంతేకాకుండా కథలో రాజారావు మిత్రడు ప్రభాకరం జీవితాన్ని చక్కదిద్దేందుకు ప్రయత్నం చేసినట్లు చూపించి తనలోని సంస్కరణ భావాన్ని వెలిబుచ్చారు. కనుక 'భోగం మేళం' కథపై సంస్కరణోద్యమ ప్రభావం పనిచేసిందని చెప్పడంలో సందేహం లేదు.

## 9. మాదిగ అమ్మాయి

పేదరికంతో ఓ హరిజన స్త్రీ జీవితం ఎలా నాశనం అయిందో తెలిపే కథే మాదిగ అమ్మాయి.

**'మాదిగ అమ్మాయి' కథ సంక్షిప్త పరిచయం :**

కథకుడిగారిది ఓ పల్లెటూరు. కథకుడు ఆ ఊరు వెళ్ళి అక్కడ అందాలన్నింటినీ అవగాహన చేసుకుంటాడు. ఆ క్రమంలో ఒకరోజు తోటలో ఓమాదిగ పిల్లని చూస్తాడు. ఆమె కథకుడు చేతికి దొరికేక 'రాత్రికి బియ్యానికి యేమన్నా యిస్తే' అంటుంది. కథకుడి హృదయం చివుక్కుమంటుంది. డబ్బు ఇస్తాడు కానీ ఎందుకో వెళ్ళిపోతానంటాడు. డబ్బు ఉచితంగా తీసుకోనంటూ నిరాకరిస్తుంది. ఆమె నీతికి చెలించిపోయిన కథకుడు ఆమె అవసరాన్ని గురించి ఆరా తీస్తాడు. ఆమె దుఃఖంతో తన గాథ చెప్పడం ప్రారంభిస్తుంది ఇలా.

''నేనా డబ్బడిగింది నాకోసమనుకున్నారా? నావృత్తి, నా జీవనం అదే, కాని నా కిష్టమా?...... నన్ను నా మేనత్త కొడుక్కే యిచ్చి పెళ్ళి చేశారు. మొదటి నుంచి మా యింట్లో మాకీ తోటవల్ల వచ్చే ఆదాయం కన్న సుకంగా బతకడం మామూలు. ఇప్పుడాలోచిస్తే ఆపై ఖర్చు మా అమ్మ సంపాయించేదేమోనని అనుమానం. నాకు బుద్ధి తెలిసినప్పణ్ణించి మేము అలివిగాని అప్పుల్లో వుండేవాళ్ళం, ఎవళ్ళెవళ్ళో రహస్యాలు మాట్లాడడం, వెళ్ళడం, ఏవో కాయితాలు, తగాదాలూ జరుగుతోనే వుండేవి. ఒకరోజు రాత్రి నాతో ఏం చెప్పకుండానే అమ్మ నన్ను వెంకయ్యకి వప్పు చెప్పింది. వెంకయ్య మా కులంవాడే. అదేదో దేశంలో లేసుల వర్తకం చేసి డబ్బు సంపాయించాడు. అతనికి మేము ఏడువందలు బాకీ. నేను నిద్రపోతూ వుండగా వొచ్చి పట్టుకున్నాడు. చప్పున లేచి అరిచాను. కాని నాన్నని గూడా తీసుకొని అమ్మ యెక్కడికో వెళ్ళింది. అమ్మ చెప్పిన మాటకి యెదురాడడం నాన్న కెన్నడూ లేదు.

నా కట్టాంటిది కొత్త. అప్పుడు ఏమీ అర్థంగాక వాణ్ణి తోసియీ తోటంతా పరిగెత్తాను....... వాడు వెనకా నేను ముందూ, ఆ వెన్నెట్లో యీ చెట్లలో యెట్లా పరిగెత్తానని! అదే చీకటైతే వాడికి దొరికేదాన్నా! చివరికి ఆ పుల్లరేగి పొదవెనక వగరుస్తున్న నన్ను పట్టుకుని కింద పడేశాడు. అప్పటికీ నా వూపిరి చివరవరకు పొట్లాడాను. ఇంక శక్తిలేక అతనికేసి చూస్తో కాళ్ళూచేతులు వేళ్ళాడేసి పడుకున్నాను. ఏమనుకున్నాడో యేమో నా తలని కిందనేసి

బాది మీద వుమ్మేసి, అమ్మనీ, నాన్ననీ తిడుతో బెదిరిస్తో వెళ్ళిపోయినాడు. కదిలే శక్తిలేక అక్కడ పడివున్నాను, బట్టన్నా సరిగా వొంటి మీద లేకుండా, అరగంటలో అమ్మవొచ్చి నన్ను కొట్టడం ప్రారంభించింది. వాడికి లోబడ్డందుకనుకుని, వాడు నన్నేం చెయ్యలేదని అరిచాను. ఆ మాట అన్నేటికల్లా మరీ కొట్టింది. ఆ "ఏడు వందలూ ఎవరు తీరుస్తారు. నీ మొగుడొచ్చి రక్షిస్తాడా" అని మళ్ళీ కొట్టింది. ఏం రాత్రి అబ్బా అది. మర్నాడురాత్రి వాడు వొచ్చాడు. నన్ను తాకితే చంపుతానన్నాను. అమ్మ నన్ను యింట్లోంచి వెళ్ళకొట్టింది. నామొగుడు రంగూను వెళ్ళాడు. కనుక నాకు దిక్కులేదు.

అప్పడే ఈ ఫ్యాక్టరీ కడుతున్నారు. కూలికి కుదిరాను. ఒకనాడు ఆ మేస్త్రీ చిల్లరలేదని కూలీ యివ్వడం ఆలస్యం చేసి చీకటి పడ్డదాకా వుంచాడు. నాకు భయమేసింది. వెళ్ళాలనిపించింది, కాని ఈ డబ్బులు తీసుకు వెళ్ళకపోతే తిండిలేదు. నన్నా మొండి గోడల మధ్య పట్టుకున్నాడు. వాడి నెత్తి మీద రాయి విసిరికొట్టి పరిగెత్తాను. వాడికి దెబ్బ తగిలిందో, చచ్చాడో అని రాత్రంతా పోలీసువాళ్ళు వస్తారనే భయపడుతోనే వున్నాను. ఆ రాత్రి తిండిలేదు, భయం. ఎక్కడెక్కడో తిరిగాను. మర్నాడు చెట్టు కింద పడుకుని వుంటే నాకు తెలిసినదొకతై వడ్లమరలోకి పనికి తీసికెళ్ళింది. వెళ్ళిన రోజునించి, ఆ మరాయన బ్రాహ్మడు నన్నెగాదిగా చూడడం, నన్ను వృధాగా పలకరించడమూ, చూసి యెంతో భయమేసింది. ఇంక ఈ మొగాళ్ళనించి తప్పించుకోలేనా? యీ అందం నాకెక్కడ దాపురించింది? బైటికి వెడితే మొగాళ్ళు నావంక తేరిబార చూడడమే. ఇది వరకు నాకా చూపుల అర్థం తెలీలేదు. తురకాళ్ళు వాళ్ళ ఆడవాళ్ళకి బురకాలెందుకు వేస్తారో అప్పుడర్థమయింది నాకు. కొందరి చూపులు, తాకడం కంటే కూడా, ఇంకేమో చెయ్యడం కన్నా కూడా అసహ్యంగా దుర్భరంగా వుంటాయి. ఒక్కొక్కడు నావంక చూస్తే, యెదురుగా వెళ్ళి మొహం మీద వుమ్మెయ్యాలనిపించేది. ఆ మరలో వారానికొకసారిగాని కూలివ్వరు. ఆ వారం రోజులూ నన్ను తీసికెళ్ళిన మనిషి దగ్గర బదులు చేసి తిన్నాను. ఆఖరు రోజున మర రాత్రి పని చేస్తున్నది రమ్మన్నాడు. రాత్రులు వీల్లేదన్నాను. రాకపోతే నీ జీతం అసలివ్వరు పొమ్మన్నాడు. దీని అప్పెట్లా తీర్చను? భయపడుతోనే వెళ్ళాను. తక్కిన మనుషులెవరూ రాలేదు. ఆయన వొచ్చి నా చెయ్యి పట్టుకున్నాడు. నేనట్టాంటి దాన్ని కానన్నాను. నన్నా ఫ్యాక్టరీలోకి లాక్కెడుతున్నాడు. నేను మాలదాన్ని నువ్వు బ్రాహ్మడివి ఇది తగదన్నా వినలేదు. పైగా ఐదు రూపాయలు చేతులో పెట్టాడు. అరిచినా చుట్టూ ఎవరూలేరు. వాళ్ళ యిల్లొక్కటే.

అక్కడ దీపం తలుపులోంచి కనపడుతోంది. చప్పున చెయ్యి వొదిలించుకొని పరిగెత్తాను. ఆయన తల్లీ భార్యా వున్నారు. ఏడుస్తో వాళ్ళ కాళ్ళ ముందు పడ్డాను.

"ఛీ. ఛీ. మాలదానివి పొమ్మ"ని లేచారు.

"యీ మాలదాన్ని పట్టుకున్న మీ కొడుకు సంగతేమిటి?" అన్నాను.

ఆ మహాతల్లి కత్తిపీట విసిరి వేసింది. ఆయన ఇంతలో నాకోసం వచ్చాడు. వాళ్ళముందే వాళ్ళిద్దరి ముందే, నన్ను పట్టుకోబోయినాడు. కత్తిపీట తీసి వాడి మీద విసిరివేశాను. ఏమయిందో! పరిగెత్తాను. అర్ధరాత్రి పోలీసులు నన్ను పట్టుకున్నారు. ఆ బ్రాహ్మడి మొహం తెగిందట. పైగా వెండిగిన్నె యెత్తికెళ్ళానన్నారు. ఆ రాత్రి కైదులో మకాం. మర్నాడు ఒక ఇన్స్పెక్టరు ప్రశ్నలడిగాడు. నేను జరిగింది చెప్పాను. వాళ్ళేదో మాట్లాడుకుని నన్ను మళ్ళీ తాళం వేశారు. ఆ కైదూ, ఆ పోలీసులూ, నాకు భయంగా వుంది. దిక్కులేదు, నన్ను చంపుతారో యేమో! ఇంకెవడన్నా వొదులుతారో లేదో! ఎప్పుడూ గాలిలో, చెట్టకింద తిరిగే నాకు ఆ కొట్టు యెట్లా వుందని! చావనన్నా చస్తాను. కాని ప్రతి నిమిషమూ వూపిరి బిగపట్టి ప్రాణాలు బిగించి ఆ కొట్టులో కూచోలేను. ఆ సాయంత్రం ఇన్‌స్పెక్టరు కాళ్ళ మీద పడి యేడ్చాను, నన్ను వొదలమని. ఆ రాత్రి పోలీసు అతను నాదగ్గరికి వచ్చి బలవంతం చేశాడు. నన్ను వొదిలిపెట్టడం తన చేతిలోనే వుందని, వొప్పుకుంటే మర్నాడు పొద్దునే ఇన్‌స్పెక్టరుతో చెప్పి వొదలిస్తానన్నాడు. ఏమైనాసరే, ఏపాపం చేసైనా సరే, బైట పడాలనిపించింది. కానీ నేనెంత వొప్పించినా సిగ్గు తిరుగబడ్డది. ఆ రాత్రి నేరం వొప్పుకొమ్మని నన్ను కొట్టారు కదా! బాబూ! మళ్ళీ న్యాయమంటారు, ప్రభుత్వమంటారు, దేవుడంటారు, అబలల్ని రక్షిస్తాడంటారు, దేవుణ్ణి యెన్నిసార్లు పిలిచానో దెబ్బలుతింటో! ఎందరెందర్నో కాపాడాడు కదా! ఎందరో పాపాత్ముల్ని రక్షించినవాడు నన్ను రక్షించలేదేం? ఇంక దేవుడి మాట విని పాపం చెయ్యకుండానే నేనెందుకు వుండాలో. పోనీ, నేనేమన్నా తప్పు చేస్తే దేవుడికి కోపం రావచ్చు. ఏం చేశానని నాకన్ని కష్టాలు? నా మానం కాపడుకున్నందుకే కదా, నాకన్ని తిప్పలు (మాదిగ అమ్మాయి)?"

అప్పటి నుండీ వెంకయ్య ఉంచుకుంటాడు. కొన్నాళ్ళకు చనిపోతాడు. ఇటువంటి బ్రతుకు తప్ప శరణ్యం లేదంటుంది ఆమె.

**కథా ఉద్దేశ్యం :**

పేదరికం అనే మహమ్మారి పేదలచేత ఏ పనైనా చేయిస్తుంది అనేది ఉద్దేశ్యం.

**'మాదిగ అమ్మాయి' కథ పై సంస్కరణోద్యమ ప్రభావం :**

పేదరికము ఇక్కట్లు ఎంత దారుణంగా ఉంటాయే ఈ కథ తెలియజేస్తుంది. కాబట్టి పేదరికాన్ని నిర్మూలించాలి. అందుకు ప్రభుత్వాలతో పాటు ప్రజలు కూడా కృషి చేయాలి. ప్రస్తుతం కథైన 'మాదిగ అమ్మాయి'లో పేదరికం వల్ల కుటుంబం అప్పులపాలై ఆ అప్పును తీర్చేందుకు కూతురి మానాన్ని పనంగా పెట్టినట్లు తెలుస్తుంది. ఇటువంటి సంఘటనలు గతంలో ఎన్ని జరిగిపోయాయో లెక్కలేదు. కానీ నేడిటువంటి స్థితి ఎదురవకుండా చూడాలనే ఉద్దేశ్యంతోనే చలం ఈ కథ రాసినట్లు భావించాలి. కథలో చూపించిన మాదిగ అమ్మాయి వంటివారు మన సమాజంలో ఎంతోమంది ఉన్నారు. పేదరికంతో వారి జీవితాన్ని అగ్గిపాలు, బుగ్గిపాలు కానీవ్వకుండా చూడాలన్నదే చలం ధ్యేయం. అణచివేతలతోనూ, అసమానతలతోనూ జీవితాన్ని సాగిస్తున్న స్త్రీ చేత ఈ యావత్ ప్రపంచాన్నే తన జీవన స్థితిని గురించి ప్రశ్నించినట్లు తెలియజేసి చలం సభ్యసమాజాన్నంతటినీ ఆలోచనల వైపు మరలించాడు. కాబట్టి ఆలోచన ప్రారంభమైనదంటే మార్పు తప్పనిసరి కనుక 'మాదిగ అమ్మాయి' కథ పై సంస్కరణోద్యమ ప్రభావం ఉన్నట్లు చెప్పడంలో సందేహంలేదు.

## 10. ఎరికలమ్మ

ఎరికుల కులానికి చెందిన అమ్మాయి పేదరికంలో ఎటువంటి కష్టాలను అనుభవించవలసి వచ్చిందో తెలిపే కథే 'ఎరికలమ్మ'.

**'ఎరికలమ్మ' కథ సంక్షిప్త పరిచయం :**

కథకుడు ఓ ఎరికలమ్మాయిని గుంటూరు రోడ్డు మీద చూస్తాడు. ఆమె దిగులుగా ఉంటుంది. అదే అమ్మాయిని అంతక్రితం నెల్లూరులో పెన్నానది ఒడ్డున చూస్తాడు కథకుడు. నదీ స్నానానికి వెళ్ళగా ఈమె, ఈమె ప్రియుడు పెన్నా నది పాయల్లో పరిసరాలను పట్టించుకోకుండా ఆడుకుంటుంటారు. ఒకరినొకరు ప్రేరేపించుకుంటుంటారు. ఇదంతా చూస్తూ నించున్న కథకున్ని ఆమె ఇసుక పెళ్ళ తీసుకొని వీపున చళ్ళున ఒకటి చరుస్తుంది.

ఆ తరువాత కొంత కాలానికి గుంటూరులో కనపడుతుంది.

అప్పటి ఆమె ప్రియుడు ఆస్పత్రిలో చేరతాడు ఒకనాడు,

"ఆనాడు ఆమె యిసిక పెళ్ళ విసిరిన సంగతి జ్ఞాపకం వొచ్చి సైకిలెక్కబోతో 'అతనేడీ?' అన్నాను.

ఆస్పత్రి వేపు తల వూయించింది. కళ్ళలో నీళ్ళు నిండాయి.

"జబ్బా!"

తలవూయించింది. "పాపం" అన్నాను. ఇంకేమనను?

"ఎన్నాళ్ళుంటారు?"

చప్పున ఏడ్చింది.

"అయిపోయిందాకా"

నవ్వులతో భూమినీ ఆకాశాన్ని నింపిన పిల్ల ఈనాడు నాముందు యేడవడం సహించలేకపోయినాను. బుజం మీద చెయ్యేశాను. అవును రోడ్డు మీదనే! నాకా యీనాడు పొయేందుకేమీ మర్యాదలేదు. ఇక ఆమె నగలు లేవు చీరెలు లేవు ఆమెకేం మర్యాద!

"డాక్టరు కుదరదన్నాడా? నేను వచ్చి డాక్టరుతో మాట్లాడనా?"

"పది రూపాయలు కావాలిట."

"ఎవరికి?"

"డాక్టరికి. మందుకొని యెక్కించాలిట"

కొంగు కళ్ళకి అడ్డం పెట్టుకుని ఆపుకోలేక వెక్కివెక్కి ఏడ్చింది. ఆ కదిలే రొమ్ము మీదకి వెళ్ళాయి నాకళ్ళు. చీరె యిదివరకంత చిరుగులు గాలేదు కాని కొంగు కళ్ళ దగ్గరికి లాక్కుంటే రొమ్ము పూర్తిగా కప్పేటంత విశాలమయిందని కాదు. ఆంధ్ర పవిత్ర నారీమణులు వలె యెనిమిది గజాల కొనలేరు పాపం ఈ బీదవారు (ఎరికలమ్మ). నేనిస్తాను రమ్మంటానంటూ

'సాయంత్రం మా యింటికి రా-"

సైకిలెక్కి వెడుతున్నాను.

"ఇల్లెక్కడ" అన్నది.

దిగి చీటి వ్రాసి యిచ్చాను. ఆమె వంకచూసి "తప్పకరా" అన్నాను. స్కూలులో జాగ్రఫీ చెపుతున్నాను; పిల్లల్ని తిట్టుతున్నాను. మేస్టర్లతో సణుగుతున్నాను. అదే ఆలోచన, కళ్ళముందు ఆమెదే రూపం. పదిరూపాయలు! బీదవాణ్ణి, మరదలు పెళ్ళి అవుతూవుంటే మొన్న కట్నానికి డబ్బులేదు పొమ్మన్నాను. మామ నాకు జరపని లాంఛనాలు సంగతి దెప్పిపొడిచి ఆ పది రూపాయలతో ఆగుతుందో, మెల్లిగా ఇంకా లాగుతుందో?'

అంతలో "తెనాలి రైలు కూత కూసింది. ఆమె దగ్గిరగా జరిగాను."

"ఇస్తాను నాకేమిస్తావు" అనేశాను. ఆ చీకట్లోనే ఆమెకర్థమైనట్లు తోచింది. 'మామూలేనేమో' అని సిగ్గుకి జవాబు చెప్పకున్నాను. కాని మామూలైన మనిషేనా! అని నా డబ్బు విలువ కూడా తగ్గి బాధపడ్డాను. చాలా సేపు మాట్లాడలేదు. తర్వాత 'సరే!

అంది. ఆ 'సరే' అనే ఒక మాట నాహృదయంలో నుంచి దూసుకుపోయింది (ఎరికలమ్మ)."

చీకటి గదిలో అతడికి సుఖాన్నిస్తుంది. పెన్నానది ఒడ్డున ఆమె ప్రియుడ్ని సంతోష పెట్టినట్లు ఇతన్ని సంతోషపెట్టకపోవటంతో ఇతడికి కోపం వస్తుంది. "మీజాతికి, మా జాతికి కుదరదు" అంటూ తల నిమిరి వెళ్ళిపోతుంది.

**కథా ఉద్దేశ్యం :**

భారతదేశంలో ఆర్థిక అసమానతలు ఎక్కువగా వున్నాయి. ముఖ్యంగా బలహీన వర్గాలకు చెందిన స్త్రీలలో ఇది కొట్టొచ్చినట్లు కనపడుతుంది. ఆర్థిక అసమానతలు తొలగిపోవాలంటే ఆర్థిక సమానత్వం రావాలనేది ఉద్దేశ్యం.

**'ఎరికలమ్మ' కథ పై సంస్కరణోద్యమ ప్రభావం :**

ఈ కథలో బలహీన వర్గాలకు చెందిన అందులోనూ వెనుకబడిన తెగయిన ఎరికల కులానికి చెందిన ఓ స్త్రీ వ్యధ కనపడుతుంది. పేదరికంతో బతుకీడ్చలేక బాధపడుతుంటే రోకటిపోటు తగిలినట్లు ప్రియుడికి జబ్బు చేసి డబ్బులేక దుర్భరమైపోతుంది ఆమె జీవితం. దాంతోచివరకు ఆమె మానాన్ని సైతం అమ్ముకుంటుంది. ఆమె సుఖాన్ని పొందినవాడు అసంతృప్తి చెందితే "మీ జాతికి మా జాతికి కుదరదు" అంటూ వెళ్ళిపోతుంది. చలానికి కావాల్సింది కూడా ఇదే. నచ్చినా, నచ్చకపోయినా, ఇష్టమున్నా లేకపోయినా అయిష్టంగా అతడి దగ్గరే పడునట్లు స్త్రీని చూపించటం చలం చేయడు. స్త్రీ ఏమి కోరుకుంటుందో ఆ కోరుకునేదాన్ని అందుకునేంత వరకు తీసుకెళ్ళినట్లు చిత్రించి స్త్రీ ఔనత్యాన్ని చొరవను, తెగింపును పాఠకులకు, చూపిస్తాడు. ప్రస్తుత కథైన ఎరికలమ్మలో తన సుఖంతో సంతృప్తి పడలేదన్న వాడ్ని బ్రతిమాలాడినట్లో ప్రాధేయపడినట్లో చిత్రించినట్లయితే కథ చలం. ఉద్దేశానికి భిన్నంగా నడుస్తున్నట్లు అనిపించేది. కానీ అలా చేయకుండా నా మానానికి పది రూపాయలు వెలకడతావా అన్నట్లు " మీ జాతికి మాజాతికి కుదరదు" అన్నట్లు చూపించి ఈ కథ మీద తన ముద్రవేశాడు. కథలో ఎరికలమ్మ పేదదే అయినా ఆలోచనా విషయంలో గొప్పది. కనుక ఈ కథ ఆలోచనాత్మకంగా వుంది. కాబట్టి 'ఎరికలమ్మ' కథ పై సంస్కరణోద్యమ ప్రభావం వుందని చెప్పాలి.

## 11. దెయ్యాలు

ఇద్దరు స్నేహితులు, వారిలో ఒకరు డాక్టరు. వారిద్దరూ హిస్టీరియా జబ్బు గురించి మాట్లాడుకుంటూ మాటల సందర్భంలో డాక్టరుకు ఎదురైన ఓ అనుభవాన్ని తెలియచేస్తున్న కథే దెయ్యాలు.

**'దెయ్యాలు' కథ సంక్షిప్త పరిచయం :**

ప్రస్తుత కథలో ఒక టీచరు, ఒక డాక్టరు మధ్య జరుగుతున్న సంభాషణను గమనించాలి. డాక్టరు తన అనుభవాన్ని మిత్రుడుకి ఇలా వినిపిస్తుంటాడు. ఒక అర్భకుని యింట్లో భార్యకు హిస్టిరియా. వెళ్ళి మంత్రం వేసినప్పుడల్లా నయమవుతుంటుంది. ఆ ఇంట్లోనే ముప్పైఏళ్ళు వయస్సున్న వితంతువైన ఆడబిడ్డకు హిస్టీరియా. వారిని వేరు వేరు గదుల్లో ఉంచి అక్కడ మందు, ఇక్కడ మంత్రం వేస్తున్నప్పుడల్లా నయమవుతుంటుంది. రోజు నయం చేస్తు వుంటే కుటుంబం కలవాడు కదా శక్తి సరిపోవడం లేదు. నలుగురు బలమైన కుర్రాళ్ళను చూసి కిటుకు నేర్పి ఆ ఇంట్లో మధ్యగదిలో అద్దెకు వుంచుతాడు. దాంతో వాళ్ళిద్దరకూ రోగం అదుపులోకొస్తుంది. కొన్నాళ్ళకు ఉన్నట్టుండి ఓరోజు రాత్రి అరవయ్యేళ్ళ తల్లికి హిస్టిరియా వచ్చిందంటూ డాక్టరు ఇంటి తలుపుకొడుతుంటాడు.

ఆ తల్లికి అరవైయేళ్ళు. అంత ముసలిదానికి ఏ డాక్టరు మంధ్యియగలడు చెప్పు! అతడికేం తోచదు. తెల్లారేటప్పటికి మందు తయారు చేసుకొస్తానని, ఐదారు మంచి కేసులు ఉన్నా, వాటిని వదులుకొని ఆ రాత్రికి రాత్రే ఊరు విడిచిపెట్టి పారిపోతాడు.

**కథా ఉద్దేశ్యం :**

మంత్రాలకు చింతకాయలు రాలవు, జబ్బులు నయం కావనేది ఉద్దేశ్యం.

**'దెయ్యాలు' కథ పై సంస్కరణోద్యమ ప్రభావం :**

సమాజంలో మూఢ విశ్వాసాలతో వేలాడేవాళ్ళందరకీ చలం ఈ కథ ద్వారా చురకలంటినట్లు భావించాలి. ఇది కంప్యూటర్ యుగం. మారుతున్న కాలానికి అనుగుణంగా మానవులంతా మారాలి. కాని ప్రస్తుత కథలో అలా కాకుండా హిస్టీరియా జబ్బుతో బాధపడుతున్న ఓ కుటుంబం మంత్రతంత్రాల్ని ఆశ్రయించి వాటి వలనే ఆ జబ్బు నయం అయిందనే భ్రమలో ఉంటారు. వారికి వైద్యం చేసిన డాక్టరు కూడా మంత్రాన్ని ప్రయోగించి వారికి వచ్చిన జబ్బును పోగోట్టే ప్రయత్నం చేస్తాడు. కానీ అతడి వల్ల గాక చివరకు నలుగురు బలమైన యువకుల్ని చూసి కిటుకు నేర్పి వాళ్ళింటిలోనే మధ్య గదిలో ఉండే ఏర్పాటు చేస్తాడు. వైద్యం కాకుండా కిటుకుల మీద నమ్మకం పెట్టుకున్న వాళ్ళను బట్టి మూఢాచారాలూ, మూఢనమ్మకాలను బలంగా నమ్ముతున్నట్లు తెలుస్తుంది. కొన్నాళ్ళకు ఆ ఇంటి యాజమాని తల్లి (60 ఏళ్ళు)కి హిస్టీరియా సోకిందంటూ డాక్టరింటి తలుపు కొడుతుంటే చేసేది లేక పారిపోతాడు. అలా పారిపోవడాన్ని బట్టి ఆ 60 ఏళ్ళ వయసామెకు

ప్రయోగించడానికి అతడి దగ్గర కిటుకు లేకపోవడం వల్లనే అతడు పారిపోయినట్లు భావించాలి. ఇటువంటి కిటుకులు ప్రయోగించే వాళ్ళునంత కాలం ప్రయోగింప చేయించుకొనే వాళ్ళు కూడా ఉన్నంతకాలం సమాజం ముందుకు కాక వెనక్కే నడుస్తుంటుంది. కాబట్టి మూఢవిశ్వాసాల్ని మూఢనమ్మకాల్ని విడిచిపెట్టాలని చలం ప్రభోదించాడు. మూఢనమ్మకాల్ని నమ్మేవారిని చైతన్యపరిచేందుకు కృషి చేశాడు. కనుక 'దెయ్యాలు' కథ పై సంస్కరణోద్యమ ప్రభావం బలంగా పని చేసిందని చెప్పొచ్చు.

## 12. పునర్వివాహం

భార్యాభర్తలిద్దరూ వితంతు శరణాలయాన్ని స్థాపించి బాల వితంతువులకు ఆశ్రయం కల్పించి పునర్వివాహాలు జరిపించే క్రమంలో బాపట్ల నుంచీ వార్త అందుకొని అక్కడికి వెళ్ళిన శరణాలయ అధికారికి ఎటువంటి పరాభవం ఎదురయిందో తెలిపే కథే పునర్వివాహం.

**'పునర్వివాహం' కథ సంక్షిప్త పరిచయం :**

వెంకట శివుడు ఒక వితంతు శరణాలయాన్ని పెడతాడు. కానీ వితంతువులే అతడికి దొరకడం లేదు, రావడం లేదు కూడా. కొంతకాలానికి ఒకామె చేరుతుంది, పేరు లక్ష్మి. ఇంకొంత కాలానికి రామచంద్రయ్య వరుడుగా దొరుకుతాడు. లక్ష్మికి రామచంద్రయ్యకీ వివాహం జరుగుతుంది. సభ కూడా ఏర్పాటు చేస్తారు. అందులో ఉపన్యాసాలు, ఉపదేశాలు కూడా జరుగుతాయి. తరువాత వెంకటశివుడు దంపతులు ఎన్నో విధవా వివాహాలు జరిపిస్తారు. బాపట్ల నుంచీ వచ్చిన ఆహ్వానాన్ని అందుకొని వెంకటశివుడు బాపట్ల వెళతాడు. అక్కడ బస చేయడానికి రామచంద్రయ్య ఇంటికోసం వెతుకుతుంటారు. చివరక వారికి రామచంద్రయ్య ఇల్లు దొరుకుతుంది.

"ఇంతలో బండి ఇంటికి వొచ్చి చేరింది. రామచంద్రయ్యగారి మామగారు పందిట్లో కూచున్నాడు. ఆయన రిటైరైన రిజిస్ట్రారు. వెంకట శివుణ్ణి కూచోమని కుశల ప్రశ్నలు వేశాడు ఆయన. రామచంద్రయ్య ఇంట్లో లేడు. బజారు వెళ్ళాడు. లక్ష్మి వడ్డనలో వుంది. ఈ మామగారు చాలా పూర్వాచారపరుడు.

"తమరిలాంటి వారిని కలుసుకోవడం చాలా అదృష్టం. సుదినమిది" అన్నాడు వెంకటశివుడు.

"ఏదోలెండి అయిపోయింది మా కాలం. ఉద్యోగం అదీ. చేసిన ఉపకారాలు చేశాను. కాని మరచిపోయినారు అప్పుడే నన్ను."

‘అది కాదండి. ఇంత పూర్వాచారపరులై వుండి కూడా - వృద్ధులూ, పెద్దలూ మీవంటివారు వితంతువుల దుస్థితిని అర్థం చేసుకుని, ఏ సంకోచం లేకుండా, ఈ పాడు సంఘాన్ని లెఖ్ఖ చెయ్యడం లేదంటే చూడడం నాకెంతో ఆనందంగా వుంది.”

రిజిస్ట్రారు తెల్లబోయి చూశాడు.

“వితంతువు వివాహాలా! నా చెవుల బడనీకండి. చాలా ఘోరం. అల్లాంటివి వినడం మహాపాపం.” వెంకటశివుడు తెల్లబోయాడు. తన కూతురు సంగతి దాచేస్తున్నాడు ఈయన! తనకి ఫలహారం సంగతి అట్లా వుంచి, కాఫీ కూడా ఇచ్చేట్టులేడు. వెంకటశివుడికి వొళ్ళు మండింది. ఇంత దొంగలు వుంటారనుకోలేదు. అందరి ముందూ పరాభవం చెయ్యాలి ఈ ముసలాయన్ని.

“లక్ష్మి సుఖంగా వుందండీ!”

“ఊ ( , వుంది. కాని లక్ష్మినేం ఎరుగుదురు మీరు?”

“మా శరణాలయంలో వుంది కదండీ.”

“శరణాలయమా? మా లక్ష్మి వుండడమేమిటి? ఎందుకు వుంటుంది శరణాలయంలో?”

“మేమేగా ఆమెని రామచంద్రయ్యగారికి ఇచ్చి పెళ్ళి చేసింది?”

“మీరా?”

చుట్టూ చూశాడు ఆయన.

“మూడువేలు ఖర్చుపెట్టి నేను ఈ వూళ్ళో మా లక్ష్మికి పెళ్ళి చేస్తే, మీరా పెళ్ళి చేసింది? ఏ లక్ష్మి సంగతి మాట్లాడుతున్నారు?”

అందరూ ఆశ్చర్యంగా చూస్తున్నారు అతని వంక, పిచ్చివాడేమోనన్నట్టు.

“ఎప్పుడు పెళ్ళి చేశారు?” అన్నాడు మళ్ళీ.

“మూడేళ్ళ క్రిందట”.

అందరూ పక పక నవ్వారు.

“దాని కొడుక్కి ఏడేళ్ళున్నాయి. పెళ్ళయి ఎనిమిదేళ్ళయింది.” వెంటక శివుడు లేవబోతున్నాడు. వీళ్ళుకాదు వాళ్ళు. రామచంద్రయ్య వొచ్చాడు. వెంకట శివుణ్ణి చూసి “ఎప్పుడు రావడం,” అంటున్నాడు. ఇంతలో మామగారు, “ఈయన్ని ఎదుగుదువా! అదేమిటి, ఆయన నీకేదో వితంతు వివాహం చేశాట్ట” అన్నాడు (పునర్వివాహం).”

అప్పుడు రామచంద్రయ్య చెప్పటం ప్రారంభిస్తాడు. విధవా వివాహం పట్ల ద్వేషాన్ని పెంచుకున్న మామగారు కూతుర్నీ అల్లుడిని ఇంటి నుంచి వెళ్ళగొడతారు. ఉద్యోగం లేక అల్లుడు దేశాలపై పడతాడు. కూతురు విధవగా అవతారమేత్తి వితంతు శరణాలయాన్ని ఆశ్రయిస్తుంది. రామచంద్రయ్య కొన్నాళ్ళకు ఉద్యోగం సంపాయించి వరుడుగా దరఖాస్తు పెట్టుకుంటాడు. తిరిగి తన భార్యనే వివాహం చేసుకుంటాడు.

**కథా ఉద్దేశం :**

పూర్వం వితంతువులు నానాటికీ పుట్టుకొస్తుండేవాళ్ళు. కానీ నేడు సంస్కరణల ఫలిత, స్త్రీ-పురుషుల ఆలోచనా ఫలితం రెండూ కలిసి వితంతు సమస్య కొంతవరకు సద్దుమనిగింది. బాల్య వివాహాల నిషేధ చట్టం స్త్రీలకు వరమైంది అనేది ఉద్దేశ్యం.

**'పునర్వివాహం' కథ పై సంస్కరణోద్యమ ప్రభావం :**

నేడు సమాజంలో వితంతు శరణాలయాలు కోకొల్లలు. స్వప్రయోజనం కోసమో, పేరు కోసమో శరణాలయాలు స్థాపించి వితంతువులను ఆదరించేవారు ఉన్నారు, వితంతువులను బాధించేవారూ ఉన్నారు. ప్రస్తుత కథలో మామగారైన రిజిస్ట్రారుకి వితంతు వివాహాల పట్ల యావగింపు. పైకి డాంభికం ప్రదర్శిస్తున్నాడు. కానీ ఆయన ఇంట్లోనే వితంతు కూతురు ఉంటుంది. పరువుకోసం ఆదరించిన శరణాలయ స్థాపకుడైన వెంకటశివయ్యను దబాయిస్తున్నాడు కానీ ఆ దబాయింపు వెనక ఉన్న లోపాన్ని కప్పిపుచ్చుతున్నాడు.

చివరకు రామచంద్రయ్య ద్వారానే మామగారి నిర్వాకాన్ని తెలుసుకోవడం జరిగింది. కథలో చూపించిన మామగారి వంటి మనస్తత్వం కలవారు పూర్వం కంటే ఈ కలియుగంలోనే ఎక్కువమంది ఉన్నారు. పరువు, ప్రతిష్ఠ అంటూ పాకులాడుతారే గానీ జీవితాన్ని సరిదిద్దే ప్రయత్నం మాత్రం చేయరు. కథలో రామచంద్రయ్య-లక్ష్మి పాత్రలు ఆలోచనకు, ఆచరణకు ప్రతీకలు. ఇంటినుండి మామ ఎల్లగొట్టితే ఒకరు ఉద్యోగవేటకు, మరొకరు వితంతు శరణాలయానికి వెళతారు. కొంత కాలానికి రామచంద్రయ్య తెలివిగా ఉద్యోగాన్ని సంపాయిస్తాడు, వివాహాన్ని జరిపించుకుంటారు. ఈ రెండు పాత్రలు ఎంతోమంది యువతీయువకులకు స్ఫూర్తి కావాలి. చిన్న చిన్న విషయాలకి నిరాశకు గురయ్యే తత్వాన్ని విడనాడాలంటూ రచయిత సందేశాన్నిచ్చాడు. ఈ కథ పునర్జీవితాన్ని ఉద్దేశించి రాయబడింది. కనుక కథలో రామచంద్రయ్య-లక్ష్మీ ద్వారా ఆ ఉద్దేశ్యం నేరవేరినట్లు తెలుస్తుంది. కాబట్టి 'పునర్వివాహం' కథ పై సంస్కరణోద్యమ ప్రభావం బలంగా పనిచేసిందని చెప్పాలి.

## 13. హరిజన సమస్య

హరిజనోద్ధరణ కోసం ఓ యోగి తన జీవితాన్ని పణంగా పెట్టడాన్ని గురించి తెలిపే కథే 'హరిజన సమస్య.'

**'హరిజన సమస్య' కథ సంక్షిప్త పరిచయం :**

సినిమా అవసరం నిమిత్తం డైరెక్టరు, కథకుడు ఓ పల్లెటూరు వెళ్ళి తిరిగి వస్తుండగా వారు ప్రయాణిస్తున్న కారు గంటకి నలభై మైళ్ళు వేగంతో వెలుతూ అకస్మికంగా ఓ నిర్మాణుషపు ప్రదేశంలో ఆగిపోతుంది. చుట్టు అడివి. చీకటిపడుతుండటంతో వారిలో ఆందోళన మొదలవుతుంటుంది. వారిలో ఒకరు డ్రైవర్ని "దగ్గర ఊరు ఎంత దూరముంటుంది?" అని అడుగుతారు. డ్రైవరు "ఏమోనండీ నాకీ రోడ్డు కొత్త" అంటాడు. అప్పుడు వారు ఏమయితేనేమి "మేం వెడుతున్నాం. కారు బాగైతే వెనకాల తీసుకురా" అంటూ నడక ప్రారంభిస్తారు కథకుడు, డైరక్టరు.

అలా నడక ప్రారంభించారో లేదో వారికి దూరంలో లైట్లు, మధురంగా సన్నాయి వాయిద్యం వినబడతాయి. ఏదో వూరు సమీపించామనుకుంటుంటారు. పెళ్ళి కాబోలు అని అభిప్రాయపడుతుంటారు. కానీ పెళ్ళిళ్ళు సీజను కాదే అనుకుంటూ ఒకవేళ పొరుగూరుకు వెళ్ళే పెళ్ళి కాబోలు అని భావిస్తారు. అంతలో తోటలూ, గుంపు, సమాధి అదేదో తీర్థం లాగుంటుంది. మొక్కు బళ్ళు చెల్లించుకుంటుంటారు. ఆ జనాల్ని చూసి ధైర్యాలోస్తాయి వాళ్ళిద్దరికీ. దాంతో

" 'చూశారా మూర్ఖం'? మతం పట్లు వొదలాలంటారు ప్రభుత్వం" అన్నాడు కథకుడు.

"రాజకీయాల్లోకి తీసుకురా వొద్దంటారు, అంతే."

"జీవితంలో కల్లా ప్రముఖమైన కులం, మతం రాజకీయాల్లోకి రావడం ఆపడం ఎవరి తరం? అందుకనే రష్యాలో దేవుడి పేరు చెపితే నరికెస్తామన్నారు. ఎన్ని ఉపన్యాసాలిస్తే మాత్రం అగుతుందా ఈ దేశంలో?"

"రష్యాలో నరికేస్తామన్నారని నీకెట్లా తెలుసు?"

"అనుకుంటారు."

"రష్యాలో మల్లె ఇక్కడా చెయ్యాలంటావా?"

"తప్పకుండా."

అట్లా చేసి ఈ మూర్ఖమే పోతే, నీ కథలకీ, నా ఫిల్ములకీ ఏం డబ్బు వస్తుంది? భక్తి పోయిందంటే, ఇంక చలం కథలే గతి."

"అంటే?"

"శృంగారం."

"శృంగారమైతే మాత్రం చలం కథలే ఎందుకు?"

"భక్తితోపాటు పాతివ్రత్యం మార్కెటు కూడా పడిపోతుంది. ఇంక బ్లాక్ మార్కెట్టే గతి, అంటే చలం."

"ప్రేమ లేదా?"

"వుందిలే. మీరందరూ ఏం చేస్తున్నారిప్పుడు మాత్రం? శృంగార ఘట్టాల్లో తెలిసో తెలికో అతని వాక్యాలేగా దొర్లిస్తున్నారు (హరిజన సమస్య)."

అంతలో వారికో యువకుడు పరిచయం అవుతాడు అక్కడ. డైరక్టరు పేరు బలం పనిచేస్తుంది. డైరక్టురుని కథకున్ని వాళ్ళ ఇంటికి ఆహ్వానిస్తాడు. పొద్దునే బండి ఏర్పాటు చేసి దగ్గర్లో బస్సులు తిరిగే రోడ్డుకు పంపిస్తానంటాడు. ఆ ముగ్గురూ పిచ్చాపాటీ మాట్లాడుకుంటూ ఓ పడిపోయిన చెట్టు మీద కూర్చుంటారు. అంతలో వారు ఆ యువకుడ్ని "ఏమిటి ఆ తీర్థం?" అని అడుగుతారు. దాంతో ఆ యువకుడు హరియోగిగారి గురించి చెప్పడం ప్రారంభిస్తాడు. "తెలీదా మీకు? హరియోగి గారి సమాధి అది. చంపేశాం ఆయన్ని మేము. ఇప్పుడు ఉత్సవాలు చేస్తున్నాం. మొక్కుకుంటాము; వ్యాజ్యాలు గెలవడానికి, పిల్లలకి, జబ్బులకీ అన్నింటికీ."

"నిదర్శనం వుంటుందా?"

"ఆఁ (హరిజన సమస్య)"

ఆ యోగి కొన్నాళ్ళు మౌనంగా గడిపాడు. జబ్బుతో ఉన్న కుర్రవాణ్ణి బ్రతికించమని ఒక హరిజనుడు వచ్చాడు. 'బ్రతికిస్తే ఆ కుర్రాణ్ణి నాకు యిచ్చేస్తారా?' అంటాడు. సరేనన్నారు, కుఱ్ఱవాడు బ్రతికాడు. అతని పేరు వీరన్న. కాలేజీలో చదువుకుంటున్న ఆ వూరి విద్యార్థులంతా ఆయనతో వాదించేవారు కులాల గుర్చి మతం గూర్చి - దేవుని గూర్చి యోగి గారి సమాధానాలు వీరన్నకు సంతృప్తి నివ్వలేదు. పూర్వం నుంచీ బ్రహ్మణులు బోధిస్తున్నది తక్కిన జాతుల వారిని అణగదొక్కడానికీ అనిపిస్తుంది వీరన్నకు. "హరిజనులు విప్లవం చేసి మీ స్త్రీలకి హరిజన బిడ్డల్ని కనాలనేవాడు" - అన్నంత పనీ తలపెడతాడు.

"ఆ దసరానాడు ముందుగా హరిజనులు స్త్రీల గుంపు మీద పడ్డారు. వూరి మగవాళ్ళు చాలా మంది పొలాల్లోకి వెళ్ళిపోయినారు మధ్యాహ్నామే. నాకేం తోచలేదు. ఈనాడు హరిజనులు దుర్మార్గం చేసినా, రేపు మావాళ్ళు వాళ్ళని నాశనం చెయ్యక మానరు. చప్పున

యోగి జ్ఞాపకం వొచ్చారు. ఒక్క పరుగు తీశాను ఆశ్రమానికి నా వీపు వెనక హరిజనులు బలవంతం చేస్తున్న స్త్రీల అరుపులు, వాళ్ళకి అడ్డుపడ్డ మా యువకుల గోల.

ఆశ్రమం చాలా ప్రశాంతంగా వుంది. చిలకలు గుంపులుగా ఎగురుతున్నాయి వేపచెట్ల మీదకి, నాకళ్ళ ముందు నెమ్మదిగా తొలిగిపోయినాయి. ఉడతలు గాలి తీరుబడిగా వీస్తోంది. చెట్టు కింద శాంతంగా కబుర్లు చెప్పుకుంటూ కూర్చున్నారు స్వామిగారు, ఇద్దరు ముసిలమ్మలతో. నన్ను చూడగానే చిరునవుతో "రా, కూచో" అన్నాడు.

హడావిడిగా నా కబురు కక్కాను. వెంటనే ఆ డెబ్భైయేళ్ళు దాటిన వృద్ధుడు లేచాడు.

"చేశాడా, అంతపనీ!" అంటో నాకంటే వడిగా పరిగెత్తుతున్నాడు. ఆయన అట్లా ఆదుర్దా పడడం నేను ఎన్నడూ చూడలేదు. పుటకలేదు చావులేదు అనే వేదాంతికి అంత ఆదుర్దా, మమకారం ఎందుకు? ఎవరి కోసం?

ఆయన చాలాసార్లు చెప్పారు మా వూరి పెద్దలతో "కాలం మారుతోంది. ఎందుకు ఏర్పడ్డదో ఈ వర్ణబేధం - ఈనాడు చాలా అన్యాయం, అసహ్యం. ఈ భేదాన్ని తీసెయ్యండి. రెండు పేటల్ని కలిపెయ్యండి" అని.

"పెద్దలు తమరు కూడా అట్లాంటి వర్ణసంకరాన్ని బోధిస్తారా? ఋషులు పెట్టిన నియమాలు" అన్నారు వాళ్ళు.

"ఈనాటి ఋషిని నేను. నేను చెప్పేమాట వినండి" అనేవారు ఆయన. కాని ఎవరు వింటారు?

అయిదు నిముషాల్లో చేరుకున్నాం మా వూరు ఆ దృశ్యం ఏం చెప్పను? ఈ లోపల మాస్త్రీలని ఎన్ని అవమానాలు చేశారో! దూరం నించి పొలాల్లోంచి పరుగెత్తుకు వొస్తున్నారు మావాళ్ళు కర్రలతో, కొడవళ్ళతో, చేతి కత్తులతో.

సరాసరి అమ్మవారి పూజ పందిరిలోకి వెళ్ళాం. అక్కడ జరిగిన అసహ్యం వర్ణించలేను. విగ్రహాన్ని పగలుకొట్టారు. అమ్మవారి పీఠానికి ముందే వీరన్న నా భార్యని పట్టుకుని కిందపడేసి...... పందిరి గుంజని పీకి ఒక్క దూకు దూకాను అడ్డుపడ్డ స్వామిగారిని కింద పడతోసి. ఇంకా తన పెంపుడు కొడుకు మీదే మమత.

వీరన్న నన్ను చూసి అరుస్తున్న నా భార్యని వొదిలి పక్కనున్న కర్ర తీసుకొని నామీదికి దూకాడు. తరువాత ఏం జరిగిందో ఇద్దరం కొట్టుకున్నాం. చూసేసరికి రెండు దెబ్బల మధ్య అడ్డం వొచ్చిన యోగిగారికి తగిలాయి. ఆయన "హరి హరీ" అంటో ప్రాణం విడిచారు.

నిర్ఘాంత పోయినాము ఆ రక్తం చూసి. అంతే అక్కడితో ఆగిపోయింది ఆ వైరం. ఎక్కడివాళ్ళు అక్కడ నిలిచిపోయారు (హరిజన సమస్య).'' దాంతో ''హరిజనులూ, మేము అందరమూ కలిసి ఆయనకి సమాధి కట్టించాము. ఎంతమంది మాస్త్రీలని హరిజనులు ఏం చేశారో కిక్కురు మనకుండా ఊరుకున్నాము. వీరన్న కోరిక నేరవేరింది. స్వామిగారి అనుగ్రహాన పిల్లలు లేని కొంత మందికి తొమ్మిది నెలల్లో పిల్లలు కలిగారు. మావూళ్ళో హరిజన సమస్యలేదు. ఆదర్శమైన గ్రామం కింద వినుతికెక్కింది. హరిజన సమస్యలను సాధించడానికి ప్రాణాలర్పించారని యోగి గారి కీర్తిని పత్రికలు నిండా అచ్చువేయించుకున్నాము. నాకూ, వీరన్నకూ అర్నెల్లు ఖైదుపడ్డది. ప్రతి సంవత్సరం హరియోగిగారికి ఈ ఉత్సవాలు చేస్తున్నాము. మొదటి నుంచీ అంత గొప్ప సంస్కర్తకి ఆశ్రయమిచ్చి ఆయన అహింసా బోధనలు ప్రకారం నడుచుకున్న యోగ్యుల క్రింద మా ఊరు పేరుని దేశమంతా చాటుకున్నాము. మా మూలనే హరియోగిగారు అంత గొప్పవారైనట్టూ ప్రగల్భాలాడుతున్నాము ఈనాడు (హరిజన సమస్య).'' అని చెప్పి ఆ యువకుడు ముగిస్తాడు.

**కథా ఉద్దేశ్యం :**

తరతరాలుగా అగ్రకులస్తులు హరిజనుల్ని వర్ణభేదం, కులభేదాలతో హింసిస్తున్నారు. ఈ వర్ణభేదం, కులభేదాలు ఉండకూడదనేది ఉద్దేశ్యం.

**'హరిజన సమస్య' కథ పై సంస్కరణోద్యమ ప్రభావం :**

హరిజనులు ఎంతో కాలంగా అగ్రకులాలు వారితో పాటు సమానహోదా, గౌరవం కల్పించాలంటూ పోరాటాలు చేస్తున్నారు. ఆ పోరాటం ఉద్యమ రూపం దాల్చింది. ప్రస్తుత కథలో అగ్రకులాల వారి దౌర్జన్యాన్ని, అణిచివేతని తట్టుకోలేక వీరన్న తిరుగుబాటు చేసినట్లు తెలుస్తుంది. ఆ తిరుగుబాటు ఫలితంగా విధ్వంసం జరిగి సంస్కరణా భావాలు కలిగిన హరియోగిగారు బలౌతారు.దాంతో అగ్రకులస్తులల్లోను చలనం కలుగుతుంది. అగ్రకులస్తులు, హరిజనులూ వర్ణభేదం, కులభేదం పక్కన బెట్టి కలిసిపోయినట్లు చిత్రించి చలం యావత్ మానవ సమాజాన్ని కులవివక్షత, వర్ణవ్యత్యాసాన్ని విడనాడమని తెలియచేశాడు. కథలో సంస్కరణ జరిగినట్లు గ్రహించాం. కనుక 'హరిజన సమస్య' కథ పై సంస్కరణోద్యమ ప్రభావం శక్తివంతంగా పని చేసిందని చెప్పాలి.

## 3.7 అడివి బాపిరాజు (అక్టోబర్ 1895 - సెప్టెంబరు 1952)

శ్రీదేవులపల్లి రామానుజరావుగారు అడివి బాపిరాజుగారిని గురించి ఇలా అంటారు.

"ఆయన అజాత శత్రువు
ఆయన మూర్తి సుకుమారం
ఆయన హృదయం కుసుమకోమలం
ఆయన వాక్కు నవనీత సమానం
ఆయన మనసు వెన్నలాంటిది
ఆయన కీర్తి హిమాలయ శిఖరం
ఆయన విజ్ఞానం సర్వతోముఖమైంది
ఆయన ప్రతిభ బహుముఖమైంది"[30]

అడివి బాపిరాజుగారు కృష్ణయ్య, సుబ్బమ్మగార్లకు 1895 అక్టోబర్ 8వ తేదీన సిరిపల్లె గ్రామంలో మాతామహుల ఇంట్లో జన్మించారు. బాపిరాజు తండ్రి అయిన కృష్ణయ్యగారు తాలూకాఫీసులో షరీఫ్‌గా పని చేసేవారు. అతడు మంచి కథకుడు కూడ.

బాపిరాజుగారి పూర్వులది కలిదిండి గ్రామం. బాపిరాజుగారి తాతగారి పేరు కూడా బాపిరాజే. అతడు పశ్చిమగోదావరి జిల్లా భీమవరానికి వచ్చి అక్కడే స్థిరపడతాడు.

చిన్నప్పటి నుండీ బాపిరాజు ఊహా జగత్తులో విహరిస్తుండేవాడు. తన అక్క పెళ్ళి సంధర్భంలో ఆమెను రాకుమారిగా, బావను రాకుమారుడిగా, తనను యువరాజుగా ఊహించుకుంటాడు. తన మీద కథలు చెప్పమని తండ్రిని, తన మీద పాటలు పాడమని తల్లిని అడిగేవాడట.

ఆ విధంగా చిన్నప్పడే బాపిరాజు భావనా జగత్తును ఏర్పరచుకొని ఆ జగత్తులో రంగురంగుల దృశ్యాలను కల్పించుకున్నాడు. కొవ్వూరు, భీమవరం, సంపల్లె ప్రయాణాలు, గోదావరి, పాపికొండలు, పట్టిసం మొదలైన ప్రకృతి సౌందర్య దృశ్యాలు ఆనాడే అతని హృదయంలో ముద్రవేసుకున్నాయి.

బాపిరాజు ప్రాథమిక విద్య భీమవరంలో జరిగింది. అప్పుడతడు ఏక సంథాగ్రాహి అట. ఏడేళ్ళ వయస్సులోనే ఆడపిల్ల వేషం వేసుకొని, నాట్యం చేస్తూ, చిన్న చిన్న గీతాలు వ్రాసి పాడుతూ ఇంట్లో వారిని ఆనంద సమ్మోహితుల్ని చేసేవాడట. గోడలపై బొమ్మలు గీసి అందరికీ చూపించేవాడట. అలా ఆటపాటలతోనూ, కలలతో అతడి ప్రాథమిక విద్య పూర్తయింది.

తరువాత హైస్కూలు విద్య కోసం 'నర్సాపురం' చేరతాడు బాపిరాజు. భీమవరానికది 34 మైళ్ళ దూరంలో ఉంది. బంధువుల వద్దే ఉండి చదువుకునేవాడు. ఆ స్కూల్లోనే చంధస్సు నేర్చుకున్నాడు.

బాపిరాజు చరిత్ర విద్యార్థి, పైగా స్వప్నలోక విహారి. నోట్సు వ్రాయడానికి బదులు మాస్టారు బొమ్మగీయడమో, ఊహాలోకానికి కవితా రూపమివ్వడమో, చిత్రరూపమివ్వడమో చేస్తుండేవాడు. దాంతో అతడికి లెక్కలంతగా అబ్బలేదు. అది అట్లా ఉండగా నాల్గొఫారంలో అతడికి తీవ్రమైన జబ్బు చేస్తుంది. అన్నింటిలోనూ సున్నాలు వస్తాయి. త్రైమాసిక, అర్థ సంవత్సర, మాస పరీక్షల మార్కులు బాగా ఉంటే పై తరగతికి ప్రామోట్ చేసేవారు. ఆ విధంగా బాపిరాజు అర్హత పొంది హైస్కూలు విద్యను పూర్తి చేస్తాడు.

హైస్కూల్లో ఉండగానే సెలవులకు భీమవరానికి వచ్చినప్పుడు అక్కడున్న మిత్రులను కలుపుకొని 'నర్సాపురం అభ్యుదయ సంఘాన్ని' స్థాపిస్తాడు. సాహిత్య రాజకీయ విషయాల చర్చలతోపాటు పంటకాల్వలు బాగు చేసి రైతులకు సేవలందించడం ఆ సంఘ కార్యకలాపాలు.

స్కూలు ఫైనలు పూర్తి చేసుకొని బాపిరాజు 'కాకినాడ' కాలేజీలో చేరడానికి బయలుదేరగా మార్గ మధ్యంలో అతడికి మళ్ళీ తీవ్రమైన జబ్బు చేస్తుంది. మిత్రులతన్ని రాజమండ్రిలో బంధువుల ఇంట్లో ఉంచుతారు. సాయంకాలానికి రోగం కుదుటపడుతుంది. ఆ బంధువు అతన్ని రాజమండ్రి కాలేజీలో చేరమని ప్రోత్సహిస్తాడు.

అప్పుడు రాజమండ్రి కళాశాల ప్రిన్సిపాల్ 'సర్ ఆస్వాల్డ్‌కూల్డ్రే.' అతడు గొప్ప చిత్రకారుడు. అతడు బాపిరాజుకు లెక్కల్లో వచ్చిన మార్కులు చూసి సీటు ఇవ్వడానికి నిరాకరిస్తాడు. బాపిరాజులో ఆడపిల్ల తనం కొంత ఉండడంతో వెంటనే కళ్ళల్లో నీళ్ళ తిరుగుతాయి. అప్పుడు చరిత్ర ప్రధానాచార్యులు వచ్చి బాపిరాజుకు చరిత్రలో వచ్చిన మార్కులు చూచి కూల్డ్రేగారిని మరొకసారి మార్కుల జాబితా పరిశీలించమంటారు. అప్పుడు కూల్డ్రేగారు బాపిరాజుకు చిత్రకళలో వచ్చిన 100 మార్కులు గుర్తించి కళాశాలలో సీటిస్తారు.

అలా కూల్డ్రేగారి శిష్యుడు కావడం బాపిరాజు జీవితంలో గొప్ప మలుపు. బాపిరాజులో నిద్రాణంగా ఉన్న సహజ కళల్ని కూల్డ్రే శిష్యరికం మేల్కొలిపింది. అతడిలోని సర్వకళలు విజృంభన అందుకున్నాయి. అతడిలోని సౌందర్యారాధన మరింత ఎక్కువైంది.

కూల్డ్రేగారు విద్యార్థుల్లో ప్రతిభను అట్టే పసిగట్టేవారు. ఎవరికి ఏవిద్యలో ఆశక్తి ఉందో గ్రహించి అందులోనే తర్ఫీదు ఇచ్చేవారు. సెలవుల్లో విద్యార్థులను వెంటపెట్టుకొని

కళాక్షేత్ర పర్యటనలకు తీసుకెళ్ళేవారు.“భారత దేశాన్ని విడిచి వెళ్ళిం తర్వాత ఆయన ‘దక్షిణ భారత ఘడియలు’ (SOUTH INDIAN HOURS) అనే గ్రంథాన్ని రచించి, తన శిష్యులైన ‘బాపిరాజు, దామెర్ల, కవికొండల’కు To my scholars and teachers అంటూ అంకితమిచ్చాడు.”[31] కూర్జేగారికి, బాపిరాజుకు విడదీయరాని అనుబంధం ఏర్పడింది.

బాపిరాజు ప్రకృతి దర్శనంతో పులకించి తాను వ్రాసుకున్న ‘తొలకరి’ గేయాల్ని తన జీవితంలో క్రొత్త వెలుగులు నింపిన గురువుకు అంకితమిస్తాడు. అతడు ఆరాధించే ‘శశికళ’ను వెతుకున్నది కూర్జే సహచర్యంలోనే. బాపిరాజు అతడి కళా జీవితాన్ని తను వెతుకున్న ఆ ఊహాసుందరికే అంకితమిచ్చాడు.

బాపిరాజు బి.ఏ.లో ఉండగానే కూర్జే దొరగారు ఇంగ్లండుకు వెళ్ళిపోవడం జరుగుతుంది. దాంతో బాపిరాజు చదువుపై ఏకాగ్రత పెట్టలేకపోతాడు. అది తెలుసుకొని కూర్జే బాపిరాజును సముదాయిస్తూ ఉత్తరాలు వ్రాసేవారు. అయినా బాపిరాజు చదువుపై శ్రద్ధ పెట్టలేక బి.ఏ తప్పుతాడు. కూర్జే ధైర్యం చెబుతూ బాపిరాజుకు మరిన్ని ఉత్తరాలు రాశారు. దాంతో శ్రద్ధగా చదివి బి.ఏ. పాసవుతాడు.

కూర్జే ఇంగ్లండులో మంచి ఉద్యోగం ఇస్తానంటే బాపిరాజు అందుకు నిరాకరిస్తు ఇలా వ్రాస్తాడు. “నువ్వు నా తల్లీ, తండ్రీ, దైవం-నువ్వు నడవడానికి నా బ్రతుకును బాటగా పరుస్తాను. కాని మీ ప్రభుత్వం క్రింద ఉద్యోగం చేయను.”[32]

బాపిరాజు అప్పటి నుండీ కాంగ్రెస్ మీటింగులకు వెళ్ళడం, ఖద్దరునే ధరించడం ప్రారంభిస్తారు.

బి.ఏ. లో చేరాక 1915లో బాపిరాజుకు సుభద్రమ్మతో వివాహమవుతుంది. 1920లో జాతీయ కాంగ్రెసులో చేరతాడు. అప్పటి నుంచీ జరిగిన ప్రతి సమావేశానికి బాపిరాజు హాజరయ్యేవాడు.

1921లో స్నేహితులనూ, తమ్ముడ్ని వెంట పెట్టుకొని కాలినడకతో వచ్చి అప్పుడు విజయవాడలో వున్న గాంధీజీని దర్శించుకొంటాడు. ‘తణుకు’లో ఖాధీ వడకడం నేర్చుకొని వచ్చి ఖాదీ ఉద్యమాన్ని ప్రచారం చేస్తాడు. గాంధీగారి ‘హరిజనోద్ధరణ పిలుపుకు’ ఆకర్షితుడై - ఉప్పలూరు గ్రామదేవాలయ పూజార్లు (దాసర్లు) హరిజనులే అని, అది మన పూర్వ సాంప్రదాయం కాబట్టి తప్పులేదని ప్రచారం చేస్తాడు.

గాంధీజీ పిలుపునిచ్చిన సహాయ నిరాకరణోద్యమానికి సహకరిస్తూ బాపిరాజు భీమవరంలో పన్నులు చెలించొద్దంటూ నినాదాలిస్తూ ఉద్యమంలో పాల్గొంటే 1922లో

అప్పటి ప్రభుత్వం అతడ్ని నిర్బంధంలోకి తీసుకొని సంవత్సరంపాటు జైలు శిక్ష విధిస్తుంది. కొన్నాళ్ళు రాజమండ్రి జైల్లోనూ మరికొన్నాళ్ళు 'కడలూరు' జైల్లోనూ ఉంచడం జరుగుతుంది. ముష్ఠి సుబ్రహ్మణ్యం, వేలూరి సత్యనారాయణ, తటవర్తి కృష్ణమూర్తి మొదలైనవారు అతని జైలు మిత్రులు. బాపిరాజు శిక్షా కాలమంతా మిత్రులవి, జైలర్‌వి, జైలు పరిసరాలనీ పెన్సిల్ స్కెచ్‌లు వేసుకుంటూ సాహిత్య ప్రసంగాలు చేస్తూ, 'నారాయణరావు' నవల వ్రాసుకుంటూ గడుపుతాడు.

తమిళ జాతీయ కవి సుబ్రహ్మణ్య భారతి ఆ గదిగోడలపై వ్రాసిన గేయాలను చూచి ఉద్రిక్తుడై ఆయన జైల్లో చాలా గేయాలు వ్రాస్తాడు. వాటికి తర్వాత 'దీపమాల' అని పేరు పెట్టుకుంటాడు.

'కోనంగి' నవల రాయడానికి బాపిరాజుకు అనుభవించిన జైలు జీవితం అక్కడి రాజకీయ పరిస్థితులు ఎంతగానో తోడ్పడ్డాయి. మొత్తం మీద సంవత్సరం శిక్షా కాలాన్ని పూర్తి చేసుకొని విడుదలవుతాడు.

జైలు నుండీ విడుదలైన తరువాత 1923 నవంబర్‌లో ప్రమోదకుమార చటర్జీగారి దగ్గర చిత్రకళ నేర్చుకొనేందుకు బందరు జాతీయ కళాశాలలో చేరతారు. అందుకాయనను కోలవెన్ను, విశ్వనాథలు ప్రోత్సహిస్తారు. బాపిరాజుగారు చటర్జీగారి దగ్గర పగలు చిత్రకళ నేర్చుకుంటూ, సాయంత్రం కృష్ణాపత్రిక ఆఫీసులో కృష్ణారావుగారి దగ్గర భారతీయ సంస్కృతి విశేషాలను తెలుసుకొనేవారు.

"ఇది వరకే బాపిరాజు కవిత్వంలో చిత్రలేఖనం వ్రాస్తున్నాడు. ఇక ముందు చిత్తలేఖనంలో కవిత్వం వ్రాయ మొదలేస్తాడు"[33] అంటూ భవిష్యత్తు చెప్పాడు విశ్వనాథ.

కృష్ణా పత్రికాఫీసుకు 'ఆంధ్ర దర్బారు' అని పేరు. పింగళి, కాటూరి, మల్లాది, ముని మాణిక్యం మొదలైన వారితో బాపిరాజు ఆ దర్బారులో ఒకడవుతాడు. అతడు ఆ దర్బారు చిత్రకారుడు. బాపిరాజు కళాపిపాసను 'ఆంధ్ర దర్బారు' తీరుస్తుంది.

కూల్డ్రే వద్ద తెలుసుకున్న కళా రహస్యాలకు ప్రమోదకుమార్ చటర్జీ శిక్షణానంతరం కృష్ణాపత్రిక దర్బారులో వర్ణరూపాలివ్వడం ప్రారంభిస్తాడు. 'శబ్ద బ్రహ్మ'; 'భాగవతపురుష' వంటి వర్ణ చిత్రాలు ఆయన్ను లోకానికి చిత్రకారుడుగా పరిచయం చేస్తాయి. ఆ విధంగా 1928 దాకా బాపిరాజు కళారాధనలోనే ఉండిపోతాడు.

1928లో బాపిరాజు మదరాసు వెళ్ళి 'లా' కాలేజీలో చేరతాడు. ఆ సంవత్సరంలోనే అతడికి పుత్ర వియోగం జరుగుతుంది. కుటుంబ కారణాలు, కళా వ్యాసాంగాల కారణం వల్ల బి.ఎల్. మొదటి సంవత్సరం తప్పుతాడు. 1931లో బి.ఎల్. పట్టభద్రుడవుతాడు.

విద్యార్థిగా తన అభ్యాస జీవితాన్ని పూర్తి చేసుకొని భీమవరం వచ్చి న్యాయవాద వృత్తిలో ప్రవేశించినప్పటికీ అది సంతృప్తి నివ్వలేదు. అందులో రాణించలేకపోతాడు. అది విడిచిపెట్టి ఉద్యోగ ప్రయత్నాలెన్నో చేస్తాడు. దొరికిన ప్రతి చిన్న ఉద్యోగం చేస్తాడు. అలా దాదాపు నాలుగేళ్ళుపాటు ఆ కళాకారుడు ఎన్నో కష్టాలెదురుకుంటాడు.

"ఆ రోజుల్లోనే ఆయన 'మత్యుదేవి' చిత్రాన్ని వేస్తున్నాడు. రచన సగం అయినప్పుడు ప్రమోదబాబు వచ్చాడట. 'ఉత్తమ చిత్రకారుని'లో దైవాంశ ఉంటుంది. అతడు తన సర్వస్వాన్ని ఏకోన్ముఖం చేసి చిత్రించే చిత్ర ప్రభావం ఊరికే పోదు అంటూ చిత్రాన్ని చెరిపివేసి, ఇక నుండి ఇటువంటి చిత్రాలు వేయవద్దన్నాడట. బాపిరాజు హృదయంలో ఆ మాటలు గాఢంగా నాటుకుపోయాయి. దుష్ఫలితాన్ని శంకించాడు. వెంటనే దక్షిమూర్తి ఉపదేశం పొంది, ఆస్తవం చేయడం మొదలు పెట్టాడట.

ఆ రోజుల్లోనే మరొక సంఘటన జరిగింది. ఒకనాడాయన విజయవాడ స్టేషన్‌లో ఉండగా గాలి దుమారం వచ్చి, ఒక పెద్ద బల్బు తెగిపోయి, ఆయన కాలుపై పెద్ద శబ్దం చేస్తూ పడిపోయింది. ఈ ఆకస్మిక సంఘటనకు ఆయన స్పృహ తప్పి పడిపోయాడు."[34]

ఆ రెండు సంఘటనల వల్ల బాపిరాజుకు నరాల బలహీనత వస్తుంది. ఆ నరాల బలహీనతనే అతడు గుండెజబ్బుగా భావించి కలత చెందుతాడు. కదిల్తే ప్రాణం పోతుందనుకొని మంచం పడతాడు.

దయాల్‌బాగ్‌కు వెళ్ళి సత్సంగ్‌లో చేరతాడు. అయినా అతడికి స్థిమితం చిక్కదు. కుటుంబ భారాన్ని భరించలేనోడని కొందరు బంధువులు దూషణలందుకుంటారు.

ఆ సమయంలో ముష్టి లక్ష్మీనారాయణగారు బాపిరాజును సేదతీరుస్తూ, ధైర్యం చెప్తూ కాపాడతారు. అదే సమయంలో మరొక మిత్రుడు "'గూడూరు నమశ్శివాయగారు' విజయవాడలో 'మృత్యుంజయా ఫార్మసీ'ని పెడుతూ దానికి బాపిరాజును ఒక చిత్రం రచించి ఇమ్మన్నారు. 'మృత్యుంజయ' చిత్ర రచనతో కోలుకుంటానన్న భావం ఆయనకు కలిగింది. అద్భుతమైన 'మృత్యుంజయ' చిత్రం రచించాడాయన. కొద్ది రోజుల్లో కోలుకున్నాడు."[35] అప్పుడే 'నారాయణరావు' నవలకు కూడా బహుమతి లభిస్తుంది. అప్పుడే 'తిక్కన' చిత్రాన్ని కూడా గీస్తాడాయన. తిరిగి సాహితీ వ్యాసాంగాన్ని కూడా కొనసాగిస్తాడు.

1935లో బందరు జాతీయ కళాశాలకు ప్రిన్సిపాల్‌గా నియమించబడతాడు. కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న రోజుల్లోనే అతడి భార్య సుభద్రమ్మకు మానసిక వ్యాధి

సంభవిస్తుంది. అప్పటికే కొడుకు కూడా మరణిస్తాడు. ఒక కూతురుకి పోలియో కూడా సోకుతుంది. ఈ విషాదానంతటినీ తనలో తానే దిగమ్రింగుకుంటాడు.

బందరు కాలేజీలో వచ్చే జీతంతో హాయిగా బ్రతకొచ్చు. తిన్నంత తిని దాచుకొనే అవకాశాలు ఎక్కువ ఉంటాయి. కానీ అతడు దాచుకోవడం అనే ఆలోచన పక్కన పెట్టి పేద విద్యార్థులకు ఫీసులు కట్టడం, వాళ్ళకు తన ఇంట్లో కులమతాల తారతమ్యం లేకుండా భోజనాలు పెట్టడం చేసేవాడు. తన భవిష్యత్తును పక్కన పెట్టి ఇతరుల భవిష్యత్తును తీర్చిదిద్దాలనేదే అతడి ఆలోచన. అతడు తన పిల్లలతో పాటు సమానంగా పోషించిన వారిలో ప్రభాకర జోసెఫ్ (సర్వోదయ నాయకుడు), ఊట్ల కొండయ్య, గుత్తి రామకృష్ణులు ముఖ్యులు.

అంతట్లోనే బాపిరాజు జీవితం మరో కొత్త మలుపు తిరుగుతుంది. 'సతీ అనసూయ' 'ధృవ విజయం' అనే తొలి "తెలుగు పిల్లల చిత్రాల"ను నిర్మిస్తున్న సి.పుల్లయ్యగారు కళాదర్శకుడుగా బాపిరాజును పరిచయం చేస్తూ కలకత్తాకు ఆహ్వానిస్తారు. బాపిరాజుగారు నెలరోజులు కళాశాలకు సెలవు పెట్టి కలకత్తా వెళ్ళి ప్రథమాంధ్ర బాలల చలన చిత్ర కళా దర్శక బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తాడు. తరువాత 'మీరాబాయి' చిత్రానికి కూడా కళా దర్శకత్వం వహిస్తాడు. దానిలో వైష్ణవాలయం సెట్టింగు, రాజగురుగండ కత్తెర వేసుకునే సెట్టింగు ఆనాడు బాగా పేరుపొందాయి. ఆ తర్వాత చిత్రం 'దక్షయజ్ఞాని'కి కూడా కళా దర్శకత్వం వహిస్తాడు. కానీ దాని నిర్మాణం పూర్తి కాలేదు. ఆ సినిమా రంగం అతన్ని కళాశాలకు దూరం చేస్తుంది. చిత్ర పరిశ్రమలోనే స్థిరపడాలని నిశ్చయించుకొని మద్రాసు వెళతాడు. ఆ సినిమా పరిశ్రమ కూడా తిరిగి మళ్ళీ అతని జీవితాన్ని చీకటిమయం చేస్తుంది.

అతను రాసిన నారాయణరావు నవలను, శైలబాల కథలను సినిమాలుగా తీస్తామంటూ ముందుకొస్తారు కొందరు. కళాదర్శకత్వం కొన్నింటికి చిత్ర దర్శకత్వం మరి కొన్నింటికీ ఇస్తామంటారు. అతడితో పని చేయించుకొని మోసం చేస్తారు. అతడు నమ్మిన సినిమారంగం అతన్ని ఆరేళ్ళు బాధిస్తుంది. అయినా అతడు కళాసేవ మానలేదు. గుంటూరులో ఒక కళాపీఠాన్ని స్థాపించి, యువకులకు శిక్షణనిచ్చి కళారంగంలో తీర్చిదిద్దుతాడు. ఆ కళాపీఠానికి అతడే 'కులపతి'. సాహిత్య సభలేవీ అతడు లేకుండా జరిగేవి కావు.

'గులాం మహమ్మద్ కలకత్తావాలా' 'మీజాన్' పత్రికాధిపతి. అతడు 1944 ఫిబ్రవరిలో మహమ్మద్ ఖాసింఖాన్ ద్వారా బాపిరాజుకు ఆ పత్రికా సంపాదకీయ బాధ్యతలు వహించాల్సిందిగా ఆహ్వానం పంపుతాడు. అప్పటికే ఎన్నో ఇబ్బందులలో ఉన్న బాపిరాజు

వెంటనే అంగీకరించి, కుటుంబంతో సహా మకాం హైదరాబాద్‌కు మార్చి 'మీజాన్'లో చేరతాడు.

1944 నుండి 1947 ఆగష్టు 7వ తేదీ దాకా ఆయన మీజాన్ సంపాదకుడుగా ఉంటాడు. ఆయన హిమబందు - తుఫాను - కోనంగి - గోనగన్నారెడ్డి - అడివిశాంతి శ్రీ' నవలలన్నీ 'మీజాన్'లో ప్రచురించారు. అతడు 'నారాయణరావు' నవలను మిగిలిన కథల్ని అచ్చు వేయించుకుంటాడు.

'మీజాన్' రాజకీయ పత్రిక. అయినా బాపిరాజు అతడు నమ్మిన సిద్ధాంతాని కనుగుణంగానే ఆ పత్రికను నడిపిస్తారు. దాని ద్వారా గాంధేయ వాదాన్ని, జాతీయోద్యమాన్ని ప్రచారం చేస్తాడు.

స్వాతంత్రం సిద్ధించడానికి ముందు హైదరాబాద్ సంస్థానంలో ఉద్రిక్తతలు ఎక్కువవుతాయి. అతడు నమ్మిన సిద్ధాంతానికనుగుణంగా పత్రిక నడపలేకపోతాడు. మరో వారం రోజుల్లో స్వాతంత్ర్యం వస్తుందనగా 1947 ఆగష్టు 7వ తేదీన ఆ పత్రికను వదిలిపెట్టేస్తాడు. అతడు విడిచిపెట్టినా అతడి పేరుతోనే కొన్నాళ్ళు ఆ పత్రిక వెలువడుతుంది. దానిలో ప్రభుత్వ వ్యతిరేకతను చూచి ప్రభుత్వం బాపిరాజు పై అరెస్టు వారంట్లను సిద్ధం చేస్తుంది. అయితే మద్రాసు ప్రభుత్వంలో హోంమంత్రిగా పని చేస్తున్న బెజవాడ గోపాలరెడ్డిగారు బాపిరాజుపై జారీ అయిన అరెస్టు వారంట్లను రద్దు చేయిస్తారు.

'మీజాన్' వదిలిన తర్వాత కూడా తిరిగి చిత్ర పరిశ్రమలో అవకాశాల కోసం ప్రయత్నం చేస్తాడు. కానీ ప్రయోజనం ఉండదు. అంతటి కష్టకాలంలోనే 1949లో ఆయన తన ఇద్దరి కుమార్తెలు రాధావసంత, ప్రేమకుమారిగార్ల వివాహాలు జరిపిస్తాడు. బాపిరాజుగారి మీద భక్తితో ఆయన పెద్దకుమార్తెను వివాహమాడిన శ్రీ శేషగిరిరావుగారు మహనీయులు. బాపిరాజు గుండెల్లో మరిగిపోయే దు:ఖాన్ని తీర్చిన పూజ్యులు.

"1950లో కనకాభిషేకం; మద్రాసు తెలుగు భాషా సమితి ఆధ్వర్యాన తయారైన తెలుగు విజ్ఞాన సర్వస్వానికి, సాహిత్యం, భాష, కళలు, విద్యమొదలైన విషయాలకు సంబంధించిన సంపుటం తయారు చేసే ఉపసంఘంలో సభ్యుత్వం."[36]

"1951లో ఉమ్మడి మదరాసు ప్రభుత్వం సింహాళంలోని సిగిరియా కుడ్య చిత్రాల ప్రతులను తీసుకురావడానికి బాపిరాజును సింహాళం పంపించింది. ఆయన రాంభట్ల కృష్ణమూర్తి, పిలకా నరసింహమూర్తి, కోడూరి రామమూర్తి, శ్రీనివాసులు నాయుడు అనే

యువ చిత్రకారులను తీసుకొనిపోయి, ఆ ప్రతుల్ని తీసుకువచ్చి మదరాసు ప్రభుత్వానికందజేశారు. ఆ చిత్రలిప్పుడు మదరాసు ప్రభుత్వ మ్యూజియంలో ఉన్నాయి."[37]

సింహళం నుండి తిరిగి వచ్చాక అతడి ఆరోగ్యం క్షీణిస్తుంది. ఆయనకు 'ప్రొస్టేటు గ్లాండ్సు' పెరగడంతో అతడి ఆరోగ్యం క్షీణించినట్లు అతడికి చికిత్స చేస్తున్న రాయంపేట డాక్టర్లు తెలుసుకుంటారు. డాక్టర్ ఎ.ఎన్.రామకృష్ణగారు, డాక్టర్ కాంతారావుగారు, డాక్టర్ మీనన్‌గార్ల సహాయంతో బాపిరాజుగారికి ఆపరేషన్ చేస్తారు. ఆ ఆపరేషన్ సక్సెస్ కాలేదు. కారణం, ఆపరేషన్ చేస్తుండగా మధ్యలో బాపిరాజుగారికి మెలకువ రావడంతో ప్రొస్టేటు గ్రంధిని తొలగించుకుండానే తిరిగి కుట్లు వేస్తారు. మళ్ళీ ఆపరేషన్ చేయవలసి వస్తుంది రెండవసారి డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ గాలి బాలసుందరరావు సలహాతో ఆపరేషన్ చేస్తారు. "సక్సెస్" అవుతుంది. సంపూర్ణ ఆరోగ్యంతో ఇంటికి తిరిగి వెళ్తారు. కానీ అతికొద్ది కాలానికే తీవ్రమైన జ్వరం వచ్చి రాయంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో మళ్ళీ చేరతాడు. డాక్టర్లు చూచి ఆరోగ్యానికి డోకా లేదంటారు. రేపో మాపో యింటికి వెళ్ళిపోవచ్చు అంటారు. "నాయాయణరావు" నవల్లో ఏవో దిద్దుబాట్లు కూడా అక్కడే చేసుకుంటాడు. భోజనం తీసుకు రమ్మని తన కూతుళ్ళను యింటికి పంపిస్తాడు. హఠాత్తుగా బాపిరాజుగారి ప్రాణం తుది ఘడియలకు చేరుకుంటుంది. అక్కడే ఉన్న తన పెద్ద అల్లుడు శేషగిరిరావుగారిని నీళ్ళు అడిగి ఒక గుక్క తాగి రెండు మూడు వెక్కిళ్ళు పెట్టి శేషగిరిరావుగారి ఒడిలోనే 1952 సెప్టెంబరు 22న రాత్రి ఏడున్నర గంటలకు చనిపోతాడు.

## 3.8 బాపిరాజు కథలపై సంస్కరణోద్యమ ప్రభావం

అడవిబాపిరాజుగారి రచనల్ని ఇటీవల విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ వాళ్ళు ఎనిమిది భాగాలుగా ప్రచురించారు. వాటిలో ఎనిమిదోవది 'అడివిబాపిరాజు రచనలు- 8 కథలు.' ఇందులో మొత్తం 37 కథలున్నాయి. వాటినన్నింటినీ పరిశీలించగా సంస్కరణా భావాలు గల కథలు ఎనిమిది ఉన్నట్టుగా తేలింది. అవి

1) తూలికా నృత్యం
2) బొమ్మలరాణీ
3) నరసన్న పాపాయి
4) తిరుపతి కొండ మెట్టు
5) దీపావళి

6) గుడ్డిపిల్ల

7) కన్ని

8) మెట్లు

ఈ ఎనిమిది కథల్ని నా సిద్ధాంత గ్రంథంలో పొందుపరుస్తున్నాను.

## 1. తూలికా నృత్యం

ఇది వితంతు పునర్వివాహాన్ని ప్రోత్సహించే కథ. పదహారేళ్ళ బాలికకు వివాహమై సంవత్సరం గడవక ముందే భర్త మరణించడంతో ఆమె జీవితం ఎటువంటి మలుపు తిరిగిందో చివరకు ఆమె తన జీవితాన్ని ఎలా చక్కదిద్దుకుందో చూపించే కథే 'తూలికా నృత్యం.' ఇందులో లలితకళలకు ప్రేమకూ పొంతన కుదిర్చాడు బాపిరాజు.

**'తూలికా నృత్యం' 'కథ' సంక్షిప్త పరిచయం :**

పద్మప్రియ అతి సౌంధర్యవతి. ఆమెకు ఎం.ఏ. పాసై, ఒక కాలేజీలో ఉద్యోగం చేస్తున్న 24 ఏళ్ళ యువకుడితో 16 సంవత్సరాల పద్మప్రియకు తండ్రి కోదండరామయ్యా మంచి కట్నం ఇచ్చి వివాహం జరిపిస్తాడు. పెళ్లై కార్యం కూడా కాకముందే భర్తకు టైఫాయిడ్ జ్వరం వచ్చి అందులో ఎన్నో ఉపవ్యాధులు సోకి అతడు మరణిస్తాడు.

చిన్నతనంలోనే పద్మప్రియ విధవయిపోవడం వల్ల బంధువులంతా దుఖిఃస్తుంటారు. తల్లితండ్రుల దుఖాఃనికి అవధులుండవు. ఆమె అందాన్ని చూసి, ఆమె స్థితిని గుర్తించి ఆమె తండ్రి స్నేహితులెందరో పునర్వివాహం జరిపించమని సలహా ఇస్తారు. అందుకు తండ్రి ముందు చదివిస్తాను. ఆ తరువాత ఆమె ఇష్టం అంటాడు.

పద్మప్రియ చదువుకోడానికి స్కూల్లో చెరుతుంది. స్కూలు ఫైనలు పాసవుతుంది. కాలేజీలో చేరుతుంది. బి.ఏ పట్టాపొందుతుంది. చిన్నప్పటి నుండీ చిత్రకళలో ఇష్టాన్ని పెంచుకుంటుంది. ఎప్పుడూ ఏవో బొమ్మలు గీస్తుంటుంది. అప్పుడామె వయస్సు 25 ఏళ్ళు. తండ్రి ఆమెకు వివాహం చేయాలని ప్రయత్నిస్తుంటాడు. అందుకామె "నాన్నా! నాకు వివాహం మీద ఇచ్ఛలేదు. నాకు చిత్రలేఖనం అంటే ఇష్టం. శాంతినికేతనానికి పోయి నందలాలుగారి పాదాలకడ చిత్రలేఖనం నేర్చుకుంటాను (తూలికా నృత్యం)." అంటూ ఆమె పట్టుపడుతుంది. అలా ఆమె శాతినికేతనంలో చెరుతుంది. అక్కడ ఆమెకు అవనీంద్ర ఋషి శిష్యుడైన ఆంధ్ర బ్రహ్మమూర్తితో పరిచయం కలుగుతుంది. బ్రహ్మమూర్తి మంచి చిత్రకారుడు. అతడు లేపాక్షి వద్ద చిత్రకళాశాల ఒకదానిని స్థాపిస్తాడు.

నందలాల్‌బోసు ఆనతితో పద్మప్రియ బ్రహ్మమూర్తితో లేపాక్షి కళాశాలకు వస్తుంది. బ్రహ్మమూర్తి వివాహమే చేసుకోనని నిర్ణయం తీసుకుని జీవితాన్ని కొనసాగిస్తున్న బ్రహ్మచారి. దానికి కారణం తనకు సరియైనా భార్య దొరకడం అసంభవమని అతని వాదన. అతడంత అందమైన వాడూ కాదు; అంత కూరూపీకాడు. కొంచెం పసిమిలో చేరే చామనచాయ. మధ్యరకం ఎత్తు. బలవంతమూకాని, బలహీనము కాని దేహసౌష్టము. కోలమోము చిన్నకళు ్ళ, సమనాసిక, విశాలమైన నుదురు సాధారణమైన నోరు. కాని అతని చూపులలో సర్వ విశ్వ సౌందర్యాలూ అన్వేషించే శక్తి ఉంది. అతని కంఠం చాలా తీయని మందర పంచమ మధ్య స్థాయి కలది. చురుకైన బుద్ధి. ఎప్పటికీ శక్తివీడని నవనవోన్మేషమైన కళాసృష్టి.

అటువంటి బ్రహ్మమూర్తి పద్మప్రియలో తన ఆశయమూర్తిని చూస్తాడు. ఆ విషయాన్ని ఆమెకు చెప్తాడు. అంగీకరిస్తే వివాహం చేసుకుంటాననంటాడు. అయితే ఆమె విధవ కావడం వల్ల ఆ ఆలోచన అంగీకరించనివ్వదు. వారిద్దరికీ కొంత సన్నిహిత్యం పెరిగాక మరోసారి ప్రయత్నించి విఫలుడై ఆమెతో "పద్మప్రియా! నేను హిమాలయాలకు వెడుతున్నాను. నాపై నీకు ప్రేమలేదని నిర్ధారణ చేసి చెప్పినావు. నీపైనా నాప్రేమ నా సర్వస్వము, నాశక్తి, నారక్తి, నాముక్తి, అదే నాకళ. నీవు ఎదురీయని ఈ ప్రేమను జయించి మహాయోగినై తిరిగి వస్తాను, ఓడిపోతానా తిరిగిరాను. నువ్వు, నా బిడ్డలు నరసింహం, వాణీసుందరి ఈ ఆశ్రమం నిర్వహించండి. ప్రథమ శిష్యురాలైన నీకు ఇదే నా తుది ఆదేశము (తూలికా నృత్యం)" అంటాడు.

అందుకామె బాధతో కూడిన స్వరంతో వినిపించి వినిపించనట్లు "మీరు నన్ను ప్రేమించటానికి నా అభ్యంతరం లేదు. ఈలాగే ఈ మన పవిత్ర స్నేహంలో ఈ ఆశ్రమం మన యిద్దరం ఎందుకు నడపకూడదు?" అని ఆమె తలవాల్చుకొని కన్నుల నీరు జలజల రాలిపోతుండగా పలికినది.

"అది అసంభవము పద్మా! ఉత్తమ సంగీతము త్రిస్థాయీ మూర్తిత్వము. ఉత్తమ ప్రేమ త్రిగుణాత్మకము. భౌతిక మానసిక ఆత్మీకరము. నేను ఈ త్రివిధంగా నిన్ను ప్రేమిస్తూ, వాంఛిస్తూ నీవు ఏవిధంగానూ ఆ మూడు స్థాయిలకు శ్రుతి కలపకుండా వట్టి స్నేహంగా ఉంటూ ఉంటే నా కళాపూజ నిర్వహించలేను. కాబట్టి మనం విడిపోవడమే ఉత్తమం." అని పలికి హిమాలయాలకు వెళ్ళిపోతాడు బ్రహ్మమూర్తి.

బ్రహ్మమూర్తి వెళ్ళినప్పటి నుండీ పద్మప్రియ పడే బాధకు అవధులు లేవు. అతడి జ్ఞాపకాలతో రోజులు గడుపుతుంది. శాంతి నికేతనంలో బ్రహ్మమూర్తిని చూసినప్పటి నుండీ

అతడ్ని ప్రేమించడం మొదలు పెడుతుంది. కానీ ఆభావం నుంచి భయపడి అతడు అడిగినపుడు అంగీకరించడం కానీ తానంతట తానైనా చెప్పడం జరగదు. కారణం తీరని సిగ్గు.

ఒకసారి వాణీ సుందరి చిత్రానికి రంగులు దిద్దుతుండగా పద్మప్రియ ఆమెతో 'వాణీ, ఒక్కసారి నీ గదికిరా, నీతో మాట్లాడాలి' అంటూ రహస్యంగా చెబుతుంది. వాణీ సుందరి ఆమె వైపు చూసి వారిద్దరూ కలిసి పద్మప్రియ గదికి వెళతారు. అక్కడ మాటల సందర్భంలో "వాణి! నేను ఒట్టి తుచ్ఛురాలను సుమా. నాగురువుగారిని నేనెంత బాధపెడున్నానో నీవు గ్రహించనే గ్రహించావు. నేను ... వారిని సంపూర్ణంగా ... నా సర్వస్వంతో నా ... నా ... నా సర్వ ... సర్వస్వముతో ప్రేమ ... ప్రే ... ప్రేమిస్తున్నాను. అది ... అది ... వారిని దర్శించిన మొదటి క్షణము నుండీ, నన్ను కుంగదీసే సిగ్గే వారికి వర్ణింపరాని బాధ కలిగిస్తున్నది. నివ్వే నన్ను రక్షించాలి. అంత భారం నీమీదే వేశాను. గురువుగారు "కూలూ"లో రూరిక్‌గారి ఆశ్రమంలో ఉన్నారు. వారు ఏమి బాధలు పడుతున్నారో (తూలికా నృత్యం)" అంటుంది.

పద్మప్రియ "మీరు వెంటనే రండీ!" అంటూ రాసి పంపిన ఉత్తరం అతడికి చేరుతుంది. వెంటనే అతడు రెక్కలు కట్టుకొని లేపాక్షిలో వాలతాడు.

హిందూపురం రైల్వేస్టేషన్ వద్ద నరిసింహారావు, వాణీసుందరీ, విద్యార్థివిద్యార్థినీలు స్వాగతం పలుకుతారు.

పద్మప్రియ ఉండక పోవటాన్ని గ్రహించి ఆమెకు అనారోగ్యమేమైనా కలగలేదు కదా అని వణికిపోతాడు.

అంతలో నరసింహం "గురువుగారు! మీరు మొదటి తరగతి విశ్రాంతి మందిరంలోకి వెళ్ళండి" అంటాడు.

బ్రహ్మమూర్తి అక్కడికి వెళ్ళగా దేవతామూర్తిలా అలంకరించుకొని ఉన్న పద్మప్రియ వెండి కలశంతో అతని పాదాలు కడిగి నీటిని తన తలపై చల్లుకుంటుంది. వెండి పళ్ళెంలో అతడికి కర్పూరహారతిస్తు చిరునవ్వుతో పద్మప్రియ.

"నా ప్రాణేశ్వరునకు దివ్యమంగళం" అని అంటూ చిరునవ్వున దూరంగా పోయి నిలుచుంది.

"ఏమిటి! నిజమా! నాదేవి! మళ్ళీ అను!" అని అతడామెను చేరినాడు.

"నిజం! నాసిగ్గు... నాకింత... చేటు తెచ్చింది గురువుగారూ! శాంతినికేతన ప్రథమ క్షణంలోనే నేను నా మనస్సు మీకర్పించుకొన్నాను (తూలికా నృత్యం)" అంటూ ఆమె ధైర్యంగా చెబుతుంది.

అతడు ఆమె చేతుల్లో ఉన్న హారతి పళ్లెం తీసి పక్కన పెట్టి, ఆమెను గాఢంగా కౌగిలించుకుంటాడు.

**కథా ఉద్దేశ్యం :**

స్త్రీలకు వైధవ్యం సంభవిస్తే జీవితం ముగిసిపోయినట్లేనా? ఏమాత్రం కాదు. పునర్వివాహంతో భవిష్యత్తును దిద్దుకోవటం తప్పుకాదనేది ఉద్దేశ్యం.

**'తూలికా నృత్యం' కథ పై సంస్కరణోద్యమ ప్రభావం :**

పూర్వం స్త్రీలు చిన్న వయసులోనే పెళ్ళిళ్లై కొంత కాలానికే విధవలై దుర్భర జీవితాన్ని అనుభవిస్తూ ఉండేవారు. రాను, రానూ అటువంటి దుస్థితి కొంత వరకు తగ్గింది. రెండు మూడు పెళ్ళిళ్ళు చేసుకొనే మొగాళ్ళు ఆకాలంలోనూ ఉన్నారు, ఈ కాలంలోనూ ఉన్నారు. కానీ ప్రస్తుత కథలో చూపించినట్లుగా చిన్న వయసులో పెళ్లైన స్త్రీ ఆ ముచ్చట తీరక ముందే భర్తపోయి విధవైన ఆమెను చేసుకోవడానికి ముందుకొచ్చిన బ్రహ్మమూర్తి వంటివారు బహుకొద్ది మందే ఉంటారని చెప్పడంలో సందేహం లేదు. కథలో బ్రహ్మమూర్తి అనే బ్రహ్మచారి వితంతువైన పద్మప్రియను వివాహమాడినట్లు చిత్రించి రచయిత వితంతు పునర్వివాహాన్ని ప్రోత్సహించాడు. వితంతువులు ఎదుర్కొనే బాధలురూపుమాపాలంటే పునర్వివాహాలు సాధ్యమైనన్ని ఎక్కువ జరగాలి. సంఘాన్ని వితంతు సమస్య కూడా పీడించేదిగా ఉంది కనుక, ఆ పీడన భారి నుండీ సంఘాన్ని తప్పించాలంటే బ్రహ్మమూర్తి వంటి వారి అవసరం ఎంతో వుంది. బ్రహ్మమూర్తి ద్వారా రచయిత వితంతు పద్మప్రియకు తిరిగి పునర్జీవితాన్ని ఇప్పించినట్లు తెలియజేసి తనలోని సంస్కరణా భావాన్ని ప్రకటించాడు. కనుక 'తూలికా నృత్యం' కథపై సంస్కరణోద్యమ ప్రభావం బలంగా పని చేసిందని చెప్పాలి.

## 2. బొమ్మల రాణీ

ఈ కథ కులాంతర వివాహాన్ని ప్రోత్సహించేది. ఎరకల కులానికి చెందిన అమ్మాయిని తెలగకులానికి చెందిన అబ్బాయి సంగీతంలో ఆమెను తీర్చిదిద్ది వివాహమాడిన వైనాన్ని 'బొమ్మల రాణీ' కథలో చూడొచ్చు.

**'బొమ్మలరాణీ' కథ సంక్షిప్త పరిచయం :**

మీనాక్షి విఠలుడి కూతురు. విఠలుడు వీరయ్య కొడుకు. వీరయ్య డెబ్బై ఏళ్ళ వయసువాడు. మంచి విద్యావంతుడు. వాల్మీకి రామాయణం, భాస్కర రామాయణం, సంస్కృత మహాభారతం, నన్నయ్య, తిక్కన, ఎఱ్ఱాప్రగడల మహాభారతం అతనికి కంఠస్థం,

మంచి నీళ్ళు ప్రాయం. అతడికి సంగీతం కూడా తెలుసు. సంగీత శాస్త్రంలో ప్రసిద్ధి కెక్కిన కోనసుబ్రహ్మణ్యశాస్త్రిగారి దగ్గర దానినభ్యసిస్తాడు. వీరయ్య తోలుబొమ్మల ప్రదర్శనలతో అనేక సంస్థానాల వారి నుండీ బహుమతులు, సన్మానాలు డబ్బులు అందుకుంటాడు.

అటువంటి ప్రతిభ గల వీరయ్య మనుమరాలే మీనాక్షి. మీనాక్షికి కూడా తోలుబొమ్మలాటలో మంచి ప్రవేశం ఉంటుంది. అద్భుతంగా పాడుతుంటుంది. కానీ అది శాస్త్రీయబద్ధంగా నేర్చుకోలేదు. ఒకనాటి ప్రదర్శనలో ఆమె గానాన్ని విన్న సీతారామయ్యగారు తన్మయుడైపోతాడు ఆ బాలిక వీరయ్యకు ఏమైతుందో అనుకుంటాడు.

ఒకసారి సీతారామయ్యగారు భీమవరంలో తోలుబొమ్మలాట ముగించుకొని వచ్చిన వారం రోజులకు ఓ సాయంత్రం వేళ ఇంట్లో ఫిడేలు వాయిస్తూంటాడు. అంతలో వీధిలో నుండీ తోలుతిత్తిలో పంచమస్వరంలో మంచి పాట వినబడుతుంటుంది. వీధిలోకి వెళతాడు. ముష్ఠి కోసం వచ్చిన వాళ్ళని చూస్తాడు. వీరయ్య జట్టులో ఉన్న వాళ్ళుగా గుర్తిస్తాడు. పద్నాలుగేళ్ళ బాలిక పాడుతుంటే, నడి వయసు స్త్రీ తిత్తి ఊదుతుంటుంది. అంతలో వారిని చూసిన సీతారామయ్య.

"అమ్మాయీ! నీకు వీరయ్య ఏమౌతాడు?"

"మా తాతయ్యండి."

"ఈ మనిషి ఎవరు?"

"మా అమ్మండి."

"నీకు సంగీతం ఎవరు నేర్పారు?"

"మా తాతయ్య నేర్పాడు సామీ."

"నీకు సంగీతం నేర్పితే నేర్చుకుంటావా?"

తల్లి - "స్వామీ! అంత అదృష్టం మాకు పడుతుందాండీ?"

"అదృష్టానికేముందిలే. ఇటువంటి కంఠం క్రమమైన సాధన లేకపోతే దోహదంలేని పూల చెట్టులా ఉంటుంది. ఇలాంటి గొంతుకే నాచేతిలోపడితే, దీని ముందర కిన్నెరుల పాటలూ, మహతీ వీణా కూడా అపశ్రుతి స్వరాలు పలకొద్దూ. దీనికీగళ మెక్కడ నుంచొచ్చిందీ?"

"మా తల్లి గొంతు ఇంతకన్నా అందంగా ఉండేదండీ" అని నడిమి వయస్సు స్త్రీ బదులు చెప్పింది.

"నేను వీరయ్యతో మాట్లాడతాను. అతన్ని ఒకసారి రేప్రొద్దున్న మా ఇంటికి పంపించు

(బొమ్మల రాణి).'' అంటాడు.

తరువాత రోజు వీరయ్య, వితలుడు కలిసి సీతారామయ్యగారింటికి వెళతారు. ''సీతారామయ్యగారి వంటి పండితోత్తముడు, సజ్జనుడు, ఉత్తమ గాయకుడు తన మనుమరాలికి సంగీతం నేర్పడం కన్న అదృష్టం ఇంకోటిలేదని తెలుసును.'' అయినప్పటికీ ఇలా అంటారు.

''స్వామీ తమరు శలవిచ్చింది ఎంతో సంతోషమైంది కాని ఏమి చేసేది? వృత్తి వాండ్లం. జట్టు కొద్దిమందే ఉంటిమి. ఈ కరువు దినాలలో మా రాబడి అంతా ఈ పిల్లదాని. గొంతుకపైనే ఆధారపడి ఉంది స్వామీ!''

''ఓయి వెఱ్ఱివాడా, ఇప్పుడు కొంచెం కాలం మళ్ళుతోందోయ్. తోలుబొమ్మలు, వీధినాటకాలు మళ్ళీ దేశంలో ఉద్దరింపబడతాయి. నాగరికత కలవాళ్ళే వీట్లను ఉద్ధరిస్తారు. అల్లాంటప్పుడు నీ మనుమరాలు సంగీతం నేర్చుకొని ఉందంటే నీ జట్టుకు వచ్చే గౌరవం ఇంతా అంతా అని కాదు.''

**వీరయ్య** : అదేమిటి స్వామీ, వీధి నాటకాలు మూలబడ్డాయి కూచిపూడి భాగవతులు కూలిపోయారు. విప్రవినోదులు అయిపులేరు. సినిమాలు, నాటకాలు మఱి అదేంటి స్వామి ఏమిట్రా అబ్బాయి దాని పేరు. విప్రవినోదులు చేసే పనులు చేస్తారు!

**సీతా** : ఓ ! మాజిక్కా!

**వీర** : అదో అదండి. అలాంటివన్నీ పెరిగిపోయాయి.

**సీతా** : ఓయీ పిచ్చివాడా, పోనీ తోలుబొమ్మలు చచ్చిపోతాయే అనుకో ఈరోజుల్లో సంగీతం నేర్చుకున్న వాళ్ళకి డబ్బెక్కువ. సంగీత సభలు, సంగీత స్కూలు మేష్టర్లు, సంగీత గ్రామఫోను ప్లేట్లు, సంగీత సినిమాలు, ఆడవాళ్ళు నాటకాల్లో వేషాలు వేయడం. ఎక్కడ జూసినా సంగీతానికే యీ రోజుల్లో డబ్బు. అల్లాంటప్పుడు కాస్త గట్టిగా సంగీతం నేర్చుకుంటే మీ కుటుంబమునంతా అదే పోషించగలదు. గౌరవము సంగతి జెప్పక్కర్లేదు. యేవంటావోయ్ వితలయ్యా?

**విత** : నిజం, సామీ! మా అప్ప ముసలివాడు. వాడికేమి తెలుసు. మా అమ్మణ్ణి మీదగ్గర వుంచుదురు సామీ (బొమ్మల రాణి).''

దానికి వీరయ్య కూడా వొప్పుకుంటాడు. కామేశ్వరరావు యమ్.ఏ. పూర్తయినాగానీ చదువుకు తగిన ఉద్యోగం దొరకక ఖాళీగా ఉంటాడు. లలిత కళల పట్ల ఆశక్తి అతడికి కూడా ఎక్కువే.

వీరయ్య తోలుబొమ్మలాట ప్రదర్శనలో పాడుతున్న మీనాక్షి కంఠాన్ని విని ఆకర్షితుడై ఇంటికి వెళ్ళి ఐదు రూపాయల నోటు పట్టుకొచ్చి పందిరి వెనుకకు వెళ్ళి వీరయ్యను ఇవతలకి పిలిచి "నీ మనువరాలి గొంతుక్కి ఇదిగో నా బహుమానం" అంటూ ఇస్తాడు కామేశ్వరరావు. దాంతో వీరయ్య కథ ఆపించి కామేశ్వరరావుని "మరీ మరీ కామేశ్వరరావుగారూ" అని పొగుడుతాడు. అప్పటినుండీ కామేశ్వరరావుకు మీనాక్షి కంఠ మాధుర్యం పదే పదే గుర్తొస్తుంటుంది.

మీనాక్షి చూడటానికి "కొంచెము ఛామనఛాయ. నవయౌవనము పరిమళిస్తూ వున్న పొంకాల రేఖలు సుడులు తిరిగి కరిగిపోతూ వున్న విగ్రహము. మోముకోల. వెడల్పు కొంచెము తక్కువైన పొడుగపాటి కన్నులు. చివర కొంచెము వత్రువ తిరిగిన ముక్కు. మావిచివుళ్ళ పెదవులు. అపశ్రుతిలేని సౌందర్యఖని. ఆ బాల మోము కళాకోవిదత్వము స్పష్టీకరిస్తూ వున్నది (బొమ్మల రాణి)."

అంతకు ముందెపుడూ కామేశ్వరరావుకి ప్రేమ ఆలోచన రాదు. అతడు తెలగ కులానికి చెందినవాడు. అయితే అతడికి నీచంగా సంచరించే తోలుబొమ్మలాట వాళ్ళ అమ్మాయిపై ప్రేమ పుడుతుంది. ఎంతోమంచి నాయుళ్ళూ, కాపులు చదువుకున్న కామేశ్వరరావుకు తమ పిల్లనిస్తామని వస్తున్నా తెలివైన, చదువున్న బాలికను చేసుకుందామనుకుంటాడు. అంతలో హఠాత్తుగా ఈ బొమ్మలవాళ్ళ అమ్మాయిపై ప్రేమ ఎక్కడినుండీ పుట్టుకొచ్చిందో అనిపిస్తుంది అతడికి.

మీనాక్షి ఆ ఊళ్ళోనే సంగీతం నేర్చుకుంటుందని గ్రహించి, అతడు కూడా తనకు తీరని కోరికైన సంగీతాన్ని సాధించేందుకు సీతారామయ్యగారి దగ్గర శిష్యుడుగా చెరతాడు. కామేశ్వరరావుకి పాఠం చెప్పేది సీతారామయ్యగారు ఏడుగంటలనుండీ ఏడున్నర వరకూ. తరువాత మీనాక్షికి మరో గంట పాఠం జరుగుతుంది. కానీ కామేశ్వరరావు అతడి పాఠం పూర్తయినాగానీ మీనాక్షి పాఠం పూర్తయ్యేవరకు అక్కడే ఉండేవాడు.

మీనాక్షికి కామేశ్వరరావు ఎందుకంత చనువు తీసుకుంటున్నాడో అన్న ఆలోచనన్నా రాలేదు. ఎప్పుడూ అతనితో ప్రాణమిస్తూ మాట్లాడేది.

మీనాక్షి సీతారామయ్య గారింట్లోనే బస చేసేది. కామేశ్వరరావు స్నేహము చేత శుభ్రత, శుచి, రసజ్ఞత వీటిని గురించి మీనాక్షి బాగా నేర్చుకొన్నది. ఎరకల వాళ్ళ పందులు దొడ్డిలా వుండే మీనాక్షి గది నెమ్మది నెమ్మదిగా మార్పు చెంది ఆరునెలలలో కళా ప్రదర్శనపు మందిరములా తయారైనది.

మీనాక్షి రెండు సంవత్సరాల పాటు గురుకులవాసం చేసినట్లయింది. ఇన్నాళ్ళు నేర్చుకొన్న చదువు చాలంటూ మీనాక్షి తాత ఆమెను తీసుకుపోవడానికి గరుత్మంతుడులా వస్తాడు. మీనాక్షి గురువును, గురువుగారి భార్యను విడిచి వెళ్ళలేక వెక్కి, వెక్కి ఏడుస్తుంటుంది.

కామేశ్వర్రావు హృదయం దడదడమని కొట్టుకొంటోంది. కుంగిపోతూ నిలబడినాడు. మీనాక్షి కోసం తెప్పించిన తొంబది రూపాయల తంబూరాను ఆమెకిస్తూ, "మీనాక్షి! ఇక నన్ను మరిచిపో!" అంటాడు.

జట్టు అంతా ఆ సమయంలో విజయవాడలో ఉంటుంది. వీరయ్య, విఠలుడు, చిన్న వీరయ్య మీనాక్షిని గుర్తుపట్టలేకపోతారు. ఆమె చూడటానికి చెత్తకుప్పలోనుండీ బయలుదేరిన చేమంతి చెట్టులా ఉంటుంది.

మీనాక్షికి తన వాళ్ళను చూస్తే "వంద సంవత్సరాల క్రితం ఉతికిన బట్టలు కట్టుకుంటూ, వారానికి ఓ మాటైనా స్నానం చేయకుండా తిరుగుతూ, నానావిధ నీచ పదార్థాలు తింటూ, ఊరుబైట వేసుకున్న గూడు గుడిసల్లో సామాను మోసుకొనేందుకు ఉపయోగించే గాడిదలతోటి, కాపలా కాసుకొనేందుకు ఉపయోగించే పులుల్లాంటి కుక్కలతోటి సావాసం చేస్తూ, నూనె రాసుకుని దువ్వకోనందున పేలు పట్టియున్న తలలతో, వెఱ్ఱి మొఱ్ఱి రాళ్ళ పూసల పేర్ల నగలు పెట్టుకున్న మెళ్ళతో, వెండి మురుగులు అలంకరించిన చేతులతో, బంగారు గుల్ల దండకడియాలు దాల్చిన బాహులతో వెండి బిళ్ళల మొలనూళ్ళతో, వెండి వడ్డాణాలతో, పొగాకు, తమలపాకూ గారలు కట్టించిన నోళ్ళతో తన చుట్టూ ఉన్న తన చుట్టాలను చూసేటప్పటికి మీనాక్షి హృదయం క్రుంగిపోయింది (బొమ్మల రాణి)." వెంటనే ఆమె ఉండి వచ్చిన సీతారామయ్యగారి ఇల్లు, అక్కడ గడిపిన రోజులు పదే పదే గుర్తొస్తూంటాయి.

అంతలో వీరయ్యగారు తన మనుమరాలు తిరిగి జట్టులోకొచ్చిందంటూ, పేరు ప్రఖ్యాతలున్న సంగీత విద్వాంసులు సీతారామయ్యగారి వద్ద శిక్షణ పొంది గొప్ప పాతకురాలైందంటూ విజయవాడంతా చాటింపేయిస్తాడు. ఆ రాత్రి అక్కళ్ళ వారి సత్రం దగ్గర ఏర్పాటు చేసిన తోలుబొమ్మలాట చూడ్డానికి వచ్చిన జనం విజయవాడ కృష్ణా పుష్కరాలకు కూడా వచ్చియుండరు. ఉత్తర గోగ్రహణం కథను ప్రారంభిస్తారు. అందులో మీనాక్షిది సైరంధ్రిపాత్ర. మీనాక్షి ఉత్సాహం లేకుండా బొమ్మలాట పాకలో ఒక మూల నలిగిపోయిన పువ్వులదండలా కూర్చొని ఉంటుంది. వీరయ్య విఘ్నేశ్వర ప్రార్థన, సరస్వతీ ప్రార్థనలు పూర్తి కాగానే "అలాగున ధర్మరాజుల వారున్నూ, భీమసేనుల వారున్నూ, అర్జున

మహారాజున్నూ, నకుల సహదేవులైన కవలలున్నూ, ద్రౌపదీదేవి మహారాణియు, ధౌమ్యులవారితో కూడానున్నూ" అని అన్నాడు.

"ఆహా!"

"పన్నెండేళ్ళున్నూ, అటవీ, అరణ్యం, విపినం, గహనం, కాననం, వనం, ఇత్యమరః అయినటువంటి అరణ్యంలో వాసం చేసినవారు అవుకుంటూ -

"ఆహా! ఇక ఏలాగయ్యా! సంవత్సరో, వత్సరో, అబ్దో, హయనో, శరత్సమాః, ఇత్యమరః, ఒక సంవత్సరం అజ్ఞాతవాసం చేయవలసుంటుంది అని ఆలోచించు కుంటూ (బొమ్మల రాణి)"

ఆవిధంగా కథ కొనసాగిస్తారు. అంతలో ద్రౌపది పాట పాడవలసిన సమయం వస్తుంది. జట్టులో అంతా మీనాక్షి వైపు చూస్తుంటారు. మీనాక్షి మాత్రం నిట్టూర్పుతో అసహనంగా కూర్చునుంటుంది. అంతలో ఆమె తల్లి దగ్గరకు వెళ్ళి "మినీ, మినీ పాట పాడ్డానికి రావే, నీ దుంపతెగ, మొద్దులా కూర్చున్నావేమే? లే, వచ్చి పాట పాడు" అంటూ కేకలేస్తుంటుంది. ఆమె కేకలకు మీనాక్షి చిచ్చర పిడుగులా లేగిసి "నేను పాడదలచుకోలేదు. మీ సరుకులు మోసే గాడిదలుగా మీరు కూడా గాడిదలు. తోలుబొమ్మలాటా? ఇది దెయ్యాలాటా?" అంటూ పట్టలేనికోపంతో తన కాళ్ళతో నేలను తంతుంది. అదంతా ఆమె తాత వీరయ్య చూస్తూనే ఉంటాడు. కోపం పట్టలేక ఆవేశంతో ఊగిపోతాడు- "నీకు సంగీతం చెప్పించినందుకా ఇంత పొగరుమోతు తనం? ఇంతట్లోకే మహారాణివైనావనా నీ ఉద్దేశం. చంఢాలపుదానా లే, వచ్చి పాడు చావగొట్టేస్తాను" అంటాడు.

తాతగారి ఉగ్రరూపం చూసి తెరవద్దకు వెళ్ళి మద్దెలకు నమస్కరించి పాట అందుకుంటుంది. శ్రుతి కుదరదు. వెనుకటి తీరురాదు. గొంతు కూడా స్థాయి పెరగదు. అందరూ అందిస్తూంటారు. కానీ మీనాక్షి అందుకోలేకపోతుంటుంది. పదిహేను నిమిషాలు భరిస్తారు. మీనాక్షి శ్రుతిలోకి రాదు. "మీనాక్షిని పాడమనండీ, మీనాక్షిని పాడమనండీ" అంటూ ఒకటే అరుపులు. మీనాక్షి పాడదు. ప్రేక్షకులందరికీ ఓర్పు నశించిపోతుంది. వీరయ్య అన్యాయం తలపెట్టాడంటూ ఆట చూడటానికి వచ్చిన వారంతా ఉప్పెనలా విరుచుకొని ఆ పందిరి మీద పడడం మొదలుపెడతారు. మీనాక్షి వెనుకటిలా పాడటానికి తీవ్రంగా ప్రయత్నిస్తుంటుంది. కానీ సాధ్యం కాదు యేడుస్తుంటుంది.

జనం అంతా తెరను చిన్నాభిన్నం చేసేస్తారు. విఠలుడు దొరికన బొమ్మలతో జట్టులో ఆడవాళ్ళని పారిపోమంటాడు. మిగతా బొమ్మల్ని చిన్న వీరయ్యకిచ్చి పరిగెత్తమంటాడు.

తండ్రికి తిత్తీ, మద్దెలా ఇచ్చి పంపించేస్తాడు. ఇంతలో నగరాలలో వీరయ్య అంటే మంచి అభిప్రాయం ఉన్న జట్టు పాకలకు నిప్పంటించనీయకుండా చూస్తారు. జనాలంతా వెళ్ళిపోయాక విఠలుడు మిగతావన్ని తీసుకొని తన గుడిసెల దగ్గరికి వెళతాడు.

జట్టునంతా కూడగట్టుకొని బందరు పారిపోతాడు వీరయ్య.

తరువాత కొంతకాలానికి కామేశ్వరరావు జట్టును మద్రాసు చేరుస్తాడు. అది డిసెంబరు నెల 1925వ సంవత్సరం. అడయారులో దివ్యజ్ఞాన సమాజం యొక్క షష్ఠిపూర్తి మహోత్సవం మహా వైభవంగా జరగబోతుంటుంది. ఎంతోమంది ప్రతినిధులు కూడా వస్తారు. వేలమంది సామాజికులు, సామాజికులు కాని వారు కూడా వస్తుంటారు.

డాక్టర్ జేమ్సు, హచ్, కజిన్సు అక్కడ జరుగుతున్న కళాత్మక ప్రదర్శనలు, సభలకు ఆనంద పారవస్సులైపోతుంటారు. ఆ కార్యక్రమానికి జావా నుండి ఒక తోలుబొమ్మల వాళ్ళ జట్టును, వీధినాటకం వాళ్ళ జట్టును పిలిపించి ప్రదర్శనలిప్పిస్తారు. ఆ ప్రదర్శనలని కామేశ్వరరావు మీనాక్షి కలిసి చూస్తారు. కామేశ్వర్రావు భావాలు ఆకాశవీథుల్లో పరుగులెడుతుంటాయి.

ఆ తరువాత రోజు కామేశ్వరరావు అతడి మిత్రుల సలహాతో కజిన్సుగారిని కలిసి "కామే : జావా తోలుబొమ్మలాట చూచానండి. ఆ ఆట ఆంధ్రదేశంనించే వెళ్ళిందని నా ఊహ.

**కజిన్సు** : కావచ్చును. ఈ రెండు దేశాల ప్రదర్శనాలకు చాలా సంబంధం వున్న మాట నిజమే.

**కామే** : ఈ ఆటలో నాటకం, నాట్యం, సంగీతం, చిత్రలేఖనము, కవిత్వము, భాష మొదలైన కళలన్నీ దివ్యంగా కలిసి వున్నాయండి.

**కజిన్సు** : జావా ఆటలో కొన్ని దోషాలు వచ్చాయి. ఆంధ్రదేశంలోని ఆటను కొన్ని దోషాలు ఆవరించాయి. కళ రానురాను హీనస్థితికి వచ్చింది.

**కామే** : మానవునిలో వున్న పశుత్వం (Atavism) ప్రతివ్యక్తి జీవితంలోనూ ఒకసారి పైకి వచ్చినట్లుగానే ఒక సంఘ జీవితంలో కూడా అప్పుడప్పుడు వస్తుందిగాదండి.

**కజిన్సు** : నువ్వు సరిగా చెప్పావయ్యా! ప్రేక్షక లోకం యొక్క హృదయస్థితిని బట్టి ప్రదర్శనం రీతినీ మారుతూ వుంటుంది. సంఘకళా రసజ్ఞత అధోలోకంలోకి పడిపోతూ వున్నప్పుడు ఆ పతనాన్ని ఆపుచేసి నిలబెట్టే బాధ్యత ప్రభుత్వంపైనా, కళాస్రష్టలపైనా, జమీందారుల పైనా, ధనికులపైనా ఉన్నది.

**కామే** : అవునండి. ఈ తోలుబొమ్మల్లోని ఉత్కృష్టత మరిచిపోయి, ఉత్తములు విముఖులవడం చేత పాటక జనులకోసం గంధోళిగాడు, కేతిగాడు, అల్లాటప్పగాడు తెరమీద విజృంభించారు. కానీ జాగ్రత్తగా చూస్తే పెద్ద పెద్ద పాత్రలకు గంభీరమైన అభినయం చిన్న పాత్రలకు వాటికి తగిన నటన మా చిత్రంగా ఉంటుందండి. రామచంద్రుడు చెయ్యి మాత్రం కదుపుతాడు. లక్ష్మణుడు తల కూడా తిప్పుతాడు. ఆంజనేయులు మొదలైన వాళ్ళు దేహమంతా కదుపుతూ అభినయం చేస్తారు. రాక్షసులు గడబిడ దడబిడగా బల్లలు చప్పుడు, బూరల మోతలతో నీడల్లా వచ్చి రూపం పొంది, మళ్ళీ పొగలా అయి మాయమవుతారు. తమరాశీర్వదిస్తే ఉదయశంకరుడు నాట్యకళను పునరుద్ధరించినట్లున్నూ, రవీంద్రుడు నాటక కళకు కొత్త పద్ధతిగ తిరిగి జీవం పోసినట్లున్నూ, ఈ తోలుబొమ్మలాట కూడ మార్చి ఉత్తమ హృదయులు మెచ్చుకొనేటట్లు చేద్దామని వుందండి.

**కజిన్సు** : మీ భావం, ఆశయం చాలా బావున్నాయి. నాకు చేతనయినంత సహాయం చేస్తాను (బొమ్మల రాణి)."

ప్రసిద్ధి చెందిన ఆంధ్ర చిత్రకారున్ని, కామేశ్వరరావు చేరదీస్తాడు. వీరయ్య, విఠలుడితో కామేశ్వర్రావు తోలుబొమ్మలాటలో కొన్ని మార్పులు తీసుకొస్తానని దాంతో ఆదాయం పెరుగుతుందని, అన్నివిధాలా మంచిదని వాళ్ళని ఒప్పిస్తాడు. లోక ఖ్యాతి పొందొచ్చని వాళ్ళను ఒప్పిస్తాడు.

కామేశ్వర్రావు ఐదువందలు అప్పు సమకూర్చుకొని, చెప్పిన విధంగా ఆంధ్ర చిత్రకారుని సలహాతో భారతీయ చిత్రలేఖన సంప్రదాయం ప్రకారంగా రామాయణ భారత కథలకు, భాగవతంలోని శ్రీకృష్ణుని కథకూ, సంధ్యా తాండవం మొదలైన శివగాథలకూ సరిపడే చిత్రాలు వీరయ్య చేత తయారుచేయిస్తాడు. వివిధ వాయిద్యకారుల్ని సమకూరుస్తాడు.

ఆ నూతన సంప్రదాయపు తోలుబొమ్మలాటను అడయారులో డాక్టరు కజిన్సు మొదలగు సహృదయుల ముందు రాత్రి ఎనిమిది గంటలకు ప్రారంభించి 12 గంటల వరకు ప్రదర్శింపచేస్తాడు.

"రంగంలో వుండవలసిన చిత్రాల మీదే వెలుగు పడుతుంది. ఉండనక్కరలేని బొమ్మలు తెరమీద లేవు. అభినయం, నృత్యం, రసము వుట్టిపడుతున్నవి. సంభాషణ తెలుగులో చక్కని నుడికారంతో, తేనెలూరుతున్నది. హంగు చేసే సంగీతం విచిత్రము. ఉత్కృష్ట పాత్రలు కర్ణాటక సంప్రదాయంగానున్నూ, ఇతర పాత్రలు యేలపాటల

పద్ధతిగానున్న పాటలూ, పద్యాలు గానం చేసినారు. మహారాజు వస్తూ వున్నప్పుడు ఒక విధమైన సమ్మేళనగానం మహాఋషి వస్తూ వున్నప్పుడు వినిపించిన సమ్మేళన గానం వేరు. మొదటిది ప్రాపంచికాద్భుతం సూచిస్తున్నది. రెండవది పారలౌకిక భావరసాలు వుట్టిపడజేస్తున్నది (బొమ్మల రాణి).'' ఆ ప్రదర్శనని అంతా స్తబ్దులై చూస్తూంటారు.

ఆమె తెల్లబోయి చూస్తూ అదంతా కళ్ళు పెద్దవి చేసుకొని గమనిస్తుంటుంది. కామేశ్వర్రావు తోలుబొమ్మలాట మళ్ళీ మొదలు పెట్టించాడేమిటీ? ఎంత బాగున్నా ఆ ఆట వద్దు.

ఆమెకు గాడిద లద్దెల వాసనా, ఏళ్ళ తరబడి చెమటలో తడి ఆరిపోయిన, భయంకరమైన ఛండాలపు మురికి గుడ్డల వాసన మళ్ళీ కొట్టినట్లనిపిస్తుంది. ఆమెకు ఒళ్ళు జలదరిస్తుంది. కళ్ళలో నీళ్ళు తిరుగుతై. ఆ నరకంలోంచి రక్షించిన వాళ్ళు సీతారామయ్యగారు, కామేశ్వర్రావు వాళ్ళు మళ్ళీ తిరిగి ఆ నరకంలోకే నెట్టెయ్యరు కదా! అమ్మో!! అనుకుంటుంది.

ప్రదర్శనం పూర్తయిన తరువాత నుండీ కామేశ్వరరావుని చూడడానికి మీనాక్షి సంకోచిస్తూంటుంది. ఇరు కుటుంబాల వాళ్ళకి ఇష్టం లేకపోయినా ఇద్దరూ మద్రాసు నుండీ రహస్యంగా బెంగుళూరు వెళ్ళి అక్కడ పెళ్ళి చేసుకుంటారు. ఆ విషయం తరువాత రోజు వార్తా పత్రికల్లో వస్తుంది. సీతారామయ్య ద్వారా ఆ విషయం వీరయ్యకు తెలుస్తుంది.

ఈ విషయం తెలుసుకొని కామేశ్వరరావు మేనమామ బండ బూతులు తిడుతుంటాడు.

ఒకరోజు అనూహ్యంగా మీనాక్షి ఆమె తాతగారైన వీరయ్య దగ్గరకు వస్తుంది. వీరయ్య ఆమె పట్ల అయిష్టతను కనబరుస్తాడు. చివరకు నీకు పుట్టే కొడుక్కి నా పేరు కూడా పెట్టుకోవద్దంటాడు.

ఓరోజు కామేశ్వరరావు భార్యతో కలిసి భీమవరంలో తన పుట్టింటికి వెళతాడు. తల్లి కొడుకు మీద బెంగతో కుసించుకుపోతుంది. ఆకస్మికంగా మీనాక్షి ఆమె పాదాల దగ్గర నిలబడి ఏడుస్తుంటుంది. కామేశ్వర్రావు తల్లి ఆమెవరో గుర్తు పట్టదు.

''నువ్వెవరు తల్లీ!''

''నువ్వు దేవతాకన్నెవు కాదు గదా'' అంటుంది. అంతలో కామేశ్వర్రావు గుమ్మం దగ్గర నిలబడి ''అమ్మా! మీ ఆజ్ఞ లేకుండా సంచరించిన ఈ అధముణ్ణి క్షమించి మా ఇద్దర్నీ దీవించవూ?'' అని అడుగుతాడు.

అప్పుడు కామేశ్వర్రావు తల్లి ''నాయనా! ఈ దేవకన్నేనా నా కోడలు? బొమ్మలాట

వాళ్ళ పిల్లలంటే యానాదుల అమ్మాయిలా వుంటుందనుకున్నాను. ఈమె శాపం చేత పుట్టిన ఇంద్రుడు కూతురురా!" అంటూ ఇద్దర్నీ దీవిస్తుంది.

**కథా ఉద్దేశ్యం :**

కులం తక్కువదైనా, ఎక్కువదైనా ప్రేమకు కులంతో నిమిత్తం లేదనేది ఉద్దేశ్యం.

**'బొమ్మలరాణీ' కథ పై సంస్కరణోద్యమ ప్రభావం :**

తక్కువ కులస్తులు కావడం వల్ల గతంలో ఎంతోమంది ఎన్నో బహిష్కరణలకు, మరెన్నో ఊచకోతలకు, ఇంకన్నో వెలివేతలకు, అణచివేతలకు గుర్రైనట్లు తెలుసు. అయితే ఆ పరిస్థితి ఆనాడే కాదు ఈనాడు కూడా ప్రత్యక్షంగా కాకపోయినా పరోక్షంగానయినా ఏదోక రూపేనా ఎక్కడోకక్కడ కనబడుతూనే ఉంది. కానీ కథలో చూపించినట్లు తక్కువ కులానికి చెందినవాళ్ళను తీర్చిదిద్ది వారికి చేయూతనందించి తోడుగా నిలిచిన పై కులాల వాళ్ళు చాలా తక్కువమందే ఉంటారని చెప్పాలి. కథలో ఎరికల కులానికి చెంది తోలుబొమ్మలాటే వృత్తిగా చేసుకొన్న వాళ్ళ అమ్మాయి మీనాక్షిని ఆమెకంటే గొప్పకులంలో పుట్టి ఎం.ఏ. చదువుకున్న కామేశ్వరరావు బంధువులను, కన్నవారిని సైతం విడిచిపెట్టి మీనాక్షిని సంస్కరించి వివాహం చేసుకొన్నట్లు రచయిత తెలియజేసి ప్రేమకు అవధులుండవని, కులమతాల తారతమ్యాన్ని ప్రేమ చూడదని నిరూపించాడు. కథలో మీనాక్షిని సంస్కరించినవాడు కామేశ్వరరావు. అటువంటి కామేశ్వరరావులు ప్రస్తుత సమాజానికి ఎంతో అవసరం. ప్రస్తుత కథను బట్టి కులాంతర వివాహం జరిగినట్లుగా గుర్తించాలి. సంస్కరణోద్యమంలో కులనిర్మూలన కూడా ఒక భాగం కాబట్టి 'బొమ్మలరాణీ' కథ కులాంతర వివాహాన్ని ప్రోత్సహించినట్లు తెలుస్తుంది. కనుక 'బొమ్మరాణీ' కథ పై సంస్కరణోద్యమ ప్రభావం శక్తివంతంగానే పనిచేసిందని చెప్పాలి.

## 3. నరసన్న పాపాయి

ఈ కథ హరిజనోద్ధరణకు సంబంధించింది. హరిజనుడు దేవాలయంలోకి అడుగుపెట్టబోతుండే అగ్రకులానికి చెందినవాడు. ఆ హరిజనున్ని హింసించిన వైనాన్ని తెలియజేసే కథే 'నరసన్న పాపాయి'.

**'నరసన్న పాపాయి' కథ సంక్షిప్త పరిచయం :**

"రుద్రేశ్వరం గుడి యెదుట శివరాత్రి ఉత్సవంలో, గుడిలోకి రాబోయాడని మా అన్నయ్య అతన్ని చావగొట్టాడు, మా అన్నయ్య అతన్ని చావగొట్టాడు !! మా అన్నయ్య

అతన్ని చావగొట్టాడు (నరసన్న పాపాయి)!!!'' అంటున్న ఎనిమిదేళ్ళ రమణ మాటలతో కథ ప్రారంభమవుతుంది.

ఇటు రమణా, అటు నరసన్న ఇద్దరూ పెద్దవాళ్ళవుతారు. రమణకి పెళ్ళవుతుంది. నరసన్నకి రత్తాలుతో పెళ్ళవుతుంది. ఆ దెబ్బల సంగతి నరసన్న మరిచిపోయినా, కొట్టిన రమణ అన్న మరిచిపోయిన, రమణ మాత్రం మర్చిపోదు. ఆ సంఘటన రమణకు, నరసన్నకు మధ్య విచిత్రమైన పవిత్ర సంబంధాన్ని ఏర్పరుస్తుంది.

రమణ తన భర్తను ఒప్పించి నరసన్నను పాలేరుగా కుదురుస్తుంది. నరసన్నకు చదువు కూడా చెప్పిస్తుంది. నరసన్న భార్య రత్తాలును రమణ ఎవరూ చూడకుండా తన దగ్గరకు పిలిచేది. తన తల దువ్వమనేది. రత్తాలు మొదట నవ్వుతుంది. తరువాత రమణ బ్రతిమలాడటంవల్లో, కోప్పడడంవల్లో మొత్తానికి ఒప్పుకొని రమణ తల దువ్వుతుంది రత్తాలు. దాంతో నరసన్నకు రుద్రేశ్వర దేవాలయంలోకి ప్రవేశం లభించినట్లవుతుంది రమణకు. రమణ కూడా రత్తాలుకి తల దువ్వుతుంది.

ఒకసారి "నరసన్నను మా అన్నయ్య కొట్టాడండీ!'' అంటుంది రమణ భర్తతో.

"ఎప్పుడు?'' అని ఆదుర్దాతో అడుగుతాడు.

"చిన్నప్పుడండీ! నరసన్న రుద్రేశ్వరస్వామి ఆలయంలోకి రాబోతుంటే. మా అన్న చూసి కొట్టాడు.'' రమణ దయార్ధ హృదయానికతడు చలిస్తాడు. 'నరసన్నకు పాపాయి పుడితే గుళ్ళోకి వెళ్ళనిస్తారా?' అంటుంది రమణ.

రత్తాలుకు రమణ దంపుళ్ళగది పురిటిగది అవుతుంది. కూతురు పుడుతుంది. ఊరంతా రమణ కుటుంబాన్ని వెలివేస్తారు కులాన్ని దిగజారుస్తున్నారని. రమణ నరసన్న పాపాయికి 'భారతాంబ'గా పేరు పెడుతుంది. రమణ కుటుంబాన్ని వెలివేసిన ఊరి జనమంతా "దేవాలయంలోకి నరసన్న వంటి హరిజన బాలకులు వస్తే చావగొట్టే జాతివాళ్ళు!'' అనుకుంటుంది.

అంతలోనే ఎలక్షన్లు వస్తాయి. నరసన్నను నిలబెడతాడు రమణ భర్త. నరసన్న ఆ ఎలక్షన్‌లో అధిక మెజారిటీ సాధిస్తాడు. శాసనసభ్యుడవుతాడు. రమణ కుటుంబాన్ని వెలివేసిన ఊరి జనమంతా వారేర్పాటు చేసిన సహపంక్తి భోజనాలలో పాల్గొంటారు. "హరిజనులందరూ ఇంత తిండీ బట్టా సంపాదించుకోవాలంటే హరినులవ్వాలా?'' అనుకుంటుంది రమణ.

కొన్నాళ్ళకు రమణకు కూడా ఒక ఆడపిల్ల పుడుతుంది. ఆ పాపకు "పూర్ణ స్వరాజ్యలక్ష్మి'' అని పేరు పెడతారు. ఆ కాలంలో సమాజంలో ఉన్న హరిజనుల స్థానమేమిటో

తెలియజేసిన కథ ఇది. "నరసన్నను మా అన్నయ్య చావబాదాడు." అన్న వాక్యాన్ని పదే పదే చెప్తూ అగ్రకులస్తుల క్రూరత్వాన్ని తెలియజేశాడు రచయిత.

**కథా ఉద్దేశ్యం :**

గతంలో హరిజనులనే వారందరికీ ఎక్కడ చూసినా ఆంక్షలే ఎదురవుతుండేవి. చివరకు దేవాలయాలలోకి కూడా ప్రవేశించరాదు అనే ఆజ్ఞలు కూడా ఉన్నాయి. కారణం తక్కువ కులాల వాళ్ళ వల్ల దేవాలయాలు మైలు పడతాయనేది అగ్రకులస్తుల నమ్మకం అసలు కులాలు, మైలు అనేవే ఉండకూడదనేది ఉద్దేశ్యం.

**'నరసన్న పాపాయి' కథ పై సంస్కరణోద్యమ ప్రభావం :**

గతంలో హరిజనులు అగ్రకులస్తుల దురహంకారానికి బలైపోతూ ఉండేవారు. హరిజనులనే వాళ్ళకి ఊరు నుండీ, వాడ నుండీ, దేవాలయాల నుండీ, చివరకు గొంతు తడుపుకోడానికి కావలసిన నీటి చెరువుల దగ్గర కూడా బహిష్కరణలే ఎదురవుతుండేవి. ఇప్పుడు ఆ దుస్థితి లేదని చెప్పడంకంటే ఎంతో కొంత మార్పు వచ్చిందని చెప్పొచ్చు. దానికి కారణం చట్టాలు. కథలో తక్కువ కులానికి చెందిన నరసన్న దేవాలయంలోకి వెళ్ళబోతుంటే అగ్రకులస్తుడు చేత తిరస్కారాన్ని ఎదుర్కొంటాడు. ఇదొక కోణమైతే అగ్రకులానికే చెందిన రమణ నరసన్న స్థితికి చెలించి కారణం తక్కువ కులం అని గ్రహించి తనతోపాటు సమాన హోదా కల్పించేందుకు ప్రయత్నించి సఫలీకృతురాలవుతుంది. తక్కువ కులానికి చెందిన నరసన్నకు, నరసన్న భార్యకు చదువు కూడా చెప్పిస్తుంది. ఆ తోడ్పాడుతో నరసన్న నాయకుడు కూడా అవుతాడు. ఇలా రమణలా చేయగలిగేవారు ఈరోజుల్లో ఉన్నారా అంటే! చాలా తక్కువమందే వుంటారు అని చెప్పాలి. అగ్రకులానికి చెందిన ఓ వ్యక్తి విడగొట్టే సంస్కృతిని పెంచి పోషిస్తే, అదే అగ్రకులానికి చెందిన మరో వ్యక్తి కలుపుకొనే సంస్కృతిని ప్రారంభిస్తుంది. ఇది హర్షించాల్సిన విషయం. ప్రస్తుత కథలో తక్కువ కులస్థుడైన నరసన్నకు సమాన హోదా కల్పించడానికి ప్రయత్నం చేయడమనేది సంస్కరణగా గుర్తించాలి. అలా కథలో ఆ దిశగా ప్రయత్నాలు జరిపినట్లు రమణ పాత్ర ద్వారా తెలుస్తుంది కనుక 'నరసన్న పాపాయి' కథ పై సంస్కరణోద్యమ ప్రభావం బలంగానే పనిచేసిందని చెప్పాలి.

## 4. తిరుపతి కొండ మెట్టు

అవిటివాడైన పున్నెడు తోటి బిచ్చగాళ్ళలో ఏర్పడిన కక్ష వలన, ఈర్ష్య వలన ఎటువంటి ఇక్కట్లు చవి చూడాల్సి వచ్చిందో 'తిరుపతి కొండ మెట్టు' కథలో చూడొచ్చు.

**'తిరుపతి కొండ మెట్టు' కథా సంక్షిప్త పరిచయం :**

మహాపుణ్యక్షేత్రం అయిన తిరుపతిలో గాలి గోపురానికి వెళ్ళే వైపు మెట్ల వరసలో మొదట, బిచ్చగాడైన పున్నెడు నివాసం. అతడు ఏకాకీ. అతడు రెండు కాళ్ళు మొండే అయినా శక్తి సామర్థ్యాలు అపారం. అతడు ప్రదర్శించే దొమ్మర విద్యల సాహసం నైపుణ్యం ఏ "ఇసాకో గ్రాండు రషియను సర్కసు"లో ఉండేవారికి కూడా ఉండదు.

అతడు చేతులతో మెట్లెక్కుతాడు. కోతిలా కొమ్మనుంచి కొమ్మకు ఎగిరి ఛంగున వెళతాడు. వేలాడుతూ చక్రంలా గిరగిర తిరుగుతాడు. దేహమంతా వాలఖ్యమనిలా పైకెత్తి వేళ్ళ మీద తల్లక్రిందులా నిలబడి నడుస్తాడు. అది అలా వుంచుదాం. అతడు అవిటివాడు ఎలా అయ్యాడో తెలుసుకుందాం.

పున్నెడుది అనంతపురం జిల్లా అతడు భూస్వామి. అతడి పూర్తిపేరు పుణ్యంరెడ్డి. అతడి కుటుంబానికీ ఆ జిల్లాలోనే పక్క ఊళ్ళో ఉండే మరో రెడ్డి కుటుంబానికీ మధ్య భూమి సరిహద్దు విషయంలో తగాదా వచ్చి పెద్ద ఘర్షణ జరుగుతుంది. అందులో పున్నెడు తండ్రీ, ముగ్గురు అన్నదమ్ములూ మరణిస్తారు. అవతలివైపు ఓ ఇద్దరూ, ఇవతల పుణ్యంరెడ్డి మాత్రమే మిగుల్తారు. పుణ్యంరెడ్డి రెండు కాళ్లూ ఆ ఘర్షణలో పోతాయి. జిల్లా ఆసుపత్రిలో రెండు కాళ్ళు తీసేస్తారు. కుటుంబమంతా నశించిపోతుంది. వ్యాజ్యాల వలన ఆస్థంతా అంతకు ముందే పోతుంది అలా పుణ్యంరెడ్డి పున్నెడు అవుతాడు.

అవతల రెడ్డి కుటుంబం ఏమవుతుందో! భగవంతుడు లేడా అన్న వేదాంతం వల్ల బ్రతుకుమీద ఆశ చిగురించి తిరుపతి కొండ మెట్ల మీద ప్రత్యక్షమవుతాడు.

తిరుపతి కొండలు ఏడు మైళ్ళు ఎక్కడం, దిగడంతో నాలుగువందల యాభైఆరు మంది బిచ్చగాళ్ళలో పున్నెడు కొచ్చే రాబడి మరి ఎవరికీ రాదు.

అక్కడ "వికలాంగులు ఉన్నారు. ముక్కు నోరు అంతా ఏకరంధ్రమైన వారున్నారు. కుష్టురోగులు, మాంత్రికులు, సన్యాసులు ముళ్ళమీద హంసతూలికా తల్పం మీదలా పండుకొనే యోగీశ్వరులు, గుడ్డివారు, కోకిల కంఠముతో పాడే గాయకులు, ఆడవాళ్ళు, మగవాళ్ళు, బిడ్డలు, భయం గలుగజేసేవి, వట్టి మొద్దుని కళాసౌందర్యం వెల్లి విరిసేవి విగ్రహాలను ముందుంచుకొని పూజారి పనిచేసే భక్తులు - ఎన్ని రకాలున్నారో తిరుమలేశ్వరుని కొలువు చేసే అయ్యంగార్లు, అయ్యరులు, అయ్యలు, రెడ్లు, మొదలియార్లు, సెట్లు, పిళ్ళలతోపాటు, కోతులతోపాటు ఈ బిచ్చకుల బృందాలు (తిరుపతి కొండ మెట్టు)!"

ఆ విచిత్ర ప్రపంచంలో ఉన్న బిచ్చగాళ్ళంతా పున్నెడుపై అసహ్యాన్ని పెంచుకుంటారు. పున్నెడు వారందరికీ విరోధిగా మారతాడు. అతడి సంపాదన వారందరికీ కడుపుమంట పుట్టిస్తుంది. దాంతో బిచ్చగాళ్ళ సంఘంలో పున్నెణ్ని అక్కడినుంచీ తొలగించాలనే ఉద్యమం మొదలవుతుంది.

బిచ్చగాళ్ళలో ఏ వార్తయినా నిమిషంలో దావానంలా వ్యాపిస్తుంది. "పున్నెణ్ణీ శ్రీ వెంకటేశ్వర సర్వహిత భక్త బృందంలోంచి రెండువేల మైళ్ళన్నా విసిరి వేసేందుకు ఒక మాఘశుద్ధ ఏకాదశినాడు బిచ్చకుల ఆశ్రమాలన్నీ" నిర్ణయించుకుంటాయి. దానికి కారణం ఆ ఏకాదశి ఉదయం నుండీ మధ్యాహ్నానికే 25 రూపాయలు వస్తాయి, ఇంకా వస్తుంటాయి కూడా పున్నెడుకి. అదే వారికి కోపాన్ని రగిల్చింది.

ఆరోజు సాయంత్రానికే ఆ తీర్మానం అమలు జరిగేది. తీర్మానం ప్రకారం బిచ్చగాళ్ళకు అన్నము సాంబారు అమ్మేవాళ్ళు పున్నెడికి అమ్మడం మానేస్తారు. సరుకులు ఏడుమైళ్ళ పొడుగునా విక్రయించేవాళ్ళు విక్రయించడం ఆపేస్తారు.

పున్నెడు మొదట తమాషాకనుకుంటాడు. క్రింద దిగుడు బావి నుంచీ పైన విడిబిచ్చగాళ్ళకు, ఆశ్రమాల వారికీ నీళ్లు అమ్మే అలివేలు సైతం పున్నెణ్ణి వెక్కిరిస్తుంది.

పున్నెడు కిందకెళ్ళి నీళ్ళు తాగిరావచ్చు. కానీ అత్యంత లాభానిచ్చే స్థలమవడంతో దాన్ని విడిచి వెళ్ళడానికి ఇష్టపడడు. దాన్ని సంపాదించడానికి నెలకు పది రూపాయల చొప్పున అద్దెకట్టి, అమ్మకాలకు సైతం నెలకు పదిరూపాయల చొప్పున సంవత్సరానికి చెల్లించి వెంకటేశ పెరుమాళ్ళ పున్నెమా అని సమకూర్చుకుంటాడు.

ఒక్కసారిగా పున్నెడికి గతం గుర్తొచ్చి కళ్ళు చమరుస్తాయి. అతడి గొంతుక ఎండుతుంది. ఆకలి కొండచిలువలా చుట్టుకుంటుంది.

కొండమీద వర్తకులకు సరుకు అమ్మేవారు వచ్చినపుడు పున్నెడు వారికి కొంత డబ్బు ఇచ్చి సాయంకాలానికి వంట సామాగ్రి తెప్పించుకుంటాడు. డోలీలవాళ్ళకు రెండణాలు చేతిలో పెట్టి కుండెడు నీళ్ళు తెప్పించుకుంటాడు. వాటితో మూడు రోజులు గడుపుతాడు.

నాలుగురోజులు పాటు తెల్లవారుజామున మూడు గంటలకు లేచి ముష్ఠికి బయలుదేరతాడు. అంతలో కొండపైన దుకాణాలకు వంటసామాగ్రి సరఫరా చేసే కందసామి వంటసామాగ్రి ఇచ్చే సమయమైందని పైకీ, కిందకీ చూసి ఆ దగ్గరలో నాలుగు బారల దూరంలో ఉన్న పొద దగ్గరకు వెళ్ళి, ఒక పెద్దరాయి తీసి చూస్తాడు. ఆ పొద పున్నెడు నిద్రించే స్థలం.

పున్నెడు యధావిధిగా దాచుకున్న సొమ్ము చూసుకునేందుకు రాతిని తెరిచి చూడగా అందులో ఉండవలసిన అయిదువందల డెభ్భైఐదు రూపాయలు లేకపోవడంతో "అమ్మయ్యో" అంటూ వెనక్కి కూలబడిపోతాడు. పున్నెడు పై ప్రాణాలు పైకే పోతాయి.

కొంతసేపటికతడికి స్పృహ వస్తుంది. ఆ పనిచేసింది కుప్పుస్వామిగాడేమోనని అనుమానపడతాడు. ఆ కుప్పుస్వామి రాక్షసుడు. అతడు వాళ్ళ జట్టు కాదు కాబట్టే పున్నెడుకి సరుకులిస్తాడు. కుప్పుస్వామి వెంకటేశ్వరుడి ఆస్తే దొంగతనం చేయగల పిశాచి!

అతడి డబ్బుతోపాటు ఉత్సాహం కూడా మాయమవడానికి కారణం అలివేలే. అలివేలు శేషాచలపతి కొండకూ, అతడికి కూడా ప్రియమైనదే. ఆమె నవ్వు అతడికోసం, ఆమె వయ్యారం కూడా అతడి కోసమే. ఆ అలివేలు కూడా అతడి మీద పగ పెంచుకుంటుంది.

ఆమె అతడివైపు చూడదు, వెళ్ళిపోయింది. అతడు భోజనం చేస్తుంటే కబుర్లు చెప్పడానికి రాదు. అతడికి జీవితం మీద కోరిక పోతుంది. యాత్రికులు పలకరించినా పున్నెడు పలకడు. ఏదైనా జబ్బా అన్నా పున్నెడు మాట్లాడకుండా పడుకొంటాడు.

అయిదురోజులు గడిచేసరికి పున్నెడు అస్తిపంజరంలా తయారవుతాడు. ఆ సంఘటన వర్తకులందరికీ తెలుస్తుంది. అక్కడున్న బిచ్చగాళ్ళంతా పండగ చేసుకుంటారు.

నీరసించిపోయిన పున్నెడికి ఆరవరోజు రాత్రి స్పృహ వస్తుంది. కొండమీద నుండీ పక్కనున్న లోయలోకి దూకి ఆత్మహత్య చేసుకుందామనుకుంటాడు. ఇంతలో వెనుకనుండీ చల్లని చేతులు అతని నడుంపట్టుకొని వెనక్కు లాగేస్తాయి!

కళ్ళు మూసుకొనే పున్నెడు వెంకటేశ్వరుడు ప్రత్యక్షమైయాడా అనుకుంటాడు. అతడు కళ్ళు తెరిచేసరికి ఎదురుగా అలివేలు కనబడుతుంది. ఆమె అందమైన ముఖం కన్నీరుతో కనబడుతుంది.

ఆమె వెక్కి వెక్కి ఏడుస్తూ, "పున్నెడు! నాను బహు పాపిని. నిండా ద్రోగం చేసిన ఆరుమాసాల క్రితం రోగం వచ్చి దుడ్డు లేక సబ్బరపడినప్పుడు నాకు పత్తురూపాయలంపిన నీ సల్లని గుండెకు నాను ద్రోగం సేశినా! సుక్కల పర్వతం ముసలిదానికి నువ్వు చేసిన సాకిరి దేముడే సేయగల్గు! నీ బతుకునిండా దేముడే వున్నాడు. వీళ్ళు పిశాసులు. నాను రక్షసి. వాళ్ళ మాటలకు లోబడి, ఈలా పాపి అయిపోతినిదా! ఓయ్! ఓయ్ నాకు నరకందా రాసినాడే (తిరుపతి కొండ మెట్టు)!" అంటూ దుఃఖాన్ని దిగమింగుకోలేక పొర్లి పొర్లి ఏడుస్తుంది.

పున్నెడు నిర్ఘాంతపోతాడు. అసత్తువలో కూడా ఆమెను దగ్గరకు లాక్కుంటాడు.

"పిల్లా, నాకు కలిగిన ఈ సెబ్బరకు నేను దుఃఖం పొందనేలేదు. ఇంతకు మించి కష్టాలు తీరినవి ఈ ప్రాణికి! కాని అతి మెత్తని నీ మనస్సుకు ఎంత బాయితనం వచ్చిందని విచారం పొందినాను. ఎప్పుడూ ఎన్నెలుకురిసే నీ చూపుల్లో కారు మబ్బులు కనబడినాయి కదా! ఇక ప్రపంచకంలో మంచి పున్నెం లేదనే తోచినదే! ఏల ఈ ప్రాణి బ్రతికేది?"

"సామీ! చెమించు, నాను శాకినిదా! నీ సొమ్ము ఏడ నీవు దాచేది నాకుడా తెలుసునే. అది కుప్పుసామికిదా నాకు సెప్పితేనే. అది వాడుదా తీసుండు!"

పున్నెడు పక్కున నవ్వాడు. అతని హృదయంలోనూ వెన్నెల కాసింది.

"పోయెలే! ఈ ప్రాణికి చేతులిచ్చిన యెంకన్న పున్నెమా! పది అయిదు నూర్లు సంపాదించినా? నువ్వు నా దగ్గిరే ఉండు! అంతే, నా సంసారం నువ్వు!"

పున్నెడు ఆమెను తన చేతుల్లోకి తీసుకుంటాడు. అలివేలు తాను తెచ్చిన కూడు తినిపిస్తుంది.

"చుక్కలు నవ్వినవి! వెన్నెలలపతి మరీ చల్లని గాఢమయిన అడవి పూవుల పరిమళాలైన కాంతులు వాళ్ళపై అక్షతలుగా చల్లాడు.

శ్రీవేంకటేశపతి తన ఎదుట జరిగిన వివాహాలకన్న తానే స్వయంగా జరిపిన యీ పెళ్ళి ఉత్తమమైనదనుకున్నాడా!"

**కథా ఉద్దేశ్యం :**

పగ, ద్వేషాలతో సాధించగలిగేది ఏదీలేదని, ప్రేమతో మాత్రమే ఏదైనా సాధించవచ్చు అనేది కథా ఉద్దేశం.

**'తిరుపతి కొండ మెట్టు' కథ పై సంస్కరణోద్యమ ప్రభావం :**

ఈ కథలో కనిపిస్తున్న పున్నెడు వంటివారు చాలా అరుదుగా ఉంటారు. నేడు ప్రపంచంలో నానాటికీ కరువవుతున్నది కలుషితమవుతుంది ప్రేమ. ఎటువంటి అవంతరాలనయినా ప్రేమతో జయించవచ్చని పున్నెడు పాత్రను బట్టి అర్థమవుతుంది. చెప్పుడు మాటలు విని తనపై కత్తి కట్టిన అలివేలు వంటివారు ఆరోజుల్లోనే కాదు ఈరోజుల్లోనూ ఉన్నారు. కథలో పున్నెడు ప్రేమ అలివేలులో మార్పు తీసుకురాగలిగింది. అంతేగాక రచయిత బిచ్చగాడు, అవిటివాడైన పున్నెడుకి అలివేలుని జీవిత భాగస్వామి అయినట్లు చిత్రించి తన ప్రతిభను కనబరచాడు. ఓ పక్క అవిటితనం దేనికీ ఆటంకం

కాదని తెలుపుతూనే మరోపక్క ప్రేమ దేనినైనా జయిస్తుందంటూ దానికి ఉదాహరణగా పున్నేడునీ, అలివేలును చూపించాడు. అలివేలులో మార్పుకు పున్నెడు ప్రేమ కారణమైంది కనుక మార్పుంటే సంస్కరించబడటంగా గుర్తించాలి. ఈ సందర్భాన్ని బట్టి ఆ సంస్కరణకు 'తిరుపతి కొండ మెట్టు' కథ తోడ్పడింది కనుక 'తిరుపతి కొండ మెట్టు' కథ పై సంస్కరణోద్యమ ప్రభావం బలంగా పనిచేసిందని చెప్పాలి.

## 5. దీపావళి

అగ్రకులస్తుల చేతిలో వుప్పరకులానికి చెందిన పిల్లవాడు ఎటువంటి నరకాన్ని చవిచూడవలసి వచ్చిందో చూపించే కథే దీపావళి.

**'దీపావళి' కథ సంక్షిప్త పరిచయం :**

అది దీపావళి పండుగ. ఊరంతా దీపాల వెలుగులతో నిండిపోయి ఉంటుంది. కానీ ఆ వెలుగుల్లో ఉన్న ఓ పిల్లవాడికి మాత్రం దీపావళి ఉండదు.

ఆ పిల్లాడి ఒళ్ళు ఉక్కుకడ్డీలా వుంటుంది. మెరుగుపెట్టిన ఎర్రవాయిలా నున్నగా తళతళలాడుతూ ఉంటుంది. కనుముక్కు తీరు కలిగివున్న మొఖం మీద కాంతులు నృత్యం చేస్తుంటాయి.

ఆ పిల్లాడు "పొద్దుణ్ణుంచీ బాణా సంచాల కొట్ల దగ్గర చింపిరి జుట్టుతో అల్యూమినియం మురుగులతో, నీలి జేగూరు కలిపిన వంటిరంగు వెలుగుతో ఆ వుప్పరి అబ్బాయి నిలిచి విస్తుబోతూ  చూస్తూనే ఉన్నాడు. అందరికి బాణాసంచాలు అతనికి మాత్రం లేవు (దీపావళి)."

సాయంకాలం దాకా అలా నిలబడ్డా కానీ ఒక తాటాకు టపాకాయగాని, ఒక సిసింద్రీ గాని, ఒక మతాబు, అగ్గిపుల్లగాని వాడికి ఇచ్చిన వారే లేరు. పొద్దున్నించీ లక్షలకొద్దీ టపాకాయలమ్మిన సాహెబు "సాలా బాగా పేలుతాయండీ! జర్మనీ వాడి ఫిరంగిలా వుండాలీ. మీకి అయిదు వందల్ ఏసుకోండి" అని విచిత్రంగా అమ్మగలుగుతుంటాడు కానీ, శాంపిల్ కోసం కాల్చినపుడు పేలని వాటినైనా ఆ పిల్లవాడ్ని ఏరుకోనివ్వడు.

పొద్దున్నుంచీ తిండే ఉండదు ఆ పిల్లాడికి. వాళ్ళమ్మా నాన్న "ఎర్రోడు ఎక్కడికి పోయాడో గంజి నీళ్ళకయినా వచ్చాడు కాదు" అని అనుకొంటూ అతడికోసం రాలేదు.

ఆ పిల్లాడు అలా వీధులన్నీ తిరుగుతూ సాయంత్రానికి బందరు బచ్చుపేటలో టపాసులు బాగా కాల్చే ఇంటి ముందు చేరతాడు. ఆ ఇంటిలో పిల్లలచేత పెద్దవాళ్ళు బాణాసంచా కాల్పిస్తూ ఉంటారు.

వాడు ఆ ఇంటి ముందుకు వచ్చినప్పటి నుండీ ఆ ఇంటిలో ఉన్న విధవాడపడుచు ఆ పిల్లాడ్ని చూస్తూనే ఉంటుంది. ఆమె పేరు పురుషోత్తమ్మ. ఆమెకు పిల్లలంటే ఆప్యాయత ఎక్కువ. ఆమెకు తెలిసి ఏ పిల్లాడికి, ఏ పిల్లకయినా అనారోగ్యం వస్తే తట్టుకోలేకపోతుంది. ఇంటి ఎదురుగా నిలబడి వున్న ఆ వుప్పరి పిల్లవాడు ఈ కాలిమీద కాసేపు, ఆ కాలిమీద కాసేపు నిలబడి టపాసుల కోసం చేస్తున్న తపస్సును ఆమె చూస్తుంటుంది.

తపస్సు చేసి, చేసి ఆ పిల్లవాడు ఆశలు భగ్నమైనట్లు కూలబడతాడు. ఆ వేడుకలో అరుగుమీద ఉన్నవారెవరికీ పిల్లవాడి గురించి పట్టించుకొనే అవసరవే లేకపోయినట్టుంటుంది. పురుషోత్తమ్మ మాత్రమే చూసి ఒక్క పరుగుతో మెట్లు దిగి ఆ పిల్లాడ్ని ఎత్తుకుంటుంది. బల్లపై పడుకోబెట్టి మజ్జిగరసం తీసుకొచ్చి తాగిస్తుంటుంది. ఇదంతా చూస్తున్న ఆమె వాళ్ళేమి మాట్లాడలేకపోతుంటారు. క్రమేపీ ఆ పిల్లవాడికి మెలుకువ వస్తుంటుంది.

"**ఒక ముసలాయన** : ఈ వెధవను తీసుకువచ్చి బల్లమీద పడుకో బెట్టిందేమిటి? పాడుపని!

**ఒకావిడ** : వీడెల్లా వచ్చాడిక్కడికి?

**ఒక చిన్న పిల్ల** : మన ఇంటి ముందర పడిపోతే అత్తయ్య తీసుకొచ్చింది.

**ఆవిడ** : మడిగట్టుకొని ప్రతి వెధవనీ ముట్టుకోవడమేనా? మన పనివాళ్ళచేతికి ఇస్తే నోట్లో పొయ్యరూ?

**ఆయన** : ఈవిడగారికి ఈ పెత్తనమేమిటి (దీపావళి)?"

పురుషోత్తమ్మ ఆ మాటలన్నీ వింటంలేదు. ఇంతలో భోంచేసి చెయ్యి కడుక్కొని వచ్చిన ఆ ఇంటి యజమాని, "ఇంక వీణ్ని పంపించు. చేసింది చాలు."

"నీ పేరేమిట్రా వెధవా, ఎవరబ్బాయివి?"

"మేం ముప్పరాళ్ళమండీ, నా పేరు చిట్టిగాడు"

"వాడి చేతులో రెండు కాసులు పెట్టి పంపించి వేయండి. ఎవరైనా ఇల్లాంటివి చూస్తే మనకు అపఖ్యాతి కూడాను (దీపావళి)." అంటాడు.

అదంతా జరిగి సంవత్సరం అయిపోతుంది. మళ్ళీ దీపావళి రానే వస్తుంది. ఆ వుప్పరి పిల్లాడు దీపావళి పొట్లాలతో అదే ఇంటి ముందు మళ్ళీ చేరతాడు. బీదవాళ్ళకు ఆ పొట్లాలే మతాబాలు, కాకర పువ్వొత్తులు, టపాకాయలు, తూటాలు కూడా.

పురుషోత్తమ్మ ఇంట్లో ఎవరికీ కనిపించకుండా మంచం కింద దాచి ఉంచిన బాణాసంచా బుట్టను అతి రహస్యంగా తీసుకొచ్చి చిట్టిగాడి చేతిలో పెట్టి "ఇది పుచ్చుకొని

ఇంటికి వెళ్ళి కాల్చుకో! పో!'' అంటుంది. అంతలో ఎక్కడనుంచీ వచ్చాడో ఆ ఇంటి యజమాని చిట్టిగాడి దగ్గరకి వాడి చేతిలో బుట్ట ఒక్క లాగు లాక్కొని వాడి చెంప పగులకొడతాడు.

అదే ఆక్రోశంతో ''వెధవ ముండకి పెత్తనాలు ఎవరిమ్మన్నారు? ఈ బాణా సంచా ఏమిటి? ఊళ్ళో వాళ్ళందరికీ బాణసంచాలు పంచి పెట్టేటట్టయితే ఇల్లూ వాకిళ్ళూ ఆస్తులూ ఆగుతాయా?'' అంటూ ''పోరా వెధవా నిరుడొచ్చావు చాలదూ? మళ్ళీ శనిలా దాపరించావా'' అంటూ ఆ ఇంటి యజమాని చిట్టిగాణ్ణి ఒక్క తన్ను తంతాడు. అది చూస్తూన్న పురుషోత్తమ్మ ''అమ్మయ్యో! చంపేశా''డంటూ మడి అని కూడా చూడకుండా, ఒక్క ఉదుటున వెళ్ళి వాణ్ణి ఎత్తుకుంటుంది. దాంతో ఆ ఇంటి యజమాని ''ఛీ! పాడు ముండా!'' అంటూ చేతిలో బుట్ట అరుగుమీద పెట్టి చిట్టిగాడ్ని పురుషోత్తమ్మ దగ్గరనుండీ లాక్కొని వీధి మధ్యలోకి విసిరివేస్తాడు. ఇదంత క్షణంలో జరిగిపోతుంది. దాంతో చిట్టిగాడికి లోకం తల్లకిందులైనట్లు అనిపిస్తుంది. తలకు రాయి తగిలి గాయమై రక్తం కారుతుంటుంది.

జరుగుతున్న గొడవ విని ఆ ఇంటి పిల్లా, పెద్దా అంతా అక్కడికి చేరతారు. ''పొట్లాలివ్వడం తప్పో, బుట్ట తీసుకోవడం తప్పో, ఉప్పరవాడై పుట్టడం తప్పో చిట్టిగాడికి అర్థం కాదు.'' ఆగ్రహం తగ్గని ఇంటి యజమాని మరిన్ని తన్నులు తన్నడానికి కోరను కనబరుస్తూ కాట్లకుక్కలా వాడి దగ్గరికి వెళతాడు. తగిలిన దెబ్బ బారంతో అతగాడు ఇంకెక్కడ కొడతాడోనని భయపడి కెవ్వుకెవ్వున అరుస్తూ పరిగెడతాడు.

పురుషోత్తమ్మ తేరుకుంటుంది. ''ఈ రాక్షసుడు వుండే కొంపలో నేనసలే వుండ''నంటూ పొలికేక పెడుతూ ''చిట్టిగా! చిట్టిగా!'' అంటూ వాడు వెళ్ళిన దారిలోనే వెళుతుంది.

**కథా ఉద్దేశ్యం :**

పిల్లలు భావిభారత పౌరులు అన్నమాట మనందరికీ తెలుసు. అదే పిల్లలు దైవాంశ సంభూతులు అన్న విషయం కూడా తెలుసు. అటువంటి పిల్లల్లో కులవివక్ష అనే విషాన్ని నూరిపోయకూడదనేది ఉద్దేశ్యం.

**'దీపావళి' కథ పై సంస్కరణోద్యమ ప్రభావం :**

ఈ కథలో కనబడ్డ చిట్టిగాడి వంటివారు ఆ రోజుల్లోనే కాదు ఈరోజుల్లో కూడా అప్పుడప్పుడు అక్కడక్కడా తారసపడుతూనే ఉంటారు. వారటువంటి దయనీయ పరిస్థితిని అనుభవించడానికి కారణం తక్కువ కులస్తులు కావటం. కథలో కనబడ్డ చిట్టిగాడి వంటి

పిల్లలు రంగడో, పుల్లడో ఎంతోమంది అగ్రకులస్తులకు వెట్టిచాకిరీ చేస్తూనో, బాలకార్మికులుగా బాధననుభవిస్తూనో జీవితాలను ఈడుస్తున్నారు. మనదేశంలో ఎన్ని చట్టాలు పుట్టుకొచ్చినా మనుషుల ఆలోచనల్లో మార్పురానంత కాలం వ్యవస్థ అలాగే ఉంటుంది. కథలో చిట్టిగాడు వుప్పరి కులస్తుడవడం వల్ల, పేదవాడు కావడం వల్ల అగ్రకులానికి చెందిన ఇంటి యజమాని చేతిలో బలి అవ్వాల్సి వచ్చింది. కానీ ఆ అగ్రకులానికే చెందిన విధవాడపడుచు కులాన్ని పక్కనబెట్టి ఆ పిల్లవాడ్ని అనుసరించినట్లు రచయిత చూపించి కులాల సంకెళ్ళు తెంచాడు. కులాల సంకెళ్ళు తెంచడమంటే కులనిర్మూలనగానే భావించాలి. కథలో కుల నిర్మూలనకు తోడ్పడిన పాత్రగా పురుషోత్తమ్మ పాత్రను చెప్పుకోవాలి. కులనిర్మూలన సంస్కరణోద్యమంలో ఒక భాగం కనుక 'దీపావళి' కథ ద్వారా రచయిత కులనిర్మూలనకు పాడుపడినట్లు భావించాలి. కాబట్టి 'దీపావళి' కథ పై సంస్కరణోద్యమ ప్రభావం ఉందని చెప్పొచ్చు.

## 6. గుడ్డిపిల్ల

అంధత్వంతో బిక్షాటన చేస్తున్న అమ్మాయికీ ఎటువంటి అవాంతరాలు ఎదురయ్యాయో చివరకు ఆమె జీవితం ఎలా సఫలీకృతం అయ్యిందో తెలియజేసే కథే గుడ్డిపిల్ల.

**'గుడ్డిపిల్ల' కథ సంక్షిప్త పరిచయం :**

బెజవాడ బండిని తాడేపల్లి గూడెం స్టేషనులో ఎక్కుతుందో బాలిక. ఆమెకు దారి చూపెందుకు ఒక పిల్లాడు కూడా ఉంటాడు. ఆమె చూడటానికి కంగారుగా విడిపోయిన తలముడితో ఉంటుంది. కళ్ళు చూస్తున్నట్లే ఉంటాయి గానీ సంజ్ఞా జ్ఞానరహితమై ఎండిపోయిన చెరువుల్లా మెరుస్తూ కనబడుతుంటాయి. తీర్చిదిద్దిన కనుబొమ్మలతో, సమానమైన ముక్కు, చిన్ననోరు, వణికే పెదాలతో ఎంతో అందంగా ఉంటుంది. ఆమె అందం ఆమెకు తప్ప మిగతావారందరికీ తెలుసు.

రైలు ఎక్కగానే "వినవే పల్లవా మృదూ చరణా కరుణా వితరాణా గుణా భరణా" అంటూ పాటందుకుంటుంది. దానితో రైలు పెట్టెలో నిశబ్దం ఆవరిస్తుంది. ఆమె గానం వింటున్న వాళ్ళకు వీనుల విందుగా ఉంటుంది.

సరిగ్గా ఆ సమయంలోనే ఆ రైలెక్కుతాడు మరో బ్రాహ్మణ బిచ్చగాడు. ఎక్కీ ఎక్కగానే ఆ పాటకు అడ్డు వస్తు ఒక హాస్యవచనం అంటాడు. ఆ హాస్యవచనం ఆ పెట్టెలో ఉన్న వాళ్ళందరినీ ఒక్కసారిగా ఆవరిస్తుంది. తేరుకునేటట్లు చేస్తుంది. పాడుతున్న ఆ అమ్మాయి పాడటం ఆపేస్తుంది.

ఎక్కిన ఆ బ్రాహ్మణ బిచ్చగాడు జబ్బు హాస్యంతో ప్రారంభిస్తాడు. అతడికి రాగోడని జబ్బంటాడు. అది తిండి జబ్బట. "భోజనానికి వెడితే మొగపెళ్ళివారికి చేసిన శాకపాకాలన్నీ తన విస్తట్లోనే మాయమౌతో వుండేవిట. వైద్యుడిది మహారోగం అన్నాట్ట. దానికి ఉదయాన్నే మినపసున్ని తాటికాయలంత మాత్రలు చేసి ఒక శేరు తేనె పాకం అనుపానంగా, ఒక డజను సేవించమన్నాట్ట. ఇత్యాది హాస్యంతో, కోమటి హాస్యం, భావ హాస్యం, గొల్లహాస్యం, బుడబుక్కలహాస్యం, కుక్కకూతలు, నక్కకూతలతో (గుడ్డిపిల్ల)" హోరెత్తించేస్తుంటాడు. రైలు పెట్టెలో వారంతా విరగబడి నవ్వుతుంటారు. ఒకళ్ళమీద ఒకళ్ళు పడుతుంటారు. అతగాడి హాస్యానికి ఆడవాళ్ళు సైతం నవ్వు పొంగుల్లో ఊగిపోతుంటారు. ఇక అప్పటినుంచీ వసూళు ళ్ళ మొదలెడతాడు. కాన్లు, అణాకాసులు, అర్ధణాలు, రెండణాల కాసులు గలగల అతని హస్తంలోకి ప్రవహిస్తూ అక్కడే మాయమవుతుంటాయి. అతగాడికి మాయా ఇంద్రజాలం కూడా తెలుసనుకుంట. ఒక పన్నెండణాల దాకా పోగయినట్టుంది. ఆ చిల్లరంతా ఆశ్చర్యంతో చూస్తున్న ఓ కుర్రవాడి లాగూలోంచి రాలుస్తాడు. "అమ్మదొంగ" అంటాడు. అక్కడున్న వాళ్ళంతా ఘొల్లుమంటారు.

"మీరు చల్లగా వుండాలి. నేను పచ్చగా వుండాలి. మీ ధాన్యాలు నాగాది నిండాలి. మీ నవ్వులోంచి ధనవర్షం కురియాలి. జయా! విజయీ భవ!! దిగ్విజయీభవ!!! మీరెప్పుడూ రైలు ప్రయాణం చేస్తూవుండాలి. బాబూ! సెలవండి" అంటూ దిగిపోతాడు.

అంతసేపు ఆ గుడ్డిపిల్ల నిర్ఘాంతపోయి ఉంటుంది. వేళాకోళపు మాటలు వినబడినప్పుడల్లా చిరునవ్వు నవ్వుతుంటుంది. ఆమెతో పాటున్న పిల్లాడు హాస్యం జరుగుతున్నంతసేపు పక్కున నవ్వుతూనే ఉంటాడు. ఆమె మళ్ళీ గొంతు సవరించుకొని,

"ఎంతనీ వేడినా, ఎక్కడ వుందువో కంతు జనకరామా!!" అనే కృతి ఆలపిస్తుంది.

దిగిపోయిన బ్రాహ్మణ హాస్యగాడి హాస్యాన్నే కమ్మాయన పక్కాయనకు మళ్ళీ, మళ్ళీ గుర్తు చేస్తూ ఆమె పాట అందుకోగానే "వుస్ పిల్లా! వుండు" అంటాడు. ఆ బాలిక అలాగే నిలబడుతుంది. ఆమెతో ఉన్న పిల్లాడు జనాల్ని డబ్బులడగడం మొదలుపెట్టగా "ఛీ, పో, ముట్టుకుంటావు : చిల్లర అయిపోయిందిరా" అంటుంటారు అందరు.

ఆ బాలిక చలనం లేకుండా అలాగే నిలుచుంటుంది. రైలు వేగంగా వెలుతూనే ఉంటుంది.

ఆరుకాన్లు వసూలవుతాయి. ఆమెతో పాటున్న ఆ పిల్లాడు ఆ అణాన్నర ఆ బాలిక చేతిలో పెడతాడు. వారిద్దరికీ ఒకరి గురించి ఒకరికి బాగానే తెలుసు. బాలిక పాట

ప్రారంభించక ముందే మరో బిచ్చగాడు రైలెక్కుతాడు. అతడూ రైలు బిచ్చగాడే. అతడికి చెయ్యి వుండదు. ముప్పైయేళ్ళుంటాయి. చిరిగిపోయిన చొక్కాతో ఎడమచేత్తో పిల్లంగ్రోవి పట్టుకొని వుంటాడు.

అతడు రైల్వేపోర్టరుగా పనిచేస్తూ రైలు కిందపడి చేయి పోగొట్టుకుంటాడు. అతగాడికి తన అనే వారెవరూ ఉండరు జీతంలో వచ్చిన సొమ్ము ఓ పక్కన వేసుకుంటూ, గూడ్సు స్టేషనులో దొంగతనాలు చేసి సంపాదించిన డబ్బు, రైలు దిగిన ప్రయాణీకుల సామాన్లు మోయగా వచ్చిన డబ్బు, టికెట్టు లేనివారిని ఆ గండం నుంచీ తప్పించినందుకు వచ్చిన లంచం అంతా కలిపి ఒక వందరూపాయల దాకా నిలవ చేసుకుంటాడు. దానంతా కలిపి ఇంటి దగ్గర దాస్తాడు. చెయ్యి నిమిత్తం రాజమండ్రి హాస్పటల్‌లో మూడు నెలలు ఉంటాడు. ఆ సమయంలోనే ఇంటి దగ్గర దాచుకున్న ఆ డబ్బును ఎవరో మాయం చేస్తారు. ఉద్యోగం కూడా పోతుంది. పెళ్ళి కూడా అవలేదు. డబ్బు పోవడంతో అతగాడికి మతిపోయినంత పని అవుతుంది. బిచ్చగాళ్ళకి కూడా కొందరు గురువులుంటారు. అతగాడు ఓ గురువు దగ్గర అందంగా పిల్లనగ్రోవి ఊదుతూ భక్తిపాటలు, వేదాంతపు పాటలు శ్రావ్యంగా ధ్వనింపజేయడం అలవరచుకుంటాడు. రైలు భిక్షాటన సాగిస్తూంటాడు.

రైలేగా ద్రోహం చేసింది! వచ్చే డబ్బుతో కాఫీ హోటల్లో తిని, కల్లుపాక దగ్గిర గౌళ్ళపుల్లమ్మ కూతురు పోసే కల్లు తాగి అనంత లోకాల్లో విహరిస్తూన్నంత హాయిగా నిద్రపోతుంటాడు.

అటువంటి వాడు ఆ గుడ్డిపిల్ల పాట వింటాడు. మనుష్యుల్లో కఠినత్వమూ, చంచలత్వము చూస్తే అతగాడికి చిరాకు పుడుతుంది. అతడు సంపాయించిన ఆరణాలను ఆ గుడ్డిపిల్ల చేతిలో వేసి రైలాగగానే దిగి వెళ్ళిపోతాడు. ఆ అమ్మాయికి అవి ఎవరిచ్చారో తెలీదు.

ఆమెకు ఊహ తెలిసిన దగ్గరనుండీ ముష్టి ఎత్తుకుంటూ రైలు పక్క గ్రామంలో డబ్బున్న రైతు కుటుంబం ఉండే మేడలో ఒక ప్రక్కన నివశిస్తూ వుండేది. ఆ ఊళ్ళో ఓ పెద్ద సంసారి తన పిల్లలకు సంగీతం నేర్పిస్తూ ఉంటే గుడ్డిపిల్ల వాకిట్లో కూర్చొని ఆ సంగీతాన్ని చెవులారా వింటుండేది. అలా అలవరచుకుంటుంది గాన విద్యను. ఆమెకు ముష్టి బాగానే వస్తుంది. సంపాదించిన సొమ్మును రైతు భార్య దగ్గర దాచుకునేది.

ఆమె ఎదుగుతున్న కొద్దీ తెలియని భయము, ఊహించని సిగ్గు కలుగుతుండేవి. ముష్టికి వెళ్ళకుండా అంతకుముందు సంపాదించిన డబ్బునే వాడుకుంటూ జీవితాన్ని సాగిస్తుంటుంది.

ఒకసారి చేబ్రోలు ముష్టికి వెళ్ళి కాలువ ఒడ్డున వంట చేసుకొంటుండగా ఓ పిల్లాడు అక్కడికి వస్తాడు. ఆమెతోనే ఉండిపోతాడు. అతడు దారి చూపుతుంటాడు. ఆమె పాట పాడుతుంటుంది. అలా నాలుగేళ్ళు పూర్తవుతాయి.

ఓరోజు సాయంత్రం కాల్వగట్టున వంట చేసుకుంటుంటే ఆ పిల్లాడు చితుకులు ఏరి ఇస్తూంటాడు. అంతలో ఓ పురుషుడు ఆ చెట్టు కిందికి వస్తాడు. అతని మొహంలో చిరునవ్వులు కనబడుతుంటాయి. కళ్ళులేని ఆమె అతగాడి రాకను అట్టే కనిపెట్టి,

"ఒరే ఎవర్రా ఆ వచ్చింది?" అనగానే పిల్లాడతడి దగ్గరకు పరిగెడతాడు. కుంటి చెయ్యి చూస్తాడు. పిల్లంగ్రోవినీ చూస్తాడు.

"ఆరోజు మనిషి" అంటాడు. ఆ పిల్ల గ్రహిస్తుంది. వచ్చిన బిచ్చగాడు పిల్లనగ్రోవి తీసి,

"ఏదిర లక్ష్మణ సీత,

పర్ణశాలలో లేదెందుశాత-" అని ఆలపిస్తూంటాడు. ఆమె వంట పూర్తవుతుంది. నిప్పులు ఆర్పేస్తుంది. బిచ్చగాడు ఆమె దగ్గరకు వెళ్ళి కూర్చుంటాడు.

"నీకూ నీ వారులేరు. నాకూ నావారు లేరు. ఏటి ఒడ్డునా ఇల్లు కడదాం పదరా!" అంటూ ఆ పాట ఆ ప్రాంతమంతా మధురంగా వ్యాపిస్తుంటుంది.

"నాకు పెళ్ళిలేదు; నేనూ ముష్టివాడనే, మనం ఇద్దరం ఎందుకు పెళ్ళి చేసుకోకూడదు?" అంటాడు.

ఆమె ఆలోచనల్లో పడుతుంది. అప్రయత్నంగా అతడి దగ్గరకు జరుగుతుంది. అతడి మొహం తడుముతుంది. ఆ చింపిరి గుడ్డల అమ్మాయి అతడికి అప్సరసలా అనిపిస్తుంది. ఆ బాలికను గట్టిగా తన గుండెకు హత్తుకుంటాడు. చూపులేని ఆమె కళ్ళను చూసి కళ్ళల్లో నీరు తెచ్చుకుంటాడు. ఆమె అతడి తల నిమురుతుంది. ఆ నక్షత్రాల వెలుగు సాక్షిగా, ప్రక్కన ప్రవహిస్తున్న గోదావరి నీటి సాక్షిగా, ఆ శుభముహూర్తంలో వాళ్ళు భార్యాభర్తలవుతారు.

**కథా ఉద్దేశ్యం :**

వైకల్యం అనేది శరీరానికే గానీ మనసుకు కాదనేది ఉద్దేశ్యం.

**'గుడ్డిపిల్ల' కథ పై సంస్కరణోద్యమ ప్రభావం :**

నిత్యం ఎన్నో రైళ్ళలోనూ, మరెన్నో బస్టాండుల్లోనూ, ఇంకెన్నో వీధుల్లోనూ ఎంతోమంది బిచ్చగాళ్ళని మనం చూస్తూనే ఉంటాం. వాళ్ళలో వికలాంగులు కూడా ఉంటుంటారు.

సమాజంలో వికలాంగుల దుస్థితి మరీ దయనీయంగా ఉంది. వారిలో స్త్రీల పరిస్థితి మరీ దారుణం. కథలో అంధత్వంతో ఉన్న స్త్రీకి మరో వికలాంగుడు జీవితాన్నిచ్చినట్లు చిత్రించి రచయిత వికలాంగుల పట్ల సమాజానికి గల బాధ్యతను (వివక్ష చూపకూడదని, చేయూతనివ్వాలని) గుర్తు చేశాడు. ప్రస్తుత కథలో గుడ్డిపిల్లకు జీవితానివ్వడం అంటే వైఖల్యాన్ని వైకల్యంగానే చూడకుండా తనకున్న శక్తి సామర్థ్యాలతో ఆమె జీవితానికి బరోసా ఇవ్వడంగా గుర్తించాలి. అలా ఆ రోజుల్లోనే కాదు ఈరోజుల్లో కూడా ఒకరి జీవితానికి మరొకరు బరోసా ఇవ్వడానికి ముందుకొచ్చేవారు చాలా తక్కువ. కానీ ఈ కథలో గుడ్డిపిల్లకు మరో బిచ్చగాడు బరోసా ఇచ్చాడు. అతడు వికలాంగుడే. దీన్ని సంస్కరణగానే గుర్తించాలి. అలా 'గుడ్డిపిల్ల' కథ పై సంస్కరణోద్యమ ప్రభావం శక్తివంతంగా పనిచేసిందని చెప్పొచ్చు.

## 7. కన్ని

ఇది రాయలసీమ ప్రాంతానికి సంబంధించిన కథ. ఆ ప్రాంతంలో నీరు దొరకక దానివ్లల పంటలు పండక ప్రజలనుభవించే దుర్భర దారిద్ర్యాన్ని కథగా మలిచి రచయిత పాఠకులకు అందించాడు. ఈ కథలో పేదరికపు మంటలు ఎంత తీవ్రంగా ఉంటాయో తెలపడమే కాక, బిచ్చకత్తె కన్ని జీవితం చివరకు ఎటువంటి మలుపు తిరిగిందో చక్కగా చూపించిన కథే కన్ని.

**'కన్ని' కథ సంక్షిప్త పరిచయం :**

పేదరికంతో మలమల మాడిపోతూ తన కుటుంబ సభ్యుల ఆకలి తీర్చేందుకు గుత్తి రైల్వేస్టేషను ప్లాటుఫారం మీద నిలబడి, రైలంతా తిరుగుతూ ముష్టెత్తుకుంటుంటుంది కన్నమ్మ.

కురూపిగా కనబడుతున్న ఆ బిచ్చగత్తెకు ముష్ఠి వేయడానికి ముందుకు రాకపోగా ఆమె అనే "బాబూ! ఇవ్వాళ పొద్దుపొడిచిన దగ్గిర నుంచి ఒక్క పిడచైనా లేక మలమల మాడిపోతున్నాను. ఏమైనా ఇవ్వండి రాజా!" అన్న మాటలు విని "ఛీ! నోరు ముయ్ పోతరించున్నావ్, ఇంత పనీ పాటా చేసి నాలుగురాళ్ళు సంపాదించుకో కూడదూ?" అంటారు కొందరు.

ఆమె చూడటానికి కనుముక్కు తీరు సరిగా వుండి యవ్వనంలో వుంది. కానీ తిండి లేక కురూపిగా కనబడుతుంటుంది. అటువంటి వాళ్ళను చూస్తే ఎవరైనా దయతో కాకపోయినా జాలితోనైనా ఎంతోకొంతో కనీసం గింజలైనా ముఖం పక్కకు తిప్పుకునైనా ఇసిరేస్తుంటారు. అటువంటి దుస్థితే ఎదురయింది కన్నమ్మకు.

ఆమె చేసే బిక్షాటన వలన ఎక్కువ డబ్బులు సమకూరేవి. రైలు పెట్టె నిండా నిండి ఉండే సిపాయి వీరుల వలనే. ఒక్కొక్కరోజు వారు కన్నికి పైసలు, అణాలు రెండణా కాసులు, మరికొన్ని సార్లు పావలాలు కురిపిస్తారు. అలా డబ్బులిస్తూనే కారుకూతలు కూస్తుంటారు. ఇంకా హేళనగా పళ్ళతో ఆమె రొమ్ముమీద పొత్తి కడుపుమీద విసిరికొడుతుంటారు. సిపాయిల చేష్ఠలను వారి హేళన మాటలను భరించలేక రైలు దగ్గర ముష్టెత్తడం మానేస్తుంది కన్ని. ఆమె బిక్షమెత్తి సంపాదించిన ఇరవైరూపాయలు రెండు నెలలకే ఖర్చుల రూపేనా అయిపోతాయి.

ఒకసారి బొంబాయి ఎక్స్‌ప్రెస్ గుత్తి రైల్వేస్టేషన్‌లో చాలాసేపు ఆగుతుంది. ఎప్పటిలాగానే సిపాయిలంతా డబ్బులు వేస్తారు, పళ్ళు కూడా విసిరేస్తారు. అంతలో మదరాసు నాయళ్ళబ్బాయి ఊరకుక్కలు అల్లరి పెడుతున్న ఆవుదూడను రక్షించేందుకు వస్తున్న గోమాతలా కన్ని దగ్గరకు వచ్చి,

"నీ పేరెవరు?"

"కన్ని అంటారు సామీ"

"ఇదిగో కన్నీ, నీకుదా ఈ ముష్ఠి ఎందుకు?"

"చక్కని నీ మొగంలో విషాదం కురవబోయే....ఏ....మొయిల్లా వుంది. నాన్‌దా మద్రాసు నాయిళ్ళ కుఱ్ఱాణ్ణి. ఆఫ్రికాలో జర్మనువాణ్ణి చావకొట్టి అలసటపడి ఇంటికి నెలరోజులు సెలవుమీదదా వస్తుంటిని. ఆ యుద్ధంలో ఒక అమెరికా సైనికుణ్ణిదా, నాన్‌దా రక్షిస్తిని. వాడి దేశం నాణెందా ఇది. బహుమతి ఇచ్చాడు. ఇది నీ దగ్గిర గుర్తుగా వుంచుకో. ఈ దుడ్డు తీసుకొని రేపణ్ణించి ముష్టిదా మానెయ్యి (కన్ని)" అంటూ ఆమె చేతిలో రూపాయి నోట్లు, డాలరు నాణెము పెట్టి కదలబోతున్న రైలెక్కి మాయమైపోతాడు.

అప్పటినుండీ కన్ని ముష్టికి వెళ్ళడం మానేస్తుంది. చుట్టుపక్కల వాళ్ళు వారి ఆకలి తీర్చుకోడానికి తమ పక్కలపైకి రమ్మని కన్నికి డబ్బు ఎరచూపుతుంటారు. వారు చెప్పినట్లు చేస్తే చేతినిండా డబ్బుంటుంది. ఆమె మీద ఆధారపడ్డ ఆరుగురిని పోషించడానికి ఎటువంటి ఇబ్బంది ఉండదు. అయినా కన్ని ఆ పనిచేయడానికి ఎంతమాత్రం అంగీకరించదు. సిపాయి ఇచ్చిన ఆ డాలరు నాణాన్ని పదే, పదే చూసుకొంటూ

"ఏదారి వచ్చావో?

ఏదారి పోయావో

నీదారి నీదిరా!

నాకు దారే లేదురా'' అనుకుంటుంది. అప్పటికి ఆమె కుటుంబానికి మూడురోజుల నుండీ తిండి ఉండదు. ఆమె తల్లి తండ్రులు ''మాయముండకు మానాభిమానాలొచ్చాయంట'' అంటూ తిడుతుంటారు. శక్తి సహనం కోల్పోయిన కన్నిలో చలనం ఉండదు. అప్పటిదాకా ఆమె కావాలనుకున్నవాళ్ళంతా ఇప్పుడు ఇది ఎవరిక్కావాలి అనుకుంటుంటారు. ఆ రాత్రంతా క్షుద్భాతతో ప్రపంచంతో సంబంధం లేనట్టు పడి వుంటుంది కన్ని. తెల్లవారుతుంది. అంతలో ''కన్ని ఎక్కడా?'' అంటూ ఓ స్వరం వినబడుతుంది. ఆస్థితిలో ఉండి కూడా పట్టలేని ఆనందంతో ''ఇక్కడే వున్నాను నాయుడు బావా'' అంటూ పెద్ద స్వరంతో బదులిస్తుంది. ఒక్క ఉదుటున రామస్వామినాయుడు ఆమె దగ్గరకు పరిగెడతాడు. ఎముకల గూడుతో ఉన్న కన్నెను తన హృదయానికి హత్తుకుంటాడు. అతడి హృదయం సంజీవి అవుతుంది కన్నికు. వెనుకటి అందాన్ని సంపాదించుకుంటుంది.

రామస్వామి అందాల కన్ని మెడచుట్టూ మూడు ముళ్ళు వేసి ''చిన్న తనం నుంచీ బస్సుల దగ్గిరదా ముష్టి ఎత్తేవాణ్ణి కన్నీ! అటునుంచి నేనూ ఇక్కడ నువ్వూ నదుల్లా కలిస్తిమి. రైలు నుంచి చూచిన నాకు నువ్వు ఏనాడో తప్పిపోయిన నేస్తురాలివిదా కనిపిస్తివి (కన్ని)'' అంటాడు.

పదిరోజులు గడిచాక రామస్వామినాయుడు యుద్ధానికి ఇటలీ వెళతాడు. ''ఇటలీ యుద్ధము నెగ్గాము. కాని కుడిచేయి ఇటలీకి అర్పించాను. కానీ ఆరోగ్యము మహా సముద్రంలా వుంది. నిన్ను గట్టిగా కౌగిలించుకొనేందుకు ఒక చేయి లేదు కన్ని!'' అంటూ రామస్వామి టెలిగ్రాము పంపిస్తాడు. అన్ని తానే అయిన నా సామికి నేను ఓ చేయి కాలేనా అనుకుంటుంది కన్ని.

**కథా ఉద్దేశ్యం :**

భారతదేశంలో పేదరికం ఎక్కువ. దానివల్ల రోజుకు ఒక్క పూటన్నా కడుపు నిండడం కోసం పడరాని పాట్లు పడే వారెందరో. భరించేవాడికి మాత్రమే తెలుస్తుంది ఆ కడగళ్ళ ఉధృతి అనేది ఉద్దేశ్యం.

**'కన్ని' కథ పై సంస్కరణోద్యమ ప్రభావం :**

మన దేశంలో దారిద్ర్యం విలయతాండవం చేస్తుంది. దానివల్లే ఎంతోమంది కథలో 'కన్ని'లా భిక్షాటన చేయవలసి వస్తుంది. ఎన్ని ఏళ్ళు గడిచినా వారి స్థితి మారడంలేదు, పేదరికం పోవడం లేదు. ధనవంతుడు మరింత ధనవంతుడవుతున్నాడు. పేదవాడు మరీ

పేదవాడిగా తయారవుతున్నాడు. ఇటువంటి పరిస్థితి మారాలంటే కథలో రామస్వామినాయుడు కన్నెను కాపాడటానికి ముందుకొచ్చినట్లు దేశాన్ని కాపాడేందుకు సంస్కర్తలు, మేధావులు ముందుకు రావాలి. కథలో బిక్షాటనతో అవమానాలతో జీవితాన్ని వెలిబుచ్చుతున్న 'కన్ని'ను ఒకప్పటి భిక్షకుడు తరువాత సైనికునిగా మారిన రామస్వామి నాయుడు వివాహం చేసుకున్నట్లు రచయిత చిత్రించి తనకు తానే సాటి అనిపించుకున్నాడు. సహజంగా ఏ కులంవాళ్ళు ఆకులం వాళ్ళనే, ధనవంతులు ధనవంతుల్నే వివాహాలు చేసుకొంటారు కానీ దానికి విరుద్ధంగా బిచ్చగత్తె అయిన 'కన్ని'ను సంస్కరించి, (ఇక్కడ సంస్కరించడం అంటే భిక్షాటనంను మానిపించడంగా గుర్తించాలి). మద్రాసు నాయుడైన రామస్వామినాయుడు కొత్తజీవితాన్ని ఇచ్చాడు. భిక్షాటన మాన్పించడానికి రామస్వామి నాయుడు పాత్ర తోడ్పడింది కాబట్టి 'కన్ని' కథపై సంస్కరణోద్యమ ప్రభావం ఊహించిన స్థాయిలో ఉందనే చెప్పాలి.

## 8. మెట్లు

ఇది కులాంతర వివాహాన్ని ప్రోత్సహించేది. అగ్రకులస్తులు అసహ్యించుకునే హరిజన స్త్రీని అగ్రకులానికే చెందిన బ్రాహ్మణాచార్యుడు వివాహమాడడాన్ని ఈ 'మెట్లు' కథలో చూడొచ్చు.

**'మెట్లు' కథ సంక్షిప్త పరిచయం :**

గూడం బయట ఆగి ఉన్న కారులోంచి దిగుతున్న ముగ్గురు బాలికలు, ఒక యువకుడు విచిత్రమైన వస్త్రధారణతో, మోడ్రన్ హెయిర్‌స్టైల్‌తో ఇంపైన వాసనగల పూలతో బంగారు ఆభరణాలు ధరించి కిరస్తానీ మిసమ్మ తొడుక్కునే జోళ్ళకన్నా అందంగా ఉండే చెప్పులతో కారు దిగుతారు. అలా దిగడాన్ని మాలపిల్ల నిశ్చేష్టురాలై చూస్తుంటుంది. ఆమె పేరు మాచీ! వారు దిగీదిగగానే పరిమళపు సువాసన చుట్టుపక్కలకంతా వ్యాపిస్తుంటుంది.

మాచీ ఒక్కసారిగా తనను తాను చూసుకొని "ఉతకు ఎరగని చిరిగిపోయిన తన పాత పోగులు పరిశీలించుకొంది. ఆ చిరుగుపాతే చీరలా వల్లెవేసుకుంది. అప్పుడప్పుడు తానూ తలగడుగు పోసుకుంటుంది. అయినా తన వొళ్ళు అలా గమ్మున వాసనేస్తుందా (మెట్లు)" అనుకుంటుంది.

వాళ్ళు కారులో వస్తారు. మాచికి మాత్రం అప్పుడప్పుడు దున్నపోతు స్వారీ తప్ప కారు యోగం ఎక్కడిది? సంతనాడే తప్ప మిగతా అప్పుడు ఆమె తల నూనె ఎరుగదు.

తంగేడు పూలు, బంతిపూలు తప్ప మరే ఇతర పూలు ఆమెకు తెలియవు. శివరాత్రి రోజు గడ్డికోసి బజారులో జట్కా వాళ్ళ కమ్మగా వచ్చిన డబ్బులు వాళ్ళ నానకు పూర్తిగా ఇవ్వకుండా మిగుల్చుకున్న అణా, అర్ధణా, కానీలు పోగు చేసి పదణాల మూడు కానులతో కొన్న మాయ వెండి కడియాలు, మురుగులే తప్ప బంగారమే ఎరుగదు మాచి.

ఆ మాలపిల్ల మాచి మోమురేఖలు శిల్ప సౌందర్యాలు, విశాల నయనాలు సినిమా తారలు చూచి ఉడుకుబోతు తనంతో కుంగిపోవలసినదే.

ఇప్పుడు మాల మాచి ఆ అందాల బాలికల్ని చూసి తెలియని ఆవేదనతో దుఃఖపడి కంటినీరు తుడుచుకుంటుంది.

మాచి తండ్రి ఆమెకు పోతిగాడి సంబంధం కుదురుస్తాడు. వాడు దున్నపోతులా ఉంటాడు. పోతిగాడు వద్దు, ఆ మాల గూడం వద్దు. చదివి ఆ పిల్లల్లా అవ్వాలి. అలా కారులో ఎక్కాలి. అలాంటి నగలు, అలాంటి చీరలు సంపాదించాలి అనుకుంటుంది.

మాచెమ్మ స్కూలు ఫైనలు పరీక్షలో ఉత్తీర్ణురాలవుతుంది. ఆమె తండ్రితో "బాబూ! యీ వూరులో ఉండలేను" అంటుంది. ఎంతమంది బ్రతిమలాడినా విననంటుంది. ఇరవయ్యోఏట ఖద్దరు చీర, ఖద్దరు రయికా కట్టుకొని సంపూర్ణ యవ్వనంతో మాలపల్లి ఊరి చివర కరణంగారి మామిడితోటలో పూత పూచిన గున్న మామిడిలా ఉన్నది హరిజన సుందరి మాచెమ్మ.

ఎంత పెద్ద చదువున్నా, ఉన్న రంగు మారదు. ఎంత గొప్ప చీరలు కట్టినా నల్లరంగు బంగారం కాదు. చాటుమాటుగా ఇంగ్లీషు పత్రికలు కొనుక్కొని అమెరికా స్త్రీలు అందాల్ని ఎలా సమకూర్చుకుంటారో చదువుతుండేది.

ఇంటి దగ్గర పోరు పెట్టి తన గ్రామపు హరిజన సంఘం వారి సహాయంతో చెన్నపట్నం దుర్గాబాయమ్మగారి ఆంధ్ర మహిళ సభ విద్యాలయంలో ఎనిమిదేళ్ళు చదివి, మొదటి తరగతిలో కాశీ విశ్వవిద్యాలయ ప్రవేశ పరీక్షలో కృతార్థురాలౌతుంది.

ఇంటరు చదవడానికి ఉచిత విద్యావేతనం సమకూర్చుకుంటుంది. చదువుకునే రోజుల్లో తండ్రి రెండు మూడు సంబంధాలు తీసుకొస్తే ససేమిరా అంగీకరించదు. వాళ్ళ గూడెంలో కనబడిన ఆ కారు, అందులోంచి దిగిన మనుష్యులు, వాళ్ళ ఆకారాలు, వారి సంభాషణలే మాచికి పదేపదే గుర్తొస్తుంటాయి.

ఆమెలో ఏ ఆలోచన తలెత్తిందో అప్పటిదాకా ఉన్న గూడెం స్వరూపం మారిపోతుంది. వికృతంగా తయారవుతుంది. ఆమె చూపులో పొలాలు నేలలోకి కుంగిపోతాయి. కాల్చిన పందిమాంసం, ఎండుచేపలు, రొయ్యలు కాలకూట విషాలై గంజి విషధార అయ్యింది.

మూడురోజులు ఉండలేక, ఉండలేక అతి కష్టం మీద వుండి నాలుగోవరోజు మద్రాసు చెక్కేస్తుంది. మాచమాంబగా పేరు కూడా మార్చుకుంటుంది. ఇంటర్ ఫస్ట్‌క్లాసులో పాసై విద్యార్థి వేతనంతో వైద్యకళాశాలలో చేరుతుంది.

కళాశాలలో ఎవరితో పడితే వాళ్ళతో మాట్లాడేది కాదు మాచమాంబ. అక్కడ జమిందారిలా మెలుగుతుండేది. కావలసిన మేకప్ సామాగ్రి కొనుకునేందుకు విద్యార్థి వేతనం చాలకపోతే తిండి తక్కువ తిని అయినా వాటిని సమకూర్చుకునేది.

"బాలకుల పొగడ్తలలో "ఈ చీర బాగున్నది, నీ వేషం మహాద్భుతం" అన్న ముక్కలే వినేదికాని "నువ్వు సౌందర్యరాణివి" అన్న మాట ఒకనాడూ వినలేదు (మెట్లు)."

మాచమాంబ క్లాస్‌మేట్ ఒకడు ఆమెతో సాన్నిహిత్యాన్ని పెంచుకుంటాడు. ఆమెను సినిమాలకు కూడా తీసుకెళతాడు. ఒకసారి ఆమె దగ్గరగా చేరి రెండు మూడుసార్లు ఆమె ధృఢవక్ష నిధులపై హస్తతలం సారించి స్పర్శించి, అదిమినాడు. అప్పుడా బాలికకు వివశత్వం కలిగింది. ఒళ్ళంతా విద్యుల్లతలు ప్రసరించాయి. కానీ అతడు ప్రేమతో అలా చేయలేదని మాచమ్మని క్షుద్రజాతికి చెందిన దానిగా భావించి, వారికైతే నీతీ నియమాలు ఉండవనుకొని అలా చేశాడనే భావం కలుగుతుంది ఆమెలో.

అవమాన భారంతో కుంగిపోయి తోక తొక్కిన భుజంగిలా ఆవేశంతో లేస్తుంది. తరువాత రోజు అతడు మాచమాంబను పలకరిస్తే, "ఓరి దుర్మార్గుడా, నేను హీనజాతి దాననుకదా, నీ పశుత్వానికి అడ్డం పెట్టననుకున్నావా? ఇక్కడనుంచి నాతో మాట్లాడకు, నువ్వు విషజంతువవు (మెట్లు)!" అంటూ మండి పడుతుంది. అతడు తల దించుకొని వెళ్ళిపోతాడు.

విద్యార్థిని, విద్యార్థులకు ఆయా సబ్జెక్టుల్లో తలెత్తే సందేహాలు నివృత్తి చేసుకోడానికి ఆచార్యుల ఇళ్ళకు వెళ్ళే అలవాటు ఉంటుంది. ఆ అలవాటుతోనే మాచమాంబిక కూడా ఆమె ఉండే వసతిగృహం నుంచీ ఆమె తరగతికి సంబంధించిన ఆచార్యులలో ఒకరి ఇంటికి ఏదో పాఠం చెప్పించుకొనేందుకు వెళుతుంది. చదువు పట్ల ఆమె దీక్ష ఆ ఆచార్యుడికి తెలుసు. ఆమెలో గ్రహణాశక్తి తక్కువే. కాని విషయాన్ని స్పష్టంగా తెలుసుకునే వరకు నిద్రాహారాలు కూడా మానడానికి సిద్ధపడుతుంది.

ఆ ఆచార్యుడు మధ్య వయస్కుడు. ఆమె అందం ఆ ఆచార్యున్ని ఆకర్షించలేదు. ఆమెలో ఉన్న దీక్ష, యవ్వనం, అతడి మనసుని కలవరపెడతాయి. ఈమె పేదమ్మాయే. కొంచెం అనునయిస్తే సునాయాసంగా దక్కుతుందనుకుంటాడు.

రాత్రి ఎనిమిది గంటలకు ఆచార్యుడు సోఫాలో ఆమెను తన పక్కనే కూర్చోబెట్టుకొని పాఠం చెప్తుంటాడు. యదాలాపంగా వేసినట్లు ఆమె తొడపై చేయి వేస్తాడు. ఆమె పాఠం దీక్షలో పడి ఆ చేతిని అంతగా పట్టించుకోదు. అదే అదునుగా ఆ చెయ్యి బొడ్డు కిందకు జరుగుతుంది. వెంటనే ఆమె తేరుకుని "గబుక్కున అతని చేయి తీసి పారవేసి, లేచి ఆడపులై "మీకు బుద్ధి ఉందా, ఇదా మీరు పాఠం చెప్పడం!" అని ఆ పుస్తకాలన్నీ అక్కడే ఉంచి విస విస గది విడిచి వెళ్ళిపోయింది (మెట్లు)."

వెంట తెచ్చుకొన్న హ్యాన్డ్‌బ్యాగ్ అక్కడే వుండిపోవడంతో తిన్నగా వసతి గృహానికే చేరుతుంది.

ఆచార్యులందరూ అలాగే చేస్తారా విద్యార్థినుల్ని లేక 'నాకు మాత్రమేనా ఆ పరాభవం' అనుకొని క్రుంగిపోతుంది. ఆ తరువాత రోజు పొద్దున ఆచార్యుడు ఆమె అతడి ఇంట్లో వదిలివెళ్ళిన పుస్తకాలు, హ్యాన్డ్‌బ్యాగ్ ఆమెకు పంపిస్తూ, ఆ బ్యాగ్‌లో ఒక ఉత్తరం పెడతాడు.

ఆ ఉత్తరంలో "అమ్మాయీ క్షమించు! ఇది నా అపచారం కాదు! నేను ఒంటరివాడను. భార్యపోయిన మధ్యకాలపు వాణ్ణి. వైద్యాలయంలో దాదులు నాకో విధమైన తృప్తి తీరుస్తున్నారుకాని సరియైన మందుకూ, ప్రకటనపు మాయమందుకు నాకు తేడా తెలిసింది కాదు. రాత్రంతా నిదరపట్టలేదు. నేను పడిన బాధ అనంతము! కంచె చేనుమేస్తే లోకం నాశనమే! నేను నలభై ఒక్క ఏళ్ళవాడిని నాకు భార్యలేదు. ఇద్దరు బిడ్డలు ఇద్దరూ మేనమామలకడ బెంగుళూరులో చదువుకొంటున్నారు. నిన్ను గురించి విచారిస్తే నువ్వు హరిజన బాలికవనీ చెక్కుచెదరని శీలం కలదానివనీ తెలుసుకున్నాను. నువ్వు నన్ను వివాహం చేసుకో - నేను తెలుగు బ్రాహ్మణుణ్ణి! నువ్వు నన్ను ప్రేమింపలేకపోవచ్చును. కానీ ఉత్తమ గృహిణీ ధర్మమే ప్రేమ కాగలదని నా నమ్మకము. నీకు ఇష్టముంటే నీకున్న కుంకుమ పువ్వురంగు చీర కట్టుకొనిరా! లేకపోతే ఏ చీర కట్టుకున్నా సరే! ఆలోచిస్తాను అనదలచుకుంటే పువ్వులు లేని తెల్లచీర కట్టుకురా! ఇట్లు క్షంతవ్యుడైన రావు (మెట్లు)" అంటూ ఉత్తరం రాస్తాడు సి.పి.రావు.

మాచమాంబ సి.పి.రావు పంపిన ఆ ఉత్తరాన్ని పదే, పదే చదువుకొని ఆలోచిస్తుంటుంది. అది వచ్చిన మూడురోజులు పాటు ఒకటే ఆలోచనలు. తాను హిందూ

జాతి కాలికింద నలపబడుతున్న మాలపిల్లని, రావు ఏమో బ్రాహ్మణుడని, పెద్దవాడైతే ఏమవుతుంది మహా అయితే పన్నెండు పదమూడు సంవత్సరాల తేడా అంత పెద్ద తేడా ఏమికాదు. రావుకు ఆరేడువందల జీతం. కారు కూడా ఉన్నవాడు. తన చదువూ పూర్తవుతుంది. కావలసిన నగలు, చీరలు, కారూ దక్కుతాయి. 'నా చదువుకి కిరీటం అవుతాడు' అనుకొంటుంది.

డాక్టరు అంత అందంగా ఏమీ ఉండడు. 'నేను అతన్ని ప్రేమించగలనా! ప్రేమ అనేది జంతు ధర్మానికి మానవ మనస్తత్వం రంగరించిన ఒక మందు. ఏదేమైతేనేం అతడ్ని వివాహం చేసుకోవడం వల్ల అన్నివిధాలా లాభమే' అనుకుంటుంది.

కారణం ఏదైతేనేమీ అతడు పెళ్ళి చేసుకుంటానన్నాడు. అప్పటిదాకా తెల్లచీరతో వెళ్ళేది, మూడవరోజు 'కుసుంబాచీర' కట్టుకొని వెళ్తుంది. ఆరోజు సాయంత్రం పుస్తకాలతో డాక్టరు రావు ఇంటికి వెళ్తుంది. వారు పెళ్ళి విషయాలన్నీ మాట్లాడుకుంటారు.

పెళ్ళి హిందూ వివాహ సాంప్రదాయంలోనూ, రిజిష్టరు రూపంలోనూ అవుతుంది. రావు తరుపున ఎంతోమంది వైద్యాధికారులు, వైద్యకళాశాలాచార్యులు కూడా వస్తారు. మాచమాంబ మాత్రం కనీసం తల్లితండ్రులను సైతం రావద్దంటుంది. అలా కాలేజీ విద్యార్థినిగా ఉన్నప్పుడే మాచమాంబ-రావుల వివాహం జరుగుతుంది. మాచమాంబ మాచమాంబరావు అవుతుంది.

డాక్టరు మాచమాంబికారావు ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టరు అవుతుంది. ఆమె అసిస్టెంటు సర్జనుగా ఉంటుంది. డాక్టరు రావు జిల్లా ముఖ్య వైద్యాధికారి అవుతాడు. డాక్టరు మాచమాంబిక కోరుకున్నవన్నీ ఒక్కొక్కటిగా నెరవేరుతుంటాయి.

భర్త ముఖం అంత అందంగా లేకపోయినా బంగారు చాయగలదే. ఇద్దరికీ కామ తృప్తి అవుతుంటుంది. అతడు రసికుడే. ఆమెకు మాత్రం ఏమీ తెలియదు. అందుకోసం ఎన్నో స్త్రీ పురుష సంబంధ గ్రంథాలు చదువుతుంటుంది. ఆమె గర్భవతి అవుతుంది. పురిటికోసం సెలవు పెడుతుంది. ఆమెపై అధికారి తన భర్తే కాబట్టి, అతడే పురుడు పోస్తాడని కలలు కంటుంది.

వారి వివాహమై మూడేళ్ళు గడుస్తుంది. ఆ మూడేళ్ళలోనే వారిద్దరిలో ఏదో అసంతృప్తి ఆమె గ్రహిస్తుంది.

అతడు ఆమె యవ్వనాన్ని చూశాడు కానీ పుట్టిన వాతావరణం చూడకుండానే పెళ్ళి చేసుకుంటాడు. 'తరగతి నల్లకుక్కను తెల్లకుక్కగా మార్చే ప్రయత్నం అయింది.'

మంగలివాడు బ్రాహ్మణుడెట్లా అవుతాడు. ఆ అనాగరిక జాతి స్త్రీ ఎంత చదువుకున్నా ఉత్తమ సంస్కారుని భార్య అవుతుందా? అనిపించి అతడి మొదటి భార్య జ్ఞాపకం వచ్చి బెంగుళూరులో ఉన్న తన పిల్లలను చూసొస్తుండేవాడు.

భార్య తన కౌగిలింతకు వచ్చిన మొదటి సంవత్సరం అతడు కామ తృప్తిపొందేవాడు. తరువాత అతడు యేదో లోటును గుర్తింపసాగాడు. ఆమె తన దేహం అతనికి అర్పించేది. కాని ఆమె ఎక్కడో ఉండేది! ఆమె లేని ఆమె - దేహ మాత్రుమూర్తిగా తోచి అతడు వ్యథ నొంది భార్యను తన పడకగదికి పిలిచేవాడు కాదు.

ఆమె బాధపడేది. అతడు వట్టి పురుషుడుగా తన్ను కోరేవాడు. తాను పూర్ణ పురుషుని వాంఛించింది. అతడు పశువులా వచ్చి పశుతృప్తి పొంది తన్ను తన పడకగదికి పొమ్మనేవాడు.

ఒకసారి డాక్టరు మాచమాంబ పని చేస్తున్న ఆసుపత్రిలోకి ఖద్దరు ధరించిన స్త్రీ పురుడు కోసం చేరుతుంది. ఆమెకు అంతకుముందే ముగ్గురు పిల్లలుంటారు.

మాచమాంబ, రోగి ఈ మాటా ఆ మాటా చెప్పుకోవడం ప్రారంభిస్తారు. వాళ్ళ మాటల ప్రస్తావనలో రోగి కూడా తన భర్తకు ఆమె రెండో భార్యననే చెబుతుంది. వారి సంభాషణలో ఆమె మాటకు రెండుసార్లు తన భర్త ప్రస్తావన తెచ్చి సంతోషపడుతుంటుంది. ఆమె ఆనందం మాచమాంబకు ఆశ్చర్యం కలిగిస్తుంది.

“**రోగి** : డాక్టరుగారూ, మావారికి వచ్చు జీతం అరవై రూపాయలయినా మా సంసారం యేదో గుప్తంగా లోట్లు లేకుండా జరుగుతున్నాదండి. ఈ యుద్ధం వల్ల ఖర్చు ఎక్కువైనమాట నిజమే. కానీ యుద్ధ భత్యం ఇంకో పదిరూపాయలిస్తున్నారు. మాకు భూముల వల్ల సాలుకు ఆరువందలు వచ్చునని పంటలకు ఖరీదులు ఎచ్చి ఇప్పుడు పదిహేను వందలు వస్తున్నాయి.

డా.మాచ : ఇప్పుడు మీ సంసారం చక్కగా జరుగుతోందన్నమాటా?

**రోగి** : ఆ !

**డా.మా** : ఒక వారంరోజులలో మీకు పురుడు వస్తుంది. ఇంతవరకూ ఆలస్యం చేశారేమమ్మా?

**రోగి** : నేను మావారిని ఎలా వదిలి ఉండగలను డాక్టరుగారూ. వారు వండుకొంటారు. పిల్లలను చూసుకోగలరు. మా సవతి పోయినయేడే నా పెళ్ళి. తర్వాత మూడేళ్ళు వరకూ నేను కాపురానికి రాలేదు. తాలూకాఫీసు పని - ఎన్ని తాలూకాలో బదిలీ - తానే తమకూ, తమ ఇద్దరి బిడ్డలకూ వంట చేసుకొనేవారు. ఇప్పుడు నేను వారి నెల్లా వండుకోనివ్వగలను చెప్పండీ?

**డా.మాచ :** మీకు ఇద్దరు సవితి బిడ్డలా?

**రోగి :** అవునండి! నేను కాపురానికి వచ్చినప్పటినుంచి ఆ ప్లిలలు "అమ్మా, అమ్మా" అంటూ నన్ను వదిలితేనా? నా బిడ్డల మీదకన్న వాళ్ళ మీదే నాకెక్కువాపేక్షండి (మెట్లు)" అంటూ ఆ రోగి తన భర్త గొప్పదనాన్ని వినిపిస్తుంటే మాచమాంబలో కొంత మార్పు చోటుచేసుకొని సర్దుబాటు దిశగా ఆలోచనలు పెరిగి "ఆ బిడ్డల తండ్రి, ఆ బిడ్డలు తన గర్భాన మూర్తించడానికి కారణం తన భర్త! జిల్లా వైద్యాధికారి! ఒక బ్రాహ్మణుడు. తనకై క్రిందకు దిగిన వ్యక్తి! తన్ను చేయిపట్టి మెట్లెక్కించిన దేవతామూర్తి - తన బిడ్డలకు తండ్రి కావాలి. తన బిడ్డలు తన్ను "అమ్మా" అని పిలవరూ! డాక్టరుగారిని "నాన్నా" అని పిలవరూ! వారు తనకు సర్వనాగరికతలు ధారపోశారు వారు దేవతామూర్తి. వారు భగవంతుడు. తానెవరు (మెట్లు)?" అనుకుంటూ తాను కూడా తల్లి కావాలని ఆశపడుతుంది.

ఒక ఆడపిల్లకు జన్మనిస్తుంది. సవతి పిల్లలను సైతం తన బిడ్డలానే ప్రేమిస్తుంది.

జిల్లా వైద్యాధికారి డాక్టర్ సి.పి. రావుగారు నల్లని తన మాలపిల్లలో భారతజాతి యొక్క అడుగుమెట్టు చూస్తాడు. పై మెట్టు అడుగుమెట్టు రెండూ ఒకటే.

**కథ ఉద్దేశ్యం :**

కులం పేరుతో విధ్వంసాలు సృష్టించడం కంటే సమానత్వ దృక్పథాన్ని అలవరచుకోవడం మంచిదనేది ఉద్దేశ్యం.

**'మెట్లు' కథ పై సంస్కరణోధ్యమ ప్రభావం :**

అనాది కాలంగా హరిజనులు నీటి కోసం, విద్యకోసం, చివరకు కూటికోసం కూడా ఎన్నో అగచాట్లు ఎదుర్కోవలసి వచ్చింది. ఆ కాలంలోనే కాదు ఈ కాలంలో కూడా ప్రత్యక్షంగా కాకపోయినా పరోక్షంగానయినా ఆ దుస్థితి ఎదురవుతూనే ఉంది. ఇంకో మాటలో చెప్పాలంటే హరిజనులు అనేవాళ్ళు తమ ఉనికిని నిలుపుకొనేందుకు రోజుకో పోరాటం చేయవలసి వస్తుంది మాచిలా. కథలో మాలకులానికి చెందిన మాచి డాక్టరు స్థాయికి ఎదగడానికి ఎన్నో పాట్లు పడాల్సివచ్చింది, మరెన్నో అవమానాలను సైతం చవిచూడాల్సి వచ్చినట్లు గమనించాలి. ఎట్టకేలకు మాలమాచి అగ్రకులానికి (బ్రాహ్మణకులానికి) చెందిన డాక్టర్ సి.పి.రావును వివాహమాడినట్లు రచయిత చిత్రించి కుల వివక్షత రూపుమాపాలనే సందేశాన్ని ఇచ్చినట్లు గ్రహించాలి. కథలో కులనిర్మూలనకు తోడ్పడిన పాత్రలు మాచమాంబ, డాక్టర్ రావులు. వాటి ద్వారా అన్ని కులాలు సమానమేనని, ఒక కులం ఎక్కువ, మరొక కులం

తక్కువ అనే తారతమ్యం చూపరాదనే భావం ప్రచారం చేయడమే కాక మరిన్ని కులాంతర వివాహాలు జరగాలనే సందేశాన్ని కూడా ఇవ్వడం జరిగింది. దాన్ని బట్టి సంస్కరణోద్యమంలో కుల నిర్మూలన కూడా ఒక భాగం కనుక 'మెట్లు' కథ పై సంస్కరణోద్యమ ప్రభావం బలంగానే పనిచేసిందని చెప్పాలి.

## 3.9 విశ్వనాథ సత్యనారాయణ (అక్టోబర్ 1895- అక్టోబర్ 1976)

విశ్వనాథ సత్యనారాయణగారు పార్వతమ్మ, శోభనాద్రి దంపతులకు 1895 అక్టోబర్ 9వ తేదీన జన్మించారు. పార్వతమ్మ, శోభనాద్రి దంపతులకు ముగ్గురాడపిల్లలు, ఐదుగురు మగపిల్లలు. వారిలో విశ్వనాథ మూడవవాడు. సత్యనారాయణగారి ఇంటిపేరు విశ్వనాథ. వారి వంశానికి సంబంధించిన పూర్వులెవరో కాశీకి వెళ్ళి, అక్కడినుండి శివలింగాన్ని తీసుకొచ్చి కృష్ణానది సమీపంలో హంసలదీవికి పైభాగంలో ఉన్న ఒక పల్లెలో ప్రతిష్ఠించడం వల్ల ఆ పల్లె విశ్వనాథ పల్లె అయిందనీ అదే వారి ఇంటిపేరుగా మారిందని అభిప్రాయం వ్యాప్తిలో ఉంది. వారి పూర్వులు విశ్వనాథ పల్లెను వదిలి నందమూరికి తరలివెళ్ళటం జరిగింది.

వారి పూర్వీలో ఒకరైన వెంకట నరసుగారు విశ్వనాథపల్లెను విడిచి నందమూరు చేరారు. ఆ గ్రామాన్ని నిర్మించింది విశ్వనాథవారే. అప్పుడా ఊరంతా వారిదే. తరువాత మిగతావారిని తీసుకొచ్చి పొలాలిచ్చి గ్రామాన్ని పరిపూర్ణం చేశారు. వెంకట నరసుగారి తరువాత వారు విశ్వనాథ సత్యనారాయణగారి తండ్రియైన శోభనాద్రిగారు. అతడు గొప్ప ప్రతిభావంతుడు, మహాదాత. అతడు గ్రామస్థులకు భారత, రామాయణాలు పురాణాలుగా చెప్పేవారుట. హరికథ చెప్పే అలవాటు కూడా వారికున్నట్లు తెలుస్తుంది. వారు హరికథ రాసినట్లు కూడా ఆధారాలున్నాయి. కానీ ప్రస్తుతం అది లభించడంలేదు. విశ్వనాథవారు వారి తండ్రి దాతృత్వాన్ని గురించి ఇలా అంటారు. "ఆ నా తండ్రియన్ దధీచి, శిబికర్ణాదుల్ పునారూప సంస్థానం బొందిన పుణ్యమూర్తి."[38]

విశ్వనాథ తండ్రిగారు మహా శివభక్తులు. 1902లో కాశి నుంచి శివలింగం తెచ్చి నందమూరులో శివాలయాన్ని నిర్మించి, అందులో ప్రతిష్ఠింపచేశారు. ఆ విశ్వేశ్వరుడే విశ్వనాథ వారి యింటి ఇలవేల్పు. విశ్వనాథవారు ఆ దేవుడి గురించి విశ్వేశ్వర శతకాన్ని రాసి ఆ దేవుడిపై తనకు గల భక్తి ప్రపత్తులను చాటుకున్నారు. అంతేకాక రామాయణ కల్పవృక్షాన్ని సైతం ఆ దేవుడికి అంకితమిచ్చారు.

విశ్వనాథగారి విద్యాభ్యాసం నందమూరు, పెదపాడు, ఇందుపల్లి, వెలినూతల, నాగవరప్పాడులలో కొనసాగింది. శ్రీ గుటనిపూడి వీరభద్రయ్యగారి వద్ద మనుచరిత్రతోపాటు గణ యతి ప్రాసలను పద్యరచనను నేర్చుకొన్నారు. విశ్వనాథ సత్యనారాయణగారు నాటకాలంటే చెవి కోసుకుంటారు. అంతేకాక వారికి గొల్ల బాగవతులు ఆడే వీధి నాటకాలంటే ఎంతో ఇష్టం. వాటితోపాటు కూచిపూడి భామాకలాపాలు, భట్రాజుల చాటు పద్యాలు కూడా ఇష్టపడేవారు. అవన్నీ విశ్వనాథ సత్యనారాయణగారు రాబోవుకాలంలో ఓ మహాకవిగా ఎదిగేందుకు ఎంతగానో ఉపయోగపడ్డాయి.

శోభనాద్రిగారికి పిల్లలకు ఆంగ్ల విద్య చెప్పించాలన్న కోరిక అధికంగా ఉండేది. ఉన్న పొలం కౌలుకిచ్చి వచ్చిన డబ్బుతో సత్యనారాయణగారిని బందురు హైస్కూలులో మొదటి ఫారంలో చేర్పించారు.

“శోభనాద్రిగారు పిల్లలను చూచుటకప్పుడప్పుడు బందరు వచ్చుచుండెడివారు. కుమారుడు పాఠ్య పుస్తకములు చదువకుండ పద్యములు వ్రాయుచుండుట చూచి తండ్రిగారు మండిపడి ‘నీవేదో పెద్ద ఉద్యోగము చేయుదువని ఆంగ్లము చెప్పించుచుండగా నీకు తెలుగు కవిత్వ మేమిరా?’ చాలు ఇంక చదువు మానుకొమ్ము అని పుస్తకములన్నియు కట్టకట్టి పారవేసిరట. వారించుక శాంతించిన పిమ్మట సత్యనారాయణగారు ‘నేనొకసారి చదివిన పుస్తకము మరొకసారి చదువలేను. అది నాకు చేతకాదు. నేనే ఫారము తప్పిన ఆ ఫారముతో చదువు మాన్పింపుము ఇదే షరతు.’ అని చెప్పి వారి నొప్పించిరి. అప్పుడే తండ్రిగారు వ్రాసిన ‘నీవు రామ కథ వ్రాసితి నంచనిపించుకో వృథాయాసము గాక కట్టుకథలై హికమా పరమాయటంచు’ కుమారుని కానతిచ్చిరి. సత్యనారాయణగారంత ‘ఈ పద్యములతో రామాయణము వ్రాయుటెట్లు? నేను కొన్నియేండ్లు పరిశ్రమ చేయవలెను. అనంతరము వ్రాయుచుండవలెను. అది యేండ్లు మీద జరగవలసిన పని. నేను కవిత్వము వ్రాయుచుండగా నీవూరకుండవలెను. నాకు భగవంతుడాయుర్దాయ మిచ్చినచో నేను రామాయణము వ్రాయుదును. మన స్వామికి అన్నపూర్ణా సహిత విశ్వేశ్వరునకంకితమిత్తు’నని మనవి చేసికొనియుండిరి. వారు దయతో నంగీకరించిరి. శ్రీరామచంద్ర మూర్తియు విశ్వేశ్వరస్వామియు వారికాయుర్దాయము నొసంగి వారిచే శ్రీమద్రామాయణ కల్పవృక్షము వ్రాయించుకొనిరి.”[39]

విశ్వనాథగారి కప్పటికే వివాహం జరిగింది. వారి సతీమణి వరలక్ష్మమ్మగారు. ఆమె కూచిబొట్లు సీతారామశాస్త్రిగారి ప్రథమ పుత్రిక.

హిందూ హైస్కూలులో చెళ్ళపిళ్ళ వెంకట శాస్త్రిగారు తెలుగు పండితులుగా ఉండేవారు. పింగళి, కాటూరి కవులు విశ్వనాథ వారికి సహాధ్యాయులు.

ఆంగ్ల విద్యా ప్రావీణ్యంతో పుత్రుడు ఉద్యోగం చేయాలన్నది శోభనాద్రి గారి కోరిక. గురువుల అనుగ్రహంతో విశ్వనాథ వారికి చక్కటి కవితలల్లటం అబ్బింది. హైస్కూలు విద్య పూర్తయ్యాక నోబుల్ కళాశాలలో ఎఫ్.ఏ. (1916) పూర్తి చేశారు. నోబుల్ కళాశాలలోనే బి.ఏ.లో ప్రవేశించారు. మూడు నాలుగుసార్లు తప్పారు. ఆ సమయంలోనే సంస్కృతాంగ్ల భాషల్లో పట్టు సంపాదించే అవకాశం దక్కింది.

బి.ఏ. తప్పడంతో ఆర్థిక ఇబ్బందులను తట్టుకొనేందుకు నోబుల్ కాలేజీలోనే ట్యూటర్‌గా పనిచేయాల్సి వచ్చింది. ఆ సమయంలోనే భారతీస్వాములుగా పేరుగాంచిన కానుకొలను త్రివిక్రమరావుగారి యొద్ద కౌముదిని, బందరులోని కంభంపాటి రామమూర్తి శాస్త్రిగారి వద్ద సంస్కృత వ్యాకరణమూ, శ్రీ పరిమి నరసింహశాస్త్రుల వారి వద్ద సూత్రభాష్యాన్ని అభ్యసించారు. వాటితోపాటు ఆంగ్ల భాషా అధ్యయనం అతడి దినచర్యలో ఒక భాగంగా మారింది. ఆ తరువాత కొంతకాలం నిరుద్యోగ సమస్యను ఎదుర్కోక తప్పలేదు. తరువాత కొంత కాలానికి బందరులో జాతీయకళాశాల స్థాపించాక 1921-26ల మధ్య తెలుగు పండితులుగా పనిచేశారు. ఆ సమయంలోనే కవిగా వారి జీవితం ప్రారంభమైంది. ఆ సమయంలో స్వతంత్ర్య పోరాటం ముమ్మరంగా సాగుతుంది. విశ్వనాథగారు ఆంధ్రప్రశస్తి, కిన్నెరసాని పాటలు, గిరికుమారుని ప్రేమగీతాలు, నర్తనశాల నాటకం మొదలైన రచనలు చేశారు. కాలగర్భంలో ఇంకిపోయిన ఎన్నో చారిత్రక వాస్తవాలని వెలికితీసి ఆంధ్రప్రశస్తి రూపంలో విశ్వనాథ సత్యనారాయణగారు శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మగారికి అంకితమివ్వడాన్ని బట్టి అతడిలోని విజ్ఞత స్పష్టమౌతుంది. సాహితీ సమితి సభ్యులుగా శ్రీకోలవెన్ను రామకోటేశ్వరరావుగారితో కలసి 'జయంతి' అనే ద్వైమాసిక పత్రికా సంపాదకులుగా కూడా పనిచేశారు. 1921లో మొదటి సంతానంగా అచ్చుత దేవరాయలు జన్మించారు. తరువాత వారికి ఇద్దరు కుమార్తెలు జన్మించారు. 1927లో బి.ఏ. పాసవడం, తండ్రి శోభనాద్రిగారు మరణించడం జరిగాయి. ఆ తరువాత రెండేళ్ళలో ఎం.ఏ. పూర్తిచేసి బందరు హిందూ కళాశాలలో 1931 వరకూ, గుంటూరు ఏ.సి. కాలేజీలో 1933 వరకూ ఆంధ్రోపన్యాసకులుగా పనిచేశారు. 1932లో వారి సతీమణి వరలక్ష్మమ్మగారు మరణించారు. 1933 నుండీ 1938 వరకు నిరుద్యోగంతో బాధపడుతూ ఆంధ్రదేశమంతా కవిగా, ఉపన్యాసకుడుగా, విమర్శకుడుగా ఖ్యాతి గడించడం జరిగింది.

1934లో 'వేయిపడగలు' నవల రచించి అడవి బాపిరాజుగారి 'నారాయణరావు' నవలతో పాటు ఆంధ్ర విశ్వకళా పరిషత్తు వారి బహుమతిని అందుకొన్నారు. ఆ సంవత్సరంలోనే రామాయణ కల్పవృక్ష కావ్యాన్ని రాయడం ప్రారంభించారు. బందరులో ఒక సాహిత్య సమాజం వారు సన్మాన సభను ఏర్పాటు చేసి, ఆ సభలో 'కవిసమ్రాట్' బిరుదు ఇచ్చారు. 1938లో విశ్వనాథ వారికి రెండవ వివాహం జరిగింది. ఆమెను కూడా విశ్వనాథవారు వరలక్ష్మమ్మగారి పేరుతోనే పిలిచేవారు. ఆమెకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె జన్మించారు. రెండవ వివాహం విశ్వనాథ వారికి అన్నివిధాలా కలిసొచ్చింది. కానీ ఓ బాధాకరమైన సంఘటన ఏమిటంటే వారి కుమారుడైన రామచంద్రుడు మరణించడం, ఆ సంఘటన విశ్వనాథ వారికి వైరాగ్యభావాలు కలగడానికి కారణమైంది.

వారి సాహిత్య నేపథ్యానికి సంబంధించి అందులోనూ నాటక ప్రక్రియకు సంబంధించిన విషయాలు ప్రస్తావించవలసి వచ్చినప్పుడు వారు అంతకు ముందే రాసిన నాటకాలు ఏంటో తెలుసుకోవాలి.

"1918లోనే ధన్యకైలాసం, 1920లో సౌప్తిక ప్రళయం, అవతార పరివర్తనం, 1924లో నర్తనశాల, 1924-25 అనార్కలి, 1933-34లో 'వేనరాజు' 1935లో తల్లి కాని పిల్ల, 1937లో త్రిశూలం రచించడం జరిగింది."[40]

1938వ సంవత్సరంలో బెజవాడగా పేరు గడించిన విజయవాడలో ఉన్న సి.వి.ఆర్ కళాశాలలో ఆంధ్రోపన్యాసకులుగా నియమించబడి 1957 వరకు సమర్ధవంతంగా నిర్వహించారు. నవ్యసాహిత్య పరిషత్తుకు 1940లో అధ్యక్షత వహించారు.

వారికి గుడివాడలో 1942లో గజారోహణోత్సవం జరిగింది. రామాయణమే కాకుండా ఖండకావ్యాలు, నవలలు, రేడియో నాటికలు, మరెన్నో విమర్శలు పుంఖాను పుంఖాలుగా రాసి సాహిత్య ప్రక్రియలన్నింటిలోనూ స్రష్టలయ్యారు. గుడివాడలోనూ, కరీంనగర్‌లోను 1956లో షష్టిపూర్తి మహోత్సవం మహాద్భుతంగా జరిగింది. 1957లో ఉద్యోగ విరమణ చేయడం జరిగింది. ఆ తరువాత కొన్ని ఏళ్ళకు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ఉపాధ్యక్షుడుగా మే 1985లో నియమించబడ్డారు. అంతేకాక అప్పటి ప్రభుత్వం చేత శాసనమండలి సభ్యులుగా నియమించబడ్డారు. దానికి రాజీనామ చేసి కరీంనగర్ కళాశాలకు అధ్యక్షులయ్యారు. రామాయణ కల్పవృక్షాన్ని 1962లో పూర్తి చేసి 'కవిసమ్రాట్' బిరుదుకు సార్థకత దక్కించుకున్నారు. ఆ మధ్యకాలంలో "1946, 48లలో కావ్య వేద హరిశ్చంద్రములు,

1951 'అంతా నాటకమే', ఆకాశరాజు, 1957లో ప్రవాహం, 1963లో భస్మాసుర చయనం, లోపల-బయట, 1964లో సత్యాగ్రహం అనే నాటకాలు రచించారు."[41]

అంతటి ప్రతిభామూర్తిని ఎన్నో సత్కారాలు వరించడం ఎంతో గర్వకారణం. వారిని వరించిన సత్కారాలు 1963 విశ్వనాథ మధ్యాక్కరలకు కేంద్ర సాహిత్య అకాడమీ పారితోషికం లభించింది. కలకత్తా నగరంలో పుష్పకిరీట సన్మానము జరిగింది. 1965లో ఆంధ్ర విశ్వకళా పరిషత్తువారు కళాప్రపూర్ణ బిరుదుతో సత్కరించారు. 1970లో కేంద్రప్రభుత్వం 'పద్మభూషణ' ఇచ్చి సత్కరించింది. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం వారు గౌరవ డాక్టరేటుతో సత్కరించారు. కేంద్ర సాహిత్య అకాడమీ వారి ఫెలోషిప్ వారికి దక్కింది. 1967లో అఖిలభారత వంగరచయితల మహాసభ వారి అవార్డు లభించింది. గౌ॥ శ్రీ పి.వి. నరసింహారావుగారు విశ్వనాథ వారి 'వేయి పడగలు' నవలను 1970లో హిందీలోకి తర్జుమా చేసి తెలుగేతర భాష వారికి కూడా తెలుగుదనాన్ని చవి చూపించడం జరిగింది. 1971వ సంవత్సరాన్ని విశ్వనాథ సత్యనారాయణ గారి జీవితంలో స్వర్ణమయం అని చెప్పాలి. ఎందుకంటే వారి సాహితీ మూర్తిని అదృష్టదేవత వరించింది. వారికి జ్ఞానపీఠ అవార్డు లభించింది. ఆ అవార్డుతోపాటు లక్షరూపాయల నగదు కూడా దక్కింది. 1971లోనే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారిని ఆస్థానకవిగా నియమించింది. జ్ఞానపీఠ అవార్డుతో దక్కిన డబ్బుతో నందమూరులోని విశ్వేశ్వర దేవాలయాన్ని బాగు చేయించి ధ్వజస్తంభం ఎత్తించి మూడురోజులు మహోత్సవాలు జరిపించారు.

తన రచనా శక్తితో తెలుగు సాహిత్య ప్రక్రియలన్నింటినీ శాసించిన కవిసమ్రాట్ తన చివరి దశలో కూడా జపయోగాభ్యాసాలతో పాటు అనర్గళంగా రచనా వ్యాసాంగాలను కొనసాగిస్తూనే ఉన్నారు. అంతేకాకుండా చిన్నతనంలో హరి నాగభూషణం గారి వలన అలాగే హిందూస్థానీ సంగీతంలో అసామాన్యులుగా పేరు గడించిన నారాయణరావుగారి పరిచయం మూలంగా విశ్వనాథ సత్యనారాయణగారిలో సంగీతంపై మక్కువ పెరిగి అందులో కూడా తన ప్రతిభను కనబరిచారు. కరీంనగర్‌లో ఉద్యోగ విరమణ చేసిన తరువాత విజయవాడ తిరిగి వచ్చారు. తన ఎనభై రెండేయేట 1976 సెప్టెంబర్ 14, 15 తారీఖుల్లో స్వగృహంలోనే "విశ్వనాథ వారికి సహస్ర చంద్రదర్శన శాంతి పోష్టికోత్సవం మిత్రులు, అభిమానులు, శిష్యులు కొనసాగించగా యధావిధిగా జరిగింది."

తరువాత కొన్ని నెలలు మాత్రమే వారు జీవించారు. హృద్రోగంతో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో దైవధ్యానంతో అక్టోబర్ 18, 1976న స్వర్గస్తులయ్యారు. కవి నిష్క్రమించడంలో

సాహిత్య లోకంలో పెనుచీకట్లు అలముకున్నాయి. పండిత లోకాన్ని దుఃఖం కమ్మేసింది. ఆ మహాకవి కటిక దారిద్ర్యాన్నే కాక అష్టైశ్వర్యాలు చవిచూచి చివరకు శివైఖ్యం పొందారు.

## 3.10 విశ్వనాథ కథలపై సంస్కరణోద్యమ ప్రభావం

విశ్వనాథ సత్యనారాయణగారి వారసులైన విశ్వనాథ పావనిశాస్త్రిగారు అందుబాటులోకి తీసికొచ్చిన "విశ్వనాథ సత్యనారాయణ చిన్నకథలు" కథా సంపుటిలో మొత్తం 30 కథలున్నాయి. ఇంకా సంపుటిలో చేర్చవలసినవి వియోగిని, పరివర్తనము, ప్రతీక్ష, కలాలీలు. ఇవి లభించలేదు. ప్రస్తుతం ఉన్న 30 కథల్లో సంస్కరణా భావాలు గల కథలు ఐదు ఉన్నట్లుగా నేను గ్రహించాను. వాటిని నా పరిశోధనా గ్రంథంలో చేర్చుకోవడం జరిగింది. అవి 1. పరిపూర్తి, 2. తిరోధానము, 3. ద్విజాత, 4. కపర్ధి, 5. మాక్లీ దుర్గంలో కుక్క.

### 1. పరిపూర్తి

అందత్వంతో అవస్త పడుతూ అయినవారితోనూ, బయటవారితోనూ అగచాట్లు ఎదుర్కొంటున్న యువతి చివరకు తన జీవితాన్ని ఎలా పరిపూర్ణం చేసుకొందో తెలిపే కథే ఈ 'పరిపూర్తి.'

**'పరిపూర్తి' కథ సంక్షిప్త పరిచయం :**

ఇరవై రెండేళ్ళ వయసుగల చంద్రశేఖరరావు బి.ఏ. పాసవుతాడు. అతడు సంపన్నుడైన వేంకటరత్నము, మహాలక్ష్మమ్మగార్లకు ఏకైక సంతానం. అతడు అందగాడు మాత్రమే కాదు విద్యాధికుడు కూడా. అంతేకాదు పరిణితి బుద్ధి కలవాడు కూడా. అతడు మెట్రిక్యులేషన్ చదివేటప్పుడే సంబంధాల మీద సంబంధాలు వచ్చాయి. అయినా అంగీకరించక బి.ఏ. పూర్తయితేగాని పెళ్ళి చేసుకోనంటాడు. తల్లితండ్రులు చేసేది లేక అతని అభిప్రాయాన్ని అంగీకరిస్తారు.

ఎఫ్.ఏ. పరీక్ష పూర్తయిన తరువాత డిప్యూటీ కలెక్టర్ సంబంధం వస్తే అతనితో చదువుకున్న రామారావు, తల్లితండ్రులు బలవంతం పెట్టినా అంగీకరించక "నాన్నగారూ! ఆయన పిల్లను నాకిస్తున్నాడా!! నా ఆస్తికి నా చదువుకి యిస్తున్నాడు. మన యాస్తి మీద నాకేమియు హక్కు లేదనుకొనుడు. నాకు తన కూతురునిస్తాడా? తాను నాలుగు వేలిచ్చునాయెను. నెలకు నలుబది రూపాయలు వడ్డీ. ఏ బీద కుఱ్ఱవానినైన, చక్కని తెలివిగల వానిని చూచి యియ్యరాదూ? వాడు హాయిగా సుఖమనుభవిస్తాడుగా (పరిపూర్తి)!" అంటాడు.

ఒకరోజు చంద్రశేఖర్‌రావు ఏదో పనిమీద ఒక పల్లెటూరుకు వెళ్ళగా అక్కడ ఉన్న స్నేహితుడు చంద్రశేఖరరావును భోజనానికి ఇంటికి ఆహ్వానిస్తాడు. చంద్రశేఖరరావు మిత్రుడు స్కూల్ ఫైనల్ పూర్తి చేసి ఉద్యోగము దొరకక ఖాళీగా ఉంటాడు. భోజనం ముగిశాక చంద్రశేఖరరావు బయట అరుగు మీద విశ్రాంతి తీసుకుంటుంటాడు. అతడి మిత్రుడెక్కడికో వెళతాడు. కొంతసేపటికి ఇంట్లో నుండీ "గుడ్డి మొద్దువు. నీ మూలముగానే మా దుంప తెగుతోంది. నిన్నెవడు పెళ్ళి చేసుకుంటాడు! పగలు చూస్తే రాత్రిళ్ళు కలలోకి వస్తావు" అంటూ ఏవేవో వినబడుతుంటాయి. కొంతసేపటికి గుడ్డిపిల్ల యేడుస్తూ వచ్చి రెండెవ యరుగు మీద కూర్చుని ఇలా అనుకొంటుంటుంది."నేను బ్రతికెందుకు, చచ్చెందుకు? నాకు చావైనా రాదాయేను! పీడవదలి పోవును. అవును, నా మూలముగా వాండ్రందఱికి కష్టముగానున్నమాట నిజమే! గ్రుడ్డిదానను గాన నన్నెవరు పెండ్లి చేసుకోరారట! వచ్చినా నన్ను చూచి వెళ్ళిపోతారట! రోజును నాకింట్లో యీ దీపారాధనలు తప్పుట లేదు" అంటూ వలవల యేడుస్తూంటుంది.

ఆమె బాగా నల్లగా ఉంటుంది. వయసు పన్నెండు సంవత్సరాలు. ఆమె తల వెంట్రుకలు సంస్కారము లేక జడలు కట్టి ఉంటాయి. ఎవరైనా పెండ్లిచూపులకు వస్తున్నారన్నప్పుడు మాత్రం వాళ్ళమ్మ రెండు మూడు సార్లు దువ్వుంటుందేమో. ఆమె వంటి మీద బంగారం లేదు. కాళ్ళకు సత్తు కడియాలు, చేతులకు ఇత్తడి మురుగులతో ఆమె ఆకారం చూడడానికి ఉప్పరి పిల్లలా వుంటుంది. కాని యామె ముఖాన బ్రాహ్మణజాతి ముద్ర లేకపోలేదు. పాపం! ఆమెను ఆమె తల్లి ఒక్కటే కాదు ఊరిలో వాళ్ళు కూడా తిడుతుంటారు. కొందరు కొంటే పిల్లలు కొడుతుంటారు కూడా.

చంద్రశేఖరరావు ఆమెను నిలువెల్లా పరీక్షిస్తాడు. ఆమెను 'అమ్మాయి! నీపేరేమి' అని ప్రశ్నిస్తాడు. ఆమె సిగ్గుపడుతూ 'రాధ' అంటుంది. అతని అందం, చదువు, యోగ్యతల గురించి శంకరరావు తన తల్లితో చెప్పునప్పుడు విన్న మాటలు గుర్తొచ్చి సిగ్గుతో ఇంట్లోకి వెళుతుంది.

ఇంటికి వెళ్ళిన చంద్రశేఖరరావు భోజనాల సమయంలో శంకర్రావు చెల్లి రాధను గురించి తల్లితండ్రులకు చెప్తాడు. అప్పుడతడి తల్లి దౌర్భాగ్యులెంతోమంది ఉంటారు అంటుంది. చంద్రశేఖరరావు, ఆ అమ్మాయి కెక్కడనయినా మంచి సంబంధము కుదిరితే? అన్నప్పుడు తల్లి ఎలా కుదురుతుందంటుంది? అందుకు చంద్రశేఖరరావు, డబ్బుగల వాళ్ళెవరయినా చేసుకోకూడదా? ధనవంతులకు కట్నాలు కావలెననే కోరిక ఎక్కువగా

ఉంటది గాని, ఎందుకు డబ్బు? ఉన్నది చాలదా! చేసుకుంటే బాగానే యుంటుంది. పేదవాళ్ళయితే బ్రాహ్మణులు కారా? అనే అభిప్రాయాన్ని వెలిబుచ్చినప్పుడు ఆ తల్లి గ్రుడ్డి పిల్లంటున్నావు కదా అంటుంది. అందుకు చంద్రశేఖరరావు, "మరి గ్రుడ్డిపిల్లయితే ఏం? సర్వాంగ సుందరిని అందరు చేసుకుంటారు, ఇవ్వాలి గాని! ఇటువంటి వాళ్ళను చేసుకుంటేనే మంచివాళ్ళు కావడం" అంటాడు. తల్లి "అంత మంచి వాళ్ళుండొద్దు నాయనా! ప్రపంచములో?" అన్నది. చంద్రశేఖరరావు "నేను చేసుకుంటానయితే; అంత మంచి వాళ్ళుండటం దుర్లభమని నువ్వే అంటున్నావు కదా." అంటూ తన ఆలోచనని ఆచరణలో పెడతాడు. రాధా, చంద్రశేఖరరావుల వివాహం జరుగుతుంది.

కొన్నాళ్ళకు రాధకు సుఖప్రసవమవుతుంది. పురుష సంతానము. ఈ మాట విన్న వెంటనే జన్మ సఫలమైందనుకుంటుంది.

రాధ తన బిడ్డను ఒకరోజు భర్తకు అందిస్తుంది.

"**రాధ** : అబ్బాయి యెట్లున్నాడు?

**చంద్ర** : మూడు మూర్తుల నీవే.

**రాధ** : అబ్బాయి కళ్లో? అచ్చముగా మీ కళ్ళవలెనే యున్నవటగా? అందరు చెప్పుచున్నారు.

**చంద్ర** : అబ్బాయి, నీకు కళ్ళు వచ్చినట్లున్నాడు (పరిపూర్తి)."

**కథా ఉద్దేశ్యం :**

వైకల్యాలు దురదృష్టవశాత్తు పొరపాటునో, గ్రహపాటునో కొందరికి సంభవిస్తాయి. దీనిని వైఫల్యంగా భావించకూడదు. వైఫల్యాలు ఎక్కువమందిలో ఉంటాయని తెలియజేయడం దీని ఉద్దేశ్యం.

**'పరిపూర్తి' కథ పై సంస్కరణోద్యమ ప్రభావం :**

ఈ కథలో కనిపించిన చంద్రశేఖరరావు పాత్ర వంటి మనస్తత్వం గల వ్యక్తులు సమాజంలో చాలా తక్కువమంది వుంటారు. అటువంటి మనస్తత్వం, ఆలోచన కలిగిన మనుషులు నేడు సమాజానికి చాలా అవసరం. వైకల్యాన్ని ఎవరూ కోరుకోరు. దురదృష్టవశాత్తు ఏదో ఒక రూపేనా సంభవించినా చంద్రశేఖరరావులా చేయూతనిస్తే అన్నివిధాలుగా రాణిస్తారు. ఆ రోజుల్లోనే కాదు ఈరోజుల్లో కూడా రెండు, మూడు పెళ్ళిళు ్ళ చేసుకోడానికి సిద్ధపడిన వ్యక్తులున్నారు. కాని అంధత్వంతో అవస్తపడే వారికి కొత్త జీవితాన్ని ఇవ్వడానికి ముందుకొచ్చేవారు చాలా తక్కువ. కానీ కథలో విశ్వనాథ సత్యనారాయణగారు

అందగాడైన చంద్రశేఖరరావు ద్వారా గుడ్డిపిల్ల రాధకు కొత్త జీవితాన్ని ఇచ్చినట్లు చిత్రించి తనలోని సంస్కరణా భావాన్ని ప్రకటించారు. కనుక 'పరిపూర్తి' కథపై సంస్కరణోద్యమ ప్రభావం బలంగా పనిచేసిందని చెప్పొచ్చు.

## 2. తిరోధానము

ఈ కథ వితంతు పునర్వివాహాన్ని సమర్థించేది. ఆకస్మికంగా వైధవ్యం సంభవించిన ఓ వితంతు యువతి వైధవ్యానికి ముందు జీవితంలో చవిచూసిన జ్ఞాపకాలను ఎలా మర్చిపోగలిగిందో తెలియజేసే కథే తిరోధానము.

**'తిరోధానము' కథ సంక్షిప్త పరిచయం :**

మహాశ్వేత సహజంగానే అత్యంత లావణ్యవతి. ఆమెకు ఎందువల్లనో నగలన్నా, కృత్రిమ ఆభరణాలన్నా ఇష్టం ఉండదు. ఎటువంటి ఆభరణాలు లేకపోయినా సుందరిగా కనిపించే ఆమెను చూసి లోకం అమంగళకర వాక్యాలు పలుకుతుంది. పాపం! ఆమెకు అవి తగిలాయేమో అన్నట్లు విధవవుతుంది.

ఆమె భర్త పేరు నీలాలోచనుడు. నీలలోచనుడు బ్రతికి ఉన్నప్పుడు ఎలా ఉండేదో, చనిపోయిన తరువాత కూడా ఒకేలా మహాశ్వేత కనిపిస్తుండేది. కారణం 'సౌమంగల్యం కాన్నా వైధవ్యం కన్నా విభిన్నమైన లక్షణం ఆమె ముఖంలో కనబడుతుండేది.' మహాశ్వేతకు కృత్రిమ అలంకారాలంటే ఎంత యావగింపో ఆమె భర్తకు మాత్రం ఆ అలంకారాల పట్ల అంతగా ఆసక్తి. అతడు బ్రతికి ఉన్నప్పుడు ఎన్నో చీరలు కొంటాడు, లెక్కలేనన్ని నగలు చేయిస్తాడు. అవన్నీ పెట్టెలో మూలుగుతుంటాయి. నీలలోచనుడికి మహాశ్వేతను నిరలంకారంగా చూడడం ఇష్టం లేక బలవంతాన రంగు చీర కట్టించి, నగలన్నీ పెట్టించేవాడు. అతడు బయటకెళ్ళగానే మహాశ్వేత అవన్నీ తీసివేసి తనకు నచ్చినట్లు ఉండేది. ఇద్దరూ విరుద్ధభావాలు కలవారు. 'ఆమెకి మల్లెపువ్వులంటే ఇష్టం. అతడికి మందార పుష్పమంటే అభిమానం.' అలా వేరువేరుగా ఉండే ఇష్టాలు ఎప్పుడూ ఎక్కడా కలిసేవికావు.

పదిహేడు సంవత్సరాలు వచ్చేసరికి నీలలోచనుడు చనిపోవడంతో మహాశ్వేత జీవితం ఒక సంవత్సరం దాకా ప్రశాంతమైన గంభీర నదిలాగా ప్రవహిస్తుండేది.

శ్వేత ఒకరోజు పూలతోటలోకి వెళ్తుంది అక్కడ నీలలోచనుడు రెండు సంవత్సరాల క్రితం నాటిన మందారవృక్షం చూస్తుంది. ఇప్పటికీ అది పూలు పూసి ఉంటుంది. దానిని నీలలోచనుడు శ్వేత "ఆలోచనలు మార్చడానికా" అన్నట్లు నాటుతాడు. కానీ శ్వేత ఎర్రని

పూలను చూసి వణికిపోతుంది. వెంటనే కళ్ళు మూసుకుంటుంది. ఆ సమయంలో నీలలోచనుడు కనిపిస్తాడు. తననే చూస్తూ ఉండిన నీలలోచనుని చూడలేక మరల కళ్ళు తెరిచేసిరికి ఎదుట మందారవృక్షం, పక్కన లేడిపిల్ల కనిపిస్తాయి. భారమైన మనసుతో పడకగదిలోకి వెళ్ళి మంచంమీద పడుకుంటుంది. భయమేస్తుంది. ఆమెకు ఏమీ తోచదు. లేచి బీరువాలో ఉన్న నీలలోచనుడు కొన్న ఎర్ర చీరను కట్టుకుంటుంది. శ్వేతను ఆమె తల్లి చూసి నివ్వెరపోతుంది. ఆ చూపు నీలలోచనుడు చూపు లాగే అనిపిస్తుంది మహాశ్వేతకు. తెలియకుండానే నిద్రపోతుంది. నిద్రనుంచీ మేలుకోనే సరికి ఆమె అభిప్రాయాల్లో మార్పులు వస్తాయి. ఆరోజు నుంచీ రంగుచీరలు తప్ప వేరేవాటిని కట్టుకోదు. నగలన్నీ పెట్టుకునేది. తెల్లచీర కట్టుకుంటే ఏ కొండో విరిగి మీద పడుతున్నట్లు ఉండేది. ఈ మార్పులన్నీ వచ్చేసరికి శ్వేతకు 18 సంవత్సరాలు.

ఒకరోజు తలస్నానం చేసి “సర్వావయవముల యందు మనోజ్ఞ భూషణములు తళతళలాడు సంజయెఱుపు బంగరు పువ్వుల బనారసు చీరకట్టి తోటలోనున్న చలువరాతిపై తల విరియ బోసికొని యారబెట్టుకొనుచున్నది. అప్పటియామె యా సౌకుమార్యమును ఆనందమును ఆ దృగంత విన్యాస వైఖరులను జూచినవారి కామె వాసకసజ్జికవలె దోచును (తిరోధానము)” అన్నట్లుంటుంది.

ఇంటిలో మహాశ్వేత అన్న అయిన మధుకాంతుడి స్నేహితుడు రాధారాం వస్తాడు. అతనిని చూసి శ్వేత ఉలికిపడి చీర సర్దుకొని అరుగుమీద నుండి లేచి వెళ్తుంది. ఆమె అందం అతనిని సమ్మోహనపరుస్తుంది. “రాధారాం తత్త్వజ్ఞాన సభవాడు. ఇంతవరకు బ్రహ్మచారి.”

శ్వేత తాను నాటిన మందారానికి తోటమాలి నీళ్ళు పోశాడోలేదోనని తోటలోకి వెళ్తుంది. పాదులో పోసిన నీళ్ళు మందార వృక్షం పీల్చుకొన్నట్లున్నా దాని చిగుళ్లన్నింటిని లేడిపిల్ల కొరికి తింటుంది. విసుగుతో అరుగుమీద కూర్చుందామనుకొనేసరికి తెల్లగులాబి పూలు కనిపిస్తాయి. మరల తన పడక గదిలో కూడా కనిపిస్తాయి. వాటిని పక్కన పెట్టి ఏదో చదువుదామనుకొనేసరికి విసుగు వచ్చి కళ్ళు మూసుకుంటే నీలలోచనుని ముఖం తేజోవిహీనంగా కనబడుతుంది.

రాధారాం సంపాదకత్వం వహిస్తున్న పత్రిక మధుకాంతుని పేరుతో ఇంటికి వస్తే శ్వేత దానిని తీసుకుంటుంది. శ్వేత నాటిన మందారవృక్షం లేడిపిల్ల పిలకలు కొరకడంతో అది చనిపోతుంది. తరువాత మూడు సంవత్సరాల క్రితం నీలలోచనుడు నాటిన మందార

వృక్షం దగ్గరికి వెళ్తుంది. అది శిశిర ఋతువు. మందారం ఇంకా కొంచెం పూస్తూనే ఉంటుంది. కళ్ళు మూసుకుంటే నీలలోచనుడు దూరంగా పోతున్నట్లుంటుంది. వెనుక ఎవరో పట్టుకున్నట్లుంటుంది, చూస్తే లేడిపిల్ల. దానిని కౌగిలించుకుంటుంది.

రాధారాం దగ్గరనుండి తరుచుగా ఉత్తరాలు రావడంతో శ్వేతలో ఏదో మార్పు చోటు చేసుకుంటుంది. అది ఒక్కసారిగా కాక క్రమక్రమంగానే బాగానే తెలిసింది. శ్వేత నిండుగా ఉండే రంగు చీరలు కట్టడం మానేస్తుంది. లేతరంగు చీరలు కట్టడం మొదలుపెడుతుంది. ముందు కన్నా ఇప్పుడు ఆమె ముఖంలో ఏదో ఉత్సాహం కనిపిస్తున్నట్లుంటుంది. "ఆమె సౌందర్యం మంతకంతకు తెల్లుపూవువలె, మొగలి పుప్పొడి వలె, తెల్లని యేకువలె, నొండు విఱిగిపోయి కాలువవలె, మల్లెపూవువలె నిగనిగలై సొగసు మీరుచున్నది. చకితములైన యామె లోచనములు అంతకంతకు నిశ్చలములగుచున్నవి (తిరోధానము)."

శిశిర ఋతువు పోవడం వలన మందారం పూయదు. మల్లెతీగ విరబూస్తుంది. తోటలో తాను రాసిన ఉత్తరం చదువుతూ ఉన్న శ్వేతను రాధారాం చూస్తాడు. ఇద్దరూ కౌగలించుకుంటారు. ఆరోజు శ్వేత చాలా సహజ సుందరంగా అలంకరించుకోవడం చూసి అలాగే తన పెళ్ళిలో కూడా ఉండాలని రాధారం అడుగుతాడు. ఆమె సిగ్గుతో కళ్ళు మూసుకుంటుంది. అప్పుడు ఆమెకు నీలలోచనుడు కనబడలేదు. పది నిమిషాలలో వందసార్లు మూసిన నీలలోచనుడు కనబడలేదు. జీవితాంతం వరకు కూడా ఆ నీలలోచనుని రూపం కనిపించలేదు.

**కథా ఉద్దేశ్యం :**

స్త్రీలకు వైధవ్యం అనేది చెప్పిరాదు. దురదృష్టవశాత్తు సంభవించినా కృంగిపోకుండా జీవితాన్ని ముందుకు సాగించాలన్నది కథా ఉద్దేశ్యం.

**'తిరోధానము' కథ పై సంస్కరణోద్యమ ప్రభావం :**

తిరోధానము కథలో బాల వితంతువైన మహాశ్వేత తాను వితంతువైపోయినందుకు చింతిస్తూ ఉండిపోక గత స్మృతులను మర్చిపోయేందుకు ప్రయత్నిస్తూ తన జీవితాన్ని తిరిగి చక్కదిద్దుకొనే ప్రయత్నం చేస్తుంది. ఇది హర్షించదగ్గ విషయం. వితంతు సమస్య రూపుమాపబడాలంటే పునర్వివాహాలు జరగాలి. ఈ కథలో రాధారాం అనే తత్త్వజ్ఞాన సభకు చెందిన సంస్కారి మహాశ్వేతకు సన్నిహితుడు కావడం విశేషం. రాధారాం వంటి సంస్కారి చేత మహాశ్వేత వంటి వితంతువుకు కొత్త జీవితం ఇచ్చినట్లు చిత్రించడం జరిగింది. కొత్త

జీవితం ఇవ్వడాన్ని సంస్కరణగా భావించాలి. కథలో సంస్కరణకు రాధారాం పాత్ర ద్వారా రచయిత కృషి చేసినట్లు తెలుస్తుంది కనుక 'తిరోధానము' కథ పై సంస్కరణోద్యమ ప్రభావం బలంగా ఉందని చెప్పాలి.

## 3. ద్విజాత

సినీనటి జీవితాన్ని ప్రతిబింబింపజేసే కథ 'ద్విజాత.' బాల వితంతువు సినిమానటి కాక ముందు ప్రవర్తన ఎలా వుంది, సినిమా నటి అయ్యాక ఎలా ప్రవర్తిస్తుంది తెలిపే కథే ద్విజాత.

**'ద్విజాత' కథ సంక్షిప్త పరిచయం :**

కథలో "నేను" అంటూ ఓ పాత్ర మొదలవుతుంది. ఆ పాత్రకు పేరు లేకపోవడం వలన ఆ "నేను"ను రచయితగా గుర్తించాలి.

ఆమె సినిమా నటి. ఆమెకు కథకుడు "ద్విజాత" అని పేరు పెడతాడు. ఆమె కథ ఏమిటో క్లుప్తంగా తెలియజేస్తాను.

కథకుడు ఒకసారి తన పనుల నిమిత్తం కలకత్తా వెళతాడు. అక్కడ ఒక హోటలులో బస చేస్తాడు. ఆ హోటలు ఎదురు గదిలో ఉన్నవారు కూడా తెలుగు వారేనని పదిరోజుల తరువాత తెలుసుకుంటాడు. వారు తమ చోటుకు కథకున్ని రమ్మని పిలిస్తే వెళతాడు. వారు కథకుని పిలిచిన కారణం వారితో ఎవరో "నేనొక క్రొత్త సినిమా తీయుటకు ప్రయత్నము చేయుచున్నాననియు, తత్ప్రయత్నము కోసము కలకత్తా వెళ్ళితిననియు" చెప్పారట. ఆ సంగతి అతడికి తరువాత తెలుస్తుంది.

కథకుడికి వారు తాంబూలం, కాఫీ ఇస్తారు. ద్విజాత చెల్లెలు ఒక చాప వేసి హార్మోనీ పెట్టె ఉంచుతుంది. ఆమె తండ్రి "మా అమ్మాయి కొంచెము సంగీతము పాడును దయచేసి కొంచెము విందురా?" అని అడగగా, కథకుడు "అయ్యో! అంతకంటే కావలయునా!" అంటాడు.

ద్విజాతిలోని లక్షణాలను "సిగ్గున్నది, లేదు అనగా ప్రమాణముగా నెంత యుండవలయునో అంత యున్నది. ఆమె యవ్వనపు గడప మీదనున్నది. ఆ సంగతి ఆమెకు తెలియును. ఆ తెలిసిన విషయము ఎంతో మర్యాదగా గాపాడుకొనుచున్నది. వినయమేమి, సిగ్గేమి, మర్యాదయేమి, ఉచితమైన నవ్వేమి అన్నియు సమానముగా కొలతకు

తగినట్టున్నవి (ద్విజాత)'' అంటూ వివరిస్తాడు. ద్విజాతకు 14 సంవత్సరాలకు తక్కువేమీ ఉండవు.

ద్విజాత ముఖం గుండ్రంగా వుండి శీలవంతురాలివలె కనిపిస్తుంటుంది. చక్కని శరీర ఛాయ కలిగి వుంటుంది. ఆమె చేసే పనులను ''ఎంత సంసారి లక్షణము! ఎంత యుత్తమ నాయికా పద్ధతి'' అని కథకుడు వర్ణిస్తాడు.

ఆమె తండ్రి కథకుడితో ''ఈమె నా కుమార్తె. ఏదైనా సినిమాలో నీమె చేతనభినయింప చేయవలెనని నాకోరిక. తమరు మా కట్టి సహాయము చేసి పెట్టేదరేమోనని యాశ పడుచున్నాను. పేదవారము. ఈమెకు చిన్నతనములోననే భర్తపోయెను (ద్విజాత).'' అని చెప్పగా, కథకుడు ''సరి ! విచారించెదను'' అంటాడు. కాని ఆమెను నాయికను చేసి సినిమా తీయగత దర్శకుడున్నాడా అనేదే కథకుడి ఆలోచన.

సంవత్సరం తరువాత కథకుడి ఊరికి ఒక చిత్రం వస్తుంది. దానిలో నాయిక ద్విజాత. ద్విజాతలో సహజంగా ఉన్న గుణాలకు తగిన పాత్ర అది. రెండు నెలలలో సంగీతం, అభినయం వల్ల ఆమె పేరు దేశమంత మారు మోగిపోతుంది.

ఒక్కొ సినిమాకి ద్విజాత వెయ్యి రూపాయలు తీసుకుంటుందని, మరి కొన్నాళ్ళకి ఆమె సొంత కంపెనీ పెట్టిందనీ, స్వంతంగానే సినిమాలు తీస్తుందని కథకుడు వింటాడు. అంతగా ఎదుగుతుంది ద్విజాత.

రెండు మూడు సంవత్సరాల క్రితం ఆమె నటించిన సినిమాను చూసి కథకుడు అరే! యీమె ద్విజాతా! మూడేళ్ళలో ఇంత మారిందా? ఈమెతో ఈ వేషం ఎందుకు వేయించారు? కామావేశము గల వేషానికి ఈమె తగదే! అందుకనా అంత మధురమైన ప్రకృతి అసముచితముగా వుంది! అనుకుంటాడు.

కొన్ని నెలలకు ముందు కథకుడు ద్విజాత నటించిన మరొక సినిమా చూసి ''ద్విజాతను వర్ణింతునా ..... అర్ధనగ్న! పరమకృత్రిమ! కుటిలా సాంగ! విచిత్ర చంక్రమణ దుష్టకామ భావోద్దీపక శరీరాంగ చాలన (ద్విజాత)!'' అని అంటాడు. కారణం ఆ సినిమాలో 10 సంవత్సరాల కుర్రవాడికి సైతం పచ్చి కామం రేపేంతగా ద్విజాత పాడిన పాట, ఆమె వస్త్రధారణ.

కొన్ని సంవత్సరాల తరువాత కథకుడు, అతడి స్నేహితుడు కలిసి ద్విజాత ఇంటికి వెళతారు. కథకుడు వారు అతన్ని గుర్తుపడతారో లేదో అనే సందేహంతోనే వెళతాడు. ద్విజాతది పెద్ద భవనము, సావడిలో సోఫాలో కూర్చుంటారు. ఆమె వస్తుంది.

"లోన లంగా, పైన పలుచని వేయి కుచ్చెళ్ళు సన్ననివి-కల చీర, బుట్టవలె నున్నది. కనుబొమ్మలు, కనురెప్పలు, చెక్కిళ్ళు, పెదవులు, ముంగురులును, ఫాలము కలియు చోటు సౌందర్య కల్పనావర్ణ పరామృష్టమైయున్నది. ఒక వికారపు నడక, లజ్జగా భావింపచేయవలయునను కొన్న సిగ్గుకాని యొక వెటగైన సిగ్గు (ద్విజాత)"తో వచ్చి వారితో ద్విజాత 'నమస్తే' అంటుంది.

కథకుడు, అతని స్నేహితుడు పది నిమిషాలు మాట్లాడితే, "ఆ నవ్వులు కృత్రిమములు. అట్టి కృత్రిమపు నవ్వులు నవ్వుటకు కూడా అభ్యాసము కావలయును. ఆమె మాట్లాడిన మాటలు మాటాడిన తరహాలో నున్నదో అసలీ కాలములో ఆ మాటలు పుట్టెనో! వాని యందు సహజత్వము లేదు. యధార్థ్యము లేదు. నిజమైన హృదయములేదు. సర్వ వాక్యములు యందును అదేదో నిజముగా తనకు పట్టని అనూహితమైన యొక సాంఘిక భావపు టొత్తిడి వలన కలిగిన వ్యర్థ మర్యాదా భావముగా గోచరించుచున్నది." అంటూ పది సంవత్సరాల క్రితం కలకత్తాలో చూసిన ద్విజాతను గుర్తు చేసుకొనే సరికి వెంటనే మద్రాసులో ఉన్న ద్విజాత గుర్తుకు వస్తుంది. వారు మాట్లాడుతున్నంతసేపు ఒక్క నిమిషం పాటైనా ద్విజాత నిశ్చలంగా కూర్చున్నదే లేదు. అంతగా ద్విజాత మారిపోతుంది.

**కథా ఉద్దేశ్యం :**

మారుతున్న కాలానికి అనుగుణంగా సమాజం మారాలని, సమాజంతో పాటు స్త్రీ మారడంలో తప్పులేదనేది ఉద్దేశ్యం.

**'ద్విజాత' కథ పై సంస్కరణోద్యమ ప్రభావం :**

'ద్విజాత' అంటేనే రెండు రకాల జీవితాలు కలదని అర్థం. ఈ కథలో 'ద్విజాత' సినిమా నటి కాకముందు బాలవితంతువుగా జీవితాన్ని గడిపింది. కొన్నాళ్ళకు సినిమా నటై ఎంతో ఖ్యాతి గడించింది. వితంతులైనంత మాత్రాన ఎదుగుదల కోరుకోరాదని ఏ శాస్త్రం చెప్పలేదు. సమాజమే బాల వితంతువులకు సంకెళ్ళు విధించి, వారిని నరక కూపంలోకి నెట్టేసింది. ఇప్పుడు కాలం మారింది, రోజులూ మారాయి. వితంతువులు సంకెళ్ళు తెంచుకొని స్వేచ్ఛను కోరుకొంటున్నారు. ఆ సంఘటనని ద్విజాత కథలో 'ద్విజాత' పాత్రను బట్టి అర్థం చేసుకోవచ్చు. ఏదేమైతేనేం ప్రస్తుత కథలో రచయిత 'ద్విజాత' పాత్రను వితంతువుగా ఈసరింపులతోనూ కష్టాలతోనూ సాగుతున్నట్లు మాత్రమే చిత్రించకుండా ఆధునికంగా ద్విజాత

ఎలా సినీనటి కాగలిగిందీ, పేరు ప్రఖ్యాతలు పొందగలిగింది చిత్రించి ఎంతోమంది వితంతువులలో చైతన్యాన్ని కలిగించే ప్రయత్నం చేశాడు. చైతన్యమంటే స్ఫూర్తి, కొత్తదనంగా భావించాలి. ఆ చైతన్యానికి ద్విజాత కథలో 'ద్విజాత' పాత్ర ఉదాహరణగా చెప్పదగింది కనుక 'ద్విజాత' కథ పై సంస్కరణోధ్యమ ప్రభావం బలంగా పనిచేసిందని చెప్పాలి.

## 4. కపర్ధి

ఈ కథలో సంఘసంస్కరణోధ్యమంతో పాటు ఆధునిక సమాజంలో చోటు చేసుకొన్న మార్పులే కాకుండా స్వాతంత్ర్యోద్యమాలు ప్రధానంగా కనబడుతాయి. భోగం పిల్ల అయిన మృణాళిని జీవితంలో చోటు చేసుకొన్న ఎన్నో సంఘటనలను కళ్ళకు కట్టినట్లు చూపించగలిగిన కథే కపర్ధి.

**'కపర్ధి' కథ సంక్షిప్త పరిచయం :**

ఈ కపర్ధి కథ "నేను" అంటూ ప్రారంభమవుతుంది. ఆ "నేను"కు పేరు లేనందువలన పాఠకులు రచయితగా గుర్తించాలి. కథకుడికి కపర్ధి రెండు సంవత్సరాలుగా తెలుసు. కపర్ధికి 30 సంవత్సరాల లోపు వయసు ఉంటుంది. వృత్తి న్యాయవాది. ఇంకా తండ్రి నుంచి వచ్చిన ఆస్తి మీద సంవత్సరానికి నాలుగు వేల ఆదాయం. ఆంగ్లం, సంస్కృతాంధ్రా సాహిత్యాల పట్ల మంచి పట్టు కలవాడు. సంగీతము, భరతనాట్యాలలోను అభిరుచి కలవాడు. కపర్ధికి కథకుడు స్నేహితుడే అయినా అంతర్గతంగా మనోభావంలో అతడొక గురువు, నేనొక శిష్యుడను అంటాడు. కపర్ధి కథకుడిని తన ఇంటికి పిలిస్తే "ఇటువంటి మన్మధాకార సంగీత సాహిత్య సరస్వతికి నెట్టి భార్య కలదో? ఆమె యెంత యందకత్తెయో? విద్యావతి కూడనేమో?" అని అనుకుంటాడు. మిత్రుని కోరిక మేరకు ఇంటికి వెళతాడు.

కథకుడు కపర్ధిని ఒక పాట పాడమని, కొంచెం అభినయించమని అడుగుతాడు. కపర్ధి నవ్వి "నేను కాదు! నా కుమారుని చేత నభినయింపించెదను" అంటూ తన కొడుకును పిలుస్తాడు. కపర్ధి తన కొడుకును పిలిచిన పేరు సంస్కృతం కాదు, తెలుగు కాదు. పాశ్చాత్యుల పేరు "రోనాల్డు."

రోనాల్డు ఎర్రని జుత్తు, తెల్లని శరీరం, పిల్లికళ్ళు చూచినంతనే పాశ్చాత్యుల పిల్లవాడిలా ఉంటాడు. ఆ పిల్లవాడిని ఒక మువ్వగోపాల పదం పాడమంటే, పాడుతూ పెద్ద సిగ్గు వచ్చి తండ్రి ఒడిలోకి వెళతాడు.

“ఇతడొక పాశ్చాత్య స్త్రీని వివాహమాడెనా? ఇతడు పాశ్చాత్య దేశములకు వెళ్ళి నట్లెవ్వరును చెప్పలేదు. ఒకవేళ నితని భార్య పాశ్చాత్యాంగనయైనచో నింతసేపు గృహాంతర్భాగమున నేలయుండెను? ఈ పాటికే సావడిలోనికి వచ్చి తద్దేశగృహిణీ మర్యాదలు జరిపియుండును. ఇతని గృహము పూర్తిగా పాశ్చాత్య మర్యాదలతో నిండియుండును. ఈ పిల్లవాడు అప్పుడు తెలుగు మాట్లాడునా? అంతయు నాంగ్లేయములోనే భాషించియుండెను. ఏవో యిట్టి యూహలు వందల వేలుగా వచ్చుచుండెను (కపర్ధి)” అని కథకుడు అనుకుంటాడు.

కపర్ధి కథకుడి మనసు గ్రహించాడో ఏమో అన్నట్లు నవ్వుతాడు. భోజనాలైన తరువాత రాత్రి పదకొండు గంటలకు బయట కుర్చీలో కూర్చొని కథకుడితో ఇలా చెప్పడం మొదలుపెడతాడు. “నాకప్పుడు ఇఱువది రెండేండ్లు. నా తల్లితండ్రులు చిన్న తనములోనే పోయిరి. నా యాస్తిని రక్షించిన ఒక్క మేనమామయు నా యిఱువదవ యేటనే మరణించెను; నేనప్పటికి రెండేండ్ల నుండి నా వ్యవహారములు చూచుకొనుచుంటిని (కపర్ధి)” అంటాడు.

తన మేనమామ బ్రతికిఉండగా పెళ్ళి చేస్తానంటే బి.యే. పరీక్షలయిన తరువాత చేసుకుంటానంటాడు. అప్పటినుండి ఎవరూ కపర్ధిని పెళ్ళి చేసుకోమని అడగలేదు. దానికి కారణం కపర్ధి స్నేహితుడి పెళ్ళికై ఒక పల్లెటూరు వెళతాడు. అక్కడ ‘మృణాళిని’ అను పద్నాలుగు సంవత్సరాల పిల్ల కనబడగా ఆమెవైపే చూస్తూంటాడు. నిద్రపట్టదు.

“అరే! నేనింత తద్వశుడనైపోతిని. ఆమెయు రోయి యింటి బాలిక. ఆమె నాకోసము సౌశీల్యవతియై యుండునా? నేను విటకాడనై యుందునా? ఛీ! ఛీ! ఎంత గాదన్నను నన్ను నేను కాదనుకొన లేకపోతిని.” అనుకుంటూ మృణాళిని వివరాలన్నింటిని సంపాదిస్తాడు.

ఒకరోజు కపర్ధి మృణాళిని ఇంటికి వెళ్తే అందరూ కన్నెరికం కోసం వచ్చాడనుకుంటారు. తరువాత ఒక సంవత్సరం వారిద్దరూ కలిసి ఉంటారు. కపర్ధి పెళ్ళి ఆలోచన తెస్తే ఆమె తల్లి అందుకు ఒప్పుకోక మృణాళినిని దాచి వేసి బంధువుల ఇంటికి వెళ్ళిందని చెప్తుంది. అప్పటికే కపర్ధి బి.ఏ. పరీక్ష అయిపోవడంతో ఆ కోపంలో, దుఃఖంలో మద్రాసు వెళ్ళి “లా” కాలేజీలో చేరుతాడు. పగలు చదువు, రాత్రి మృణాళిని ఊహల్లో రెండు సంవత్సరాలు గడుపుతాడు. ఏదిఏమైనా ఆమె నా భార్య అనుకుంటాడు. చదువు పూర్తి అవ్వగానే సరాసరి మృణాళిని ఊరికే వెళతాడు కపర్ధి. ఆ గ్రామంలోని స్నేహితులు వారి ఇంటికి రమ్మని పిలిచినా అతడు వెళ్ళడు. అందరూ కపర్ధితో “ఓయీ! నీకింకను

దాని మీద యాశ వదలలేదు. దానికేమి? ఆమె యభినయము చూచితీరవలెను" అంటూ భరతశాస్త్రంలో అంతటి ప్రముఖురాలు లేదని, ఎవరు పిలిచినా రాదని, మేళము కట్టదని చెప్తారు. ఇంకొందరు "ఆమె కొక కొడుకట. ఒక దొర పాశ్చాత్యుడు ఆమె నుంచుకొనెనట. ఏడాదిగా నామె కాంగ్రెసులో వాలంటీరుగా చేరెనట. నిత్యము ఖద్దరునే కట్టునట. ఆరు నెలలనుండి క్షయవ్యాధియేమో యనుకొనుచున్నారట" అని చిత్రవిచిత్రాలైన కథలను చెప్తారు.

ఆమెను త్వరగా చూడాలన్న ఆశతో కపర్థి మృణాళిని ఇంటికి వెళతాడు. అక్కడికి మృణాళిని వస్తుంది. కపర్థి ఆమెను చూసి ఆశ్చర్యపోయినా ఆమె మాత్రం సాధారణంగా రెండు సంవత్సరాల క్రితం తనతో ఎలా ప్రవర్తించిందో అలానే ప్రవర్తిస్తుంది. కపర్థి విన్నవన్నీ నిజాలో! అబద్దాలో! తేల్చుకోలేక అయోమయంలో పడతాడు. కపర్థితో వచ్చినవారు మృణాళినిని అభినయించమంటే, ఏమి అభినయించను అని కపర్థి భుజముపై వాలుతుంది. ఆమె శరీరం తనకి తాకగానే తీవ్ర జ్వరం చేత మండిపోతున్నట్లు తెలుస్తుంది. అప్పుడు కపర్థి మృణాళినికి నేర్పిన ఒక కీర్తన పాడమంటాడు. ఆ కీర్తనలోని భావం "తల్లి తన పిల్లను ముద్దాడుట" ఆ అభినయ భారం చేత ఆమె పడిపోతుందేమోనని ఉద్వేగంతో అక్కడినుండి కపర్థి బయటికి వెళ్ళిపోతాడు.

కపర్థి ఆ ఊరికి ఉత్తరంగా నడిచిపోతూ ఉంటే దారిలో ఒక వాగు ఉంటుంది. ఎప్పుడు అది ప్రవహిస్తూనే ఉంటుంది. దానిపై వంతెన ఉండదు. వెనుక ఎవరో వస్తున్నట్లనిపిస్తుంది. చూస్తే మృణాళిని. చంకలో ఒక పిల్లవాడు. వాడికి ఒక సంవత్సరం వయస్సు ఉంటుంది. కపర్థి ఏమీ అడగడు. ఆమె కూడా ఏమీ చెప్పదు. వాళ్ళు వాగు దగ్గరికి వచ్చేసరికి కొంచెం చీకటి పడుతుంది. నీళ్ళు మోకాళ్ళ లోతుంటాయి. దానిలో మృణాళిని నడిస్తే చీర తడుస్తుందని కపర్థి ఆమెను ఎత్తుకొని అవతలికి తీసుకెళ్తుంటే అందరూ వింతగా చూస్తారు. వారు ఒక హోటలులో ఒక గది తీసుకుంటారు. అక్కడ మృణాళినితో "నిన్ను నేనిప్పుడు తీసికొని పోయినచో లోకమేమందురు? నేను వివాహ మాడుటకు నీవిప్పుడు తగిన దానవుకావు. నీవు పోయి నీ తల్లి దగ్గర నుండుము. నేనిట్లే జీవితాంతము నీవే నా భార్యవనుచు, బ్రహ్మచారినైయుందు" అని బయటకు వెళ్ళి భోజనం చేసి వచ్చేసరికి గదిలో ఆమె తల్లి, అప్పగార్లు ఉంటారు. వెంటనే కపర్థి లోపలికి వెళ్ళకుండానే వెనక్కొస్తాడు. తెల్లవార్లు నిద్రపోడు. వారు వెళ్ళి ఉంటారని నమ్మి, మృణాళిని అక్కడినుండి వెళ్ళదన్న చిన్న ఆశతో గదికి వెళతాడు. పిల్లవాడు, మృణాళిని అనుకొన్నట్లు అక్కడే

ఉంటారు. ఆమెతో "నీవు వెళ్ళిపోలేదా" అని అడిగితే సమాధానం చెప్పదు. ఆమెపై ఎంత ప్రేమ కలిగిన ఏదో వెలితి గడ్డిపరకలా అడ్డు వస్తుంది. సాయంత్రం కూడా ఆమె అలానే ఉంటే తీసుకువెళదామనుకొని మరలా బయటకు వెళతాడు.

రెండు గంటలు కాలేదు. దారిలోని సత్యాగ్రహం ఆపడం కోసం పోలీసులు తుపాకులు పేల్చారని, ఒక దెబ్బ తగిలి మృణాళిని చనిపోయిందని తెలుసుకొని కపర్థి అక్కడికి వెళ్ళేసరికి ఆమె చనిపోయి ఉంటుంది. వెంటనే ఆ పిల్లవాడు ఏమయ్యాడో అని గదికి వెళ్ళేసరికి అక్కడ వాడు ఏడుస్తుంటాడు. వాడిని కపర్థి మృణాళిని బంధువులకి అప్పగిద్దామనికొనేసిరికి వారు వస్తారు, చూస్తారు కానీ ఆ పిల్లవాడిని, కపర్థిని పట్టించుకోరు.

కపర్థి అప్పుడు ఆ పిల్లవాడిని తెచ్చుకుంటాడు. వారి సంభాషణలో పిల్లాడి పేరు "రోనాల్డు" అని తెలుసుకుంటాడు. తరువాత మృణాళిని అలా చనిపోవడానికి కారణం ఆమె తల్లి, అప్పులు పెట్టిన బాధలు భరించలేకనని తెలిసి బాధపడతాడు.

అలా చివరికి రోనాల్డు కథ చెప్పి కపర్థి విడిచిన దీర్ఘ నిశ్వాసం కథకుని గుండెలో పదిమైళ్ళ లోతున దిగబడినట్లవుతుంది. కపర్థిని ఎలా ఓదార్చాలో కథకునికి అర్థం కాదు. తెల్లవారుజామున కథకుడికి కొంచెం నిద్రపడుతుంది. కపర్థి వచ్చి లేపి కాఫీకి రమ్మని తొందరపెడతాడు. కథకుడికి కపర్థిని చూసి ఇతడు రాత్రి చూసిన కపర్థికాడు. "నేను రెండేండ్లుగా అప్పుడప్పుడు కలిసికొన్ని రసజ్ఞ శేఖరుడును, కళాజీవియు, మధుర భాషియునగు కపర్థి యితడు" అంటూ కపర్థి ఉత్సాహంలో పాలు పంచుకుంటాడు.

**కథా ఉద్దేశ్యం :**

ప్రేమకు అవధులు లేవని, అనుబంధం ఎప్పటికీ అంతంకాదనేది ఉద్దేశ్యం.

**'కపర్థి' కథ పై సంస్కరణోద్యమ ప్రభావం :**

ఈ కథ అందరి ప్రేమ కథల్లాంటిదే, అన్ని ప్రేమ చరిత్రల వంటిదే. లైలా-మజ్ను, దేవదాసు-పార్వతి వంటివారు ఈ కథలో లేకపోయిన వారి ప్రేమ ఎంత పవిత్రమైందో ఈ కథలో ఉన్న కపర్థి-మృణాళినిల ప్రేమ కూడా అంత పవిత్రమైందే. ఓ భోగం పిల్లను వివాహం చేసుకుందామని నిశ్చయించుకోవడం ప్రశంసించదగ్గ విషయం. ఆ నిర్ణయానికి కట్టుబడి ఉన్నవాడు కపర్థి. కానీ, మృణాళిని కుటుంబసభ్యుల వలన కపర్థి కోరిక నెరవేరకపోవడం భాధాకరం. ఇటువంటి సంఘటనలు ఆనాడేకాదు, ఈనాడు సైతం ఎందరో ప్రేమికులకు ఎదురవుతున్నాయి. కొంతమంది ప్రేమిస్తారు కొన్నాళ్ళ తరువాత ఆ ప్రేమను

విస్మరించగలుగుతారు. కానీ కపర్ధి వంటి అమరప్రేమికులు బహుకొంతమందే ఉంటారు. ఆ కొంతమంది మహనీయులుగా చిరస్థాయిగా నిలిచిపోతారు. కథలో కపర్ధి భోగంపిల్ల అయిన మృణాళినిని పెళ్ళి చేసుకోవాలనుకోవడం ద్వారా ఆమె జీవితాన్ని బాగు చేయాలనే ఉద్దేశ్యం మనకు స్పష్టమవుతుంది. బాగు చేయడమంటే సంస్కరించడం కనుక సంస్కరణకు పూనుకొన్నవాడు కథలో కపర్ధి. కాబట్టి 'కపర్ధి' కథపై సంస్కరణోద్యమ ప్రభావం ఉందని చెప్పొచ్చు.

## 5. మాక్లీ దుర్గంలో కుక్క

'మాక్లీ దుర్గంలో కుక్క' కథను ముదివేడు ప్రభాకరరావుగారు సమకాలీన సామాజిక స్థితిగతుల్ని విమర్శించే కథల్లో చేర్చారు. ఈ కథా సారాన్ని బట్టి ఇందులో వర్ణవ్యవస్థకు సంబంధించిన చర్చ జరగడం వల్ల సంస్కరణోద్యమంలో వర్ణవ్యవస్థ నిర్మూలన కూడా ఒక భాగం కనుక ఈ కథను నేను సంస్కరణోద్యమ కథల్లో చేరుస్తున్నాను. వర్ణవ్యవస్థకు సంబంధించి ఇద్దరి వ్యక్తుల మధ్య జరిగిన విస్తృతమైన చర్చను 'మాక్లీ దుర్గంలో కుక్క' కథలో చూడొచ్చు.

**'మాక్లీ దుర్గంలో కుక్క' కథా సంక్షిప్త పరిచయం :**

మాక్లీ దుర్గం రైల్వేస్టేషన్ గుంతకల్లు నుంచి బెంగుళూరు వెళ్ళే దారిలో నాలుగు స్టేషన్లు ఇవతల ఉంటుంది. మాక్లీ దుర్గం రైల్వేస్టేషన్ చాలా చిన్నది. ఆ స్టేషన్‌లో ఒక చిన్న దుకాణం ఉంటుంది. ఆ దుకాణాన్ని దుకాణం వాడు రైళ్ళు వచ్చినపన్పుడు తెరిచి, రైలు వెళ్ళిపోయినప్పుడల్లా మూసేస్తుంటాడు. కుక్క ఒకటి ఆ దుకాణం తెరిచినప్పుడల్లా అక్కడ తయార్. ఆ దుకాణం ఎత్తులో ఉంటుంది. "కుక్క తన చూపు దుకాణంలోని పళ్ళికలలో ఉన్న మిఠాయి మీద పడే అంత సమరేఖలో నుంచుని - ఊర్ధ్వదృష్టితో తపస్సు చేస్తూంది. ఎప్పుడైనా దుకాణం సర్దేటప్పుడన్నా, యెవడైనా కొనుక్కొనేటప్పుడైనా ఒక చిన్న ముక్కన్నా జారిపడుతుందేమోనని ఆశతో చూస్తుంటుంది. ఎప్పుడూ పడలేదుగానీ పది రోజులు క్రిందట పకోడి కొనుక్కున్నవాడు చద్దివాసన వేయడం వల్ల పారేస్తే, కుక్క నోటితో దానిని ఆత్రుతగా పట్టుకొని ముందు పళ్ళతో నొక్కి అంగిట్లోకి పోయేందుకు రెండు గతుకులు గతికి మింగి దగ్గు వచ్చి కక్కుతుంది. కుక్క దగ్గరలో ఉన్న సెలయేట్లో నీళ్ళు తాగుతుంది. అది ముందు కాళ్ళు చాపి గడ్డి మీద పడుకొని లేత గడ్డిపరకలు కొరుకుతుంది.

ఆ కుక్క మంచి మిడతల వేటగాడు. అప్పుడప్పుడు పొలం పిచ్చుకలను పట్టుకుంటుంది. సెలయేటి నీళ్ళు, మంచిగాలి, లోయలోకి దిగడం, ఎక్కడంతో కుక్క

మంచి దేహ పటుత్వాన్ని సంపాదిస్తుంది. కుక్క పొరపాటునైనా స్టేషన్ ఎదురుగా ఉన్న కొండ మీదకు వెళ్ళదు.

ఒకసారి ఒక పెద్దమనిషి ఆడ సీమకుక్కను స్టేషన్‌లోకి తీసుకొస్తాడు. అప్పుడు ఊరకుక్కకు, సీమకుక్కకు మొదటి చూపులోనే ప్రణయం ఏర్పడుతుంది. ఆ పెద్దమనిషి చేతిలో కర్ర ఉంటుంది. దానిని చూసి ఊరకుక్క సీమకుక్క దగ్గరకు వెళ్ళేదికాదు. పెద్దమనిషి తన సీమకుక్కను కరకతాలకు కట్టేసి సామాన్లు తూయించకోడానికో, మరి దేనికో వెళ్తాడు. రెండు కుక్కలూ కలుస్తాయి.

ఆ స్టేషన్‌కు ఇన్‌చార్జ్‌గా ఉన్న స్టేషన్‌మాస్టరు కొంత చదువుకున్నవాడే. పెద్దమనిషికీ, స్టేషన్‌మాస్టర్‌కు ఆధునిక సిద్ధాంతాల రాద్ధాంతాల చర్చ జరుగుతుంటుంది.

"స్టే.మా : కాదండీ ! వర్ణవ్యవస్థ ఉండాలి. మన పూర్వులు దానిని నియమించారు. వాళ్ళు ఏ ప్రయోజనం కోసం దాని నేర్పరచారో ఆ ప్రయోజనాలు తెలియకుండా మనం వానిని తీసివేయరాదు.

పె.మ : అట్లా అంటే లాభం లేదండీ! ఆ సిద్ధాంతాలేమిటో చెప్పండి. మనవాళ్ళు చెప్పారు కదా అని వినేరోజులు పోయినై. ప్రతిదీ వాదానికి నిలవాలి. వాదానికి నిలవంది మేము ఒప్పుకోము.

స్టే.మా : వారు ఏ ప్రయోజనాలర్థించారో మనకు తెలియదు. మనకు వాటిని తెలుసుకొనేటంత మేథాశక్తి లేదు.

పె.మ : దానికి నేనొప్పుకోను. జ్ఞానము ప్రపంచం నడిచిన కొద్దీ వృద్ధి అవుతోంది గానీ తగ్గడం లేదు. మన పూర్వులకు మనకున్నంత వాదనాశక్తి లేదంటాను. మానసికశాస్త్రం, పదార్థ విజ్ఞాన శాస్త్రం ఇప్పుడు వృద్ధి అయినంత పూర్వం వృద్ధి కాలేదు.

స్టే.మా : అయితే మీరు వర్ణవ్యవస్థ తీసిపారవేయాలి అంటారా?

పె.మ : తీసివెయ్యాలంటాను. ఈ వ్యవస్థ మూలంగా అనేక భేదాలేర్పడుతున్నవి. కొందరనవసరంగా తాము గొప్ప వాళ్ళమనుకొంటున్నారు. తక్కువ కులాల మీద అధికారం చలాయిస్తున్నారు. వర్ణాంతర భోజనములూ, వివాహములూ జరుగవలె. అప్పుడే దేశానికి ముక్తి.

స్టే.మా : సర్వభూతములయందు సమత్వం ఉండాలిసిందే కాని వర్ణాంతర వివాహం నేను ఒప్పుకోను. పైకి కనబడే భేదాలు మనసా లేకుండా చేసుకోవాలి. మన పూర్వులు కూడా అదే చెప్పారని నా ఉద్దేశ్యం.

పె.మ : మనవాళ్ళట్లాగూ చెప్పలేదు. మనవాళ్ళు సంఘానికి చేసిన ద్రోహం అంతంతకాదు (మార్క్‌్లీ దుర్గంలో కుక్క)" అంటూ పెద్దమనిషి బయటకు వస్తాడు. తన కుక్క వైపు చూస్తాడు. ఆ రెండు కుక్కలు వర్ణభేదాన్ని మర్చిపోయి కలుసుకుంటుంటాయి. పెద్దమనిషి పరిగెత్తుకుంటూ వెళ్ళి దుర్గపుకుక్కను పది పదకొండు దెబ్బలు కొడతాడు. ఆ దెబ్బల బాధ భరించలేక వదిలిపెట్టడానికి ఇష్టం లేకపోయినా చివరకు వదిలించుకొని స్టేషన్ బయటకు వెళ్ళిన తరువాత కానీ దానికి తెలయలేదు తొంటి విరిగిందని. ఆ పెద్దమనిషి తన సీమకుక్కను సైతం నాలుగు దెబ్బలు కొడతాడు.

స్టేషను మాస్టరు ఆ గందరగోళమంతా తెలుసుకొని బయటకు వచ్చి "అయ్యా! ఎందుకు కుక్కనట్లా కొట్టారు?"

పె.మ : ఇది జాతి గల కుక్క. దీనికి తోడు మగకుక్కను కొనాలని చాలా ప్రయత్నం చేశాను. దొరకలేదండీ. దీనికి ఋతువు వచ్చింది. దీన్ని బెంగుళూరు తీసుకొని పోతున్నాను ఈ జాతి మగకుక్కతో కలపాలని."

స్టేషన్ మాస్టరు నవ్వుతాడు. పెద్దమనిషి ముఖకవళికల్లోనూ, కనుబొమ్మల మీద నల్లనిరేఖ యేర్పడుతుంది. అయినాగానీ నవ్వుతాడు. అయినా వాళ్ళిద్దరూ స్నేహంగానే మాట్లాడుకుంటుంటారు.

స్టేషన్‌మాస్టరు సీమకుక్క అందానికి ముగ్దుడై దాని మొగాన మచ్చకూ, తోక కుచ్చుకూ, దాని గోధుమ వన్నె రంగుకు ఆకర్షితుడై దానిని ముద్దు పెట్టుకుంటాడు. 'దీనికి పిల్లలు పుడితే నాకో పిల్లను తప్పకుండా ఇవ్వా'లని వాగ్దానం చేయించుకొంటాడు.

ఊరకుక్కతో కలవడం వల్ల సీమకుక్క ఒళ్ళంతా మట్టి అంటుతుంది. అంతకు ముందే వర్షం పడి దగ్గరలో ఉన్న పెద్ద బండలమీద నీటిమడులు ఏర్పడుతాయి. పెద్దమనిషి తనతో తెచ్చుకున్న తోలు పెట్టె తెరచి రెండు ఉతికిన తువాళ్ళూ, సబ్బు బిళ్ళా తీసి మడిలో కుక్కకు అభ్యంగన స్నానం చేయిస్తాడు. ఇంతలో రైలొస్తుంది. అరుస్తున్న కుక్కను పట్టుకొనే రైలెక్కుతాడు. మగకుక్క ఆడకుక్కకు దూరంగా నిలబడి దానివైపే చూస్తుంటుంది. అతడు కిటికీలోంచి ఊరకుక్కను చూస్తు రెండుసార్లు కర్రాడిస్తాడు. దానితో అది మరింత దూరం పోతుంది. రైలు కదులుతుంది.

సీమకుక్క కంయి కంయిమని అరుస్తూ తలుపు దగ్గరకు వెళుతుంటే అతడు గొలుసు లాగి పట్టకొంటాడు. రైలు బెంగుళూరు చేరగానే కుక్క యేడుపు మానేసి యజమాని దగ్గర చనువుగా కూర్చుంటుంది. అతడు 'లీలా! అల్లా చేయవచ్చునా?' అంటూ ముద్దు

పెట్టుకుంటాడు. ఇందాకటి కుక్క అదే పనిచేస్తే అమృతం పెల్లుబికి వచ్చినట్లు ఆశ్వాదించి ఇప్పుడు అతడిచ్చిన ముద్దును నచ్చనివాళ్ళు ఇచ్చిన ముద్దుగా భావించి తిరస్కరిస్తుంది.

దుర్గంలో కుక్క ఇరిగిన తొంటిని గాడిదగడపాకు, అడ్డసరపాకులకూ రుద్ది, ఒండు మట్టిలో అద్దుకొని, పదిహేను రోజులకు సరిచేసుకుంటుంది. తిరిగి స్టేషనులో కొస్తుంది. మిఠాయి దుకాణం వైపు చూస్తుంది.

ఒకరోజు ఇద్దరు విద్యార్థులు ఆ దుకాణంలో ఏదో కొనుక్కొని తింటూ బల్ల మీద కూర్చుని మాట్లాడుకొంటున్న మాటలు కుక్క చెవిన పడతాయి.

"**ఒకడు** : మనదేశంలో భూతదయ అన్నదిలేదు. పెద్దవాళ్ళందరూ పిన్నవాళ్ళ మీద అధికారం చేస్తారు. నేను బి.ఏ. ప్యాసైనాను. ఉద్యోగమిచ్చే దిక్కులేదు. పెద్దవాళ్ళు మలమల మాడిపోతున్నారు. గొప్పవాళ్ళు సోఫాల మీదకాని ఒరగరు.

**రెం** : మనవాళ్ళు అందరూ స్వార్ధపరులే. పిడికెడు బిచ్చం పెట్టరు. చివరకు కుక్కకు వేసినట్లైనా పెదవాళ్ళకింతవెయ్యరు (మాక్లీ దుర్గంలో కుక్క)" అంటూ మాట్లాడుకుంటున్న వాళ్ళ దగ్గరకు వచ్చి వాళ్ళ చేతిలో ఉన్న పొట్లం వైపు చూస్తుంటుంది. ఇద్దరూ ఇంగ్లీషులో మాట్లాడుకొంటుంటారు.

వారిలో ఒకరి కాళ్ళకు బూట్లు ఉంటాయి. ఆ బూటు కాలితో కుక్కను డొక్కలో తంతాడు. దానికి రెండు మూడురోజుల నుంచి తిండిలేదేమో ఆ దెబ్బ పొట్టలో ఏ నరానికి తగిలిందో ఏమో మెలికలు తిరిగిపోతుంది. కొంతసేపటికి తేరుకొని అక్కడినుండీ ఉడాయిస్తుంది.

ఆరోజు రాత్రి వేగోలం ఒకటి కొండమీద నుంచి స్టేషనులోకి వస్తుంది. కుక్క భయపడి దుకాణం క్రింద ఒక గూడుగా ఉంటే దానిలో దాక్కుంటుంది. వేగోలం పసిగట్టి ఆ గూటి దగ్గర కాపు కాస్తుంది. వేగోలం మూతి గూట్లోకి పెడితే కుక్క లోపల దాక్కొని దాని నోరంతా కరుస్తుంది. వెనక్కు తిరిగితే తోకా పృష్ఠభాగం గాట్లు చేస్తుంది. వేగోలం కొంత ఆదమరపుగా ఉన్నప్పుడు కుక్క కొంచెం బయటికి వచ్చి దాని మెడ పట్టుకుని గుంజుతుంది. చివరకు ఒక పట్టులో వేగోలం పీక పట్టుకొని దాని ఊపిరి ఆగేదాకా కుక్క వదల్లేదు.

తెల్లవారిన తరువాత అందరూ కుక్క పౌరుషాన్ని తెలుసుకుంటారు. రెండేళ్ళుగా మర్యాదలేని ఆ కుక్కకు మర్యాదలెక్కువైపోతాయి. స్టేషన్ మాస్టరు రోజూ దానికి అన్నం వేయమని ఆజ్ఞ కూడా జారీ చేస్తాడు.

స్టేషన్‌లో ఉన్న దుకాణంలో యజమాని సంవత్సరం క్రితం చేసిన మిఠాయిని ఎవరూ కొనకపోవడం చేత వారానికోసారి తాజాగా నూనెలో వేసినా ఎవరూ దాని ముఖం చూడకపోవడంతో ఆ మిఠాయి జంగిలీని కుక్క మీద మహా దయ కలిగి దాని ముందు పెడతాడు. అది ఆప్యాయంగా తింటుంది.

తరువాత రోజు రాత్రి కుక్క మహా బాధపడుతూ ఏడవడం మొదలుపెడుతుంది. స్టేషన్ మాస్టరు, పోర్టర్లూ వేగోలాలు వచ్చినాయేమో అనుకుంటారు. కుక్కకు వాతం చేస్తుంది. కనబడ్డ ఆకల్లా కొరుకుతుంది. ఏ ఆకు పనిచేయదు. ఒండుమట్టి నా వల్ల "మాస్టరు, 'ఏమండీ కుక్క పిల్లలను పెట్టిందా?' అని అడిగాడు. పెద్దమనిషి ఇట్లా అన్నాడు. "అయ్యా! కుక్కను బెంగుళూరుకు తీసుకువెళ్ళాను. జాతి కుక్క నెక్కనివ్వలేదు. మీ పాడుకుక్క పాడుచేసింది. కుక్క పిల్లల్నికన్నది. ఊరకుక్కల్ని పెట్టింది. నాకు చాలా విచారం వేసింది. ఈసారి మంచి పిల్లలు పెడితే మీకు తెచ్చిస్తా"నన్నాడు. స్టేషను మాస్టరు "మా కుక్క మంచిదండీ! అది మంచి పౌరుషశాలి. కొన్నాళ్ళక్రింద అది ఒక వేగోలాన్ని చంపి"దన్నాడు. పెద్దమనిషి "పోనిద్దురూ! వెధవకుక్క. నాకు దానిని చంపవలెనని ఉంది. ఇంకా అది మీ స్టేషన్‌లో ఉంటే చూపించండి. దాన్ని నరికిపోతా"నన్నాడు. స్టేషనుమాస్టరు "దానికేదో వాతం పుట్టి కుక్క పాడైపోయిందన్నాడు (మాక్లీ దుర్గంలో కుక్క)."

ఇంతలో ఆ కుక్క కాలీడ్చుకుంటూ అక్కడికి వస్తుంది. స్టేషను మాస్టరు ఇదేనండీ అంటూ దాన్ని చూపిస్తాడు. పెద్దమనిషి దాన్ని చీదరించుకొని పౌరుషంతో ఒక్క తన్ను తంతాడు. దానికి పారిపోవడం కుదరక మెడా, కాళ్ళూ యెత్తి ఒక పక్కకు ఒత్తిగిలి యేడుస్తుంటుంది. పోర్టరు వచ్చి కాలితో దాన్ని అవతలికి తోస్తాడు. మాస్టరు నవ్వి 'మీకెంత కోపమండీ' అంటాడు.

వారిద్దరి స్నేహమూ ముదిరి రాత్రి పెద్దమనిషి స్టేషనుమాస్టరుకి అతిథిగా ఉంటాడు. ఆ రాత్రి కుక్క రైలుక్రింద పడుతుంది. రైలు దాని నడుము మీదనుండీ వెళుతుంది. దుర్గపుకుక్క తన్నుకొని ప్రాణం విడుస్తుంది.

నాలుగు నెలల తరువాత ఆ పెద్దమనిషి తన రెండు కుక్కపిల్లల్లో ఒకటి చచ్చిపోయిందని చెప్తూ ఉన్న ఒకదాన్ని స్టేషను మాస్టరుకిస్తాడు. అది ఆరునెలల వయసు వచ్చేసరికి తండ్రిలా తయారవుతుంది. ఎవరైనా దానికి మిఠాయి పెట్టబోతే కరవబోతుంది. ఎన్ని ఆడకుక్కలు వచ్చినా వాటివైపే చూడదు. విద్యార్థులు వచ్చి భూతదయోపన్యాసాలు చేస్తుంటే వారి వైపు కోపంగా చూస్తుంటుంది. ఆ పెద్దమనిషి వచ్చి వర్ణవ్యవస్థ గురించి

స్టేషన్‌మాస్టరుతో మాట్లాడుతుంటాడు. కుక్క అక్కడికి వెళ్ళినప్పుడు దీన్ని ముద్దుగా ముట్టుకోబోతాడు. కుక్క కోపంగా పళ్ళు చూపించి జీర్ణంకాని వేగోలపు మాంసాన్ని కక్కి వెళ్తుంది.

ఆ దుకాణం వాడు చద్ది మిఠాయి వేయబోతాడు. కుక్క వాడి పిక్కకండలు పట్టి లాగుతుంది. చివరకు మనుష్యులంటేనే దానికి అసహ్యం కలుగుతుంది.

**కథా ఉద్దేశ్యం :**

ఎవరైనా ఆచరించకుండా సలహాలను, సూచలను మిగతావారికి ఇవ్వడం సమంజసం కాదనేది ఉద్దేశ్యం.

**'మాక్లీ దుర్గంలో కుక్క' కథ పై సంస్కరణోద్యమ ప్రభావం :**

భారతదేశంలో ఒకానొకప్పుడు వర్ణ వ్యత్యాసం విస్తృతంగా ఉండేది. తెల్లజాతీయులు (ఆంగ్లేయులు) నల్లజాతీయులను (భారతీయులను) ఎన్నో అవమానాలకు గురి చేస్తుండేవారు. కారణం నల్ల వారవడం వల్ల. కాలం మారుతున్న కొద్దీ దాని ప్రభావం కొంతమేరకు తగ్గినా ఈనాటికీ ఎక్కడొకక్కడ ఏదోక సందర్భంలో కనబడుతూనే ఉంది. ఇది రూపు మాపాలంటే మనుష్యుల ఆలోచన మారాలి. 'మాక్లీ దుర్గంలో కుక్క' కథలో పెద్దమనిషి పాత్ర వంటివారు ఈ సభ్యసమాజంలో కోకొల్లలు. వర్ణవ్యత్యాసం పోవాలని, దానివల్ల కొందరు ఇబ్బందులు పడుతున్నారని చెప్తున్నాడే కానీ ఆచరించడానికి మాత్రం వెనుకాడుతున్నట్లు తెలుస్తుంది. వర్ణవ్యత్యాస నిర్మూలన కోసం ఊకదంపుడు ప్రసంగాలు ఏమాత్రం పనికిరావని తెలుపుతూ విశ్వనాథసత్యనారాయణగారు దుర్గపుకుక్క (ఊరకుక్క) సీమకుక్క (జాతికుక్క) రెండు వర్ణవ్యత్యాసాన్ని మర్చిపోయి కలుసుకున్నాయని తెలియజేసి వర్ణవ్యత్యాసంపై తిరుగుబాటు లేవదీశారు. ఈ సకల చరాచర సృష్టిలో జంతువులకు లేని వర్ణవ్యత్యాసం మనుషుల్లో ఎందుకుండాలనే అభిప్రాయాన్ని గుర్తుచేసి తనలోని సంస్కరణ భావాన్ని ప్రకటించారు. దీన్ని బట్టి 'మాక్లీ దుర్గంలో కుక్క' కథ పై సంస్కరణోద్యమ ప్రభావం బలంగానే పనిచేసిందని చెప్పాలి.

# పాదసూచికలు

1. వెలుగుజాడ సాహితీ ప్రముఖుల విశ్లేషణలు; విశాఖ ఆకాశవాణి ప్రసార మాలిక, నాగసూరి వేణుగోపాల్, వెలుగుజాడ - గురజాడ (ముందుమాట)
2. ధీపధారి గురజాడ; డా॥రాచపాళెం చంద్రశేఖరరెడ్డి; పుట : 51
3. వెలుగుజాడ సాహితీ ప్రముఖుల విశ్లేషణలు; విశాఖ ఆకాశవాణి ప్రసార మాలిక, నాగసూరి వేణుగోపాల్, నిజంగా వెలుగుజాడే (ముందుమాట).
4. వెలుగుజాడ సాహితీ ప్రముఖుల విశ్లేషణలు; విశాఖ ఆకాశవాణి ప్రసార మాలిక, నాగసూరి వేణుగోపాల్, గురజాడకు పూర్వం తెలుగు సాహిత్యం - డా॥ కోడూరి శ్రీరామమూర్తి; పుట 13.
5. గురజాడ తొలి కొత్త తెలుగు కథలు; గురజాడ కథలపై విమర్శ; రాచపాళెం చంద్రశేఖరరెడ్డి; పుట : 46, 47
6. పైదే, పుట : 51
7. ఆణిముత్యాలు - గురజాడ కథలు; విశాలాంధ్ర 1972 ప్రచురణ; పుట : 55
8. పైదే, ప్రవేశిక; పుట : 5
9. గురజాడ తొలి కొత్త తెలుగు కథలు; గురజాడ కథలపై విమర్శ; రాచపాళెం చంద్రశేఖరరెడ్డి; పుట : 68
10. పైదే, పుట : 68
11. ఆణిముత్యాలు - గురజాడ కథలు; విశాలాంధ్ర 1972 ప్రవేశిక; పుట : 6
12. గురజాడ తొలి కొత్త తెలుగు కథలు; గురజాడ కథలపై విమర్శ; రాచపాళెం చంద్రశేఖరరెడ్డి; పుట : 69
13. పైదే.
14. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి చిన్న కథలు - సమగ్ర సమీక్ష; డాక్టర్ చామర్తి కనకయ్య 'కనక్ ప్రవాసి'; పుట : 22
15. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి కథలు మొదటి సంపుటం ; చాంధస తమస్సు నుండి పుట్టిన సంస్కరణ జ్యోతి - ఏటుకూరి బలరామమూర్తి
16. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి చిన్న కథలు-సమగ్ర సమీక్ష; డాక్టర్ చామర్తి కనకయ్య 'కనక్ ప్రవాసి'; పుట : 24

17. పుల్లంపేట జరీ చీర, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి కథలు, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి; శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి గురించి
18. బ్రాహ్మణాగ్రహారం ; శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి కథలు మూడవ సంపుటం ; శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి, పుట : 264
19. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి చిన్న కథలు-సమగ్ర సమీక్ష; డాక్టర్ చామర్తి కనకయ్య 'కనక్ ప్రవాసి'; పుట : 105
20. చలం ఆత్మకథ ; పుట : 1
21. పైదే, పుట : 4
22. పైదే, పుట : 6
23. పైదే, పుట : 6, 7
24. పైదే, పుట : 14
25. చలం 'మ్యూజింగ్స్' విమర్శనాత్మక పరిశీలనం, కె.యస్. రమణ; పుట : 21
26. పైదే, పుట : 23
27. పైదే, పుట : 30, 31
28. పైదే, పుట : 49
29. సత్యాన్వేషి చలం ఒక పరిశీలన, డా॥ వాడ్రేవు వీరలక్ష్మీదేవి ; పుట : 84, 85
30. అడివి బాపిరాజు కథలు, కవిత్వం - పరిశీలన ; డాక్టర్ వి. సిమ్మన్న ; పుట : 1
31. అడివి బాపిరాజు అతని రచనలు విమర్శనాత్మక పరిశీలన (అముద్రితం) ; వి. తిరుపతయ్య ; పుట : 677
32. పైదే, పుట : 679
33. పైదే, పుట : 682
34. పైదే, పుట : 683
35. పైదే, పుట : 684
36. అడివి బాపిరాజు రచనలు - 8 కథలు, అడివి బాపిరాజు, అడివి బాపిరాజు జీవిత సువర్ణరేఖలు
37. అడివి బాపిరాజు అతని రచనలు విమర్శనాత్మక పరిశీలన (అముద్రితం) ; వి. తిరుపతయ్య ; పుట : 689

38. వేయి పడగలు విశ్లేషణాత్మక విమర్శ, ఆచార్య ఎస్. గంగప్ప ; పుట : 3

39. పైదే, పుట : 5

40. పైదే, పుట : 7

41. పైదే, పుట : 8

42. పైదే, పుట : 10

# సంస్కరణోద్యమ కథలు - భాష, శైలీ పరిశీలిన

*సాహిత్యకారులు సమాజాన్ని చైతన్యపరిచే సృజనాత్మక సాహిత్యాన్ని సృష్టించినట్లయితే ఆ రచయితల కృషి సఫలీకృతమైనట్లే. గురజాడ అప్పారావు, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి, గుడిపాటి వెంకటాచలం, అడివి బాపిరాజు, విశ్వనాథ సత్యనారాయణ వంటి సుప్రసిద్ధ రచయితలు సంఘ సంస్కరణ దృష్టితో తమ వంతుగా సాహిత్య సేవలందించారు. ప్రస్తుతం నా పరిశోధనాంశం కథకు సంబంధించింది కనుక సంస్కరణోద్యమ కథల్లో భాష ఎలా వుందో, శైలి ఎలా వుందో పరిశీలిస్తాను. దానికి ముందు సంస్కరణోద్యమ సాహిత్యమంటే ఏమిటో తెలియజేస్తాను.*

## 4.1 సంస్కరణోద్యమ సాహిత్యం

సంస్కరణ అంటే లోపాలను సరిదిద్దడం. సాహిత్యం సమాజానికి ప్రతిబింబం. ఆంగ్ల ప్రభావంతో తెలుగు సాహిత్యంలో అనేక మార్పులు సంభవించాయి. ఆ మార్పుల్లో ముఖ్యమైనవి సంస్కరణలు. ఈ సంస్కరణలను మేధావులు, రచయితలు, విమర్శకులు ఆహ్వానించారు. ఆ దిశగా ప్రయత్నాలు ప్రారంభించారు. భారతదేశంలో కులం పేరుతోనూ, మతం పేరుతోనూ జరుగుతున్న అన్యాయాన్ని, అరాచకాల్ని, మూఢనమ్మకాల్ని, కర్మకాండల్ని, అగ్రకులాల పెత్తందారీతనాన్ని ఖండిస్తూ భక్తి ఉద్యమం అవతరించింది. ఈ ఉద్యమం మానవతావాదాన్ని పెంపొందింప జేసేందుకు తోడ్పడింది. ఇది సైతం సంఘసంస్కరణలో భాగమే. సంఘసంస్కరణోద్యమం ద్వారా సమాజంలోని మౌలిక అంశాలలో మార్పు తీసుకొచ్చేందుకు కృషి చేయడం జరుగుతుంది.

ప్రాచీన కాలంలో చార్వక మతం ఈ విషయంలో చెప్పుకోదగినంత కాకపోయినప్పటికీ కొంతమేర ముందడుగు వేసిందని చెప్పాలి. మతం ఆధారంగా శివకవులు సంస్కరణకు ప్రయత్నించినట్లు చెప్పొచ్చు. ఆ తర్వాత అన్నమయ్య, భక్త రామదాసు, వేమన, పోతులూరి

వీరబ్రహ్మం లాంటివారు సంస్కరణా భావాజాలాన్ని ప్రచారం చేశారు. పాశ్చాత్య విద్యా ప్రభావం ఈ ఉద్యమం పై పడి, కార్యరూపాన్ని సంతరించుకొంది. ఈ ఉద్యమానికి ఎంతోమంది సంఘసంస్కర్తలు రాజారామమోహనరాయ్, ఈశ్వరచంద్ర విద్యాసాగర్, వివేకానందుడు, కందుకూరి వీరేశలింగం వంటివారు సారధులుగా నిలిచారు. సంస్కరణోద్యమంలో డా॥ అంబేద్కర్, ఇ.వినాయకర్, గోరా మొదలైన వారి కృషి మరువలేనిది.

వీరి ఉపన్యాసాలు, రచనలు సమాజాన్ని ఎంతగానో ప్రభావితం జేశాయి. ఆ ప్రభావ ఫలితంగానే సంస్కరణలు వేగం అందుకున్నాయి.

ఆంగ్ల సాహిత్య ప్రభావ ఫలితంగా భారతదేశంలోకి, ఆంధ్రరాష్ట్రంలోకి క్రొత్త సాహిత్య ప్రక్రియలు ప్రవేశించాయి. అలా ప్రవేశించిన వాటిలో చెప్పుకోదగ్గవి కథానిక, నవల, నాటకం, విమర్శ, నాటిక, కవిత, వ్యాసం, సమీక్ష, పీఠికలు, జీవితచరిత్ర, స్వీయచరిత్ర, పత్రికా లేఖనం, సంపాదకీయం, అనువాద సాహిత్యం, శాస్త్రగ్రంథం, వ్యాఖ్యానం ముఖ్యమైనవి.

## 4.2 సంస్కరణోద్యమ కథలు - భాష

భావాలను వ్యక్తం చేసేందుకు, అభిప్రాయాలను తెలిపేందుకు దోహదపడే ఏకైక సాధనం భాష. ఈ భాషను గ్రాంధిక భాష, వ్యవహారిక భాష, సరళభాష అని వాడుతుంటారు. ప్రాచీన సాహిత్యం అంతా గ్రాంధిక భాషలో ఉంటుంది. ఆధునిక సాహిత్యమంతా వ్యవహారిక భాషలో సాగుతుంది.

గురజాడ కాలంలో కావ్యభాష వ్యవహారికంలోకి మారేందుకు ఆకస్మికంగా ప్రతిబంధకాలను విడిపించుకోలేక రచనల్లో బాగా నలిగి మెరుగులు దిద్దుకోవడం ప్రారంభమయింది. గురజాడ భాషా సూత్రాన్ని తెలుసుకొన్న చింతాదీక్షితులు ఆ శతాబ్దంలో శైలిని అందంగా ప్రయోగించి తీర్చిదిద్దాడు. వేగంగా వెలువడే వాక్యాలతో విస్తృతమైన ప్రభావాన్ని కనబరిచే తీరు చలంతోనే ప్రారంభమైంది. తన పరిసరాల్లో కనిపించే శిష్టజనుల భాష వాడుకను విన్నది విన్నట్లు అచ్చుగుద్దిన ప్రగతిశీలి శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి.

'కరుణకుమార', చాసో, గోపీచంద్, మా గోఖలే, రాచకొండ విశ్వనాథశాస్త్రి, ఇరివెంటి కృష్ణమూర్తి, సురమౌళి, యశోదారెడ్డి ప్రభృతులు శిష్టేతర జానపద పదజాలాన్ని వాక్యవిన్యాసాన్ని, నుడికారాన్ని పుణికిపుచ్చుకొని వైవిధ్యం చూపించారు.

ఒకానొకప్పుడు భాషకుండే నియమనిబంధనలు, ఆంక్షలు ప్రస్తుతం లేవు. రచయితల అభిరుచులను బట్టి, పాత్రలను బట్టి శిష్టవ్యావహారికం నుండి శిష్టేతరమైన జానపద మాండలిక వ్యవహారం వరకు అన్నిరకాల భాషాభేదాలు ప్రయోగ యోగ్యతను నోచుకున్నాయి. నేడు ఏ ప్రాంతానికి చెందిన రచయితలయినా ఏ సామాజిక స్థాయిల్లో పుట్టి పెరిగినా వీరు వాడేది ఆధునిక ప్రమాణభాషే. తెలుగులో శిష్టవ్యావహారికం ఈనాడు ప్రాచుర్యంతో బాటు అర్హస్థానం పొందగలిగిందంటే దానికి కథారచయితల కృషి ఉందని చెప్పక తప్పదు.

గురజాడ కథానికలతోనే తెలుగు సాహిత్యంలో వ్యావహారికం (ఆధునికత) ఆరంభమైంది. అయితే కావ్యాలలో ఉండే గ్రాంథిక భాష ప్రభావం పూర్తిగా పోలేదు. తరువాత వెలువడిన పానుగంటి లక్ష్మీనరసింహారావు, మాడపాటి హనుమంతరావు, వేలూరి శివరామశాస్త్రి, పూడిపెద్ది వెంకటరమణయ్య, తల్లా వజ్ఝల శివశంకర శాస్త్రి మొదలైన వారి కథల్ని గ్రాంథిక భాష ఏలింది.

ప్రపంచంలో ఉన్న జీవద్భాషలన్నింటిలోనూ పలురకాల మాండలికాలు దర్శనమిచ్చినట్లే, తెలుగు భాషలో కూడా అనేకరకాల మాండలికాలు దర్శనమిస్తాయి. ప్రాంతాన్ని బట్టి, వర్గాన్ని బట్టి, కులాన్ని బట్టి, వృత్తిని బట్టి, విద్యా సంస్కారాదులను బట్టి ఉచ్ఛరణను బట్టి, వ్యావహీకృతాన్ని బట్టి ఎన్నోరకాల మాండలికాలు ఏర్పడతాయి. ప్రాంతాలను బట్టి తెలుగులో నాలుగురకాల మాండలికాలున్నట్లుగా భాషాశాస్త్ర పరిశోధకులు గుర్తించారు అవి :

1. పూర్వాంధ్రం : శ్రీకాకుళం, విశాఖపట్టణం, విజయనగరం జిల్లాలు
2. దక్షిణాంధ్రం : రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం జిల్లాలూ, గుంటూరు జిల్లాలో వినుకొండ, పల్నాడు (దక్షిణభాగం) తాలూకాలూ, మహబూబ్‌నగర్ జిల్లాలో దక్షిణభాగం.
3. ఉత్తరాంధ్రం : తెలంగాణా జిల్లాలు- మహబూబ్‌నగర్ జిల్లాలో దక్షిణభాగం మినహా
4. మధ్యాంధ్రం : మిగిలిన ఉభయగోదావరులు, కృష్ణా గుంటూరు జిల్లాలు - వినుకొండ, పల్నాడు (దక్షిణభాగం) తాలూకాలు తప్ప

ప్రాంతీయ మాండలికాల తరువాత తెలుసుకోవలసినవి శిష్టశిష్టేతర మాండలికాలు. చదువు సంస్కారాలు అబ్బిన శిష్టజనుల వ్యవహారం 'ప్రమాణ భాష'గా వెలుగులోకొచ్చి అన్ని రంగాల వారికీ ఆమోదయోగ్యమైంది.

భాషలో మాండలిక బేధాలు ఎన్ని కనబడినా పద, పదాంశ, ధ్వని స్థాయిలోనూ పోలికలోనూ తప్ప వాక్య నిర్మాణ స్థాయిలో భేదాలు కనబడవని భాషాశాస్త్రజ్ఞులు అభిప్రాయం.

## I గురజాడ వాడుక భాష :

ఈ సందర్భంలో గురజాడ 'దిద్దుబాటు'లో భాషా ప్రయోగాన్ని తెలియజేస్తాను. దిద్దుబాటులో గురజాడ అప్పారావు సరళ భాషను వాడటం జరిగింది. భాషలో క్లిష్టత లేకుండా రచయిత ఎంతగానో జాగ్రత్త పడ్డాడు. దిద్దుబాటులో గ్రాంథిక పదాలు సాధ్యమైనంత తక్కువగా వాడేందుకు ప్రయత్నించి సఫలీకృతుడయ్యాడు. ఈ క్రమంలో మొదటిసారి రాసిన దిద్దుబాటులో ఎక్కువ గ్రాంథిక పదాలు దొర్లడంవల్ల కొన్నాళ్ళకు సవరించి మళ్ళీ 'దిద్దుబాటు'ను తిరిగి రాయడం జరిగింది. ఈ కథ పూర్వాంధ్ర మాండలికంలో రాయబడినట్లు రావుఁడు పాత్రను పరిశీలిస్తే మనకు అర్థమవుతుంది.

కథలో కమలిని తన భర్తయిన గోపాలరావును మార్చేందుకు ప్రయత్నించే క్రమంలో తాను పుట్టింటికి వెళ్ళిపోతున్నట్లు ఓ ఉత్తరం రాసి బల్లపై ఉంచి, తను దాక్కుంటుంది. ఆలస్యంగా ఇంటికి వచ్చిన గోపాలరావు కమలిని కనబడకపోవటాన్ని గ్రహించి, ఆ ఇంటి పనివాడైన రావుఁడ్ని ఆరా తీసే సందర్భంలో జరిగిన సంభాషణ పరిశీలిద్దాం.

"వీధి గుమ్మం దగ్గరికి వెళ్ళి తలుపు తెరిచి చూసేసరికి, వీధి నడుమ చుట్ట కాలుస్తూ తల ఎత్తి ఆకాశం మీది చుక్కల్ని చూస్తూ రావుఁడు కనపడ్డాడు ! "రామా!" అని గోపాల్రావు పిలిచాడు. రావుడి గుండె ఝల్లుమంది, నోట్లో చుట్ట జారి కిందపడ్డది.

"రా వెధవా !"

కాలీడ్చుకుంటూ రావుఁడు దగ్గిరకొచ్చాడు.

"మీ అమ్మేదిరా ?"

"మా యమ్మా బాబూ? మాకొంపలువున్నాది."

"నీ అమ్మ కాదురా ! బుద్ధిహీనుడా ! నా భార్యరా."

ఆ మాటతో రావుఁడికి మతిపోయింది. ఆలోచించుకుని అన్నాడు -

"ఎక్కడుంటారు బాబూ? అమ్మగోరు గదిలో తొంగున్నారు బాబూ !"

"యింట్లో ఎక్కడా లేదురా, వెధవా ! యిల్లు విడిచి నువ్వెక్కడికి పోయినావురా?"

రావుఁడు మొహం ఓరజేసుకుని "నౌఖరోడికి కాల్నొస్తుంది, కడుపు నొస్తుంది, బాబూ. పెద్దయ్యోరు మరీ మరీ అప్పసెప్పి ఎల్లినారు గందా, అమ్మగారి నొక్కర్నీ ఒగ్గేసి నిసిరాత్రేళ

సానమ్మగారి-" రావుఁడి వీపు మీద రెండు వీశ గుద్దులు పడ్డాయి. "సంపేసినారు బాబూ" అని రావుఁడు నేలకూలబడ్డాడు.

గోపాలరావు దయగలవాడు. వెంటనే కోపం దిగజారి, పశ్చాత్తాపం కలిగింది. రాముణ్ని చేత లేవనెత్తి, వీపు నిమిరి, "కోపం పట్టలేక పశువువలె ఆచరిస్తిని" అనుకుంటూ గదిలోకి తీసుకువెళ్ళాడు.

కుర్చీమీద తాను కూచుని "రామా ఏమాయెరా!" యని దైన్యంతోటి అన్నాడు. రావుఁడు యీ తట్టూ, ఆ తట్టూ, చూసి

"ఏటో మాయలా వుంది, బాబూ" అన్నాడు.

"పుట్టింటిగ్గానీ వెళ్ళి వుండునా?"

"అంతోరు కారనా, బాబూ! కోపగించితే సెప్పజాల్నుగానీ, ఆడోరు సదువుకుంటే, ఏటౌతాది బాబూ?"

"విద్య విలువ నీకేం తెలుసురా, రామా!" అని గోపాలరావు మోచేతులు బల్లపైన ఆన్చి ఆ నడుమ శిరస్సు వుంచి తలపోస్తూ వున్నంతలో, ముద్దులొలికే కమలిని చేవ్రాలున వుత్తర వొఁకటి బల్లమీద కనబడ్డది (దిద్దుబాటు)."

"గుణవతి, విద్యానిధి, వినయ సంపన్నురాలు నా చెడ్డబుద్ధికి తగిన శాస్తి చేసింది."

"అమ్మగారేటి సేసినారు బాబూ!"

"పుట్టింటికి వెళ్ళిపోయింది - గానీ, నీకు తెలియకుండా ఎలా వెళ్ళిందిరా?"

రావుఁడు రెండడుగులు వెనక్కివేసి "నాఁ తొంగున్నాను కావాల బాబూ! అలిగితే సెప్పసాల్నుగాని బాబూ, ఆడదాయి సెప్పకుండా పుట్టినోరింటికి ఎల్తానంటే లెంపలోయించి కూకోబెట్టాలి గాని మొగోర్లాగా రాతలూకోతలూ మప్పితే ఉడ్డోరం పుట్టదా, బాబూ?"

"ఓరి మూర్ఖుడా ! భగవంతుడి సృష్టిలోకల్లా ఉత్కృష్టమయిన వస్తువు విద్యనేర్చిన స్త్రీ రత్నమే. శివుడు పార్వతికి సగం దేహం పంచి యిచ్చాడు కాదా. ఇంగ్లీషువాడు భార్యను 'బెటర్ హాఫ్' అంటాడు. అనగా పెళ్ళాం మొగుడికన్న దొడ్డది అన్నమాట. బోధపడ్డదా?"

"నాకేం బోధకాదు బాబూ?" రావుఁడికి నవ్వు ఆచుకోవడం అసాధ్యం కావచ్చింది.

"నీ కూతుర్ని బడికి పంపిస్తూన్నాం కదా, విద్య యొక్క విలువ నీకే బోధపడుతుంది. మీ వాళ్ళకంటె అప్పుడె దానికి ఎంత నాగరికత వొచ్చిందో చూడు. ఆ మాట అలా వుణ్ణియ్యిగాని, యిప్పుడు నువ్వో నేనో వెంటనే బయల్దేరి చెంద్రవరం వెళ్ళాలి! నే వెళ్దానికి

శలవు దొరకదు. నువ్వు తాతల నాటి నౌఖరివి. నీ మీద కమలినికి యిష్టం. గనక నువ్వే వెళ్ళడం మంచిది. వెళ్ళి కమలినిని పిలుచుకు రా."

"శలవైతే యెల్నా, యెలతాను. ఆ(గ్రానంటే-"

"యింద పది రూపాయలు. బతిమాలి తీసుకొస్తివట్టాయునా, మరి పది రూపాయిలిస్తాను."

"సిత్తం"

"అయితే, యేమిఁటి చెప్పాలో తెలుసునా?"

"యేటా, బాబూ? సెప్పకుండా లేసి రావడం మా మంచి పని సేసినారమ్మా బాబు నాయీపు పగలేసినారు రండి రండమ్మా అని సెప్తాను."

"నన్ను క్షమించి దెబ్బల మాట మరిచిపో. కమలినితో ఎన్నడూ దెబ్బల మాట చెప్పబోకు. ఈ మాట జ్ఞాపకం వుంచుకుంటావు గద?"

"సిత్తం"

"నువ్వు కమలినితో చెప్పవలసిన మాటలేవో, చెబుతాను బాగా చెవొగ్గి విను ........ పంతులికి బుద్ధి వొచ్చిందను........"

"అదేటి బాబు !"

"నీకెందుకు? నే అన్నమాట గట్టిగా జ్ఞాపకం వుంచుకుని చెప్పు. పంతులికి బుద్ధి వొచ్చింది అను. మరి ఎన్నడూ సానుల పాట వినరు. గట్టివొట్టువేసుకున్నారు (మరచిపోయి అన్నాను; ఆ మాట అనకు.) యిటు పైని ఎన్నడూ, రాత్రిళ్ళు యిల్లు కదలరు. ఇది ఖరారు. తెలిసిందా?"

రావుఁడు తల వూపాడు.

"ఇంకా ఏవిఁటంటే, గెడ్డం పట్టుకుని బతిమాలుకున్నానని చెప్పమన్నారు. దయదల్చి పంతులు లోపాలు బయట పెట్టొద్దన్నారు. (ఇది ముఖ్యమైన మాట విన్నావా?) రెండు మూడురోజుల్లో తప్పకుండా వెళ్ళిపోయి రమ్మన్నారు. మీరు దగ్గర లేకపోవడం చేత వెఱ్ఱెత్తినట్టున్నారు. గడియో యేడు లాగ గడుపుతున్నారు. (యీ మాట మరవగలవు జాగ్రత్త) యేం చెప్పాలో తెలిసింది గదా? ఒక మాటైనా మరచిపోకు."

"తెలిసింది బాబూ."

"యేం చెబుతావో నాకోమాటు చెప్పు."

రాముఁడు తల గోకుకొనుచు "యేటా - యేటా - అదంతా నాకేం తెల్దు బాబూ. -

నేనంతాను అమ్మా! నా మాటినుకొండి - కాలం గడిపినోణ్ణి - పిన్నల్ని సూసినాను. పెద్దల్ని సూసినాను యిన్నారా? ఆడోరు యజమాని సెప్పినట్టల్లా యిని వల్లకుండాలి లేకుంటే పెద్ద పంతులార్లాగ, సిన్న పంతులోరు కూడా సెడిపోతారు. మీ శెవుల్లో మాట. పట్టంలోకి బంగారు బొమ్మలాంటి సానమ్మ వొచ్చింది. ఆ సానెమ్మోర్ని సూసినకాణ్ణుంచీ పంతులు మనసు, మనసులా లేదు. నా మాటిని రండి. లేకుంటే మీ సిత్తం, అంతాను (దిద్దుబాబు)."

ఈ కథ సవరించి రాసింది. దీనినే మొట్టమొదట సారి రాసినప్పుడు గ్రాంథిక భాషా పదజాలం ఎక్కువ కనబడింది. నేడు, రాసిన తరువాత ఒక్క అక్షరాన్ని కూడా మార్చడానికి ఇష్టపడడం లేదు రచయితలు. కానీ, ఆ రోజుల్లో అచ్చయిన తరువాత కూడా వాడుక భాషకు మరింతచోటు కల్పించేందుకు ప్రయత్నించి కొన్ని మార్పులతో తిరిగి రాసిన గురజాడ ప్రతిభ, పట్టుదల హర్షించదగినవి. దీనిని నేటి తరం కథారచయితలంతా అలవాటు చేసుకోవాలి, కొనసాగించాలి. కథలో పనివాడైన రాముఁడు చేత పలికింపజేసిన "తొంగున్నారు, ఒగ్గేసి, ఏటౌతది, తొంగున్నాను, కూకోబెట్టాలి, మప్పితే, యేటా, చెవొగ్గి, నేనంతాను, తెల్దు, వల్లకుండాలి, అంతాను." మొదలైన పదాలు పూర్వాంధ్ర మాండలికంలో ఎక్కువగా వాడుకలో ఉండేవని స్పష్టమౌతుంది. గురజాడ ఆ ప్రాంతానికి చెందినవాడు కనుక పదాలు ప్రయోగించడంలోను, ఆ ప్రాంతపు భాషను ఉపయోగించడంలోనూ గొప్ప ప్రతిభ కనబరిచాడని చెప్పడంలో సందేహం లేదు.

## II. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి భాషాభిమానం :

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారి మీద ఇద్దరి వ్యక్తుల ప్రభావం ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తుంది. ఒకరు ఆధునిక భావాలు కలిగిన వీరేశలింగం కాగా మరొకరు ఆధునిక భాషాభిలాషి గురజాడ. వీరి నుండి శ్రీపాద ఆధునిక భావాలను, ఆధునిక భాషను అందుకొన్నారు. ఆధునిక భావాలను కథలుగా మలిచి అత్యాధునికమైన భాషతో తీర్చదిద్ది తెలుగు జాతికి కథలుగా అందించి కథా చక్రవర్తి అయ్యారు. ఇతర భాషల సాహిత్యా ప్రభావాన్ని తనపై పడనివ్వకుండా జాగ్రత్తపడి తనదైన ప్రతిభతో తెలుగు వారికి నవ్య దృక్పథాన్ని అందించిన వారిలో వీరు కూడా ఉన్నారని చెప్పడంలో సందేహంలేదు.

కథలు చదివేటప్పుడు కథలోని భావాలు పాఠకుడి మనసును స్పృశించాలంటే భాష బలంగా ఉండాలి. కథలోని భావాలు బలంగా ఉన్నప్పటికీ కూడా ఆ భావాలకు తగిన భాషను ప్రయోగించక పోయినట్లయితే పాఠకుడి మనస్సుకు కథలోని భావాలు

చేరవు. దానివల్ల కథాప్రయోజనం దెబ్బతింటుంది. కథలో ఇతివృత్తం, నేపథ్యం, భావం, శిల్పంతోపాటు బలమైన భాష కూడా ఉండాలి.

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు తన కథల్లో సరళగ్రాంథిక భాషను వాడి పాఠకులందరి చేత శభాష్ అనిపించుకున్నారు. వీరి కథలు చదివిన ప్రతి తెలుగువాడు ఆ కథల్లోని తీయ్యదనాన్ని చవిచూస్తాడు.

వీరికి తెలిసినవి రెండే భాషలు, ఒకటి తెలుగు, రెండు సంస్కృతం. మరే యితర భాషలు వీరు నేర్చుకోలేదు. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారి అభిప్రాయంలో

"సంస్కృత భాష భాషలన్నీటికి మాతృభాష వంటిది. శ్రీపాద వారు తన అనుభవాలు-జ్ఞాపకాలలోనూ సంస్కృతం, తెలుగుల గూర్చి చెబుతూ ఇలా అంటారు. "సంస్కృతం వినా తెలుగుభాషకు పరిపూర్ణత లేదు. రానేరాదు కూడా."[1]

శ్రీపాదవారు సంప్రదాయ కుటుంబంలో పుట్టి పెరిగారు. ఆ కుటుంబంలో వారు అభిమానించేది సంస్కృత భాషనే తెలుగు చదువుకోవడాన్ని నీచంగా భావించే సంప్రదాయం వారిది. అటువంటి స్థితి నుండి బయటపడి, కుల వృత్తులను సైతం విడిచిపెట్టి తెలుగుపై అభిమానాన్ని పెంచుకొని వ్యవహారికంలోనే రచనలు చేయడం వీరి విశిష్టత.

అనుభవాలూ - జ్ఞాపకాలునూలో వీరు ఇలా చెప్పారు.

"నా దృష్టిలో తెనుగు దేశమే దేశం."

"తెనుగు భాషే భాష"

"తెలుగు మనుష్యులే మనుష్యులు"

"తెలుగు వేషమే వేషం."

"ఇంతేకాదు"

ఏ జాతి మొదటా - ఏ సందర్భంలోనూ - ఎందుకున్నూ నా తెలుగు జాతి తీసిపోదు." ఇంకా ఇలా అంటారు.

"తెలుగు భాష సరస్వతీ వాగ్విలాసం, స్వయంభువు అసూయాజనకమైన మాధుర్యం దానిది.

ఖండానికంతకూ ఏకైక మధురిమం అది."[2]

దీనిని కాపాడటమే నిజమైన జాతీయత అనేది వీరి అభిప్రాయము. భారతీయుల్లో తెలుగువారికి భాషమీద, ప్రాంతం మీద నానాటికీ అభిమానం దిగజారుతుందని దానిని కాపాడుకుంటేనే తెలుగు జాతి వికాసం పొందుతుందని రచనల్లోనూ, అనుభవాలూ - జ్ఞాపకాలూనూ ద్వారా చెప్పారు.

ఇంకా వీరు తెలుగు భాషను గురించి, తెలుగు పదాలను గురించి, తెలుగు నుడికారాలను గురించి ఇలా అంటారు.

"తెనుగు భాష తన విశ్వరూపం కనపరుస్తుంది...."

"నా తెనుగు భాష శాస్త్రీయం - తాటా బూటం కాదు"

"నా తెనుగు భాష యుగ యుగాలుగా ప్రవాహిని అయి ఉండినది గాని, యివాళ, ఆ భాషలో నుంచి ఒక మాటా, యీ భాషలో నుంచి మాటా, ఎరువు తెచ్చుకుని భరత విద్య ప్రదర్శిస్తున్నది కాదు."

"నా తెనుగు భాష సరస్వతికే తేనే చినుకులందించింది. గాని నీరు చప్పనిది కాదు."

"నా తెనుగు భాష ఎక్కడ పట్టినా చక్రవర్తుల రాజ్యాంగాలు నడిపింది గాని, పరాన్న భుక్కుగాదు."

"నాతెనుగు స్వతంత్రంగా బ్రతగ్గలది గాని కృత్రిమ సాధనాలతో ప్రాణవాయువు కూర్చుకోవలసిందీ కాదు, అక్రమ దోహదాలతో పోషింపబడవలసిందీ కాదు."

"యావద్భారత దేశంలోనూ, యీ విశాల విశ్వంలో కూడా.........."[3] అన్న ఈ మాటలు శ్రీపాద వారికి తెలుగు భాష మీద ఎంత మక్కువ ఉందో మనం తెలుసుకునేందుకు దోహదపడతాయి.

ఇప్పుడు వీరు రాసిన 'రామలక్ష్మి' కథలో భాషాప్రయోగాన్ని తెలియజేస్తాను. సూర్యారావు, రంగారావు ఇద్దరూ మిత్రులు. యఫ్.యే. పరీక్ష కోసమని చదువుకోవడానికి ఓ అద్దె మేడలో నివసిస్తూంటారు.

సాయంకాలం అయిదుగంటలయినది. ఎండ చల్లబడెను. శీతల ప్రచారము చాలా మందముగ నుండెను. మేడల నీడలు చాలా దూరము వఱకును ప్రాకిపోయినవి. సర్కారులో కొలువున్న వారందఱును ఇండ్లకు చేరుకొనుచుండిరి. తురక పిల్లలు కొందరు ఇంటింటికిని తిరిగి మల్లెపూవులను, చేమంతి పూవులను అమ్ముచుండిరి.

చాలా మనోహరముగానున్న యీ సమయమున బ్యాండు యొక్క మనోహర గమకములు, తరువాత గుఱ్ఱపుబండ్లు రెండు ప్రక్కలను వినోదము చూచుచుండ కూలి స్త్రీలు, పిల్లలు, రాకపోకలు సేయుచుండు మరికొందరు నుండిరి. దిదృక్ష ఉఱకలు వేయునంత మందముగ ఆ సమూహము వచ్చుచుండెను. పెండ్లివారికి ముందు వియ్యాలవారి నడకలు చూపుచుండగా ఈ మేడవసారాలోనికి వితంతు యువతియు, ఆ మేడ వసారాలోనికి తరుణ విద్యార్థియు నొక్కమఱే వచ్చిరి. వెంటనే ఇరువురి చూపులు

నేకమయినవి. ఇరువురి ముఖములను దరహాస భాసురములైనవి. ఇద్దరి కపోలములును పులికితములైనవి. ఇద్దరి నయనములును లజ్జాముద్రితములయినవి.

ఇంతే, ఇంతే కనబడినవి. వెంటనే యిరువురును లోపలకు బోయిరి. ఎందులకు వచ్చిరో, ఏల నవ్వుకొనిరో, ఎందులకు సిగ్గుపడిరో, ఏల వెడలిపోయిరో. వీరే రామలక్ష్మీ, సూర్యారావులు. సూర్యారావు, రంగారావు నివసిస్తున్న మేడకు ఎదురుగా రామలక్ష్మీ బంధువులతో కలిసి ఉంటుంది. రామలక్ష్మి యుక్త వయసులోనే ఉండటం వల్ల సూర్యారావు పట్ల ప్రణయం కలుగుతుంది. సూర్యారావు ఇంటి దగ్గర అతడి తల్లితండ్రులు సూర్యారావుకు మేనమామ కూతురుతో పెళ్ళి చేయాలని నిశ్చయించుకుంటారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ వేంకటావధానులు సూర్యారావుకు పండగ సెలవలు ఇవ్వగానే ఇంటికి రమ్మని ఉత్తరం రాస్తాడు. ఇది సూర్యారావుకు ఆశ్చర్యం కలిగించలేదు.

రాత్రి 8 గంటలకు దీపము వెలుగులో మేడ వసారాలో సూర్యారావు పెట్టె సర్దుకొంటుండగా ఎదుటి మేడ నుండి రామలక్ష్మీ ఓ పూల బంతిని విసిరి జారుకుంటుంది. సూర్యారావు మీద పడవలసిన ఆ పూలబంతి విధివిశాత్తు గురి తప్పి గదిలో చదువుకొంటున్న రంగారావు ఒడిలో పడుతుంది. ఏమిటోనని చూడగా రంగారావు అది బంతి పూలబంతి, దానికో చీటీ చుట్టబడి ఉంది. తెలివిగా వ్యవహరించి రంగారావు అది ఏమిటో అని తెరచి చూస్తాడు. అందులో "మీరు సంకురాత్రి పండుక్కి యింటికి వెళ్ళకండి" అని వుంటుంది. రంగారావు విషయాన్ని పసిగట్టి "తప్పదు నా స్థానమున నా మిత్రుడు రంగారావు సకలమును మాట్లాడును" అని ప్రత్యుత్తరము రాసి సూర్యారావు పక్కమీద కెళ్ళిన తరువాత అతడికి తెలియకుండా రంగారావు వసారాలో కొచ్చి ప్రత్యుత్తరము కోసం ఎదురుచూస్తూ స్తంభము చాటున ఆమె నిలబడియుండడం చూసి రంగారావు చీకట్లో ఉండే బంతి విసిరేసి లోపలికి వెళతాడు.

తెల్లవారుజామున సూర్యారావు మోటరు పైన ద్రాక్షారామము మీదగా రామచంద్రపురము వెళ్ళిపోతాడు.

సూర్యారావు, రంగారావు ఇద్దరూ మూడేళ్ళనుంచి కలిసే చదువుకుంటున్నారు. సూర్యారావు మేధావి. రంగారావు కల్పకుడు. వీరిద్దరూ ఒక ఊరువారు కాదు, ఒక జిల్లా వారైనా కాదు, ఒక శాఖవారన్నా కానేకారు. కానీ వీరి స్నేహం అలా సాగిపోతుంది.

రంగారావు భార్యను వదిలేసి మరో పెళ్ళి కోసం ప్రయత్నాలు జరుపుతూ ఉంటాడు. ఈ సంగతి అతడి మిత్రుడైన సూర్యారావుకు తప్ప ఎవరికీ తెలియదు. స్నేహితుడి సలహా

ప్రకారం రంగారావు అందరాని కన్యల మీది ఆశను త్రెంచుకొని వితంతువును పెళ్ళి చేసుకోదలచి వీరేశలింగం పంతులుగారితో ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుతుంటాడు. అత్యంత అందమైన వితంతువు కావాలనుకోవడం వల్ల అతనికి పంతులుగారు వివాహం చేయలేకపోయారు. ఎన్నోసార్లు అతడు పంతులుగారి ఆశ్రమానికి వెళ్ళి ఎంతోమంది వితంతువులను చూసి "ఇంతకంటే అందగత్తె వచ్చినప్పుడు తెలుపండి. తొందరలేదు గాని; సాధ్యమైనంత త్వరగా పెళ్ళి కావాలి" అంటాడు. పంతులుగారు రంగారావులోని మోసాన్ని పసికట్టి విసుగు చెందుతారు. కానీ పూర్వాచార పరాయణుని పుత్రునకు వితంతు వివాహము ఎలా అయినా జరిపించాలనే పట్టుదల వల్ల ఆ విసుగును జయిస్తారు. రంగారావు తన మొదటి భార్యను గురించి ప్రస్తావించవలసినపుడు ఆమె రంగూను లేచిపోయి నదంటాడు.

"రామలక్ష్మీ యేడెనిమిది సారులు రంగారావు మీదికి బంతులు విసరెను. ఒక బంతిలో నున్న జాబులో "ఎక్కడికి రమ్మంటే అక్కడికి వస్తాను" అని యుండెను. రెండవ దానిలో "పెళ్ళి చేసుకోవాలి తెలిసిందా? మరియొక విధంగా అయితే - అయితే - రాను తెలిసిందా?" అని యుండెను. మూడవ దానిలో "తొరగా కావాలి" అని యుండెను. నాల్గవ దానిలో "మొగ వేషంతో వూరు దాటుతాను సిద్ధం చెయ్యండి" అని యుండెను. అయిదవదానిలో "రేపు మా అన్నయ్య బందరు వెడతాడు. తెల్లారగట్ల బయలుదేరితే మంచిది" అని యుండెను. ఆ రాత్రి మూడుసార్లు బంతులు రాకపోకలు చేసెను (రామలక్ష్మీ)."

వీరేశలింగం పంతులుగారు కలకత్తా వెళ్ళారని, అక్కడ గొప్ప సంఘసంస్కరణా సభ జరగబోతున్నట్లు ఆ సభలో తొంభై తొమ్మిది మంది వితంతు వివాహాలు జరగబోతున్నట్లు, వందోవదిగా మన వివాహము జరిగితే బావుంటుందని వీరేశలింగం పంతులుగారు ఎంతగానో ప్రోత్సహిస్తున్నట్లు అందుకతడు ముందుగా అక్కడికి వెళ్ళి ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నట్లు, రంగారావు నిన్ను కలకత్తా తీసుకొస్తాడంటూ సూర్యారావు నాకు ఉత్తరం రాశాడని రంగారావు అభూతకల్పన చేసి, రామలక్ష్మిని నమ్మించి, ఆమె చెప్పినట్లే సిద్ధం చేసి సంకేతం ప్రకారం వేకువజామునే జట్కా బండి మీద పిఠాపురానికి అక్కడి నుండి తునికి తీసుకొచ్చి రైలెక్కించి కలకత్తా చేరుస్తాడు.

కలకత్తా చేరాక సూర్యారావు కనిపించకపోయేసరికి రామలక్ష్మి కలత చెంది "వారింకా వచ్చారు కారేమండీ?" అని అడుగుతుంది. "కారణం తెలవదు రేపు తంతి కొడతాను" అంటాడు. అందుకామె "సభ యెప్పుడండీ?" అనగా, "నాకు తెలవదు. ఆ వివరం మొదట

అతడు రాయలేదు. వీరేశలింగం గారి బసయినా తెలిస్తే వెళ్ళి మాట్లాడి వుందును" అంటాడు. అందుకామె జీవం లేని దానిలాగా నిరుత్తరయై వుండి "రేపు తప్పకుండా తంతి కొట్టాలి సుమండీ" యని ఉద్విగ్న స్వరముతో అన్నది.

ఎన్నిరోజులు గడిచినా సూర్యారావు నుండి జవాబు రాకపోయే సరికి రామలక్ష్మి రంగారావును మళ్ళీ తంతి కొట్టమంటుంది. అందుకతడు కొట్టే వచ్చాను. వీరేశలింగంగారి బస ఎక్కడో తెలుసుకుంటాను అని బయలుదేరి వెళ్ళిన రెండు గంటలకి ఒక తంతి వస్తుంది. రంగారావు రాగానే తంతి వచ్చిందండీ అంటూ రంగారావు మీదకు దానిని విసురుతుంది. అతడు వచ్చిందా అంటూ దానిని తెరిచి చదువబోతుండగా అమృత వాక్కులు వినబడతాయని ఆశ పడుతుంటే రామలక్ష్మికి రంగారావు ముఖంలో మహానందము తిరోహితము కాజొచ్చెను. ఏమిటీ అని ఆమె తెల్లబోగా "ఛీః మూర్ఖుడు మోసం చేశాడు" అంటూ ఆ తంతిని నేలకేసి కొడతాడు.

ఇంతకీ ఏమి రాశాడండీ అని రామలక్ష్మి అడగగా "ఛండాలుడు రాయడానికేమి వుందీ? తనకి మేనమామ కూతురు తప్పింది గాదుట క్షమించవలసినదని నీతో చెప్పమన్నాడు. నీ యిష్టం వచ్చిన వాణ్ని పెళ్ళాడి సుఖించమన్నాడు. నిన్ను తరువాత తాను వచ్చి చూసి దీవిస్తాడుట" అని బదులిచ్చాడు. దాంతో ఆమె దుఃఖంతో "ఆ తంతి యిలా యివ్వండి" అని చేయి చాపగా "యెందుకూ వెధవ తంతి?" అంటూనే దానిని ముక్కలుగా చించి అక్కడి నుండి వెళ్ళిపోతాడు.

రామలక్ష్మి దుఃఖానికి అంతులేదు. "ఇది నిజమే అయివుంటుందా? సూర్యరావు అలా రాస్తాడా? గొంతుకు కోస్తాడా?" అని ఎన్నోరకాలుగా ఆలోచిస్తుంటే, ఇంతలో రంగారావు తిరిగి మళ్ళీ వస్తాడు. రాగానే, "యేమంటావు మరీ? ఇంటికి తీసుకువెళ్ళమంటే తీసుకెడతాను. ఏం చెయ్యమంటే అది చేస్తాను. ఆ తుచ్ఛుడి రాతలు నమ్మి నిన్ను యింత దూరం తీసుకువచ్చాను. నామీద నీకు కోపం అక్కర్లేదు. నీ యిష్టం ప్రకారం చెయ్యడానికి నాకేమీ అభ్యంతరం లేదు. తొరగా నేను కాకినాడ పోవాలి. చదువు పాడయిపోతూ వుంది" అని పలకగా రామలక్ష్మి కాసేపు మౌనంగా వుండి "మీరు వెళ్ళిపోండి. నేను కాశీ పోయి గంగాదేవిని ఆశ్రయిస్తాను" అంటుంది.

అప్పుడు ఇద్దరూ పది నిమిషాలు మౌనంగా వుంటారు. ఇంతలో రామలక్ష్మి ముఖం పైకెత్తి చూడగానే రంగారావు చేష్టలను బట్టి తను మోసపోయినట్లు గ్రహించడానికి ఎంతో సమయం పట్టలేదు. కుటిల బుద్ధి కలిగిన రంగారావు ముఖములో మోహపూరితమైన

నవ్వు కనబడుతుంది. ఉత్తరక్షణమునందే రంగారావు ముఖము పైకెత్తి చూసే చూపుల్లో ఆశను కనబరుస్తూ “లేకుంటే దయ యుంచి - యిల్లు కదిలిరానే వచ్చావు గ-న-క నెత్తిమీద పెట్టుకుని పూజిస్తాను నన్ను పెళ్ళాడు” అంటాడు. ఆ మాటలకు రామలక్ష్మికి మెడలో మంగళసూత్రము బదులు కాలసర్పం చుట్టినట్లు తోచెను. దానితో ఆగ్రహావేశం పెల్లుబికి రామలక్ష్మి “ఛండాలుడా, నువ్వు నా కొంప తీశావు” అని మళ్ళీ కుమిలి, కుమిలి ఏడుస్తూ నేలకొరిగింది. ఇది చూసి రంగారావు భయభ్రాంతుడై మెల్లగా అక్కడి నుండి జారుకుంటాడు.

రామలక్ష్మి రోధన చూసి ఆమె బస ఉన్న ఇంటి యజమాని నగేంద్రనాధ బెనర్జీ సంగతేంటో తెలుసుకోవడానికి ప్రయత్నించగా భాష తెలియకపోవడం వల్ల విఫలుడై లోనికెళ్ళి చూడగా రంగారావు లేకపోవడాన్ని గ్రహించి రంగారావు మోసాన్ని పసిగట్టి బయటకెళ్ళి రంగారావును తంతి ఇవ్వమనగా అది లేదు చించేశానని పలికినప్పుడు, దాని నకలు సంపాదించొచ్చు అన్నప్పుడు, మీరు సంపాదించండి అంటూ రంగారావు మళ్ళా తిరిగి తన బసకొచ్చి తోలు పెట్టితో ఉడాయిస్తాడు. అతడిపై కోపంతో ఉన్న రామలక్ష్మి అతడ్ని ఏ మాత్రం అడ్డుకొనే ప్రయత్నం చేయలేదు. బెనర్జీ తిరిగి ఇంటికి వచ్చి అక్కడ ఉన్న తెలుగు వారితో ఇప్పుడు “నీ సంగతి యేమిటమ్మా?” అని అడిగిస్తాడు. తెలుగు మాట వినబడే సరికి రామలక్ష్మికి ప్రాణం లేచి వచ్చి తలుపు చాటు నుండి “పేరు సూర్యరావుగారు కాకినాడ కాలేజీలో యెప్పే చదువుతున్నారు. వారికి తంతి కొట్టాలి” అని సమాధానమిచ్చింది. ఆంధ్రుడు ఆ సంగతి బెనర్జీకి చెప్పగా, బెనర్జీ ఉన్న పలానే పోస్టాఫీసుకు వెళ్ళి అర్జంటుగా రావలసిందిగా సూర్యరావుకు టెలిగ్రామ్ పంపుతాడు.

టెలిగ్రామ్ అందిన వెంటనే సూర్యారావు బయలుదేరి కలకత్తా చేరతాడు. ఇంతలో రామలక్ష్మి జరిగినదంతా తలుచుకొని దుఃఖపడుతూ తాను మొదట విసిరిన బంతి కూడా సూర్యారావు చూసి వుండడేమో అసలు వస్తాడా? వచ్చినా నన్ను పెళ్ళి చేసుకుంటాడా? వంటి ప్రశ్నలెన్నో ఆమె మనసులో తలెత్తాయి. ఇంతలో సూర్యారావును నగేంద్రనాధ బెనర్జీ వెంట పెట్టుకొని  ఇంటికి తీసుకొస్తాడు. సూర్యారావు రాకతో రామలక్ష్మి దుఃఖం మరింత ఎక్కువవుతుంది. దానితో సూర్యారావు రామలక్ష్మితో “విచారించకు. నిన్ను పెళ్ళాడడానికి వచ్చాను” అంటాడు.

ఆరోజు సాయంత్రం కలకత్తాలోని బ్రహ్మసామాజికుల ప్రధాన కార్యస్థానములో వారిద్దరి పెళ్ళి జరుగుతుంది.

ఈ కథను ఇంత అద్భుతంగా తీర్చిదిద్దిన శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారి ప్రతిభ అమోఘమైంది. ఇంపైన పదజాలాన్ని సందర్భానుగుణంగా ప్రయోగిస్తూ కథను కొనసాగించిన తీరు అద్భుతం. ఈ కథలో ప్రయోగించిన కపోలములును, దిదృక్ష ఉఅకలు, లజ్జా ముద్రితములయినవి, కల్పకుడు, అవిసుపును, సంకేతానుసారముగ, నిరుత్తరయై, తంతి కొట్టాలి, ఉద్విగ్న స్వరముతో, అమృతవాక్కులు, తిరోహితము, తుచ్ఛుడి రాతలు, ఉత్తరక్షణమునందే వంటి పదాలే అందుకు అక్షరసాక్ష్యాలు.

## III. చలం భాష విశిష్టత :

చలం ఆధునిక భావాలకు ఆధునిక భాష ఉత్ప్రేరకంలా పనిచేసింది. తను చెప్పదలచుకున్న దానిని జంకూ, బెరుకూ లేకుండా చెప్పగలిగిన సమర్ధుడుగా తెలుగు సాహిత్యంలో పేరు గాంచాడు. సమాజంలో నానాటికీ కుచించుకుపోతున్న విలువల్ని వాటికి కారణమైన వ్యవస్థల్ని ఘాటుగా విమర్శించడంలో ఇతడికితడే సాటయ్యాడు. స్త్రీ స్వేచ్ఛ, స్త్రీ స్వతంత్ర్యాన్ని కోరి ఆ విషయాల పట్ల తన అభిప్రాయాల్ని వెల్లడి చేసి స్త్రీ పక్షపాతిగా ముద్రవేసుకున్నాడు. వ్యవస్థల పట్ల తన విసుగును వ్యక్తం చేసేందుకు ఉద్వేగవంతమైన, కరుకైన భాషను వాడి ఎంతోమంది విమర్శకుల నోళ్ళలో నానాడు.

ఇతడు రచనల్లో ప్రయోగించిన వాక్యాలలో ఎదుటివాళ్ళని చకితుణ్ణి చేయగలిగే అర్థం గోచరిస్తూంది. అనాధిగా అనుసరిస్తున్న, అంగీకరిస్తున్న విధానాలను, పద్ధతులను తిరస్కరించాడు. అనూహ్యమయిన ప్రతిపాదనం - మనకు తెలియని నూతన కోణం నుండీ విషయాన్ని చూపటం - చురుక్కుమని అంటుకొనే హాస్యం - విమర్శ - ఇంతలోనే మనస్సులోని లోతులను చూపే విశ్లేషణం - మళ్ళీ హఠాత్తుగా నక్షత్ర లోకాలకు విసిరివేసే ప్రకృతి వర్ణన - ఇవన్నీ తొందర తొందరగా కాలునిలువనీక, నిలిచీ నిలవకముందే మరొక చోటుకు చేయి పుచ్చుకు పరుగెత్తే వేగం - ఆవేశంతో ఒక్కటిగా పెనవేసుకొని ఉండే అంశాలు ఉంటాయి.

ఇది ఆయనకు సమాసాల వల్ల సాధ్యమైందా, జాతీయాలు, సామెతలు, నుడికారాల వల్ల కుదిరిందా, మహాప్రాణప్రయోగం - అనుప్రాసల ఆధిక్యం వల్లనా లేదా అచ్చతెలుగు వల్లనా అనే విషయాన్ని గురించి భాషా పరమైన వింగడింపు కుదరదు.

చలానికి 'హిపోక్రసీ' అంటే ఎంత మాత్రమూ నచ్చదు. ముఖానికి ముసుగులు కప్పుకొని, మాటల్లో ఒక విధంగా, చేతల్లో మరొక విధంగా ప్రవర్తించే వారిని తన రచనల్లో

అద్భుతమైన భాషా ప్రయోగంతో ఎన్నో సందర్భాల్లో గేలిచేశారు. చలం విస్తృతంగా కథలు రాసే రోజుల్లో దేశంలో స్వాతంత్రోద్యమం జరుగుతూ వుంది. వరదలా దేశాన్ని ముంచెత్తిన ఈ మహోద్యమంలో సహజంగానే కొంత బురద కూడా చేరింది. కొంతమంది అవకాశవాదులు ఉద్యమం పేరుతో పబ్బం గడుపుకోవాలని కాంగ్రెస్ ఉద్యమంలో జొరబడ్డారు. మహాత్ముని ఆదర్శాలు హిమాలయమంత ఎత్తులో ఉంటే, వాటిని అందుకోలేకపోయినా కనీసం అందుకోవాలనే ప్రయత్నం కూడా చేయకపోయినా, ఆయన అనుచరులమని డాంబికాలు ప్రదర్శించేవారు తక్కువేమీలేరు. ఆనాటి ఆ వాతావరణాన్ని చలం తన కథల్లో గొప్ప భాషా నైపుణ్యంతో ఆవిష్కరించాడు. దేశభక్తులమని జబ్బలు చరిచేవారు కూడా కట్టుకున్న ఇల్లాలి పట్ల సాధారణ భర్తల్లాగానే ప్రవర్తిస్తారనీ, ఈర్ష్యా, అసూయలకూ, స్వార్థ ప్రయోజన సాధనకూ వారు అతీతంగా ఉండరని చెబుతారు చలం కొన్ని కథల్లో.

చలం నిజమైన గొప్ప రచయిత. ఆధునిక తెలుగు సాహిత్యంలో ఆరంభం నుండీ అవిశ్రాంతంగా తను రాయదలచుకున్నదాన్ని రాసి, చెప్పదలచుకున్న దాన్ని చెప్పి విమర్శలను, ప్రసంశలను చవిచూసిన ఉత్తముడు. ఆ అనుభవంతోనే అతడు ఇలా అంటాడు.

"-కథను ఇట్లా నడిపిద్దామని అనుకోను. పాత్రని కాగితం మీద పెట్టగానే వాళ్లే నడిపించుకుంటారు కథని. అందుకే నా Theories కి విరుద్ధంగా ఉంటాయి నేను రాసేవి చాలాసార్లు -"[4] అన్న చలం మాటల్లో అతిశయోక్తి లేదు. అందువల్ల పాఠకులకు చలం పాత్రలు సజీవమూర్తుల్లా దర్శనమిస్తాయి.

"వాటి ఆవేదనలు, అన్వేషణలు, సంఘర్షణలు, అన్నీ అత్యంత శక్తివంతంగా మన గుండెను హత్తుకుంటాయి. " -- తనకూ ఈ ప్రపంచానికీ సామరస్యం కుదిరిందాకా కవి చేసే అంతర్ బహిర్ యుద్ధం కవిత్వం -" ('మహాప్రస్థానం' ముందు మాటలో) అని అన్న చలం ఈ 'యుద్ధారావాన్ని' వచనంలో తన రచనల్లో వినిపించాడనిపిస్తుంది. అతడి రచనలు చదివినప్పుడు. మనోవిశ్లేషణాపరంగా చెప్పాల్సి వచ్చినప్పుడు చలంగారి కథలు ఆయన నవలలకు తీసిపోవు. సహజంగానే నవలకున్నంత పరిధి కథకు ఉండదు. చిన్న అద్దంలో కథకుడు ఎంతో ప్రపంచాన్ని చూపించవలసి ఉంటుంది. ఇట్లాంటి పరిమితులున్నప్పటికీ చలంగారు పాత్రల మనఃప్రవృత్తిని అద్భుతంగా మనముందు ఉంచుతారు తన కథల్లో."[5]

ఈ సందర్భంలో చలం కథలో ఒకటయిన 'హరిజన సమస్య' కథలోని భాషను గురించి తెలియజేస్తాను. 'హరిజన సమస్య' కథలో డైరక్టరూ, కథకుడు హరియోగి మరణాన్ని యువకుడి ద్వారా తెలుసుకుంటున్న సందర్భంలో చలం ప్రయోగించిన భాషను ఇప్పుడు చూద్దాం.

ఈ కథ మూఢనమ్మకాల్ని, కులమతాల తీవ్రతని, వర్ణవ్యవస్థలో ఉన్న హెచ్చుతగ్గుల్ని చిత్రించింది. ఇది ఓ యోగి కథ. డైరక్టరు-కథకుడూ ప్రయాణిస్తూన్న కారు ఒక గంటకి నలభైమైళ్ళ వేగంతో పోతూ ఆకస్మికంగా రోడ్డు మధ్యలో ఆగిపోతుంది. ఇక చేసేది లేక చీకటి పడిపోతుండే ఆ నిర్మానుష్యపు ప్రదేశంలో ఉండటానికి జంకి నడక మొదలుపెడతారు డైరక్టరు-కథకుడు. వారలా కొంతసేపు నడవగా గ్లాసులైట్లు కనబడతాయి. జనసంచారం కూడా కనబడుతుంది. అప్పుడు హమ్మయ్య ఏదో ఊరు సమీపించిందనుకొంటూ వారికున్న భయాన్ని పోగొట్టుకొంటారు. ఇంతలో,

"తోటలు ఇళ్ళు, గుంపు అదేదో సమాధి తీర్థం లాగుంది. మొక్కుబళ్ళు చెల్లించుకుంటున్నారు. ధైర్యాలొచ్చాయి వాళ్ళకి. "చూశారా మూర్ఖం? మతం పట్లు వొదలాలంటారు ప్రభుత్వం" అన్నాడు కథకుడు.

"రాజకీయాల్లోకి తీసుకురావొద్దంటారు, అంతే."

"జీవితంలో కల్లా ప్రముఖమైన కులం, మతం రాజకీయాల్లోకి రావడం ఆపడం ఎవరి తరం? అందుకనే రష్యాలో దేవుడి పేరు చెపితే నరికేస్తామన్నారు. ఎన్ని ఉపన్యాసాలిస్తే మాత్రం ఆగుతుందా ఈ దేశంలో?"

"రష్యాలో నరికేస్తామన్నారని నీకెట్లా తెలుసు?"

"అనుకుంటారు."

"రష్యాలో మల్లె ఇక్కడా చెయ్యాలంటావా?"

"తప్పకుండా."

"అట్లా చేసి ఈ మూర్ఖమే పోతే, నీ కథలకీ, నా ఫిల్ములకీ ఏం డబ్బు వొస్తుంది? భక్తి పోయిందంటే, ఇంక చలం కథలే గతి."

"అంటే?"

"శృంగారం."

"శృంగారమైతే మాత్రం చలం కథలే ఎందుకు?"

"భక్తితో పాటు పాతివ్రత్యం మార్కెటు కూడా పడిపోతుంది. ఇంక బ్లాక్ మార్కెట్టే గతి, అంటే చలం."

"ప్రేమ లేదా?"

"వుందిలే. మీరందరూ ఏం చేస్తున్నారిప్పుడు మాత్రం? శృంగార ఘట్టాల్లో తెలిసో తెలీకో అతని వాక్యాలేగా దొర్లిస్తున్నారు."

ఇంతలో ఓ యువకుడు వారి దగ్గరకొచ్చి వారి గురించి తెలుసుకొని తన ఇంటికి ఆహ్వానిస్తాడు. పొద్దున్నే బండి చేసి దగ్గరలో ఉన్న బస్సులు తిరిగే రోడ్డుకు పంపిస్తానంటాడు.

ముగ్గురూ ఓ కూలిపోయిన చెట్టు మీద కూర్చుని తమాషా చూస్తుంటారు. ఇంతలో "ఏమిటి ఈ తీర్థం" అని అడగగా, ఆ యువకుడు "తెలీదా మీకిది?" హరియోగిగారి సమాధి. చంపేశాం మేము ఆయన్ని ఇప్పుడు ఉత్సవాలు చేస్తూన్నాం. ఇక మొక్కుకుంటాం వ్యాజ్యాలు గెలవడానికి, పిల్లలకోసం, జబ్బులు పోవడం కోసం.

"ఫలితం వుంటుందా" అని అడుగగా,

"ఆఁ" అని సమాధాన మిస్తాడా యువకుడు.అతడు విద్యావంతుడిలా ఉన్నాడు.

"ఎందుకు చంపారు ఆ యోగిని?" అని అడుగగా, ఆ యువకుడు యోగికి సంబంధించిన కథను వారికి తెలిపే ప్రయత్నం చేస్తాడిలా.

నా చిన్నతనంలో 25 ఏళ్ళ క్రిందగావును, ఎక్కడి నుండీ వచ్చారో, మా ఊళ్ళో తిరుగుతున్నాడు. తెలుగు మనిషే. ఇన్నాళ్ళు ఎక్కడ ఉండొచ్చాడేమో. వయస్సు చూస్తే నడివయస్సు దాటింది. ఎవరితోనూ మాట్లాడడు. పిలిచి పెట్టినా పళ్ళు తప్ప మరేమీ పుచ్చుకోడు. త్వరలోనే మహాత్ముడ్ని చేసుకొన్నారు వీళ్ళు. రాత్రి పూట ఏ చెట్టు కిందో పడుకుంటే పిల్లలకోసం, రోగాలు నయం చేసుకోవడం కోసం, తప్పిపోయిన గొడ్ల కోసం వీళ్ళు వెళ్ళి అతడి వద్ద మొరపెట్టుకొనేవాళ్ళు. విసుక్కుని లేచి వెళ్ళి వేరే చెట్టుక్రింద పడుకునేవాడు. పిల్లలమైతే ఇక సరేసరి. పెద్దవాళ్ళు చూడకుండా పగలు అతన్ని తిట్టి, రాళ్ళు విసిరేసి, గడ్డం లాగి అతన్ని ఏడిపించేవాళ్ళం. చాలా మందికి అతడి వలన వాళ్ళ కోరికలు నెరవేరాయనే భావన ఏర్పడింది.

ఓ రాత్రి హఠాత్తుగా మాట్లాడాడతడు తెలుగులో. ఆ ఊరి పెద్ద రైతు భార్య పిల్లలకోసం అతడి దగ్గరకొస్తే "వెళ్ళి ఓ కుర్రాణ్ణి చూసి పడుకో. నా దగ్గర ఏముంది" అన్నాడు నలుగురిలో. అతడి మీద ద్వేషం రేగింది. అతడు మౌనం వీడాడు. అతడి గురువు మూడేళ్ళ మౌనం ఆజ్ఞాపించాడట. ఆ గడువు తీరిపోయింది. ఎందుకీ వూళ్ళో వున్నావంటే "ఆజ్ఞ" అంటాడు. అతడు మాట్లాడటం ప్రారంభించిన తరువాత ఆ ఊరి వారికి ఎటువంటి వరాలు కానీ,

మేలులు కానీ జరగడంలేదు. వరాలడిగిన వారికి వేదాంతం వినిపించేవాడు. చాలా పేదవాడు, కటిక దరిద్రుడును. మేం పెట్టే బాధలు తట్టుకోలేక హరిజనవాడకి చేరుకున్నాడు.

ఆ వాడలో సూరిగాడు కొంచెం మోతుబరి. అతని పిల్లాడికి జబ్బుచేస్తే తల్లితండ్రిలిద్దరూ ఆ పిల్లోడ్ని ఈ హరియోగి కాళ్ళ మీద పడేసి జబ్బు నయం చేయమని రక్షించమని ప్రాధేయపడతారు.

అప్పుడు యోగి రక్షిస్తే ఈ పిల్లోణ్ని నాకు యిచ్చేస్తారా? అంటాడు. ఒప్పుకోక ఏం చేస్తారు, అంగీకరించారు. వెంటనే జబ్బు పోయింది. దాంతో కొంత దూరంలో ఓ గుడిసెవేసి యోగికి ఆశ్రయం కల్పించారు. యోగి పిల్లోణ్ని తీసుకోలేదు. తల్లితండ్రులు మాత్రం ఆ పిల్లోడ్ని యోగి గారి పిల్లోడిగానే భావించారు.

ఆ యోగి అక్కడ స్థిరపడగానే ఆ హరిజనవాడకే గొప్ప యోగం పట్టింది. పంటలు పండాయి. ప్రభుత్వం వారికి తోడ్పడింది.

యోగిగారి కీర్తి హెచ్చింది. ఖ్యాతి పెరిగింది. మా ఊరి నుంచి కూడా ప్రజలు ఎగబడ్డారు. పొరుగూళ్ళ నుంచి కూడా గుంపులు ప్రారంభమయ్యాయి. మహత్యాలు జరిగాయని కొందరంటే అవేమీ లేవని మరికొందరు అంటుండేవారు. క్రమంగా యోగిగారే తగాదాలను పరిష్కరించటం, కొట్లాటలు మాన్పడం, సలహాలు ఇవ్వడం మొదలైంది. సూరిగాడి కుటుంబం మీద యోగిగారికి అభిమానం ఉండనే ఉండేది. సూరిగాడి కొడుకు వీరన్న మాతో పాటు పక్క ఊళ్ళో హైస్కూల్లో చదువుకొనేవాడు. "హరిజనులు మా పేటలోకి రాకూడదు. కానీ ఒక్క ఆ ఆశ్రమంలో మాత్రం సమానులమై కలుసుకోడానికి మాలవాళ్ళకీ అభ్యంతరం వుండేది కాదు. మొత్తానికి ఆనాటి మా ఊరి యువకులందరమూ ఆయన శిష్యులం ఒక విధంగా (హరిజన సమస్య)."

"మేం కాలేజీకి వెళ్ళి నేర్చుకోవడం, పత్రికలు చదవడం, దేశంలో పెద్దల్ని కలుసుకోవడం, మా కలేజీలో డిస్కషన్లు చెయ్యడం, రాజకీయాల పుస్తకాలు చదవడం వీటితో మాలో మాకు భేదాభిప్రాయాలే గాక యోగిగారి ధర్మబోధనలు వుత్త పురాతనపు చాదస్తాలనిపించాయి. శలవలకి ఇంటికి వొచ్చినప్పుడు ఆయనతో వారించేవాళ్ళం. ఆయన అన్నిటికి అంగీకరించేవాడు. కాని ఆ అంగీకారం మాకు తృప్తిగా వుండేది కాదు.

"ఈ పూజలూ, భజనలూ వుత్త అర్థం లేని పనులే. పురాతనపు మూర్ఖత్వాలు" అంటే-

"నవీన మూర్ఖత్వాలు పురాతన మూర్ఖత్వాల కన్న నయమా?" అని నవ్వాడు.

"నవీన పద్ధతుల్లో మూర్ఖత్వం లేదు."

"కొన్నాళ్ళకి ఇవీ పురాతనమైన మూర్ఖత్వాలైపోవా?"

"అసల దేవుడున్నాడనడమే మూర్ఖం"

"ఎందుకు?"

"వున్నాడని ఎట్లా తెలుసు?"

"లేడని యెట్లా తెలుసు?"

"లేనిదాన్ని తెలుసుకోడమెట్లా?"

"ఉన్నదాన్ని తెలుసుకున్నావా?"

"దేన్ని?"

"నిన్ను"

"తెలీకేం?"

"తెలుసుకుంటే ఇంక దేవుడి ప్రశ్నేలేదు."

"ప్రస్తుత కాలానికి దేవుడి చాలా అనవసరం" అన్నాం మాలో ఒకరం. ఓ వెన్నెల రాత్రి.

"ఏం? నాకు మల్లేనే దేవుడూ ముసలివాడైనాడు గావును."

"అది కాదు. మానవుడే సర్వశక్తిమంతుడైనాడు."

"ఇప్పుడేం, ఇది వరకూ సర్వశక్తిమంతుడే."

"కాని ఇది వరకు కన్న ఇప్పుడు."

"తనని తాను తెలుసుకుంటున్నాడన్నమాట."

"కనక దేవుడు అనవసరమనుకుంటున్నాడు."

"చాలా మంచి లక్షణం."

"మరి మీరు ఈశ్వర భక్తిని ఎందుకు బోధిస్తారు?"

"శక్తి హీనులకి, మీ బోటి ధీరులకి కాదు."

ఆయన మమ్మల్ని చూసి నవ్వుతున్నాడనిపించింది. ఆయనకి తెలిసిందో ఏమో కొంచెం వుండి, మళ్ళీ అన్నాడు. "ఎబ్బే, ఈశ్వరుడు చాలా అనవసరం. ఎందుకంటే అవసరం వొచ్చిననాడు కోపగించడు. 'ఈ నాటికి నాతో పని కలిగిందా?' అని ఎత్తి పొడవడు."

"అయితే దేవుణ్ణి మేం వొదిలెయ్యడం తప్పు కాదంటారా?"

“అనవసరమైన దాన్ని ఆహ్వానించడం చాలా అనవసరం. కాని ఈశ్వరుడి అవసరం చాలా తప్పని అవసరం.”

“మాకు అవసరం కాదు.”

“చెపితినిగా, అవసరం కానన్నాళ్ళు చాలా అనవసరం (హరిజన సమస్య).” ఇట్లాంటి Platitudes (ప్లాటిట్యూడ్స్) మాట్లాడేవాడు ఆయన.

“కాలేజీలో మార్పు చెంది ఆయన్ని ధిక్కరించిన మాలో ముఖ్యుడు సూరన్న కొడుకు. యోగి గారి ప్రేమ పుత్రుడు, వీరన్న. అతను తమాషాగా తయార్తై మానించి కూడా దూరమౌతున్నాడు. హరిజనుల్ని అగ్ర కులస్తులు చాలా ఘోరం చేశారనీ, చేస్తున్నారనీ ఇంక ఒక్కవారం, ఒక్కరోజు హరిజనులు ఆ దుర్గతిని సహించకూడదనీ, హరిజన విప్లవం వెంటనే లేవతీయాలనీ అతని నిశ్చితాభిప్రాయం. ఏ ఉపన్యాసంలో, ఏ సంభాషణలో, యెక్కడైనా అప్రస్తుతంగా అదే మాట, అదే కలవరింత. అతనికేమన్నా పిచ్చియెక్కిందేమో ననిపించింది. ప్రతి పత్రికకీ వ్యాసాలు పంపేవాడు అదే పద్ధతి మీద అచ్చు కానీ, కాకపోని. ప్రతి శలవల్లోనూ తన పేటలో హరిజనులకి ఉపన్యాసాలిచ్చి, యువకుల్ని రెచ్చకొట్టి ఒక సైన్యంగా తయారుచేస్తున్నాడు. ఆ ఉద్రేకాన్నే యోగి గారి ముందు వెళ్ళబోసేవాడు.

“హరిజనులకి జరుగుతున్న ఈ అన్యాయాన్ని ఎట్లా అంగీకరిస్తున్నారు మీరు?” అన్నాడు దూకుడుగా.

“ఆ అన్యాయాలు నా అనుమతి కోరందే” అన్నాడు ఆయన నవ్వుతో.

“మీరు వాటిని అంగీకరిస్తారా?”

“నేనేమిటి? ఎవరూ ఏ అన్యాయాన్నీ అంగీకరించరు.”

“కాని, ఈ అగ్రకులం వాళ్ళు అంగీకరిస్తున్నారు.”

“అంటే - వాళ్ళకేదో న్యాయం కనపడుతోందన్న మాట.”

“ఏం న్యాయం? స్వార్థం.”

“ఆచారం, కాలం.”

“అవి వొప్పుకుంటారా మీరు?”

“నా అంగీకారంతో గాని, అనంగీకారంతోగాని లోకం మారితే ఇంక కావలసింది ఏముంది?”

“నేను ఆచారాన్ని ఒప్పుకోను.”

“చాలా మంచి పని.”

"వాళ్ళు ఒప్పుకుంటారు."

"చాలా మంచి పని."

"రెండూ ఎట్లా మంచివౌతాయి."

"నీళ్ళూ, నిప్పూ రెండూ మంచివైనట్టే."

"సరే లెండి. కాని నేనిదంతా మార్చబోతున్నాను."

"తప్పకుండా మార్చు."

"మీరేమంటారు?"

"ఇప్పుడేమంటాను? మార్చావంటే - కబీరు, బుద్ధుడు, రామానుజుడి కన్న గొప్పవాడి వంటాను."

"ముందు ఈ వూరిని మార్చబోతున్నాను."

"మార్చెయ్యి. అదేదో నేనూ నేర్చుకుంటాను."

"ఏమిటి?"

"మార్చే విద్య."

"ఏం లేదు. బలవంతంగా చొరబడటమే !"

"చొరబడి మళ్ళీ బయటకి వొస్తావా, అక్కడే వుంటావా?"

నవ్వాము

"ఆ ఆచారాన్ని పగలకొడతాను. ఎవరడ్డమొస్తారో చూస్తాను."

"చూడనీరేమో !"

"వాళ్ళకి ఏం అధికారం వుంది, మానవుడు మానవుణ్ణి పశువుగా చూడడానికి?"

"నువ్వూ అదేగా చేస్తున్న పని?"

"నేనా?"

"మరి బలవంతంగా చొరబడేది పశువేగా?"

ఎంత నవ్వాము!

"సర్వసోదరభావం కలిగిస్తాను."

"సోదరుడితో బలవంతంగా కలబడి"

"కలబడితేగాని బుద్ధి రాదు."

"బుద్ధి తెచ్చుకునే ప్రమేయం లేనే లేదా ఏమిటి, ఇతర్లకి బుద్ధి తెప్పించటమే గాని?"

వీరన్నకి చాలా కోపం ఒచ్చింది.

"మీవన్నీ వుత్త మాటలు తీరిగ్గాకూచుని దేవుడి న్యాయం, ఏర్పాట్లు అనే మత్తు మందు, బద్ధకం. నాకు మరణమన్నా భయంలేదు."

"జీవితమంటే భయమన్నమాట?"

ఓడిపోయినా ననిపించిందో, లేక పూర్వపు గౌరవం తిరగబెట్టిందో "అయితే ఏం చెయ్యమంటారు? ఇట్లానే హీనస్థితి ననుభవించమంటారా?" అన్నాడు వీరన్న.

"అన్ని స్థితుల్లోకీ హీనస్థితి ద్వేషం; మనుషుడో, దేవుడో తనకి హీనస్థితి నిచ్చాడనే కోపం, తిరుగుబాటు.

"ఇదంతా పూర్వం నించీ బ్రాహ్మణులు - బోధించిన విషం, తక్కిన జాతుల్ని అణగతొక్కి వుంచడానికి."

"అగ్రజాతుల్ని అణగతొక్కడానికి ఈనాడు తక్కిన జాతులు బోధిస్తున్న కాలకూట విషం ఈ ద్వేషం" అని గట్టిగా అన్నారు యోగి గారు.

"మీరు అగ్రజాతుల వేపా?"

"ద్వేషం లేని వారి వేపు."

"వారికి లేదా ద్వేషం?"

"ప్రస్తుతం పైకి లేదు. నువ్వు నీ ద్వేషంతో దాన్ని రగిల్చిందాకా."

"ఒక్క కులాలే కాదు; దేశాలు దేశాల మీద, బీదలు ధనికుల మీద తిరగబడి తమ హక్కుల కోసం నిలబడే జ్ఞానం, పటుత్వం వొచ్చాయి ఈనాడు."

"తిరగబడడం జ్ఞానమూ పటుత్వమూ కావు, అజ్ఞానం, బలహీనత, నిజమైన పటుత్వం తిరగబడదు. ఇదివరకు లొంగిపోయిన బలహీనతే తిరుగుబాటులోకి రూపం మారింది అంతే."

"మరి ఇట్లా అణిగి, నలిగి క్షీణించివలసిందే?"

"బలం లేనప్పుడే అవన్నీ జరుగుతాయి."

"ఇంక మాకు సుఖ మనేది అఖ్ఖర్లేదా?"

"సరైన మాటలకి వొచ్చావు. సుఖం దేని మీద ఆధారపడి వుందో ఆలోచించుకో సమత్వం, స్నేహం, సత్యం, సహనం వీటిమీద. దేవుడు లేకపోనీ, ఈ విషయాలు ప్రతి హృదయంలో వెలుగుతున్నాయి. వాటి నుంచి తప్పి సుఖం లేదు. ఒకరు అన్యాయం

చేస్తున్నారని నువ్వు న్యాయం తప్పితే, నిన్ను కాపాడేందుకు రక్షణ ఏదీ? తగూ పెట్టి హక్కులు సంపాయిస్తావు. సుఖానెక్కణ్నించి తెచ్చుకుంటావు?"

ఇట్లా వాదించుకునే వాళ్ళు వాళ్ళిద్దరూ. కాని యోగిగారి మాటలు వీరన్నకి నచ్చలేదు. చీకిన పురాణ నీతులనేవాడు (హరిజన సమస్య)."

ఇంతలో అనుకొన్నదే తడవుగా వీరన్న ఆ ఊళ్ళో ఎవరికీ తెలియకుండా గ్రామ విప్లవాన్ని సిద్ధం చేశాడు. దసరా ఆ ఊళ్ళో పెద్ద పండుగ. పూజలు, పందిళ్ళు, సంతర్పణలు, కలశాలు, ఊరేగింపులు హడావిడిలో ఊరంతా మునిగి వుండగా, ఓరోజు సాయంత్రం వచ్చి పడ్డారు. హరిజనులు ఊరి మీద కర్రలతో. నాకు తెలీగానే హడలిపోయాను. ఎందుకంటే వీరన్న అంతర్యం నాకు తెలుసు.

"ఎబ్బే - యీ ప్రభుత్వం చేసే శాసనాలు ఏం లాభం లేదు. ఎన్నటికీ కలుపుకోరు మమ్మల్ని ఎన్ని శిక్షలతో బెదిరించినా, ఇంకా గ్రంథాలు వెతికీ తప్పించుకుంటారు. అట్లా కాదు. హరిజనులు విప్లవం చేసి మీ స్త్రీలు హరిజన బిడ్డల్ని కనాలి" అనేవాడు.

అదీ నా భయం.

"మా వూళ్ళో పెద్ద హరిజన సమస్య లేనేలేదు. ఆ ముసలి వాళ్ళని నొప్పించడం యెందుకని మరీ ఇళ్ళల్లో కలుపుకోలేదు మేము వాళ్ళని - అంతే.

"పోనీ వీరన్న పదేళ్ళు ఆగవోయ్. ఈ ముసలి వాళ్ళని చావనీ. మనందరం ఏకమవుదాం." అన్నాను.

"అప్పటికి నువ్వు ముసలివాడవై ఇప్పటి ముసలాళ్ళ మల్లేనే పట్టుబడతావు. నువ్వు లేకపోతే తక్కినవాళ్ళు నీ మాట సాగనీరు. అదేం లాభం లేదు" అన్నాడు, అతను చాలా కసిగా. నిజమేననిపించింది నాకూ.

ఆ దసరా నాడు ముందుగా హరిజనులు స్త్రీల గుంపు మీద పడ్డారు. వూరి మగవాళ్ళు చాలామంది పొలాల్లోకి వెళ్ళిపోయినారు మధ్యాహ్నమే. నాకేం తోచలేదు. ఈనాడు హరిజనులు దుర్మార్గం చేసినా, రేపు మా వాళ్ళు వాళ్ళని నాశనం చెయ్యక మానరు. చప్పున యోగి జ్ఞాపకం వొచ్చారు. ఒక్క పరుగు తీశాను ఆశ్రమానికి. నా వీపు వెనక హరిజనులు బలవంతం చేస్తున్న స్త్రీల అరుపులు, వాళ్ళకి అడ్డుపడ్డ మా యువకుల గోల.

ఆశ్రమం చాలా ప్రశాంతంగా వుంది. చిలకలు గుంపులుగా ఎగురుతున్నాయి వేపచెట్లు మీదకి, నా కళ్ళముందు నెమ్మదిగా తొలిగిపోయినాయి ఉడతలు. గాలి తీరుబడిగా వీస్తోంది.

చెట్టుకింద శాంతంగా కబుర్లు చెప్పుకుంటూ కూచ్చున్నారు స్వామిగారు ఇద్దరు ముసలమ్మలతో, నన్ను చూడగానే చిరునవ్వుతో, "రా, కూచో" అన్నాడు.

హడావిడిగా నా కబురు కక్కాను. వెంటనే ఆ డెబ్భై ఏళ్ళు దాటిన వృద్ధుడు లేచాడు.

"చేశాడా, అంతపనీ!" అంటూ నాకంటే వడిగా పరిగెత్తుతున్నాడు. ఆయన అట్లా ఆదుర్దా పడడం నేను ఎన్నడూ చూడలేదు. పుటకలేదు, చావులేదు అనే వేదాంతికి అంత ఆదుర్దా, మమకారం ఎందుకు? ఎవరికోసం?

ఆయన చాలాసార్లు చెప్పారు మా వూరి పెద్దలతో "కాలం మారుతోంది. ఎందుకు ఏర్పడ్డదో ఈ వర్ణ బేధం - ఈనాడు చాలా అన్యాయం, అసహ్యం. ఈ బేధాన్ని తీసెయ్యండి రెండు పేటల్ని కలిపెయ్యండి" అని.

"పెద్దలు తమరుకూడా అట్లాంటి వర్ణ సంకరాన్ని బోధిస్తారా?" ఋషులు పెట్టిన నియమాలు" అన్నారు వాళ్ళు.

"ఈనాటి ఋషిని నేను. నేను చెప్పేమాట వినండి" అనేవారు ఆయన. కాని ఎవరు వింటారు?

అయిదు నిముషాల్లో చేరుకున్నాం మా వూరు ఆ దృశ్యం ఏం చెప్పను? ఈ లోపల మా స్త్రీలని ఎన్ని అవమానాలు చేశారో! దూరం నుంచి పొలాల్లోంచి పరుగెత్తుకు వొస్తున్నారు మా వాళ్ళు - కర్రలతో, కొడవళ్ళతో, చేతి కత్తులతో.

సరాసరి అమ్మవారి పూజ పందిరిలోకి వెళ్ళాం. అక్కడ జరిగిన అసహ్యం వర్ణించలేను. విగ్రహాన్ని పగలకొట్టారు. అమ్మగారి పీఠానికి ముందే వీరన్న నా భార్యని పట్టుకుని కిందపడేసి ......... పందిరి గుంజని పీకి ఒక్క దూకు దూకాను అడ్డుపడ్డ స్వామిగారిని కింద పడతోసి. ఇంకా తన పెంపుడు కొడుకు మీదే మమత.

వీరన్న నన్ను చూసి అరుస్తున్న నా భార్యని వొదిలి పక్కనున్న కర్ర తీసుకుని నా మీదికి దూకాడు. తరువాత ఏం జరిగిందో ఇద్దరం కొట్టుకున్నాం. చూసేసరికి రెండు దెబ్బలూ, మధ్య అడ్డం వొచ్చిన యోగి గారికి తగిలాయి. ఆయన "హరి హరీ" అంటూ ప్రాణం విడిచారు.

నిర్ఘాంత పోయినాము ఆ రక్తం చూసి అంతే, అక్కడితో ఆగిపోయింది ఆ వైరం. ఎక్కడి వాళ్ళు అక్కడ నిలిచిపోయినారు.

హరిజనులూ, మేమూ అందరమూ కలిసి ఆయనకి సమాధి కట్టించాము. ఎంతమంది మా స్త్రీలని హరిజనులు ఏం చేశారో కిక్కురు మనకుండా ఊరుకున్నాము. వీరన్న కోరిక

నెరవేరింది. స్వామిగారి అనుగ్రహాన పిల్లలు లేనివాళ్ళకి కొంతమందికి తొమ్మిది నెలల్లో పిల్లలు కలిగారు. మా ఊళ్ళో హరిజన సమస్య లేదు. ఆదర్శమైన గ్రామం కింద వినుతి కెక్కింది. హరిజన సమస్యలను సాధించడానికి ప్రాణాలర్పించారని యోగిగారి కీర్తిని పత్రికల నిండా అచ్చు వేయించుకున్నాము. నాకూ, వీరన్నకూ ఆర్నెల్లు ఖైదుపడ్డది. ప్రతి సంవత్సరం హరియోగి గారికి ఈ ఉత్సవాలు చేస్తూన్నాము. మొదటి నుంచీ అంత గొప్ప సంస్కర్తకి ఆశ్రయమిచ్చి ఆయన అహింసా బోధనలు ప్రకారం నడుచుకున్న యోగ్యులకింద మా ఊరి పేరుని దేశమంతా చాటుకున్నాము (హరిజన సమస్య).''

ఈ విధంగా చలం 'హరిజన సమస్య' కథను అద్భుతంగా రాసి తనలోని సంస్కరణా భావాలను తెలుపడమే కాక ఈ కథను నడిపేందుకు ఆధునిక భాషలో వినూత్నంగా ఆంగ్ల పదాలైన బ్లాక్ మార్కెట్టే, డిస్కషన్లు, ప్లాటిట్యూడ్స్ (platitudes), కాలేజీలో, talent (టాలెంట్) వంటి పదాలని ప్రయోగించడం, ఇవే కాకుండా దొర్లిస్తున్నారు, బండి చేసి, వ్యాజ్యాలు వంటి పదాలను వాడి ఆధునిక సాహిత్యంలో అందులోనూ కథా ప్రక్రియలో తన స్థానాన్ని పదిలపరుచుకొన్నారు.

## IV. బాపిరాజు భాషా వైదుష్యం :

అడివి బాపిరాజు సమాజంలో ఉన్న మానవజాతిలోని హెచ్చుతగ్గుల్ని, కులమతాల తారతమ్యలని, స్త్రీల సమస్యల్ని, భూస్వాముల ఆదిపత్యాన్ని తన కథల్లో చిత్రించి సంస్కరణోద్యమానికి కథాసాహిత్యం ద్వారా తనదైన పంథాలో సేవలందించారు. ఇందుకు వారి అనుభవాలు ఎంతగానో ఉపయోగపడ్డాయని చెప్పడానికి వారు ప్రయోగించిన భాషే నిదర్శనం.

ఆంధ్ర వాఙ్మయం పై అన్యభాషల ప్రభావం మొదటినుంచి బాగా కనబడుతుంది. ఒక్క మాటలో చెప్పలంటే అన్యభాషల ప్రభావం లేని భాష అంటూ ఏదీ ఈ ప్రపంచంలో లేదు. ఇది ఏ భాషకు మినహాయింపు కాదు. ఎంత ఎక్కువగా అన్యభాషా పదాల సంపర్కం వుంటే అంతగా ఆ భాష ప్రపంచ భాషలో అభివృద్ధి చెందినదని భాషా శాస్త్రజ్ఞుల అభిప్రాయం. దీనికి ఆంగ్లభాషను ఉదాహరణగా పేర్కొనవచ్చు.

ఒక జాతి మరొక జాతిపై రాజకీయంగా, సాంస్కృతికంగా, సాంఘికంగా, మతపరంగా, ప్రభావాన్ని కనబరచినట్లే ఒక భాష మరొక భాషను ప్రభావితం చేస్తుంది. బ్రిటిషు పరిపాలనా కాలంలో తెలుగు సాహిత్యంలో ఇంగ్లీషు పదాలు కోకొల్లలుగా చేరాయి. అదేవిధంగా

మహమ్మదీయుల పరిపాలనా కాలంలో ఉర్దూ, అరబిక్, పర్షియన్ మొదలైన భాషాపదాలు విరివిగా చోటు చేసుకున్నాయి.

తెలుగు సాహిత్యంలో ప్రతి రచయిత రచనల్లోనూ, అన్యదేశ్యాలు కనబడుతున్నాయి. అలాగే అడివి బాపిరాజు సాహిత్యంలో కూడా అన్యదేశ్యపదాలు చోటుచేసుకున్నాయి.

కథకు సొగసునిచ్చేది భాష. వస్తువుకు తగిన భాషను, పాత్రకు తగిన సంభాషణను ఎన్నుకోవడం రచయిత చేపట్టవలసిన ముఖ్య కర్తవ్యం. బాపిరాజు కళాత్మక కథల కొక విధమైన భాషను, సాంఘిక కథలకు మరొక విధమైన భాషను ప్రయోగించాడు. మొదటి భాష కావ్యభాషకు, రెండవ భాష వ్యావహారికానికి దగ్గరగా ఉంటాయి. గ్రాంథిక ఛాయలు కనిపించినా ఆయన భాష మొత్తం మీద వ్యావహారికమే.

ఆంధ్ర సాహిత్యంలో అభివృద్ధి చెందిన వాఙ్మయ విశిష్టతల్లో ప్రత్యేకతను సంతరించుకున్నది అన్యభాషాపద ప్రయోగం. ఇది విలువైంది, ప్రయోజనాత్మకమైంది. ఒక భాష ఇతర భాషలతో పరస్పర సంబంధం కలిగిన కొద్దీ ఆయా భాషల పదాలు వచ్చి చేరడం పరిపాటి. అడివిబాపిరాజు సాహిత్యంలో అన్యదేశాలైన అరబిక్, పారశీకం, ఉర్దూ, హిందీ, పోర్చుగీసు, ఆంగ్ల పదాలు ఎక్కువగా చోటుచేసుకున్నట్లు తెలుస్తుంది.

ఈ సందర్భంలో అడవి బాపిరాజు సాంఘిక కథల్లో ఒకటైన 'దీపావళి' కథలోని భాషా ప్రయోగాన్ని తెలియజేస్తాను. ఇందులో రచయిత పండగ వాతావరణాన్ని వ్యవహారిక భాషలో చిన్న, చిన్న వాక్య ప్రయోగాలతో సాక్ష్యాత్కరింపచేశారు. కథలో వుప్పరుల దుస్థితిని మన కళ్ళ ముందుంచారు. పండుగ జరుపుకోవాలని ఉన్న జరుపుకోలేని వుప్పరి వాళ్ళబ్బాయయిన చిట్టిగాడి పరిస్థితిని మనం గమనించాలి. అటువంటి పాత్రను సైతం సృష్టించి బాపిరాజు కథకుడిగా తనను తాను నిరూపించుకున్నాడు.

కథలో ఓ ఊరి వాతావరణం మనకు కనబడుతుంది. దీపావళి నాడు కటిక చీకటిలో దీపాలు, నల్లటి ఆకాశంలో మెరిసే నక్షత్రాలు. కారు చక్కదనం నవ్వితే ముత్యాల పలువరసలు.

అరుగు మీద దీపాలు. వాకిలి ముందర మొగ బొబ్బాసి చెట్ల మీద అమరించిన దీపాలు ఆకాశదీపాలు, ఇళ్ళల్లో దీపాలు, గుళ్ళల్లో దీపాలు, రంగురంగుల మతాబాలు, విదేశీ బాణాసంచాలు, స్వదేశీ బాణా సంచాలు, టపాకాయల ఫిరంగి మోతలు, చిచ్చుబుడ్లు, తూటాలు, తారాజువ్వలు, దీపాలపండగ వెలుగు వర్షముతో కళకళలాడిపోతుంది. అయితే ఓ వుప్పరి అబ్బాయికి మాత్రం దీపావళి లేదు.

పొద్దుణ్ణుంచీ బాణసంచాల కొట్ల దగ్గర చింపిరి జుట్టుతో అల్యూమినియం మురుగులతో, నీలి జేగురూ కలిపిన వంటి రంగు వెలుగుతో ఆ వుప్పరి అబ్బాయి నిలిచి విస్తుబోతూ చూస్తూనే ఉన్నాడు. అందరికి బాణా సంచాలు : అతనికి మాత్రం లేవు.

ఎంతసేపు ఎదురు చూసినా, ఎన్ని గంటలు నిరీక్షించినా ఒక్క తాటాకు టపాకాయగాని, సిసింద్రీగాని, మతాబా అగ్గిపుల్లగాని ఆ కుర్రవాడి  చేతిలో పెట్టే దయతో నిండిపోయిన హృదయం కలవాడు ఒకడూ కనిపించలేదు. పొద్దున్నించీ లక్షల కొద్దీ టపాకాయలమ్మిన సాహెబు

"సాలా బాగా పేలుతాయండీ! జర్మనీ వాడి ఫిరంగిలా వుండాలీ. మీకీ అయిదు వందల్ ఏసుకోండి" అని విచిత్రంగా అమ్మగలిగాడు కాని, కొనేవాళ్ళకి చూపించడానికి కాలిస్తే పేలకుండా, తుస్సుమన్న టపాకాయి కూడా ఆ కుర్రవాణ్ణి ఏరుకోనిచ్చాడు కాదు.

సాయంకాలానికి బందరు వీధులన్నీ తిరిగి ఆ కుంకాయి బచ్చుపేటలో బాగా బాణాసంచాలు కాల్చే ఒక మేడ ముందర నిలబడ్డాడు. ఆ ఇంటిలోని పెద్దలు ఆడపిల్లల చేత, మొగపిల్లల చేత కాల్పించిన బాణాసంచాలు విదేశీవి, స్వదేశీవి నలభై రూపాయల దాకా ఉంటాయి.

వాడి ఒళ్ళు ఉక్కు కడ్డీలాగే గట్టిగా వుంది. మెరుగు పెట్టిన ఎర్రవాయిలా, నున్నగా తళతళలాడుతోంది. కనుముక్కు తీరు కలిగి వున్న మొఖం మీద కాంతులు నృత్యం చేస్తున్నవి. మతాబాల వెలుగు ఆ జుట్టు మీద పడినప్పుడల్లా మబ్బు పింజల మీద పడిన సూర్యుడి వెలుగులా ఆరిపోయింది. వాడికి పొద్దుటి నుండీ కడుపులో కూడులేదు.

సాయంత్రం వాడు ఆ ఇంటి దగ్గర నిలుచున్నప్పటి నుంచి ఆ యింటి వారి వెధవాడపడుచు ఆ అబ్బాయి వైపు తదేక దృష్టితో చూస్తూనే ఉంది. ఇంటి కెదురుగుండా నిలుచున్న ఉప్పరి వాళ్ళబ్బాయి మీద నుంచి ఆమె చూపులు మరలిపోలేదు. చీకట్లలో కలిసిపోతూ, వెలుగుల్లో మెరిసిపోతూ కదలకుండా ఈ కాలి మీద వంగి ఒక మాటూ, ఆ కాలి మీద వంగి ఒక మాటూ నిలుచుని వున్న ఆ పాపడు ఆమె హృదయాన్ని ఆమె ఆలోచననూ ఇనుమును అయస్కాంతం లాగినట్లే లాగేశాడు.

"ఉన్నట్టుండి కళ్ళు తిరిగి ఆ కుఱ్ఱవాడు భగ్నమైన ఆశలు కింద కూలినట్లు పడిపోయాడు. ఆ జ్వాలా మహోత్సవంలో అరుగు మీద ఉన్న వాళ్ళెవరికి, ఆ కుఱ్ఱవాడు పడిపోవటం గమనించవలసిన అవసరమే లేకపోయింది. అది పురుషోత్తమ్మ చూచింది. ఒక్క పరుగులో మెట్లన్నీ దిగింది. తృణావర్తుణ్ణి హతమార్చి భూమి మీద వాలిపోయిన

శ్రీకృష్ణుణ్ణి ఎత్తుకున్న యశోదలాగ పురుషోత్తమ్మ ఆ బాలుణ్ణి ఎత్తుకున్నది; సావిట్లో బల్లమీద పడుకోబెట్టి ఇంట్లోకి పరుగెత్తుకెళ్ళి, వెండి గిన్నెలో ఇంత మజ్జిగ పోసి అందులో ఇంత వేడి వేడన్నం మెత్తగా పిసికి, మెతుకులు పిండి పారేసి ఆ గిన్నె పట్టుకు చక్కా వచ్చింది.

ఆ పిల్లవాడి నోట్లో చుక్క చుక్కా ఆమె పోయడం మొదలు పెట్టింది. ఇదంతా చూస్తూ తెల్లబోయి, వాళ్ళు వాళ్ళేమీ మాట్లాడలేకపోయారు. అన్నసారం దిగిన కొద్దీ ఆ పాపడికి ప్రాణం తెప్పరిల్లి నెమ్మదిగా మెళుకువ వచ్చింది.

**ఒక ముసలాయన** : ఈ వెధవను తీసుకు వచ్చి బల్ల మీద పడుకోబెట్టిందేమిటి? పాడుపని!

**ఒకావిడ** : వీడెల్లా వచ్చాడిక్కడికి?

**ఒక చిన్నపిల్ల** : మన ఇంటి ముందర పడిపోతే అత్తయ్య తీసుకొచ్చింది.

**ఆవిడ** : మడిగట్టుకొని ప్రతి వెధవనీ ముట్టుకోవడమేనా? మన పనివాళ్ళచేతికి ఇస్తే నోట్లో పొయ్యరూ?

**ఆయన** : ఈవిడగారికి ఈ పెత్తనమేమిటి?

పురుషోత్తమ్మ ఈ మాటలన్నీ వింటమేలేదు. ఆ కుఱ్ఱవాడు కళ్ళు విప్పేటప్పటికి ఆమె ప్రాణాలు కుదుటపడ్డాయి. చల్లని గాలిలా సంతోషం ఆమె దేహమంతా ప్రసరించింది. ''నాయనా? ఇదంతా తాగు'' అని ఆ గిన్నె వాడి చేతికిచ్చింది.

''ఇంక వీణ్ణి పంపించు; చేసింది చాలు''

''నీ పేరేమిట్రా వెధవా, ఎవరబ్బాయివి?''

''మేం ముప్పరాళ్ళ మండి, నా పేరు చిట్టిగాడు.''

భోం చేసి చెయ్యి కడుక్కొని వచ్చిన ఇంటి యజమాని, ''వాడి చేతుల్లో రెండు కాసులు పెట్టి పంపించివేయండి. ఎవరైనా ఇల్లాంటివి చూస్తే మనకు అపఖ్యాతి కూడాను'' అన్నాడు (దీపావళి).''

ఇదంతా జరిగి ఏడాదయింది. మళ్ళీ దీపావళి పండుగ వచ్చింది. ఇంతట్లో చిట్టిగాడు దీపావళి పొట్లాలు పట్టుకు వచ్చి నెమ్మదిగా ఆవిడ దగ్గర పెట్టాడు.

పురుషోత్తమ్మ పొట్లాలు చూపింది. చిట్టిగాణ్ణి చూసింది. చిట్టిగాడు నవ్వుతూ ఆమెకేసి చూశాడు.

పురుషోత్తమ్మ గుండె దడదడలాడింది. పురుషోత్తమ్మ మేనగోడలు చిన్నపిల్ల కిలకిల నవ్వి, చప్పట్లు కొట్టింది. పురుషోత్తమ్మ గబగబ లోపలికి పరిగెత్తుకు వెళ్ళి మంచం కింద ఎవరికీ కనిపించకుండా, దాచి ఉంచిన బాణాసంచా బుట్ట ఇవతలికి తీసి చీర కొంగు చాటున కనపడకుండా పట్టుకు చక్కా వచ్చింది.

"ఇది పుచ్చుకొని ఇంటికి వెళ్ళి కాల్చుకో! పో!" అని పురుషోత్తమ్మ ఆ బుట్ట చిట్టిగాడి చేతిలో పెట్టింది.

ఇంతట్లో ఎక్కడనుండి వచ్చాడో ! కారు మేఘంలా చిట్టిగాడి దగ్గరకి, ఆ యింటి యజమాని. వాడి చేతిలో బుట్టలాక్కొని మొహం ఊడి పడేటట్లు చెళ్ళున ఒక్క లెంపకాయ కొట్టినాడు.

"వెధవముండకి పెత్తనాలు ఎవరిమ్మన్నారు? ఈ బాణాసంచా ఏమిటి? ఊళ్ళో వాళ్ళందరికీ బాణసంచాలు పంచిపెట్టేటట్టయితే ఇల్లూ వాకిళ్లూ ఆస్తులూ ఆగుతాయా?" అని "పోరా వెధవా నిరుడొచ్చావు చాలదూ? మళ్ళీ శనిలా దాపురించావు" అని ఆ యింటి యజమాని చిట్టిగాణ్ణి ఒక్క తన్ను తన్నాడు.

"అమ్మయ్యో! చంపేశా"డని మడి అని కూడా ఆలోచించకుండా, అరుగు మీద నుంచి ఉరికి వాణ్ణి చివ్వున ఎత్తుకొన్నది పురుషోత్తమ్మ.

"ఛీ ! పాడుముండా!" అంటూ ఇంటి యజమాని మెరుపులా బుట్ట అరుగుమీద పెట్టడం, చిట్టిగాణ్ణి ఆమె చంకలో నుంచి లాగడం, ముట్టుకుంటేనే తన పవిత్రత అంతా తగలడిపోతుందేమో అన్నట్లు వాణ్ణి చెయ్యి పట్టుకొని వీధి మధ్యకి విసిరేయడం అంత తృటిలో జరిగిపోయింది.

చిట్టిగాడికి లోకం తల్లకిందులైపోయింది. రోడ్డు మీద రాయి తలకు తగిలి, పగిలి రక్తం కారడం మొదలుపెట్టింది. పురుషోత్తమ్మ కెవ్వున అరుస్తూ అరుగు దగ్గరే కూలిపోయింది.

ఈ గలభాకు ఇంట్లో వాళ్ళూ పిల్లలూ, పెద్దలూ, అరుగు మీదకు చక్కా వచ్చారు. పొట్లాలివ్వడం తప్పో, బుట్టతీసుకోవడం తప్పో, ఉప్పరవాడై పుట్టడం తప్పో చిట్టిగాడికేమి తెలుస్తుంది? వాడి మొఖం అంతా రక్తమయమైపోయింది. ఉగ్రుడైపోయిన యజమాని ఇంకా రెండు తన్నులు తన్నడానికి పిడికెళ్ళు ముడుచుకొని, కోరను కనపరుస్తూ కాట్ల కుక్కలా కస్సు ఖస్సుమంటూ వాడి దగ్గరికి నడిచాడు. అరుగు మీద, చంటిబిడ్డ ఒకటే గోల, వాడికి కొమ్ములు చూపిస్తూ, బుసకొట్టుతూ వచ్చే మహిషాసురిడిలా ఉన్న ఇంటి యజమానుణ్ణి చూచి, సమ్మెట పెట్టులాగ తలమీద బాధ అయినా, గమనించకుండా,

చిట్టిగాడు లేచి, భయంతో కనుపాపలు తిరిగిపోగా కెవ్వుకెవ్వున అరుస్తూ పరుగెత్తడం ప్రారంభించాడు. పురుషోత్తమ్మ లేచింది. మహాశక్తిలా ఉగ్రురాలయిపోయింది. "ఈ రాక్షసుడు వుండే కొంపలో, నేనసలే వుండ"నని పొలికేక పెట్టింది. శోకాన్ని దుఃఖం తరుముకొని వచ్చింది. "చిట్టిగా! చిట్టిగా!" అంటూ వాడు వెళ్ళిన దారినే తూలుతూ ఆమె ఆ దీపావళి వెలుగుల్లో, చీకట్లల్లో వీధులలో సందులలో పడి నడిచిపోయింది (దీపావళి)."

ఈవిధంగా బాపిరాజు గారు దీపావళి కథను ఇళ్ళల్లో దీపాలు, గుళ్ళల్లో దీపాలు వంటి జంట పదాలతోనూ, అల్యూమినియం మురుగులతో వంటి ఆంగ్ల పదాలతోను, నీలి జేగూరూ లాంటి మారుమూల పదాలతోనూ, "మీకీ అయిదు వందల్ ఏసుకోండి" లాంటి తెలుగు స్పష్టంగా తెలియని సాహెబు ప్రయోగించిన మాటలతోనూ, భోంచేసి వంటి సంస్కృత పదాలతోనూ, పొలికేక వంటి అచ్చ తెలుగు పదాలతోనూ, ఇంకా ఉక్కుకడ్డీలాగే గట్టిగా వుంది, మెరుగు పెట్టిన ఎర్రవాయిలా, ఇనుమును అయస్కాంతం లాగినట్లే, తృణావర్తుణ్ణి, గలభాకు వంటి పదాలతో అద్భుతంగా మలిచారు.

బాపిరాజుగారు కథల్లో వివిధజాతులు, అనేక తెగలు ఇంకా బిచ్చగాళ్ళకు సంబంధించిన భాషాతీరును కూడా ఆయా పాత్రలకు తగిన విధంగా ప్రయోగించి తన ప్రతిభతో పాఠకుల్ని ఆకర్షించారు.

**ఉదాహరణకు :**

**"ఉప్పర్ల భాష :**

వెంటనే వెనకాలే వచ్చి ఎవరో కళ్లు మూశారు. 'యారది; ఎర్రి వేళాకోళాలు. ఒదిలేయి కళ్లు మూత్తావేం? ఓరెవడురా! కుంక! చంపేత్తాను' శక్తిలా తిరిగింది నీలాలు.

ఎదుట నాగన్న నవ్వుతో బలం ఉందే నీకు పిల్లా ! నాయేళ్లు రగతం వస్తున్నాయి చూడే!' అన్నాడు.

'నా బావే' అని ఒక్క గంతున అతని మీద వాలిపోయింది నీలాలు.

'పీడరయ్యగోరు బేలు మీద ఇడదల చేయించాడు. అర్ని నువ్వే పెట్టించావంటగా? నీ మెడలో బంగారు గుళ్ల పేరు తాకట్టు యెట్టావంట, నువ్వు మాలచ్చివే పిల్లా !' అని నాగన్న పలుకుతూ నీలాల్ని గుండె కదిమేశాడు.

**బిచ్చగాళ్ల భాష :**

'మీరు చల్లగా వుండాలి, నేను పచ్చగా వుండాలి. మీ ధాన్యలు నా గాది నిండాలి.

మీ నవ్వులోంచి ధనవర్షం కురియాలి. జయా! విజయీభవ !! దిగ్విజయీభవ !!! మీరెప్పుడూ రైలు ప్రయాణం చేస్తూ వుండాలి. బాబూ ! సెలవండి' అని తర్వాత స్టేషనులో దిగిపోతాడు.

**ఏనాదుల భాష :**

'మోపు నెత్తి మీదెడ్డావేమో అని పిల్చా, ఈ బాబయ్యగారు కేకలేస్తుండారు' అని నవ్వుచు చెప్పినది. 'ఏ' అని వాడన ఆమె పిల్లవాని యుదంతము నాకేకల సంగతి వానితో చెప్పినది. అంత నాతడు తిరిగి నవ్వుచు 'బాబయ్యగోరు! మాకేటండి మేడలా మిద్దెలా? మాము చెట్టుకిందడుకుంటాం, చెట్టుకింద తింటాం. బగవంతుడే మన్ని చూస్తాడండి. నక్కలు గిక్కలు నీల్లు మంటలు అన్ని మా చుట్టాలండి' అని యనెను."[6]

ఇంతటి ప్రతిభ కలిగిన అడివిబాపిరాజుగారి కథా వైదూష్యం ప్రశంసించదగింది.

## V. కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ గారి భాష :

ఏ రచయిత కయినా, ఏ కవికయినా రచన చేయబోయే ముందు వారి రచనల్లో చూపించబోయే ప్రాంతాలు, ప్రజల జీవన స్థితిగతులు, ఆచార వ్యవహారాలు, సాంప్రదాయాలు, అలవాట్లు వాడుకలో ఉన్న భాషపై సమగ్రమైన అవగాహన ఉండాలి. విశ్వనాథ సత్యనారాయణగారు జ్ఞానపీఠ్ బహుమతి గ్రహీత. వారు తెలుగు సాహిత్యంలో ఉన్న అన్ని ప్రక్రియలలో తనదైన ప్రతిభను కనబరచి కవి సామ్రాట్‌గా ఖ్యాతి కెక్కారు.

మహాకవులు, మహారచయితలు అనబడే వాళ్ళకి భాష ఒక గొప్ప లక్షణం. అది శబ్దం వల్ల వశమయ్యే గొప్ప ఫలం. శబ్దం వశమవడమంటే కేవలం నోటితో ఉచ్ఛరించడం రావడం మాత్రమే కాదు. ఒక్కొక్క శబ్దానికీ ఒక్కో నిర్దిష్టమైన అర్థం ఉంటుంది.

ఆవిధంగా నిర్దేశించబడిన అర్థం సమయానుకూలంగా రచయిత లేదా కవి మనోనేత్రానికి చేరుకోగలిగితే అది అతడి వశమైనట్లే. శబ్ద ప్రపంచంలో ఎవరి ప్రత్యేకత వారిది. అంటే ఒక్కొక్కరికి ఒక్కొక్క భాష ప్రభుత్వము ఉన్నదన్న మాట. ఇది కేవలం సంస్కారం వల్ల మాత్రమే రాదు, కృషి వల్ల దక్కుతుంది. కృషి వ్యక్తి నిష్ఠము. ఎవరెంత కృషి చేస్తే వారికి అంతగా భాషపై పట్టు చిక్కుతుంది. ఎవరి భాషా ప్రత్యేకత వారిది. ఈ భేదం వారి, వారి రచనలు పరిశీలిస్తే తెలుస్తుంది. నన్నయ - తిక్కనల భాషా ప్రయోగం వేరు, అలాగే శ్రీనాథ -పోతనామాత్యులది వేరు, అలాగే పెద్దన - తిక్కనలది వేరు, అలాగే గురజాడ - శ్రీపాదలది వేరు, చలం - బాపిరాజులది వేరు. అలాగే ఈ విశ్వనాథది వేరు. కొన్ని రోజులు కృషి చేస్తే ఒక్కసారిగా అలవడేది కాదు ఇది. ఇది రచయితలకు లేదా కవికి

జన్మతహ సిద్ధించే వరం. దీన్ని రచయిత నుండీ వేరు చేయడం వీలుకాని పని. రచయిత లేదా కవి తనలో ఉన్న భాషా శక్తికి మరింతగా మెరుగులు దిద్దుకొని రచనలు చేయడం ప్రారంభిస్తే ఓ గొప్ప మహాకావ్యం ఉద్భవిస్తుంది. భాషను పెంపొందించుకొనేందుకు చేసే కృషి ఓ తపస్సు లాంటిది. తిక్కన్న లాంటి వాడికే నిర్వచనోత్తర రామాయణం పూర్తి చేసినా కానీ భాషపై పట్టు ఏర్పడలేదంటే భాషను అలవరచుకోవడం ఎంత కష్టమో అర్థమయి వుంటుంది. విశ్వనాథ సత్యనారాయణగారు కూడా దీనికి అతీతులు కారు.

విశ్వనాథ సత్యనారాయణను మనం కవి అనుకుందామా ఆయనకు మించిన కవి పండితులున్నారు. నవలా రచయిత అనుకుందామా? అంతకు మించిన గొప్ప నవలాకారులున్నారు. ఆయనను అన్ని విధాలుగా పరిశీలించిన మనకు తెలిసేది ఒక్కటే.

"తన కనుకూలురు, ప్రతికూలురు ఇద్దరూ ఉన్నారని తెలిసి, అందరూ కలిసికట్టుగా ఒప్పుకోక తప్పనట్లుగా జాతీయ స్థాయిలో రచయితగా ఆయన తన స్థానాన్ని భద్రం చేసికొన్నాడు. ఆయనను గురించి అందరూ అంగీకరించేది మరొకటి కూడా ఉన్నది. ఆంధ్ర భాషా సాహిత్యరంగమున ఆయనంత ప్రముఖుడూ, ప్రసిద్ధుడూ, వివాదాస్పదుడూ ఈ శతాబ్దంలో మరొకడు లేడు అని."[7]

ఆంధ్ర పౌరుషంతో అతడు కవిగా దర్శనమిచ్చాడు. అంతరాత్మను పట్టుకొని అంతర్విశ్లేషణలతో నవలాకారుడిగా ప్రశస్తికెక్కాడు. నాటక కర్తగానూ, భావకవితా ప్రస్థాన గ్రంథ నిర్మాతయై ఆత్మలాభప్రాప్తికి దాంపత్యాన్ని మార్గంగా ప్రభోదించాడు. శ్రీమద్రామాయణ భాష్యకారుడుగా ఆంధ్రావళిని కల్పవృక్షచ్ఛాయలలో నిల్పి, తెలుగు సాహిత్య సరస్వతిని తన విద్యావైదుష్యం చేత, తన బుద్ధి వైభవం చేత భారతీయ జ్ఞానపీఠ పురస్కారానికి యోగ్యంగా తీర్చిదిద్దాడు. ఒక్కమాటలో చెప్పాలంటే సాహిత్య ప్రపంచాన్ని అరవై ఏళ్ళు ఏలిన కవికుల గురువుగా గుర్తింపు పొందారు ఈ విశ్వనాథగారు.

అక్కడి వరకూ బాగానే వుంది. అయితే మారుతున్న కాలానికి తగిన విధంగా రచనల్లో భాషను కూడా మార్చుకోవాలి కదా. కానీ విశ్వనాథగారు అలా చేయలేదు. గ్రాంథిక భాషనే కొనసాగిస్తూ వచ్చారు. కాలం మారుతుందంటే సమాజం కూడా ఎంతో కొంత మారుతుందనే కదా అర్థం. సమాజం మారుతుందంటే ప్రజలు కూడా మార్పుకు లోనవుతున్నారనేగా భావం. ప్రజలు మారుతున్నా విశ్వనాథగారి భాషలో మార్పు చోటు చేసుకోలేదు. ఇంకా చెప్పాలంటే సాంప్రదాయమంటూ విశ్వనాథగారు భాష పరంగా సమాజాన్ని, ప్రజల్ని

ఎదగనివ్వకుండా, నిరోధించేరేమో అనిపిస్తుంది. ఇది కేవలం భాషకు మాత్రమే వర్తించే అభిప్రాయం సుమా. మరే ఇతర విషయాలకు ఈ అభిప్రాయాన్ని అనువయించకూడదు.

విశ్వనాథ గారిలో ఆధునిక భావాలు పుష్కలంగా ఉన్నాయి. కానీ ఆ భావాలకు తగిన భాష లేకపోవడం బాధాకరం. సునిశితంగా పరిశీలిస్తే గురజాడ రచనల్లో కనబడే భాషకూ, విశ్వనాథ రచనల్లో భాషకు పెద్ద తేడా లేదనిపిస్తుంది.

గురజాడ ఆధునిక భాషా ఉద్యమాన్ని ప్రారంభిస్తే, గిడుగు రామమూర్తిగారు దాన్ని కొనసాగిస్తే, విశ్వనాథగారు తన కాలంలో భాషను కట్టడి చేశారు. గురజాడగారికి, విశ్వనాథగారికి కాలపరంగా కూడా తేడా వుంది. భాష విశ్వనాథ వారి దాకా వచ్చినపుడు మరింత మెరుగై వుండి వుండాల్సింది. అలా జరగకపోవడం విచారకరమే. ఈ విషయాన్ని ఎంతోమంది విమర్శకులు ప్రస్తావించారు.

చాలామంది విశ్వనాథగారు సంఘసంస్కరణకు కృషి చేయలేదనే అభిప్రాయంలో ఉన్నారు. కానీ పరిశోధనాత్మక దృష్టితో చూస్తే వీరు సంఘసంస్కరణకు కృషి చేసినట్లు ఋజువు అవుతుంది. నా పరిశోధనా ప్రక్రియ కథ కాబట్టి వీరి కథలను పరిశీలిస్తే సంఘసంస్కరణా నేపథ్యంతో ఐదు కథలు రాసినట్లు స్పష్టమయింది.

వీరిలో సంఘసంస్కరణా భావాలు ఎక్కువే. తన కథా రచనల్లో అంతకు ముందు ఎక్కువగా ఎవరూ స్పృశించని అంశాలను వీరు స్పృశించగలిగారు.

ఈ సందర్భంలో విశ్వనాథ సత్యనారాయణగారి చిన్న కథల్లో ఒకటైన 'మాక్లీ దుర్గంలో కుక్క' అనే కథలో వీరి భాషా ప్రయోగాన్ని తెలియజేస్తాను.

ఈ కథలో ఓ పెద్ద మనిషి, స్టేషన్‌మాస్టరు కులవ్యవస్థ, వర్ణవ్యవస్థల పట్ల వారి, వారి అభిప్రాయాన్ని తెలియజేయడాన్ని గమనించాలి. అంతేకాకుండా విశ్వనాథగారు తన రచనా శక్తితో కుక్క గురించి కూడా కథ రాసి తన ప్రత్యేకతను చూపించారు. మాక్లీ దుర్గం రైల్వేస్టేషన్‌లో ఉన్న ఓ కుక్క గాధే ఈ కథ. రైలు వచ్చే వేళకూ, వెళ్ళే వేళకూ ఆ రైల్వేస్టేషన్‌లో ఉన్న ఓ చిన్న దుకాణం తెరచి ఉంటుంది. దుకాణం తెరిచినప్పుడల్లా అక్కడ ఉన్న కుక్క దుకాణం ముందు తయారు. "అంగడి ఎత్తుగా ఉంటుంది. కుక్క తన చూపు అంగడిలోని పళ్ళికలలో ఉన్న మిఠాయి మీద పడే అంత సమరేఖలో నుంచుని - ఊర్ధ్వదృష్టితో తపస్సు చేస్తుంది. ఎప్పుడైనా నాడంగడి సర్దేటప్పుడైనా, యెవడైనా కొనుక్కొనేటప్పుడైనా, ఒక చిన్న ముక్క జారిపడుతుందేమో అని యెదురు చూస్తూ ఉంటుంది. వారానికో పదిరోజులకో, అట్లా యెప్పుడూ పడదుగాని, పదిరోజుల క్రింద చేసిన పకోడి, కొనుక్కున్నవాడు చద్దివాసన

వేసి పారేస్తే, కుక్క దానిని తన నోటితో అగావుగా పట్టుకొని ముందు పళ్ళతో నొక్కి అంగిట్లోకి పోయేందుకు రెండు గతుకులు గతికి మ్రింగి దగ్గు వచ్చి మళ్ళీ కక్కుతుంది. రైలు వెళ్ళిపోవటంతోటే ఆ అంగడివాడు మూస్తాడు. కుక్క పోయి సెలయేట్లో నీళ్ళు తాగుతుంది. ముందు కాళ్ళు చాచి గడ్డి మీద పడుకొని లేత గరికపోచలు కొరుకుతుంది. ఆ కుక్క మంచి మిడతల వేటగాడు. అప్పుడప్పుడు పొలము పిచ్చుకలను గూడా పట్టుకొంటుంది. సెలయేటి నీళ్ళూ, మంచి గాలీ, లోయలోకి దిగటం ఎక్కటం; కుక్క మంచి దేహపటుత్వంలో ఉన్నది. కుక్క చెదరియైనా స్టేషను ఎదురుగానున్న కొండమీదికి పోదు (మాక్లీ దుర్గంలో కుక్క)."

ఒకసారి ఒక పెద్ద మనిషి ఒక ఆడ సీమకుక్కను స్టేషనులోకి తెచ్చి కటకటాలకు కట్టేసి, సామానులు తూయించుకోటానికో దేనికో వెళ్ళాడు. అంతలో సీమకుక్క, దుర్గపు కుక్క రెండూ కలుసుకున్నాయి. ఇదే సమయంలో వెళ్ళిన పెద్ద మనిషికీ, స్టేషన్ మాస్టారుకీ మధ్య ఆసక్తికరంగా ఆధునిక సిద్ధాంత రాద్ధాంతాల చర్చ జరుగుతుంది. స్టేషన్ మాస్టరు చదువుకున్న వాడవడం వల్ల ఆధునిక భావాలు పెంపొందించుకొని వర్ణవ్యవస్థ పట్ల తన అభిప్రాయాన్ని వ్యక్తపరిచే సందర్భంలో తనకూ, పెద్దమనిషికీ మధ్య ఈవిధమైన సంభాషణ జరుగుతుంది.

"**స్టే.మా** : కాదండీ! వర్ణవ్యవస్థ ఉండాలి. మన పూర్వులు దానిని నియమించారు. వాళ్ళు ఏ ప్రయోజనం కోసం దాని నేర్పరచారో ఆ ప్రయోజనాలు తెలియకుండా మనం వానిని తీసివేయరాదు.

**పె.మ** : అట్లా అంటే లాభం లేదండీ! ఆ సిద్ధాంతాలేమిటో చెప్పండి. మనవాళ్ళు చెప్పారు కదా అని వినే రోజులు పోయినై. ప్రతిదీ వాదానికి నిలవాలి. వాదానికి నిలవంది మేము ఒప్పుకోము.

**స్టే.మా** : వారు ఏ ప్రయోజనాలర్థించారో మనకు తెలియదు. మనకు వాటిని తెలుసుకునేటంత మేథాశక్తి లేదు.

**పె.మ** : దానికి నేనొప్పుకోను. జ్ఞానము ప్రపంచం నడిచిన కొద్దీ వృద్ధి అవుతోంది గాని తగ్గడం లేదు. మన పూర్వులకు మనకున్నంత వాదనాశక్తి లేదంటాను. మానసిక శాస్త్రం, పదార్థ విజ్ఞానశాస్త్రం ఇప్పుడు వృద్ధి అయినంత పూర్వం వృద్ధి కాలేదు.

**స్టే.మా** : అయితే మీరు వర్ణవ్యవస్థ తీసి పారవేయాలి అంటారా?

**పె.మ :** తీసివెయ్యాలంటాను. ఈ వ్యవస్థ మూలంగా అనేక భేదాలేర్పడుతున్నవి. కొందరనవసరంగా తాము గొప్పవాళ్ళమనుకొంటున్నారు. తక్కువ కులాలమీద అధికారం చలాయిస్తున్నారు. వర్ణాంతర భోజనములూ, వివాహములూ జరుగవలె. అప్పుడే దేశానికి ముక్తి.

**స్టే.మా :** సర్వభూతములయందు సమత్వం ఉండాలిసిందే కాని వర్ణాంతర వివాహం నేను ఒప్పుకోను. పైకి కనబడే భేదాలు మనసా లేకుండా చేసుకోవాలి. మన పూర్వులు కూడా అదే చెప్పారని నా ఉద్దేశం.

**పె.మ :** మనవాళ్ళట్లాగూ చెప్పలేదు. మనవాళ్ళు సంఘానికి చేసిన ద్రోహం అంతంతకాదు (మాక్లీ దుర్గంలో కుక్క).''

అంతలో పెద్దమనిషి అక్కడి నుండీ బయటకు వచ్చాడు. తన కుక్క వంక చూచాడు. సీమకుక్క, దుర్గపుకుక్క వర్గభేదం మఱచిపోయి కలుసుకుంటున్నాయి. పెద్దమనిషి పరిగెత్తుకు పోయి దుర్గపుకుక్కను పది, పదకొండు దెబ్బలు కొట్టాడు. 'జ్ఞాతాస్వాద'మైన ఆ కుక్క వదిలిపెట్టుటకు సమర్థముకాక చివరకు వదిలించుకొని పోయింది. తన కుక్కకు కూడా నాలుగు తగిలించాడు. దుర్గపుకుక్క స్టేషను బయటకు వెళ్ళిన తరువాత కానీ తెలిసి రాలేదు దాని తొంటి విరిగిందని.

ఈ గందరగోళం అంతా విని స్టేషను మాస్టరు బయటకు వచ్చి ఈ సంగతంతా తెలుసుకొని, ఆధునిక భావాలు బలంగా ఉన్న ఆ పెద్దమనిషితో " 'అయ్యా ! ఎందుకు కుక్కనట్లా కొట్టారు?'

**పె.మ :** ఇది జాతి గల కుక్క. దీనికి తోడు మగకుక్కను కొనవలెనని చాలా ప్రయత్నం చేశాను. దొరకలేదండీ. దీనికి ఋతువు వచ్చింది. దీన్ని బెంగుళూరు తీసుకొని పోతున్నాను. ఈ జాతి మగకుక్కతో కలపవలెనని.

స్టేషను మాస్టరు కొంచెము నవ్వాడు. పెద్దమనిషి కనుబొమల మీద మాత్రం కొంచెం నల్లనిరేఖ యేర్పడ్డది. ఆయనా నవ్వాడు.

తరువాత మళ్ళీ యిద్దరూ స్నేహంగా మాట్లాడుకొన్నారు. స్టేషను మాస్టరు సీమకుక్క అందానికీ, మొగాన మచ్చకూ, తోక కుచ్చుకూ, దాని గోధుమవన్నె రంగునకూ మిక్కిలి మెచ్చుకొని దాన్ని ముద్దాడాడు. 'దీనికి పిల్లలు పుడితే నాకో పిల్లను తప్పకుండా ఇవ్వా'లని వాగ్దానం చేయించుకొన్నాడు (మాక్లీ దుర్గంలో కుక్క).''

ఊరకుక్క సంసర్గం చేత సీమకుక్క ఒళ్ళంతా మన్నయింది. అంతకుముందే వానకురిసి ప్రక్కనున్న పెద్ద బండల మీద నీటి పడెలు కట్టాయి. పెద్దమనిషి తన తోలు పెట్టె తెఱచి రెండు ఉతికిన తువాళ్ళూ, సబ్బు బిళ్ళాతీసి ఆ పడెలో తన సీమకుక్కకు అభ్యంగము చేయించి తువాళ్ళతో దాన్ని చక్కగా తుడిచాడు. ఇంతలో రైలు వచ్చింది. ఆయన కంయి కంయి మని అఱచుచున్న కుక్కను తువ్వాల్లో చుట్టి చంకన పెట్టుకొని రైల్లో ఎక్కాడు. మగకుక్క ఆడకుక్కకు దూరంగా నిలుచుండి కుంటుతూ దాని వంకనే సాకూతంగా చూడడం మొదలుపెట్టింది. ఆయన కిటికీలో నుంచి తొంగి చూచి కుక్కవైపునకు రెండుసార్లు కర్ర ఆడించాడు. అదీ మరీ దూరం పోయింది.

రైలు బయలుదేరింది. మాటిమాటికీ సీమకుక్క తలుపు దగ్గరకు వచ్చి బయటకు తొంగి చూస్తుంది. అతడు దాన్ని గొలుసుతో లాగిపట్టుకుంటాడు. రైలు బెంగుళూరు చేరిన తరువాత కుక్క ఏడుపు మాని యజమాని దగ్గర చనువుగా కూర్చుంది. అతడు దానిని ఒళ్ళోకి తీసికొని 'లీలా ! అల్లా చేయవచ్చునా?' అని దాని నోట్లో నోరు పెట్టి ముద్దు పెట్టుకొన్నాడు. ఇందాకటి కుక్క యీ పనే చేస్తే అంత హృదయంగమంగా ఊరుకొన్న ఆ కుక్క పరపురుష చుంబనం పరిహరించినట్లుగా అతని చుంబనం పరిహరించింది.

ఇక్కడ దుర్గపు కుక్క పడరాని పాట్లు పడి మొత్తానికి కాలు సరిచేసుకొంది. తిరిగి మళ్ళీ తినరాని తన్నులు తిని, తినగూడని మిఠాయి తిని ఆరోగ్యాన్ని పూర్తిగా పాడుచేసుకొంది. అందరి చేత చివాట్లు పెట్టించుకొంటూ జీవితాన్ని సాగిస్తూంది. ఇలా ఆరు నెలలు గడిచింది.

"ఒకరోజు సీమకుక్కను తెచ్చిన మనిషి వచ్చాడు. మాస్టరూ, ఆయనా పూర్వపు పరిచయాన్ని మగిడించుకొని మాట్లాడుకొన్నారు. మాస్టరు, 'ఏమండీ కుక్క పిల్లలను పెట్టిందా?' అని అడిగాడు. పెద్దమనిషి ఇట్లా అన్నాడు. "అయ్యా ! కుక్కను బెంగుళూరుకు తీసుకువెళ్ళాను. జాతికుక్క నెక్కనివ్వలేదు. మీ పాడుకుక్క పాడు చేసింది. కుక్క పిల్లల్ని కన్నది. ఊరకుక్కల్ని పెట్టింది. నాకు చాలా విచారం వేసింది. ఈసారి మంచిపిల్లలు పెడితే మీకు తెచ్చిస్తా" నన్నాడు. స్టేషనుమాస్టరు 'మా కుక్క మంచిదండీ! అది మంచి పౌరుషశాలి. కొన్నాళ్ళక్రింద అది ఒక వేగోలాన్ని చంపి"దన్నాడు. పెద్దమనిషి "పోనిద్దురూ! వెధవకుక్క. నాకు దానిని చంపవలెనని ఉంది. ఇంకా అది మీ స్టేషనులో ఉంటే చూపించండి. దాన్ని నరికి పోతా"నన్నాడు. స్టేషనుమాస్టరు "దాని కేదో వాతం పుట్టి కుక్క పాడైపోయిందన్నాడు (మాక్లీ దుర్గంలో కుక్క)."

ఇంతలో ఆ కుక్క కాలీడ్చుకొంటూ అక్కడికి వచ్చింది. స్టేషనుమాస్టరు ఇదేనండీ అంటూ ఆ కుక్కను పెద్దమనిషికి చూపించాడు. అప్పుడు పెద్దమనిషి దాని మీద కోపంతో కసిగా కాలితో ఒక్క తన్ను తన్నాడు. దానితో అది పారిపోలేక అక్కడే ఒక పక్క కొత్తిగిలి మెడా కాళ్ళూ యెత్తి యేడ్చింది. ఇంతలో పోర్టరు వచ్చి దానిని అవతలికి తోశాడు. మాస్టరుగారు నవ్వి 'మీ కెంత కోపమండీ' అన్నాడు.

వారి ఇద్దరి స్నేహమూ బలిసి ఆ రాత్రి పెద్దమనిషి స్టేషనుమాస్టరు గారికి అతిథిగా వుండిపోయాడు. ఆరాత్రి కుక్క రైలు క్రింద పడ్డది. రైలు దాని నడుము మీద నుండి వెళ్ళింది. "అంగవ్రాతములో జికిత్సకుడు దుష్టాంగమ్ము ఖండించి"నట్లు రైలు వ్యాధిగ్రస్తమై నష్టశక్తియైన దాని పశ్చార్థమును ఖండించింది. కాని శేషాంగశ్రేణికి రక్షలేక అది ఒక అరగంట తన్నుకొని చచ్చిపోయింది. దీనితో దుర్గపు కుక్క చరిత్ర ముగిసింది.

ఈ కథలో పెద్దమనిషి ఆధునికంగా ఆలోచిస్తున్నాడే కానీ ఆ ఆలోచనలను ఆచరణలో పెట్టడానికి ఇష్టపడడంలేదు. ఈ విషయం పెద్దమనిషి పాత్రను పరిశీలిస్తే మనకు తెలుస్తుంది. వాదనలు బలంగా ఉన్నా కానీ ఆచరణ లేకపోతే ఏం ప్రయోజనం? విశ్వనాథవారు ఇదే అభిప్రాయాన్ని మనకు పెద్దమనిషి పాత్ర ద్వారా చాలా చక్కగా తెలియజేశారు.

అయితే ఈ కథలో సందర్భానుగుణంగా క్రొత్త పదాలైన "సమరేఖలో, ఊర్ధ్వదృష్టితో, అగావుగా, సాకూతంగా, హృదయంగమంగా, మగిడించుకొని, బలిసి, నష్టశక్తియైన వంటి వాటితో పాటు గ్రాంథిక పదాలైన "జ్ఞాతాస్వాద, "అంగ వ్రాతములో జికిత్సకుడు దుష్టాంగమ్ము ఖండించి," వ్యాధిగ్రస్తమై, పశ్చార్థమును, శేషాంగశ్రేణికి వంటి పదాలను వాడి కథను తీర్చిదిద్దినట్లు మనం గుర్తించాలి.

## 4.3 సంస్కరణోద్యమ కథలు - శైలి

కథ పరంగా శైలిని గురించి చెప్పే ప్రతివారూ శిల్పానికీ - శైలికీ చాలా దగ్గర సంబంధం వుంది అనే అభిప్రాయాన్ని వ్యక్త పరుస్తూంటారు. శైలి అనేది రచయిత తాను చేపట్టిన ప్రక్రియలో సాధించే నేర్పుగా గుర్తించాలి. ప్రతి రచయిత తన రచనలో శైలి ద్వారా తనదైన ముద్ర వేస్తాడు. ఇక శిల్పం గురించి చెప్పాల్సి వస్తే శిల్పం అనేది కథకు ఉండాలనుకుంటున్న ఒకానొక నియమం. ఈ నియమానికీ రచయిత కృషితో సాధించే శైలికీ దగ్గర సంబంధం వుందనడం సబబు కాదు. నియమం ఎప్పటికీ నియమమే. శైలి

రచయిత ఎంతగా శ్రమిస్తే అంతగా వశమయ్యే ఒకానొక వరం. శైలి విషయంలో రచయిత ఏకలవ్యుడు వంటివాడు.

"భావ వ్యక్తీకరణ విధానంలో మెరుగులు దిద్దే ఒకానొక రచనారీతిని 'శైలి' అనవచ్చు. శైలీ పరిశీలనం కేవలం భాషాశాస్త్రానికీ సాహిత్య విమర్శకీ చెందింది మాత్రమే కాక కళాభినివేశ పాండిత్యాలతో కూడిన శాస్త్రీయ కృషి విశేషంగా భావించవచ్చు. ఈ నూతన శాస్త్రం మొదటి నుంచీ రెండు భిన్న మార్గాలలో నడిచింది. ఆ మార్గాలు ఇవి :

1. సామాన్య భాషా వ్యవహార తత్త్వ పరిశీలనం (Style of Language)
2. సృజనాత్మక భాషా వ్యవహార తత్త్వ పరిశీలనం (Style of Writer)

Bally పండితుడు సారస్వత శైలిని శైలీ శాస్త్రపరిధి నుంచి తొలగించి దానిని సామాన్య భాషకే పరిమితం చేశాడు. కాని అతని అనుయాయులు యావద్భాషతో అన్వయించి శైలీశాస్త్ర పరిధిని విస్తృత పరిచారు."[8]

"లూకాస్ పండితుడు "ఇతరులను స్పందింప జేసే వ్యక్తిత్వమే సారస్వత శైలి" అని సంక్షిప్తంగా నిర్వచించాడు. కవి ఆత్మీయత, అలంకారిక విషయాలు శైలికి కీలకాలు. అందువల్ల శైలీశాస్త్రం సాహిత్య విమర్శ, భాషాశాస్త్రాలతో పాటు వ్యాకరణాలంకార శాస్త్రాలతోనూ బాంధవ్యమందింది."[9]

ప్రాచీన కవుల్లో ఒకడైన వాల్మీకి మాత్రమే శిలాప్రతిమ అనే అర్థంలో శైలిని ప్రయోగించాడు. సంస్కృతంలో కుల్లూకభట్టు, రఘునాథుడు, ఆంధ్రంలో సోమనాథుడు, శ్రీనాథుడు సంప్రదాయం, పద్ధతి, ప్రకారం అనే అర్థాల్లో వాడారు.

నేడు ఈ శైలి కవి రచనా ప్రకారమనే అర్థంలో వ్యాప్తిలో కొచ్చింది.

ఆధునిక యుగంలో కవి రచనా ప్రకారం అనే అర్థం గల శైలీ శబ్దం ఆంగ్లభాషలో style అనే పదానికి పర్యాయపదంగా గుర్తించాలి. ఆకస్మికంగా శబ్ద సామ్యం అర్థసామ్యం కుదిరినంత మాత్రాన శైలి మనదే అని భావించడం అంత సబబు కాదు. నవలా, కథ ఈ రెండు శబ్దాలు మన సాహిత్యంలో ఉన్నంత మాత్రాన అవి మనవే అయిపోవు. వాటిని మనం పాశ్చాత్య సాహిత్యం నుంచి తెచ్చుకొన్నట్లే శైలిని కూడా తెచ్చుకున్నామన్న విషయాన్ని ఎప్పటికీ గుర్తుంచుకోవాలి.

ఆచార్య పింగళి లక్ష్మీకాంతం గారి అభిప్రాయం ప్రకారం "ఈ శైలి అను పదమును మనము ఆంగ్ల భాషలో style అనుదానికి పర్యాయపదముగా కల్పించుకొన్నదేకాని, మన భాషలోని శబ్దము కాదు. ఇది మన అలంకార శాస్త్రములో ఎచ్చటను లేదు. మన

పూర్వులెవ్వరును దీనిని వాడలేదు. శైలికి సన్నిహితమైన అర్థము గల శబ్దములు రీతి, శయ్య అనునవి కలవు. ఆ శబ్దములనైనను, విశేషార్థములో వాడెదరు కాని సాధారణార్థములో వాడరు. కావున శైలి శబ్దము మనకు నూతన సంపాదనము.''[10]

పలు భాషలకు సంబంధించిన వివిధ నిఘంటువులలో శైలి శబ్దానికి ఎన్నో రకాల అర్థాలు కనబడతాయి. వాటిని ఇప్పుడు చూద్దాం.

''శైలి శబ్దానికి వాచస్పత్యంలో చారిత్ర సంకేత భేదాలనీ, శబ్ద కల్పద్రుమంలో సంకేతమనీ, శబ్దార్థ కల్పతరువులో సంకేతం, పరిభాష, హెచ్చరికతో కూడిన నడత, శీలం అనీ ఆపై కోశంలో వ్యాకరణ పరిభాషా వివరణం, వ్యక్తీకరణ విధానం, సమన్వయ విధానం, ప్రవర్తన అని అర్థాలున్నాయి.''[11]

''ప్రసిద్ధ తెలుగు నిఘంటువులైన శబ్దరత్నాకరం ఆంధ్రవాచస్పత్యం వీటిలో శైలి శబ్దం అసలు లేకపోవడం గమనించదగ్గ విషయం. సూర్యరాయాంధ్ర నిఘంటువులో 1. ''వ్యాకరణ సూత్రముల సంక్షిప్త వివరణము. 2.అర్థము చెప్పెడి పద్ధతి, మొదట సామాన్యముగా అర్థము చెప్పి పిమ్మట దానిని విస్తరించి వివరించుట. 3. నడవడి, ప్రవర్తనము 4. రచనారీతి'' అనే శబ్దార్థ చంద్రికలో ''రచనా కౌశలముగల భాషా సౌష్ఠవము, భాషా సరణి, లేఖన పద్ధతి, విధము, ధోరణి'' అనీ, ఆంధ్ర దీపికలో ''సంకేతము, పరిభాష, శాస్త్రీయ వ్యవహారము'' అనే అర్థాలున్నాయి. శబ్దార్థ దీపికలో శైలీ శబ్దాన్ని ఇవ్వలేదు. ఇందులో శయ్యకు అర్థంగా శైలీ శబ్దం ఇవ్వబడింది.''[12]

శైలి శబ్దం అనేక హిందీ నిఘంటువులలో ఇలా ఉంది. ''హిందీ శబ్ద సాగర్‌లో ప్రణాళిక, రీతి వాక్య రచనా ప్రకారం, భావాభివ్యక్తీకరణ రీతి లేక కౌశలం కాఠిన్యం వ్యాకరణ సూత్రాల సంక్షిప్త వివరణం, ప్రస్తర మూర్తి అనే అర్థాలున్నాయి. వీటిలో ''భావాభివ్యక్తీకరణ కౌశలం'' అనే అర్థం పరిశీలింపదగ్గది. భార్గవ నిఘంటువులో పద్ధతి, సంప్రదాయం, ఆచరణం అనే అర్థాలున్నాయి. ఈ అర్థాలతో పాటు style అనే ఆంగ్ల పర్యాయపదాన్ని కూడా ఈ నిఘంటువు ఇచ్చింది. శంకర నారాయణ తెలుగు - ఇంగ్లీషు నిఘంటువులో శైలి (Noun) style manner of expression అని ఉంది. వ్యక్తీకరణ విధానం అనే అర్థాన్ని శైలీ శబ్దానికి ఈ నిఘంటువు ఇచ్చింది. Style అనే పర్యాయపదాన్ని ప్రదర్శించింది.''[13]

శైలిని అనేక రకాలుగా చూడొచ్చు. ఏ రచయిత కూడా తన శైలిని మార్చుకోడానికి ఇష్టపడరు. ఒక విధంగా పాఠకులు రచయితకు దగ్గర కావడానికి పరోక్షంగా శైలి దోహదపడుతుంది. ఒక రచయిత రచనలు చదివిన తరువాత ఆ రచయితకు సంబంధించిన

ఏవైనా కొన్ని ఇతర రచనలు పాఠకుడు చదివినపుడు లేదా మరెవరైనా ఆ రచనకు సంబంధించిన విషయాలను ప్రస్తావించినపుడు వెంటనే ఆ రచయిత స్ఫురణకు రావడం సహజం.

సృజన రచనల్లో ప్రధానంగా గ్రాంథిక శైలి, సరళ గ్రాంథిక శైలి, ప్రామాణిక శైలి, వ్యవహారిక శైలి, మాండలిక శైలి అనే బేధాలను గుర్తించవచ్చు.

శైలి అంటే ఇదేయని ఖచ్చితమైన నిర్వచణాలు ఇవ్వడం కష్టం. కానీ ఒకే భాషలో ఒక భావాన్ని తెలుపటానికి రచయిత వాడే ప్రత్యేకమైన పదాలను, వాక్యాలను ఇంకా క్లుప్తంగా చెప్పాలంటే భావాన్ని తెలియజేసేందుకు రచయిత వాడే పర్యాయపద సముదాయాన్ని శైలిగా పరిగణించవచ్చు. అంటే ఒకే అర్థాన్ని ఇచ్చే రెండు వేరు, వేరు పదాలన్నమాట.

"అంటే, ఒక విషయం చెప్పటానికి లోకంలో వేరు, వేరు ప్రయోగాలు విచ్చికంగా వాడుకలో ఉన్నప్పుడు, వక్త (రచయిత) అప్పటి సందర్భాన్ని బట్టి, అప్పటి శ్రోత (పాఠకుడు)ను బట్టి, విషయ గౌరవాన్ని బట్టి, వైయక్తికమైన అభిరుచిని బట్టి, తన వ్యుత్పత్తిని బట్టి, అలవాటును బట్టి వీటిలో అన్నిటిని బట్టి కాకపోయినా కొన్నిటిని బట్టి అయినా - ఆ సందర్భంలో ఒక ప్రయోగం చేస్తాడు. ఇది అతని శైలిలోకి వస్తుంది. ఉచ్చారణ పద్ధతి మొదలు, వాక్య నిర్మాణ విధానం వరకు వివిధ స్థాయిల్లో, వివిధ రీతుల్లో అతని శైలి ద్యోతికమవుతుంది."[14]

నేను పరిశోధనకెంచుకున్న గురజాడ అప్పారావు, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి, గుడిపాటి వెంకటాచలం, అడవి బాపిరాజు, విశ్వనాథ సత్యనారాయణగారి కథల్ని పరిశీలిస్తే వాటిలో గురజాడశైలి ఒక్కొక్క రచన చిన్న, చిన్న తేలికైన మాటలతోను, సమాసాలతోను, వాక్యాలతోను, వ్యవహారిక భాషలో రూపొందిందని, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి శైలి మారుమూల మాటలతోను, దీర్ఘసమాసాలతోను, సుదీర్ఘమైన సంశ్లిష్ట వాక్యాలతోను కూడి ఉందని, చలం రచనల్లో అతడి శైలీ సులభంగా గ్రహించే తత్త్వాన్ని, స్వభావోక్తిని కనబరుస్తోందని, బాపిరాజు కథా సాహిత్యంలో శైలి జంట పదాలతోనూ, ధ్వన్యనుకరుణ శబ్దాలతోనూ, అన్యదేశ్య పదాలతోనూ, జాతీయాలతోనూ, సామెతలతోనూ, సూక్తులతోనూ, ఊతపదాలతోనూ కూడి వుందని, విశ్వనాథ సత్యనారాయణగారి రచనల్లో అతడి శైలి క్లిష్టత, పదాడంబరం, అలంకారికతతో నిండి వుందని తెలిసింది. ఎవరి రచనా ప్రత్యేకత వారిది. వీరు వారి, వారి శైలులను కథల్లో కనబరచి తెలుగు సాహిత్యంలో వారి స్థానాలను పదిలపరుచుకున్నారు.

## పాదసూచికలు

1. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి కథలు - భాష సౌందర్యానుశీలన, పర్యవేక్షణ : బేతవోలు రామబ్రహ్మం, పరిశోధన : అలమూరు మనోజ్ఞ, University of Hyderabad 2007, పుట : 4
2. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి కథలు - భాష సౌందర్యానుశీలన, పర్యవేక్షణ : బేతవోలు రామబ్రహ్మం, పరిశోధన : అలమూరు మనోజ్ఞ, University of Hyderabad 2007, పుట : 5, 6
3. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి కథలు - భాష సౌందర్యానుశీలన, పరిశోధన : అలమూరు మనోజ్ఞ, University of Hyderabad 2007, పుట : 6, 7
4. తెలుగు కథ నాడూ, నేడూ ; కథా సాహిత్య వ్యాసాలు, కోడూరి శ్రీరామమూర్తి, పుట : 69
5. తెలుగు కథ నాడూ, నేడూ ; కథా సాహిత్య వ్యాసాలు, కోడూరి శ్రీరామమూర్తి, పుట : 69
6. అడివి బాపిరాజు కథలు, కవిత్వం-పరిశీలన, డాక్టర్ వి. సిమ్మన్న, పుట : 61
7. విశ్వనాథ వైఖరి, కేతవరపు రామకోటిశాస్త్రి, పుట : 7
8. భారత పద్యశైలి, డాక్టర్ చేరెడ్డి మస్తాన్ రెడ్డి, పుట : 1
9. భారత పద్యశైలి, డాక్టర్ చేరెడ్డి మస్తాన్ రెడ్డి, పుట : 2
10. భారత పద్యశైలి, డాక్టర్ చేరెడ్డి మస్తాన్ రెడ్డి, పుట : 9
11. భారత పద్యశైలి, డాక్టర్ చేరెడ్డి మస్తాన్ రెడ్డి, పుట : 11, 12
12. భారత పద్యశైలి, డాక్టర్ చేరెడ్డి మస్తాన్ రెడ్డి, పుట : 12
13. భారత పద్యశైలి, డాక్టర్ చేరెడ్డి మస్తాన్ రెడ్డి, పుట : 12, 13
14. కథానిక స్వరూప స్వభావాలు, పోరంకి దక్షిణామూర్తి, పుట : 298

# ఉపసంహారం

తెలుగు కథ సంస్కరణోద్యమ ప్రభావ చిత్రణ (గురజాడ అప్పారావు, శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి, గుడిపాటి వెంకట చలం, అడివి బాపిరాజు, విశ్వనాథ సత్యనారాయణ) - ఈ ఐదుగురు రచయితలు ఏం చెప్పదలచుకున్నారో వీరి కథల్ని సునిశితంగా పరిశీలిస్తే అర్థమవుతుంది. తొలితరం కథా రచయితగా ఖ్యాతి కెక్కిన గురజాడ సంఘసంస్కరణ భావాలు బలపడుతున్న సమయంలో సాహిత్య సృష్టిని మొదలు పెట్టారు. దాని వలనే ఆ భావాలు మన సాహిత్యంలో ప్రతిఫలిస్తున్నవి. గురజాడ రాసినవి ఐదు కథలే అయినప్పటికీ ఆ ఐదు ఆణిముత్యాల వంటివి, స్త్రీని ఏ ఏ కోణాల నుండి చిత్రించడానికి అవకాశముందో ఆ అన్ని కోణాలను అతడు దర్శించి తరువాత తరం వారికి మార్గదర్శకుడయ్యాడు. గృహిణిగా తనకు జరిగే అన్యాయాన్ని సున్నితంగా పరిష్కరించుకోగలిగిన కమలిని, వేశ్యలు కూడా మనుష్యలేనని చెప్పిన సరళ, బ్రహ్మణ సాంప్రదాయాల్లో నలిగిపోతూ కూడా అవసరమైన సమయంలో సమయస్ఫూర్తిగా వ్యవహరించిన నాంచారమ్మ, పేరులో ఆధునికత ఉన్నా భర్త పాదాల కింద నలిగిపోతున్న మెటిల్డా, పరమత సహనాన్ని ప్రభోదించిన "పెద్ద మసీదు", అందుకు నిదర్శనం సాహెబు, నారాయణ భట్టు. ఆ పాత్రల ద్వారా గురజాడ తనలోని సంస్కరణాభావాల్ని ప్రజలకు అందించే ప్రయత్నం చేసి కృతకృత్యులయ్యారు.

తరువాత వచ్చిన శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి గారు గురజాడ మార్గాన్ని మరింత విశాలం చేశారు. అంటే గురజాడ కాలంలోనే మరింత జటిలంగా వున్న వితంతు సమస్యని గురజాడ స్పృశించలేదు. ఆ సమస్యనే ప్రధానంగా చేసుకుని శ్రీపాద వారి కథలు సాగాయి. అయితే ఆ ఒక్క అంశాన్నే కాక యువతులు, గృహిణులు మొదలైన వారి సమస్యలు ఎత్తి చూపుతూనే, వితంతువులు ఎదుర్కొనే రకరకాల సమస్యలను తెలిపారు. చిన్నతనంలోనే వివాహం జరిగి భర్త చనిపోయి మళ్ళీ పుట్టింటికి వచ్చిన స్త్రీ ఆర్థికంగా ఇతరులపై ఎంతగా ఆధారపడుతుందో ఏ వయసులోనైనా, ఏ పరిస్థితుల్లోనైనా స్త్రీ ఎంత అస్వతంత్రురాలో 'బుచ్చి వెంకాయమ్మ' కథ తెలుపుతుంది.

శ్రీపాద వారు వితంతువుల సమస్యలను చిత్రించి పరిష్కార మార్గాన్ని సంస్కరణల ద్వారా సూచించారు. శ్రీపాద తరువాత వచ్చిన గుడిపాటి వెంకటచలం మాత్రం పరిష్కారాన్ని స్త్రీ స్వేచ్ఛతో ముడిపెట్టి చెప్పారు. సాంప్రదాయాల్లో బతుకుతున్న స్త్రీలు స్త్రీ స్వేచ్ఛను

కోరుకుంటే, ఆ సాంప్రదాయాలను తెంచుకోకుండా వారికి విముక్త లభించదు. అలా తెంచుకోవడం, సాంప్రదాయవాదులకు మింగుడు పడకున్నా అది స్త్రీ స్వేచ్ఛకు అనివార్యమనే విషయాన్ని స్పష్టం చేశారు చలం. సంస్కరణ మార్గంలో స్త్రీ కొంత సామరస్య ధోరణిని అవలంబించే అవకాశం ఉంది దానిని పురుషుడు అలుసుగా తీసుకోవచ్చు. అందుకే ఆమె మెత్తగా ఉండకుండా ఆమె తన సుఖాన్ని తాను కోరుకుని తనకిష్టమైన మార్గాన్ని స్వేచ్ఛగా ఎన్నుకోవాలని చలం తెలియజేశారు.

తరువాత వచ్చిన బాపిరాజు సైతం వితంతు పునర్వివాహాలను ప్రోత్సహిస్తూ, కులాంతర వివాహాలను సమర్థించారు. ఈ సంస్కరణాభావాలు ప్రజల మనసుల్లోకి చేరేందుకు కథా సాహిత్యం ద్వారా కృషి చేశారు.

తరువాత సత్యనారాయణ గారు కూడా అదే మార్గాన్ని అనుసరించడం విశేషం. వీరు కూడా వితంతు పునర్వివాహాలను సమర్థిస్తూ, వేశ్యా సమస్యను స్పృశిస్తూ కథలు రాశారు. ఈ కథలన్నీ విశ్వనాథ సత్యనారాయణ గారిలోని సంస్కరణా భావాలను తెటతెల్లం చేశాయి.

ఈ ఐదుగురి సంస్కరణ కథల్ని పరిశోధించడం వల్ల నాకు

1. అవిద్య
2. అజ్ఞానం
3. మూఢాచారాలు
4. కుల వ్యవస్థ
5. దురాచారాలు
6. బాల్య వివాహాలు
7. స్త్రీ సమస్యలు
8. అస్పృశ్యత
9. కన్యాశుల్కం

ఆనాటి సమాజంలో ఎక్కువగా ఉన్నట్లు తెలిసింది. వీటి బారి నుండీ ప్రజల్ని తప్పించి వారిలో చైతన్యం కలిగించడం కోసం ఈ రచయితలు చేసిన కృషి ఎంతో గొప్పది.

సమాజాన్ని మెరుగైన స్థితికి తీసుకురావడానికి సాహిత్యం ఎంతగానో దోహద పడుతుందనే ఉద్దేశ్యంతో ఆంగ్ల సాహిత్య, ప్రభావం వల్ల అలవరుచుకొన్న ప్రక్రియల ద్వారా సమకాలీన సమస్యలను ఆ యా రచనల్లో చూపించి వాటి వలన ఎదురయ్యే

విపత్తులని ప్రజలకు తెలియజేసే రచనలు చేస్తూ మెరుగైన సమాజం కోసం జీవితాంతం పోరాడిన సాహితీ మూర్తులు గురజాడ, శ్రీపాద, చలం, బాపిరాజు, విశ్వనాథలు.

వీళ్ళు  బాల్య వివాహాలు, ఆవిద్య, మూఢనమ్మకాలు, మూఢ విశ్వాసాలు వితంతు సమస్యలతో పాటు మద్యపానాన్ని గురించి,  మాదక ద్రవ్యాల గురించి కూడా కథలు రాసి ఉంటే బాగుండేది. మద్యపానం వల్ల ఎన్నో కుటుంబాల వ్యక్తులు మృత్యుకౌగిలికి చేరడం జరుగుతుంది. మద్యపాన వినియోగం ఆ కాలంలో కూడా ఉధృతంగా ఉండేది.  ఇక మాదకద్రవ్యాలు అయితే సరేసరి.  వీటి బారి నుండి కూడా సమాజాన్ని, ప్రజల్ని చైతన్యపరిచే కథలు ఈ రచయితల కలం నుండి వచ్చి వుండుంటే సమాజానికి ఎంతో ఉపయోగకరంగా ఉండేదనేది  నా  ఉద్దేశం.

ఈ సమస్యల పై తరువాత కాలంలో వచ్చిన ఎంతో మంది రచయితలు కథలు రాశారు.  ఇంకా రాస్తున్నరు.  రచయితలుగా స్థిరపడదలచుకున్న వారు ఆ యా సమస్యలపై స్పందించడం, పాఠకుల్ని ఆలోచింపచేయించే రచనలు చేయాలనుకోవడం కొత్తేమీ కాదు. ఆ సమస్యలను రూపుమాపే దిశగా ఆలోచనాత్మకమైన రచనలు వెలువరచి ఆ యా రచనలు, ఆ యా సమస్యలపై ప్రభావాన్ని కనబరిచే విధంగా ప్రజల్ని ఆలోచింపజేయించి సమస్యలపై ఉద్యమించే విధంగా రచనలు చేయగలగడం ఉత్తమ రచయిత బాధ్యత కాబట్టి గురజాడ, శ్రీపాద, చలం, బాపిరాజు, విశ్వనాథలు తమ బాధ్యతను నెరవేర్చి సమాజానికి సాహిత్యం ద్వారా సేవలందించారు. వీరి కృషి అపారమైంది. చిరస్మరణీయమైంది.

వీరి కథల్లో భావ స్పష్టతకు లోటు లేదు. కథాకథనానికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వబడింది. చెప్పదలచిన విషయాన్ని సూటిగా, స్పష్టంగా సామాన్యులకు సైతం అర్థమయ్యే విధంగా రాశారు. కొంత వరకు భాషా విన్యాశాలు, ఆడంబరాలు తగ్గించి అనగా కఠిన శబ్దాలు, దీర్ఘసమాసాలు ఎక్కువగా వాడకుండా జాగ్రత్తపడి, సందర్భానుగుణంగా పదాలు వాడి పాఠకులని ఆలోచింపజేశారు.

తెలుగు సాహిత్య ప్రక్రియల్లో ఒకటైన కథ విషయానికొస్తే కథ రాయడానికి వారి వ్యక్తిగత అనుభవాలతో పాటు సామాజిక పరిస్థితులపై పూర్తి అవగాహన వుండాలి,  సమాజ పోకడ అర్థమయి వుండాలి.  ఈ రెండింటిని సమానంగా పోషించినపుడే కథ రసవత్తరంగా తయారై  రక్తికెక్కుతుంది.

నేటికీ సమాజాన్ని ఎదగనివ్వకుండా ఆటంకాన్ని కలిగిస్తున్న సాంఘిక దురాచారాల మీద వివిధ కోణాల్లో మరింత విస్తృతమైన పరిశోధనలు జరగవలసిన అవసరం ఎంతో వుంది. అలాగే ఈ ఐదుగురు రచయితలకు సంబంధించిన కథల మీద విడివిడిగా సంస్కరణా దృక్పథంలో పరిశోధనలు చేయవలసిన అవసరం వుంది.

# అనుబంధం


## సుప్రసిద్ధ కథా రచయితలు :



గురజాడ అప్పారావు
(సెప్టెంబరు 1862 - నవంబర్ 1915)




శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి
(ఏప్రిల్ 1891 - ఫిబ్రవరి 1961)



గుడిపాటి వెంకటచలం
(మే 1894-మే 1979)



అడివి బాపిరాజు
(అక్టోబర్ 1895 - సెప్టెంబరు 1952)



విశ్వనాథ సత్యనారాయణ
(అక్టోబర్ 1895- అక్టోబర్ 1976)


## ప్రసిద్ధ సంఘసంస్కర్తలు :



రాజా రామోహన రాయ్
(1772-1833)



ఈశ్వర చంద్ర విద్యా సాగర్
(1820-1890)



కేశవ చంద్రసేన్
(1838-1884)



అనిబిసెంట్
(1847-1933)



కందుకూరి వీరేశలింగం
(1848-1919)



రఘుపతి వెంకటరత్నం నాయుడు
(1862-1939)



ఉన్నవ లక్ష్మీనారాయణ
(1873-1958)



నాళం కృష్ణారావు
(1881-1961)



సూర్యారావు బహద్దర్
(రావు వెంకట కుమార మహీపతి)
(1885-1964)



దరిశి చెంచయ్య
(1890-1964)



కనుపర్తి వరలక్ష్మమ్మ
(1896-1978)



సంగెం లక్ష్మీబాయమ్మ
(1910-1979)



ఈశ్వరి బాయి జె.
(1918-1991)

# ఉపయుక్త గ్రంథ సూచి


1. ఇనాక్, కొలకలూరి. 1999. అస్పృశ్యగంగ (కథానిక సంకలనం). జ్యోతి గ్రంథమాల : అనంతపురం.
2. ఈశ్వరరావు, సెట్టి (సంపాదకుడు). 1984. గురజాడ రచనలు కథానికలు. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ : హైదరాబాదు.
3. కనకయ్య, చామర్తి (కనక్ ప్రవాసి), 1985-86 . శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి చిన్న కథలు-సమగ్ర సమీక్ష. తరుణ ప్రచురణలు. కాకినాడ.
4. గంగప్ప, ఎస్. 1993 ***వేయిపడగలు - విశ్లేషణాత్మక విమర్శ.*** శశీ ప్రచురణలు : గుంటూరు.
5. చలం గుడిపాటి. 1984. ***జెలసీ***. అరుణా పబ్లిషింగ్ హౌస్ : విజయవాడ.
6. చలం గుడిపాటి. 2005. ***జానకి.*** అరుణా పబ్లిషింగ్ హౌస్ : విజయవాడ.
7. చలం గుడిపాటి. 2004. ***యవనవ్వనం.*** అరుణా పబ్లిషింగ్ హౌస్ : విజయవాడ.
8. చలం గుడిపాటి. 2007. ***ఆ రాత్రి*** (కథలు). అరుణా పబ్లిషింగ్ హౌస్ : విజయవాడ.
9. చంద్రశేఖర్ రెడ్డి, రాచపాళెం. 1986. ***గురజాడ తొలి కొత్త తెలుగు కథలు***. శిల్పి ప్రచురణలు : అనంతపురం.
10. చంద్రశేఖర్ రెడ్డి, రాచపాళెం. 2006. ***కథాంశం (తెలుగు కథానికా సాహిత్య విమర్శ).*** శ్రీమతి ఆర్. లక్ష్మి. 28-3-198, తారక్‌నాథ్ కాలనీ : అనంతపురం.
11. చంద్రశేఖర్ రెడ్డి, రాచపాళెం. 2007. ***జాతీయోద్యమ కథలు.*** పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం : హైదరాబాదు.
12. చంద్రశేఖర్ రెడ్డి, రాచపాళెం. 2010. ***దీపధారి గురజాడ***. ప్రజాశక్తి బుక్ హౌస్ : హైదరాబాదు.
13. చెన్నకేశవులు, పోతిరెడ్డి. 2006. ***స్వాతంత్ర్యానంతర తెలుగు కవిత్వంలో సంఘసంస్కరణ***. ఇందిర ప్రచురణలు : హైదరాబాదు.
14. దక్షిణామూర్తి, పోరంకి. 1988. ***కథానిక స్వరూప స్వభావాలు.*** తెలుగు కథానిక శతజయంతి సంవత్సరోత్సవ దీపిక : హైదరాబాదు.
15. నదీరా యడవల్లి. 1987. రాజారామమోహన్‌రాయ్. శ్రీకృష్ణా ప్రింటర్స్ : విజయవాడ.

16. ప్రసన్నాంజనేయులు, మంచికలపాటి. 2007. విశ్వనాథ నవలా శిల్పం. స్వీయ ప్రచురణ : నెల్లూరు.
17. బాపిరాజు, అడవి. 2011. ***అడవిబాపిరాజు రచనలు - 8*** (కథలు) విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ : హైదరాబాద్.
18. మధుసూధనరావు, త్రిపురనేని. 1996. ***విశ్వనాథ తిరోగమన సాహిత్యం***. విరసం ప్రచురణ : హైదరాబాదు.
19. మస్తాన్‌రెడ్డి, చేరెడ్డి. 1989. ***భారత పద్యశైలి***. ఆశాలతా ప్రచురణలు : నరసరావుపేట.
20. రజని, ఎస్. 2007. ***తొలితరం తెలుగు కథారచయితలు - స్త్రీ సమస్యల చిత్రణ.*** చరిత ఇంప్రెషన్స్ : హైదరాబాదు.
21. రమణ, కె.యస్. 1987. చలం 'మ్యూజింగ్స్' విమర్శనాత్మక పరిశీలన. శ్రీ వల్లి పబ్లికేషన్స్ : హైదరాబాదు.
22. రమణమూర్తి, ఆర్.వి. (ప్రధాన సంపాదకులు). 2012. గురజాడ సాహిత్య సర్వస్వం. తెలుగు అకాడమి : హైదరాబాదు.
23. రమాపతిరావు, అక్కిరాజు. 1990. కందుకూరి వీరేశలింగం. తెలుగు విశ్వవిద్యాలయం : హైదరాబాదు.
24. రమాపతిరావు, అక్కిరాజు. 2006. తెలుగు వైతాళికులు - కందుకూరి వీరేశలింగం. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం : హైదరాబాదు.
25. రామకోటి శాస్త్రి, కేతువరపు. 1994. విశ్వనాథ వైఖరి. జిజ్ఞాస ప్రచురణ : వరంగల్లు.
26. రామలక్ష్మి, కె. (అనువాదకురాలు). 1989. భారతీయ సాహిత్య నిర్మాతలు రాజారామమోహన్‌రాయ్. కేంద్రీయ సాహిత్య అకాడమి : న్యూఢిల్లీ.
27. లక్ష్మినారాయణ, కె. (సంపాదకులు). 1998. దళిత కథలు -4. (ఆర్థిక, రాజకీయ కథలు 1910-1998). రచనా పబ్లికేషన్స్ : అనంతపురం.
28. విజయలక్ష్మి, కనుపర్తి. 1991. బ్రహ్మసమాజ సాహిత్యం ఒక పరిశీలన. సిద్ధార్థ పబ్లికేషన్స్ : మండపేట.
29. విశ్వనాథరెడ్డి, కేతు. 2004. దీపధారులు 20వ శతాబ్ది తెలుగు కథకులు. సాహితీ స్రవంతి : హైదరాబాదు.
30. వీరలక్ష్మీదేవి, వాడ్రేవు. 2006. సత్యాన్వేషి చలం ఒక పరిశీలన. అరుణా పబ్లిషింగ్ హౌస్ : విజయవాడు.

31. వీరేశలింగం పంతులు, కందుకూరి. 2010. ***రాజశేఖర చరిత్రము.*** విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ : హైదరాబాదు.

32. వెంకట సుబ్బయ్య, వల్లంపాటి. 2000. ***కథాశిల్పం.*** విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ : హైదరాబాదు.

33. వేణుగోపాల్, నాగసూరి. 2006. ***వెలుగుజాడ***. గురజాడ విద్యా సంస్థలు కంటోన్మెంటు : విజయనగరం.

34. శ్రీరామమూర్తి కోడూరి. 2008. ***మా మంచి తెలుగు కథ***. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్: హైదరాబాదు.

35. సత్యవతి, పి. 1995. ***ఇల్లలకగానే.*** విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్: హైదరాబాదు.

36. సత్యనారాయణ, విశ్వనాథ. 1996. ***విశ్వనాథ సత్యనారాయణ చిన్న కథలు***. విశ్వనాథ పబ్లికేషన్స్ : విజయవాడ.

37. సిమ్మన్న, వెలమల. 1995. ***అడివి బాపిరాజు కథలు, కవిత్వం - పరిశీలన***. దళిత సాహిత్య పీఠం : విశాఖపట్నం.

38. సిమ్మన్న, వెలమల. 1995. ***బాపిరాజు భాషా వైదుష్యం***. దళిత సాహిత్య పీఠం : విశాఖపట్నం.

39. సీతారత్నం, ఎ. 2007. స్త్రీవాద కథలు స్త్రీల జీవన చిత్రణ. వెలుగు సాహితీ సాంస్కృతిక సంస్థ: విశాఖపట్నం.

40. సుధాకర్, ఎండ్లూరి. 1999. ***మల్లెమొగ్గల గొడుగు మాదిగ కతలు.*** దండోరా ప్రచురణలు: హైదరాబాదు.

41. సూర్యారావు, అవసరాల (సంపాదకులు). 1972. ***ఆణిముత్యాలు.*** విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ : హైదరాబాదు.

42. సుబ్బారావు, వావిలాల. (సంపాదకుడు) 2011. ***చలం ఆత్మ కథ.*** ప్రియదర్శిని ప్రచురణలు : హైదరాబాదు.

43. సుబ్బారావు, వావిలాల. 1993. ***చలం గారి కథానికా సాహిత్యము అనుశీలనము.*** సౌమ్య సుష్మ ప్రచురణలు : అమరావతి.

44. సుబ్బారావు, వావిలాల. (సంపాదకుడు) 2011. ***చలం కథలు - 1.*** ప్రియదర్శిని ప్రచురణలు : హైదరాబాదు.

45. సుబ్బారావు, వావిలాల. (సంపాదకుడు). 2011. ***చలం కథలు - 2.*** ప్రియదర్శిని

ప్రచురణలు : హైదరాబాదు.

46. సుబ్బారావు, వావిలాల. (సంపాదకుడు). 2011. ***చలం కథలు - 3.*** ప్రియదర్శిని ప్రచురణలు : హైదరాబాదు.

47. సుబ్రహ్మణ్యం, జి.వి. 1995. ***విశ్వనాథ నవ్య సంప్రదాయం.*** యువభారతి సాహితీ సాంస్కృతిక సంస్థ : హైదరాబాదు.

48. సుబ్రహ్మణ్యశాస్త్రి, శ్రీపాద. 1992. ***శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి కథలు (మొదటి సంపుటం)*** విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ : హైదరాబాద్.

49. సుబ్రహ్మణ్యశాస్త్రి, శ్రీపాద. 1992. ***శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి కథలు (రెండవ సంపుటం)*** విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ : హైదరాబాద్.

50. సుబ్రహ్మణ్యశాస్త్రి, శ్రీపాద. 1992. ***శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి కథలు (మూడవ సంపుటం)*** విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ : హైదరాబాద్.

51. సుబ్రహ్మణ్యశాస్త్రి, శ్రీపాద. 2005. ***పుల్లంపేట జరీ చీర.*** ప్రతిభ పబ్లికేషన్స్ : హైదరాబాద్.

52. సుబ్రహ్మణ్యశాస్త్రి, శ్రీపాద. 2008. ***నిలువు చెంబు.*** ప్రతిభ పబ్లికేషన్స్ : హైదరాబాద్.

53. సుబ్రహ్మణ్యశాస్త్రి, శ్రీపాద. 2011. ***మార్గదర్శి కథలు.*** ప్రగతి పబ్లికేషన్స్ : హైదరాబాద్.

**అముద్రిత సిద్ధాంత గ్రంథాలు:**

54. తిరుపతయ్య, వి. 1982. ***ఆడివి బాపిరాజు అతని రచనలు విమర్శనాత్మక పరిశీలన*** (అముద్రితం); పి.హెచ్.డి. పట్టా కోసం ఉస్మానియా విశ్వవిద్యాలయానికి సమర్పించిన సిద్ధాంత వ్యాసం.

55. నరేశ్ రావు, కె. 1996. ***శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి కథలు - స్త్రీ***. ఎం.ఫిల్. పట్టాకోసం హైదరాబాదు విశ్వవిద్యాలయానికి సమర్పించిన లఘు సిద్ధాంత వ్యాసం.

56. పద్మావతి, దంటు. 1992. ***సంస్కరణోద్యమ సాహిత్యంలో స్త్రీ నవలా ప్రక్రియ 1850 - 1920.*** పి.హెచ్.డి. పట్టా కోసం హైదరాబాదు విశ్వవిద్యాలయానికి సమర్పించిన సిద్ధాంత వ్యాసం.

57. మనోజ్ఞ, ఆలమూరు. 2007. ***శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి కథలు - భాషా సౌందర్యానుశీలన***. ఎం.ఫిల్. పట్టాకోసం హైదరాబాదు విశ్వవిద్యాలయానికి

సమర్పించిన లఘు సిద్ధాంత వ్యాసం.

58. మోహిని, చిప్పాడ. 2009. వీరేశలింగం పంతులుగారి సామాజిక చైతన్య వ్యాసాలు - వ్యక్తిత్వ వికాసం. ఎం.ఫిల్. పట్టాకోసం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి సమర్పించిన లఘు సిద్ధాంతవ్యాసం.

59. రాజు, కె. 1991. ***శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి కథలు - సంఘ సంస్కరణ.*** ఎం.ఫిల్. పట్టాకోసం హైదరాబాదు విశ్వవిద్యాలయానికి సమర్పించిన లఘు సిద్ధాంత వ్యాసం.

60. రాజు, కుమ్మరి. 1995. ***శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి కథలు, నవలలు ఆధునిక చైతన్యం.*** పి.హెచ్.డి. పట్టా కోసం హైదరాబాదు విశ్వవిద్యాలయానికి సమర్పించిన సిద్ధాంత వ్యాసం.

**వ్యాసాలు:**

61. 1982. ***తెలుగు కథారచయితలు*** (పరిశీలనాత్మక వ్యాస సంకలనం) ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి : హైదరాబాదు.

62. బుద్ధ ప్రసాద్, మండలి (సంపాదకులు). 2007. ***వజ్రభారతి 1947 - 2007*** (స్వతంత్ర భారతదేశంలో వివిధ రంగాలలో తెలుగు వారి 60 ఏళ్ళ ప్రగతి సమీక్షా వ్యాసాలు). కృష్ణా జిల్లా రచయితల సంఘం : విజయవాడ.

63. దక్షిణామూర్తి, ఇసుకపల్లి (సంపాదకులు). 1988. ***రజత రంజని.*** రంజని రజతోత్సవ సంఘం: హైదరాబాదు.

64. మంజులత, ఆవుల (ప్రధాన సంపాదకులు). 2005. ***ఆధునిక తెలుగు సాహిత్యంలో ప్రక్రియల ధోరణులు.*** తెలుగు అకాడమి: హైదరాబాదు.

65. రాంబాబు, వేదగిరి (సంకలన కర్త). 2000. ***కథానికా లక్ష్యము - లక్షణాలు*** (వివిధ రచయితల వ్యాసాలు). పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం : హైదరాబాదు.

66. రాజారాం, మధురాంతకం (సంపాదకులు). 1998. ***తెలుగు కథకులు - కథన రీతులు*** విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్. హైదరాబాదు.

67. వేణుగోపాల్ నాగసూరి (సంపాదకులు). 2007.***నేటికీ శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి సాహిత్య కృషి పై సమాలోచన.*** ఆంధ్రకేసరి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ : రాజమండ్రి.

68. శ్రీరామమూర్తి, కోడూరు. 2005. ***తెలుగు కథ నాడూ - నేడూ*** (కథా సాహిత్య వ్యాసాలు). విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ : హైదరాబాదు.

69. సుబ్రహ్మణ్యం, జి.వి. (గౌరవ సంపాదకులు).2005. ***20వ శతాబ్ది తెలుగు వెలుగు.*** మొదటి భాగం (అ-మ). ద్విదశాబ్ది ఉత్సవాలు, నిఘంటు నిర్మాణ శాఖ, భాషాభివృద్ధి పీఠం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం : హైదరాబాదు.

70. సుబ్రహ్మణ్యం, జి.వి. (గౌరవ సంపాదకులు).2005. ***20వ శతాబ్ది తెలుగు వెలుగు.*** ద్వితీయ భాగం (య-హ). ద్విదశాబ్ది ఉత్సవాలు, నిఘంటు నిర్మాణ శాఖ, భాషాభివృద్ధి పీఠం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం : హైదరాబాదు.

**పత్రికలు:**

71. నాయని కృష్ణకుమారి (సంపాదకులు). నవంబర్ 1997 - జనవరి 1998. సంపుటి - 1, సంచిక - 3. ***వాఙ్మయి*** (త్రైమాసిక పరిశోధన పత్రిక). పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం : హైదరాబాదు.

72. ప్రసాద్, యం.వి.యస్. (గౌరవ సంపాదకులు). 1994. ***భావనామ ఉగాది ప్రత్యేక సంచిక.*** సమాచార పౌర సంబంధాల శాఖ : హైదరాబాదు.